దధోభాగమున పక్వాశయమునకు క్రిందిభాగమున జనించిన విసర్పమున తొలుత విరూక్షణరూపమైనచికిత్సను చేయవలెను. రక్తపిత్తములవలన కల్గిన విసర్పమునందును స్నేహనరూపమైనచికిత్స హితకరము కానేరదు. వాతమధికముగ నుండువిసర్పమునను, స్వల్పదోషముగ నుండు పిత్తవిసర్పమునను, తిక్తక (తిక్తరస ద్రవ్యముల జేర్చబడిన) ఘృతము నుపయోగింపవలెను. ప్రబలమైన పిత్తముచే జనించిన (పైత్తిక) విసర్పమున విరేచనౌషధము నియ్యవలెను. అటుగాక అధికదోషయుక్తమైన పైత్తికవిసర్పమున విరేచనకరముకాని ఘృతము నుపయోగించినయెడ దోషము లోపలనే స్తంభించి త్వక్కును మాంసమును రక్తమును కూడ పచింపజేయును. కావున బహుదోషయుక్తమైన పైత్తికవిసర్పమున తొలుత విరేచనము నుపయోగించుటచే చాలప్రశస్తము. మరియు విసర్పమునకు రక్తము ముఖ్యమైన యాశ్రయము కావున తొలుత రక్తమోక్షణము చేయించుట ప్రశస్తము. (రక్తమోక్షణముచేత విసర్పమున కాశ్రయమైన రక్తము వెడలినచో దాని నాశ్రయించిన విసర్పంబును శమించునని భావము.)

విసర్పచికిత్సావివరణము.

మూ. ఇతి వీసర్పనుత్ ప్రోక్తం సమాసేన చికిత్సితం,
ఏతదేవ పునస్సర్వం వ్యాసతస్సంప్రవక్ష్యతే. 51

వ్యా. ఇత్తెరంగున విసర్పహరమగు చికిత్స (దోషదూష్యాదిభేదముల ననుసరించి విభజించి) సంగ్రహముగ చెప్పబడినది. ఇదియే పైవిభాగక్రమము ననుసరించి విస్తరముగ నీక్రింద వివరించి చెప్పబడును.

కఫ-పిత్తజవిసర్పమున వమనౌషధయోగము.

మూ. మదనం మధుకం నిమ్బం వత్సకస్య ఫలాని చ,
వమనం సమ్ప్రదాతవ్యం విసర్పే కఫపిత్తజే. 52

వ్యా. కఫపిత్తములచే వేరువేరుగనైనను రెండిటిసంసర్గముచేనైనను జనించిన విసర్పమున మ్రంగకాయ, అతిమధురము, వేపపట్ట, కొడిసెపాలవిత్తులు వీనిని ఏకముగ జేర్చి వమనము చేయించుటకై యుపయోగింపవలెను.

మూ. పటోలపిచుమర్దాభ్యాం పిప్పల్యా మదనేన చ,
విసర్పే వమనం శస్తం తథా చేన్ద్రయవైః సహ. 53
యాంశ్చ యోగాన్ ప్రవక్ష్యామి కల్పేషు కఫపిత్తినాం,
విసర్పిణాం ప్రయోజ్యాస్తే దోషనిర్హరణాః శివాః. 54

వ్యా. చేదుపొట్ల, వేపచిగుళ్లు, పిప్పళ్లు, మ్రంగకాయ, కొడిశపాలవిత్తులు, వీని నన్నిటి నొకటిగ జేర్చి కఫపిత్తవిసర్పములయందు వమనమునకై యుపయోగించునది. మరియు కల్పస్థానమున కఫపిత్తరోగుల నుద్దేశించి దోషముల వెడలించుటకై యేయోగములు చెప్పబడునో వానినికూడ కఫపిత్తవిసర్పరోగుల కుపయోగించుట చాల మంచిది.

విసర్పమున శమనకషాయయోగములు, అందు ముస్తాదియోగములు మూడు.

మూ. ముస్తనిమ్బపటోలానాం చన్దనోత్పలయోరపి,
శారిబామలకోశీరముస్తానాం వా విచక్షణః. 55
కషాయాన్పాయయేత్ వైద్యః సిద్ధాన్ వీసర్పనాశనాన్,

వ్యా. తుంగగడ్డలు, వేపపట్ట, చేదుపొట్ల, ఈమూడిటినైనను; చందనము, నల్లకలువలు, ఈరెండిటినైనను; సుగంధపాల, ఉసిరికకాయలబెరడు, వట్టివేళ్లు, తుంగగడ్డలు, ఈనాల్గిటినైనను; సమభాగములుగ కూర్చి వేరువేరుగ విధ్యుక్తప్రకారము కషాయమును సిద్ధముచేసి త్రాగించినయెడ విసర్పములు శమించును. (ఇవి మూడు కషాయయోగములు.)

విసర్పమున కిరాతతిక్తాదికషాయము.

మూ. కిరాతతిక్తకం లోధ్రం చన్దనం సదురాలభమ్. 56
నాగరం పద్మకింజల్క ముత్పలం సవిభీతకం,
మధుకం నాగపుష్పం చ దద్యాద్వీసర్పశాన్తయే. 57

వ్యా. నేలవేము, లొద్దుగుపట్ట, శ్రీగంధము, దూలగొండి, శుంఠి, తామరపువ్వులోని కేసరములు, నల్లకలువలు, తానికాయబెరడు, అతిమధురము, నాగకేసరములు, వీని నన్నిటిని సమభాగములుగ కూర్చి కషాయము కాచి విసర్పము శమించుటకై త్రాగింపనగును.

విసర్పమున ప్రపౌండరీకాదికషాయము.

మూ. ప్రపౌణ్డరీకం మధుకం పద్మకింజల్కముత్పలం,
నాగపుష్పం చ లోధ్రం చ తేనైవ విధినా పిబేత్. 58

వ్యా. పౌండరీకమను గంధద్రవ్యము, అతిమధురము, తామరపువ్వులోని కేసరములు, నల్లకలువలు, నాగకేసరములు, లొద్దుగుపట్ట, వీని నన్నిటిని సమభాగములుగ చేర్చి పైజెప్పినరీతిగ కషాయము కాచి విసర్పరోగమున త్రాగవలయును.

## విసర్పమున ద్రాక్షాదిశీతకషాయము.

మూ. ద్రాక్షాం పర్పటకం శుంఠీం గుడూచీం ధన్వయాసకం,
నిశాపర్యుషితం దద్యాత్ తృష్ణావీసర్పశాన్తయే. 59

వ్యా. ద్రాక్షపండు, పర్పాటకము, శుంఠి, తిప్పతీగ, దూలగొండి, వీనిని సమభాగములుగ జేర్చి మెత్తగ నలియగొట్టి కల్కమున కారింతలు జలమును బోసి ఒక రాత్రియంతయు నూరపెట్టి యాశీతకషాయము త్రాగినయెడ దప్పియు విసర్పంబును శమించును. ఇచ్చట "క్షుణ్ణం ద్రవ్యఫలం సమ్యక్ షడ్భిర్నీరపలైః ప్లుతం, నిశోషితం హిమః సస్యాత్ తథా శీతకషాయకః" అను పరిభాష ననుసరించి శీతకషాయవిధి నెరుంగునది.

## విసర్పమున పటోలాదిశీతకషాయము.

మూ. పటోలం పిచుమర్దం చ దార్వీం కటుకరోహిణీం,
యష్ట్యాహ్వాం త్రాయమాణాం చ దద్యాద్వీసర్పశాన్తయే. 60

వ్యా. చేదుపొట్ల, వేపపట్ట, మ్రానిపసుపు, కటుకరోహిణి, అతిమధురము, త్రానుగపట్ట, వీనిని సమభాగములుగ గూర్చి పైజెప్పినరీతి శీతకషాయముచేసి యిచ్చినయెడ విసర్పము శాంతపడును.

## విసర్పమున పటోలాదిక్వాథకషాయము.

మూ. పటోలాదికషాయం వా పిబేత్త్రిఫలయా సహ,
మసూరవిదలైర్యుక్తం ఘృతమిశ్రం ప్రదాపయేత్. 61

వ్యా. పైజెప్పబడిన పటోలాదికషాయద్రవ్యములతో కూడ త్రిఫలములను, చిరుసెనగలబద్దలను కూడ పైజెప్పినకషాయమున చేర్చి కషాయము కాచి యందు నేతిని యథోచితముగ జేర్చి విసర్పరోగికి త్రాగింపనగును. ఇచ్చట "మసూరవిదలైః" అను చోట చిరుసెనగల బద్దపప్పు అని యర్థముగాని "విదళ" శబ్దమునకు తెగడయని యర్థము కాదు. ఆయర్థమున స్త్రీలింగనిర్దేశ ముండవలసివచ్చును.

## విసర్పమున పటోలపత్రాదికషాయము.

మూ. పటోలపత్రముద్గానాం రసమామలకస్య చ,
పాయయేత ఘృతోన్మిశ్రం నరం వీసర్పపీడితమ్. 62

వ్యా. చేదుపొట్లఆకు, పెసలు, ఉసిరికకాయలబెరడు వీనిని సమభాగములుగ కషాయము కాచి అందు ఆవునేతిని చేర్చి విసర్పపీడితునకు త్రాగింపనగును.

విసర్పహరఘృతములు, అందు మహాతిక్తఘృతోపయోగము.

మూ. యచ్చ సర్పిర్మహాతిక్తం పిత్తకుష్ఠనిబర్హణం,
నిర్దిష్టం, తదపి ప్రాజ్ఞో దద్యాద్వీసర్పశాన్తయే. 63

వ్యా. కుష్ఠచికిత్సితమున చెప్పబడిన పిత్తకుష్ఠహర మహాతిక్తఘృతమును పిత్తవిసర్పము శమించుటకై యుపయోగింపదగును. (ఇచ్చట కుష్ఠచికిత్సితమున "సప్తచ్ఛదం ప్రతివిషాం......వీసర్పమమ్లపిత్తం......మహావికారాన్ మహాతిక్తం" (చి. అ. ౭. శ్లో. ౧౪౪—౧౫౦) అని చెప్పబడిన మహాతిక్తఘృతము నెఱుంగునది.)

త్రాయమాణాఘృతోపయోగము.

మూ. త్రాయమాణాఘృతం సిద్ధం గుల్మికే యదుదాహృతం,
విసర్పాణాం ప్రశాన్త్యర్థం దద్యాత్తదపి బుద్ధిమాన్. 64

వ్యా. మరియు గుల్మచికిత్సితమున జెప్పబడిన త్రాయమాణాఘృతమును విసర్పములు శమించుటకై యుపయోగింపనగును. (ఇచ్చట గుల్మచికిత్సితమున "జలే దశగుణే సాధ్యం......వీసర్పం పైత్తికం జ్వరం......హన్యాదేతత్ ఘృతోత్తమమ్" (చి. అ. ౫. శ్లో. ౧౧౮—౧౨౧) అని చెప్పబడిన త్రాయమాణాఘృతము నెఱుంగునది.)

ఇంతదనుక చెప్పబడిన కషాయాదియోగములు విరేచనమున కర్హులుకాని విసర్పరోగులకు శమనమునకై యుపయోగింపదగును.

విసర్పమున విరేచనవిధి, అందు త్రివృచ్చూర్ణోపయోగము.

మూ. త్రివృచ్చూర్ణం సమాలోడ్య సర్పిషా పయసాపి వా,
ఘర్మాఽమ్బునా వా సంయోజ్య మృద్వీకానాం రసేన వా. 65
విరేకాఽర్థం ప్రయోక్తవ్యం సిద్ధం వీసర్పనాశనం,

వ్యా. తెల్లతెగడచూర్ణమును నేతిలోనైనను, పాలలోనైనను, వేడినీళ్లలోనైనను, ద్రాక్షపండ్లరసములో నైనను గూర్చి కలియబెట్టి విసర్పము శమించుటకై విరేచనమున కియ్యవలెను.

కొన్ని విరేచనయోగములు.

మూ. త్రాయమాణాశృతం వాపి పయో దద్యాద్విరేచనమ్. 66
త్రిఫలారససంయుక్తం సర్పిస్త్రివృతయా సహ,
ప్రయోక్తవ్యం విరేకార్థం విసర్పజ్వరనాశనం, 67

వ్యా. కానుగును ఆవుపాలలో కలిపి పక్వముజేసి విరేచనమునకై త్రాగింపనగును. మరియు తెగడచూర్ణమును త్రిఫలాకషాయమున కలిపి అందు నేతిని చేర్చి విరేచనము నకై యుపయోగించినయెడ వీసర్పంబును జ్వరంబును శమించును.

విసర్పమునం దామలకరసోపయోగము.

మూ. రసమామలకానాం వా ఘృతమిశ్రం ప్రదాపయేత్,
స ఏవ గురుకోష్ఠాయ త్రివృచ్చూర్ణయుతో హితః. 68
దోషే కోష్ఠగతే భూయః ఏతత్కుర్యాచ్చికిత్సితం,

వ్యా. ఉసిరికకాయలరసమున ఘృతమును జేర్చి విసర్పరోగికి త్రాగించవలెను. రోగి క్రూరకోష్ఠము కల్గియుండుయెడ పైజెప్పిన యుసిరికకాయలరసమున తెగడచూర్ణ మును కలిపి త్రాగింపవలెను.

పైజెప్పిన చికిత్సను దోషము కోష్ఠమున జేరియున్నతరి ప్రాయికముగ నుపయో గింపనగును.

విసర్పమున రక్తమోక్షణవిధి.

మూ. శాఖాదుష్టే తు రుధిరే రక్తమేవాదితో హరేత్. 69
భిషగ్వాతాన్వితం రక్తం విషాణేన వినిర్హరేత్,
పిత్తాఽన్వితం జలౌకోభిః, కఫాన్వితమలాబుభిః. 70
యథాసన్నం వికారస్య వ్యధయేదాశు వా సిరాం,
త్వఙ్మాంసస్నాయుసంక్లేదః రక్తక్లేదాద్ధి జాయతే. 71

వ్యా. శాఖాశ్రయములైన దోషములచేత రక్తము దుష్టమైనయెడల తొలుత రక్తమునే వెడలించవలెను. అట్టి దుష్టరక్తము వాతముతో కూడి చెడియున్నయెడ జింక మొదలగువాని కొమ్ముచే నారక్తమును వెడలించవలెను. అయ్యది పిత్తముతో కూడి యున్నచో జలగల కరిపించి వెడలించవలెను. కఫముతో కూడియుండుయెడ సొరకాయ బుఱ్ఱలచే వెడలించవలెను. మరియు రక్తమోక్షణము చేయునప్పుడు విసర్పము వ్యాపిం చిన ప్రదేశమునకు సమీపముననున్న సిరను శీఘ్రముగ వ్యధనము చేసి రక్తమును వెడ లించవలెను. రక్తము చెడినయెడ వెంటనే చర్మంబును మాంసంబును స్నాయువులును వరు సగచెడును. (కావున రక్తము చెడినయెడ అతిశీఘ్రముగ పైజెప్పినవిధముగ చెడినరక్తము నకు చేరియున్న సిరను వేధించి దుష్టరక్తమును వెడలించవలెనని భావము. రక్తమోక్షణ విధి శల్యతంత్రవైద్యమని యిట వివరింపబడదయ్యె.

### విసర్పమున శరీరమున వెలుపల చేయదగిన ప్రలేపాదిచికిత్స.

మూ. అన్తశ్శరీరే సంశుద్ధే (ఏవం నిర్హృతదోషాణాం) దోషే త్వఙ్మాంస
సంశ్రితే, ఆదితో వాఽల్పదోషాణాం క్రియాబాహ్యా ప్ర
వక్ష్యతే. 72

వ్యా. పైజెప్పిన విరేచన-రక్తమోక్షణములచే దోషము బైటవెడలి శరీరాంతర్భాగము శుద్ధమైనపిదప దోషము త్వక్కును మాంసమును ఆశ్రయించి యుండునెడ చేయదగిన బాహ్యక్రియ (శరీరముపైని చేయదగిన ఆలేపనము సేచనము మున్నగు చికిత్స) యీక్రింద జెప్పబడును. మరియు నీబాహ్యచికిత్సారూపమైన యాలేపాదులు దోషములు బలిష్ఠము గాక స్వల్పముగ నున్నపుడు శోధనచికిత్స జేయకయే తొలుత గూడ చేయదగును. (ఇచ్చట శోధనము అంతః పరిమార్జనమనియు, ఆలేపాదులు బహిః పరిమార్జనమనియు నెరుంగునది.)

### వాత-పిత్తవిసర్పహరప్రలేపములు, అందు ఉదుంబరత్వగాది ప్రలేపము.

మూ. ఉదుమ్బరత్వఙ్మధుకం పద్మకిఞ్జల్కముత్పలం,
నాగపుష్పం ప్రియఙ్గుశ్చ ప్రదేహాస్సఘృతో హితః. 73

వ్యా. అత్తిపట్ట, యష్టిమధుకము, తామరపువ్వులలోని కేసరములు, నల్లకలువలు, నాగకేసరములు, ప్రేంకణము వీని నన్నిటిని సమములుగ గూర్చి నూరి నేతినికూడ కలిపి పట్టువేయదగును.

### న్యగ్రోధపాదాదిప్రలేపము.

మూ. న్యగ్రోధపాదాః తరుణాః కదలీగర్భసంయుతాః,
బిసగ్రన్థిశ్చ లేపస్స్యాత్ శతధౌతఘృతాప్లుతః. 74

వ్యా. లేతవియగు మఱ్ఱియూడలు, అరటిమ్రానిలోపలనుండు బొందె, తామరగడ్డలు, వీనినొకటిగ గూర్చి నూరి శతధౌత (నూరుపర్యాయములు చిలికిన) ఘృతమును కలిపి పట్టువేయనగును.

### కాలీయాదిప్రలేపము.

మూ. కాలీయం మధుకం హేమ వన్యం చన్దనపద్మకౌ,
ఏలా మృణాళం ఫలినీ ప్రలేపః స్యాద్ఘృతాప్లుతః. 75

వ్యా. కాలీయము (నల్లనికాడలు కల గంధద్రవ్యము), అతిమధురము, నాగకేసరచూర్ణము, తుంగగడ్డలు (కైవర్తముస్తలు), చందనము, పద్మకము, ఏలకులు,

తామరకాడలు, ప్రేంకణము వీని నన్నిటిని గూర్చి మెత్తగ నూరి నేతితో కలిపి పట్టు వేయనగును.

(ఇచ్చట "హేమ-నాగకేసరచూర్ణం; వన్యం-కైవర్తముస్తమ్" అని చక్రపాణి వ్యాఖ్యలో నున్నది.)

శాద్వలాదిప్రలేపము.

మూ. శాద్వలం చ మృణాళం చ శంఖం చన్దనముస్తకం,
వేతసస్య చ మూలాని ప్రదేహస్స్యాత్ సతణ్డులః. 76

వ్యా. గరిక, తామరకాడలు, శంఖము, చందనము, తుంగగడ్డలు, నీరుప్రబ్బలి వేళ్లు, వరిబియ్యము వీనినన్నిటిని జేర్చి నూరి నేతితో కలిపి పట్టువేయనగును.

సారిబాదిప్రలేపము.

మూ. సారిబా పద్మకిఞ్జల్క-ముశీరం నీలముత్పలం,
మఞ్జిష్ఠా చన్దనం లోధ్రం అభయా చ ప్రలేపనమ్. 77

వ్యా. సుగంధపాల, తామరపువ్వులోని కేసరములు, వట్టివేళ్లు, నల్లకలువలు, మంజిష్ఠి, చందనము, లొద్దుగు, కరకకాయలు, వీనినన్నిటిని కూర్చినూరి పట్టువేయవలెను.

నలదాదిప్రలేపము.

మూ. నలదం చ హరేణుశ్చ లోధ్రం మధుకపద్మకౌ (మధుకముత్పలం),
దూర్వా సర్జరసశ్చైవ సఘృతం స్యాత్ప్రలేపనమ్. 78

వ్యా. వట్టివేళ్లు, రేణుకలు (తక్కోలాలు), లొద్దుగు, అతిమధురము, పద్మకము, గరిక, సర్జరసము (మద్దిచెట్టు పాలు, దీనిని పాలమడ్డియనియు లోకమున చెప్పెదరు). వీని నన్నిటిని నూరి నేతితో కలిపిన పటుకయనగును.

యావకాదిప్రలేపము.

మూ. యావకాః సక్తవశ్చైవ సర్పిషా సహ యోజితాః,
ప్రదేహో మధుకం క్షీరా సఘృతా యవసక్తవః. 79

వ్యా. యవల సత్తుపిండిని నేతితో కలిపి యైనను, అతిమధురమును, నల్లనినేల గుమ్మడిగడ్డను, యవలసత్తుపిండిని యొకటిగ నూరి నేతిలో కలిపి యైనను పట్టువేయవలెను.

బలాదిప్రలేపము.

మూ. బలాముత్పలశాలూకం వీరామగురుచన్దనం,
కుర్యాదాలేపనం వైద్యో మృణాళం చ బిసాన్వితమ్. 80

వ్యా. చిట్టాముట్టి, నల్లకలువదుంపలు, నల్లని నేలగుమ్మడిగడ్డ, అగరు, చందనము, పట్టివేళ్లు, తామరకాడలు, వీనినన్నిటిని గూర్చి నూరి నేతితో కలిపి పట్టువేయవలెను. (ఇచ్చట "వీరా-విదారీకందః, మృణాళం-ఉశీరం" అని చక్రపాణివ్యాఖ్య).

కొన్ని ప్రలేపములు.

మూ. యవచూర్ణం సమధుకం సఘృతం చ ప్రలేపనం,
హరేణవో మసూరాశ్చ సముద్గాశ్శ్వేతశాలయః. 81
పృథక్ పృథక్ ప్రదేహాస్స్యుః సర్వే వా సర్పిషా సహ,

వ్యా. యవలపిండిని అతిమధురమును గూర్చి నూరి నేతిలో కలిపి పట్టువేయవలెను. మరియు హరేణువులు (గుండ్రనిసెనగలు (బటానులు), చిరుసెనగలు, పెసలు, తెల్లనిరాజనములబియ్యము వీని వేరువేరుగ నైనను, అన్నిటి నొకటిగ గూర్చియైనను నూరి పట్టువేయనగును. (ఇచ్చట—"హరేణవః-వర్తులకలాయాః" అని వ్యాఖ్య, బటానులని యర్థము).

కొన్ని ప్రలేపయోగములు.

మూ. పద్మినీకర్దమః శీతో మౌక్తికం పిష్టమేవ వా. 82
శఙ్ఖః ప్రవాళః శుక్తిర్వా గైరికం వా ఘృతాప్లుతం,
ప్రపౌణ్డరీకం మధుకం బలా శాలూకముత్పలమ్. 83
(పృథగేతే ప్రదేహాశ్చ హితాః జ్ఞేయాః విసర్పిణాం,)

వ్యా. తామరకొలనులో నుండు చల్లనిబురద, మంచిముత్యములు, శంఖము, పవడములు, ముత్యపుచిప్పలు, గైరికము (కావిరాయి), ప్రపౌండరీకము, (పుండరీకమను గ్రంథ్యము), అతిమధురము, చిట్టాముట్టి, తామరదుంపలు, నల్లకలువలు, వీనిని వేరువేరుగ నీళ్లతో నూరి నేతిలో కలిపి పట్టువేసినచో విసర్పమునకు చాల హితకరములుగ నుండును. (పైజెప్పినవానిలో నొక్కొకటిని ఒక్కొక ప్రలేపయోగముగ గల్పించునది).

న్యగ్రోధపత్రాదిప్రలేపములు.

మూ. న్యగ్రోధపత్రం దుగ్ధేన సఘృతం స్యాత్ప్రలేపనం,

బిసాని చ మృణాళం చ; సఘృతాశ్చ కశేరుకాః. 84
శతావరీవిదార్యోశ్చ కన్దౌ ధౌతఘృతాప్లుతౌ,
శైవాలం నలమూలాని గోజిహ్వా వృషకర్ణికా. 85
ఇన్ద్రాణిశాకం సఘృతం శిరీషత్వగ్బలాఘృతం,
(దేయం వా దాహశాన్తయే.)

వ్యా. మఱ్ఱియూడలను పిన్నమనుబాలను చేర్చి ఘృతమున కలిపి యైనను; తామర కాడలను వట్టివేళ్లను నూరి నేతిలో కలిపియైనను; నమ్మదుంపలను నూరి నేతిలో కలిపి యైనను; పిల్లిపీచరగడ్డలను నేలగుమ్మడిగడ్డను నూరి శతధౌతఘృతమున కలిపి యైనను; పట్టువేయవలెను. మరియు పాచితీగెలు, కిక్కసగడ్డివేళ్లు, కర్పూరపుబెండ (ఎద్దునాలిక చెట్టు), ఎలుకచెవియాకు, నల్ల వావిలియాకు, వీనిని గూర్చి నూరి నేతిలో కలిపియైనను; దిరిసెనపుపట్టను, చిట్టాముట్టిని నూరి నేతిలో కలిపియైనను పట్టువేయనగును.

### న్యగ్రోధాదికల్కప్రలేపము.

మూ. న్యగ్రోధోదుమ్బరప్లక్షవేతసాఽశ్వత్థపల్లవైః 86
త్వక్కల్కైః బహుసర్పిర్భిః శీతైరాలేపనం హితం,

వ్యా. మఱ్ఱి, అత్తి, జువ్వి, ప్రబ్బలి, రావి, అనునీవృక్షములయొక్క చిగుళ్లను పట్టలను ఒకటిగ జేర్చి మెత్తగ నూరి, కల్కముచేసి అందు నేతిని అధికముగ కలిపి పట్టు వేయవలెను.

### దోషానుసారముగ ప్రలేపవిభాగము.

మూ. ప్రదేహాః సర్వ ఏవైతే వాతపిత్తోల్బణే శుభాః,
(రక్తపిత్తోల్బణే హితాః) 87
సకఫే తు (కఫజే తు) ప్రవక్ష్యామి ప్రదేహానపరాన్ హితాన్,

వ్యా. పైని "ఉదుమ్బరత్వఙ్మధుకం" అని యుపక్రమించి చెప్పబడిన ప్రలేపయోగంబులన్నియు వాత-పిత్తోల్బణములైన విసర్పములయందు హితకరములు. కఫముచే గల్గిన విసర్పములకు హితకరములైన ప్రలేపయోగము లీక్రింద వివరింపబడును.

ఇచ్చట పైజెప్పబడిన ప్రలేపము లన్నియు వాత-పిత్తములచే వేరువేరుగనైనను రెండును కలిసియైనను సంభవించిన విసర్పములకు లేపములు చెప్పబడినవి. కఫ సంబంధమైన విసర్పములకు ప్రలేపము లీక్రిందజెప్పబడునని దోషానుసారముగ విభజింప

బడినది. కొందరు పైజెప్పబడిన యోగములను కూడ కఫహరములుగ నన్వయించి చెప్పె దరు. 'కఫజే తు' 'అపరాః' అను విభాగముచే పృథగ్విషయముగ స్ఫుటముగనే తెలియుచున్నది. వాగ్భటాచార్యులును—"త్రిఫలా పద్మకోశీరం... లేపశ్లేష్మవిసర్పహః" (అ. హృ. చి. అ. ౧౮) అని యుపక్రమించి యీక్రింది యోగములనే కఫహర ములుగ జెప్పెను. కావున క్రింద జెప్పబడునవియే కఫజవిసర్పహరములని చెప్పుట సమంజసము.

### కఫజవిసర్పహరప్రలేపములు, అందు త్రిఫలాదిప్రలేపము.

మూ. త్రిఫలాం పద్మకోశీరం సమఙ్గాం కరవీరకమ్. 88
నలమూలాన్యనన్తాం చ ప్రదేహాముపకల్పయేత్,

వ్యా. త్రిఫలములు, పద్మకము, వట్టివేళ్లు, మంజిష్ఠి, గన్నేరు, కిక్కిసగడ్డివేళ్లు, మామెనకొమ్ములు, (లేక గరిక), వీని నన్నిటిని కూర్చి నూరి కఫజవిసర్పమున పట్టువేయ వలెను.

### ఖదిరాదిప్రలేపము.

మూ. ఖదిరం సప్తపర్ణం చ ముస్తమారగ్వధం ధవమ్. 89
కురణ్టకం దేవదారు దద్యాదాలేపనం భిషక్,

వ్యా. చండ్ర, కానుగుపట్ట, తుంగగడ్డలు, రేలఆకు, వెలిచండ్ర, పచ్చగోరంట, దేవదారుచెక్క, వీనినికూర్చి నూరి పట్టువేయునది.

### ఆరగ్వధాదిప్రలేపయోగములు.

మూ. ఆరగ్వధస్య పత్త్రాణి త్వచం శ్లేష్మాతకస్య చ. 90
ఇన్ద్రాణిశాకం కాకాహ్వాం శిరీషకుసుమాని చ,
శైవాలం నలమూలాని వీరాం గన్ధప్రియఙ్గుకామ్. 91
త్రిఫలాం మధుకం వీరాం శిరీషకుసుమాని చ,
ప్రపౌణ్డరీకం హ్రీబేరం దార్వీత్వఙ్మధుకం బలామ్. 92
పృథగాలేపనం కుర్యాత్ ద్వన్ద్వశస్సర్వశోఽపి వా,

వ్యా. రేలచిగుళ్లు, విరిగిపట్ట, (ఈరెండును చేరియొకయోగము); నల్లవావిలి యాకు, కాకిదొండ, దిరిసెనపుపువ్వులు, (ఈమూడు నొకయోగము); పాచి (నాచు) తీగెలు, కిక్కిసగడ్డివేళ్లు, నల్లనేలగుమ్ముడుగడ్డ, ప్రేంకణము, (ఇవి యొకయోగము); త్రిఫలములు, అతిమధురము, నల్లనేలగుమ్మడిగడ్డ, దిరిసెనపువ్వులు, (ఇవి యొకయోగము);

పుండరీకమను గంధద్రవ్యము, కురువేరు, మ్రానిపసుపుపట్ట, అతిమధురము, చిట్టాముట్టి, (ఇవి యొకయోగము); ఈయోగములను వేరువేరుగనైనను, రెండేసియోగముల నొకటిగ చేర్చియైనను, అన్నిటినిగూర్చియైనను నూరి పట్టువేయవలెను.

### ప్రలేపములయందు దోషానుసారముగ విశేషము.

మూ. ప్రదేహాస్సర్వ ఏవైతే దేయాస్స్వల్పఘృతాప్లుతాః. 93
వాతపిత్తోల్బణే యే తు ప్రదేహాస్తేఘృతాధికాః,

వ్యా. కఫజవిసర్పము నుద్దేశించి పైని "త్రిఫలాం పద్మకోశీరం" అని యుపక్రమించి చెప్పబడిన ప్రలేపములన్నియు కొంచెముగ నేతితోగూర్చి యుపయోగింపం దగును. వాత-పిత్తోల్బణవిసర్పముల నుద్దేశించి "ఉదుమ్బరస్య త్వఙ్మధుకం" అని యుపక్రమించి చెప్పబడిన ప్రలేపములన్నియు నేతిని అధికముగ జేర్చి యుపయోగింపనగును.

### అగ్నివిసర్పహరలేప-సేకములు.

మూ. ఘృతేన శతధౌతేన ప్రదిహ్యాత్ కేవలేన చ. 94
ఘృతమణ్డేన శీతేన పయసా మధుకామ్బునా,
పఞ్చవల్కకషాయేణ సేచయేత్ శీతలేనవా. 95
వాతాసృక్పిత్తబహుళం విసర్పం బహుశో భిషక్,

వ్యా. వాతంబును రక్తంబును పిత్తంబును అధికముగకల (అగ్ని) విసర్పమున శతధౌతఘృతమునుమాత్రము పట్టువేయదగును. మరియు పేరిస నేతిమీఁది మండముచేనైనను, పాలచేనైనను, అతిమధురమునుచేర్చి కాచబడిన కషాయముచేనైనను పంచవల్కముల (మఱ్ఱి మొదలగువానిపట్టల) కషాయమునైనను, తడుపవలెను. (చల్లగనుండు పైజెప్పినద్రవములచే విసర్పము వ్యాపించినస్థలమును శుభ్రముగ మాటిమాటికి కడుగవలెనని యర్థము).

ఇచ్చట పంచవల్కమన:—"న్యగ్రోధోదుమ్బరాశ్వత్థప్లక్షవేతస వల్కలైః, సర్వైరేకత్రసంయుక్తైః పఞ్చవల్కలముచ్యతే" అని తంత్రాంతరవాక్యముచే, మఱ్ఱి, అత్తి, రావి, జువ్వి, ప్రబ్బలి అను నైదువృక్షములపట్టల కూటమియని యెరుంగునది.

వాగ్భటాచార్యులును:—"శతధౌతఘృతేనాగ్నిం ప్రదిహ్యాత్, కేవలేన వా, సేచయేత్...రసేన వా" (అ. హృ. చి. అ. ౧౮) అని అగ్నివిసర్పమునకు ఇచ్చట చెప్పినయోగములనే లేపములకు చెప్పిరి.

విసర్పవ్రణములకు సేచనాదులు.

మూ. సేచనాస్తే ప్రదేహా యే త ఏవ ఘృతసాధనాః. 96
తే చూర్ణయోగాః వీసర్పవ్రణానామవచూర్ణనాః,

వ్యా. పైనివిసర్పముల నుద్దేశించి యేయేవిసర్పములకు ఏయేప్రలేపయోగములు చెప్పబడెనో ఆయాయోగముల ద్రవ్యములనే సేచనజలమును సిద్ధముచేయుటకును, ఘృతముల సాధించుటకు కల్కాదులకును, వ్రణాలేపనచూర్ణములకును గ్రహించి ఆయా విసర్పముల కుపయోగించునది.

విసర్పములయందు వ్రణరోపణాదులు.

మూ. దూర్వాస్వరససిద్ధం చ ఘృతం స్యాత్ వ్రణరోపణమ్. 97
దార్వీత్వక్ మధుకం లోధ్రం కేసరం చావచూర్ణనం,
పటోలః పిచుమర్దశ్చ త్రిఫలా మధుకోత్పలే. 98
ఏతత్ ప్రక్షాళనం సర్పిః వ్రణచూర్ణం ప్రలేపనం,

వ్యా. గరికస్వరసమును జేర్చి సిద్ధముచేయబడిన ఘృతమును వ్రణము నార్పుటకై యుపయోగింపనగును. మ్రానిపసుపుపట్ట, అతిమధురము, లొద్దుగపట్ట, నాగకేసరములు వీనినన్నిటినిగూర్చి చూర్ణముచేసి విసర్పవ్రణమును మాన్పుటకై యుపయోగింపవలెను. మరియు చేదుపొట్ల, వేపపట్ట, త్రిఫలములు, అతిమధురము, నల్లకలువలు, వీనినన్నిటిని విసర్పవ్రణముల కడుగుకషాయములకు, వ్రణములమాన్పు ఘృతములకును, వ్రణములపై జల్లు చూర్ణమునకును, పట్టువేయుటకు నుపయోగింపదగును.

విసర్పమునందు ప్రలేపనియమములు, అందు రక్తపిత్తవిసర్పమున విధి.

మూ. ప్రదేహాస్సర్వ ఏవైతే కర్తవ్యాః సమ్ప్రసాదనాః. 99
క్షణే క్షణే ప్రయోక్తవ్యాః పూర్వముద్ధృత్య లేపనమ్,
అథావనోద్ధృతే పూర్వే ప్రదేహా బహుశోఽఘనాః. 100

వ్యా. విసర్పములయందు రక్తదోషము పిత్తమును శుభ్రపరిచి శమింపజేయుటకై యుపయోగించు ప్రలేపము లన్నిటిని తొలుత వేసినపట్టు చెమ్మఆరకుండ పచ్చిగనున్నప్పుడే దానిని కడుగకయే తీసి వేరుపట్టు వేయుచుండవలెను. మరియు నది ఘనముగాక పలుచనగ నుండునట్లు ప్రతిక్షణమున వెనువెంటనే పలుమారు వేయుచుండవలెను,

### కఫజవిసర్పమున ప్రలేపనవిధి.

మూ. దేయాః ప్రదేహాః కఫజే పర్యాయేణానోద్ధృతే ఘనాః,
త్రిభాగాఙ్గుష్ఠమాత్రస్స్యాత్ ప్రలేపః కల్కపేషితః. 101
నాతిస్నిగ్ధో న రూక్షశ్చ న పిణ్డో న ద్రవస్సమః,

వ్యా. కఫమునగల్గిన విసర్పమున తొలుత వేసినపట్టు చెమ్మ బాగుగ నెండినపిదప దానిని విడదీసి మరల ఘనముగ పట్టువేయవలెను. మరియు ప్రలేపౌషధమును నూరి కల్కముజేసి బొటనవ్రేలిలో మూడవవంతు ఘనము కల్గియుండునట్లు పట్టువేయవలెను. మరియు నాకల్కము మిక్కిలి స్నిగ్ధంబును మిక్కిలి రూక్షంబునుగాక ముద్దగను మిక్కిలి పలుచగను లేక సమముగ ద్రవముకల్గి యుండవలెను.

### ప్రలేపనమున కొన్ని నియమములు.

మూ. న చ పర్యుషితం లేపం కదాచిదవచారయేత్. 102
న చ తేనైవ లేపేన పునర్జాతు ప్రలేపయేత్,
క్లేదవీసర్పశూలాని సోష్మభావాత్ ప్రవర్తయేత్. 103
లేపో హ్యుపరి పట్టస్య కృతః స్వేదయతి వ్రణం,
స్వేదజాః పిటకా స్తస్య కణ్డూశ్చైవోపజాయతే. 104
ఉపర్యుపరి లేపస్య లేపో యద్యవచార్యతే,
తానేవ దోషాన్ జనయేత్ పట్టస్యోపరి యాన్ కృతః. 105
అతిస్నిగ్ధోఽతిద్రవశ్చ లేపో యద్యవచార్యతే,
త్వచి న శ్లిష్యతే సమ్యక్ న దోషం శమయత్యపి. 106
తన్వాలిప్తం న కుర్వీత సంశుష్కో హ్యపుటాయతే,
న చౌషధిరసో వ్యాధిం ప్రాప్నోత్యపిచ శుష్యతి. 107
తన్వాలిప్తేన యే దోషాః తానేవ జనయేద్భృశం,
సంశుష్కః పీడయేద్వ్యాధిం నిస్స్నేహో హ్యవచారితః. 108

వ్యా. ప్రలేపమునకైన కల్కద్రవ్యములను నూరి కొంతకాలము జాగుచేసి దానిని ప్రలేపమున కుపయోగింపంజనదు. (నూరినవెంటనే పట్టువేయవలెననుట), తొలుత వేసినపట్టును విడదీసి దానినే మరల పట్టువేయజనదు. అయ్యది మిక్కిలి వేడెక్కియుండును కావున నాస్థలమున కుళ్లి వ్రణము స్థలాంతరమునకు వ్యాపించి పోటు మున్నగుబాధలు అధికముగ కల్గును.

మరియు వ్రణముపైని గుడ్డనునిచి దానిపై పట్టువేసినచో నావిరిచే చెమటబట్టి యచ్చోట బొబ్బలులేచి దురదయు కల్గును, కావున వ్రణములమీద గుడ్డ మొదలు దానినునిచి దానిమీద పట్టు వేయజనదు.

మరియు తొలుత వేసినపట్టును విడదీయక దానిమీదనే మరల పట్టువేసినను పైజెప్పినరీతిగ నావిరిచేత చెమటబట్టి బొబ్బలు లేచి బాధించును. కల్కమున స్నేహ ద్రవ్యముల నధికముగ జేర్చినను, మిక్కిలి ద్రవముగ జేసినను, ఆకల్కౌషధము చర్మము పై చక్క నంటకుండును. దానంజేసి దోషమును శమింపజాలదు. దట్టముగాక పలుచగ పట్టువేసినయెడ ఎండి యూడిపోవును. దానంజేసి యౌషధము యొక్కసారము వ్యాధి గల్గినస్థలమున వ్యాపింపక వ్యాధిని శమింప సమర్థము కానేరదు. స్నేహమును బొత్తుగ చేర్చకయే పట్టువేసినయెడ ద్రవమంతయు శీఘ్రముగ నెండి వ్యాధిని శమింపనేరదు. (కావున పైజెప్పినరీతిగ విధ్యుక్తప్రకారము పట్టువేయవలెనని భావము).

### విసర్పమునం దన్నపాననియమములు.

మూ. అన్నపానాని వక్ష్యామి విసర్పాణాం నివృత్తయే,
లఙ్ఘితేభ్యో హితో మన్థో రూక్షః సక్షౌద్రశర్కరః. 109
మధురః కిఞ్చిదమ్లో వా దాడిమామలకాన్వితః,
సపరూషకమృద్వీకః సఖర్జూరః శృతామ్బునా. 110
తర్పణైర్యవశాలీనాం సస్నేహా చావలేహికా,
జీర్ణే పురాణశాలీనాం యూషైర్భుఞ్జీత భోజనమ్. 111

వ్యా. ఇంతదనుక విసర్పహరచికిత్సితము చెప్పబడినది. పిదప విసర్పమున హితకరములగు నన్నపానములు వివరింపబడు:—విసర్పములయందు లంకణముచేయించినవారికి నెయ్యి మున్నగుస్నేహముల జేర్పక సిద్ధము చేయబడినదియు, తేనెను చక్కెరను కలుపుటచే తీపికల్గినదియు, దానిమ్మరసమునైనను ఉసిరికపండ్లరసమునైనను కొంచెముగ పులుపుకై జేర్పబడినదియు, ఈతపండ్లను ద్రాక్షపండ్లను ఖర్జూరపుపండ్లను జేర్చి పక్వముచేయబడిన మంథమును (సత్తుపిండిని), కాచబడిన వేడినీళ్లతో కలిపి త్రాగించవలెను. పిమ్మట యవలయొక్కయు రాజనములయొక్కయు బొరుగులపిండియందు నేతిని జేర్చి ముద్దజేసి యవలేహనముగ నిప్పించవలెను. అయ్యది జీర్ణమైనపిదప ప్రాతవియగురాజనములయన్నమును యూషములతో గూర్చి భుజింపజేయవలెను.

### విసర్పహరయూషాదికల్పనము.

మూ. ముద్గాన్ మసూరాంశ్చణకాన్ యూషార్థముపకల్పయేత్,

అనమ్లాన్ దాడిమామ్లాన్ వా పటోలామలకైస్సహ. 112
జాఙ్గలానాం చ మాంసానాం రసాంస్తస్యోపకల్పయేత్,
రూక్షాన్ పరూషకద్రాక్షా దాడిమామలకాన్వితాన్. 113

వ్యా. యూషములగల్పించుటకై పెసలనైనను, చిరుసెనగలనైనను, సెనగలనైనను జేర్చి విధ్యుక్తప్రకారము సిద్ధముచేయనగును. మరియు నాయూషములయందు పులుపు చేర్చకయైనను దానిమ్మపండ్లపులుపును చేర్చియైనను, పొట్లను ఉసిరికకాయలను కూడ చేర్చి పక్వము చేయనగును. మరియు జాంగలజంతువులమాంసరసములను స్నేహమును జేర్పక యీతపండ్లను దానిమ్మపండ్లరసమును ఉసిరికకాయలరసమును కూడ చేర్చి రూక్షములుగ పక్వముచేసి యాహారముతో గూడ నుపయోగింపందగును. (ఇచ్చట 'రూక్షాన్' అనుపదముచేత రూక్షగుణముకల జంతుమాంసములరసములును, స్నేహమును జేర్పక సంస్కరింపబడిన మాంసరసములును గ్రహింపదగును).

### విసర్పమున నాహారార్థమై యుపయోజ్యధాన్యాదులు.

మూ. రక్తాశ్శ్వేతాః మహాహ్వాశ్చ శాలయష్షష్టికైస్సహ,
భోజనార్థే ప్రశస్యన్తే పురాణాస్సుపరిస్రుతాః. 114
యవగోధూమశాలీనాం సాత్మ్యాన్యేవ ప్రదాపయేత్,
యేషాం నాత్యుచితశ్శాలిః నరా యే చ కఫాఽధికాః. 115

వ్యా. ప్రాతవియగు ఎఱ్ఱనిరాజనములును, తెల్లనిరాజనములును, పెద్దసంబావులును, అరువదినాళ్లసంబావులును భోజనమునకై కఫాధికవిసర్పరోగుల కుపయోగింపందగును. పైజెప్పిన ధాన్యములబియ్యమును శుభ్రముగ నీళ్లతో కడిగి వండి గెంజినివార్చి యుపయోగింపందగును. మరియు యవలు గోధుమలు రాజనములు అను నీమూటిలో నెవరికి నేది యలవాటుగ నుండునో వారికి దానినే యుపయోగింపందగును. మరియు వరిబియ్యమలవాటులేనివారికిని కఫప్రకృతి యధికముగ నుండువారికిని యవలును గోధుమలును ఉపయోగింపందగును. (ఇచ్చట యవలును గోధుమలును మధురరసములైనను "సర్వం మధురం కఫకరం, అన్యత్ర పురాణాచ్ఛాలి-యవ-గోధూమాత్" అను ప్రమాణముచే నవి ప్రాతవియగునెడ కఫమున విరోధముచేయక విసర్పములకు హితకరములని యెరుంగునది).

### విసర్పమున వర్జనీయములు.

మూ. విదాహీన్యన్నపానాని విరుద్ధం స్వపనం దివా,
క్రోధవ్యాయామసూర్యాఽగ్నిప్రవాతాంశ్చ వివర్జయేత్. 116

వ్యా. తాపమునుబుట్టించు నన్నపానములును, పరస్పరవిరుద్ధములగు క్షీరమత్స్యాదుల నొకటిగ జేర్చి భుజించుటయు, పగటినిద్రయు, క్రోధంబును, శరీరమున కాయాసమును కల్గించుపనులును, ఎండవేడియు, నిప్పువేడిమియు, ప్రబలమైన గాలితాకుడును, వీనినన్నిటిని విసర్పరోగపీడితులు విడువవలెను.

విసర్పమున దోషానుసారముగ చికిత్సావిభాగము.

మూ. కుర్యాచ్చికిత్సితాదస్మాత్, శీతప్రాయాణి పైత్తికే,
రూక్షప్రాయాణి కఫజే స్నైహికాన్యనిలాత్మకే. 117
వాతపిత్తప్రశమనమగ్నివీసర్పిణే హితం,
కఫపిత్తప్రశమనం ప్రాయః కర్దమసంజ్ఞితే. 118

వ్యా. పైచెప్పిన చికిత్సావిధానములో శీతప్రాయములుగ నుండు చికిత్సితములను పిత్తముచేగల్గిన విసర్పమునందు చేయదగును. కఫమునగల్గిన విసర్పమున రూక్షప్రాయములగుచికిత్సలను, వాతమున జనించినవిసర్పమున మిక్కిలి స్నిగ్ధములగుచికిత్సలను చేయదగును. మరియు నగ్నివిసర్పమున వాతపిత్తశామకచికిత్సలను, కర్దమవిసర్పమున కఫపిత్తహరచికిత్సలను ప్రాయికముగ నుపయోగింపవలెను.

గ్రన్థి (వాతకఫజ) విసర్పచికిత్సాక్రమము.

మూ. రక్తపిత్తోత్తరం దృష్ట్వా గ్రన్థివీసర్పమాదితః,
రూక్షణైర్లఙ్ఘనైస్సేకైః ప్రదేహైః పాఞ్చవల్కలైః. 119
సిరామోక్షైః జలౌకోభిః వమనైస్సవిరేచనైః,
ఘృతైః (శృతైః) కషాయతిక్తైశ్చ కాలజ్ఞస్సముపాచరేత్. 120

వ్యా. రక్తంబును పిత్తంబును మిక్కిలి యుత్కటముగ వృద్ధినొందిన గ్రంథివిసర్పమున తొలుత రూక్షణక్రియలు, లంఘనములు, పరిషేకములు, పంచవల్కలముల ప్రలేపములు, సిరామోక్షణములు, జలగలచే రక్తమోక్షణము, వమనవిరేచనములు, కషాయతిక్తరసద్రవ్యముల కషాయములు, (లేక ఘృతములు), అను నీచికిత్సలను దేశకాలాదులను రోగిపరిస్థితిని చక్కగ గమనించి తత్తదుచితముగ చేయవలెను.

గ్రంథివిసర్పమున శోధనము.

మూ. ఊర్ధ్వం చాఽధశ్చ శుద్ధాయ రక్తే చాఽప్యవసేచితే,
వాతశ్లేష్మహరం కర్మ గ్రన్థివీసర్పిణే హితమ్. 121

వ్యా. గ్రంథివిసర్పరోగికి తొలుత శరీరమునందలి యూర్ధ్వభాగమున నుండు దోషమును వమనముచేతను, క్రిందిదోషమును విరేచనముచేతను వెడలించి, పిదప రక్తమోక్షణముచేయించి, పిమ్మట వాతకఫముల హరించునట్టి చికిత్సనుచేయుట చాల హితకరము.

### గ్రంథివిసర్పశూలహరస్వేదనము.

మూ. ఉత్కారికాభిరుష్ణాభిరుపనాహాః ప్రశస్యతే,
స్నిగ్ధాభిర్వేసవారైర్వా గ్రన్థివీసర్పశూలినామ్. 122

వ్యా. గ్రంథివిసర్పమున నొప్పికల్గియున్నయెడ ఉష్ణవీర్యములై వాతకఫహరద్రవ్యములచే సిద్ధముచేయబడిన ఉత్కారికలచేనైనను స్నిగ్ధములైన వేసవారములచేనైనను ఉపనాహము చేయవలెను. (ఇచ్చట నుత్కారికోపనాహమన ఔషధములను ముద్దగనూరి యావిరిచే నుడికించి యాపిష్టముచే దట్టముగ పట్టువేయుట యని యర్థము).

### గ్రంథివిసర్పమున సేచనము.

మూ. దశమూలోపసిద్ధేన తైలేనోష్ణేన సేచయేత్,
కుష్ఠతైలేన చోష్ణేన పాక్యక్షారయుతేన చ. 123
గోమూత్రైః పత్రనిర్యూహైః ఉష్ణైర్వా పరిషేచయేత్,

వ్యా. దశమూలముల జేర్చి పక్వముచేయబడిన వేడిగనుండు ఘృతముచేనైనను, చెంగల్వకోష్టును జేర్చి సిద్ధముచేయబడి యుష్ణముగనుండు తైలమునైనను, క్షారపాకవిధి ప్రకారము పక్వముచేయబడిన క్షారోదకముతోగూడిన తైలముచేనైనను, గోమూత్రముచేనైనను, ఆముదపుఆకుమున్నగువాని జేర్చి కాచబడినకషాయముచేనైనను, విసర్పగ్రంథిని తడుపవలెను. పైజెప్పబడిన ద్రవములు సుఖోష్ణముగ నున్నపుడుపయోగింపవలెను.

### గ్రంథివిసర్పమున ప్రలేపనములు.

మూ. సుఖోష్ణయా ప్రదిహ్యాద్వా పిష్టయా చాశ్వగన్ధయా. 124
శుష్కమూలకకల్కేన నక్తమాలత్వచాపి వా,
విభీతకత్వచాం వాపి కల్కేనోష్ణేన లేపయేత్. 125

వ్యా. పెన్నేరుగడ్డను మెత్తగనూరి యుడికించి సుఖోష్ణముగ నున్నపుడు విసర్పగ్రంథిపై దట్టముగ పట్టువేయవలెను. లేక యెండుముల్లంగిగడ్డలనైనను, కానుగపట్ట

నైనను, తాండ్రచెట్టుపట్టనైనను, మెత్తగనూరి కల్కముచేసి యుడికించి సుఖోష్ణముగ నున్నపుడు గ్రంథిపైని దట్టముగ పట్టువేయనగును.

### బలాదిప్రలేపము.

మూ. బలాం నాగబలాం పథ్యాం భూర్జగ్రన్థిం విభీతకం,
వంశపత్రాణ్యగ్నిమన్థం కుర్యాద్గ్రన్థిప్రలేపనమ్. 126

వ్యా. చిట్టాముట్టి, జిబిలిక, కరకకాయలు, భుజపత్రి, తానికాయబెరడు, వెదురాకు, తూరనెల్లి, వీనినన్నిటిని గూర్చి నూరి విసర్పగ్రంథికి పట్టువేయనగును.

### దంత్యాదిప్రలేపము.

మూ దన్తీ చిత్రకమూలత్వక్ సుధార్కపయసీ గుడః,
భల్లాతకాస్థికాసీసం లేపో భిన్ద్యాచ్ఛిలామపి. 127
బహిర్మార్గస్థితం గ్రన్థిం కిం పునః కఫసమ్భవం,

వ్యా. నేపాళపుగింజలు, చిత్రమూలమువేరుపట్ట, జెముడుపాలు, జిల్లేడుపాలు, బెల్లము, జీడిగింజలు, అన్నభేది, వీనినన్నిటిని గూర్చి నూరి పూసినయెడ రాతినైనను పగులదీయును. ఇక శరీరమునందలి బాహ్యామార్గమున కఫముచే సంభవించిన గ్రంథిని భేదించునని వేరుగ జెప్పవలెనా? (తప్పక భేదించుననుట).

### గ్రంథివిసర్పాభేదనచికిత్స.

మూ. దీర్ఘకాలస్థితం గ్రన్థిం భిన్ద్యాద్వా భేషజైరిమైః. 128
మూలకానాం కులుత్థానాం యూషైః సక్షారదాడిమైః,
గోమూత్రాన్నైః యవాన్నైర్వా సశీధుమధుశర్కరైః. 129
సక్షౌద్రైః వారుణీమణ్డైః మాతులుఙ్గరసాన్వితైః,
త్రిఫలాయాః ప్రయోగైశ్చ పిప్పలీక్షౌద్రసంయుతైః. 130
ముస్తభల్లాతసక్తూనాం ప్రయోగైః మాక్షికస్య చ,
దేవదారుగుడూచ్యోశ్చ ప్రయోగైర్గిరిజస్య చ. 131
ధూమైర్విరేకైశ్శిరసః పూర్వోక్తైః గుల్మభేదనైః,
అయోలవణపాషాణహేమతామ్రప్రపీడనైః. 132

వ్యా. విసర్పగ్రంథి శాంతపడక చాలకాలమువరకును అనుసరించి బాధించుచున్నయెడ నీక్రిందజెప్పబడు చికిత్సావిధానములచే భేదింపవలెను:—యవక్షారమును దానిమ్మ

పండ్లరసమును జేర్చి పక్వము జేయబడిన ముల్లంగియూషములతో నైనను, ఉలవకట్టులతో నైనను, గోధుమాన్నమును యవాన్నమును భుజింపజేయవలెను. మరియు చక్కెరను తేనెను జేర్చిన శీధుమద్యము నైనను, తేనెను మాదీఫలరసమును కలిపిన వారుణీమద్యము నైనను త్రాగింపనగును. త్రిఫలచూర్ణమును పిప్పలిచూర్ణమును తేనెతో కలిపి తినిపించవలెను. కుష్ఠచికిత్సితమున జెప్పబడిన ముస్తసక్తుయోగము నైనను,రసాయనమున జెప్పబడిన భల్లాతకసక్తువు నైనను, ధాతుమాక్షికము నైన నుపయోగింపందగును. దేవదారుచెక్కను తిప్పతీగెను చూర్ణము చేసి తేనెతో కలిపియైన నుపయోగింపనగును. శిలాజతువు నైన నుపయోగింపదగును. మరియు ధూమపానములను నస్యప్రయోగముచే శిరోవిరేచనమును చేయించవలెను. గుల్మచికిత్సితమున జెప్పబడిన గ్రంథిభేదనోపాయములను, ఇనుము లవణము రాయి బంగరు రాగి వీనిని కాల్చి యొత్తడము కాపుడము పెట్టవలెను. (ఇట్టిచికిత్సావిధానములచే కఠినమైన గ్రంథిని భేదింపవలెనని యర్థము).

ఇచ్చట:—కుష్ఠచికిత్సితమున జెప్పబడిన "ముస్తం వ్యోషం త్రిఫలా...... చూర్ణం తర్పణభాగైః నవభిః సంయోజితం సమధ్వాజ్యమ్,...వినిహన్తి" (చి. అ. ౭. శ్లో. ౬౫-౬౭) అనుముస్తాదిసక్తుచూర్ణంబును; "భల్లాతకసర్పిః......భల్లాతకసక్తవః... భల్లాతవిధానముక్తమ్"(చి. అ. ౧. పాద.౩) అని చెప్పబడిన భల్లాతకసక్తుయోగంబును, "ముస్త-భల్లాతసక్తూనాం" అనుపదముచే గ్రహింపబడును. మరియు "పూర్వోక్తైః గుల్మభేదనైః" అనుపదముచేత గుల్మచికిత్సితమున జెప్పబడిన భేదనోపాయముల గ్రహించునది.

## గ్రంథివిసర్పమున దాహవిధి.

మూ. ఆభిః క్రియాభిస్సిద్ధాభిః వివిధాభిర్బలీ స్థిరః,
గ్రన్థిః పాషాణకఠినః యదా నైవోపశామ్యతి. 133
అథాస్య దాహః క్షారేణ శరైః హేమ్నాఽథవా హితః,
(లోహేన వా హితః.)
పాకిభిః పాచయిత్వా వా పాటయిత్వా సముద్ధరేత్. 134

వ్యా. పైజెప్పబడిన పలువెరంగులైన సిద్ధక్రియలచేత మిక్కిలి కఠినమై బలిష్ఠమైన విసర్పగ్రంథి రాతివలె కఠినమై శమించకుండునెడ క్షారముచే నైనను, నిప్పునకాల్చబడిన యినుపఖడ్డీలచేనైనను, బంగరుఖడ్డీలచేనైనను విసర్పగ్రంథిని కాల్చి భేదింపవలెను. లేక గ్రంథుల పచింపజేయునట్టి యౌషధములముద్దచే పచింపజేసి పక్వమైన పిదప శస్త్రముచే భేదించి గ్రంథిని వెలికిం దీయవలెను.

### గ్రంథివిసర్పమున రక్తమోక్షణము.

మూ. మోక్షయేద్బహుశశ్చాస్య రక్తముత్క్లేశమాగతం,
పునశ్చాపహృతే రక్తే వాతశ్లేష్మజిదౌషధమ్. 135
ధూమో విరేకశ్శిరసః స్వేదనం పరిమర్దనమ్,
అప్రశామ్యతి దోషే చ పాచనం వా ప్రశస్యతే. 136

వ్యా. విసర్పగ్రంథియందు రక్తము అధికముగ చెడియున్నయెడల అట్టిచెడ్డరక్తము రక్తమోక్షణవిధిప్రకారము వెలికిందీసి పిమ్మట వాతశ్లేష్మము హరించునట్టి చికిత్సలను మరల చేయవలయును. మరియు గ్రంథిని భేదించినపిదప ధూమము శిరోవిరేచనకరమయిన నస్యము స్వేదనము మర్దనము మున్నగువిధుల మరల జేయవలయును. అట్టిచికిత్సలచే గూడ దోషము పూర్తిగ హరించనియెడల మరల దోషమును పచింపజేయునట్టి బాహ్యోపచారములను ఓషధీప్రయోగములను చేయవలయును.

### విసర్పగ్రంథియందు వ్రణోపచారము.

మూ. ప్రక్లిన్నం దాహపాకాభ్యాం బిషక్ శోధనరోపణైః,
బాహ్యైశ్చాభ్యన్తరైశ్చైవ వ్రణవత్సముపాచరేత్. 137

వ్యా. పైజెప్పిన దాహకర్మచేతను పాచనక్రియచేతను, విసర్పగ్రంథియందలి దోషము పక్వమైనపిదప అట్టిదోషము వెడలించునవియు వ్రణములనార్పునవియు నగు బాహ్యక్రియలచేతను, ఆభ్యంతరౌషధములచేతను, వ్రణములకు చికిత్స జేయు విధముగ చికిత్స జేయుచు నుపచరించవలయును.

### విసర్పగ్రంథియందు వ్రణమునుమాన్పుచికిత్స, అందు కంపిల్లకాదితైలము.

మూ. కంపిల్లకం విడంగాని దార్వీ కారఞ్జకం ఫలం,
పిష్ట్వా తైలం విపక్తవ్యం గ్రన్థివ్రణచికిత్సితమ్. 138
ద్వివ్రణీయోపదిష్టేన కర్మణా చాప్యుపాచరేత్,
దేశకాలవిభాగజ్ఞో వ్రణాన్వీసర్పజాన్ బుధః. 139

(ఇతి గ్రన్థివీసర్పచికిత్సా.)

వ్యా. కంపిల్లకము, వాయువిడంగములు, మ్రానిపసుపు, కానుగకాయలు, వీనిని నూరి కల్కముచేసి కూర్చి విధ్యుక్తప్రకారము తైలమును పక్వముచేసి యీతైలమును విసర్పగ్రంథిచే నైన వ్రణమును మాన్పుటకై లేపనాదులచేయనగును. మరియు ద్వివ్ర

ణీయాధ్యాయమున నుపదేశింపబడు వ్రణరోపణ (వ్రణములమాన్పు) చికిత్సావిధాన ముచే దేశకాలాదిపరిస్థితుల చక్కఁగమనించి విసర్పముచే గల్గినవ్రణములను మాన్పుటకై యుపయోగింపనగును. (ఇచ్చట ద్వివ్రణీయాధ్యాయమున "న్యగ్రోధోదుమ్బరాశ్వత్థ" (చికి. 25) అని యుపక్రమించి చెప్పబడినవ్రణరోపణాదివిధులనన్నిటిని గ్రహించునది).

## గలగండచికిత్సావిధానము.

మూ. య ఏవ విధిరుద్దిష్టో గ్రన్థీనాం వినివృత్తయే,
స ఏవ గలగణ్డానాం కఫజానాం నివృత్తయే. 140
గలగణ్డాస్తు వాతోత్థా యే కఫానుగతా (బలా) నృణాం,
ఘృతక్షీరకషాయాణామభ్యాసాన్న భవన్తి తే. 141

వ్యా. ఇచ్చట విసర్పగ్రంథులనుద్దేశించి యేచికిత్స విధింపబడినదియో ఆచికిత్సా విధానమునే కఫముచే జనించి గలగండముల నివర్తించుటకు నుపయోగింపదగును. మరియు కఫ మనుబంధమయి వాతమును ప్రధానముగ చేసి సంభవించిన గలగండములకు అట్టికఫవాతహరములగు ఘృతక్షీరకషాయముల నభ్యాసముగ నుపయోగించుచున్నయెడ నయ్యవి నివర్తించును. (ఇచ్చట 'గలగండానాం" అని బహువచననిర్దేశముచేత గండ మాలలు కూడ గ్రహింపబడును. కావున గలగండమునకు అతిదేశించిన విసర్పచికిత్సితమే గండమాలలకును చేయదగునని యెరుంగునది).

## విసర్పమునందు రక్తమోక్షణప్రాధాన్యము.

మూ. యానీహోక్తాని కర్మాణి విసర్పాణాం నివృత్తయే,
ఏకతస్తాని సర్వాణి రక్తమోక్షణమేకతః. 142
విసర్పో న హ్యసంసృష్టో రక్తపిత్తేన జాయతే,
తస్మాత్సాధారణం సర్వముక్తమేతచ్చికిత్సితమ్. 143
విశేషో దోషవైషమ్యాన్న చ నోక్తః సమాసతః,
సమాసవ్యాసనిర్దిష్టాం క్రియాం విద్వానుపాచరేత్. 144
(సమాసవ్యాసనిర్దేశైః ఉక్తం చైతచ్చికిత్సితం,)

వ్యా. విసర్పములు శమించుటకై చెప్పబడినచికిత్సలన్నిటికంటెను రక్తమోక్షణము ప్రధానమైనదిగనుండును. ఏవిసర్పమునందైనను రక్తపిత్తములసంసర్గములులేక జనించుట లేదుకావున దోషసాధారణముగ రక్తమోక్షణ ముఖ్యముగ జెప్పబడినది. మరియు

తక్కిన చికిత్సలన్నియు దోషవిశేషము ననుసరించి సంగ్రహముగను విస్తరముగను నిర్దేశింపబడినది. అట్టి సమాసవ్యాసరూపమైన చికిత్సావిధానమున విద్వాంసుడగుపండితుడు గమనించి తత్తదనుసారముగ చికిత్సచేయనగును.

## అధ్యాయవిషయసంగ్రహము.

భవన్తి చాత్ర:—

నిరుక్తం (క్తిః) నామభేదాశ్చ దోషా దూష్యాణి హేతవః,
ఆశ్రయో మార్గతశ్చైవ విసర్పగురులాఘవమ్. 145
లిఙ్గాన్యుపద్రవా యే చ యల్లక్షణ ఉపద్రవః,
సాధ్యత్వం, న చ, సాధ్యానాం సాధనఞ్చ యథాక్రమమ్. 146
ఇతి పిప్రష్ఠవే సిద్ధం అగ్నివేశాయ ధీమతే,
పునర్వసురువాచేదం విసర్పాణాం చికిత్సితమ్. 147

వ్యా. విసర్పశబ్దనిర్వచనము, నామము, విసర్పభేదములు, విసర్పమునకు సంబంధించినదోషములు, దూష్యములును; విసర్పకారణములు, ఆశ్రయభేదములు, విసర్పము వ్యాపించుమార్గముల ననుసరించి గురులాఘవనిర్ణయము, ఆశ్రయభేదముచే కల్గులక్షణములు, విసర్పమున కల్గునుపద్రవములు, నుపద్రవసామాన్యలక్షణములు, విసర్పసాధ్యాసాధ్యవిభాగము, సాధ్యములయినవిసర్పములకు చికిత్సాక్రమము, అను నీవిషయము లన్నియు అగ్నివేశునిప్రశ్నానుసారముగ పునర్వసువను నాత్రేయమహర్షిచే విసర్పిచికిత్సితమను నీయధ్యాయమున వివరించి చెప్పబడినది.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే, దృఢబలసంపూరితే,
చికిత్సాస్థానే, విసర్పచికిత్సితం నామైకవింశోఽధ్యాయః.

ఇత్తెరంగున అగ్నివేశకృతంబును చరకప్రతిసంస్కృతంబును నైనచరకసంహిత యను నాయుర్వేదతంత్రమునందలి చికిత్సాస్థానమున దృఢబలసంపూరితభాగమున విసర్పచికిత్సితమనునది ఇరువదియొకటవ యధ్యాయము సమాప్తము.

---

## ద్వావింశాధ్యాయము.

అవతరణిక:—విసర్పమున తృష్ణ యుపద్రవరూపముగ విశేషముగ సంభవించును కావున, విసర్పచికిత్సితమును జెప్పిన పిదప తృష్ణాచికిత్సితము చెప్పబడును:—

మూ. అథాతస్తృష్ణారోగచికిత్సితం వ్యాఖ్యాస్యామః. 1

ఇతి హ స్మాహ భగవానాత్రేయః. 2

వ్యా. విసర్పచికిత్సితమును జెప్పినపిదప దానికుపద్రవరూపమైన తృష్ణారోగమునకు దగినచికిత్సను భగవానుడగునాత్రేయులుపదేశించినదానికి న్యూనాతిరేకముగాకుండునట్లు వివరించి చెప్పెదనని యర్థము.

### తృష్ణాచికిత్సితప్రారంభము.

మూ. జ్ఞానప్రశమతపోభిః ఖ్యాతోఽత్రిసుతో జగద్ధితేఽభిరతః,
తృష్ణానాం ప్రశమార్థం చికిత్సితం ప్రాహ పఞ్చానామ్. 3

వ్యా. తత్త్వజ్ఞానముచేతను శాంతిచేతను చాంద్రాయణాది తపోవిశేషములచేతను మిక్కిలి ప్రశస్తిగాంచిన యాత్రేయమునిపుంగవుడు లోకమున కుపకారముచేయుటయం దాసక్తికలవాడై యైదువిధములుగ నిర్దేశింపబడిన తృష్ణాభేదములకై దిటికిని శమనోపాయ రూపమైన చికిత్సను ఈక్రింద వివరింపబడురీతిగ నుపదేశించెను.

(అష్టోదరీయాధ్యాయమున రోగభేదముల పరిగణనముచేయుతరి "పఞ్చ తృష్ణా ఇతి:— వాత-పిత్త-ఆమ-క్షయ-ఉపసర్గాత్మికాః" (సూ. అ. ౧౯. సూ. ౧౭) అని తృష్ణ దప్పియైదువిధములుగ నిర్దేశింపబడినది. అట్టితృష్ణాభేదములైదును (తక్కినకాస హిక్కాదిరోగములవలెనసాధ్యభేదములు లేక) సాధ్యములై చికిత్సావిషయగోచరము లని "తృష్ణానాం ప్రశమార్థం చికిత్సితం ప్రాహ పఞ్చానాం" అనువాక్యముచే జెప్ప బడినది. చికిత్సితమన చికిత్సావిధాయకగ్రంథమని యర్థము. అట్టిచికిత్సితము నిదానపరి జ్ఞానపూర్వకముగ నుండవలెను కావున చికిత్స ననుసరించిన నిదానంబును చికిత్సితపదము చేతనే సంగ్రహింపబడునని యెరుంగునది).

### తృష్ణారోగనిదాన-సంప్రాప్తులు.

మూ. క్షోభాద్భయాచ్ఛ్రమాదపి శోకాత్క్రోధాద్విలఙ్ఘనాన్మద్యాత్,
క్షారామ్లలవణకటుకోష్ణరూక్షశుష్కాన్నసేవాభిః. 4

ధాతుక్షయ-గదకర్షణ-వమనాఽద్యతియోగసూర్యసన్తాపైః,
పిత్తాఽనిలౌ ప్రవృద్ధౌ సౌమ్యాన్ ధాతూంశ్చ శోషయతః. 5
రసవాహినీశ్చ నాడీః (ధమనీః) జిహ్వామూల్యగలతాలుకక్లోమ్నః
సంశోష్య నృణాం దేహే కురుత స్తృష్ణాం మహాబలావేతౌ. 6
పీతం పీతం హి జలం శోషయతస్తావతో న యాతి శమం,
ఘోరవ్యాధికృశానాం ప్రభవత్యుపసర్గభూతా సా. 7

వ్యా. మనస్సుకు సంక్షోభము కల్గుట, భయము, శ్రమము, దుఃఖము, కోపము, ఉపవాసమునుండుట, మద్యపానముచేయుట, కారము, పులుపు, ఉప్పు, చేదు, అనునీరసములుగలపదార్థములను భుజించుట; స్పర్శముచేతను, వీర్యముచేతను ఉష్ణమయినపదార్థము భుజించుట; రూక్షమయిన (జిడ్డులేని), పదార్థముల భుజించుట, ద్రవములేకయెండిన అన్నమును భుజించుట, రసాదిధాతువులు క్షీణించుట, జ్వరాదిరోగములచే శరీరము కృశించుట, వమనవిరేచనాదులు అధికముగనగుట సూర్యునివేడిమి యధికముగ సోకుట, ఈకారణములచేత పిత్తవాతములు రెండును వృద్ధినొంది ప్రకుపితములై శరీరమునందలి సౌమ్యములయినకఫమును ఉదకములను వహించుధాతువులు తొలుత ద్రవములేక శోషింపజేసి పిదప రసధాతువును శరీరమున వ్యాపింపజేయునాడులను, నాలుకయొక్క మొదటిభాగముకుత్తుకను, తాలువులను, క్లోమమును, వీనినన్నిటిని పరసగ ద్రవములేక యెండించి మిక్కిలి బలిష్ఠములగు వాతపిత్తములు రెండును మనుజులయొక్క శరీరమును తృష్ణను (దప్పిని) కల్గించును. మరియు నావాతపిత్తములు రెండును అట్టిదప్పికల్గినప్పుడు మాటిమాటికి జలమును త్రాగుచున్నను అట్టిజలమును అప్పటికప్పుడే యెండించుచుండును. దానంజేసి యీదప్పి శమింపనేరదు. మరియు క్రూరమయిన విషూచిమున్నగువ్యాధులచే కృశించినవారికి ఈతృష్ణావ్యాధి యుపద్రవరూపముగను సంభవించును.

ఇచ్చట భయసంక్షోభాదికారణములలో కొన్ని వాతమును వృద్ధిపొందించునవియు. కొన్ని వాతపిత్తముల రెండింటిని వృద్ధినొందించునవియు నైయున్నవి. అందు వానివాని కారణముల ప్రత్యేకముగ నూహించునది. "పిత్తాఽనిలౌ ప్రవృద్ధౌ" అని యుపక్రమించి తృష్ణాసామాన్యముగసంప్రాప్తి చెప్పబడినది కావున తృష్ణాభేదములన్నిటియందును వాతపిత్తములు రెండును ప్రధానకారణములై యుండును. మరియు శారీరస్థానమున "ఇచ్ఛా ద్వేషాత్మికా తృష్ణా సుఖదుఃఖాత్ప్రవర్తతే,తృష్ణా చ సుఖదుఃఖానాం కారణం పునరుచ్యతే" (శా. అ. ౧. శ్లో. ౧౩౭) అను గ్రంథముచే సుఖదుఃఖములవలనః ఇచ్ఛా

ద్వేషరూపమయిన మానసికతృష్ణావ్యాధియొకటి చెప్పబడినది అట్టితృష్ణ ఇచ్చట గ్రహింపబడదని యభిప్రాయముచే "నృణాం దేహీ కురుత స్తృష్ణాం మహాబలావేతౌ" అని నిర్దేశింపబడినది. సుఖముచేకల్గిన ఇచ్ఛారూపమయినతృష్ణయు దుఃఖముచేకల్గినద్వేషరూపమయినతృష్ణయు మానసికములు ఇచ్చట చెప్పబడినది. శరీరమునందలిదోషమును కారణముగ జేసి జనించినదిగాన దేహజమనియు పరస్పరభేదము నెరుంగునది.

మరియు మనుజులకు స్వాభావికముగ జనించు తృష్ణయందును వాతపిత్తములే ప్రారంభకారణములై యుండును. ఐనను అట్టినైసర్గికమైనతృష్ణ యథోచితద్రవపానము చేత శమించును. రోగరూపమయిన ఈతృష్ణయందు మాటిమాటికి నీళ్లుత్రాగుచున్నను శమించక బాధించుచుండునని పరస్పరభేదము నెరుంగునది. ఈవిషయమునే "పీతం పీతం హి జలం శోషయతస్తావతౌ న యాతి శమం" అని వివరించి చెప్పబడినది. "ఘోరవ్యాధికృశానాం" అనువాక్యముచే నుపద్రవరూపమయిన తృష్ణాసంప్రాప్తి నిర్దేశింపబడినది.

### తృష్ణారోగపూర్వరూపము, స్వరూపలక్షణము.

మూ. ప్రాగ్రూపం ముఖశోషః స్వలక్షణం సర్వదాఽమ్బుకామిత్వం,
తృష్ణానాం సర్వాసాం లిఙ్గానాం లాఘవమపాయః. 8

వ్యా. తృష్ణారోగము జనించుటకుముందు నోట ద్రవములేక యెండును. తృష్ణారోగభేదములకు నీక్రింద వేరువేరుగా జెప్పబడులక్షణములు స్వల్పముగ కనబడును. అందు కొన్నిలక్షణములు బొత్తుగ లేకయు నుండును. ఇదియే తృష్ణారోగమునకు పూర్వరూపము మరియు యెల్లప్పుడును మాటిమాటికి త్రాగుచున్నను జలమును కోరుచుండుటయే తృష్ణావ్యాధికి నియతమైన స్వరూపలక్షణము.

ఇచ్చట జ్వరమునకు సంతాపంబును శోథరోగమునకు ఉన్నతముగ నుండుటయు నెట్లు నియతమైనస్వరూపలక్షణములై యుండునో అత్తెరంగుననే జలకామిత్వము తృష్ణావ్యాధికి నవ్యభిచరితమైన స్వరూపలక్షణమని యెరుంగునది. ముఖశోషంబును ఆయాతృష్ణావ్యాధిలక్షణములు స్వల్పముగ కన్పడుటయు పూర్వరూపములగును. ఈవిషయమునే "అవ్యక్తం లక్షణం తస్యాః పూర్వరూపమితి స్మృతమ్" అని స్థలాంతరమున చెప్పబడినది.

ఇచ్చట కొందరు "ప్రాగ్రూపం ముఖశోషః స్వరక్షయః సర్వదాఽమ్బుకామిత్వం"

అని పఠించెదరు. ఈపాఠము స్వరూపలక్షణము చెప్పియుండలేదు. లేక ముఖశోషస్వరక్షయములు పూర్వరూపమనియు సర్వదాంబుకామిత్వము స్వలక్షణమనియు విభజించి తృష్ణలన్నిటియందనుకల్గులక్షణములు స్వల్పముగనుండినయెడ రోగవిముక్తిలక్షణమనియు "లాఘవమపాయః" అనువాక్యముచే సూచింపబడినది. తృష్ణకు చెప్పిన స్వలక్షణములన్నియు పూర్తిగ నొకప్పుడు జ్వరాదిరోగలక్షణములవలె బొత్తిగ నివర్తించుటలేదు. ఏలయన మనుజులకు స్వాభావికమయినతృష్ణ (దప్పి) విడువకయుండునుగాన పూర్తిగ నివర్తించక అట్టితృష్ణాలక్షణములు కొంచెముగనివర్తించుటయే వ్యాధివిముక్తలక్షణమని "లాఘవమపాయః" అనుపదముచే సూచింపబడినది.

## తృష్ణారోగోపద్రవములు.

మూ. ముఖశోషస్వరభేదభ్రమసన్తాపప్రలాపసంస్తంభాన్,
తాల్వోష్ఠకణ్ఠజిహ్వాకర్కశతాం చిత్తనాశం చ. 9
జిహ్వానిర్గమమరుచిం బాధిర్యం మర్మధూయనం సాదం,
తృష్ణోద్భూతా కురుతే, పఞ్చవిధాం లిఙ్గతః శృణు తామ్. 10

వ్యా. నోటద్రవములేక యెండుట, కంఠస్వరము మారుట, ఒడలు తిరుగుట, సంతాపము, వ్యర్థముగ మాటలాడుట, శరీరము స్తంభించుట, తాలువులును పెదవులును, కంఠంబును, నాలుకయు, కరకరలాడుచుండుట; మనస్సుకేమియు తోచకుండుట, నాలుక లోనికి లాగికొనిపోవుట, నోటరుచి తెలియకుండుట, చెవులు వినబడకుండుట, మర్మస్థలములయందు బాధకల్గుట, శరీరము కృశించుట, వీనినన్నిటిని తృష్ణారోగము కల్గించును. మరియు తృష్ణారోగము నైదింటిని ప్రత్యేకలక్షణము లీక్రింద చెప్పబడును.

ఇచ్చట ముఖశోషాదులు తృష్ణారోగమునకు నుపద్రవములుగ కల్గునని "తృష్ణోద్భూతా కురుతే" అని యుపదేశింపబడినది. ఇదియే తృష్ణావ్యాధికి లక్షణములని కొందరు చెప్పెదరు. అట్టియెడ ప్రత్యేకముగ నుపద్రవములు చెప్పబడలేదు. విషయసంగ్రహమున "సోపద్రవాం చ పఞ్చానాం" అని యుపద్రవములను కూడ నిర్దేశించుట సంగతము కాకుండును కావున పైజెప్పిన ముఖశోషాదులు వ్యాధ్యవస్థయందు సామాన్యముగ వృద్ధినొంది వ్యాధిలక్షణములుగ నుండుననియు, అయ్యవి యుత్కటముగ వృద్ధినొందిన నాడు ఉపద్రవరూపము లగుననియు చెప్పుట సమంజసమని తోచెడిది.

### వాతజతృష్ణాసంప్రాప్తిః

మూ. అబ్ధాతుం దేహస్థం కుపితః పవనో యదా విశోషయతి,
తస్మిన్ శుష్కే శుష్యత్యబల స్తృష్యత్యథ విశుష్యన్. 11

వ్యా. పైజెప్పబడిన స్వకారణములచే ప్రకోపమునొందినవాతము శరీరమునందలి పలుదెరంగులనుండు ద్రవరూపములగు ధాతువులను ఎండించినపుడు మనుజుడు బలహీనుడై తానును శుష్కించును. దానంజేసి మానవుడు దప్పికగల్గియుండును.

### వాతజతృష్ణాలక్షణములు.

మూ. నిద్రానాశః శిరసో భ్రమ స్తథా శుష్కవిరసముఖతా చ,
స్రోతోఽవరోధ ఇతి చ స్యాల్లిఙ్గం వాతతృష్ణాయాః. 12

వ్యా. వాతముచే గల్గినతృష్ణయందు నిదురబట్టదు. తల తిరుగునట్లుండును, నోట ద్రవములేక యెండును, నాసికాదిస్రోతోరంధ్రములు బిగదీసియుండును. ఇవియన్నియు వాతికతృష్ణాలక్షణములు.

### పిత్తజతృష్ణాసంప్రాప్తిః

మూ. పిత్తం మతమాగ్నేయం కుపితం చేత్తాపయత్యపాం ధాతుం,
సన్తప్తస్స హి జనయే త్తృష్ణాం దాహోల్బణాం నృణామ్. 13

వ్యా. పిత్తము ఆగ్నేయాంశప్రధానమైనది; అట్టి పిత్తము స్వకారణములచే కుపితమై శరీరమునందలియబ్ధాతువులను తాపమునొందించును. పిత్తముచే తాపమునొందిన యబ్ధాతువు తీవ్రమైన తాపముతోగూడిన తృష్ణను మనుజులకు కల్గించును.

ఇచ్చట నీవిషయము నెరుంగునది.—శారీరస్థానమునందలి శరీరసంఖ్యాశారీరమున "యత్ ద్రవసరమందస్నిగ్ధమృదుపిచ్ఛిలం రసరుధిరవసాకఫపిత్తమూత్రస్వేదాది తదాప్యం రసో రసనం చ" (శా. అ, 2) అనువాక్యముచే పిత్తము జలవికారమని చెప్పబడినది. వెంటనే "యత్పిత్తమూష్మా యో యా చ భాః, శరీరే తత్సర్వమాగ్నేయం రూపం దర్శనం చ" (శా. అ. 2) అనువాక్యముచేత పిత్తము ఆగ్నేయమనియు చెప్పబడినది. ఈరెండువాక్యములబట్టి పిత్తమున జలగుణంబులును అగ్నిగుణంబులును మిశ్రముగ నున్నదనియు, దానంజేసి పిత్తము సౌమ్యాగ్నేయ స్వరూపమనియు స్ఫుటమగుచున్నది. అయినను పిత్తము ఆగ్నేయగుణబాహుళ్యముగనుండునని తలంచి "పిత్తం మత

మాగ్నేయం" అని యిచ్చట చెప్పబడినది. మరియు సౌమ్యాగ్నేయాదివికారముల పరిగణించునపుడును ఆగ్నేయవికారములతో పిత్తవికారములను జేర్చి చెప్పియునున్నది. కావున పిత్తము ఉభయాత్మకమైనను ఆగ్నేయగుణబహుళమని యెరుంగునది. అట్టి యాగ్నేయ గుణభూయిష్ఠమైనపిత్తము స్వకారణములచే ప్రకుపితమై పైజెప్పినరీతిగ తృష్ణారోగమును గల్గించునని ముఖ్యభావము.

### పిత్తజతృష్ణాలక్షణములు.

మూ. తిక్తాస్యత్వం శిరసో దాహః, శీతాఽభినన్దతా మూర్ఛా,
పీతాఽక్షిమూత్రవర్చస్త్వమాకృతిః పిత్తతృష్ణాయాః.	14

వ్యా. పిత్తముచే గల్గినతృష్ణయందు నోరు చేదుగనుండును, తల మంట బుట్టును, చలవగోరును, మూర్ఛ గ్రమ్మును, కన్నులును మూత్రంబును మలంబును పచ్చగనుండును. ఇవియన్నియు పిత్తమునగల్గిన తృష్ణాలక్షణములు.

### ఆమజతృష్ణాసంప్రాప్తి.

మూ. తృష్ణాయాంఽఽమప్రభవాసాఽప్యాగ్నేయాఽఽమపిత్తజనితత్వాత్

వ్యా. ఆమముచే గల్గినతృష్ణయు ఆగ్నేయమే యగును. ఏలయన అయ్యది ఆమపిత్తముచే గల్గినదియగుటంజేసి యాగ్నేయమే యగును. (పక్వముకాని యాహారరసము అడ్డగించుటచే పిత్తము వృద్ధినొంది ప్రకుపితమై తృష్ణను కల్గించును. అట్టియెడ ఆమము మార్గనిరోధమాత్రముచే నీతృష్ణకు కారణమైనను, అట్టి నిరోధముచే ప్రకుపితమైనపిత్తమున జనించుటంజేసి ఆమజతృష్ణయు నాగ్నేయమే యగునని భావము. మరియు ఆమముతో సమానచికిత్సయు, ఆమముతో సమానములగులక్షణంబులును కలకఫంబును ఆమశబ్దముచే (లక్షణయా) గ్రహింపబడును. ఆమసముద్భవ (ఆమముతో సమానచికిత్సాలక్షణములుకల కఫముచే జనించిన) తృష్ణారోగంబును ఆగ్నేయము (పైజెప్పినరీతిగ నాగ్నేయమగును) అనియు నర్థము. ఈయర్థము చెప్పుటచేత సుశ్రుతమున జెప్పబడిన కఫజతృష్ణయు నీతంత్రకారునిచే నాగ్నేయాంతర్భూతముగ గ్రహింపబడినదికావున "పంచ తృష్ణాః" అనునియమమునకు భంగములేదని యెరుంగునది. మరియు వాతపిత్తములురెండును తృష్ణకు కారణములైనను ఇచ్చట నామజతృష్ణయందు పాచనక్రియకు కారణమైన పిత్తము ప్రధానముకావున అట్టిపిత్తమును ప్రధానముగజేసి "ఆమపిత్తజనితత్వాత్" అని చెప్పబడినది. ఆహారమును పచించుటయందు పిత్తము ప్రధానమని సూత్ర

స్థానమున నిట్లు చెప్పబడినది:—"దర్శనం పంక్తిరూష్మా చ క్షుత్తృష్ణాదేహమార్దవమ్, ప్రభాప్రసాదౌ మేధా చ పిత్తకర్మాఽవికారజమ్." (సూ. అ. ౧౮).

## ఆమజతృష్ణాలక్షణము.

మూ. లిఙ్గం తస్యాశ్చాఽరుచిరాధ్మానకఫప్రసేకౌ చ. 15

వ్యా. ఆమముచే జనించిన తృష్ణయందు నోటరుచియు, కడుపుబ్బరంబును కల్గును. నోట కఫము స్రవించును.

## క్షయజతృష్ణాలక్షణము.

మూ. దేహో రసజోఽమ్బుభవో రసశ్చ తస్య క్షయాచ్చ తృష్యేత్తు,
దీనస్వరః ప్రతామ్యన్ సంశుష్కహృదయగలతాలుః. 16

వ్యా. దేహము రసధాతువువలన పుట్టినది. అట్టిరసము పంచభూతములతో జేరిన జలభాగమున కల్గును. అట్టిజలరూపమైన రసధాతువు క్షీణించుటవలన తృష్ణను (దప్పిని) కల్గించును. ఈతృష్ణయందు కంఠస్వరము దీనముగనుండును. మైకము గ్రమ్మును. హృదయంబును కుత్తుకయు తాలువులును తడిలేక యెండును.

వివరణము:—మనుజుడు పాంచభౌతికమై మధురాదిషడ్రసవిశిష్టమైన యాహారము భుజించినచో నయ్యది జాఠరానలముచే పక్వమై దానివలన యాహారసారరూపమైనద్రవము కల్గును. ఆయాహారసారరూపమైనద్రవము రక్తాదిధాతువులకన్నిటికి నుత్పాదకమైనరసధాతువుగ పరిణమించును. రసధాతువువలన రక్తంబును దానివలన మాంసంబును కల్గుచు, వరుసగ శుక్రపర్యంతమైన ధాతువులుగ మారును.( ఈయుత్పత్తిక్రమమే స్థలాంతరమున విస్తరింపబడియున్నది) కావున అట్టి ధాతూత్పత్తికి ప్రధానమైనది రసధాతు వగును. ఆరసధాతువుకు పైజెప్పినక్రమమున నాహారరసము కారణము. అయ్యది జలరూపము. పైనిదానమున జెప్పిన కారణములచే ద్రవరూపమైన రసధాతువు శుష్కించినపుడు, ద్రవరూపమై రసధాతువునకు సమానజాతీయమైనజలమునే కోరుచుండును. (రసక్షయమయినపుడు దానికి కారణమైనజలము క్షీణించును. అట్టియెడ మనుజుడు జలమునే యెడలేక కోరుచుండుట సహజమనిభావము.) ఈవిషయమునే సుశ్రుతు లిట్లుపదేశించిరి:—"ధోషధాతుమలక్షీణో బలక్షీణోఽపి మానవః,స్వయోనివర్ధనం యత్తదన్నపానం ప్రకాంక్షతి" (సు. సూ. అ. ౧౫) దోష-ధాతు-మలంబులైనను శరీరబలంబైనను క్షీణించినమానవునకు అట్టిధాత్వాదులలో నెయ్యది క్షీణించియుండునో, దానిని

వృద్ధినొందించుచున్న పానములయందు మిక్కిలి కోరిక పుట్టునని యర్థము.) ప్రకృతమున రసధాతువు క్షీణించినపుడు రసధాతువునకు వర్ధకమైనజలమును విశేషముగ కోరును. ఈ విషయమునే తంత్రకారులు "తస్య క్షయాచ్చ తృష్యేత్తు" అని స్పష్టముగ జెప్పిరి.

## ఉపసర్గజతృష్ణాలక్షణము.

మూ. భవతి ఖలు యోపసర్గాత్తృష్ణా సా శోషిణీ కష్టా,
జ్వరమేహక్షయశోషశ్వాసాద్యుపసృష్టదేహానామ్. 17

వ్యా. జ్వరము, ప్రమేహము, క్షయము, శోషము, శ్వాసకాసములు మున్నగు రోగములచే బాధింపబడినవారికి నుపద్రవరూపముగ సంభవించిన తృష్ణ ఉపసర్గజమని చెప్పబడినది. ఈతృష్ణయందు జలమును మాటిమాటికి త్రాగుచున్నను దప్పి యణగక ద్రవము ఎండుచునే యుండును; కావున నిది మిక్కిలి కష్టసాధ్యమగును. (ఇత్తెరంగున నుద్దేశప్రకారము వాత-పిత్త-ఆమ-అన్నక్షయ - ఉపసర్గాత్మికములైన తృష్ణాభేదము లైదును ప్రత్యేకముగ వివరింపబడినవి. మరియు సుశ్రుతమున—"తిస్రస్స్మృతాస్తాః క్షతజా చతుర్థీ క్షయాత్తథా హ్యామసముద్భవా చ స్యాత్సప్తమీ భక్తనిమిత్తజా చ" (సు. ఉ. అ. ౪౮) అని తృష్ణాభేదములు నిర్దేశింపబడినవి. ఇందు కఫజ-క్షతజ-అన్నజ భేదములధికముగ జెప్పబడినవి.అందు కఫజ అన్నజతృష్ణాభేదములు ఆమజతృష్ణాయందును, క్షతజము ఉపసర్గాత్మకమందును అంతర్భూతములగునని యీతంత్రకారులు పంచతృష్ణా భేదముల నిరూపించిరి).

## అసాధ్యతృష్ణావిభాగము.

మూ. సర్వాస్త్వతిప్రసక్తాః రోగకృశానాం వమిప్రసక్తానాం,
ఘోరోపద్రవయుక్తాః తృష్ణాః మరణాయ విజ్ఞేయాః. 18

వ్యా. పైజెప్పబడిన తృష్ణలలో నెద్దియైనను మిక్కిలి యుత్కటముగ నున్నచో నయ్యది యసాధ్యమగును. మరియు రోగములచే కృశించినవారికి సంభవించినదియు, వాంతితో కూడినదియు, మిక్కిలి బాధల గల్గించునుపద్రవముల గూడినదియు, నసాధ్యములై ప్రాణాంతకరములగును.

## అబ్ధాతుశోషమున గల్గు తృష్ణాస్వరూపము.

మూ. నాఽగ్నిం వినా హి తర్షః పవనాద్వా తౌ హి శోషణే హేతూ,
అబ్ధాతోరతివృద్ధౌ; అపాం క్షయే తృష్యతేనరో హి. 19

వ్యా. శరీరమునందలి యద్ధాతువులను (ద్రవరూపములగు రసాదిధాతువులను) శోషింపజేయుటకు, అగ్నిస్వరూపమైనపిత్తంబును శోషణస్వభావముకలవాతంబును వృద్ధి నొందినచో నవిరెండును కారణములగును. అట్టిప్రకుపితములైన వాతపిత్తములచే శరీరము నందలిద్రవరూపములగు ధాతువులు ద్రవములేక యెండినయెడ మనుజుడు దప్పికల్గి విశేషముగ జలమునే కోరుచుండును. కావున అగ్నిస్వరూపమైన పిత్తంబును వాతంబును సంబంధించక తృష్ణావ్యాధి కల్గనేరదు. (కావున తృష్ణాభేదము లన్నిటియందును అద్ధాతు శోషకములైన పిత్తవాతములు కారణములగును. దీనిచేత అద్ధాతుశోషజరూపతృష్ణాభేదంబును సంగృహీతమని యెరుంగునది).

### ఆహారభేదమునగల్గు తృష్ణాస్వరూపము.

మూ. గుర్వన్నపయఃస్నేహైః సంమూర్ఛద్భిః విదాహకాలే చ,
యస్తృష్యేత్ వృతమార్గే తత్రాప్యనిలానలౌ హేతూ. 20

వ్యా. గురుత్వమును కల్గించు నాహారములభుజించినను, పాలను, స్నేహద్రవ్యములను అధికముగ భుజించుటవలనను అయ్యవి పాకమునొందుచు నొండొంటకలయునప్పుడు వాతము ప్రకుపితమగును. అట్టియాహారముయొక్క విదగ్ధపాకావస్థయందు పిత్తము ప్రకోపమునొందును. అట్టిప్రకుపితములైన వాతపిత్తములు శరీరమునందలి ద్రవమును వ్యాపింపచేయు స్రోతోమార్గముల నడ్డగించినప్పుడు దప్పికల్గును. అట్టి తృష్ణావ్యాధికిని వాతపిత్తములే కారణములగును. (ఇచ్చట భుజించబడినయాహారమంతయు పక్వమై యేకీభవించునపుడు కల్గుతృష్ణకు వాతంబును, విదగ్ధపాకావస్థయందు కల్గుతృష్ణకు పిత్తంబును కారణములగును. కావున అట్టి తృష్ణాభేదములకును వాతపిత్తజములయందే యంతర్భావమని భావము).

### మద్యజతృష్ణాస్వరూపము.

మూ. తీక్ష్ణోష్ణరూక్షభావాన్మద్యం పిత్తానిలౌ ప్రకోపయతి,
శోషయతోఽపాం ధాతుం తావేవహి మద్యశీలానామ్. 21

వ్యా. మద్యమునందలి తీక్ష్ణ-ఉష్ణ-రూక్ష-గుణములచే పిత్తవాతములు రెండును ప్రకోపమునొందును. కావున మద్యమును విశేషముగ త్రాగునలవాటుకలవారికి పైజెప్పిన రీతి ప్రకోపమునొందిన వాతపిత్తములు అద్ధాతువులను శోషింపజేయును. దానంజేసి తృష్ణారోగము సంభవించును. ఇదియే మద్యజతృష్ణయగును. దీనికిని వాతపిత్తములే కారణములగును. (కాన తద్భేదములచేతనే నీతృష్ణాభేదమును సంగృహీతమగును.

## తృష్ణారోగోపశయము.

మూ. తప్తాస్వివ సికతాసు హి తోయమాశు శుష్యతి క్షిప్తం,
తేషాం సంతప్తానాం హిమజలపానాద్భవతి శర్మ. 22

వ్యా. పైజెప్పిన తృష్ణారోగము లన్నిటియందును అబ్ధాతువులు ద్రవము లేక శుష్కించియుండుటంజేసి జలమును పలుమారు త్రాగుచుండినను(యెండతీవ్రముచే కాలియుండు నిసుకలో నీళ్లు పోసినపుడు ఆనీరంతయుం చుండిపోవువిధముగ) త్రాగబడిన జలమంతయు నెండిపోవుచుండును కావున అట్టిసంతాపముగలవారికి చల్లనినీళ్లను త్రాగించినచో సుఖముకల్గును. (ఇది తృష్ణారోగమునకుపశయము).

## శీతోపచారజతృష్ణాస్వరూపము.

మూ. శిశిరస్నాతస్యోష్మా రుద్ధః కోష్ఠం ప్రపద్య తర్షయతి,
తస్మాన్నోష్ణక్లాన్తో భజేత సహసా జలం శీతమ్. 23

వ్యా. ఎండలో సంచరించుటచేత శరీరము బడలి చాలవేడికల్గియున్నపుడు చల్లని నీళ్లయందు స్నానముచేసినయెడ శరీరముపై వ్యాపించియున్న వేడియంతయును రోమరంధ్రమార్గములచేనడ్డగింపబడి వెనుకకుమరలి కోష్ఠమున చేరును. అట్టిసంతాపమువలన దప్పియధికముగకల్గును.(ఇదియును పిత్తముచే జనించునది. కావున ఉష్ణముచేత బడలియున్నపుడు వెంటనే స్నానపానాదులకు చల్లనినీళ్లనుపయోగింపజనదు. కొంతసేపువిశ్రమించి శరీరము వేడితగ్గినపిదప శీతజలము నుపయోగింపందగునని భావము).

## పైజెప్పినయబ్ధాతుశోషణాదితృష్ణల సామాన్యలక్షణములు.

మూ. లిఙ్గం సర్వాస్వేతాస్వనిల-క్షయ-పిత్తజం భవత్యథ తు,
పృథగాగమాచ్చికిత్సితమతః ప్రవక్ష్యామి తృష్ణానామ్. 24

వ్యా. "నాగ్నిం వినాపి తర్షః" అని యుపక్రమించి పైసినిర్దేశింపబడిన తృష్ణలయందు వాతలక్షణంబులును, ధాతుక్షయలక్షణంబులును, పిత్తలక్షణంబులును కల్గియుండును. లక్షణములచే సమానములుగ నున్నను ఆయాతృష్ణ జనించుటకు కారణములు వేరువేరుగనుండుటంజేసి వానివానికి (ఆయాకారణభేదములబట్టి) వేరువేరుచికిత్సితమును జెప్పెదను.

ఇచ్చట నీవివరణము నెరుంగునది:—"గుర్వన్నపయః స్నేహైః" అనిచెప్పబడిన అన్నసంమూర్ఛనజతృష్ణకును వాత-పిత్తములు కారణములుగ జెప్పబడినవి. కావున దీని యందు వాతపిత్తలక్షణములే ప్రాయికముగనుండును. "తీక్ష్ణోష్ణరూక్షభావాత్" అని చెప్పబడిన అబ్ధాతుక్షయజతృష్ణయందును వాతపిత్తములు కారణములై యుండును; కావున దీనియందు క్షయజతృష్ణాలక్షణంబులు కానబడును. "శిశిరస్నాతస్యోష్మా" అని చెప్పబడిన శీతస్నానజతృష్ణయందు పిత్తము కారణమగును కావున పైత్తికలక్షణములు కన బడును. ఈవిషయమే "లింగం సర్వాస్వనిలక్షయపిత్తజం భవతి" అనిక్షప్తముగ జెప్ప బడినది.

మరియు వానిలక్షణములు సామాన్యముగ నున్నను కారణములు వేరువేరుగ నుండుటంబట్టి యట్టి కారణానుగుణముగ వేరువేరు చికిత్సలు చెప్పబడునని 'పృథగా గమాత్' అనినిర్దేశింపబడినది. ఇచ్చట "ఆగచ్ఛత్యస్మాదితి ఆగమః" అనువిగ్రహముచేత వ్యాధి జనించుటకు కారణము ఆగమశబ్దవాచ్యమని యెరుంగునది.

తృష్ణారోగసామాన్యచికిత్స; అందు ఐంద్రజలపానము.

మూ. అపాం క్షయాద్ధి తృష్ణా సంశోష్య నరం ప్రణాశయేదాశు,
తస్మాదైన్ద్రం తోయం సమధు పిబేత్, తద్గుణం వాఽన్యత్. 25
కిఞ్చిత్తువరాఽనురసం తను లఘు శీతం సుగన్ధి సురసం చ,
అనభిష్యన్ది చ యత్తత్ క్షితిగతమప్యైన్ద్రవత్ జ్ఞేయమ్. 26

వ్యా. తృష్ణయందు అబ్ధాతువు (శరీరమునందలి ద్రవభాగము) శుష్కించుట వలన మనుజుని శీఘ్రముగచంపజాలును; కావున అట్టిశుష్కించిన ధాతువున ద్రవముకు కల్గించుటకై యంతరిక్షముననే క్రింద పడనీయక వర్షధారలనుండి గ్రహింపబడిన (యైంద్ర)జలమును కొంచెముగ తేనెను కలిపి త్రాగవలెను. అట్టి యంతరిక్షజలములేని నాడు దానితో సమానమైనగుణముకలజలముసైన త్రాగవలెను.

మరియు నంతరిక్షమునుండి పుడమిపయిం బడినజలంబును మిగుల స్వల్పముగ కషాయరసముకల్గి స్వచ్ఛముగ తేలికయై చల్లనై మనసుకు ప్రతికూలమైన గంధమును నాలుకకు రుచినిచెరచురసంబును లేకయు, స్రోతోరంధ్రముల ద్రవమును పుట్టించకయు (జలుబుచేయకయు) నుండునెడ నయ్యది యంతరిక్షజలమునకు సమానగుణమైయుండును. (దీనిని తృష్ణారోగమున త్రాగుటకు నైంద్రజలమునకు బదులుగ నుపయోగింపందగునని భావము).

ఇచ్చట ననిష్టగంధములేనిది సుగంధియనియు, మధురాదిరసములు వ్యక్తముగ లేక రసనేంద్రియమునకింపైనది సురసమనియు చెప్పబడును. ఈవిషయమున సుశ్రుతాచార్యు లిట్లు చెప్పిరి:—"అనిష్టగంధతా గంధదోషః" "వ్యక్తరసతా రసదోషః" (సు. సూ. అ. ౪౫) జలమునందిష్టముకానిగంధము కల్గియుండుట గంధమునకు సంబంధించిన దోష మనియు, మధురాదిరసములు వ్యక్తములుగ కానవచ్చినచో రసమునకు సంబంధించిన దోషమనియు నర్థము.

### తృష్ణారోగమున పానీయములు.

మూ. శృతశీతం ససితోత్పలమథ వా శరపూర్వపఞ్చమూలేన,
లాజాసక్తుసితాహ్వామధుయుతమైన్ద్రేణ వా మన్థ్యమ్. 27
(లాజానాం సక్తూనాం సమధుసితం మన్థమైన్ద్రేణ),
వాట్యం వాఽఽమయవానాం శీతం మధుశర్కరాయుతం దద్యాత్,

వ్యా. (కుశదర్భవేళ్లు, రెల్లుదర్భవేళ్లు, కాకివెదురువేళ్లు, దర్భవేళ్లు, చెరకువేళ్లు, ఈయైదును చేరి శరాదిపంచమూలములనియు తృణపంచమూలములనియు చెప్పబడును.) ఈశరాదిపంచమూలములను సమభాగములుగగూర్చి నీళ్లకాచి చల్లగ చల్లార్చి యందు శీనాకల్కండను చేర్చి దప్పియందు త్రాగవలెను. లేక పేలాలసత్తుపిండిని అంతరిక్షజలమునకలిపి యందు చక్కెరను తేనెను యథోచితముగకలిపి త్రాగవలెను. పచ్చియవలను కొంచెముగ వేయించి మంథముగ సిద్ధముచేసి చల్లారినపిదప అందు తేనెను చక్కెరనుకలిపి త్రాగింపనగును.

### తృష్ణాహర-అన్నపానాదులు.

మూ. పేయాం వా శాలీనాం దద్యాద్వా కోరదూషాణామ్. 28
పయసా శృతేన భోజనమథవా మధుశర్కరాయుతం యోజ్యం,
పారావతాదికరసైః ఘృతభృష్టైర్వాఽప్యలవణామ్లైః. 29
తృణపఞ్చమూలముఞ్జాతకైః ప్రియాలైశ్చ జాఙ్గలాస్సుకృతాః,
శస్తా రసాః పయో వా తైస్సిద్ధం శర్కరామధుమత్. 30

వ్యా. రాజనంపుబియ్యముచేనైనను కొఱ్ఱలచేనైనను సిద్ధముచేయబడిన పేయయను గంజిని త్రాగవలెను. లేక పైజెప్పిన బియ్యముచే నన్నమును సిద్ధముచేసి యందు

తేనెను చక్కెరను చేర్చి కాగిచల్లారిన పాలతో భుజింపనగును. లేక పావురములు మున్నగు పక్షులమాంసరసమును ఉప్పును పులుపును కొంచెముగ జేర్చి నేతితో తిరగబోత జెట్టిసిద్ధము చేసి యామాంసరసముతో నన్నమును భుజింపనగును. తృణపంచమూలములను ముంజాతమను శాకవిశేషమును చారపప్పును చేర్చి సిద్ధము చేయబడిన జాంగలమాంసరసంబులను, ఆద్రవ్యముల జేర్చి కాచి పక్వము జేసి చక్కెరను తేనెను కలిపిన పాలను చేర్చి భుజించుట చాల హితము.

ఇచ్చట శాలిధాన్యంబును కొఱ్ఱలును ప్రాతవి హితకరములు. ఈవిషయమును వాగ్భటాచార్యులు "యవాగూశ్శాలిభిస్తద్వత్కోద్రవైశ్చ చిరంతనైః......సిద్ధేన భోజనమ్" (అ. హృ, చి. అ. ౬. శ్లో. ౬౨) అనుగ్రంథము స్ఫుటముగ జెప్పెను. మరియు—ముంజాతమనునది స్వనామఖ్యాతశాకవిశేషము. దీనిగుణాదులను వాగ్భటాచార్యు లిట్లు చెప్పిరి:—"ముఞ్జాతం వాతపిత్తజిత్. స్నిగ్ధం శీతం గురుస్వాదు బృంహణం శుక్రకృత్పరమ్" (అ. హృ, సూత్ర. అ. ౬. శ్లో. ౮౨) అని దీనిని శాకవర్గమధ్యమున పఠించియున్నది. కావున శాకవిశేషమని తోచెడి. "ముంజ దర్భ" అని వ్యాఖ్యానము చేయుట యప్రశస్తము.

### అభ్యంగ-అవగాహములు.

మూ. శతధౌతఘృతేనాక్తః పయః పిబేత్ శీతతోయమవగాహ్య,
ముద్గమసూరచణకజాః రసాస్తు భృష్టా ఘృతే దేయాః. 31

వ్యా. శతధౌతఘృతముచే శరీరమునకును శిరస్సునకును అభ్యంగనము చేసికొని చల్లనినీళ్లయందు మునిగి స్నానముచేసి పాలను త్రాగవలెను. లేక పెసలపప్పునైనను చిరుసెనగపప్పునైనను సెనగపప్పునైనను నేతిలో వేయించి కట్టుజేసి యారసమును త్రాగవలెను.

### తృష్ణాహరపాన-అభ్యంగన-సేక-నస్యములు.

మూ. మధురైస్సజీవనీయైః శీతైశ్చ సతిక్తకైః శృతం క్షీరం,
పానాభ్యఞ్జనసేకేష్విష్టం మధుశర్కరాయుక్తమ్. 32
తజ్జం వా ఘృతమిష్టం పానాఽభ్యఙ్గేషు నస్యమపి చ స్యాత్,
వారిపయస్సశర్కరముష్ట్యా అపి నస్యమిక్షురసః. 33

వ్యా. మధురరసముగల ద్రవ్యములను జీవనీయగణమున జెప్పబడిన ద్రవ్యములను శీతవీర్యముగల ద్రవ్యములను తిక్తరసద్రవ్యములను చేర్చి కాచబడినపాలలో తేనెను చక్కెరనుకలిపి త్రాగుటకును అభ్యంగమునకును సేకమునకునుపయోగింపందగును. మరియు పైజెప్పిన మధురాది ద్రవ్యముల జేర్చి కాచబడిన పాలనుండి తీయబడిన వెన్నవలనబుట్టిన ఘృతమునైనను పాన-అభ్యంగన-నస్యముల కుపయోగింపనగును. మరియు స్త్రీలచనుబాల యందైనను ఒంటెపాలయందైనను చక్కెరను కలిపి నస్యముచేయదగును. లేక చెరకు రసమునైన నస్యము చేయదగును. (ఇచ్చట జీవనీయశబ్దముచేత—"జీవకర్షభకౌ మేదా మహామేదా కాకోళీ క్షీరకాకోళీ, ముద్గమాషపర్ణ్యౌ జీవన్తీమధుకమితి, దశేమాని జీవనీయాని భవంతి" (సూ. అ. ౪) అని చెప్పబడిన జీవనీయగణము గ్రహించునది).

## తృష్ణారోగమున తాలుశోషహరగండూషములు.

మూ. క్షీరేక్షురసగుడోదకసితోపలాక్షౌద్రశీధుమార్ద్వీ(ర్ధ్వీ)కైః,
వృక్షామ్లమాతులుఙ్గైః గణ్డూషాః తాలుశోషఘ్నాః. 34

వ్యా. పాలు, చెఱకురసము, బెల్లపుపానకము, కల్కండపానకము, తేనె, శీధుమద్యము, ద్రాక్షపండ్లరసముచేనైనమద్యము, చింతపండుపులుపురసము, మాదీఫలరసము, ఈద్రవముల చేత గండూషముచేసినయెడ తృష్ణారోగమునగల్గిన తాలుశోషము (తాలువులు ద్రవములేకయెండుట)ను హరించును.

ఇచ్చట గండూషమన:—"అసంచార్యముఖే పూర్ణే గణ్డూషః; కబలశ్చరః తు ద్రవేణ గణ్డూషః; కల్కేన కవలస్స్మృతః" అనుపరిభాషనుబట్టి ద్రవరూపమైన యౌషధమును నోటినిండుకు కదలించుటకు వలనుపడకుండున ట్లుంచుకొనుటయని యెరుంగునది.

## తృష్ణాహరప్రలేపములు.

మూ. జమ్బ్వామ్రాతకబదరీవేతసపఞ్చవల్కపఞ్చామ్లైః,
హృన్ముఖశిరఃప్రలేపాః సఘృతా మూర్ఛాభ్రమతృషాఘ్నాస్స్యుః.

వ్యా. నేరేడు, కొండమామిడి, రేగు, ప్రబ్బలి అనునీనాల్గువృక్షములపట్టనైనను; పంచవల్కలముల (మఱ్ఱి, అత్తి, రావి, జువ్వి, ప్రబ్బలి అనునవిచేరి పంచవల్కలములు) పట్టలనైనను; పంచామ్లముల (రేగుపండ్లపులుపు, పులిచింతాకురసము మాదీఫలరసము, పుల్లప్రబ్బలి, దానిమ్మపండ్లరసము) రసములచేర్చి నూరి యందు నేతిని కలిపి, హృదయ

స్థానమునను, ముఖమునను, శిరస్సునను పూసినయెడ మూర్ఛయు, భ్రమంబును, దప్పియు శమించును.

ఇచ్చట "న్యగ్రోధోదుమ్బరాశ్వత్థప్లక్ష వేతసవల్కలైః, సర్వైరేకత్రసంయుక్తైః పఞ్చవల్కలముచ్యతే" అని పంచవల్కలములును; "కోలామ్లం చుక్రికామ్లం చ మాతులుఙ్గామ్లమేవ చ, చతురమ్లమితి ప్రోక్తం, పఞ్చామ్లం తు సదాడిమమ్" అని పంచామ్లములు తంత్రాంతరమున జెప్పబడినది గ్రహించునది.

తృష్ణాహరదాడిమాది లేపములు.

మూ. దాడిమదధిత్థలోధ్రైః సవిదారీబీజపూరకైశ్శిరసః,
లేపో గౌరామలకైః ఘృతారనాళయుతైశ్చ హితః. 36
శైవలపఙ్కామ్బురుహైః సామ్లైస్సఘృతైశ్చ సక్తుభిర్లేపః,

వ్యా. దానిమ్మపండ్లరసము, వెలగపండ్లగుంజు, లొద్దుగు, నేలగుమ్మడి, మాదీఫలరసము, పచ్చియుసిరికకాయలు, వీనినన్నిటిని గూర్చి నూరి కల్కముజేసి, అందు నేతిని ఆరనాళము జేర్చి శిరస్సున లేపనముజేసినయెడ తృష్ణారోగము శమించును. మరియు జలమునందలి పాచితీగెలు, బురుద, తామరపువ్వులు, వీనిని నూరి అందు దానిమ్మరసము మున్నగువానిపులుపును చేర్చియైనను; సత్తుపిండియందు పులుపును నేతిని కలిపియైనను శిరస్సున పట్టువేసినయెడ దప్పి శమించును.

తృష్ణాహరశీతోపచారములు.

మూ మస్త్వారనాళవసన-కమలార్ద్రమణిహారసంస్పర్శాః. 37
శిశిరామ్బుచన్దనార్ద్రస్తనతటపాణితలసంస్పర్శాః,
క్షౌమార్ద్రాభివసనానాం వరాఙ్గనానాం ప్రియాణాం చ. 38
హిమవద్దరీవనసరిత్సరోఽమ్బుజ పవనేన్దుపాదశిశిరాణాం,
రమ్యశిశిరోదకానాం (రమ్యోదకశిశిరాణాం) స్మరణం చ కథాశ్చ,
తృష్ణాఘ్నాః. 39

వ్యా. మీగడను గంజిని జేర్చి తడుపబడినగుడ్డను, కమలములను, తడిసినమణిహారములను, స్పృశించుటయు; తడిసినపట్టుబట్టలగట్టికొని చాలప్రీతిపాత్రములగు యువతుల నాలింగనాదులచే స్పృశించుటయు, పన్నీరు మొదలగు చల్లనిద్రవముల చేతను

చందనముచేతను తడిసి చల్లనైన పైజెప్పినస్త్రీలయొక్క స్తనప్రదేశమును హస్తములను స్పృశించినను దప్పి శమించును. మరియు—హిమవత్పర్వతమునందలిగుహలు, వనములు, ప్రవాహములు, సరస్సులు, వానియందలికమలములు, చల్లనిగాలి, చంద్రకిరణములు, చల్లనైనవస్తువులు, రమ్యమైనచల్లనినీళ్లు కల ప్రదేశములు, వీనిస్మరించుటయు, వీనికిసంబంధించిన కథలవినుటయు దప్పిని శమింపజేయును. (ఇంతదనుక జెప్పబడిన వైయింద్రజలపానాదిచికిత్సలన్నియు తృష్ణారోగసామాన్యముగ నిర్దేశింపబడినవి.)

## తృష్ణారోగమున విశేషచికిత్స, అందు వాతజతృష్ణాచికిత్సితము.

మూ॥ వాతఘ్నమన్నపానం మృదు లఘు శీతం చ వాతతృష్ణాయాః,
క్షయకాసనుచ్ఛృతక్షీరఘృతమూర్ధ్వవాతక్షయతృష్ణాఘ్నమ్. 40
స్యాజ్జీవనీయసిద్ధం క్షీరఘృతం వాతపిత్తజే తర్షే,

వ్యా॥ వాతముచే కల్గినతృష్ణయందు వాతహరములగు నన్నపానంబులును, మృదు-లఘు-శీతగుణములు కలయన్నపానాదులును హితకరములగును. క్షయజకాసములహరించునట్టి ద్రవ్యముల జేర్చి కాచబడినక్షీరంబును ఘృతంబు నుపయోగించినయెడ శ్వాసమును క్షయమును తృష్ణను హరించును. జీవనీయగణద్రవ్యములచే సిద్ధమైనక్షీరమును ఘృతమును వాతపిత్తములచే గల్గిన తృష్ణయం దుపయోగించునది.

## పైత్తికతృష్ణయందు జలపానవిధి.

మూ॥ పైత్తే ద్రాక్షాచన్దనఖర్జూరోశీరమధుయుతం తోయమ్. 41
లోహితశాలితణ్డులఖర్జూరపరూషకోత్పలద్రాక్షాః,
మధుపక్వలోష్టమేవ చ జలే స్థితం శీతలం పేయమ్. 42

వ్యా॥ ద్రాక్షపండు, చందనము, ఖర్జూరపుకాయలు, వట్టివేళ్లు, ఈద్రవ్యములను చేర్చి యూరబెట్టబడిన చల్లనినీళ్లయందు యథోచితముగ తేనెను చేర్చి, పిత్తమునకల్గిన దప్పియందు త్రాగనగును. మరియు—ఎఱ్ఱవరిబియ్యము ఖర్జూరపుపండు, చిట్టీతపండు, నల్లకలువలు, ద్రాక్షపండు, తేనె, వీనినన్నిటిని చల్లనినీళ్లలో జేర్చి, అందు క్రొత్తకుండపెంకును ఎఱ్ఱగ నిప్పునకాల్చివైచి యాజలను చల్లబడినపిదప పైత్తికతృష్ణయందు త్రాగవలెను.

## పైత్తికతృష్ణకు తండులోదకపానీయము.

మూ॥ లోహితశాలిప్రస్థః సలోధ్రమధుకాఞ్జనోత్పలైః క్షుణ్ణాః, పక్వామ

లోష్ట జలమధు సమాయుతో (పక్వామలోష్టమధుజలసమా
యుతో) మృణ్మయే పేయః. 43

వ్యా. ఎఱ్ఱవరిబియ్యము ఒక ప్రస్థమును, లొద్దుగచెక్క అతిమధురము రసాంజనము నల్లకలువలు, ఇవియన్నియు చేరి నాల్గుపలములు, వీనినన్నిటిని జేర్చి ముక్కముక్కలుగ దంచి నాల్గింతలనీళ్లలో కలిపి, యొకకుండలోబోసి, అందు కుండపెంకును నిప్పునకాల్చక వేసి తేనెకలిపి యొకరాత్రియంతయు మూసియునిచి మరునాడు ఆజలమును తేటగ నుండునట్లు వడగట్టి త్రాగినయెడ పిత్తజతృష్ణారోగము శమించును.

ఇచ్చట తండులోదకవిధానము ననుసరించి ఎఱ్ఱవరిబియ్యమును ప్రస్థపరిమితమును బద్దలుగ పగులగొట్టి అందు, లొద్దుగ మున్నగు ద్రవ్యములను నలుగగొట్టి బియ్యమునకు నాల్గవవంతుకలిపి యొక్క క్రొత్తకుండలోబోసి యీసముదాయమునకు నాల్గింతలజలమును బోసి కుండపెంకును నిప్పునకాల్చకయే అందుచేర్చి మితముగ తేనె కలిపి యొకరాత్రి యంతయు నూరబెట్టి మరునాడు త్రాగవలెను. ఈకల్పనము తంత్రాంతరమున నిట్లు చెప్ప బడినది:—"తణ్డులం కణశః కృత్వా పలం గ్రాహ్యం హి తణ్డులాత్, చతుర్గుణం జలం దేయం తణ్డులోదకకర్మణి, శీతకషాయమానేన తణ్డులోదకకల్పనా."

## పైత్తికతృష్ణయందు పానీయము.

మూ. వటమాతులుఙ్గవేతసపల్లవకుశకాశమూలయష్ట్యాహ్వైః,
సిద్ధేఽమ్భస్యగ్నినిభాం కృష్ణమృదం కృష్ణసికతాం వా. 44
తప్తాని నవకపాలాన్యథవా నిర్వాప్య పాయయేత్ఽచ్ఛం,
ఆపాకశర్కరం వాఽ(ఆపాకమధుశర్కరమ) మృతవల్ల్యుదకం
తృషాం హన్తి. 45

వ్యా. మఱ్ఱిచిగుళ్లు, మాదీఫలవృక్షముయొక్క చిగుళ్లు, ప్రబ్బలిచిగుళ్లు, కుశదర్భ వేళ్లు, రెల్లుదర్భవేళ్లు, అతిమధురము, వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి నలుగగొట్టి యందు నీళ్లుబోసి కుండలో జేర్చి నాల్గవపాలు మిగులునట్లు పక్వముచేసి, నల్లనిమట్టి నైనను, నల్లనియిసుకనైనను, క్రొత్తకుండపెంకులనైనను నిప్పుతోసమానముగనుండునట్లు కాల్చి పైజెప్పినకషాయములో వైచి చల్లారిన పిదప తేటగనుండు నాజలమును వడగట్టి త్రాగవలెను. తిప్పతీగెను జలమున వైచి కొంచెముగ కాచి యందు తేనెను చక్కెరను

కలిపి త్రాగినయెడ దప్పిని హరించును. (ఇచ్చట "పానీయే కార్షికం ద్రవ్యం ప్రస్థార్థం పాదశేషితమ్" అనుపానీయకల్పనాపరిభాషానుసారము కల్పింపనగును.)

ఇచ్చట "తప్తాని నవకపాలాన్యథవా" అనుచోట 'నరకపాలాని' అనునవపాఠము చిరంతనముద్రితప్రతియందు కానవచ్చినది. చక్రపాణిదత్తవ్యాఖ్యానమున "నవకపాలాని-నూతనశరావాదిఖండాన్" అని వివరించియున్నది. కావున 'నర' అను పాఠము సమంజసముకాదని స్ఫుటముగ తేలుచున్నది. ఈవ్యాఖ్యనైన సరకుసేయక 'నర' పాఠము నవలంబించి "మనుష్యునియొక్క పుఱ్ఱెయెముకలనుగాని ఎఱ్ఱగకాల్చి చల్లార్చి యాజలమును వడబోసికొని త్రాగవలయును" అని వ్యాఖ్యానముచేయుట మిక్కిలి జుగుప్సాకరము, నింద్యము, అశ్లీలము, హాస్యాస్పదంబును.

## పిత్తజతృష్ణాహరశీతకషాయములు.

మూ. క్షీరవతాం మధురాణాం శీతానాం శర్కరామధువిమిశ్రాః,
శీతకషాయాః మృద్భృష్టసంయుతాః పిత్తతృష్ణాఘ్నాః. 46

వ్యా. అత్తి, జువ్వి, రావి, మున్నగుక్షీరి(పాలుగల)వృక్షములయొక్క పట్టలనైనను, మధురరసముగలద్రవ్యములనైనను, గుణవీర్యములచే శీతములైనద్రవ్యములనైనను విధ్యుక్తప్రకారము శీతకషాయములుగ సిద్ధముచేసి అందు నిప్పునకాల్చబడినమట్టిపెళ్లలను వేసి వడగట్టి చక్కెరను తేనెను చేర్చి త్రాగినయెడ పిత్తమున గల్గినదప్పి శమించును. (ఇచ్చట కషాయద్రవ్యములను మెత్తగ నలుగగొట్టి యారింతలనీళ్లలో కలిపి రాత్రియంతయు నానబెట్టిన నయ్యది శీతకషాయమని యెరుంగునది.)

## ఆమజతృష్ణాచికిత్స.

మూ. వ్యోషవచాభల్లాతకతిక్తకషాయాః తథాఽఽమతృష్ణాఘ్నాః,
యచ్చోక్తం కఫజాయాం వమ్యాం, తచ్చైవ కార్యం స్యాత్ .47

వ్యా. త్రికటుకములు, వస, జీడిగింజలు, తిక్తరసద్రవ్యములు, వీనినిచేర్చి సిద్ధమైనకషాయములు ఆమజతృష్ణను శమింపజేయును. మరియు కఫముచే జనించినవమనమునకు జెప్పినచికిత్సయు ఆమజనితతృష్ణయందును చేయదగును.

## కఫానుబంధతృష్ణయందు వమనవిధి.

మూ. స్తంభాఽరుచ్యవిపాకాలస్యచ్ఛర్దిషు సఫానుగాం తృష్ణామ్,

జ్ఞాత్వా దధిమధుతర్పణలవణోష్ణజలైః వమనమిష్టమ్. 48

వ్యా. శరీరము స్తంభించి అరుచికల్గి జీర్ణముగాక ఆలస్యంబును వాంతియు కల్గియున్నయెడ కఫము అనుబంధముగ గలతృష్ణయని యెరింగి, పెరుగు తేనె సత్తుపిండి ఉప్పు జలము, వీనియందు వమనౌషధమును (మ్రంగకాయను) కలిపి వమనముచేయించవలెను. (ఆమజతృష్ణయందు కఫము అనుబంధముగనున్నపుడు పైజెప్పినరీతిగ వమనముచే కఫమును బైటవెడలించవలెనని భావము.)

మూ. దాడిమమ్లఫలం వాఽప్యన్యత్ సకషాయమథ లేహం,

పేయమథవా హారిద్రామ్బుశర్కరాక్షౌద్రసంయుక్తమ్. 49

వ్యా. దానిమ్మపండ్లరసమున మ్రంగకాయచూర్ణమును కలిపియైనను లేక కషాయరసము కలయుసిరికకాయలు మున్నగువానిరసముననైనను మ్రంగకాయచూర్ణమునుకలిపి లేహముగజేసి సేవించవలెను. లేక పసుపును నీళ్లలో కలిపి కాచి యందు చక్కెరను తేనెను కలిపి త్రాగినను కఫజతృష్ణ శమించును.

## అథ ధాతుక్షయజతృష్ణా చికిత్స.

మూ. క్షయకాసేన తు తుల్యా క్షయతృష్ణా యా గరీయసీ నృణాం,

క్షీణక్షతశోషహితైః తస్మాత్తాం భేషజైశ్శమయేత్. 50

వ్యా. ధాతుక్షయమునకల్గినతృష్ణరోగము క్షయకాసమును బోలె చాలగొప్పదిగ నుండును. కావున క్షతక్షీణులకును శోషరోగులకును జెప్పిన బృంహణాద్యౌషధములచే నట్టిదప్పిని శమింపజేయవలెను.

## అథ మద్యపానజశిశిరస్నానజతృష్ణా చికిత్స.

మూ. పానాత్తృషార్తః పానం త్వర్ధోదకమమ్లలవణగన్ధాఢ్యం,

శిశిరస్నాతః పానం మద్యామ్బు, గుడామ్బు వా, తృషితః 51

వ్యా. మద్యమును మితిమీరిత్రాగుటవలనకల్గిన తృష్ణారోగమున మద్యమునకు సమభాగముగ చల్లనినీళ్లుకలిపి దానిమ్మపండ్లరసమును ఉప్పును సుగంధద్రవ్యములను జేర్చి త్రాగ

వలెను. మరియు ఎండగొట్టుబడినవెంటనే చల్లనినీళ్లలో స్నానముచేయుటచే గల్గినదప్పి యందు మద్యమును జలమును చేర్చియైనను, బెల్లపుపానకమునైనను త్రాగవలెను.

## ఉపవాసాదులచేగల్గిన తృష్ణారోగముల చికిత్స.

మూ. భక్తోపరోధతృషితః స్నేహాత్తృషార్తోఽథవా తనుయవాగూం,
ప్రపిబేత్ గురుణా తృషితః భుక్తేన తదుద్ధరేత్ భుక్తమ్. 52
మద్యామ్బు వాఽమ్బుకోష్ణం బలవాం స్తృషితఃసముల్లిఖేత్పీత్వా,

వ్యా. అన్నమును నిరోధించి భుజించకుండుటచే బడలి దప్పికల్గినపుడును, స్నేహ మును విశేషముగ నుపయోగించుటచే గల్గినదప్పియందును పలచగ కాచబడినయవాగువను గంజని త్రాగవలెను. మరియు గురుగుణముకలయాహారమును భుజించుటచే దప్పికల్గిన యెడ అపుడు భుజింపబడినయాహారమును వాంతిజేసి బయిటవెడలింపవలెను. రోగి బలి ష్ఠుడుగ నున్నయెడ సగము మద్యమును సగము నీళ్లను కలిపియైనను, కొంచెము వేడిగ నుండుజలమునైనను త్రాగించి వాంతి చేయించవలెను.

## తృష్ణారోగమున మంథపానీయము.

మూ. మాగధికావిశదముఖః సశర్కరం వా పిబేన్మన్థమ్. 53

వ్యా. పైజెప్పినరీతిగ వాంతిచే నాహారమును వెడలించి నోట జిగురులేక విశద నుగనుండుటకై పిప్పలిచూర్ణముతో గూడినజలముచే పుక్కిలించి పిమ్మట మంథమున చక్కెరను కలిపి త్రాగవలెను.

మంథకల్పనము స్థలాంతరమున నిట్లు చెప్పబడినది:— 'సక్తవః సర్పిషాభ్యక్తాః శీతోదకపరిప్లుతాః, నాతిద్రవో నాతిసాన్ద్రః మంథ ఇత్యభిధీయతే” వరిపేలాలపిండిని నేతితో తడిపి చల్లనినీళ్లలో కలిపి మిగులచిక్కగను తేటగను కాకుండునట్లు సిద్ధముచేయ బడినది మంథమనబడును. ఈలక్షణమునే యితరస్థలములయందును గమనించునది.

## తృష్ణారోగమున తాలుశోషచికిత్స.

మూ. బలవాంస్తు తాలుశోషే పిబేద్ఘృతం తృష్యమద్యాచ్చ,
సర్పిర్భృష్టం క్షీరం మాంసరసాంశ్చాఽబలస్స్నిగ్ధాః. 54

అతిరూక్షదుర్బలానాం తర్షం శమయేత్ నృణామిహాశు పయః,
ఛాగో వా ఘృతభృష్టః శీతో మధురో రసో హృద్యః. 55

వ్యా. తాలువులు తడిలేకయెండినయెడ రోగి బలిష్ఠుడుగ నున్నచో తృష్ణారోగమున హితకరములగు నౌషధాదులతోఁగూడ ఘృతమును చేర్చి త్రాగవలెను. తృష్ణారోగమున హితములైన యాహారాదులయందును ఘృతమును జేర్చి భుజింపనగును. మరియు అట్టి తాలుశోషమునందు రోగి బలహీనుడైయున్నయెడ నేతిని చేర్చి సంస్కరించి పక్వము చేయబడిన పాలను, స్నిగ్ధములగు మాంసరసములను త్రాగవలెను. మరియు మిక్కిలి రూక్షమై బలహీనమైనశరీరముకలవారికిని కల్గినదప్పిని పాలు అతిశీఘ్రముగ శమింపజేయును. మరియు మేకపోతుమాంసరసమున మధురంబులును శీతవీర్యంబులునైన ద్రవ్యములజేర్చి పక్వముజేసి నేతితో సంస్కరించి యుపయోగించినయెడ హృదయమునకు హితంబును రూక్షదుర్బలులకు దప్పిని హరించునదియు నగును.

ఇచ్చట 'తృష్యమద్యాచ్చ' అనుచోట "తృష్యం, అద్యాత్" అని ఛేదము. తృష్ణారోగమున హితమైనది 'తృష్యము'. అట్టియాహారమును తినవలెనని యర్థము. 'తృషే హితం-తృష్యం' అని వ్యుత్పత్తి నెరుంగునది. తాలుశోషమున ఘృతము "తృష్ణా మూర్ఛా పరీతాశ్చ గర్భిణ్యస్తాలుశోషిణః" (సూ. అ. ౧౩) అని తాలుశోషమున నిషేధింపబడినది. అయినను తృష్ణారోగానుకూలద్రవ్యములతో జేర్చి ఘృతము నుపయోగించినచో ప్రభావవిశేషమునంజేసి హితకరమగునని యిచ్చట విశేషవిధిగ నుపదేశింపబడినదని యెరుంగునది.

స్నిగ్ధాన్నజతృష్ణాచికిత్స.

మూ. స్నిగ్ధేఽన్నే భుక్తే యా
తృష్ణా స్యాత్తాం గుడాంబునా శమయేత్,

వ్యా. మిక్కిలి స్నిగ్ధమైనయాహారమును భుజించుటవలన కలిగినతృష్ణారోగమును చల్లగనుండు బెల్లపుపానకమును త్రాగించినచో శమించును.

ఉపసర్గజతృష్ణాచికిత్స, శీత-ఉష్ణజలోపయోగవిషయములు.

మూ. తర్షం మూర్ఛాభిహతస్య రక్తనిష్ఠీవనం హితం స్యాత్. 56

తృట్ దాహమూర్ఛా (ఛర్ద్యమ్లదాహమూర్ఛా) భ్రమక్లమ
మదాత్యయాస్రవిషపిత్తే,
శస్తం స్వభావశీతం; శృతశీతం సన్నిపాతేఽమ్భః.
హిక్కా-శ్వాసనవజ్వరపీనసఘృతపీతపార్శ్వగలరోగే,
కఫవాతకృతే స్త్యానే సద్యశ్శుద్ధే చ హితముష్ణమ్. 58
పాణ్డూదరపీనసమేహగుల్మమన్దాఽనలాఽతిసారేషు,
ప్లీహ్ని చ తోయం న హితం; కామమసహ్యే పిబేదల్పమ్. 59

వ్యా. మూర్ఛారోగపీడితునకు దప్పికల్గినయెడ రక్తపిత్తహరములగు చికిత్సల జేయనగును. మరియు వాంతి, అమ్లపిత్తము, తాపము, మూర్ఛ, భ్రమము, క్లమము (బడలిక), మదాత్యయము, రక్తదోషము, విషము, పిత్తము, అనుదానిచే గల్గినరోగములు, ఈవ్యాధులయందెల్ల దప్పి యుపద్రవరూపముగ కల్గినపుడును సామాన్యముగ దప్పికల్గినపుడును స్వభావముచేతనే చల్లగనుండుజలమును త్రాగవలెను. సన్నిపాతజ్వరములయందు కాగి చల్లారినజలమును త్రాగవలెను.

మరియు:—ఎక్కిళ్లు, శ్వాసము, నవజ్వరము, పీనసము, (ఈరోగములయందును), ఘృతము త్రాగినపుడును, పార్శ్వశూలమునందును గలరోగమునందును, కఫవాతరోగముల యందును, కఫము ఘనీభవించియున్నపుడును, వమనాదిశోధనచికిత్సల జేసికొనినప్పుడును చక్కగ కాగి వేడిగనుండుజలమును త్రాగుట మంచిది.

పాండురోగమునందును, ఉదరరోగమునందును, పడిసెముపట్టినప్పుడును, ప్రమేహములయందును, గుల్మరోగమునను, జాఠరాగ్ని మందగించినపుడును, అతిసారమునందును, ప్లీహవృద్ధియందును, దప్పికల్గినయెడ జలమును త్రాగకుండుట చాలమంచిది. ఒకవేళ దప్పి గోరువ వలనుపడక తీవ్రముగనున్నపుడు జలమును కొంచెముగ త్రాగవలెను.

## తృష్ణారోగశమనావశ్యకత.

మూ. పూర్వామయాతురస్సన్ దీనస్తృష్ణార్దితో జలం కాంక్షన్,
న లభేత స చేన్మరణం ఆశ్వేవాప్నుయాద్దీర్ఘరోగం వా. 60
తస్మాద్దాన్యామ్బు పిబేత్ తృష్యన్ రోగీ సశర్కరాక్షౌద్రం,
యద్వా తస్యాన్యత్ స్యాత్సాత్మ్యం రోగస్య తచ్ఛ్రేష్టమ్. 61

తస్యాం వినివృత్తాయాం తజ్జన్యోపద్రవః సుఖం జేతుం,
తస్మాత్తృష్ణాం పూర్వం జయేద్బహుభ్యోఽపి రోగేభ్యః. 62

వ్యా. మనుజునకు తొలుత నొకరోగము సంభవించి బాధపడుచున్నపుడు దప్పి తీవ్రమై జలమును కోరుచున్నయెడ త్రాగుటకు జలమును బొత్తుగనియ్యనిచో శీఘ్రముగ మరణమునొందును, లేక దీర్ఘరోగము సంభవించును. కావున రోగపీడితునకు దప్పి తీవ్రముగనున్నపుడు దనియాలకషాయమున చక్కెరను తేనెను కలిపి త్రాగించవలెను. లేక అప్పుడు బాధించురోగమునకు వ్యతిరేకము గాకుండునదియు దప్పినణచునదియునగు నితరద్రవములు అన్నపానములు మున్నగువాని నుపయోగింపనగును. అట్టిపానీయాద్యుపయోగముచేత దప్పి శమించినపిదప, నొకవేళ పానీయోపయోగమునంజేసి వేరొండు రోగము సంభవించినను, అయ్యది సులభోపాయముచేతనే సాధింపందగియుండును. కావున నుపద్రవము లెన్ని కల్గియున్నను తొలుత దప్పిను పేక్షింపక శీఘ్రముగ తగుపానీయాదులచేత శమింపజేయుట ముఖ్యకర్తవ్యము.

అధ్యాయవిషయసంగ్రహము.

తత్ర శ్లోకః.—

మూ. హేతూ యథాగ్నిపవనౌ కురుతః సోపద్రవం చ పఞ్చానాం,
తృష్ణానాం పృథగాకృతిరసాధ్యతా సాధనం చోక్తమ్. 63

వ్యా. ఐదువిధములైన తృష్ణలకు కారణములైన వాతపిత్తములు తృష్ణరోగమును కల్గించువిధంబును, తాలుశోషము మున్నగు తృష్ణోపద్రవంబులును, అట్టి తృష్ణారోగముల వేరువేరులక్షణంబులును, సాధ్యాఽసాధ్యభేదంబులును, వానిచికిత్సయు నీతృష్ణారోగ చికిత్సితాధ్యాయమున విస్తరముగ చెప్పబడినది.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే, దృఢబలసమ్పూరితే
చికిత్సాస్థానే తృష్ణారోగచికిత్సితం నామ ద్వావింశోఽధ్యాయః.

వ్యా. ఇత్తెరంగున నగ్నివేశకృతంబును చరకప్రతిసంస్కృతంబును నగు చరకసంహితయను నాయుర్వేదతంత్రమునందలి చికిత్సాస్థానమున దృఢబలసంపూరితభాగమున తృష్ణారోగచికిత్సితమనునది యిరువదిరెండవయధ్యాయము సమాప్తము.

# త్రయోవింశాధ్యాయము.

అవతరణిక:—తృష్ణారోగమున చికిత్సితమంతయు శీతోపచారమునే ప్రధానముగ జేసి యుండును. విషచికిత్సితమునను శీతోపచారమే ప్రధానముగ నుండును; కావున తృష్ణారోగచికిత్సితమును జెప్పినపిదప విషచికిత్సితము చెప్పబడును:—

మూ. అథాతో విషచికిత్సితం వ్యాఖ్యాస్యామః. 1

ఇతి హ స్మాహ భగవానాత్రేయః. 2

వ్యా. తృష్ణాచికిత్సితమును జెప్పినపిదప విషచికిత్సితమును భగవానుడగు నాత్రేయు లుపదేశించినదానికి న్యూనాతిరేకము లేకుండునట్లు వివరించి చెప్పెదనని యర్థము.

## విషచికిత్సితవిషయనిర్దేశము.

మూ. ప్రాగుత్పత్తిం గుణాన్ యోనిం వేగాన్ లిఙ్గాన్యుపక్రమాన్,
విషస్య బ్రువతస్సమ్యక్ అగ్నివేశ! నిబోధ మే. 3

వ్యా. "ఓయగ్నివేశా! విషముయొక్క తొల్లింటియుత్పత్తిని (1) దానిగుణములను, (2) దానికాశ్రయమును అధిష్ఠానమును, (3) దానివేగములను, (4) దాని లక్షణములను, (5) (విషము శరీరమున వ్యాపించినప్పుడు దాన గల్గు లక్షణములును, అన్నాదులయందు గలసి యున్నపుడు కల్గు లక్షణములును లింగశబ్దముచే గ్రహింపబడును) విషమునకు సంబంధించిన చికిత్సలను, (6) ఈవిషయముల నన్నింటిని చక్కగ వివరించి చెప్పెద వినుము" అని అగ్నివేశుని సంబోధించి యాత్రేయు లుపదేశించెను.

ఇచ్చట 'నాఽపృష్టా గురవో వదన్తి' అనున్యాయము ననుసరించి యాత్రేయ ప్రతివచనముచే శిష్యుడు పైజెప్పినవిషయములనే యడిగియుండునని ప్రశ్నమూహింపదగినది. మరియు రోగాధికారమున తక్కినరోగముల నన్నిటిని పరిగణించునపుడు విషమును సూత్రించి యుండలేదు. ఐనను మదభేదములను మాత్రము 'చత్వారో మదాః' (సూ. అ. ౧౯) అని చెప్పియుండుటంజేసి, అట్టి మదకారణమైన విషము కూడ సంగ్రహింపబడును కావున విషము కూడ సూత్రితమనే యెరుంగునది.

## విషముయొక్క ప్రాగుత్పత్తి.

మూ. అమృతార్థం సముద్రే తు మథ్యమానే సురాసురైః,
జజ్ఞే ప్రాగమృతోత్పత్తేః పురుషో ఘోరదర్శనః. 4

దీప్తతేజాః చతుర్దంష్ట్రః హరికేశోఽనలేక్షణః,
జగద్విషణ్ణం తం దృష్ట్వా తేనాఽసౌ విషసంజ్ఞితః.
(విషం తత్తు విషాదనాత్)

వ్యా. దేవతలును రాక్షసులును కలిసి యమృతముకొరకు సముద్రమును తరచు నపుడు అమృతము పుట్టుటకు ముందు, మిక్కిలి ప్రకాశించు తేజస్సు కలవాడును, నాల్గుకోరలు కలవాడును, పింగళవర్ణములైన వెండ్రుకలు కలవాడును, నిప్పులు రాలు కన్నులుగలవాడును, భయంకరమైన రూపముకలవాడును నగు నొకపురుషుడు తొలుదొలుత జనించెను. భయంకరాకారుడగు నతనిం గాంచి జగమునంగల ప్రజలందరు నేమియుం దోచక నివ్వెరపడి విషణ్ణచిత్తులై యుండిరి. ఆకారణమునం జేసి (విషణ్ణులగుటవలన) విషశబ్దముచే నాభయంకరపురుషుడు పిలువంబడియె ("విషాదజనకత్వాత్ విషః" అనువ్యుత్పత్తిచేత చూచుజనుల కందరకును విషాదమును కల్గించుటంజేసి విషశబ్దముచే నన్వర్థముగ జెప్పబడునని భావము.)

విషాధిష్ఠానములు రెండు.

మూ. జఙ్గమస్థావరాయాం తత్ యోనౌ బ్రహ్మా న్యయోజయత్,
తదంబుసమ్భవం తస్మాత్ ద్వివిధం పావకోపమమ్. 6
అష్టవేగం దశగుణం చతుర్వింశత్యుపక్రమం,

వ్యా. పైజెప్పినవిషమును జంగమ (గమనస్వభావముకల జంతువుల) రూపమైన యోనియందును (ఉత్పత్తిస్థానమునందును), స్థావరవస్తురూపమైన యోనియందును ఆశ్రయించి యుండుమని యాజ్ఞచేసెను. అట్టి జంగమస్థావరయోనిభేదములచే రెండు తెరంగులైన విషంబును నీటియందు (సముద్రోదకమునందు) తొలుత బుట్టినది. పిమ్మట స్థావరజంగమరూపములగు ద్వివిధయోనులయందుండుమని నియోగింపబడినది. కావున నీకారణములచే రెండువిధముల నుండునని భావము. మరియు నిది యగ్నితో సమానమైన గుణములు కల్గియుండును. ఈవిషము మనుజులశరీరమున వ్యాపించునపుడు ఎనిమిదివిధములైన వేగముల జూపును. పదిగుణముల గల్గియుండును. ఇరువదినాల్గు చికిత్సాభేదములు కల్గియుండును. (విషమునకు స్థావర-జంగమరూపములైన రెండధిష్ఠానములును, ఎనిమిదివేగములును, పదిగుణంబులును, ఇరువదినాల్గు చికిత్సోపాయంబులును, అగ్నితో సమానమైన తీవ్రతయు కల్గియుండునని భావము.) ఇచ్చట చెప్పబడిన విషవేగము లెనిమిదియు మనుజులనుద్దేశించి చెప్పబడినది. పశ్వాదులకు వేగములు నాల్గువిధములని చెప్పబడును.

### విషమునకు కాలవిశేషముచే ప్రకోప-శమములు.

మూ. తద్వర్షాస్వమ్బుయోనిత్వాత్ సంక్లేదం గుడవద్గతమ్ 7
సర్పత్యమ్బుధరాపాయే తదగస్త్యో నిహన్తి చ,
ప్రయాతి మన్దవీర్యత్వం విషం తస్మాద్ఘనాత్యయే. 8

వ్యా. విషము పైఁజెప్పినరీతిగ నీటివలన బుట్టుటంజేసి వర్షాకాలమున బెల్లమువలె ద్రవీభూతమగుచు వ్యాపించును. వర్షకాలము వెళ్లినవెంటనే (శరత్కాలమున) అగస్త్యులు (తనప్రభావముచే) శమింపజేయును. కావుననే మేఘాడంబరము లేని శరత్కాలమున విషము మందవీర్యమై (తనశక్తినుడిగి) యుండును.

### జంగమవిషాధిష్ఠానములు.

మూ. సర్పాః కీటోన్దురా లూతాః వృశ్చికాః గృహగోధికాః,
జలౌకా మత్స్యమణ్డూకాః కణభాః (శలభాః) సకృకణ్టకాః. 9
శ్వ-సింహ-వ్యాఘ్ర-గోమాయు-తరక్షు-నకులాదయః,
దంష్ట్రిణో యే, విషం తేషాం దంష్ట్రోత్థం జఙ్గమం మతమ్. 10

వ్యా. సర్పములు, పురుగులు, ఎలుకలు, సాలెపురుగులు, తేళ్లు, బల్లులు, జలగలు, మత్స్యములు, కప్పలు, కణురీగలు, తొండలు, (ఊసరవల్లులు), కుక్కలు, సింహములు, పులులు, నక్కలు, సివంగులు, ముంగిసలు, ఇవి మున్నగు కోరలు కలజంతువులును జంగమములు. వానికోరలవలన బుట్టినవిషము జంగమవిషమని చెప్పబడును.

ఇచ్చట నుద్దేశమున "ప్రాగుత్పత్తిం గుణాన్ యోనిః వేగాన్ లిఙ్గాన్యనుక్రమాత్" అని ప్రాగుత్పత్తినిర్దేశానంతరము గుణములు నిర్దేశింపబడినవి. కావున ప్రాగుత్పత్తిని చెప్పినవెంటనే గుణముల వివరించుట న్యాయ్యము. అయినను గుణముల కాశ్రయమైన విషమున కధిష్ఠాంతముల రెంటిని వివరించి పిదప గుణముల వివరించుట సమంజసమని తలంచి తంత్రకారులు విషాధిష్ఠానముల నుపదేశించిరి. విషము గుణములచే తన ప్రభావమును జూపును. కావున అట్టి గుణప్రాశస్త్యమును సూచించుటకై యుద్దేశస్థలమున గుణముల నధిష్ఠానమునకు ముందు నిర్దేశించిరి.

మరియు కీటలూతాదిజంతువులు కోరలు కల్గినవి గాకున్నను సర్పశ్వానసింహాదులకోరలు గలవాని ప్రధానముగ జేసి దంష్ట్రిశబ్దముచే (ఛత్రిన్యాయమున) గ్రహింపబడును. 'దంష్ట్రోత్థం' అనుచోటను ఈన్యాయము ననుసరించియే లూతాదివిషములు కూడ గ్రహింపబడును. మరియు సుశ్రుతాచార్యులు జంగమవిషాధిష్ఠానముల వివరించునపుడు

"జఙ్గమస్య విషస్యోక్తాన్యధిష్ఠానాని షోడశ" అని యుపక్రమించి యిట్లు చెప్పెను:— "తత్ర దృష్టినిశ్వాసదంష్ట్రానఖమూత్రపురీష శుక్రలాలాఽఽర్తవముఖ సందంశవిశర్ధిత గుదాస్థి పిత్తశూకశవానీతి" (సు. కల్ప. అ. 3. సూ. ౨.) దృష్టి, నిశ్వాసము, కోరలు, గోళ్లు, మూత్రము, పురీషము, శుక్రము, నోటిద్రవము, ఆర్తవము, నోటికాటు, అపానము, గుదము, అస్థి, పిత్తము, శూకము (ముల్లు), శవము, అను నీపదునారును జంగమరూపములైనజంతువుల నాశ్రయించినవి. జంగమవిషమున కధిష్ఠానము లగునని యర్థము. ఈపదునారింటివిభాగంబును ప్రత్యేకలక్షణంబులును సుశ్రుతమునసే విస్తరింపబడినది. ఈతంత్రము కాయచికిత్సాప్రధాన మగుటంజేసి యగదతంత్రవక్తవ్యాంశమును కేవలము సంగ్రహరూపముగ నిట జెప్పెనని యెరుంగునది. సుశ్రుతవాక్యమున 'శుక్రలాలారార్తవ' అని 'అర' శబ్దమునుజేర్చి పాఠాంతరము గాననగును. 'అర' యన తోక. వృశ్చికాదులు ఆరవిషమని యర్థము. వానితోకయందలి ముల్లున విషముండును కావున శూక శబ్దముచేతనే గతార్థమగును కావున 'అర' అనుపాఠ మనవసరమని డల్హణ వ్యాఖ్య నున్నది.

## స్థావరవిషాధిష్ఠానములు.

మూ. ముస్తకం పౌష్కరం క్రౌఞ్చం వత్సనాభం వలాహకం,
కర్కటం కాలకూటం చ కరవీరకసఞ్జ్ఞకమ్. 11
పాలకేన్ద్రాయుధం తైలం మేదకం కుశపుష్పకం,
రోహిషం పుణ్డరీకం చ లాఙ్గలక్యఞ్జనాభకమ్. 12
సఙ్కోచం మర్కటం శృఙ్గీవిషం హాలాహలం తథా,
ఏవమాదీని చాన్యాని మూలజాని స్థిరాణి చ. 13

వ్యా. ముస్తకము, పౌష్కరము, క్రౌంచము, వత్సనాభము (వసనాభి), వలాహకము, కర్కటము, కాలకూటము, కరవీరకము (గన్నేరువేళ్లలో నుండునది), పాలకము, ఇంద్రాయుధము, తైలము (తైలమునకు జేరిన విషభేదము), మేద (చ) కము, కుశపుష్పము, రోహిషము, పుండరీకము, లాంగలకము (పొత్తిగడ్డ), అంజనాభకము, సంకోచము, మర్కటము, శృంగివిషము, హాలాహలము, ఇవి మున్నగు నామభేదములు కలవిషములు చెట్లయొక్క దుంపలు ఆకులుమున్నగువాని నాశ్రయించి యుండును. కావున నవి యన్నియు స్థావరవిషభేదములని యెరుంగునది.

వివరణము:— పైజెప్పిన ముస్తకాదివిషములలో కొన్నిచెట్లయొక్క దుంపలను, కొన్ని ఆకులు, కాయలు, పుష్పములు, పట్టు, బొంతజెముడు మున్నగువాని పాలు, రసము,

**బంక**, వేళ్లు, ధాతువులు (రసపాషాణాదులు), ఇవి మొదలగువానిని ఆశ్రయించి యుండును. కావున స్థావరవిషము లగును. ఈవివరణమును సుశ్రుతాచార్యు లిట్లు చెప్పిరి:—"మూలం పత్రం ఫలం త్వక్ క్షీరం సారఏవచ, నిర్యాసో ధాతవశ్చైవ కన్దశ్చ దశమస్స్మృతః" (సు. కల్ప. అ. ౨.) ఈతంత్రకారులు ప్రాయికముగ కందములయందే విషముండునని యుద్దేశించి 'మూలజాని' అని పత్రాదులకు గూడ నుపలక్షకముగ నిర్దేశించిరి.

మరియు—అట్టి స్థావరవిషమునకు ముస్తక పౌష్కరాది నామభేదములు ఆయాదేశమునం దలవాటునుబట్టి విషముయొక్క రూపాదిభేదములబట్టియు కల్గినట్లున్నది. అట్టినామభేదములచే సామాన్యముగ గ్రహింపనలవికాకున్నది. శబరకిరాతాదులవలన నీనామభేదములు కొంతవరకును తెలిసికొనదగియుండును. ఈముస్తకాదివిషప్రత్యేక లక్షణంబులు మున్నగునవి సుశ్రుతమున విస్తరముగ జెప్పబడినవి.

### గరవిషము, దానిలక్షణము.

మూ. గర(పరం)సంయోగజం చాన్యత్ గరసంజ్ఞం గదప్రదం,
కాలాన్తరవిపాకిత్వాత్ న తదాశు హరత్యసూన్. 14

వ్యా. గరమను విషమును సిద్ధము జేయుటకై చేర్పబడు ద్రవ్యములు గరమనబడును. అట్టి ద్రవ్యములయొక్క సంయోగమున గల్గినవిషము గరమని తంత్రకారులు చెప్పెదరు. ఇయ్యది శీఘ్రముగ జీర్ణముగాక చాలకాలమునకు జీర్ణమగును; కావున తక్కిన విషములబోలె శీఘ్రముగ ప్రాణముల హింసించక నానాట రక్తాదిధాతువుల జెరచుచు పాండువు ప్లీహము గుల్మము అతిసారము మున్నగు క్రూరవ్యాధుల గల్గించును.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—గరమను విషము స్థావరజంగమరూపములైన విషముచేతనే సంభవించును కావున ప్రత్యేకముగ నుద్దేశింపక అధిష్ఠానభేదముచే స్థావరజంగమభేదములు రెండు మాత్రము నిర్దేశింపబడినవి. సుశ్రుతులును 'స్థావరం జఙ్గమం యచ్చ కృత్రిమం చాపి యద్విషమ్' (సు. కల్ప. అ. ౨) అనువాక్యముచేత ద్రవ్యసంయోగముచే గల్గిన కృత్రిమరూపమైన విషమును ద్వివిధాంతర్గతముగనే చెప్పిరి. మరియు ద్రవ్యసంయోగముచే జనించినవిషము గరమని "గరసంయోగజం చాన్యత్" అనువాక్యముచే జెప్పబడినది. అయ్యది నిర్విషద్రవ్యసంయోగముచే జనించినయెడ గరమనియు, విషముతోకూడిన ద్రవ్యముల సంయోగమున కల్గినది కృత్రిమ మనియు రెండు తెరంగులు.

ఈవిషయము కాశ్యపసంహితయం దిట్లున్నది:—"సంయోగజం చ ద్వివిధం తృతీయం విషముచ్యతే, గరం స్యాదవిషం తత్ర సవిషం కృత్రిమం మతమ్." ఈతంత్రకారుడును—"దంష్ట్రావిషే మూలవిషే సగరే కృత్రిమే విషే" (చి. అ. ౧) అను వాక్యముచే జెప్పిరి.

మరియు దూషీవిషలక్షణము సుశ్రుతమున నిట్లు చెప్పబడినది:—"యత్ స్థావరం జఙ్గమకృత్రిమం వా దేహాదశేషం యదనిర్గతం వా, జీర్ణం విషఘ్నౌషధిభిర్హతం వా దావాగ్నివాతాతపశోషితం వా. స్వభావతో వా గుణవిప్రహీణం విషం హి దూషీవిషతాముపైతి." (సు. కల్ప. అ. ౨) విషహరంబులగు నౌషధములచే నొద్ధత్యముడిగి కొంచెముగ శేషించి యుండు విషంబును, కార్చిచ్చు గాలి ఎండ మున్నగువాని తాకుడుచే మందవీర్యమైన విషంబును, తనకు స్వాభావికములగు వ్యవాయి వికాసి మున్నగు గుణములు తగ్గియున్నను, లేక స్వభావము చేతనే తనగుణములలో కొన్ని లోపించి యున్నను, ఆట్టివిషము జంగమ-స్థావర-కృత్రిమవిషములలో నెద్దియైనను దూషీవిషమని యర్థము. ఈదూషీవిషంబును పైజెప్పిన స్థావరజంగమగరవిషములలో నేది యైనను పై జెప్పిన కారణములచే మందమైన రూపాంతరమగును కావున నామూటియందే యంతర్భూతమని యెరుంగునది.

## జంగమవిషలక్షణములు.

మూ. నిద్రాం తన్ద్రాం క్లమం దాహం సపాకం(దాహమపాకం) లోమహర్షణం, శోఫం చైవాతిసారం చ జనయేజ్జఙ్గమం విషమ్. 15

వ్యా. నిద్ర, కునికిపాటు, బడలిక, తాపము అజీర్ణము, రోమహర్షము, శోఫ, అతిసారము, వీని నన్నిటిని జంగమవిషము కల్గించును.

## స్థావరవిషలక్షణములు.

మూ. స్థావరం తు జ్వరం హిక్కాం దన్తహర్షం గలగ్రహం,
ఫేనవమ్యరుచిశ్వాసమూర్ఛాశ్చ జనయేత్ విషమ్. (భృశమ్.) 16

వ్యా. స్థావరవిషము జ్వరమును ఎక్కిళ్లను దంతహర్షమును కల్గించును. కంఠమును బిగపట్టును. నురుగుతో గూడిన వాంతిని, అరోచకమును, శ్వాసమును, మూర్ఛను కల్గించును. (ఈచెప్పబడిన స్థావర-జంగమవిషలక్షణములు విషవేగము లన్నిటియందును సామాన్యముగ జెప్పబడినవి.)

## స్థావర-జంగమవిషములు ఒకదాని నొకటి శమింపజేయుననుట.

మూ. జఙ్గమం స్యాదధోభాగం ఊర్ధ్వభాగం తు మూలజం,

(జఙ్గమం స్యాదూర్ధ్వభాగం అధోభాగం తు మూలజం,)
తస్మాత్ దంష్ట్రా(దంష్ట్రి)విషంమౌలం హన్తిమౌలం చ దంష్ట్రిజమ్.

వ్యా. జంగమవిషము శరీరమునం దధోభాగమున వ్యాపించును. స్థావరవిషము శరీరమునం దూర్ధ్వభాగమున వ్యాపించును. ఇత్తెరంగున జంగమస్థావరవిషములు పరస్పర విరుద్ధమార్గముల సంచరించుటంజేసి జంగమవిషము స్థావరవిషమును, స్థావరవిషము జంగమ విషమును హరించును.

### అష్టవిధవిషవేగములు, వాని ప్రత్యేకలక్షణములు.

మూ. తృణ్మోహద న్తహర్ష ప్రసేకవమథుక్లమాః భవన్త్యాద్యే,
వేగే రసప్రదోషాత్ అసృక్ప్రదోషాద్ద్వితీయే తు. 18
వైవర్ణ్యభ్రమవేపథుమూర్ఛాజృమ్భాఙ్గచిమిచిమాతమకాః(తజ్జ్ఞాః.)
దుష్టపిశితాత్తృతీయే మణ్డలకణ్డూశ్వయథుకోఠాః. 19
వాతాదిజాశ్చతుర్థే దాహచ్ఛర్ద్యఙ్గశూలమూర్ఛాద్యాః,
నీలాదీనాం తమసశ్చ దర్శనం పఞ్చమే వేగే. 20
షష్ఠే హిక్కాభఙ్గః స్కన్ధస్య తు సప్తమేఽష్టమే మరణం,
నృణామ్;

(స్థావరజంగమరూపమైన విషము శరీరమున వాతప్రేరితమై రసాదిధాతువుల నొక్కొకదాని నతిక్రమించుచు ధాత్వంతరమున వ్యాపించుటయే విషవేగమని చెప్ప బడును. ఈవిషయమును సుశ్రుతు లిట్లుపదేశించిరి:—“ధాత్వన్తరేషు యాస్స్థ...తత్తు వేగాన్తరం స్మృతమ్” (సు. కల్ప. అ. ౪) అట్టి విషవేగము లీక్రింద వివరింపబడును).

వ్యా. విషము ఎనిమిదివేగములు కల్గియుండునని “అష్టవేగం దశగుణం” అను వాక్యముచే నిర్దేశింపబడినది. అందు మొదటివేగమున రసధాతువుతో వ్యాపించి చెరిచి విషవేగమును జూపును. ఈవేగమున దప్పియు, మూర్ఛయు కల్గును. దంతములు జలబ రించును. నోట నీరుగారును. వాంతియగును. బడలిక కల్గును. రెండవవేగమున రక్తము చెడి శరీరము వివర్ణమగును. ఒడలు తిరుగును. శరీరమున కంపము పుట్టును. మూర్ఛ గ్రమ్మును. ఒడలివిరుపులును ఆవలింతలును కల్గును. శరీరమునం దెల్ల చిమచిమయను జిల బుట్టును. కన్నుల చీకటి గ్రమ్మినట్లుండును. మూడవవేగమున మాంసమున విషము వ్యాపించి చెరచును. దానంజేసి శరీరముపై పొడలును, జిలయు, వాపును, దద్దురులును కల్గును. నాల్గవవేగమున విషము మేదస్సున వ్యాపించి దానిం జెరచును. దానంజేసి

వాతాదిదోషముల రోగంబులును, తాపంబును, వాంతియు, ఒడలియందు శూలమున గ్రుమ్మినట్లు పోటును, మూర్ఛయు మున్నగు నుపద్రవములుకల్గును. ఐదవవేగమున విషము అస్థులయందు వ్యాపించి వానిం జెరచును. దానివలన కంటికి నీలరక్తాదివర్ణములు కనబడును. మూర్ఛ గ్రమ్మును. ఆరవవేగమున మజ్జయందు వ్యాపించి దానిం జెరిచి ఎక్కిళ్లను కల్గించును. ఏడవవేగమున శుక్రమున విషమువ్యాపించి భుజశిరస్సులను పట్టుసడలించును. ఎనిమిదవ వేగమున సప్తధాతువుల నన్నిటి నతిక్రమించి శరీరమునందెల్ల పూర్తిగ వ్యాపించి మరణము నొందించును. ఈయెనిమిదివిధములైన విషవేగంబులును మనుజ సామాన్యముగ సంభవించును.

ఇచ్చట చతుర్థాదివిషవేగములకు దూష్యములగు మేదస్సు, అస్థి, మజ్జ, శుక్రములనునవి నిర్దేశింపబడకున్నను వరుసన నూహించుకొనునది. మరియు 'నీలాదీనాం' అను నాదిశబ్దముచేత రక్తాదివర్ణంబులును గ్రహింపబడును. సుశ్రుతమున సప్తకలావ్యాప్తి ననుసరించి సప్తవిషవేగములు నిరూపింపబడినవి. ఇచ్చట సప్తకలాతిక్రమరూపమైన యెనిమిదవవేగమును నిరూపించి అట్టివేగమున మరణము సంభవించునని నిర్దేశింపబడినది. ఈ యెనిమిదవవేగమున విషము సప్తధాతువుల నతిక్రమించి ఐతవిషము హృదయమునను దష్టవిషము దంశముననుజేరి మరణము నొందించును.

## పశ్వాదులకు కల్గు విషవేగములు.

మూ. చతుష్పదాం స్యాచ్చతుర్విధః; పక్షిణాం త్రివిధః. 21
సీదత్యాద్యే భ్రమతి చ చతుష్పదో వేపతే తతశ్శూన్యః (శూనః),
మన్దాహారో మ్రియతే శ్వాసేన హి చతుర్థవేగే తు. 22
ధ్యాయతి విహగః ప్రథమే వేగే ప్రభ్రామ్యతి ద్వితీయే తు,
స్రస్తాఙ్గశ్చ తృతీయే విషవేగే యాతి పఞ్చత్వమ్. 23

వ్యా. నాల్గుపాదములు కల పశువులు మృగములు మున్నగు జంతువులకు స్థావరజంగమరూపమగువిషముచే గల్గినవేగములు నాల్గువిధములుగ నుండును. పక్షులకు విషవేగము మూడువిధముల నుండును. (ఈజంతువు కిట్టి విషభేదసంకోచము అవి యల్పసత్వములగుటవలన కల్గినది). అందు చతుష్పాదజంతువులు మొదటివిషవేగమున శరీరము కృశించి గిరగిర దిరుగుచుండును. రెండవవేగమున వడవడ వణంకుచు నొడలెరుంగక యుండును. (లేక శరీరమెల్ల వాచును). మూడవవేగమున నాహారము ముట్టదు. నాల్గవవేగమున శ్వాసము పుట్టి చచ్చును. మొదటివేగమున పక్షులు చింతతో నున్నట్టు

లేమియుం దోచక నిశ్చేష్టముగ నుండును. రెండవవేగమున దిరదిర దిరిగి పడుచుండును. మూడవవేగమున శరీరమంతయు స్తంభించి చచ్చును. (ఇచ్చట విషవేగప్రస్తావవశమున తిర్యగ్జంతువుల విషవేగభేదంబులును నిరూపింపబడినది).

మరియు—ఏజంతువునకైనను విషముచే వ్యాపత్తు కలిగినపుడు అట్టి విషము అన్నపానాదిమూలమున కోష్ఠమున జేరి యుండునెడ దానిశక్తికొలది వేగముల వరుసగ జూపి తుదకు మృతిజెందినయెడ చచ్చినముహూర్తకాలమునకు హృదయమున జేరును. ఆవిషము సర్పము మున్నగు జంతువులు కరచుటచేనైనను, విషమును పూయబడిన బాణము మున్నగునవి గ్రుచ్చుటచేనైనను శరీరమునందలి రసరక్తాదిధాతుమూలముగ వ్యాపించి, దానంజేసి యాజంతువు మృతినొందినయెడ పిదప ముహూర్తకాలమునకు కాటు తగిలినస్థలమునందే చేరును. ఈవిషయము "పీతం మృతస్య హృది తిష్ఠతి దష్ట విద్ధయోః దంశే స్యాత్" అని (3౨ శ్లోకమున) చెప్పబడును. అత్తరి విషపానముచే నైనను సర్పాదిదంశముచేనైనను విషదిగ్ధాయుధప్రయోగముచేనైనను మాంసోచితమైన జంతువేదైన మృతిజెందినయెడ చచ్చినపిదప శరీరమున వ్యాపించిన విషమంతయు ముహూర్తకాలమునకు పైజెప్పినరీతిగ హృదయముననైనను, కాటునందైనను చేరును కావున ముహూర్తకాలానంతరము విషయుక్తమైన హృదయమునను, కాటు కల్గినస్థలమునను ఉండుమాంసమును వదలి తక్కినమాంసమును భుజింపదగును. ఈవిషయమును సుశ్రుతాచార్యు లిట్లు నుడివిరి:—"స్వభావాదేవ తిష్ఠేత్తు ప్రహారాఽఽదంశయోర్విషం, వ్యాప్య సావయవం దేహం దిగ్ధవిద్ధాహిదష్టయోః, తౌల్యాద్విషాన్వితం మాంసం యః ఖాదేన్మృతమాత్రయోః,యథా విషం స రోగేణ క్లిశ్యతే మ్రియతేఽపి వా. అతశ్చాప్య నయోర్మాంసం అభక్ష్యం మృతమాత్రయోః, ముహూర్తాత్తదుపాదేయం ప్రహారాఽఽ దంశవర్జితమ్" (సు. కల్ప. అ. 3) పైజెప్పిన విషయమును గమనించి విషహతజంతు మాంసమును గ్రహించుటకై యిచ్చట చతుష్పదాదిజంతువిషవేగములు నిరూపింపబడిన దని ప్రయోజనము నెరుంగునది. మరియు "ముహుర్ముహుశ్శిరోన్యాసః......చతుష్ప దానాం దష్టానాం అగదస్సార్వకార్మికః" (౧౭౯-౧3౨ శ్లో) అనుగ్రంథముచే పశువు లకు సంబంధించిన విషలక్షణంబును చికిత్సయు చెప్పబడును.

## విషసామాన్యగుణములు.

మూ. లఘు రూక్షమాశు విశదం వ్యవాయి తీక్ష్ణం వికాసి సూక్ష్మం చ,
ఉష్ణమనిర్దేశ్యరసం దశగుణముక్తం విషం తద్జ్ఞైః. 24

వ్యా. విషము, లాఘవము, రూక్షము, ఆశు (శీఘ్రకారిగుణము), విశదము, వ్యవాయి (తొలుత శరీరమునం దెల్ల నీటియందుంచబడిన తైలబిందువువలె వ్యాపించు స్వభావము), తీక్ష్ణము (గాటుకల్గియుండుట), వికాసి, సూక్ష్మము, ఉష్ణము, స్ఫుటముగ దెలియరానిరసము, అను నీపదిగుణములును కల్గియుండునని యాయుర్వేదవేత్తలచే జెప్పబడినది.

## విషగుణముల ప్రత్యేకకృత్యములు.

మూ. రౌక్ష్యాద్వాత, మౌష్ణ్యాత్పిత్తం, సౌక్ష్మ్యాదసృక్ప్రకోపయతి;
కఫమవ్యక్తరసత్వాదన్నరసాంశ్చానువర్తతే శీఘ్రమ్. 25
శీఘ్రం వ్యవాయిభావాత్ ఆశు వ్యాప్నోతి కేవలం దేహమ్,
తీక్ష్ణత్వాన్మర్మఘ్నం; ప్రాణఘ్నం తద్వికాసిత్వాత్. 26
దురుపక్రమం లఘుత్వాత్; వైశద్యాత్ స్యాదసక్తగతిదోషం;
దోషస్థానప్రకృతీః ప్రాప్యాఽన్యతమం హ్యుదీరయతి. 27

వ్యా. విషము రూక్షగుణము కల్గియుండుటచే వాతమును, ఉష్ణగుణమువలన పిత్తమును, సూక్ష్మగుణమువలన రక్తమును ప్రకోపింపజేయును. (రక్తము సూక్ష్మమార్గముల ననుసరించి వ్యాపించు స్వభావము కల్గినది. అట్టి సూక్ష్మగుణము విషమునందు నుండుటం జేసి సూక్ష్మమార్గమున సంచరించు రక్తమునం గలిసి ప్రకోపింపజేయునని భావము). మరియు విషము అవ్యక్తరసమగుటవలన (అవ్యక్తరసమైన జలముతో సమానరూపమగు) కఫమును వృద్ధినందును. అట్టి యవ్యక్తరస మగుటచేతనే యాహారమునందలి మధురాది రసముల నతిశీఘ్రముగ ననువర్తించి యుండును. (అవ్యక్తరసమైన జలము ఆహారమునందలి మధురాదిరసములను గంధాదులను గ్రహించి యన్నమున వ్యాపించి యేకమగువిధముగ విషంబును అవ్యక్తరస మగుటవలన యాహారమునందలి రసాదులతో నేకీభవించి యతి శీఘ్రముగ నన్నమును చెరచును. దానంజేసి భుజింపబడినయన్నమును విషదూషితమై చెడునని భావము. ఇదియే యోగవాహిత్వము). శీఘ్రముగ వ్యాపించుగుణమువలనను వ్యవాయి (జీర్ణము గాకమునుపే శరీరమున వ్యాపించు స్వభావము కలది) యగుటవల నను శరీరమునం దెల్ల నతిశీఘ్రముగ వ్యాపించును. తీక్ష్ణగుణమువలన హృదయాదిమర్మస్థాన ములను చెరచును. (హృదయాది మర్మములు మిగుల సౌమ్యములై మృదుత్వము కల్గి యుండును కావున వానికి విరుద్ధమైన తీక్ష్ణగుణము కల్గియుండుటవలన విషము హృద యము కణతలు మున్నగు మర్మస్థలముల వ్యాపించి చెరచునని భావము). వికాసి (సంధిబం ధములను శిథిలములుగ జేసి హింసించుస్వభావము కల్గినది) యగుటవలన ప్రాణముల

హింసించును. లఘుత్వము కల్గియుండుటవలన చికిత్స జేయ వలనుపడదు. లఘుత్వమువలన నొకచోటనైన నిల్కడ లేకుండును. అట్టియెడ నౌషధముతో సంబంధము కల్గుట దుస్తరము. కావున నట్టియవస్థయందు చికిత్స కార్యకరణసమర్థము కానేరదని భావము). విశదగుణము కల్గియుండుటవలన దోషముల నంటకయే శరీరమున వ్యాపించును. (జిగురు కల్గిన వస్తువు పిచ్ఛిలము. ఇది వేరొకదానితో నంటికొనును. దీనికి విరుద్ధముగ (జిగురు లేక) నుండునది విశదము. విషము అట్టివిశదగుణము కల్గియుండుటంజేసి దోషదూష్యాదుల నంటకయే వ్యాపించునని భావము). పైజెప్పినరీతిగ వాతాదిదోషములయందు నియతమైన గమనము లేక ఆయాదోషములకు స్థానములైన ఆశయములయందును వాతాదిప్రకృతులను వ్యాపించి దోషములలో నెద్దానినైన ప్రకోపింపజేసి ఆయాదోష లక్షణముల జూపును.

ఇచ్చట విషమునకు సంబంధించి పైజెప్పబడిన రూక్షాదిగుణములు వానివానికి సంబంధించి నియతమైన విరుద్ధవ్యాపారముల మాత్రము చేయునుగాని అనుకూలములగు వ్యాపారముల జేయుటలేదు. ఇది విషముయొక్క స్వభావము. కావుననే విషము రౌక్ష్యాదిగుణములచే వాతాదిదోషముల వృద్ధినొందించునుగాని కఫాదిదోషముల శమించుటలేదు.

మరియు సూక్ష్మాదిగుణలక్షణముల నిట్లెరుంగునది—"దేహస్య సూక్ష్మచ్ఛిద్రేషు విశేద్యత్సూక్ష్మముచ్యతే" శరీరమునందలి మిగుల సూక్ష్మములగు రోమరంధ్రములు మున్నగువానియందు ప్రవేశించి వ్యాపించునది సూక్ష్మము. "పూర్వం వ్యాప్యాఖిలం కాయం తతః పాకం చ గచ్ఛతి, వ్యవాయీ తత్" తొలుత శరీరమునంతెల్ల పూర్తిగ వ్యాపించి కాలానంతరమున జీర్ణమగునది వ్యవాయి. "సన్ధిబన్ధాంస్తు శిథిలాన్ యత్కరోతి వికాసి తత్, విశ్లేష్యౌజశ్చ ధాతుభ్యః" శరీరమునందలి కీళ్లను సడలించి ప్రాణాధారమైన యోజస్సును ధాతువులనుండి విడదీయునది వికాసి. ఇట్టి క్రూరములగు గుణముల గల్గియుండుటవలన విషము ప్రాణహరమగును. మరియు పైజెప్పబడిన లఘ్వాదిగుణములు పదియును జంగమస్థావర విషసామాన్యముగ నుండును. ఈవిషయమునే సుశ్రుతులిట్లు స్ఫుటముగ జెప్పిరి:—"సర్వాణి కుశలైః జ్ఞేయాన్యేతాదిదశభిర్గుణైః, రూక్షముష్ణం స్థావరం జఙ్గమం యచ్చ కృత్రిమం చాపి యద్విషం, సద్యోవ్యాపాదయేత్తత్తు జ్ఞేయం దశగుణాన్వితమ్." (సు. కల్ప. అ. ౨)

## వాతస్థానగతవిషలక్షణములు.

మూ. స్యాద్వాతికస్య వాతస్థానే కఫపిత్తలిఙ్గమీషత్తు,
　　తృణ్మోహారతి (తృణ్మోహాఽరుచి) మూర్ఛాగలగ్రహచ్ఛర్దిఫేనాది.

వ్యా. వాతప్రకృతి కలవానికిని విషము వాతస్థానములగు పక్వాశయముమున్న స్థానములయందు వ్యాపించినపుడును కఫపిత్తములకు జెప్పిన లక్షణములు స్వల్పముగ దప్పి, తెలివితప్పుట, అరతి (దేనియందు నిచ్చ లేకుండుట), మూర్ఛ, గలగ్రహ (కుత్తుక బిగబట్టుట), వాంతి, నోట నురుగువెడలుట మున్నగు వాతలక్షణము లధికముగ కల్గును. (ఇచ్చట "కఫపిత్తలింగమీషత్తు" అని చెప్పుటవలన కఫపిత్తములకు జెప్పిన లక్ష ములు స్వల్పముగ నుండుననియు, వాతమునకు సంబంధించిన స్థానమును ప్రకృతిని దప్పి మోహము మున్నగు వాతలక్షణములు మెండుగ నుండుననియు నెరుంగునది. ఇ రంగుననే తక్కిన కఫపిత్తముల రెండిటికిని యూహించునది).

పిత్తస్థానగతవిషలక్షణములు.

మూ. పిత్తాశయస్థితం పైత్తికస్య కఫవాతయోః విషం తద్వత్,
తృట్కాసజ్వరవమథుక్లమదాహతమోఽతిసారాది.

వ్యా. విషము పిత్తాశయములగు నాభిమున్నగుస్థానముల వ్యాపించినపుడు పిత్తప్రకృతి కలవానికిని కఫవాతములకు జెప్పినలక్షణములు కొద్దిగను దప్పి, కాస జ్వరము, వాంతి, బడలిక, తాపము, మూర్ఛ, అతిసారము మున్నగు పిత్తలక్షణము మెండుగను కల్గును.

కఫస్థానగత విషలక్షణములు.

మూ. కఫదేశగం కఫస్య చ దర్శయేద్వాతపిత్తయోశ్చేషత్,
లిఙ్గం శ్వాసగలగ్రహకణ్డూలాలావమథ్వాది.

వ్యా. విషము కఫస్థానములగు ఆమాశయము మున్నగుప్రదేశములయం వ్యాపించినను కఫప్రకృతి కలవానికిని వాతపిత్తపిత్తలక్షణములను స్వల్పముగ శ్వాసము, గలగ్రహము, జిలయు, నోట చొంగవెడలుట, వాంతి మున్నగు కఫలక్షణ లధికముగను సంభవించును. (ఇచ్చట "కఫస్య చ" అను చకారమువలన కఫప్రకృతికి యర్థము చేయనగును. మరియు విషము మద్యమును త్రిదోషముల ప్రకోపింపజేయున ఐనను అందు స్థానవిశేషమును ప్రకృతివిశేషమును బట్టి విషము స్థానవిశేషమునకు సం ధించినదోషలక్షణముల విశేషముగ జూపుననియు, తక్కినదోషములలక్షణముల కొ జూపుననియు నెరుంగునది.

దూషీవిషలక్షణములు.

మూ. దూషీవిషం తు శోణితదుష్ట్యరుః కిటిభకోఠలిఙ్గం చ,
విషమైకైకం దోషం సన్దూష్య హరత్యసూనేవమ్.

వ్యా. దూషీవిషము రక్తమును జెరిచి బొబ్బలను కిటిమములను (కణుదురీగెలు కుట్టినపుడు గల్గు దద్దురులవంటి దద్దురులను) కోఠములను (మండలాకారములైన పొడలను) కల్గించును. మరియు నీవిషము వాతాదిదోషములలో నొక్కొకదానిని విశేషముగ చెరచుచు, వాతాదులకు వేరువేరుగ "స్యాద్వాతికస్య" అని యుపక్రమించి చెప్పబడిన లక్షణములు కలిగి తుట్టతుదకు ప్రాణముల హరించును.

మరియు దూషీవిషలక్షణము స్థలాంతరమున నిట్లు చెప్పబడినది:—"దూషితం దేశకాలాది దివాస్వప్నై రభీక్ష్ణశః, యస్మాద్దూషయతే ధాతూన్ తస్మాద్దూషీవిషం స్మృతమ్" స్థావరజంగమకృత్రిమభేదములచే మూడు తెరంగులైన విషములలో నెద్దియైన దేశకాలాది వైపరీత్యముచే నైనను, పవలు నిదురించుటచే నైనను దూషితమై శరీరమున నే యిమిడియుండి ప్రకుపితమై శరీరమునందలి రసరక్తాదిధాతువులను చెరచునది దూషీవిషమని యర్థము. మరియు దూషీవిషలక్షణము సుశ్రుతమున ఆమాశయాది స్థానభేదమునుబట్టి విశేషలక్షణములు "తేనార్దితో భిన్నపురీషవర్ణః" (సు. కల్ప. అ. ౨) అని యుపక్రమించి వివరింపబడినది. విస్తరభీతిచే నిట ననువదింపబడలేదు.

## అసాధ్యవిషలక్షణములు.

మూ. క్షరతి విషతేజసాఽసృక్ తత్తాని నిరుధ్య మారయతి జన్తుం,
పీతం మృతస్య హృది తిష్ఠతి దష్టవిద్ధయోః దంశదేశే స్యాత్. 32

వ్యా. విషము శరీరమున వ్యాపించునపుడు విషమునందలి తేజోభాగముచే శరీరమునుండి స్రవించును. మరియు నావిషము స్రోతోమార్గముల నిరోధించి ప్రాణిని చంపును. మరియు విషపానముచే ప్రాణికి శరీరమునందెల్ల వ్యాపించియున్న విషము చచ్చినపిదప ముహూర్తకాలమునకు హృదయమున జేరును. సర్పాదిజంతువు కరచుటచే గల్గినవిషము చచ్చినపిదప కాటునందే చేరును. విషముచే పూయబడిన బాణము మున్నగు నాయుధముల గ్రుచ్చుటచే జచ్చినజంతువునకు చచ్చినపిదప గాయము తగిలినస్థలమునందే చేరును.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—విషము శరీరమున రసాదిధాతుక్రమముగ వ్యాపించుచు నొకధాతువునుండి వేరొకధాతువున వ్యాపించునపుడు ఒక్కొకవిధమైన వేగమును (తనశక్తిని) జూపును. ఇట్లు రస-రక్త-మాంస-మేదః-అస్థి-మజ్జ-శుక్రములను నేడుధాతువులయందును వ్యాపించుచు నేడువిధములైన వేగముల జూపి, తుట్టతుదకు హృదయమున వ్యాపించుచు నెనిమిదవ వేగమును జూప గడంగును. అట్లు హృదయమున వ్యాపించిన వెంటనే తప్పక మృతి నొందును. కావున హృదయమున విషము వ్యాపింపక

మును పే యచ్చోటు వ్యాపింపకుండుటకు దగు చికిత్స నరయుటకై యిచ్చట "పీతం మృతస్య...దంశే స్యాత్" అని చెప్పబడినది. మరియు హృదయమున విషము వ్యాపింపక ముందును, వాతప్రాబల్యమున మనుజుడు చచ్చినట్లును కనబడును. అట్టియెడ నసాధ్యలక్షణములు లేనిచో హృదయమునకు విషమును వ్యాపించనీయక తగుచికిత్సా విధానము నాచరించి హృదయమును కాపాడినచో వానిని బ్రతికింప సాధ్యమగును. ఈవిషయము కాశ్యపసంహితయం దిట్లు చెప్పబడినది:—"మృత ఇవ చేన్మర్త్యస్స్యాత్ అసాధ్యలిఙ్గైర్విహీనశ్చ, స జీవయితుం శక్యః కృతా చైతస్య హృదయరక్షా చేత్."

మరికొన్ని యసాధ్యవిషలక్షణములు.

మూ॥ నీలౌష్ఠదన్తశైథిల్యకేశపతనాఙ్గభఙ్గవిక్షేపాః,
శిశిరైర్న లోమహర్షః నాఽభిహతే దణ్డరాజీ స్యాత్. 33
క్షతజం క్షతాచ్చ నాయాత్యేతాని భవన్తి మరణలిఙ్గాని,
ఏభ్యోఽన్యథా చికిత్స్యాః తేషాం చోపక్రమాన్ శృణు మే.

వ్యా. విషము వ్యాపించినవానికి పెదవులు నల్లబడుట దంతములు సడలి శిథిలములగుట, వెండ్రుకలూడుట, ఒడలు పగులుట, అవయవముల పలుచెరంగుల విదర్చుట, శిశిరోపచారములచే రోమహర్షము కల్గకుండుట, కట్టెతో బాదినపుడు శరీరముపై వాతయేర్పడకుండుట, పాము మున్నగునవి కరిచిన కాటునుండి రక్తము కారకుండుట, ఈలక్షణములు కల్గినయెడ నట్టివిషబాధితుడు మృతిజెందును. అట్టి యసాధ్యలక్షణములు లేనివారికి చికిత్స జేయందగును. అట్టిచికిత్సావిధానము లీక్రింద వివరింపబడును.

విషహరములగు నిరువదినాల్గు చికిత్సాభేదనములు.

మూ॥ మన్త్రారిష్టోత్కర్తననిష్పీడనచూషణాఽగ్నిపరిషేకాః,
అవగాహరక్తమోక్షణవమనవిరేకోపధానాని. 35
హృదయావరణాఽఞ్జననస్యధూమలేహౌషధప్రశమనాని (ప్రథమనాని,) ప్రతిసారణం ప్రతివిషం సంజ్ఞాసంస్థాపనం లేపః. 36
మృతసఞ్జీవనమేవ చ వింశతిరేతే చతుర్భిరధికాః,
స్యురుపక్రమా, యథా యే యత్ర యోజ్యాః శృణు తథా తాన్.

వ్యా. మంత్రప్రయోగము (1), అరిష్టబంధనము (2), ఉత్కర్తనము (పాము మున్నగునవి కరచినకాటును కత్తిరించుట) (3), నిష్పీడనము (కాటుగలస్థలమున గట్టిగ నలిపి విషమును వెడలించుట) (4), చూషణము (కరచినకాటునుండి గొట్టము మున్నగు

వానిమూలమున విషమును పీల్చుట), (5) కాటున నిప్పుచే కాల్చుట (6), పరిషేకము (నీళ్లలో స్నానముచేయుట) (7), అవగాహనము (జలముచే నిండిన తొట్టి మున్నగు వానిలో మునిగి స్నానముచేయుట) (8), రక్తమోక్షణము (9), వమనము (10), విరేచనము (11), ఉపధానము (విషము తలకెక్కకుండుటకై శిరస్సున నౌషధము నుపయోగించుట) (12), హృదయావరణము (హృదయమును కాపాడుటకైన యౌషధప్రయోగము) (13), అంజనము (14), నస్యము (15) ధూమము నుపయోగించుట (16), లేహములు (17), ఔషధములు (18), శమనము (19), ప్రతిసారణము (కాటున చూర్ణాదుల నునిచి రుద్దుట) (20), ప్రతివిషము (విరుద్ధగుణముగల వేరొండువిషమును ప్రయోగించుట) (21), శరీరమున ప్రజ్ఞ చెడకుండ కాపాడుట, లేక ప్రజ్ఞ దప్పిన మరల ప్రజ్ఞను కల్గించుట (22), లేపములు (23), మృతసంజీవనయోగము (24), అను నివి యన్నియు కలిసి విషచికిత్సితములు ఇరువదినాల్గువిధము లగును. ఈచికిత్సలలో దేనిని యేకాలమున నెట్లుపయోగించునదియు నీక్రింద వివరముగ జెప్పబడును.

ఇచ్చట విషచికిత్సలలో మంత్రరూపమైనది ప్రభావాతిశయముచే ప్రధానమైనది. మంత్రప్రభావాతిశయము సుశ్రుతాచార్యులచే నిట్లుపదేశింపబడెను:— దేవబ్రహ్మర్షిభిః ప్రోక్తాః మన్త్రాః సత్యతపోమయాః, భవన్తి నాన్యథా, క్షిప్రం విషం హన్యుః సుదుస్తరమ్. విషం తేజోమయైః మన్త్రైః సత్యబ్రహ్మతపోమయైః, యథా నివార్యతే క్షిప్రం ప్రయుక్తైర్న తథౌషధైః.'' సు. కల్ప. (అ. ౫. శ్లో. ౭. ౮) దేవర్షులచేతను బ్రహ్మర్షులచేతను ప్రకాశింపజేయబడిన మంత్రములు సత్య-తపస్స్వరూపము లైయుండును. కావున నవి యెుకప్పుడును వ్యర్థములుగావు. అట్టి ప్రభావము కలమంత్రములుదుస్సాధమైన విషమునుగూడ అతిశీఘ్రముగహరించును. అట్టి ప్రభావము కల మంత్రప్రయోగమువలన విషము హరించునట్లు ఔషధప్రయోగములు శమింప నేరవు. కావున విషమునకు మంత్రప్రయోగము ప్రధానమనిభావము. మరియు అరిష్టమన పాముకరచినవెంటనే ఆవిషమును వ్యాపింపనీయక నరికట్టువిధానము. ఇయ్యది మంత్రప్రయోగరూపంబును, దారము మున్నగువానిచే రక్షాబంధరూపంబునై రెండువిధముల నుండును. అరిష్టబంధనవిధానమును సుశ్రుతులు ఇట్లు చెప్పిరి:—''సర్వైరేవాదితః సర్పైః శాఖాదష్టస్య దేహినః, దంశస్యోపరి బధ్నీయాత్ అరిష్టాశ్చతురఙ్గులే. ప్లోతచర్మాన్తవల్కానాం మృదునాన్యతమేన చ, న గచ్ఛతి విషం దేహం అరిష్టాభిర్నివారితమ్.'' (సు. కల్ప. అ. ౫. శ్లో. ౧-౨) సర్పజాతిలో నేసర్పమైనను కాళ్లు చేతులు మున్నగు శాఖలయందు కరచినను కరచినచోటుకు నాలుగంగుళముల పైభాగమున గుడ్డపేలికతో

నైనను మెత్తనిచెట్టుపట్టనారతోనైనను కరచినవెంటనే కట్టు కట్టవలెను. దీనివలన విషము శరీరమున వ్యాపించక నిలబడును. (ఇదియే అరిష్టబంధము.)

మరియు మంత్రప్రయోగమువలన సర్పవిషము అతిశీఘ్రముగ నివర్తించుచుండు విషయము ఇక్కాలంబునను పామరసాధారణముగ గూడ ననుభవసిద్ధము కావున మంత్రప్రభావవిషయమై యేరికిని సంశయింప నవకాశముండదని నాయభిమతము.

## దంశవిషచికిత్స, అందు విషమును నిరోధించుటకై యరిష్టబంధ-నిష్పీడనాదిచికిత్సలు.

మూ. దంశాత్తు విషం దష్టస్యాఽవిసృతం వేణికాం భిషగ్బద్ధ్వా,
నిష్పీడయేద్భృశం దంశముద్ధరేన్మర్మవర్జం వా. 38
తం దంశం వా చూషేత్ ముఖేన యవచూర్ణపాంసుపూర్ణేన,

వ్యా. పాము కరచినప్పుడు కాటునుండి విషము శరీరమున నల్గెడల వ్యాపించక ముందుగనే (గుడ్డపేలిక మున్నగువానిచేత) తొలుత (నభిమంత్రించి) కట్టు కట్టవలెను. (దానివలన విషము కాటుననే నిలబడును). పిమ్మట కరచిన కాటును గట్టిగ బిగబట్టి నలిపి విషమును వెడలించవలెను. లేక కాటున కత్తిరించి విడదీసి పారంబుచ్చనగును. మర్మస్థలంబున మాత్రము ఈచెప్పబడినపీడన, ఉద్ధరణములు చేయదగదు. లేక కాటున నుండువిషమును వైద్యుడు నోటియందు యవచూర్ణమును ధూళిని నిండించుకొని నోటితో పీల్చవలెను. (ఇచ్చట నోటికి విషసంస్పర్శము లేకుండుటకై యవలపిండిని ధూళిని నోటనుంచుకొనవలెనని చెప్పబడినది.)

మరియు నిచ్చట ఔషధాదుల నిర్దేశించక యరిష్టబంధనము మాత్రము చెప్పబడినది కావున మంత్రప్రయోగపూర్వకముగ నరిష్టబంధనము చేయవలెనని తెలిసెడి. దీనినే లోకమున 'లింగము' అని చెప్పెదరు. మంత్రపూర్వకమైన యరిష్టబంధనమును సుశ్రుతు లిట్లు నుడివిరి:—"అరిష్టామపి మన్త్రైశ్చ బధ్నీయాన్మన్త్రకోవిదః, సా తు రజ్జ్వాదిభిర్బద్ధా విషప్రతికరీ మతా." (సు. కల్ప. అ. ౫. శ్లో. ౬).

[ఈయరిష్టబంధనము సర్పదష్టునకు శరీరమున చేయకున్నను మంత్రవేత్త భిన్నదేశమున నున్నను కరచినవాని నామగోత్రముల చెప్పి తంత్రీవార్తమూలమున మంత్రవేత్తకు దెలిపినచో వారుండుస్థలముననే యభిమంత్రించి యేదైననొకచెట్టుకు గుడ్డపేలికను కట్టెదరు. వెంటనే విషపీడితుడు సుఖమునొందును. ఇది యీకాలమునను ప్రత్యక్షముగ జూచుచున్నాము. కావున మంత్రప్రభావము అమేయము.]

### దంశవిషమున రక్తమోక్షణము.

మూ. ప్రచ్ఛనశృఙ్గజలౌకావ్యధనైస్స్రావ్యం తతో రక్తం. 39
రక్తే విషప్రదుష్టే దుష్యేత్ప్రకృతిః తతస్త్యజేత్ప్రాణాన్,
తస్మాత్ప్రఘర్షణైరసృగవర్తమానం ప్రవర్త్యం స్యాత్. 40

వ్యా. (పాము మున్నగునవి కరచినకాటున శలాకు మున్నగువానిచే కాటుచేసి యైనను, విషము వ్యాపించినసిరలను వేధించి యైనను గొట్టములచేత నందుండి రక్తమును వెడలించవలెను. లేక జలగల కరిపించి యైన రక్తమును స్రవింపజేయవలెను.) శరీరము నందలి రక్తము విషసంబంధమునంజేసి చెడినయెడ శరీరముయొక్కయు ధాతువు మున్నగు వానియొక్కయు స్వభావము చెడును. దానంజేసి ప్రాణంబులును పోవును. కావున రక్తము వెడలకున్నయెడ ప్రఘర్షణముచేనైన (పత్రచూర్ణాదులచే రుద్దుటవలనను) రక్తమును వెడలించవలెను. (ఇది రక్తమోక్షణమను తొమ్మిదవ చికిత్సాభేదము. విషచికిత్స యందు చికిత్సాక్రమము వరుసగ జెప్పియుండలేదు. కావున క్రమచికిత్స నవలంబించక విషప్రాబల్యమునుబట్టి సమయోచితచికిత్సను జేయదగునని యెరుంగునది.)

### సర్పవిషమునకు ప్రతిసారణచికిత్స, శీతప్రసేకము.

మూ. త్రికటుగృహధూమరజనీపఞ్చలవణరోచనాః (చోరకాః) సవా
ర్తాకాః, ఘర్షణమతిప్రవృత్తే వటాదిభిశ్శీతలైర్లేపః. 41
రక్తం హి విషాధానం వాయురివాగ్నేః ప్రదేహసేకైస్తత్,
శీతైః స్కన్దతి తస్మిన్ స్కన్నే వ్యపయాతి విషవేగః. 42
విషవేగాన్మదమూర్ఛావిషాదహృదయద్రవాః ప్రవర్తన్తే,
శీతైర్నివర్తయేత్తాన్ వీజ్యశ్చాఽఽలోమహర్షాత్స్యాత్. 43

వ్యా. త్రికటుకములు, కరిదూపము, పసుపు, పంచలవణములు, గోరోచనము, వంగ, వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి పాము మొదలగునవి కరచిన కాటుపై నునిచి రుద్దవలెను. దీనివలన రక్తము వెడలి విషము నివర్తించును. (ఇది ప్రతిసారరూపమయిన ఇరువదియవ చికిత్సాభేదము.) మరియు విషము రక్తముతో కలసి శరీరమునం దెల్ల తీవ్రముగ వ్యాపింపనున్నయెడ మఱ్ఱిపట్ట మున్నగు శీతలద్రవ్యములచే పట్టువేయవలయును.

శరీరమునందలి రక్తము గాలి యగ్నిని వ్యాపింపజేయువిధముగ విషమును శరీరమునందెల్ల తీవ్రముగ వ్యాపింపజేయును. విషమునకు సాయపడు రక్తము ప్రలేపనము

చల్లనినీళ్లచే సేచనము, మున్నగు శీతోపచారములచేత గట్టబడి కదలకుండును. అయ్యది కదలకున్నప్పుడు విషంబును శరీరమున వ్యాపింపనేరదు. (కావున పైజెప్పిన ప్రలేపాదుల చేయవలయునని యర్థము.) విషవేగమువలన మదము, మూర్ఛ, మనస్సు, క్లేశము, హృదయద్రవంబును (హృదయమున బాధ) కలుగు. అట్టియెడ శీతోపచారములచేత పైజెప్పిన యుపద్రవములను గల్గనియ్యక నివర్తింపదగును. మరియు రోమహర్షము కల్గునంతవరకు వీవనలచే గాలి సోకునట్లు విసరవలయును.

ఇచ్చట “ప్రఘర్షణ” మన ప్రతిసారణమని యర్థము. ప్రతిసారణవిధానము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—“లవణైః కటుచూర్ణైశ్చ ఘృష్యతే యద్వ్రిణం బుధైః, ప్రతిసారః తతః ప్రోక్తః” చూర్ణాదులచే కాటు మున్నగు వ్రణములపై రుద్దుట ప్రతిసారణమని యర్థము. మరియు సర్వవిషహారములలో రక్తమోక్షణము ముఖ్యమని సుశ్రుతాచార్యు లిట్లు చెప్పెను:—“సమన్తతస్సిరాదంశాత్ విధ్యేత్తు కుశలో భిషక్, శాఖాగ్రే వా లలాటేవా వేధ్యాస్తా విసృతే విషే, రక్తే నిర్హ్రియమాణే తు కృత్స్నం నిర్హ్రియతే విషమ్, తస్మాత్ విస్రావయేద్రక్తం సా హ్యాస్య పరమా క్రియా.” (సు.కల్ప.అ.౫) విషము శరీరమునందెల్ల వ్యాపించియున్నతరి, కాటునకు నల్గెడల వ్యాపించియున్నపుడు రక్తవాహినులగు సిరలను వేధించవలయును. లేక కాళ్లు చేతులు మున్నగు శాఖలయొక్క అగ్రభాగమునందైనను, నుదుటియందైనను సిరలను వేధించి (గ్రుచ్చి) రక్తమును స్రవింపచేయవలయును. రక్తము స్రవించినయెడల దాని సాహాయ్యమున వ్యాపించువిషమంతయు నారక్తముతోగూడ నిశ్శేషముగ వెడలిపోవును. కావున విషము శరీరమున తీవ్రముగ వ్యాపించి యున్నపుడు రక్తమోక్షణమే యుక్తమయిన చికిత్స యని భావము.

### ఛేదనాదిచికిత్సలచే విషము నివర్తించువిధము.

మూ. తరురివ మూలచ్ఛేదాద్దంశచ్ఛేదాన్న వృద్ధిమేతి విషం,
ఆచూషణమానయనం, జలస్య సేతుర్యథా తథాఽరిష్టాః. 44
త్వఙ్మాంసగతం దాహో దహతి విషం, స్రావణం హరతి రక్తాత్.
పీతం వమనైస్సద్యో హరేద్విరేకైః;

వ్యా. పాము కరిచిన వెంటనే కాటున ఛ్చేదించి విడదీసినయెడ (వృక్షము వ్రేళ్లను ఛేదించినప్పుడు మొదలంట నెండువిధముగ) విషము వ్యాపింపకయే నిశ్శేషమగును. మరియు విషమును నోటితో పీల్చినయెడ విషమంతయు బైటవెడలును. పైజెప్పిన మంత్రపూర్వకముగ నరిష్టబంధనము చేసినయెడ విషము శరీరమున వ్యాపించక

(పారుచుండు జలము అడ్డముగ కట్ట కట్టుటచే నిలబడు భంగి) కట్టుబడి కాటుననే హరించును. నిప్పుచే కాటున కాల్చినయెడ చర్మమునను మాంసమునను చేరిన విషమును దహించి నిశ్శేషముగ జేయును. రక్తమును (సిరావ్యధనముచే) వెడలించినయెడ రక్తమున చేరియుండు విషమును హరించును. మరియు విషమును పానము జేసినయెడ అట్టి విషమును తొలుతనే వమనవిరేచనములచే వెడలించవలెను.

## విషమునకు ద్వితీయవేగమునందు చేయదగిన చికిత్స.

మూ. ద్వితీయే తు. 45

ఆదౌ హృదయం రక్ష్యం తస్యావరణం పిబేద్యథాలాభం,
మధుసర్పిర్మజ్జపయో (మజ్జానం) గైరికమథ గోమయరసం వా.46
ఇక్షుం సుపక్వమథ వా (దక్షం సపక్షమథ వా) కాకం నిష్పీడ్య
తద్రసంవరణం,ఛాగాదీనాం వాఽసృక్ భస్మమృదం వా పిబేదాశు.

వ్యా. విషముయొక్క రెండవవేగమున చికిత్సల కన్నిటికి ముందుగ హృదయమును కాపాడవలెను. హృదయమున విషముచే బాధ కల్గకుండుటకై యీ క్రింద చెప్పబడు హృదయావరణౌషధయోగములలో దొరికిన యౌషధము నెద్దానినైన త్రాగవలెను:—తేనె, నెయ్యి, మజ్జ (మూలగ), ఆవుపాలు, గైరికము (కావిరాయి), వీని నొకటిగ జేర్చి యైనను, ఆవుపేడరసమునైనను, పక్వము చేయబడిన చెరకురసముతోనైనను, కాకిని కాల్చి దానిమాంసరసమును పిండి దానితోనైనను, మేకపోతు మున్నగువాని రక్తముతోనైనను, నల్లనిపుట్టమట్టిని బూడిదెను కలిపి త్రాగింపవలెను. (ఇది హృదయమునకు బలము నిచ్చి కాపాడు ఔషధయోగములు. ఈవిషయమును సుశ్రుతు లిట్లు చెప్పిరి:—"పాయయేతాఽగదాంస్తాంస్తాన్ క్షీరక్షౌద్రఘృతాదిభిః,తదలాభే హితావా స్యాత్ కృష్ణా వల్మీకమృత్తికా." (సు. కల్ప. అ. ౫) ఈవాక్యముచేత విషహరములగు నౌషధములను క్షీరాదిద్రవములలో కలిపి త్రాగవలెననియు, ఔషధములు లేనియెడ నల్లని పుట్టమట్టిని కలిపి త్రాగవలెననియు తెలిసెడి.)

## విషముయొక్క తృతీయాదివేగములకు చికిత్స.

మూ. క్షౌరోఽగదస్తృతీయే శోఫహరైర్లేఖనైః (శోథహరైశ్ఛర్దనం)
సమధ్వమ్బు, గోమయరసశ్చతుర్థే వేగే సకపిత్థమధుసర్పిః. 48
కాకాణ్డశిరీషాభ్యాం స్వరసేనాశ్చ్యోతనాఞ్జనే నస్యం,

స్యాత్ పఞ్చమేఽథ షష్ఠే సంజ్ఞాయాః స్థాపనం కార్యమ్. 49
గోపిత్తయుతా రజనీ మఞ్జిష్ఠామరిచపిప్పలీపానం,
విషపానం దష్టానాం, విషపీతే దంశనం చాన్తే. 50

వ్యా. విషముయొక్క మూడవవేగమున క్రింద జెప్పబడు క్షారాగదము నుపయోగింపనగును. శోఫమును హరించునవియు వమనకరంబులును నగు నౌషధములతో కొంచెము తేనెను కలిపి త్రాగించి వమనమును చేయించవలెను. నాల్గవవేగమున ఆవుపేడరసమున వెలగపండురసమును తేనెను నేతిని కలిపి త్రాగించవలెను. ఐదవవేగమున కాకాండమను శింబీధాన్యవిశేషమును దిరిసెనపుగింజలను జేర్చి స్వరసము జేసి యాస్వరసముచేత ఆశ్చ్యోతనమును అంజనమును నస్యమును చేయనగును. ఆరవవేగమున గోరోచనమును పసుపును చేర్చి స్వరసము చేసి శరీరముపై ప్రజ్ఞ దప్పకుండుటకై యాశ్చ్యోతనమును అంజనము నస్యమును చేయవలెను. మరియు మంజిష్ఠి, మిరియాలు, పిప్పళ్లు, ఈమూడింటిని స్వరసముచేసి త్రాగించవలెను. (ఐదు-ఆరు వేగములయందు ప్రజ్ఞ తప్పి మైకము గ్రమ్మును కావున నారెండువేగములయందును కాకాండశిరీషస్వరము మున్నగువానిచే నాశ్చ్యోతన-అంజన-నస్యముల చేసియు, మంజిష్ఠాదిస్వరసమును త్రాగించియు చికిత్స జేసినయెడ మైకము గ్రమ్మదని భావము. ఇది సంజ్ఞాస్థాపనరూపమైన యిరువదిరెండవచికిత్స.)

మరియు విషము కడపటి ధాతువున వ్యాపించుటచే కల్గిన యేడవవేగమున పాము కరచినవానికి (స్థావరరూపమైన) విషమును త్రాగించవలెను. విషమును త్రాగినవానికి సప్తమవేగమున పామును కరిపించవలెను. (ఇది ప్రతివిషప్రయోగరూపమైన యిరువదియొకటవ చికిత్స. ఈచికిత్సనే "జఙ్గమం స్యాదధోభాగం ఊర్ధ్వభాగం తు మూలజమ్, తస్మాద్దంష్ట్రావిషం మౌలం, హన్తి మౌలం చ దంష్ట్రజమ్." (శ్లో. ౧౭) అను వాక్యముచే సహేతుకముగ జెప్పిరి. మరియు విషము ఇంకొకవిషముతో సమానగుణవీర్యముగ నున్నను స్థావరవిషము జంగమవిషమును హరించుటయు, జంగమవిషము స్థావరవిషమును హరించుటయు విషనిష్ఠప్రభావముచే సంభవించునని యెరుంగునది. ఈవిషయమును సుశ్రుతాచార్యులు "విషం విషఘ్నముక్తం యత్ ప్రభావస్తత్ర కారణమ్," అనువాక్యముచే స్ఫుటముగ దెలిపిరి.)

ఇచ్చట ఆశ్చ్యోతనమన—కషాయము, తేనె, ఆసవము, స్నేహద్రవ్యములు మున్నగుద్రవములను కన్నుల దెరచి కంటినడుమ మూడంగుళములయెత్తునుండి బొట్టుగ విడుచుట యని యెరుంగునది. ఈవిషయము తంత్రాంతరమున నిట్లున్నది—"ఉన్మీలి

తేఽక్ణి దృఙ్మధ్యే బిన్దుభిః ద్వ్యఙ్గుళాద్ధితమ్, క్వాథక్షౌద్రాసవస్నేహబిన్దూనాం యత్తు పాతనమ్. యద్వ్యఙ్గుళోన్మితే నేత్రే ప్రోక్తమాశ్చ్యోతనం హి తత్." (పరిభాష). క్షారాగదము—"తరుణపలాశక్షారం......సముపయుక్తాః" (శ్లో. ౧౦౧-౧౦౪) అనువాక్యముచే క్రింద చెప్పబడును.

## విషముయొక్క యెనిమిదవ వేగమున మృతసంజీవనయోగములు.

మూ. శిఖిపిత్తార్ధయుతం స్యాత్ పలాశబీజమగదో మృతేషు వరః,
వార్తాకుఫాణితాఽగారధూమగోపిత్తనిమ్బం వా. 51
గోపిత్తయుతైర్గులికాః సురసాగ్రన్థిద్విరజనీమధుకుష్ఠైః,
(సురసోగ్రాద్విరజనీమధుకుష్ఠైః.)
శస్తాఽమృతేన తుల్యాః శిరీషపుష్పకాకాణ్డకరసైర్వా. 52
కాకాణ్డసురసగవాక్షీపునర్నవావాయసీశిరీషఫలైః,
ఉద్బన్ధనవిషజలమృతే లేపౌషధినస్యపానాని. 53
(లేపాఞ్జననస్యపానాని.)

వ్యా. (విషము పైజెప్పినరీతిగ రసాదిసప్త ధాతువులయందును వరుసగ నొక్కొక ధాతువునందు వ్యాపించుచు నొక్కొకవేగమును జూపును. ఈయేడువిధములగు వేగములకు వరుసగ చికిత్స పైగ్రంథముచే జెప్పబడినది. అష్టమవేగమున విషము స్థావరమైనచో హృదయమునందును, జంగమమైనచో కాటునందును జేరి తుదకు మరణము నొందించును. (ఈవిషయము "అష్టమే మరణమ్" (శ్లో. ౨౦) అని చెప్పబడినది) అట్టి విషవేగమున జేయదగిన మృతసంజీవన (చచ్చినవాని బ్రతికించు) ఔషధయోగములీక్రింద చెప్పబడును.)

ఎనిమిదవ విషవేగమున మృతునిబోలె చేష్టల దక్కియుండునపుడు నెమలిపిత్తము నొకభాగమును, దానికి సగపాలు మోదుగవిత్తనమును కలిపినూరి యుపయోగించవలెను. మరియు వంగవిత్తనములు, అర్ధపాకముగ కాచబడినచెరకురసము, కరిదూపము, గోరోచనము, వేపపట్టు, వీనిని జేర్చి నూరి గుళికలు చేసి యుపయోగింపనగును. లేక గోరోచనము, తులసి, మోడి, పసుపు, మ్రానిపసుపు, చెంగల్వకోష్టు, వీనిని గోపిత్త (గోరోచన) రసముతోనైనను, దిరిసెనపుపువ్వులరసముచేనైనను పెద్దవేప (లేక కాకిదొండ) రసముచేనైనను, నూరి మాత్రలుచేసి యుపయోగించవలెను. లేక కాకిదొండ; తులసి,

పెద్దపాపర (చేదుపుచ్చ), గలిజేరు, కాచియాకు, దిరిసెనపువిత్తనము వీనిని సమభాగములుగ గూర్చియైన నుపయోగించవలెను. పైజెప్పిన యోగములను ఉద్బంధనము (ఉరి వేసికొనుట)చేనైనను, విషముచేనైనను, జలముచేనైనను బాధపడిచచ్చుటకు సిద్ధముగ నున్నపుడు (అట్టివారికి ప్రాణాంతపరిస్థితియందు) లేపములకును, శిరస్సున కాటుచేసి దాని మూలమున నుపయోగించుటకును, నస్యమునకును, (అంజనమునకును) పానమునకును సమయోచితముగ నుపయోగింపవగును. ఇవి యమృతమును బోలె ప్రాణదాయకముగ నుండును. (ఇది మృతసంజీవనమను నిరువదినాల్గవ చికిత్స).

ఇచ్చట 'ఉపధి' యన నుపధానము. ఇయ్యది చికిత్సాపరిగణనమున "మన్త్రారిష్ట......విరేకోపధానాని" (శ్లో. 39) అని పదిరెండవ చికిత్సగ చెప్పబడినది. శిరస్సున కాకపాదమువలె శస్త్రముచే చీల్చి యౌషధమునిడుటయే యుపధి, ఉపధానమనబడును. ఈవిధానమును సుశ్రుతు లిట్లు చెప్పిరి:—"తీక్ష్ణశస్త్రేణ మూర్ధని. కుర్యా త్కాకపదం చర్మ సాసృగ్వా పిశితం క్షిపేత్." (సు. కల్ప. అ. 5.) మరియు తంత్రాంతరమునను "బ్రహ్మద్వారవికీర్ణలోహితలవే గుఞ్జైకమాత్రం దదేత్" అని యీవిధానము చెప్పబడినది. [ఈనవనాగరకకాలమున నాంగ్లేయచికిత్సావిధానమునను అతిప్రాచీనమగు నీపద్ధతి నవలంబించి శలాకములు మున్నగుసాధనముల మూలమున నౌషధమును రక్తమున ప్రవేశింపజేసి చికిత్సజేసెదరు. దీనిని "ఇజ్ జక్షన్" అని చెప్పెదరు. ఈవిధానము స్మృతితప్పి ఔషధప్రయోగమునకు అవకాశము లేక కుట్టాపిరితో నుండుపరిస్థితియందు ఔషధప్రయోగమునకు చాల సులభోపాయము.)

విషహరమృతసంజీవనయోగము.

మూ. స్పృక్కాప్లవస్థౌణేయకాంతీ శైలేయరోచనాతగరం,
ధ్యామకకుఙ్కుమమాంసీసురసాఽగ్రేలాలకుష్ఠఘ్నమ్. 54
బృహతీ శిరీషపుష్పం శ్రీవేష్టకపద్మచారటివిశాలాః,
సురదారుపద్మకేసరసావరకమనశ్శిలాకౌన్తర్యః. 55
జాత్యర్కపుష్పరసరజనీద్వయహిఙ్గుపిప్పలీలాక్షాః,
జలముద్గపర్ణి చన్దనమధుకమదనసిన్ధువారాశ్చ. 56
శమ్పాకలోధ్రమయూరకగన్ధఫలానాకులీవిడఙ్గాశ్చ,
పుష్యే సంహృత్య సమం పిష్ట్వా గులికాః విధేయాస్స్యుః 57
సర్వవిషఘ్నో జయకృత్ విషమృతసఞ్జీవనో జ్వరనిహన్తా,
ఘ్రేయవిలేపనధారణధూమగ్రహణైః గృహస్థశ్చ. 58

భూతవిషజన్త్వలక్ష్మీకార్మణమన్త్రాగ్న్యశన్యరీన్ హన్యాత్,
దుస్స్వప్నస్త్రీదోషాసకాలమరణామ్బుచౌరభయమ్. 59
ధనధాన్యకార్యసిద్ధిః శ్రీపుష్ట్యాయుర్వివర్ధనో ధన్యః,
మృతసఞ్జీవన ఏషః ప్రాగమృతాత్ బ్రహ్మణా విహితః. 60
(ఇతి మృతసఞ్జీవనోఽగదః)

వ్యా. స్పృక్క-యను గంధద్రవ్యము, నాగముస్తలు, స్థౌణేయకమను గంధద్రవ్యము (మాచిపత్రి, పచ్చాకు), కాంక్షి (సౌరాష్ట్రమృత్తిక), రాతిపువ్వు, గోరోచనము, గ్రంథితగరము, కామంచిగడ్డి, కుంకుమపువ్వు, జటామాంసి, తులసిదళములు, ఏలకులు, హరిదళము, చంద్రచేవ, ములక, దిరిసెనపువ్వులు. శ్రీవేష్టము (దేవదారు బంకతో చేయబడిన ధూపద్రవ్యము), పద్మకము (పద్మకాష్ఠము), చారటి (కాశ్మీరదేశపు తామర), ఏటిపుచ్చకాయ, దేవదారుచెక్క- తామరపువ్వులలోని కేసరములు, తెల్ల లొద్దుగు, మణిశిల, రేణుకలు, జాజిపువ్వులు, జిల్లేడుపువ్వులు, (ఈరెండు పుష్పముల రసము), పసుపు, మ్రానిపసుపు, ఇంగువ, పిప్పళ్లు, లక్క-, కురువేరు, అడవిపెసర, శ్రీగంధము, అతిమధురము, మ్రంగకాయ, వావిలి, రేలజిగురు, లొద్దుక, ఉష్ట్రరేణి, ప్రేంకణము, సన్నరాష్ట్రము, వాయువిడంగములు, వీని నన్నిటిని పుష్యనక్షత్రమునాడు సమభాగములుగ గ్రహించి యన్నిటి నొకటిగ గూర్చి నూరి గుళికలుగ జేయవలెను. ఇది మృతసంజీవనగుటిక లనబడును.

ఈగుటికల నుపయోగించినయెడ విషముల నన్నింటిని హరించును. జయమును కల్గించును. విషముచే జచ్చినవారిని బ్రతికించును. జ్వరముల హరించును. దీనిని ఆఘ్రాణించుటకును, శరీరముపై బూయుటకును, శరీరమున ధరించుటకును, ధూమమును గ్రహించుటకును, ఇంటిలో నుంచుటకును ఉపయోగింపనగును. అట్టియుపయోగమువలన భూతంబులును, విషజంతువులును, అలక్ష్మియు, కార్మణంబును (ఇతరుల కాపత్తు కల్గుటకై చేయబడు మంత్రప్రయోగము) అభిచారికమంత్రప్రయోగాదిభయంబును, అగ్నిభయంబును, అశని (పిడుగు) భయంబును, దుస్స్వప్నదోషంబును, స్త్రీలచే ప్రయోగింపబడు గరవిషమున గల్గిన దోషంబులును, అకాలమరణంబును, నీటిభయంబును, చోరభయంబును, వీని నన్నిటిని హరించును. ధనధాన్యసమృద్ధి కల్గి, సంపత్తును ఆయువును, శరీరపుష్టియు నానాట వృద్ధినొందియుండును. ఈమృతవనయోగము అమృతము ప్రాదుర్భవించుటకుమునుపు (అట్టియమృతమువలన కల్గు సుగుణముల నొందుటకై) బ్రహ్మచే

నిర్ణయింపబడినది. (ఇట్లు చెప్పుటచేత నియ్యది యమృతమును బోలె లోకోత్తరగుణముల కల్గియుండునని భావము.)

విషమున దోషహరచికిత్స.

మూ. మంత్రైరథమనీబన్ధోఽవమార్జనం కార్యమాత్మరక్షా చ,
దోషస్య విషం యస్య స్థానే స్యాత్తం జయేత్పూర్వమ్ 61

వ్యా. పాము మున్నగు విషజంతువులు కరిచినవెంటనే పట్టుగుడ్డపేలిక మున్నగు వానిని మంత్రములచే నభిమంత్రించి (పైజెప్పిన యరిష్టబంధనవిధిప్రకారము) కాటునకు పైభాగమున ధమనులను బిగియకట్టవలెను. ఇది అవమార్జనము (విషమును ధమనులనుండి పైకి వ్యాపింపనీయక యనులోమముగ హరింపజేయుపద్ధతి) దీనిని మంత్రములచేతనే చేయవలెను. అట్టిమంత్రములచేతనే భూతాద్యావేశము లేకుండునట్లు ఆత్మరక్షయు చేయదగును. పిమ్మట విషము ఏదోషముయొక్క స్థానమున జేరునో ఆస్థానమునకు సంబంధించిన దోషమును శమింపచేయనగును.

వాతాదిస్థానగతవిషచికిత్స.

మూ వాతస్థానే స్వేదో దధ్నా నతకుష్ఠకల్కపానం చ,
ఘృతమధుపయోఽమ్బుపానాఽవగాహసేకాశ్చ పిత్తస్థే. 62
క్షారోఽగదః కఫస్థానగతే స్వేదస్తథా సిరావ్యధనం,

వ్యా. విషము వాతమునకు స్థానములగు పక్వాశయాది స్థానముల జేరినయెడ విధ్యుక్తప్రకారము స్వేదనము చేయనగును. గంధితగరమును చెంగల్వకోష్టును కల్కము జేసి పెరుగులో కలిపి త్రాగించవలెను. విషము పిత్తస్థానమున జేరినయెడ ఘృతమును తేనెను జలమును త్రాగించవలెను. అవగాహనమును పరిషేకమును చేయనగును. కఫస్థానమున జేరినయెడ క్రింద "తరుణపలాశక్షారం" అని యుపక్రమించి చెప్పబడు క్షారాగదము నుపయోగించి స్వేదవిధియు సిరావ్యధనంబును చేయనగును.

స్వేదాధ్యాయమున "కషాయమద్యనిత్యానాం...విషమద్యవికారిణామ్,......న స్వేదమవతారయేత్" (సూ. అ. ౧౪ శ్లో. ౧౬-౧౭) అనువాక్యముచేత విషమున స్వేదవిధి నిషిద్ధము. అయినను. అవస్థావిశేషమునుబట్టి యిచ్చట విశేషవిధిగ జెప్పబడినదని యెరుంగునది. మరియు నిరువదినాల్గు విషచికిత్సాభేదములలో స్వేదవిధి ప్రత్యేకముగ పరిగణనము చేయకున్నను అగ్నికర్మభేదముచేతనే సంగ్రహింపబడినదని యెరుంగునది. ఇత్తెరంగుననే ఉపశమనశబ్దముచేత పేయ మున్నగు భోజనాదివిధియు సంగ్రహింపబడినది కావున పరిగణనము చేయకుండుట ప్రత్యవాయకరము కాదు.

### రక్తగతదూషీవిషచికిత్స.

మూ. దూషీవిషేఽథ రక్తస్థితే సిరాకర్మ పఞ్చవిధమ్. 63
భేషజమేవం కల్ప్యం భిషగ్విదాఽఽలక్ష్య సర్వదా సర్వం,
స్థానం జయేద్ధి పూర్వం స్థానస్థస్యాఽవిరుద్ధం చ. 64

వ్యా. దూషీవిషము రక్తమున జేరినపుడు సిరావ్యధనంబును, వమన-విరేచనాది పంచవిధశోధనకర్మంబులును చేయదగును. వైద్యవేత్తయగు పండితుడు ఎల్లెడలను దోషస్థానముల చక్కగ గమనించి దోషస్థానానుగుణముగ నౌషధమును ఆయాదోషస్థానముగ జేరినవిషమునకు విరోధము కల్గనీయక కల్పించి, ఆయాస్థానమునకు సంబంధించిన దోషమును తొలుత హరింపజేయవలెను.

### విషహరమగు ఉపధానమనుచికిత్స.

మూ. విషదూషితవిషమార్గః స్రోతస్సంరోధరుద్ధవాయుస్తు,
మృత ఇవ శ్వసేన్మర్త్యః స్యాదసాధ్యలిఙ్గైర్విహీనశ్చ. 65
చర్మకషాయాః కల్కం బిల్వసమం మూర్ధ్ని కాకపదమస్య,
కృత్వా దద్యాత్కటభీకటుకట్ఫలప్రధమనం చ. 66
ఛాగం గవ్యం మాహిషం వా మాంసం కౌక్కుటమేవ వా,
దద్యాత్కాకపదే తస్మిన్ తతస్సఙ్క్రమతే విషమ్. 67
(ఛాగగవ్యమాహిషావికకౌక్కుటాబ్జమాంసాని,
దద్యాత్కాకపదోపరి మత్తే విషేణైవ చ సహసా.)

వ్యా. కఫమార్గములు విషముచే చెడి దానంజేసి స్రోతోమార్గములయందు వాతము సంచరించనీయక యడ్డుపరిచినయెడ మనుజుడు చచ్చినవానివలె శ్వాసమును విడచుచు పెదిమెలు నల్లబడుట మున్నగు (ముందు చెప్పబడిన) నసాధ్యలక్షణములు లేకుండినచో, వానియొక్క శిరస్సున కాకిపాదమువంటి యాకారముగ కాటుబెట్టి పుండుచేసి, అందు సంబరేణుకల్కము నొకపలము నునిచి, మెరపుతీగె (మాల్కంగిని), త్రికటుకములు, కాయఫలము, వీనిని చూర్ణముచేసి ప్రథమమున నస్యమును చేయవలెను. (ఈచికిత్సచే మైకము నివర్తించును).

పిమ్మట రక్తము కారుచుండు మేకపోతుమాంసమునైనను, జింకమాంసమునైనను, ఎద్దుమాంసమునైనను, ఎనుబోతుమాంసమునైనను, కోడిమాంసమునైనను, శిరమునందలి

కాకపదాకారమైన వ్రణమున బెట్టినచో శరీరమునందు వ్యాపించిన విషము ఆమాంశ మున సంక్రమించును. (ఇది ఉపధానమను పదిరెండవ చికిత్సాభేదము.) ఈచికిత్సను సుశ్రుతు లిట్లు చెప్పిరి:—"తీక్ష్ణశస్త్రేణ మూర్ధ్ని చ, కుర్యాత్కాకపదం చర్మ సాసృగ్వా పిశితం క్షిపేత్" (సు. కల్ప. అ. ౪).

ఇచ్చట ప్రధమనమన నస్యభేదము. దీనిలక్షణము తంత్రాంతరమున నిట్లు చెప్పబడి నది:—"షడఙ్గులౌద్విపక్త్రాయా నాడీచూర్ణం తయా ధమేత్, తీక్ష్ణం కోలమితం వక్త్రవాతైః ప్రధమనం హి తత్" ఆరంగుళములనిడుపును రెండుప్రక్కల నిడుపుగ రంధ్రమును కల బొంగువెదురు మున్నగు గొట్టమున తీక్ష్ణమగు నౌషధచూర్ణము నర్ధకర్షప్రమాణము నునిచి నోటితో నూది నాసారంధ్రములలో నెక్కించుట ప్రధమననస్యమని యర్థము.

## విషమునం దవస్థాభేదముచే నస్యవిధి.

మూ. నాసాక్షికర్ణజిహ్వాకణ్ఠనిరోధేషు కర్మ నస్తస్స్యాత్,
వార్తాకుబీజపూరజ్యోతిష్మత్యాదిభిః పిష్టైః. 68

వ్యా. నాసారంధ్రంబులును, కన్నులును, చెవులును, నాలుకయు, కంఠంబును నిరోధింపబడి స్తంభించి యున్నయెడ వాకుడువిత్తులు, మాదీఫలములచెక్కలు, జ్యోతిష్మతి (మాల్కంగిని), మున్నగు నస్యద్రవ్యములను చూర్ణముచేసి నస్యమును చేయవలెను.

ఇచ్చట షడ్విరేచనశతాశ్రితీయాధ్యాయమున "జ్యోతిష్మతి" క్షవక...ఇతి దశేమాని శిరోవిరేచనోపగమాని భవన్తి" (సూ. అ. ౪) అను వాక్యముచే జెప్పబడిన శిరోవిరేచనగణమును గ్రహించునది.

## దేవదార్వాద్యంజనము.

మూ. అఞ్జనమక్ష్ణ్యుపరోధే కర్తవ్యం బస్తమూత్రపిష్టైస్తు,
దారువ్యోషహరిద్రాకరవీరకరఞ్జనిమ్బసురసైస్తు. 69

వ్యా. కన్నులు కానరాకున్నయెడ దేవదారుచెక్క, త్రికటుకములు, పసుపు, గన్నేరు, కానుక, వేము, తులసి వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి గొఱ్ఱెలమూత్రమున నూరి కన్నులలో కలికముచేయవలెను. (ఈయంజనముచేత స్మృతి తప్పియున్న వానికి ప్రజ్ఞ కలుగును).

## విషమునకు గంధహస్తియను నగదౌషధము.

మూ. శ్వేతా వచాఽశ్వగన్ధాహిఙ్గ్వమృతాకుష్ఠసైన్ధవే లశునం,
సర్షపకపిత్థమధ్యం టుంటుకమూల కరఞ్జబీజాని. 70

వ్యోషం శిరీషపుష్పం ద్విరజన్యౌ వంశలోచనఞ్చ సమం,
పిష్ట్వాజస్య మూత్రేణ గోఽశ్వపిత్తేన సప్తాహమ్. 71
వ్యత్యాసభావితోఽయం నిహన్తి శిరసిస్థితం విషం క్షిప్రం,

వ్యా. జ్యోతిష్మతి (ఎక్కుడుతీగ) వస, పెన్నేరుగడ్డ, ఇంగువ, తిప్పతీగ,చెంగల్వ కోష్టు, సైంధవలవణము, వెల్లుల్లి, ఆవాలు, వెలగకాయలోనిగుంజు, పెద్దమానిచెక్క, కానుగవిత్తులు, త్రికటుకములు, దిరిసెనముపువ్వులు, పసుపు, మ్రానిపసుపు, వెదురుప్పు వీని నన్నిటిని సమభాగములుగ చేర్చి మేకపంచితము చేర్చి నూరి యాపిష్టము నొకదినమున గోరోచనరసమునందును, మరుసటిదినము గుఱ్ఱపుపిత్తరసమునందును భావనచేయునది. ఇత్తెరంగున గోరోచనమునందును, అశ్వపిత్తమునందును, మార్చిమార్చి భావన చేయుచు నేడుదినములవరకు భావన చేయవలయును. ఈయౌషధము కండ్లకు కలికము వేసిన తలకెక్కియుండు విషమును నతిశీఘ్రముగ హరించును. (ఈయౌషధమును మాత్రలుగ సిద్ధముచేయనగును).

### గంధహస్తిచే నివర్తించు రోగములు.

మూ. సర్వజ్వరభూతగ్రహవిషూచికాజీర్ణమూర్ఛార్తీః. 72
ఉన్మాదాపస్మారౌ కాచపటలనీలికాశిరోదోషాన్,
శుష్కాక్షిపాకపిల్లార్బుదార్మకణ్డూతమోదోషాన్. 73
క్షయదౌర్బల్యమదాత్యయపాణ్డుగదాంశ్చాఞ్జనాత్తథా మోహాన్
లేపాద్విషదిగ్ధక్షతలీఢదష్టపీతవిషఘాతీ. 74
అర్శస్స్వానద్ధేషు చ గుదలేపో యోనిలేపనం స్త్రీణాం,
మూఢే గర్భే దుష్టే లలాటలేపః ప్రతిశ్యాయే 75
వృద్ధౌ (దద్రౌ) కిటిభే కుష్ఠే శ్విత్రవిచర్చికాదిషు లేపః,
గజ ఇవ తరూన్ విషగదాన్నిహన్త్యగదగన్ధహస్త్యేషః. 76
(ఇతి గన్ధహస్తినామాఽగదః.)

వ్యా. మరియు పైజెప్పినయౌషధము కంటికి అంజనము నుపయోగించినయెడ, సర్వజ్వరములు, భూతములు, గ్రహములు, విషూచీ, అజీర్ణము, మూర్ఛారోగము, ఉన్మాదము, అపస్మారము, అనునీరోగంబులును; కాచము, పటలము, నీలికా, శిరస్సునందలి దోషములు, శుష్కాక్షిపాకము, పిల్లము, నేత్రార్బుదము, అర్మము, కన్నులజిల; తమో

దోషము (రేజీకటి) అను నీనేత్రరోగంబులును; క్షయము, బలహీనము, మదాత్యయము, పాండురోగము, మోహము, (తెలివి తప్పుట) అను నీరోగంబులును; నివర్తించును.

మరియు నీయౌషధమును పూసినయెడ విషముతో కూడినబాణము మున్నగు నాయుధములచే కల్గిన గాయములును, విషజంతువులు నాకుటచేతను, కరచుటచేతను, కల్గిన విషంబును; త్రాగబడిన విషంబును నివర్తించును. అర్శస్సులు (గుదాంకురములు) స్తంభించియున్నపుడు ఈయౌషధమును చాది పూయవలయును. స్త్రీలకు మూఢగర్భ రోగమున యోనికి లేపనము చేయవలయును. విషపడిశము పట్టియున్నపుడు నుదుట పట్టువేయవలయును. దద్రుకుష్ఠమునందును, కిటిభకుష్ఠమునందును, శ్విత్రమునందును, విచర్చికా మున్నగు కుష్ఠములయందును, లేపనము చేయవలయును. పైజెప్పిన విధముగ ఆయావ్యాధికి తగినట్లు నీయౌషధము నుపయోగించినచో పైజెప్పిన విషరోగముల నన్నిటిని మదపుటేనుగు వృక్షములను వ్రేళ్లతో పెకలించువిధముగ నిర్మూలముచేయును. దానంజేసియే యీయౌషధము అగదగంధహస్తి యని చెప్పబడినది.

## మహాగంధహస్తియోగము.

మూ॥ పత్రాగురుముస్తైలా నిర్యాసాః పఞ్చ చన్దనం స్పృక్కా,
త్వఙ్నలదోత్పలవాలకహరేణుకోశీరవ్యాఘ్ర(వన్య) నఖాః. 77
సురదారుకనకకుఙ్కుమధ్యామకకుష్ఠప్రియఙ్గవస్తగరం,
పఞ్చాఙ్గాని శిరీషాత్ వ్యోషాలమనశ్శిలాఽజాజ్యః. 78
శ్వేతాకటభీ కరఞ్జౌరక్షోఘ్నీ సిన్ధువారికా రజనీ,
సురసరసాఞ్జనగైరికమఞ్జిష్ఠానిమ్బనిర్యాసాః. 79
వంశత్వగశ్వగన్ధా హిఙ్గు దధిత్థాఽమ్లవేతసం లాక్షా,
మధుమధుకసోమరాజీవచారుహరోచనాతగరమ్. 80
అగదోఽయం వైశ్రవణాయాఖ్యాతస్త్ర్యమ్బకేణ షట్త్ర్యఙ్గః,
అప్రతిహతప్రభావః ఖ్యాతో మహాగన్ధహస్తీతి. 81
పిత్తేన గవాం పేష్యా గులికాః కార్యాస్తు పుష్యయోగేణ,
పానాఞ్జనప్రలేపైః ప్రసాదయేత్సర్వకర్మాణి. 82

వ్యా॥ లవంగపుపత్రి, కృష్ణాగురు, తుంగగడ్డలు, ఏలకులు, పఞ్చనిర్యాసములు (ఐదువిధములయిన జిగుర్లు), మంచిగంధము, స్పృక్కయనెడి గంధద్రవ్యము, లవంగపు పట్ట, తెల్లవట్టివేళ్లు, నల్లకలువలు, కురువేరు, రేణుకలు, వట్టివేరు, వన్యనఖము (నఖపు

చిప్పలు అనుసుగంధద్రవ్యము), దేవదారుచెక్క, నాగకేసరములు, కుంకుమపువ్వు, కామంచిగడ్డి, చెంగల్వకోష్టు, ప్రేంకణము, గ్రంథితగరము, దిరిసెనపుచెట్టుయొక్క ఆకు, పట్ట, వేరు, కాయ, పువ్వులు, (ఇవి చేరి పంచాంగములు), త్రికటుకములు, హరిదళము, మణిశిల, జీలకర, తెల్లదింటెన, కానుగ, తెల్లావాలు, వావిలి, పసుపు, తులసి, రసాంజనము, గైరికము (కావిరాయి), మంజిష్ఠ, వేపబంక, తవక్షీరి, పెన్నేరుగడ్డ, ఇంగువ, వెలగపట్ట, అమ్లవేతసము (పుల్లప్రబ్బలి), లక్క, తేనె, అతిమధురము, బావంచివిత్తులు, వస, గరిక, గోరోచనము, తగరము (నందివర్ధనభేదము), ఈయరువదిద్రవ్యములను సమభాగములుగ గూర్చి గోరోచనరసముచేత నూరి పుష్యమీనక్షత్రమునాడు మాత్రలు చేసి యుంచుకొనునది. ఈయౌషధయోగము ఈశ్వరునిచేత కుబేరున కుపదేశింపబడినది. అరువదిద్రవ్యములతో కూడిన ఈయౌషధరాజమును పానమునకును, అంజనమునకును, ప్రలేపనమునకు నుపయోగించుచు చికిత్సాకృత్యము లన్నిటిని సాధింపగలడు.

(ఇచ్చట "పఞ్చ నిర్యాసాః" అనుచోట అత్తి, మఱ్ఱి, రావి, ప్రబ్బలి, జువ్వి, అను నీయైదిటియొక్క బంకయని యెరుంగునది.)

### మహాగంధహస్త్యుపయోగక్రమము.

మూ. పిల్లం కణ్డూం తిమిరం రాత్ర్యన్ధ్యం కాచమర్బుదం పటలం,
హన్తి సతతప్రయోగాత్ హితమితపథ్యాశినాం పుంసామ్. 83
విషమజ్వరానజీర్ణాన్ దద్రుం కణ్డూం విషూచికాం పామాం,
విషమూషికలూతానాం సర్వేషాం పన్నగానాం చ.
ఆశు విషం నాశయతి సమూలజమధకన్దజం సర్వమ్. 84
ఏతేన లిప్తగాత్రః సర్పాన్ గృహ్ణాతి భక్షయేచ్చ విషం,
కాలపరీతోఽపి నరో జీవతి నిత్యం నిరాతఙ్కః. 85
ఆనద్ధే గుదలేపః యోనౌ లేపశ్చ మూఢగర్భాణాం,
మూర్చ్ఛార్తిషు చ లలాటే ప్రలేపమాహుః ప్రధానతమమ్. 86
భేరీమృదఙ్గపటహాన్ ఛత్త్రాణ్యమునా తథా ధ్వజపతాకాః,
లిప్త్వాఽహివిషనిరస్యై ప్రధ్వనయేద్దర్శయేన్మతిమాన్. 87
యత్ర చ సన్నిహితోఽయం న తత్ర బాలగ్రహాః న రక్షాంసి,
న చ కార్మణవేతాలాః వహన్తి నాథర్వణా మన్త్రాః. 88

సర్వగ్రహా న తత్ర ప్రభవన్తి న చాగ్నిశస్త్రనృపచౌరాః,
లక్ష్మీశ్చ తత్ర భజతే యత్ర మహాగన్ధహస్త్యస్తి. 89

వ్యా. మరియు పైజెప్పిన యౌషధరాజమును నిరంతరముగ కన్నుల కంజనము నిడినచో పిల్లము, కంటిదురద, తిమిరము, రేజీకటి, కాచము, నేత్రార్బుదము, పటలము, అను నేత్రవ్యాధుల నన్నిటిని హరించును. దీని నుపయోగించునపుడు హితంబును మితంబును పత్థ్యకరంబు నైనయాహారమును భుజింపనగును. దీనిని పానాంజనాదిరూపముగ నుపయోగించినయెడ విషమజ్వరములను, అజీర్ణములను, దద్రుకుష్ఠమును, దురదను, విషూచిని, పామా (గజ్జి) కుష్ఠమును, విషముతోఁగూడిన మూషకములయొక్కయు సాలెపురుగులయొక్కయు పలుదెరంగులైన సర్పములయొక్కయు విషములను, మూలములయందును కందములయందునుం గల విషముల నన్నింటిని అతిశీఘ్రముగ హరించును.

మరియు నీయౌషధమును శరీరముపై బూసికొనినయెడ సర్పములను చేత పట్టుకొనగల్గును. విషమును తినగలడు. (దానివలన నపాయము గల్గదనుట). వానికి మృత్యుకాలము సన్నిహితమైయున్నను చాలకాలము జరావ్యాధివిముక్తుడై జీవించియుండును.

మరియు మలము బంధించి యున్నవానికి గుదస్థానమునను, మూఢగర్భము కల స్త్రీకి యోనిద్వారమునందును యీయౌషధమును పూయవలెను. మూర్ఛారోగములయందు నీయౌషధమును ముఖ్యముగ నుదుట పట్టువేయవలెను.

భేరి, మద్దలము, పటహము (తమ్మట), అనువాద్యములకును, యీయౌషధమును బూసి వాయించినను, గొడుగులకును ధ్వజములకును బూసి చూపించినను, సర్పవిషము నివర్తించును. ఈయౌషధమున్నస్థలమున బాలగ్రహంబులును, రాక్షసగ్రహంబులును చేరవు. కార్మణమంత్రతంత్రప్రయోగంబులును, భేతాళంబులును, అథర్వణమంత్రములచేనైన యాభిచారికప్రయోగంబులును ఈయౌషధమున్నచోట చేరవు. గ్రహబాధయు అగ్నిభయంబును శస్త్రాస్త్రభయంబును రాజభయంబును చోరభయంబును ఒకప్పుడు కల్గనేరదు. ఈమహాగంధహస్తియను మహౌషధమున్నచోట లక్ష్మి నిరంతరముగ నివసించును.

### మహాగంధహస్తిని సిద్ధముచేయుటకు మంత్రము.

మూ. పిష్యమాణ ఇమం చాత్ర సిద్ధం మన్త్రముదీరయేత్:—
"మమ మాతా జయా నామ జయో నామేతి మే పితా. 90
సోఽహం జయజయాపుత్రో విజయోఽథ జయామి చ,
నమః పురుషసింహాయ విష్ణవే విశ్వకర్మణే. 91

సనాతనాయ కృష్ణాయ భవాయ విభవాయ చ,
తేజో వృషాకపేస్సాక్షాత్ తేజో బ్రహ్మేన్ద్రయోర్యమే. 92
యథాహం నాఽభిజానామి వాసుదేవపరాజయం,
మాతుశ్చ పాణిగ్రహణం సముద్రస్య చ శోషణమ్. 93
అనేన సత్యవాక్యేన సిధ్యతామగదో హ్యయం,
"హిలిమిలిసంస్పృష్టే రక్ష సర్వభేషజోత్తమే స్వాహా" 94
(లిహిలిహి, మిలిమిలి, సంస్పృష్టేరక్షరక్షసర్వభేషజోత్తమేస్వాహా)
(ఇతి మహాగన్ధహస్తీ నామాఽగదః)

వ్యా. పైఁజెప్పిన మహాగంధహస్తియోగమున జెప్పబడిన యరువదిద్రవ్యములను ఒకటిగఁగూర్చి పుష్యనక్షత్రముతో గూడిన శుభదినమున చూర్ణముచేసి యాచూర్ణమును కల్వమున వేసి యందు గోరోచనరసమును బోసి "మమ మాతా...స్వాహా" అను మంత్రమును జపించుచు చక్కఁగ నూరి మాత్రలు చేసి యుంచుకొని పైఁజెప్పినవిధముగ నుపయోగించవలెను.

విషోపద్రవములచికిత్స, అందు శ్వాసజ్వరాదిహర ఋషభకాదిపానము.

మూ. ఋషభకజీవకభార్గీమధుకోత్పలధాన్యకేసరాజాజ్యః,
ససితగిరికోలమధ్యాః పేయాః శ్వాసజ్వరాదిహరాః 95

వ్యా. ఋషభకము, జీవకము, గంటుభారంగి, అతిమధురము, నల్లకలువలు, దనియాలు, నాగకేసరములు, జీలకర, తెల్లపువ్వులు పూచు విష్ణుక్రాంతము, రేగుపండ్లగుజ్జు వీని నన్నిటిని సమభాగములుగ జేర్చి నూరి త్రాగినయెడ విషప్రకోపమున గలిగిన శ్వాసము జ్వరము మున్నగు నుపద్రవముల హరించును. ఇచ్చట "సితగిరి" అనుపదమును "సితగిరిః=శ్వేతాపరాజిత" అని చక్రపాణిదత్త వ్యాఖ్యానములో నున్నది. తెల్ల పువ్వుల పూచు విష్ణుక్రాంతమని యర్థము.

హింగ్వాదిచూర్ణపానము.

మూ. హిఙ్గు చ కృష్ణాయుక్తం కపిత్థరసయుక్తమగ్ర్యలవణం చ,
సమధుసితౌ పాతవ్యౌ జ్వరహిక్కాశ్వాసకాసఘ్నౌ. 96

వ్యా. ఇంగువను, పిప్పళ్లను, చేర్చియైనను; సైంధవలవణమును, వెలగపండ్లరసమున గూర్చియైనను; తేనెను, పంచదారను గలిపి త్రాగినచో విషమువలన గలిగిన జ్వరమును హిక్కాశ్వాసమును, కాసమును హరించును,

### విషమున గల్గిన వమన-హిక్కలకు లేహ-ధూమపానములు.

మూ. లేహః కోలాస్థిమజ్జాంజనలాజోత్పలమధుఘృతైర్వమ్యామ్,
బృహతీద్వయాఢకీపత్రధూమవర్తిస్తు హిక్కాఘ్నీ. 97

వ్యా. రేగుపండ్లగింజలోనిపప్పు, రసాంజనము, వరిపేలాలు, నల్లకలువలు, వీని నన్నిటిని సమముగ గూర్చి నూరి తేనెను నేతిని గలిపి సేవించినయెడ విషమువలన కలిగిన వాంతి నివర్తించును. మఱియు వాకుడు, ములక, కందులు, లవంగపుపత్రి వీని నన్నిటిని చేర్చి నూరి విధ్యుక్తప్రకారము వర్తిని జేసి ధూమపానము చేసినయెడ యెక్కిళ్లను హరించును. ఇచ్చట ధూమవర్తివిధానము, స్థలాంతరమున చెప్పబడినదానిని చూచుకొనునది.

### విషహరధూపము.

మూ. శిఖిబర్హబలాకాస్థీని సర్షపాశ్చన్దనం చ ఘృతయుక్తం,
ధూమో గృహశయనాసనవస్త్రాదిషు శస్యతే విషనుత్. 98

వ్యా. నెమలిపింఛము, తెల్లకొక్కెరయొక్క యెముకలు, ఆవాలు, చందనము, వీని నన్నిటిని చేర్చి చూర్ణముచేసి నేతిలో కలిపి ధూమము వేసి యాపొగను, యింటి యందును, పడకలయందును, పీఠములయందును, వస్త్రములయందును వ్యాపింపచేసిన యెడ విషమును హరించును.

### సర్పవిషహరధూమాగదము.

మూ. ఘృతయుక్తైనతకుష్ఠే భుజగపతిశిరః శిరీషపుష్పైశ్చ,
ధూమోఽగదః స్మృతోఽయం సర్వవిషఘ్నః శ్వయథుహృచ్చ.

వ్యా. గ్రంథితగరము, చెంగల్వకోష్టు, రెండుశిరస్సులుగలసర్పముయొక్క శిరస్సు, దిరిసెనపుపువ్వు, వీని నన్నిటిని నొకటిగ జేర్చి నేతిలో కలిపి పొగపట్టినయెడ శూలలన్నిటిని, దాన కల్గు వాపును హరించును. ఇది ధూమాగదము.

### విషహరధూమము.

మూ. జతుసేవ్యపత్రగుగ్గులుభల్లాతకకకుభపుష్పసర్జరసాః,
శ్వేతా చ ధూమ ఉరగాఽఽఖుకీటవస్త్రక్రిమినుదగ్ర్యః. 100

వ్యా. లక్క, వట్టివేళ్లు, లవంగపత్రి, గుగ్గిలము, జీడిగింజలు, ఏరుమద్దిపువ్వులు, సర్జరసము (మద్దిపాలు), (లేక తెల్లగుగ్గిలము) తెల్లదింటెన వీనినన్నిటిని చూర్ణముచేసి

ధూపమువేసినయెడ పాములను, ఎలుకలను, సాలెపురుగులు మున్నగు విషపురుగులను గుడ్డలయందలి చీరపేలు మున్నగు క్రిములను హరించును. ఇది మిగుల శ్రేష్ఠమయిన ధూమము.

### విషహరక్షారాగదవటకములు.

మూ॥ తరుణపలాశక్షారం స్రుతం పచేచ్చూర్ణితైః సహ సమాంశైః,
లోహితమృద్రజనీద్వయశుక్లసరసమఞ్జరీమధుకైః. 101
లాక్షాసైన్ధవమాంసీహరేణుహిఙ్గుద్విసారిబాకుష్ఠైః,
సవ్యోషైర్బాహ్లీకైః దర్వీవిలేపనం ఘట్టయేద్యావత్. 102
సర్వవిషశోథగుల్మత్వగ్దోషార్శోభగన్దరప్లీహ్నః,
శోథాపస్మారక్రిమిభూతస్వరభేదపాండుగదాన్. 103
మన్దాగ్నిత్వం కాసం సోన్మాదం నాశయేయురథ పుంసాం,
గులికాశ్ఛాయాశుష్కాః కోలసమాస్తాః సముపయుక్తాః 104
(ఇతి క్షారాగదః.)

వ్యా॥ లేతమోదుగుచెట్టుపుల్లలకాల్చి బూడిదచేసి క్షారపాకవిధ్యుక్తప్రకారముగ క్షారోదకముచేసి పుచ్చుకొనునది. ఎఱ్ఱని కావిరాయిమట్టి, పసుపు, మ్రానిపసుపు, తెల్ల తులసియొక్క పువ్వుగొత్తులు, అతిమధురము, లక్క, సైంధవలవణము, జటామాంసి, రేణుకలు, ఇంగువ, సుగంధపాల, పెద్దసుగంధపాల (మామెనగొమ్ములు, చెంగల్వకోష్ఠు, త్రికటుకము, కుంకుమపువ్వు, వీని నన్నిటిని సమభాగములుగ కూర్చి చూర్ణముచేసి పైజెప్పినక్షారోదకమున చేర్చి పక్వముచేయునది. గరిటతో కలియపెట్టుచు పక్వము చేయునపుడు గరిటెకు ఔషధము నంటుకొనునంత కాలము వండి దించునది. ఆయౌషధమును రేగుపండునంతేసి గుళికలగ జేసి నీడన యెండించి యుపయోగించునది. ఇది క్షారాగదమని చెప్పబడును. దీని నుపయోగించుటవలన పలుతెరంగులైన విషములచే గల్గిన వాపులు, శోథలు, గుల్మములు, చర్మదోషముచే గల్గు గజ్జి మున్నగురోగములు, అర్శోరోగము, భగందరము, ప్లీహవృద్ధి, శోథము (నంజు), అపస్మారము, క్రిములు, భూతావేశము, కంఠస్వరభేదము, పాండురోగము, అగ్నిమాంద్యము, కాసము, ఉన్మాదము, అను నీవ్యాధుల నన్నిటిని నాశముచేయును.

మూ॥ విషపీతదష్టవిద్ధేష్వేతద్దిగ్ధే చ వాచ్యముద్దిష్టం,
సామాన్యతః; పృథక్త్వాన్నిర్దేశమతశ్శృణు యథావత్. 105

వ్యా. ఇంతదనుక విషపానమునకును, పాము మున్నగునవి కరచుటచే కల్గిన విషమునకును, విషముచే పూయబడిన బాణము మున్నగునవి గ్రుచ్చుకొనుటచే కల్గిన విషమునకును సంబంధించిన లక్షణంబులును, చికిత్సలును సామాన్యముగ చెప్పబడినవి. ఈ క్రింద అట్టి విషపీతాదులకు సంబంధించిన లక్షణములును, చికిత్సలును వేరువేరుగ నిర్దేశింపబడును.

### ఆహారాదిపరీక్షావశ్యకత.

మూ. రిపుయుక్తైర్భోజ్యే నృభ్యః స్వేభ్యః, స్త్రీభ్యోఽథ వాభయం నృపతేః,
ఆహారవిహారగతః తస్మాత్ప్రేష్యాన్పరీక్షేత. 106

వ్యా. పరిపాలించురాజునకు తనకు శత్రువుతో కూడిన భృత్యుడు మున్నగు మనుజులవలనను, స్త్రీలవలనను, ఆహారవిహారములకు సంబంధించిన ప్రాణభయము. కల్గును కావున తాను ఆహారవిహారముల నాచరించుటకు తనకు సేవకులుగా నుండు వంటవాడు మున్నగు వారిని తొలుత నీక్రింద జెప్పినవిధముగ పరీక్షించవలయును. (శత్రుపక్షమున జేరిన సేవకులును తమకు సౌభాగ్యమును గోరు స్త్రీలును రాజునకు అన్నపానములయందును, సాధనపదార్థములయందును విషమును కలిపి యుపయోగించెదరు, కావున సేవకులు మున్నగువారిని ఆహారాదులను క్రిందజెప్పబడులక్షణములచే గమనింపవలెనని భావము).

### విషము పెట్టినవానిలక్షణములు.

మూ. అత్యర్థశఙ్కితస్స్యాత్ బహువాగథవాఽల్పవాగ్విగతలక్ష్మీః,
ప్రాప్తః ప్రకృతివికారం విషప్రదాతా నరో జ్ఞేయః. 107

వ్యా. విషమును పెట్టిన మనుజుడు ఏపని జేయుటకును మిక్కిలి సందేహించును. సంబంధము లేక తనకిచ్చవచ్చినట్లు మాట్లాడును. లేక శంకతో గూడి జంకి కొద్దికొద్దిగ మాట్లాడును. వానిముఖ తేజస్సు ప్రకృతియును మారియుండును. ఈలక్షణములబట్టి విషము పెట్టినవానినిగ నరయునది.

### విషయుక్తాన్నపరీక్ష, దానిలక్షణము.

మూ. దృష్ట్వైవం న తు సహసా భోజ్యం కుర్యాత్తదన్న(గ్ర)మగ్నౌ తు,
స విషం హి ప్రాప్యాఽన్నం బహూన్ వికారాన్ భజత్యగ్నిః. 108
శిఖి బర్హవిచిత్రార్చిః తీక్ష్ణోఽక్షమకుణపధూమశ్చ,
(తీక్ష్ణాక్షమకుణపగన్ధిశ్చ; తీక్ష్ణస్సరూక్షగన్ధిశ్చ)

స్ఫుటతి చ సశబ్దమేకావర్తో విహితార్చిరపి చ స్యాత్. 109
పాత్రస్థం చ వివర్ణం భోజ్యం స్యాన్మక్షికాంశ్చ మారయతి,
క్షామస్వరాంశ్చ కాకాన్ కుర్యాత్, విరజేచ్చకోరాక్షి. 110

వ్యా. తనకు మామూలుగ వంటజేసి వడ్డించు వంటవాడు సేవకుడు మున్నగు పరిచారకులు పైజెప్పిన లక్షణములతో గూడి మామూలుకన్న విలక్షణముగ మార్పుజెంది యున్నపుడు వారు పెట్టిన యాహారపదార్థమును (అన్నమును) తొందరపడి భుజింపం జనదు. మరియు నాయన్నమును నిప్పుతో నుంచవలెను. అప్పు డాయన్నము విషయుక్త మైయున్నచో నగ్నియందు అనేకవికృతరూపములు కనబడును:—నిప్పులోనిజ్వాల నెమలిపురివలె చిత్రవర్ణముకల్గి జ్వలించును. అట్టిజ్వాల మిక్కిలి తీక్ష్ణమై యోరువ శక్యము గాకుండును. పీనుగకంపుతో గూడినపొగ వెడలును. చిటచిట యను శబ్దముతో గూడి నిప్పుకణములు పగులును. ఒక్కతూరి సుడి తిరిగి నిప్పు చల్లారును. ఆవిషయుక్తాన్నమును పాత్రలో నుంచినచో వర్ణము మారియుండును. దానిపై సీగెలు వ్రాలినచో చచ్చును. కాకులు చూచినచో కంఠధ్వని క్షీణించును. చకోరపుపక్షులు చూచినచో వానికన్ను లెఱ్ఱనగును.

విషముకలిసిన పానీయమును పరీక్షించువిధము.

మూ. పానే నీలా రాజీ వైవర్ణ్యం స్యాం చ నేక్షతే ఛాయామ్,
పశ్యతి వికృతామథ వా లవణాక్తే ఫేనమాలా స్యాత్. 111

వ్యా. పానార్హములగు జలము మున్నగుద్రవములయందు విషమును కలిపినయెడ నయ్యది రేఖలు కల్గియుండును. రంగు మారియుండును. దానియందు తననీడ కనబడదు. లేక వికృతరూపముగ కనబడును. విషయుక్తజలము మద్యము మున్నగుపానీయములలో లవణమును కలిపినయెడ నురుగు కట్టును.

విషయుక్తాన్నపానములచే గల్గు లక్షణములు.

మూ. పానాఽన్నయోస్సవిషయోః గన్ధేన శిరోరుక్ హృదిచ మూర్ఛాచ
స్పర్శేన పాణిశోథః సుప్త్యఙ్గులిదాహతోదనఖభేదాః. [ణ్ణా చ,
ముఖగేత్వోష్ఠ (ముఖతాల్వోష్ఠ) చిమిచిమాజిహ్వాతూనాజడావివ
ద్విజహర్షహనుస్తమ్భాఽఽస్యదాహలాలాగళవికారాః. 113

వ్యా. పైజెప్పినరీతిగ విషయుక్తములైన పానీయములయొక్కయు అన్నము యొక్కయు వాసన నాసారంధ్రములకు సోకినయెడ శిరస్సునందును హృదయమునందును నొప్పి పుట్టును. మూర్ఛగ్రమ్మును. అట్టి యన్నపానములను చేత తాకినయెడ చేతుల

యందు వాపు పుట్టును. స్పర్శజ్ఞానము నశించును. వ్రేళ్లయందు మంటయు సూదుల గ్రుచ్చినవిధముగ పోటును కల్గును. గోళ్లు పగులు, అట్టియన్నపానము నోటికి తగిలిన వెంటనే చిమచిమ యని జిలపుట్టును. నాలుక వాచి రుచిని గ్రహించుశక్తి యుడిగి వర్ణము మారియుండును. దంతహర్షము కల్గును. అంకిళ్లు స్తంభించును. నోట మంటబుట్టి జొల్లు కారును. గొంతురాపు మున్నగు కంఠరోగములు కల్గును.

### ఆమాశయగతవిషదుష్టాన్నపానలక్షణములు.

మూ. ఆమాశయం ప్రవిష్టే వైవర్ణ్యం స్వేదసదనముత్క్లేదః,
దృష్టిహృదయోపరోధో బిన్దుశతైశ్చీయతే చాఙ్గమ్. 114

వ్యా. విషముతో గూడిన యన్నపానములు ఆమాశయమున జేరినయెడ శరీర వర్ణము మారును. చెమటబట్టి యొడలు నొచ్చును. జఠరాగ్ని మందగించును. వాంతి యగునట్లుండును. కంటిచూపు తెలియదు. హృదయమున పట్టుపట్టినట్లుండును. శరీరము నందెల్ల చుక్కలు పుట్టును.

### విషదుష్టాన్నపానములు పక్వాశయమున జేరుటచే గల్గులక్షణములు.

మూ. పక్వాశయం తు యాతే మూర్ఛామదమోహదాహబలనాశాః,
తన్ద్రాకార్శ్యం చ విషే పాణ్డుత్వం చోదరస్థే స్యాత్. 115

వ్యా. విషయుక్తమైన యన్నపానములు పక్వాశయమున జేరినయెడ మూర్ఛ కల్గును. తిక్కయెత్తిన ట్లుండును. జ్ఞానము చెడును. తాపము కల్గును. శరీరబలము నశించును. మైకము గ్రమ్మును. శరీరము కృశించును. ఉదరమున జేరినప్పుడు పాండు రోగము కల్గును.

### విషదుష్టదంతకాష్ఠము, దాన గల్గుబాధలు.

మూ. దన్తపవనస్య కూర్చో విశీర్యతే దన్తోష్ఠమాంసశోషశ్చ,
కేశచ్యుతిశ్శిరోరుగ్గ్రన్థయశ్చ సవిషేఽథ శిరోఽభ్యఙ్గే. 116

వ్యా. దంతధావనము చేయుటకు సాధనమైన దంతకాష్ఠము కుంచిక మున్నగునవి విషసంబంధము కల్గియున్నయెడ నయ్యవి విచ్చిపోవును. దానిచే పలుదోమినయెడ దంతములకును పెదవులకును సంబంధించిన మాంసమున వాపు కల్గును. విషముతో గూడిన తైలముచే నభ్యంగనము చేసికొనినయెడ వెండ్రుక లూడును. తలనొప్పి కల్గును. తలఁ గ్రంథులు పుట్టును.

### విషదుష్టాఽఞ్జనాద్యుపయోగమున గల్గునుపద్రవములు.

మూ. దుష్టేఽఞ్జనేఽక్షిదాహస్రావాఽత్యుపదేహశోథరాగాశ్చ,

ఖాద్యైరాఢో కోష్ఠః, స్పృశ్యైస్త్వగ్ధాప్యతే దుష్టైః. 117

వ్యా. కన్నుల కుపయోగించు అంజనమున విషసంబంధము కల్గియున్నయెడ కన్నుల మంటపుట్టి నీరుకారును. కంటిలోపల మాంసము పెరుగును. రెప్పలపై వాచును. కన్ను లెఱ్ఱబడును. మరియు విషదుష్టభోజ్యపదార్థములచే కోష్ఠంబును, స్పర్శనార్హాము లగుగంధాదులచే చర్మంబును తొలుత చెడును.

విషయుక్తస్నానాదులచే గల్గునుపద్రవములు.

మూ. స్నానాఽభ్యఙ్గోత్సాదనవస్త్రాలఙ్కారవర్ణకైర్దుష్టైః,
కణ్ద్వార్తికోఠపిటకారోమోద్గమచిమిచిమాశోథాః. 118
ఏతే కరచరణదాహతోదక్లమూ విపాకాశ్చ,
భూపాదుకాశ్వగజపర్మకేతుశయనాఽఽసనైర్దుష్టైః. 119

వ్యా. విషయుక్తములైన జలమున స్నానముచేసినను, తైలాదులచే నభ్యంగనము చేసికొనినను నలుగుపిండి మున్నగువానిచే శరీరమును మర్దించినను, వస్త్రములను భూషణముల ధరించినను, శరీరమునకు వర్ణోత్కర్షమును కల్గించు చూర్ణాదుల నుపయోగించినను, శరీరముపై దురదయు, నొప్పియు, పిడకలును, రోమాంచంబును కల్గును. చిమచిమ యను బాధతో గూడిన వాపు కల్గును. మరియు విషయుక్తమైన భూమిపై గూరుచున్నను, పాదుకల ధరించినను విషసంబంధముగల జీనికల గుఱ్ఱమును ఏనుగులు మున్నగు వానిపై నెక్కి సవారిచేసినను, అట్టి కవచమును తొడిగినను, ధ్వజముల నుపయోగించినను శయ్యలపై బరుండినను, ఆస్తరణములపై గూర్చున్నను, దానంజేసి పైజెప్పబడిన దురద మున్నగునుపద్రవంబులు కల్గును. కాలుసేతుల మంటపుట్టును. పోటు కల్గును. కరచరణాదులు కమలి పుండగును.

విషదుష్టమాల్యాదులు, దానగల్గు నుపద్రవములు.

మూ. మాల్యమగన్ధం ఘ్రాయతి శిరోరుజా లోమహర్షకరమ్,
స్తమ్భయతి ఖాని, నాసాముపహన్తి, దర్శనం చ ధూమః. 120
కూపతటాకాదిజలం దుర్గన్ధం సకలుషం వివర్ణం చ,
పీతం. శ్వయథుం కోఠాన్ పిడకాశ్చ కరోతి మరణం చ. 121

వ్యా. పుష్పమాలికలు విషయుక్తములైనచో నవి వాడును. వానిని శిరమున జుట్టినయెడ తలనొప్పియు రోమహర్షంబును కల్గును. విషయుక్తమైన పొగ సోకినయెడ శరీరమునందలి నాసాదిరంధ్రముల స్తంభింపజేయును. ఘ్రాణేంద్రియమునకు గంధమును

గ్రహించుశక్తియు, దర్శనేంద్రియమునకు రూపాదుల గ్రహించు సామర్థ్యంబును నశించును. మరియుబావులు గుంటలు మున్నగు జలాశయములజలము విషముతో గూడిన యెడ నీళ్లు దుర్గంధముతో గూడి కలకబారి వివర్ణమగును. అట్టిజలమును త్రాగినయెడ వాపురు బొబ్బలను పొడలను కల్గించి తుదకు చంపును.

## ఆమాశయ-చర్మగతవిషచికిత్స.

మూ. ఆదావామాశయగే వమనం, త్వక్ స్థే ప్రదేహసేకాది,
కుర్యాద్విషచికిత్సాం దోషబలం చైవ హి సమీక్ష్య. 122

వ్యా. "ఖాద్యైరాదౌ కోష్ఠః, స్పృశ్యైస్త్వగ్దూష్యతే దుష్టైః" అనువాక్యముచే పైచెప్పినప్రకారము విషయుక్తములైనయాహారాదిభోజ్యపదార్థములచే నామాశయము చెడినపుడు తొలుత వమనము చేయించవలెను. స్నానాభ్యంగాదులచే చర్మము దుష్టమైనప్పుడు ప్రలేపములు, ప్రసేకము మున్నగు (బహిఃపరిమార్జనరూపమైన) చికిత్సలను జేయనగును. అట్టిచికిత్సలను రోగియొక్కయు దోషములయొక్కయు బలమును గమనించి చేయనగును.

మూ. ఇతి మూలవిషవిశేషాః ప్రోక్తాః శృణు జఙ్గమస్యాతః,
సవిశేషచికిత్సితమేవాదౌ తత్రోచ్యతే తు సర్పాణామ్. 123

వ్యా. ఇత్తెరంగున మూల(స్థావర)విషమునకు జేరిన లక్షణాదుల విశేషములు వివరింపబడినవి. ఇక నీక్రింద జంగమవిషమునకు సంబంధించిన విశేషములును చికిత్సితంబును చెప్పబడును. అందును సర్పములయొక్క విశేషంబును చికిత్సయు తొలుత చెప్పబడును.

## సర్పభేదములు, వానిచే త్రిదోషప్రకోపక్రమము.

మూ. ఇహ దర్వీకరః సర్పో మణ్డలీ రాజిమానితి,
త్రయో యథాక్రమం వాత-పిత్త-శ్లేష్మప్రకోపణాః. 124
(దర్వీకరా మణ్డలినో రాజిమన్తస్తథైవ చ,
సర్పా యథాక్రమం వాత-పిత్త-శ్లేష్మప్రకోపణాః.)

వ్యా. దర్వీకరములు, మండలి, రాజిమంతములను సర్పములు మూడుజాతులు. అందు దర్వీకరములు వాతమును, మండలిసర్పములు పిత్తమును, రాజిమంతములు శ్లేష్మమును వరుసగ ప్రకోపింపజేయును.

## దర్వీకరాది సర్పలక్షణములు.

మూ. దర్వీకరః ఫణీ జ్ఞేయః, మణ్డలీ మణ్డలాఽఫణః,

బిన్దులేఖో విచిత్రాఙ్గః పన్నగస్స్యాత్తు రాజిమాన్. 125

వ్యా. పడిగె కల్గినసర్పము దర్వీకర మనబడును. మండలి యనుసర్పము శరీరముపై పొడలవంటి మచ్చలుకల్గి చిన్నపడిగె కల్గియుండును. రాజీమంతమనుసర్పము చిత్రవర్ణములగు సన్నని చుక్కలును నిడుపులైన గీతలును కల్గిన శరీరము కల్గినదిగ నుండును. (ఇచ్చట "మండలీమండలాఽఫణః" అను చోట 'అఫణః' అని ఛ్ఛేదము. నఞ్, ఈషదర్థకము. చిన్నపడిగె కలది మండలి యనుసర్పమని ఫలితార్థము. ఈవిషయము "జ్ఞేయాః మణ్డలినోఽభోగాః" (అ. హృ, ఉ. అ. 3౬) అని వాగ్భటాచార్యులు చెప్పిరి. "అభోగాః—అల్పభోగాః" అని సర్వాంగసుందరవ్యాఖ్యాన మున్నది.) మరియు దర్వీకరాది సర్పజాతుల మూటిలో నొక్కొకటియందు నవాంతరభేదములు సుశ్రుతాది తంత్రములయందు చెప్పబడినవి. కాయచికిత్సాప్రధానమైన యీతంత్రమునందు వివరింపబడలేదని యెరుంగునది.)

## దర్వీకరాదివిషప్రత్యేకలక్షణములు.

మూ. విశేషాద్రూక్షకటుకమమ్లోష్ణం స్వాదు శీతలం,
విషం యథాక్రమం తేషాం తస్మాద్వాతాదికోపనమ్. 126

వ్యా. పైజెప్పిన త్రివిధసర్పములలో దర్వీకరములవిషము కటురసంబును రూక్షగుణంబును అధికముగ గల్గియుండును. మండలిసర్పములవిషము అమ్లరసంబును ఉష్ణగుణవీర్యంబులును అధికముగ గల్గియుండును. రాజిమంతములవిషము మధురరసంబును శీతగుణవీర్యంబులును అధికముగ కల్గియుండును. పైజెప్పినరీతిగ వేరువేరుగ రసగుణములు కల్గియుండుటచేతనే దర్వీకరవిషము వాతమును, మండలివిషము పిత్తమును, రాజిమంతముల విషము కఫమును వరుసగ ప్రకోపింపజేయును.

విషము సామాన్యముగ త్రిదోషముల బ్రకోపించునది యైనను పైజెప్పిన క్రమముగ నాయావిషము ఆయాదోషమును విశేషముగ ప్రకోపింపజేయుననియర్థము. మరియు విషము జలమునుబోలె నవ్యక్తరసమైనను కటుకాదిరసంబులును రూక్షాదిగుణంబులును అందు సుసూక్ష్మములుగ నుండునని యభిప్రాయముచే జెప్పబడినది.

## దర్వీకరదంశలక్షణము.

మూ. దర్వీకరకృతో దంశః సూక్ష్మదంష్ట్రాపదోఽసితః,
నిరుద్ధరక్తః కూర్మాభో వాతవ్యాధికరో మతః. 127

వ్యా. దర్వీకరసర్పముచే కరచినకాటు సూక్ష్మములగుకోరలగుర్తులు కల్గి నల్లగనుండును. రక్తము స్రవించక తాబేలువంటి వాపుకల్గి వాతవ్యాధుల గల్గించును.

### మండలిదంశలక్షణము.

మూ. పృథ్వర్పితః సశోథశ్చ దంశో మణ్డలినా కృతః,
పీతాభః పీతరక్తశ్చ సర్వపిత్తవికారకృత్. 128

వ్యా. మండలిసర్పము కరిచిన కాటులో కోరలగంటులు మిగుల లోతునకు దిగి యుండును. వాపుగల్గి పచ్చనై పచ్చనిరంగుకలరక్తముతో గూడియుండును. ఆవిషము పిత్తవ్యాధులనన్నిటిని కల్గించును.

### రాజిమంతదంశలక్షణము.

మూ. కృతో రాజిమతా దంశః పిచ్ఛిలః స్థిరశోఫకృత్,
స్నిగ్ధః పాణ్డుశ్చ సాంద్రాఽసృక్ శ్లేష్మవ్యాధిసమీరణః 129

వ్యా. రాజిమంత మనుసర్పముచే కరవబడినకాటు జిగురుగను గట్టిగ నుండు వాపు కల్గియు, స్నిగ్ధంబును, పాండువర్ణంబును, ఘనీభవించిన (చిక్కనైన) రక్తము కల్గియు నుండును. ఈవిషము కఫవ్యాధుల గల్గించును.

### సర్పములలో స్త్రీ-పురుష-నపుంసకలక్షణములు.

మూ. వృత్తభోగో మహాకాయః శ్వసన్నూర్ధ్వేక్షణః పుమాన్,
స్థూలమూర్ధా సమాఙ్గశ్చ స్త్రీ; త్వతస్స్యాద్విపర్యయాత్. 130
క్లీబః;

వ్యా. పురుషజాతిసర్పము గుండ్రనైన పడగయు దీర్ఘమైన శరీరంబును కల్గి యుండును. తీవ్రముగ బుసకొట్టును. కన్నులు శిరస్సున మీదిభాగమున నుండును. స్త్రీజాతిసర్పముతల స్థూలమైయుండును. శరీరము మిక్కిలి లావును సన్నమునుగాక సమస్థితి నుండును. పైజెప్పినలక్షణములకు విరుద్ధముగ నుండునది నపుంసకజాతి సర్పము.

(ఇచ్చట స్త్రీపురుషాది భేదములు విషముయొక్క తీవ్రభేదము తెలియుటకును, తదనుగుణముగ చికిత్స కల్పించుటకును జెప్పబడినది).

### స్త్రీ-పురుష-నపుంసకసర్పదష్టలక్షణములు.

మూ. త్రసత్యధోదృష్టిః స్వరహీనః ప్రకమ్పతే,
స్త్రియా దష్టః; విపర్యస్తైరేతైః పుంసా నరో మతః. 131
వ్యామిశ్రలిఙ్గైరేతైస్తు క్లీబదష్టం నరం వదేత్,
ఇత్యేతదుక్తం సర్పాణాం స్త్రీపుంక్లీబనిదర్శనమ్. 133

వ్యా. పైజెప్పబడిన స్త్రీపురుషాదిసర్పములలో స్త్రీసర్పము కరచినచో మనుజుడు మిక్కిలి భయపడును. క్రిందచూచుచు కంఠస్వరము క్షీణించి వణకుచుండును. పురుష

కరచినప్పుడు మనుజునకు పైజెప్పినలక్షణములకు విరుద్ధలక్షణములుఁకల్గియుండును.
కసర్పముకరచినయెడ మనుజుడు పైజెప్పబడినలక్షణములు రెండును మిశ్రములుగ
ను. ఇత్తెరంగున స్త్రీ-పురుష-నపుంసకసర్పలక్షణంబులును, వానిచే కరవబడిన మనుజ
ములును వేరువేరుగ జెప్పబడినవి.

## గర్భిణి-ప్రసూతసర్పములు కరచిన విషలక్షణములు.

పాణ్డువక్త్రస్తు గర్భిణ్యా శూనౌష్ఠోఽప్యసితేక్షణః,
జృమ్భాక్రోధోపజిహ్వార్తః; సూతయా రక్తమూత్రవాన్. 133

వ్యా. గర్భముతో నున్నసర్పము కరచినవానికి ముఖము పాండువర్ణముగ
ు. పెదవులు వాచును. కన్నులు నల్లబడును. అప్పుడే ప్రసవించినసర్పము కరచిన
ఆవలింత లధికముగ వెడలును. కోప మధికమగును. చిరినాలుక పెద్దదియగును.
మెఱ్ఱనై వెడలును.

## గోధా(ఉడుము)విషలక్షణము.

సర్పో గౌధేరకో నామ గోధాయాం(గోధాఖ్యః)స్యాచ్చతుష్పదః,
కృష్ణసర్పేణ తుల్యస్స్యాత్ నానా స్యుర్మిశ్రజాతయః. 134

వ్యా. ఉడుమునకు బుట్టిన సర్పము గౌధేరమనియు గౌధేయమనియు చెప్ప
దీనికి నాల్గుకాళ్లుండును. ఇయ్యది కృష్ణసర్పమునకు సమానమైన విషము కల్గి
ును. మిశ్రజాతిసర్పములు పలుదెరంగులైయుండును.

(గోధయన ఉడుము. దానికి బుట్టినది గౌధేరమను సర్పభేదము. ఉడుము దర్వీ
ష్ణసర్ప)జాతికిని ఇతరసర్పజాతులకును కల్గుకలయికచే కల్గినసర్పవిశేషము. ఇదియే
యని చెప్పబడును. దానిసంతతి యంతయు 'గౌధేర, గౌధేయ, గౌధార'
ములచే జెప్పబడును. ఈసంతతిలో జేరిన సర్పము లన్నిటికిని మొదటియుత్పత్తికి
ు కృష్ణసర్పము కావున దానింబోలె క్రూరమైనవిషము కల్గియుండునని భావము.
ప్రధానములగు దర్వీకర-మండలి-రాజిమంతములను మూడుసర్పజాతుల పరస్పర
ునం జేసి కల్గిన సర్పములు సంకరజాతులగు. ఇవి నానారూపములుఁగ నుండును.
ంబులు సంకరసర్పభేదములబట్టి వానిలక్షణములే సంకరములుగ కలిసియుండును.
రమును కారణముగ జేసియే యివి త్రిదోషముల ప్రకోపింపజేయును. ఈవిష
వాగ్భటాచార్యు లిట్లు సంగ్రహముగ జెప్పిరి:—"వ్యన్తరాస్త్విద్వ్యాదేశేషామేవ
ంత్. వ్యామిశ్రలక్షణాస్తే హి సన్నిపాతప్రకోపణాః" (అ. హృ. ఉ. అ. ౩౬.
సంకరజాతిసర్పములు వ్యంతరము లనబడును.)

### దంశభేదములు.

మూ. గా(గూ)ఢసమ్పాదితం వృత్తం పీడితం లమ్బితాఽర్పితం,
సర్పితం చ భృశాఽఽబాధం దంశా యేఽన్యే న తే భృశాః. 135

వ్యా. మిక్కిలి లోతున దిగునట్లు కరవబడిన కాటును, వర్తులముగ నుండు కాటును, కోరల బిగబట్టి కరవబడిన కాటును, కోరల నన్నిటిని గ్రుచ్చిన కాటును, కోరలచే గీచబడినకాటును, మిక్కిలి బాధను కల్గించును. ఇవిగాక తక్కినవి యెట్టికాటు లైనను మిక్కిలి బాధను కల్గింపనేరవు.

### సర్పములకు వయోభేదముచే విషతీవ్రత్వము.

మూ. తరుణాః కృష్ణసర్పాస్తు, గోనసాః స్థవిరా స్తథా,
రాజిమన్తో వయోమధ్యే భవన్త్యాశీవిషోపమాః. 136

వ్యా. కృష్ణసర్పములు (దర్వీకరములు) బాల్యమునందును, గోనసములు (మండలి సర్పములు) ముసలితనమునందును, రాజిమంతములు యౌవనదశయందును ఆశీవిషముల (దృష్టినిశ్వాసవిషములైనసర్పముల)బోలె మిగుల తీవ్రమైనవిషమును కల్గియుండును. (గోనసము, అన కొండచిలువ).

### సర్పములయొక్క కోరలభేదము.

మూ. సర్పదంష్ట్రాశ్చతస్రస్తు తాసాం వామాధరా సితా,
పీతా వామోత్తరా దంష్ట్రా రక్తా శ్యావాధరోత్తరా. 137

వ్యా. సర్పములకు కోరలు ఇరుప్రక్కలయందును పైభాగమునను క్రిందిభాగమునను, చేరి నాలుగుకోర లుండును. (అందు పైభాగమునం దిరుప్రక్కల నొక్కొక్కటియు క్రిందిభాగమునం దొక్కొక్కటియు నుండును.) ఈనాలుగుకోరలలో యెడమవైపున క్రిందిభాగమునం దుండుకోర తెల్లగ నుండును. యెడమవైపున పైభాగమున నుండుకోర పచ్చగనుండును. కుడివైపున క్రిందనుండు కోర యెర్రగనుండును. పైనుండు కోర శ్యామవర్ణముగ నుండును.

### పాముకోరలభేదముపట్టి విషపరిమాణనిర్ణయము.

మూ. యన్మాత్రః పతతే బిన్దుర్గోవాలాత్ సలిలోద్ధృతాత్,
వామాధరాయాం దంష్ట్రాయాం తన్మాత్రం స్యాదహేర్విషమ్.
ఏక-ద్వి-త్రి-చతుర్వృద్ధిర్విషభాగోత్తరోత్తరాః,
సవర్ణాస్తత్కృతా దంశా బహూత్తరవిషాః భృశాః. 139

వ్యా. అవుతోకనుండు వెంట్రుక నొకటి నీళ్లలో వైచి పైకి యెత్తినపుడు దాని నుండి క్రిందికి జారు నీటిబిందువంతటి పరిమితి గలవిషము పాముయొక్క యెడమ వైపున క్రిందిభాగమున నుండుకోరలో నుండును. తక్కిన మూడుకోరలలో నెడమవైపున పైభాగమునందు పై జెప్పిన రెండుబిందువుల పరిమితి గలవిషంబును కుడివైపున క్రింద నున్నకోరలో మూడుబిందువుల పరిమితిగలవిషమును మీదనున్నకోరలో నాలుగుబిందువుల పరిమితిగల విషమును వరుసగ నుండును. అట్టికోరలచేత కరచునప్పుడు ఏకోరతో కాటుపెట్టునో యాకాటున యాకోరకు చెప్పినవిషపరిమాణంబును దానికి పై జెప్పబడిన విధంబును కల్గియుండును, అట్టికోరల విషాధిక్యతనుపట్టియే యొకదానికన్న నొకటి మిక్కిలి బాధాకరముగ నుండును.

వివరణము—పై వివరించిన ప్రకారము మూండువిధములైన సర్పములలో దర్వీకరదంశము నల్లగ నుండుననియు, మండలిదంశము, పచ్చగ నుండుననియు, రాజీమంత దంశము పాండువర్ణముగ నుండుననియు, "దర్వీకరకృతో దంశః......శ్లేష్మవ్యాధిసమీరణః" (127-129) అను గ్రంథముచే చెప్పబడినది. ఇచ్చట కోరలయొక్క నాలుగుభేదములనుపట్టి నాలుగువిధము లయినరంగులు నిర్దేశింపబడినవి. దీనినిపట్టి పై జెప్పిన సర్పభేదములలో నన్నిటియందును దంష్ట్రాభేదము ననుసరించి ఇచ్చట చెప్పబడిన నాలుగు విధములయినరంగులును కలసియే యుండుననని చెప్పవలసి యున్నది. ఇది పరస్పరవిరుద్ధమున్నచో నీవ్యవస్థ నెరుంగునది. విషము కాటునందు మాత్రము నున్నపుడు ఆయాకోరలను నియమితమైన వర్ణములు ఆయాకోరలచే కల్గినకాటునందు కల్గియుండును. ఇట్టి విషము శరీరమున వ్యాపించినప్పుడు వాతాదిప్రకోపము ననుసరించి దర్వీకరాదులకు జెప్పబడిన ఆయారంగులు ఆయాదంశమున కల్గియుండును. ఎట్లనగా—దర్వీకరము కరచినప్పుడు కరచినతోడనే దానికాటున ఏకోరతో కరచునో యాకోరకు చెప్పినరంగు ఆకాటున నుండును. పిదప నావిషము శరీరముపై వ్యాపించునప్పుడు దర్వీకరసర్పమునకు నిర్ణీతమైన నలుపు కల్గి వాతమును ప్రకోపింప చేయును. మండలివిషము కరచినప్పుడు కోరలకు చెప్పినరంగు తొలుత కల్గియుండి పిదప శరీరమున వ్యాపించి పిత్తము ప్రకోపించినపుడు పచ్చనిరంగు కల్గియుండును. రాజీమంతము కరచినప్పుడు తొలుత కోరకు సంబంధించిన రంగు కల్గియుండి శరీరమున వ్యాపించి శ్లేష్మము ప్రకోపించు నపుడు రాజీమంతమునకు నిర్ణీతమైన పాండువర్ణము కల్గియుండును. అని వ్యవస్థ నెరుంగునది. సర్పభేదముపట్టి చెప్పినవర్ణభేదము వాతపిత్తశ్లేష్మములకు సంబంధించినదని భావము. ఈవివరణము తంత్రాంతరమున "దంశే స్వే స్వే వర్ణాః సంభవన్తి దోషజే స్మృతే" అను వాక్యముచే స్పష్టముగ జెప్పబడినది.

కీటోత్పత్తికారణము, వానిభేదములు.

మూ. సర్పాణామేవ విణ్మూత్రాత్కీటాః స్యుః కీటసంమతాః,
దూషీవిషాః ప్రాణహరా ఇతి సంక్షేపతో మతాః. 140

వ్యా. సర్పములయొక్క మలమూత్రములవలన పలుతెరంగులైన కీటకములు పుట్టును. అయ్యవి దూషీవిషములు (కాలాంతరమున బాధకల్గించు విషము కల్గినవి), ప్రాణహరములు (కుట్టినవెంటనే సర్పములబోలె తీవ్రముగ ప్రాణములు హింసించును), అని సంక్షేపముగ రెండుతెరంగుల జెప్పబడును.

ఇచ్చట "విణ్మూత్రాత్" అని చెప్పినవి యుపలక్షణముగాన సర్పములయొక్క శుక్రము, శవము, దుర్గంధము, అండములును కూడ కీటముల కుత్పత్తికారణ మగునని యెరుంగునది. ఈవిషయము సుశ్రుతమున నిట్లు చెప్పబడినది:—"సర్పాణాం శుక్ర విణ్మూత్ర శవపూత్యణ్డసంభవాః, వాయ్వమ్బ్వగ్నిప్రకృతయః కీటాస్తు వివిధాః స్మృతాః" (సు. కల్ప. అ. 8. సూ ౧).

దూషీవిషకీటదష్టలక్షణములు.

మూ. గాత్రం రక్తం సితం కృష్ణం శ్యావం వా పిడకాన్వితం,
సకణ్డూదాహవీసర్పపాకి స్యాత్కుథితం తథా. 141
కీటైర్దూషీవిషైర్దష్టం

వ్యా. దూషీవిషములగు కీటములచే కరువబడిన శరీరము ఎరుపు, నలుపు, తెలుపు, శ్యామవర్ణము, అనునీరంగులలో నేదైన నొకవర్ణము కల్గియుండును. బొబ్బలతో కూడి యుండును. దురదయు మంటయు కల్గి విషము శరీరమున పలుతెరంగున వ్యాపించును. శరీరమునం దచ్చటచ్చట బొబ్బలు లేచి కుళ్లును.

ప్రాణహరకీటదష్టలక్షణములు.

మూ. లిఙ్గం ప్రాణహరం శృణు,
సర్పదష్టే యథా శోథః వర్ధతే సోగ్రగన్ధ్యసృక్. 142
దంశోఽక్షిగౌరవం మూర్ఛా సరుగార్తః శ్వసిత్యపి,
తృష్ణాఽరుచిహారీతశ్చ భవేద్దూషీవిషార్దితః. 143

వ్యా. ప్రాణహరములగు కీటకములు కరచినయెడ పాము కరచినవిధముగ కరచిన చోట శోథము (వాపు) వృద్ధినొందును. మిక్కిలి తీవ్రమైన వాసనతో కూడి రక్తము వెడలును. కన్నులు బరువుగ నుండును. మూర్ఛగ్రమ్మును. మిక్కిలి తీవ్రమైనబాధతో

కూడి శ్వాసము వెడలును. దప్పియు, అరోచకంబును తీవ్రమగును. అట్టిలక్షణములబట్టి ప్రాణహారమగు దూషీవిషముచే బాధితునిగ నెరుంగునది.

దూషీవిషలూతాదష్టవిషలక్షణములు.

మూ. దంశస్య మధ్యే యత్కృష్ణశ్యావం వా జాలకావృతం,
దగ్ధాకృతి భృశం పాకిక్లేదశోథజ్వరాన్వితమ్. 144
దూషీవిషాభిర్లూతాభిః తం దష్టమితి నిర్దిశేత్,

వ్యా. దూషీవిషములయిన సాలెపురుగులు కరచినపుడు అవి కరచినచోట కాటు నడిమి నల్లని రంగైనను, శ్యామవర్ణంబైనను కల్గియుండును. సన్నరంధ్రములు అనేకము లుండును. కాటున అగ్నిచే కాల్చినట్లు మంటకల్గి పుండగును. ద్రవముతో మాంసము కుళ్లును. జ్వరము కల్గును. ఈలక్షణములుబట్టి దూషీవిషములగు సాలెపురుగులగు సాలెపురుగులచే కరువబడెనని యెరుంగునది.

ప్రాణహారలూతాదష్టవిషలక్షణము.

మూ. సర్వాసామేవ తాసాం చ దంశే లక్షణముచ్యతే. 145
శోథః శ్వేతా సితా రక్తాః పీతా వా పిడకాః జ్వరః,
ప్రాణాన్తకో భవేచ్ఛ్వాసః దాహిహిక్కాశిరోగ్రహాః. 146

వ్యా. పైజెప్పబడిన సాలెపురుగులు కరచినప్పుడు కాటున వాపుకల్గి శ్వేతవర్ణంబును, నలుపును, ఎరుపును, పసుపును, ఈరంగులలో నొకరంగుతో కూడిన బొబ్బలు కల్గి జ్వరము వ్యాపించి తీవ్రమయిన శ్వాసంబును, మంటయు, యెక్కిళ్లును, తల నొప్పియు కల్గినయెడ అట్టిలూతావిషము ప్రాణాంతకమైనదని యెరుంగునది.

(లూతాభేదములు పదునారువిధములుగ నుండును. అందు ఎనిమిదిభేదములు కృచ్ఛ్రసాధ్యములు, త్రిమండలామునగు భేదములు ఎనిమిదియు నసాధ్యములు. ఈపదు నారిటి నామరూపలక్షణభేదంబులును, ప్రాగుత్పత్తి ప్రకారంబును సుశ్రుతమున "వక్ష్యామి లూతాప్రభవం పురాణమ్" (సు. కల్ప. అ. ౮) అని యుపక్రమించి వివరింపబడినది. కాయచికిత్సాప్రధానమగు నీ తంత్రమున వానివివరణము అప్రధాన మగుటంజేసి యీతంత్రకారు లుపేక్షించెను.)

దూషీవిషాఖుదష్టలక్షణములు.

మూ. ఆదంశాచ్ఛోణితం పాణ్డు మండలాని జ్వరోఽరుచిః,
లోమహర్షశ్చ దాహశ్చాఽప్యాఖుదూషీవిషార్దితే. 147

వ్యా. దూషీవిషము (మందవీర్యవిషము)కల యెలుకలు కరచినయెడ కాటునుండి పాండువర్ణమైన రక్తము వెడలును. శరీరముపైని మండలాకారములైన పొడలు పుట్టును. జ్వరము కల్గును. అరుచియు, రోమహర్షణంబును, మంటయు కల్గును.

అసాధ్యమూషికాదష్టవిషలక్షణములు.

మూ. మూర్ఛాంగశోథవైవర్ణ్యక్లేదశబ్దాశ్రుతిజ్వరాః,
శిరోగురుత్వం లాలాసృక్ ఛర్దిశ్చాఽసాధ్యమూషికైః. 148

వ్యా. అసాధ్యమైనవిషముగలయెలుకలు కరచినపుడు మూర్ఛయు, వొడలియందు వాపును, వివర్ణతయు కలుగును. కాటున ద్రవము పుట్టి చీముపట్టును. ఈవిషముచే బాధింపబడినవానికి చెవులు వినబడదు. జ్వరము వచ్చును. తల బరువుగ నుండును. నోట జొల్లుకారును. రక్తము వాంతియగును.

కృకలాసక (తొండలేక ఊసరవిల్లి)యొక్క విషలక్షణము.

మూ. శ్యావత్వమథ కార్ష్ణ్యం వా నానావర్ణత్వమేవ వా,
మోహః పురీషభేదశ్చ దష్టే స్యాత్కృకలాసకైః. 149

వ్యా. తొండయైనను, ఊసరవిల్లియైనను కరచినచో వానిశరీరమెల్ల శ్యామవర్ణంబుగ నైనను, నల్లనిరంగు కల్గియైనను, అనేకవర్ణముల కల్గియైన నుండును, మూర్ఛ గ్రమ్మును, విరేచనమగును.

తేలుయొక్క విషలక్షణము.

మూ. దహత్యగ్నిరివాదౌ తు భినత్తీవోర్ధ్వమాశు చ,
వృశ్చికస్య విషం యాతి దంశే పశ్చాత్తు తిష్ఠతి. 150

వ్యా. తేలు కుట్టినప్పుడు తొలుత నిప్పున కాల్చినవిధముగ మంట పుట్టును. పిమ్మట నతిశీఘ్రముగనే శరీరమున పగులదీయునట్లు కుట్టినచోటినుండి పైకి వ్యాపించును. ఇత్తెరంగున తేలువిషము శరీరమున వ్యాపించి కొంతకాలమునకు కుట్టినచోటికి దిగియచ్చట నుండును.

తేలువిషముయొక్క అసాధ్యలక్షణము.

మూ. దష్టోఽసాధ్యస్తు హృత్ (హృక్) ఘ్రాణరసనోపహతో నరః,
మాంసైః పతద్భిరత్యర్థం వేదనార్తో జహాత్యసూన్. 151

వ్యా. కన్నులు, హృదయము, ముక్కు, నాలుక, యీస్థలములయందు తేలు కుట్టినయెడ విష మసాధ్యమగును. మరియు శరీరమునందలి మాంసము శిథిలమై యూడి

పడుచున్నను బాధ మిక్కిలి యధికమైనను మనుజులు ప్రాణముల శీఘ్రముగ వదలుదురు.

### కణభదష్టవిషలక్షణము.

మూ. విసర్పశ్శ్వయథుశ్శూలం జ్వరశ్ఛర్దిరథాపి చ,
లక్షణం కణభైర్దష్టే దంశశ్చైవ విశీర్యతే. 152

వ్యా. కణభములు (కణుదురీగెలు) కరచినయెడ వాపు కల్గి అయ్యది మిక్కిలి తీవ్రమైన పోటుతో కూడి శరీరమున నల్గెడల విసర్పమును బోలె వ్యాపించును. జ్వరంబును వాంతియు కల్గును. కరచినకాటు పగులును.

కణభభేదములు సుశ్రుతమున నిట్లు చెప్పబడినది:—"త్రికణ్టకః కుణీ చాపి హస్తికక్షోఽపరాజితః, చత్వార ఏతే కణభాః వ్యాఖ్యాతాస్తీవ్రవేదనాః." (సు. కల్ప. అ. ౮).

### ఉచ్చిటింగదష్టవిషలక్షణము.

మూ. హృష్టరోమోచ్చిటింగేన స్తబ్ధలిఙ్గో భృశార్తిమాన్,
దష్టః శీతోదకేనేవ సిక్తాన్యఙ్గాని మన్యతే. 153

వ్యా. ఉచ్చిటింగమను తేలు కరిచినయెడ రోమాంచము కల్గును. గుహ్యాము స్తంభించి మిక్కిలి బాధ కల్గును. శరీరమునందెల్ల చల్లనినీళ్లను చల్లినవిధముగ జడమై యుండును. ("ఉచ్చిటింగాఖ్యో వృశ్చికః" అని సర్వాఙ్గసుందరవ్యాఖ్యలో వృశ్చికభేదము ఉచ్చిటింగమని చెప్పబడినది).

### మండూకదష్టవిషలక్షణము.

మూ. ఏకదంష్ట్రార్దితః శూనః సరుక్స్యాత్ పీతకః సతృట్,
ఛర్దిర్నిద్రా చ మణ్డూకైః సవిషైర్దష్టలక్షణమ్. 154

వ్యా. విషముతో కూడినకప్ప కరచిన కాటున నొక్క కోర మాత్రము గ్రుచ్చియుండును. దానివిషముచే బాధితునకు నొప్పితో కూడి శరీరము వాచును. శరీరము పచ్చగ నుండును. దప్పికల్గును. వాంతి యగును. నిద్ర వచ్చును.

### మత్స్య-జలౌకాదష్టవిషలక్షణములు.

మూ. మత్స్యాస్తు సవిషాః కుర్యుః దాహశోఫరుజస్తథా,
కణ్డూం శోథం జ్వరం మూర్ఛాం సవిషాస్తు జలౌకసః. 155

వ్యా. విషముతోఁ గూడిన చేపలచే కరవబడినవానికి మంట కల్గును. వాపుపుట్టును. నొప్పి కల్గును. మరియు విషముతోఁ గూడినజలగలు కరిచినయెడ దురదయు వాపును జ్వరంబును మూర్ఛయు కల్గును.

బల్లి, జెఱ్ఱి, దోమలు, వీనివిషలక్షణములు.

మూ. దాహతోదస్వేదశోథకరీ తు గలగోడికా,
(విదాహం శ్వయథుం తోదం స్వేదం తు గృహగోధికా,)
దంశే స్వేదం రుజం దాహం కుర్యాచ్ఛతపదీవిషమ్. 156
కణ్డూమాన్మశకైరీషత్ శోథస్స్యాన్మన్దవేదనః,
అసాధ్యకీటసదృశమసాధ్యమశకక్షతమ్. 157

వ్యా. గలగోడిక(విషముతోఁ గూడినబల్లి)కరచినయెడ మంటయు పోటును చెమటయు వాపును కల్గును. విషముతోఁ గూడిన యడవిజెఱ్ఱి కరచినయెడ కాటున చెమట బట్టును. నొప్పియు మంటయు పుట్టును. దోమలు కుట్టినయెడ దురదయు కొంచెముగ వాపును కల్గును. కొంచెముగ నొప్పి పుట్టును. కొండదోమలవిషము అసాధ్యముగ నుండును. వానిలక్షణములను అసాధ్యకీటలక్షణములబట్టి యెఱుంగునది.

దోమకాటువిషలక్షణములు.

మూ. సద్యః ప్రస్రావిణీ శ్యావా దాహమూర్ఛాజ్వరాన్వితా,
పిడకా మక్షికాదంశే తాసాం తు స్థగికాఽసుహృత్. 158

వ్యా. విషముతోఁ గూడిన యీఁగ కరచినయెడ వెంటనే కుట్టినచోట శ్యామవర్ణమైన బొబ్బలేచి యందుండి నీరు స్రవించుచుండును. మంట పుట్టును. మూర్ఛయు జ్వరంబును కల్గును. స్థగికయను జాతిలోఁ చేరినయీఁగ కరిచినయెడ దానివిషము ప్రాణముల హరించును.

(సుశ్రుతమునందు "మక్షికాః కాంతారికా, కృష్ణా, పిఙ్గళికా, మధూలికా, కషాయీ, స్థగికా చేత్యేవం షట్" (సు. కల్ప. అ. ర) అని మక్షికాభేదము లారుగ జెప్పబడినవి. అందు స్థగికయనునది ప్రాణహరంబని యిచ్చట నిర్దేశింపబడినది).

స్థానాదివిశేషముచే సర్పవిషాఽసాధ్యత్వము.

మూ. శ్మశానచైత్యవల్మీకయజ్ఞాశ్రమసురాలయే,
పక్షసన్ధిషు మధ్యాహ్నే సాఽర్ధరాత్రేఽష్టమీషు చ. 159

న సిద్ధ్యన్తి నరా దష్టాః పాషణ్డాయతనేషు చ,
దృష్టి-శ్వాస-మల-స్పర్శవిషైః ఆశీవిషై స్తథా. 160
వినశ్యన్త్యాశు సమ్ప్రాప్తాః దష్టాః సర్వేషు మర్మసు,

వ్యా. శ్మశానము, చైత్యము (గ్రామదేవతానివాసమునకై గ్రామమధ్యమున నిర్ణయించిన గొప్పవృక్షము), పుట్ట, యజ్ఞముల సల్పుప్రదేశము, ఋష్యాదులు నివసించు ఆశ్రమస్థలములు, దేవాలయము, ఈస్థలవిశేషములయందు పాము కరచినను; అమావాస్య పూర్ణిమ, మధ్యాహ్నము, అర్ధరాత్రి, అష్టమి, అనునీకాలవిశేషములయందు పాము కరిచినను; కాపాలికులు మున్నగు పాషండులయొక్క యాలయములయందును పాము కరిచినను; అట్టి సర్పవిషము కుదరనేరదు. మరియు, దృష్టి, నిశ్వాసము, మలము, అనువానియందు విషముకల సర్పములు ఆశీవిషము లనబడును. అట్టియాశీవిషసర్పములచే కరవబడినవారికి సర్వవిధములైన చికిత్సల జేసినను విషము నివర్తించక శీఘ్రముగనే మృతినొందెదరు.

ఇచ్చట 'దృష్టిశ్వాస' అని చెప్పినది ఆశీవిషసర్పస్వరూపలక్షణము. ఈలక్షణము తంత్రాంతరమున—"దృష్టినిశ్వాసాదిభిర్హి వ్యాప్నురాపః ఆశీవిషాః, ఆశుకారిత్వాత్" అని చెప్పబడినది.

## సర్పవిషము తీవ్రముగ వృద్ధినొందు కారణములు.

మూ. (యేన కేనాపి సర్పేణ సమ్భవస్సర్వ ఏవ చ.) 161
భీతమత్తాఽబలోష్ణక్షుత్తృషార్తే వర్ధతే విషం,
విషం ప్రకృతికాలౌ చ తుల్యౌ ప్రాప్యాఽల్పమన్యథా.
(ప్రాణాల్పమన్యథా.) 162

వ్యా. మనుజుడు భయమునొంది యున్నను, మద్యము మున్నగువానిచే మత్తునొందియున్నను, బలహీనుడుగ నున్నను, ఉష్ణముచేనైనను ఆకలిచేనైనను పీడితుడై యున్నను, అట్టివాని నేవిధమైన సర్పము కరచినను విషము మిక్కిలి తీవ్రమై వృద్ధినొందును. మనుజుని ప్రకృతియు కాలంబును విషమునకు సమానగుణములుగ నున్నను అప్పు డేవిధమైనసర్పము కరచినను దానివిషము మిగుల తీవ్రమై వృద్ధినొందును. అటుగాక కాలంబును ప్రకృతియు విషమునకు విరుద్ధగుణములుగ నున్నచో విషము స్వల్పముగ నుండును. (మనుజుని ప్రకృతి యుష్ణంబును కాలము గూడ నుష్ణంబు నైయున్న యెడ విషము స్వభావముచేతనే యుష్ణప్రధానము కావున ప్రకృతికాలములు విషము

నకు సమానగుణము లగును. అట్టియెడ విషము ఎట్టిదైనను మిగుల తీవ్రమగుననియు; అటుగాక మనుజుడు కఫప్రకృతియు కాలము శీతంబు నైయున్నయెడ విషమునకు విరుద్ధ గుణంబు లగుటంజేసి తీవ్రత నుడుగుననియు భావము).

మందవిషసర్పములు.

మూ. వారివిప్రహతాః క్షీణాః భీతా నకులనిర్జితాః,
వృద్ధా బాలాస్త్వచో ముక్తాః సర్పా మన్దవిషాః స్మృతాః 163
సర్వదేహాశ్రితం క్రోధాద్విషం సర్పో విముఞ్చతి,
తదేవాహారహేతోర్వా భయాద్వా న ప్రముఞ్చతి. 164

వ్యా. నీళ్లచే గొట్టబడిన సర్పంబులును, కృశించిన సర్పంబులును, భయపడిన సర్పంబులును, ముంగిసలచే పోట్లాడి తప్పించుకొనిన సర్పంబులును, ముసలిపాములును, పసిపాములును, కుబుసమును వదలిన సర్పంబులును, ఇవి యన్నియు తీవ్రము దక్కి స్వల్పమైనవిషము కల్గియుండును. సర్పములు కోపము కల్గినప్పుడు తనశరీరమునందెల్ల వ్యాపించి యుండువిషమును కాటున విడచును. అయ్యది యాహారమును తినియున్నపుడును, భయపడి యున్నపుడును, విషమును పూర్తిగ విడువదు. (కావున పైజెప్పిన కారణములచే విషము స్వల్పముగ నుండునని భావము).

గోనససర్పములు (కొండచిలువలు) ముసలితనమున విషము వృద్ధినొంది యుండు నని "గోనసాః స్థవిరా స్తథా...భవన్త్యాశీవిషోపమాః" (శ్లో. ౧౩౬) అనువాక్యముచే పైని చెప్పబడినదికావున ఇచ్చట "వృద్ధాః" అనుపదముచేత గోనసములు దక్క తక్కినసర్పములకే యన్వయించునది. మరియు సర్పములకు విషము శరీరమునందెల్ల (మనుజులకు శుక్రమునుబోలె) వ్యాపించి యుండును. అయ్యది కోపోద్రేకమునం జేసి కోరలయందు సంక్రమించి కాటున విడువబడును. కోపము లేక భయపడి యుండు సమయమున కోరలయందు మాత్రము స్వల్పముగనుండువిషమునే విసర్జించును. కావున భయపడిన సర్పములకు విషము స్వల్పముగ నుండును.

కీటాదివిషములకు వాతాదిదోషవ్యవస్థ.

మూ. వాతోల్బణవిషాః ప్రాయః ఉచ్చిటిఙ్గాః సవృశ్చికాః,
వాతపిత్తోల్బణాః కీటాః శ్లైష్మికాః కణభాదయః. 165

వ్యా. ఉచ్చిటింగములను వృశ్చికభేదములను, సాధారణమైన వృశ్చికజాతియు, వాతాధికమైన విషమును ప్రాయికముగ కల్గియుండును. లూత మున్నగు కీటకములు వాత

పిత్తము లధికముగకల విషముతో కూడి యుండును. కణభములు (కణుదురీగలు) మున్నగునవి కఫాధికమైన విషమును కల్గియుండును.

విషమున వాతాదిలింగములబట్టి చికిత్సావిధానము.

మూ. యస్య యస్య హి దోషస్య లిఙ్గాధిక్యాని లక్షయేత్,
తస్య తస్యౌషధైః కుర్యాద్విపరీతగుణైః క్రియామ్.                166

వ్యా. విషము వ్యాపించినప్పుడు అట్టివిషముచేత నేయేదోషమునకు సంబంధించిన లక్షణము లధికముగ కనబడునో ఆయాదోషమునకు విరుద్ధగుణములయిన యౌషధములచే చికిత్స జేయనగును.

వాత-పిత్త-కఫోల్బణవిషలక్షణములు.

మూ. హృత్పీడోర్ధ్వానిలః స్తంభః సిరాయామోఽస్థిపర్వరుక్,
ఘూర్ణనోద్వేష్టనం గాత్రశ్యావతా వాతికే విషే                167
సంజ్ఞానాశోష్ణనిశ్వాసౌ హృద్దాహః కటుకాస్యతా,
దంశా(మాంసా)వదరణం శోథో రక్తపీతశ్చ పైత్తికే.                168
వమ్యరోచకహృల్లాసప్రసేకోత్క్లేశగౌరవైః,
సశైత్యముఖమాధుర్యైః విద్యాచ్ఛ్లేష్మాధికం విషమ్.                169

వ్యా. వాతాధికమైన విషము శరీరమున వ్యాపించియున్నపుడు రొమ్మునొప్పియు ఊర్ధ్వశ్వాసమును కల్గును. శరీరము స్తంభించును. నరములు లాగును. ఎముకలయందును కీళ్లయందును నొప్పి పుట్టును. శరీరము వణకును, అవయవములు కొంకరలు పోవును. శరీరమంతయు శ్యామవర్ణముగ నుండును.

పిత్తాధికవిషమున ప్రజ్ఞ తప్పును. నిశ్వాసము వేడికల్గి వడలును. రొమ్మున మంట పుట్టును. నోరు చేదుగనుండును. కుట్టినస్థలమునందును, మాంసమునందును పగులదీయు నట్లు బాధ కల్గును. (లేక బద్దలుగ పగులును.) యెరుపును పసుపురంగును కల వాపు కరచినస్థలమున పుట్టును.

శ్లేష్మాధికమైనవిషమున వాంతియగును. నోరు అరుచి కల్గియుండును. ఓకరింతలు వచ్చును. నోట జొల్లు కారును. వాంతియగును. శరీరము బరువుగ నుండును చల్లబడును. నోరు తీపికల్గియుండును.

వాతోల్బణవిషచికిత్స.

మూ. ఖండేన చ ప్రణాలేపః తైలాభ్యఙ్గశ్చ వాతికే,
స్వేదో నాడీపులాకాద్యైః బృంహణశ్చ విధిర్హితః.                170

వ్యా. వాతాధికవిషమున చందనముచేత వ్రణమునకు పట్టువేయవలయును. నువ్వులనూనెచే నభ్యంగనము చేయించవలయును. గల్లపొట్టు మున్నగువానిచే నాడీ స్వేదనమును చేయవలయును. శరీరమునకు బలము కల్గించు బృంహణము చేయనగును. (వాగ్భటమున "పిణ్యాకేన వ్రణాలేపః" అని యున్నది. నువ్వులతెలికపిండిని పట్టువేయ వలెనని యర్థము.)

## పిత్త-కఫోల్బణవిషచికిత్స.

మూ. సుశీతైః స్తంభయేత్సేకైః ప్రదేహైశ్చాపి పైత్తికం,
లేఖనచ్ఛేదనస్వేదవమనైః శ్లైష్మికం జయేత్. 171

వ్యా. పిత్తాధికవిషమున మిక్కిలి చల్లగనుండు సేకములచేతను, పట్టులచేతను విషమును వ్యాపింపనీక స్తంభింపచేయవలయును. శ్లేష్మాధికవిషమున లేఖనము ఛేదనము స్వేదనముచేసి వమనము చేయించవలయును.

## సర్వవిషసామాన్యముగ శీతక్రియావిధి.

మూ. విషేష్వపి చ సర్వేషు సర్వస్థానగతేషు చ,
అవృశ్చికోచ్చిటిఙ్గేషు ప్రాయః శీతో విధిర్హితః. 172

వ్యా. ఉచ్చిటింగములు, వృశ్చికములు తక్క తక్కిన యితరజంతువులవిషము లన్నిటియందును అట్టివిషము ఏస్థానమున వ్యాపించియున్నను మిక్కిలి శీతప్రధాన మైన చికిత్సను చేయుట చాల హితకరము.

## వృశ్చికవిషచికిత్స.

మూ. వృశ్చికే స్వేదమభ్యఙ్గం ఘృతేన లవణేన చ,
సేకాంశ్చోష్ణాన్ప్రయుఞ్జీత భోజ్యం పానం చ సర్పిషః. 173
ఏతదేవోచ్చిటిఙ్గేఽపి ప్రతిలోమం చ పాంశుభిః,
ఉద్వర్తనం సుఖాంబూష్ణైస్తథావచ్ఛాదనం ఘనైః. 174

వ్యా. తేలు కుట్టినవిషమున చెమటపట్టించి నేతితో సైంధవలవణముతోను అభ్యం గనస్వేదనమును చేయవలయును. వేడిగనుండు జలము ఆరనాళము మున్నగువానిచేత సేకములు చేయించవలయును. ఘృతముతో కూడిన ఆహారమును ఘృతపానమును చేయ నగును. ఉచ్చిటింగవిషమునందును పైజెప్పిన చికిత్సనే చేయనగును. మరియు మట్టిచేత ప్రతిలోమముగ రుద్దవలయును. వేడినీళ్లలో ధూళి మున్నగువానిని కలిపి సుఖోష్ణముగ నున్నపుడు దట్టముగ పట్టువేయవలయును.

### వెఱ్ఱికుక్క మున్నగునవి కరచిన విషలక్షణము.

మూ. శ్వాత్రిదోషప్రకోపాత్తు తథా ధాతువిపర్యయాత్,
శిరోఽభితాపి లాలా స్రావ్యధోవక్త్రస్తథా భవేత్. 175
అన్యేఽప్యేవం విధా వ్యాలాః కఫవాతప్రకోపణాః,
హృచ్ఛిరోరుగ్ జ్వరస్తమ్భతృషా మూర్ఛాకరా మతాః. 176

వ్యా. వెఱ్ఱికుక్క కరచినయెడ వాతాది త్రిదోషములు ప్రకోపించును. సంజ్ఞావహధాతువులు విరుద్ధములగును. దానంజేసి శిరస్సునందు సంతాపము కల్గును. నోట జొల్లు కారును. తల క్రిందికివంచుకొని యుండును. మరియు విషముతో కూడిన నక్క శివంగి క్రూరజంతువులు పిచ్చెత్తినపుడు వానిచే కరవబడినవానికి కఫవాతములను ప్రకోపింపజేయును. దానంజేసి హృదయమునందును, శిరస్సునందును నొప్పి కల్గును. జ్వరము వచ్చును. శరీరము స్తంభించును. దప్పియు మూర్ఛయు కల్గును.

### సవిష-నిర్విషదంశలక్షణములు.

మూ. కణ్డూనిస్తోదవైవర్ణ్యసుప్తిక్లేదోపశోషణం,
విదాహరాగరుక్పాతః శోఫో గ్రన్థినికుఞ్చనమ్. 177
దంశావదరణం స్ఫోటాః కర్ణికామణ్డలాని చ,
జ్వరశ్చ సవిషే లిఙ్గం విపరీతన్తు నిర్విషే. 178

వ్యా. విషముతో కూడిన కీటములు మున్నగు పైజెప్పబడిన జంతువులు కరచినయెడ జిల, పోటు, వర్ణముమారుట, స్పర్శజ్ఞానము తెలియకుండుట, కాటున ద్రవము కల్గి కుళ్లుట, ద్రవము లేక యెండుట, మంట, యెరుపుకల్గుట, నొప్పితోకూడి పుండగుట, వాపు, శరీరమున గ్రంథులు వ్యాపించుట, కరచినకాటున పగులుట, బొబ్బలు కల్గుట, దుర్మాంసము పెరుగుట, పొడలు కల్గుట, జ్వరము, ఈలక్షణము లన్నియు కల్గును. పైజెప్పిన కుక్కనక్క మొదలగు జంతువులు విషము లేకుండి కరచినయెడ యీలక్షణములు కలుగవు.

### అవస్థానుసారముగ విషచికిత్స.

మూ. తత్ర సర్వే యథావస్థం ప్రయోజ్యాః స్యురుపక్రమాః,
పూర్వోక్తాః విధిమన్యఞ్చ యథావత్ బ్రువతః శృణు. 179

వ్యా. పైజెప్పిన లక్షణములయందు ఆయాయవస్థ ననుసరించి తత్తదనుగుణముగ పైజెప్పబడిన ఇరువదినాల్గు చికిత్సలలో నెద్దానినైన చేయదగును. మరియు నాచికిత్సలు గాక విశేషవిధిగ పైజెప్పబడు చికిత్సావిధానమును వ్యవస్థానుసారముగ చేయదగును.

## హృదయవిదాహ, ప్రసేకములయందు విషచికిత్స.

మూ. హృద్విదాహే ప్రసేకే వా విరేకవమనం భృశమ్,
యథావస్థం ప్రయోక్తవ్యం శుద్ధే సంసర్జనక్రమః. 1౮౦

వ్యా. విషము వ్యాపించుటవలన హృదయమునందు మంటకల్గి నోట జొల్లు కారుచున్నయెడ అవస్థానుగుణముగ వమనమునైనను, విరేచనమునైనను, తీవ్రముగ చేయించవలయును. దానిచే కోష్ఠము శుద్ధమయిన పిదప పేయాది సంసర్జనక్రమమును ననుసరించి యాహారమును సేవింపదగును.

## శిరోగత-నేత్రగతవిషచికిత్స.

మూ. శిరోగతే విషే నస్తః కుర్యాన్మూలాని బుద్ధిమాన్,
బన్ధుజీవస్య భార్గ్యాశ్చ సురసస్యాసితస్య చ. 1౮౧
దత్త్వా కాకమయూరాణాం మాంసాసృక్ మస్తకే క్షతే,
ఉపధేయమధో దష్టస్యోర్ధ్వదష్టస్య పాదయోః. 1౮౨
పిప్పలీమరిచక్షారవచాసైన్ధవశిగ్రుకాః,
పిష్ట్వా రోహితపిత్తేన ఘ్నన్త్యక్షిగతమఞ్జనాత్. 1౮౩

వ్యా. నక్క కుక్క మున్నగువానివిషము శిరంబున చేరియున్నయెడ మంకెన వేళ్లు, గంటుభారంగి, నల్లతులసివేళ్లు, వీనిచే నస్యమును చేయించవలెను. మరియు శరీ మునం దధోభాగమున కరవబడినవానికి శిరస్సునందును, ఊర్ధ్వశరీరమున కరవబడినవానికి అరికాళ్లయందును కాటు చేసి యావ్రణమున కోడియొక్కయు కాకియొక్కయు నెమలియొక్కయు రక్తముతో కూడిన పచ్చిమాంసము నుంచవలెను. పైజెప్పినజంతువుల విషము కండ్లలో వ్యాపించినయెడ పిప్పళ్లు, మిరియాలు, యవక్షారము, వస, సైంధవలవణము, మునగపట్ట, వీని నన్నిటిని రోహితమను మత్స్యముయొక్క పిత్తము చేర్చి నూరి కన్నులలో కలికము వేయవలెను.

## ఆమాశయాదిగతవిషచికిత్స.

మూ. కపిత్థమామం ససితక్షౌద్రం కణ్ఠగతే విషే,
లిహ్యాత్ ఆమాశయగతే తాభ్యాం చూర్ణపలం నతాత్. 1౮౪
విషే పక్వాశయగతే పిప్పలీం రజనీద్వయమ్,
మఞ్జిష్ఠాం చ సమం పిష్ట్వా గోపిత్తేన నరః పిబేత్. 1౮౫

రక్తం మాంసం చ గోధాయాః శుష్కం చూర్ణీకృతం హితమ్,
విషే రసగతే పానం కపిత్థరససంయుతమ్. 186
శేలోర్ధ్వాలత్వగగ్రాణి బాదరౌదుమ్బరాణి చ,
కటభ్యాశ్చ పిబేద్రక్తగతే మాంసగతే పిబేత్. 187
సక్షౌద్రం ఖదిరారిష్టం కౌటజం మూలమమ్భసా,
సర్వేషు చ బలే ద్వే తు మధూకం మధుకం నతమ్. 188

వ్యా. కంఠమున విషము చేరియున్నయెడ పచ్చివెలగకాయగుజ్జులో చక్కెరను తేనెను కలిపి నాకించవలెను. విషము ఆమాశయమున చేరియున్నయెడ పలపరిమితమైన గ్రంథితగరమును చూర్ణముచేసి తేనెను చక్కెరను కలిపి సేవించునది. విషము పక్వాశయమున చేరినపుడు పిప్పళ్లు, పసుపు, మ్రానిపసుపు, మంజిష్ఠి, వీనిని సమభాగములుగ గూర్చి గోరోచనమున నూరి త్రాగునది. విషము రసధాతువున జేరినపుడు ఉడుము యొక్క మాంసమును రక్తమును ఎండించి చూర్ణముచేసి వెలగకాయరసమున కలిపి త్రాగించవలెను. రక్తధాతువున విషము చేరియున్నపుడు విరిగిచెట్టుయొక్కయు రేగుచెట్టు యొక్కయు అత్తిచెట్టుయొక్కయు, ఎక్కుడుతీగెయొక్కయు వేళ్లనుపట్టలను చిగుళ్లను సమభాగములుగ గూర్చి నూరి కల్కముచేసి నీళ్లలో కలిపి త్రాగవలెను. విషము మాంసమున జేరినపుడు చంద్రవేరును వేపవేరును కొడిసెపాలవేరును నీళ్లు పోసి నూరి త్రాగించవలెను. చిట్టాముట్టివేరును పేరాముట్టివేరును ఇప్పవేరును అతిమధురమును గ్రంథితగరమును సమభాగములుగ గూర్చి నీళ్లుపోసి నూరి పైజెప్పిన శిరోగతాది అవస్థాభేదము లన్నిటియందును త్రాగనగును.

### కఫాధికవిషమున పిప్పల్యాది-చూర్ణప్రతిసారణము.

మూ. పిప్పలీం నాగరం (మరిచం) క్షారం నవనీతేన మూర్ఛితమ్,
కఫే భిషగుదీర్ణే తు విదధ్యాత్ప్రతిసారణమ్. 189

వ్యా. పిప్పళ్లు, శుంఠి, యవక్షారము, వీనిని చూర్ణముచేసి వెన్నలో కలిపి విషము కఫస్థానమున నున్నపుడు కరచినకాటున నునిచి రుద్దవలెను.

### కొన్ని విషహరసిద్ధయోగములు.

మూ మాంసీకుఙ్కుమపత్రత్వగ్రజనీనతచన్దనైః,
మనశ్శిలావ్యాఘ్రనఖసురసైరమ్బుపేషితైః. 190
పానసస్యాఞ్జనాలేపాః సర్వశోథవిషాపహాః,

వ్యా. జటామాంసి, కుంకుమపువ్వు, లవంగపత్రి, లవంగపట్ట, పసుపు, గ్రంథిత
రము, గంధముచెక్క, మణిశిల, వ్యాఘ్రనఖ మనెడు గంధద్రవ్యము, తులసి, వీని నన్ని
టిని కూర్చి నీళ్లుబోసి మెత్తగ నూరి పానమునకును నస్యమునకును అంజనమునకును లే
మునకు నుపయోగించినచో పలువెరంగులైన శోఫములును సర్వవిషములును నివర్తించును

## సర్వవిషహరయోగము.

మూ. చన్దనం తగరం కుష్ఠం హారిద్రే ద్వే త్వగేవ చ. 19
మనశ్శిలా తమాలశ్చ రసః కైసర ఏవ చ,
శార్దూలస్య నఖశ్చైవ సుపిష్టం తణ్డులామ్బునా. 19
హన్తి సర్వవిషాణ్యేవ వజ్రివజ్రమివాఽసురాన్,

వ్యా. చందనము, గ్రంథితగరము, చెంగల్వకోష్టు, పసుపు, మ్రానిపసుపు, లవం
పత్రి, మణిశిల, కానుగపట్ట, నాగకేసరములరసము, వ్యాఘ్రనఖమనెడుగంధద్రవ్యమ
వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి బియ్యపుకడుగునీరు బోసి మెత్తగ నూరి త్రా
నచో విషముల నన్నిటి నింద్రునివజ్రాయుధము రాక్షసుల నమయించుభంగి హరించున

## సర్పవిషహరపాన-నస్య-అంజనములు.

మూ. రసే శిరీషపుష్పస్య సప్తాహం మరిచం సితమ్. 19
భావితం సర్పదష్టానాం నస్యపానాఽఞ్జనే హితమ్,

వ్యా. తెల్లమిరియాలను దిరిసనపువ్వులరసమునం దేడుదినములు భావనచేసి పామ
కరిచినవారికి నస్యమునకు పానమునకు కండ్లలో కలికము వేయుటకును ఉపయోగించి
యెడ సర్పవిషము నివర్తించును.

## సర్పవిషహరపానము.

మూ. ద్విపలం నతకుష్ఠాభ్యాం ఘృతక్షౌద్రచతుష్పలమ్. 19
అపి తక్షకదష్టానాం పానమేతత్సుఖప్రదమ్,

వ్యా. గ్రంథితగరమును చెంగల్వకోష్టును చేరి రెండుపలములను చూర్ణముచే
నెయ్యియు తేనెయు చేరి నాల్గుపలముల పరిమితమున కలిపి త్రాగినయెడ తక్షకమన
మహాసర్పము కరిచినను సుఖముగ విషము నివర్తించును.

## దర్వీకరసర్పవిషహరపాన-అంజనములు.

మూ. సిన్ధువారస్య మూలం చ శ్వేతా చ గిరికర్ణికా. 19
పానం దర్వీకరైర్దష్టే నస్యం సమధుపాకలమ్,

వ్యా. వావిలివేళ్లు, తెల్లనిపువ్వులు కల విష్ణుక్రాంతము, (లేక తెల్లదింటెన) వీనిని నూరి త్రాగించి, చెంగల్వకోష్టు తేనెతో చాది కలికము వేసినయెడ దర్వీకర (కృష్ణసర్ప) విషము నశించును.

మండలిసర్పవిషహరయోగము.

మూ. మఞ్జిష్ఠా మధుయష్టీ చ జీవకర్షభకౌ సితా. 196
కాశ్మర్యం వటశుఙ్గాని పానం మణ్డలినాం విషే,

వ్యా. మంజిష్టి, అతిమధురము, జీవకము, ఋషభకము, నేలగుమ్ముడు, మఱ్ఱియూడలు, వీనిని సమభాగములుగ కూర్చి నూరి చక్కెర చేర్చి త్రాగినయెడ మండలి (కొండచిలువ) సర్పవిషము శాంతపడును.

రాజీమంతసర్పవిషహరయోగము.

మూ. వ్యోషం సాతివిషం కుష్ఠగృహధూమో హరేణుకా. 197
తగరం కటుకా క్షౌద్రం హన్తి రాజీమతాం విషమ్,

వ్యా. త్రికటుకములు, అతివస, చెంగల్వకోష్టు, కరిదూపము, రేణుకలు, గ్రంథితగరము, కటుకరోహిణి, వీని నన్నిటిని సమభాగములు గూర్చి చూర్ణము చేసి తేనెతో కలిపి సేవించినయెడ రాజీమంతము లనెడు సర్పములవిషమును హరించును.

అన్ని సర్పవిషములకును పానము.

మూ. గృహధూమం హరిద్రే ద్వే సమూలం తణ్డులీయకమ్. 198
అపి వాసుకినా దష్టః పిబేన్మధు (దధి) ఘృతాప్లుతమ్,

వ్యా. కరిదూపము, పసుపు, మ్రానిపసుపు, చిర్రికూరసమూలము, వీనిని నూరి తేనెను నేతిని చేర్చి త్రాగినయెడ వాసుకి యను సర్పరాజము కరచినను విషము నివర్తించును.

కీటవిషహరచికిత్స.

మూ. క్షీరివృక్షత్వగాలేపః శుద్ధే కీటవిషాపహః. 199
ముక్తాలేపోదరశ్శోథదాహతోదజ్వరాపహః,

వ్యా. కీటవిషములందు తొలుత వమనవిరేచనరూపశోధనముల చేసి పిమ్మట అత్తి, రావి, జువ్వి, మఱ్ఱి, కలజువ్వి అను సీక్షీరివృక్షములయొక్క పట్టను నూరి పూసినయెడ విషమును హరించును. ముత్యములను నూరి పట్టువేసినయెడ కీటవిషముచే కల్గిన వాపు మంట పోటు జ్వరము వీటినన్నిటిని పోగొట్టును.

## లూతావిషహర చికిత్స.

మూ. చన్దనం పద్మకోశీరం శిరీషః సిన్ధువారికా. 200
క్షీరశుక్లనతం కుష్ఠం పాటలోదీచ్య సారిబాః,
శేలుస్వరసపిష్టోఽయం లూతానాం సార్వకార్మికః. 201
(యథా యోగం ప్రయోక్తవ్యః సమీక్ష్యా లేపనాదిషు.)

వ్యా. శ్రీగంధము, పద్మకము (పద్మకాష్ఠము,) వట్టివేరు, దిరిసెనము, వావిలివేరు, నేలగుమ్మిడివేరు, గ్రంథితగరము, చెంగల్వకోష్టు, పాదిరివేళ్లు, కురువేరు, సుగంధపాల వేరు, వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి విరిగిచెట్టు ఆకుయొక్క స్వరసము పోసి నూరి లూతా(సాలెపురుగుల)విషమున సమయోచితముగ ఆలేపనము, నస్యము, పానము మున్నగు చికిత్సల కుపయోగించిన విషమును హరించును.

## లూతావిషహర పానయోగము.

మూ. మధూకం మధుకం కుష్ఠం శిరీషోదీచ్యపాటలాః,
సనిమ్బసారిబాః క్షౌద్రాః పానం లూతావిషాపహమ్. 202

వ్యా. ఇప్పపట్ట, అతిమధురము, చెంగల్వకోష్టు, దిరిసెనపుపట్ట, కురువేరు, పాదిరివేళ్లు, వేపపట్ట, వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి నూరి చక్కెరయు, తేనెయు కలిపి త్రాగినయెడ లూతావిషమును హరించును.

## కీటలూతావిషమున కర్ణికాపాతనయోగము.

మూ. కుసుమ్భపుష్పం గోదన్తః స్వర్ణక్షీరీ కపోతవిట్,
దన్తీ త్రివృత్ సైన్ధవం చ కర్ణికాపాతనం తయోః. 203

వ్యా. కుసుంబపుష్పము, హారిదళము, కంకుష్టము, పావురములమలము, నేపాళపు వేళ్లు, తెల్లతెగడ, సైంధవలవణము, వీనినన్నిటిని కూర్చి నూరి సాలెపురుగులయొక్కయు కీటములయొక్కయు కాటున పెట్టినయెడ అవి కరచుటచే కల్గిన కర్ణిక (దుర్మాంసము) యూడిపోవును.

## కీటలూతాదంశమునందలి వ్రణహర చికిత్స.

మూ కటభ్యర్జునశైరీష శేలుక్షీరీద్రుమత్వచః,
కషాయకల్కచూర్ణాస్స్యుః కీటలూతావ్రణాపహాః. 204

వ్యా. యెక్కుడుతీగ (మాల్కంగుని) పట్ట, మద్దిపట్ట, దిరిసెనపుపట్ట, విరిగిపట్ట అత్తి రావి మున్నగు క్షీరివృక్షములయొక్క పట్టలు, వీనినన్నిటిని గూర్చి కషాయము

నైనను, కల్కముగనైనను, చూర్ణముగనైనను సిద్ధముచేసి కీటములు సాలెపురుగులు కరచుటచే కల్గిన వ్రణములకు ప్రక్షాళనము మున్నగువాని కుపయోగించిన వ్రణములు మానును.

### మూషకవిషచికిత్స.

మూ. త్వచం చ నాగరం చైవ సమాంశం శ్లక్ష్ణపేషితమ్,
వేయముష్ణాంబునా సర్వం మూషికాణాం విషాపహమ్. 205

వ్యా. దాల్చినిచెక్క, శుంఠి యీరెంటిని సమభాగములుగ గూర్చి నూరి వేడి నీళ్లలో కలిపి త్రాగినయెడ యెలుకలవిషమును హరించును.

### వృశ్చికాదివిషహరాఽగదయోగము.

మూ. కుటజస్య ఫలం పిష్టం తగరం జాలమాలినీ,
తిక్తేక్ష్వాకుశ్చ యోగోఽయం పానప్రథమనాదిభిః 206
వృశ్చికోన్దురుమ్లూతానాం సర్పాణాం చ విషం హరేత్,
సమానో హ్యమృతేనాయం గరాజీర్ణఞ్చ నాశయేత్. 207
సర్వేఽగదా యథాదోషం ప్రయోజ్యాః సుః త్రికణ్టకే,

వ్యా. కొడిసెపాలగింజలు, గ్రంథితగరము, జాలామాలిని, చేదుసొర, వీని నన్నిటిని సమభాగములుగ కూర్చి చూర్ణముచేసి పానమునకును, నస్యము మొదలైనవానికిని నుపయోగపరచిన తేలువిషము, ఎలుకవిషము, సాలెపురుగులవిషము, సర్పవిషము వీటి నన్నిటిని హరించును. మరియు నీయోగము అమృతమును బోలి విషముల నన్నిటిని హరించును. గరము(పెట్టుడుమందు)చే కల్గిన అజీర్ణము నివర్తించును. పైజెప్పిన విషహరములగుయోగముల నన్నిటిని త్రికంటకకీటవిషమునందు ఆయాదోషముల ననుసరించి యుపయోగింపదగును. (త్రికంటకమనునది కీటవిశేషము. సుశ్రుతమున "ఏకజాతీన తస్మూర్ధ్వం కీటాన్ వక్ష్యామి భేదతః,... త్రికంటకః కుణీ చాపి హస్తికక్షోఽపరాజితః. చత్వార ఏతే" (సు. కల్ప. అ. ౮) అని చెప్పబడినది).

### వృశ్చికవిషహరాగదము.

మూ. కపోతవిణ్మాతులుఙ్గం శిరీషకుసుమాద్రసః. 208
శఙ్ఖిన్యార్కం పయః శుంఠీ కరఞ్జో మధు వార్శికే,

వ్యా. పాపురములమలము, మాదీఫలము, దిరిసెనపువ్వులరసము, కడిలచెట్టుపట్ట, జిల్లేడుపాలు, శుంఠి, కానుగపట్ట, తేనె, వీని నన్నిటిని కూర్చి నూరి లేపాదులకుపయోగించిన తేలువిషము నివర్తించును.

### భేక-మత్స్యవిషహరచికిత్స.

మూ. శిరీషస్య ఫలం పిష్టం స్నుహీక్షీరేణ దార్దురే. 209
మూలాని శ్వేతభణ్డీనాం వ్యోషం సర్పిశ్చ మత్స్యజే,

వ్యా. దిరిసెనపువిత్తులను నూరుకొని జెముడుపాలతో కలిపి పూసినచో కప్ప విషము హరించును. తెల్ల విష్ణుక్రాంతముయొక్క వేళ్లను త్రికటుకములను నూరి నేతిలో కలిపి మత్స్యములు కరచుటచే కల్గిన విషమున నుపయోగించునది.

### జలగలు మున్నగువానివిషచికిత్స.

మూ. కీటదష్టక్రియాస్సర్వా సమానాః స్యుర్జలౌకసామ్. 210
వాతపిత్తహరీ చాపి క్రియా ప్రాయః ప్రశస్యతే,
వార్శ్చికో హ్యుచ్చిటిఙ్గస్య కణభస్య(శలభస్య)ఔన్దురోగదః. 211

వ్యా. కీటదష్టవిషమునకు చెప్పిన చికిత్సావిధానము లన్నియు జలగలు కరచిన విషమునకు నుపయోగింపదగును. మరియు వాతపిత్తములను హరించు చికిత్సావిధానమును జలగలవిషమునకు చేయుట మిగుల ప్రశస్తము. మరియు వృశ్చికవిషమునకు చెప్పిన చికిత్సయు ఉచ్చిటిఙ్గవిషమునకును కణుదురీగవిషమునకును ఎలుకలవిషమునకును నుపయోగింపదగును.

### విశ్వంభరాదికీటవిషహరాఽగదము.

మూ. వచాం వంశత్వచం పాఠాం నతం సురసమఞ్జరీం,
ద్వే బలే నాకులీ కుష్ఠం శిరీషం రజనీద్వయమ్. 212
గుహామతిగుహాం శ్వేతామజగన్ధాం శిలాజతు,
కత్తృణం కటభీం క్షారం గృహధూమం మనశ్శిలామ్. 213
రోహీతకస్య పిత్తేన పిష్ట్వా తు పరమోఽగదః,
నస్యాఞ్జనాదిలేపేషు హితో విశ్వమ్భరాదిషు. 214

వ్యా. వస, వెదురుపట్ట, చిరుబొద్ది, గ్రంథితగరము, తులసి పూగుత్తులు, చిట్టాముట్టి, పేరాముట్టి, సర్పాక్షి, చెంగల్వకోష్టు, దిరిసెనము, పసుపు మ్రానిపసుపు, ...

కోలపొన్న, ముయ్యాకుపొన్న, తెల్లదింటెన, వాయింట, శిలాజిత్తు, కిక్కసగడ్డి, మాల్కంగుని, యవక్షారము, కరిదూపము, మణిశిల, వీనినన్నిటిని సమభాగములుగకూర్చి రోహితకమను మత్స్యముయొక్క పిత్తమును కలిపి నూరి నస్యమునకును, అంజనమునకును, ఆలేపము మున్నగు క్రియావిధానములయందు నుపయోగించినచో విశ్వంభరా మున్నగు కీటములయొక్క విషమును హరించును. ఇయ్యది మిగుల శ్రేష్ఠమయిన విషహరౌషధము. (విశ్వంభరాది త్రయోదశకీటభేదములు సుశ్రుతమున నిట్లు వివరింపబడినది:—‘‘విశ్వమ్భరః......త్రయోదశైతే సౌమ్యాస్స్యుః కీటాః శ్లేష్మప్రకోపణాః’’ (సు.కల్ప. అ. ౮) విశ్వాంభరాది కీటభేదములు పదుమూడును కఫప్రకోపకరములు.)

## జెఱ్ఱివిషమును హరించుచికిత్స.

మూ. స్వర్జికాఽజశకృత్క్షారస్సురసాఽఽథాక్షిపీడకః,
మదిరామణ్డసంయుక్తో హితశ్శ్వేతపదీవిషే. 215

వ్యా. స్వర్జికాలవణము, మేకపెంటికలు, యవక్షారము, తులసి, అక్షిపీడకమను శింబీవిశేషము, వీనినన్నిటిని నూరి మదిరయను మద్యముయొక్క మీది తేటలో కలిపి కంటిలో నునిచి రుద్దినయెడ జెఱ్ఱివిషమును హరించును. (ఇచ్చట—అక్షిపీడకమన— ‘‘శ్వేతపీతశిమ్బీభేదః’’ అని చక్రపాణివ్యాఖ్యలో నున్నది. ‘‘అక్షి పీడయిత్వా యద్రసోఽక్షిణి ధీయతే సోఽవపీడోఽక్షిపీడకః’’ అని గంగాధరకృత జల్పకల్పతరు వ్యాఖ్యలో నున్నది.)

## బల్లివిషమునకు చికిత్స.

మూ. కపిత్థమక్షిపీడోఽర్కబీజం త్రికటుకం తథా,
కరఞ్జో ద్వే హరిద్రే చ గలగోడ్యా(గృహగోధా)విషం జయేత్.

వ్యా. వెలగకాయలోని గుజ్జు, అక్షిపీడకమను శింబీభేదము, జిల్లేడువిత్తులు, త్రికటుకములు, కానుగువిత్తులు, పసుపు, మ్రానిపసుపు, వీని నన్నిటిని ఉపయోగించినచో బల్లివిషమును హరించును.

## సర్వవిషహరయోగము.

మూ. కాకాణ్డరససంయుక్తో విషాణాం తణ్డులీయకః,
ప్రధానో బర్హిపిత్తేన తద్వద్వాయసపీలుకః. 217

వ్యా. కాకిదొండరసముతో కూడిన చిఱ్ఱివేళ్లను, నెమలిపిత్తముతో కూడిన నల్లతుమికిచెక్కయు సర్వవిషములకును ప్రధానమైనయౌషధముగ నుండును.

### సర్వవిషములకు పంచశిరీషాగదము.

మూ. శిరీషఫలమూలత్వక్పుష్పపత్త్రైః సమైర్ఘృతైః,
శ్రేష్ఠః పఞ్చశిరీషోఽయం విషాణాం ప్రవరో వధే. 218
(ఇతి పఞ్చశిరీషోఽగదః.)

వ్యా. దిరిసెనపుకాయలు, దానివేరు, దానిపట్ట, పువ్వులు, ఆకులు, ఈయైదిటిని సమభాగములుగ గూర్చి నూరి చూర్ణము జేసి నేతిని వీని కన్నిటికిని సమముగ గూర్చిన నియ్యది పంచశిరీషాగదయోగ మనబడును. ఇయ్యది విషముల కన్నిటికిని మిగుల శ్రేష్ఠమైన యౌషధము.

### చతుష్పద-ద్విపదజంతువిషహరౌషధము.

మూ. చతుష్పద్భిః ద్విపద్భిర్వా నఖదన్తక్షతం తు యత్,
శూయతే పచ్యతే చాపి స్రవతి జ్వరయత్యపి. 219
సోమవల్కోఽశ్వకర్ణశ్చ గోజిహ్వా హంసపద్యపి,
రజన్యౌ గైరికం లేపః నఖదన్తవిషాఽపహః. 220

వ్యా. పిల్లి మొదలగు నాలుగుపాదములజంతువులైనను, కోతులు ఆడమనుష్యులు మున్నగు రెండుకాళ్లుకల జంతువులైనను గోళ్లచేతను దంతములచేతను కరచినయెడ గాయమువాచి పక్వమై యందుండి పూయాదులు స్రవించి జ్వరము కల్గును. అట్టియెడ వెలిచంద్రచేవ, మద్దిచెక్క, ఎద్దునాలుకచెట్టుపట్ట, హంసపాది (చెప్పుతట్టాకు), పసుపు, మ్రానిపసుపు, గైరికము (కావిరాయి) వీని నన్నిటిని చేర్చి నూరి లేపముచేసినయెడ పైజెప్పిన నఖదంతములచే కల్గినవిషమును హరించును.

### శంకావిషము, దానకల్గులక్షణములు.

మూ. దురన్ధకారే విద్ధస్య (దష్టస్య) కేనచిద్విషశఙ్కయా,
విషోద్వేగాత్ జ్వరశ్ఛర్దిః మూర్ఛాదాహోఽపి వా భవేత్. 221
గ్లానిర్మోహోఽతిసారశ్చాప్యేతత్ శఙ్కావిషం స్మృతం (మదం,)

వ్యా. గాఢమైన చీకటిలో విషము లేకుండు నేజంతువుచే నైనను కరవబడిన యెడ విషమున్నదేమో యను శంకచే గల్గినవిషము శంకావిషము. అద్దాని వేగమునం జేసి వాంతియు జ్వరంబును మూర్ఛయు తాపంబును కల్గును. బడలికయు, మైకంబును, అతిసారంబును కల్గును. ఇయ్యది శంకావిషలక్షణము. (వాస్తవ్యముగ విషము లేకున్నను

విషముండుననుసంశయముచే మనసున భీతి జెంది శంకాప్రభావమునంజేసి విషమునందు వలె జ్వరము మున్నగు లక్షణములు కల్గునని భావము).

శంకావిషమునకు చికిత్సితము.

మూ. చికిత్సితమిదం తస్య కుర్యాదాశ్వాసయన్ బుధః. 222
సితా వైగన్ధికో ద్రాక్షా పయస్యామధుకం మధు,
పానం సమన్త్రపూతాంబు ప్రోక్షణం సాన్త్వహర్షణమ్ 223

వ్యా. అట్టి శంకావిషపీడితుని మంచిమాటలచే నూరడించుచు నీక్రింద చెప్పబడు చికిత్సితమును చేయవలెను—చక్కెర, శుద్ధిచేయబడిన గంధకము, ద్రాక్షపండు, క్షీరకాకోళి, అతిమధురము, తేనె, వీనిని జలమున జేర్చి యభిమంత్రించిన జలమును త్రాగుటయు, మంత్రింపబడిన పరిశుద్ధజలముచే ప్రోక్షించుటయు, మంచిమాటలచే నూరడించుటయు పైజెప్పిన శంకావిషమున హితముగ నుండును.

విషపీడితులకు హితకరములైన యన్నములు.

మూ. శాలయష్షష్టికాశ్చైవ కోరదూషాః ప్రియఙ్గవః.
భోజనార్థే ప్రశస్యన్తే, లవణార్థే చ సైన్ధవం,

వ్యా. శాలిధాన్యంబులును, అరువదినాళ్లసంబావులును, వరగలును, కొఱ్ఱలును, అన్నమునకై విషబాధితు లుపయోగించవలెను. ఉప్పు నుపయోగించుటకై సైంధవలవణము నుపయోగింపవలెను.

విషపీడితులకు హితములైన శాకములు.

మూ. తణ్డులీయకజీవన్తీవార్తాకసునిషణ్ణకాః. 224
చన్దుర్చ్ఛమణ్డూకపర్ణీ చ శాకం చ కులకం హితం,

వ్యా. చిఱ్ఱికూర, పాలకూర, వంగకాయలు, పులిచింతాకు, లేక (చుక్కకూర) యెలుకచెవియాకు, సరస్వతియాకు, చేదుపొట్ల, (లేక కాకర) ఇవి యన్నియు విషపీడితునకు శాకములకై యుపయోగించుట మంచిది.

విషపీడితులకు హితములైన యూషమాంసరసములు.

ధాత్రీ దాడిమమమ్లార్థే యూషా ముద్గహరేణుభిః. 225
రసాశ్చైణశిఖిశ్వావిల్లావతైత్తిరపార్షతాః,
విషఘ్నౌషధసంయుక్తా రసా యూషాశ్చ సంస్కృతాః. 226

అవిదాహీని చాన్నాని విషార్తానాం భిషగ్జితం,

వ్యా. ఆహారపదార్థములయందు పులుపు చేర్చుటకై యుసిరికకాయలరసమును పుల్లదానిమ్మరసమును చేర్చుట మంచిది. పెసలు, హరేణుకలుచేర్చి చేయబడిన యూషములును, జింకలు, నెమళ్లు, శల్యమృగములు, లావుకపిట్టలు, తీతువుపిట్టలు, పొడలయిఱ్ఱి (దుప్పి), ఈజంతువులమాంసరసములను విషహరౌషధముల జేర్చి సంస్కరింపబడిన మాంసరసములును యూషములును, విదాహకరములు గాని యన్నంబులును విషపీడితులకు చాల హితకరము లైయుండును.

విషపీడితులు విసర్జింపవలసినవి.

మూ. విరుద్ధాఽధ్యశనక్రోధక్షుద్భయాయాసమైథునమ్. 227
వర్జయేద్విషముక్తోఽపి దివాస్వప్నం విశేషతః,

వ్యా. అకాలభోజనము, (లేక పరస్పరసంయోగాదులచే విరుద్ధములగు క్షీరమత్స్యాదుల జేర్చి భుజించుట), అధ్యశనము (భుజించినవెంటనే మరల భుజించుట), క్రోధము, ఆకలిని నిరోధించుట, భయపడుట, శరీరమునకు శ్రమమును కల్గించు పనుల జేయుట, స్త్రీసంభోగము, వీనినన్నిటిని విషపీడితుడు విషముహరించినను కొంతకాలము విడువవలెను. మరియు పవటినిద్రను బొత్తుగవిడిచియుండుట ముఖ్యకర్తవ్యము.

పశ్వాదులకు కల్గిన దష్టవిషలక్షణములు

మూ. ముహుర్ముహుశ్శిరో న్యాసః శోథస్రస్తోష్ఠకర్ణతా (శుష్కోష్ఠకర్ణతా,) జ్వరః స్తబ్ధాఽక్షిగాత్రత్వం హనుకమ్పోఽఙ్గమర్దనమ్.
రోమాఽపగమనం గ్లానిః అరతిర్వేవథుర్భ్రమః,
చతుష్పదాం భవత్యేతత్ దష్టానామిహ లక్షణమ్. 230

వ్యా. నాల్గుకాళ్లుకలపశువులు మున్నగు జంతువులను పాము మున్నగు విషజంతువులు కరిచినయెడ నయ్యది మాటిమాటికిని తలను వణకించును. శరీరమున వాపు కల్గును. పెదవులును చెవులును పట్టు దప్పి సడలి వ్రేలుచుండును. (లేక ద్రవము లేక శుష్కించును), జ్వరము కల్గును, కన్నులును శరీరంబును స్తంభించి యుండును. దవుడలు వణకును, ఒడలంతయు నొప్పిపుట్టును. శరీరమునందలి రోమము లూడును. బడలి యుండును. అరతి కల్గును. కంపము కల్గును. శరీరము చుట్టి తిరిగి పడును. ఇవియన్నియు పాము మున్నగువానిచే కరవబడిన పశ్వాదులకు కల్గు లక్షణములు.

### పశ్వాదులవిషమునకు చికిత్స.

మూ. దేవదారు హరిద్రే ద్వే సరలం చన్దనాగరు (సురసం చన్దనాగరు),
రాస్నా గోరోచనాఽజాజీ గుగ్గుల్వ్రేతురసో నతమ్. 231
చూర్ణం ససైన్ధవాఽనన్తం గోపిత్తమధుసంయుతమ్,
చతుష్పదానాం దష్టానాం అగదస్సార్వకార్మికః. 232

వ్యా. దేవదారుచెక్క, పసుపు, మ్రానిపసుపు, సరళపు చెట్టుచెక్క, గంధపుచెక్క, అగరుచెక్క, సన్నరాష్ట్రము, గోరోచనము, జీలకర, గుగ్గిలము, గ్రంథితగరము, సైంధవలవణము, సుగంధపాల, వీని నన్నిటిని సమములుగ గూర్చి చూర్ణముచేసి చెరకురసమున కలిపి, అందు గోపిత్తమును తేనెను చేర్చిన, నియ్యది విషపీడితములగు పశ్వాదుల చికిత్సలన్నిటి కుపయోగింపదగినయౌషధము.

### గరవిషప్రయోగము, దాన గల్గులక్షణములు.

మూ. సౌభాగ్యార్థం స్త్రియః స్వేదరజోనానాఽఙ్గజాన్ మలాన్,
శత్రుప్రయుక్తాంశ్చ గరాన్ ప్రయచ్ఛన్త్యన్నమిశ్రితాన్. 233
తైస్స్యాత్ పాణ్డుః కృశోఽల్పాగ్నిః గరశ్చాస్యోపజాయతే,
మర్మప్రధమనాధ్మానం శ్వయథుం హస్తపాదయోః. 234
జఠరం గ్రహణీదోషం యక్ష్మాణం విషమజ్వరం,
(జఠరం గ్రహణీరోగో యక్ష్మా గుల్మః క్షయో జ్వరః,)
ఏవంవిధస్య చాన్యస్య వ్యాధేర్లిఙ్గాని దర్శయేత్. 235
స్వప్నే మార్జారగోమాయువ్యాళాన్ సనకులాన్ కపీన్,
ప్రాయః పశ్యతి నద్యాదీన్ శుష్కాంశ్చ సవనస్పతీన్. 236
కాలశ్చ గౌరమాత్మానం స్వప్నే గౌరశ్చ కాలకం,
వికర్ణనాసికం వాపి ప్రపశ్యేత్ విహతేన్ద్రియః. 237

వ్యా. స్త్రీలు తమభర్తలను స్వాధీనముగ జేసికొని సుఖము ననుభవించ నుద్దేశించి తమశరీరావయవములయందలి చెమటను బుతురక్తమును ఇతరములగు మలములను జేర్చి యౌషధమును సిద్ధముచేసి యన్నము మున్నగు భోజ్యపదార్థములలో కలిపి తమభర్తలకు పెట్టెదరు. మరియు శత్రువులుగ నుండు రాజులును జంతువులశల్యములు స్వల్పవీర్య

ములగువిషద్రవ్యములను జేర్చి యన్నాది భోజ్యపదార్థముల కలిపి వంటవారు భృత్యులు మున్నగువారి మూలమున శత్రువులకు బెట్టెదరు. ఇదియే గరమని చెప్పబడును.

అట్టి గరవిషమును తినుటవలన పాండురోగము, కృశత్వము కల్గును. మరియు నట్టిగరము క్రింద జెప్పబడు రోగరూపముగ పరిణమించును—మర్మస్థలములయందు మథించినవిధముగ బాధయు, కడుపుబ్బరంబును, కాలుసేతులయందు వాపును, మహోదరంబును, గ్రహణీరోగంబును, రాజయక్ష్మంబును, విషమజ్వరంబును కల్గును. మరియు నిట్టిలక్షణములు రోగాంతరంబులును సంక్రమించును. అట్టిరోగికి స్వప్నములలో పిల్లులు, నక్కలు, పులులు, ముంగిసలు, కోతులు, ఈజంతువులు కనబడును. నదులు నీళ్లులేకయు, చెట్లు ఎండియు, స్వప్నమున కనబడును. తనశరీరము నల్లగ నున్నను గౌరవర్ణముగ నున్నట్లును, గౌరవర్ణము కల్గియుండుసెడ నల్లగ నున్నట్లును (వ్యత్యస్తముగ) స్వప్నమున కనబడును. తనశరీరమును చెవులు ముక్కులు లేనట్లును తోచును. ఇట్టి వ్యత్యాసము ఇంద్రియముల పాటవము చెడుటచే సంభవించును. (ఈలక్షణములబట్టి గరపీడితుడని నిర్ణయింపవలెనని భావము.)

పైజెప్పిన గరభేదమును వాగ్భటాచార్యు లిట్లు చెప్పెను:—"సౌభాగ్యార్థం స్త్రియో భర్త్రే రాజ్ఞే వాఽరాతిచోదితాః, గరమాహారసంపృక్తం యచ్ఛన్త్యాసన్నవర్తినః. నానాప్రాణ్యఙ్గజమలవిరుద్ధౌషధిభస్మనామ్, విషాణాం చాఽల్పవీర్యాణాం యోగో గర ఇతి స్మృతః." (అ-హృ, ఉ. అ. 35)

### గరవిషచికిత్స, అందు వమనప్రయోగము.

మూ॥ తమవేక్ష్య భిషక్ ప్రాజ్ఞః పృచ్ఛేత్కిం కైః కదా సహ,
జగ్ధమిత్యవగమ్యాశు ప్రదద్యాత్ వమనం భిషక్. 238
సూక్ష్మం తామ్రరజస్తస్మై సక్షౌద్రం హృద్విశోధనమ్,

వ్యా. పైజెప్పిన లక్షణములు కలరోగిని జూచి జ్ఞానవంతుడగు వైద్యుడు 'నీవెప్పుడు ఎవరితో కూడి యేమి తింటివి' అని యడిగి, వాడు చెప్పునట్టిమాటలవలన గరవిషము ప్రయోగింపబడినట్లు తోచినయెడ వెంటనే వానికి మిగుల సూక్ష్మముగనుండు రాగిరాపొడిని తేనెలో కలిపి యిచ్చి వమనముల జేయించినచో హృదయము శుద్ధమగును.

### గరవిషమున స్వర్ణభస్మప్రయోగము.

మూ. శుద్ధే హృది తతశ్శాణం హేమచూర్ణస్య దాపయేత్. 239

హేమ సర్వవిషాణ్యాశు గరాంశ్చ వినియచ్ఛతి,
న సజ్జతే హేమపాఙ్గే విషం పద్మదలేఽమ్బువత్. 240

వ్యా. పైజెప్పిన వమనముచే హృదయము శుద్ధమయినపిదప శాణపరిమితమైన స్వర్ణభస్మము నియ్యవలయును. స్వర్ణభస్మము పలుతెరంగులైన విషములను, గరరూపమయినవిషమును, శీఘ్రముగ హరించును. మరియు స్వర్ణమును సేవించినవారికి శరీరమున యెట్టివిషమయినను (తామరాకులో జలమంటనిభంగి) అంటకుండును.

### సర్వవిషహరనాగదంత్యాదిఘృతము.

మూ. నాగదన్తీ త్రివృద్దన్తీ ద్రవన్తీస్నుక్పయఃఫలైః,
సాధితం మాహిషం సర్పిః సగోమూత్రాఢకం హితమ్. 241
సర్పకీటవిషార్తానాం గరార్తానాం చ శాన్తయే,

వ్యా. పెద్దపాపర, తెగడ, దంతివేళ్లు, ఎలుకచెవిచెట్టువేళ్లు, జెముడుపాలు, మ్రంగకాయ, వీనిని బఱ్ఱెనేతిలో చేర్చి, అందు ఆఢకపరిమితము గోమూత్రము కలిపి ఘృతపాకవిధిప్రకారము, పక్వముచేసి, ఈఘృతము నుపయోగించినయెడ సర్పములయొక్కయు కీటములయొక్క విషంబును, గరవిషంబును శమించును. (ఇచ్చట నాగదంతీమున్నగువానిని కల్కముచేసి ప్రస్థపరిమితమైన బఱ్ఱెనేతిలో నాల్గవవంతుగ చేర్చి గోమూత్రమును ద్రవమునకై ఆఢకపరిమితమున చేర్చి ఘృతమును సిద్ధముచేయునది.

### విషాదరోగహర అమృతఘృతము.

మూ. శిరీషత్వక్ త్రికటుకం త్రిఫలాం చన్దనోత్పలే. 242
ద్వే బలే సారిబాఽఽస్ఫోతాసురభీనిమ్బపాటలాః,
బన్ధుజీవాఢకీ మూర్వా వాసా సురసవత్సకాః. 243
పాఠాం కోలాశ్వగన్ధార్కమూలయష్ట్యాహ్వపద్మకాః,
విశాలాం బృహతీం లాక్షాం కోవిదారం శతావరీమ్. 244
కటభీదన్త్యపామార్గాః పృశ్నిపర్ణీరసాఞ్జనం,
శ్వేతభణ్డాశ్వఖురకౌ కుష్ఠదారుప్రియంగుకాః. 245
విదారీం మధుకాత్ సారం కరఞ్జస్య ఫలత్వచం,
రజన్యౌ లోధ్రమక్షాంశం పిష్ట్వా సాధ్యం ఘృతాఢకమ్ 246
తుల్యామ్బుభాగగోమూత్ర త్ర్యాఢకేతద్విషాపహం,

అపస్మారక్షయోన్మాదభూతగ్రహగరోదరమ్. 247
పాణ్డురోగాన్క్రిమీన్గుల్మాన్ప్లీహోరుస్తంభకామలాః,
హనుస్కంధగ్రహాదీంశ్చ పానాభ్యఞ్జననావనైః. 248
హన్యాత్సంజీవయేచ్చాపి విషోద్బన్ధమృతాన్నరాన్,
నామ్నేదమమృతం సర్వవిషాణాం స్యాద్ఘృతోత్తమమ్. 249
(ఇత్యమృతఘృతం.)

వ్యా. దిరిసెనపుపట్ట, త్రికటుకములు, త్రిఫలములు, చందనము, నల్లకలువలు, చిట్టాముట్టి, పేరాముట్టి, సుగంధపాల, అడవిమల్లె, గన్నేర, వేపపట్ట, పాదిరిపట్ట, మంకెన, కందులు, చాగపట్ట, అడ్డసరము, తెల్లతులసి, కొడిసెపాలవిత్తులు, చిరుబొద్ది, ఊడుగపట్ట, పెన్నేరుగడ్డ, తెల్లజిల్లేడువేరు, యష్టిమధుకము, పద్మకాష్ఠము, వెట్టివేరు, వాకుడు, లక్క, దేవకాంచనము, పిల్లితేగలు, యెక్కుడుతీగ, దంతివేళ్లు, ఉత్తరేణి వేళ్లు, కోలపొన్న, రసాంజనము, గులిమిడి, నెమ్మిపట్ట, చెంగల్వకోష్టు, దేవదారుచెక్క, ప్రేంకణము, నేలగుమ్ముడు, అతిమధురపుపాలు, కానుగకాయలు, కానుగపట్ట, పసుపు, మ్రానిపసుపు, లొద్దుగుపట్ట, వీని నన్నిటిని ఒక్కొక్కదానిని ఒక్కొక కర్షమువంతున గూర్చి నూరి కల్కముచేసి ఆఢకపరిమితమైన ఘృతమున జేర్చి, అందు మేకలయొక్కయు గోవులయొక్కయు మూత్రమును మూఁడాఢకములను దీనికి సమముగ మూఁడాఢకములు జలమును గూర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసిన నయ్యది యమృతఘృతమని చెప్పబడును.

ఈఘృతమును పానమునకును, అభ్యంగనమునకును, నస్యమునకు నుపయోగించిన యెడ అపస్మారము, క్షయము, ఉన్మాదము, భూతావేశములు, గ్రహములు, గరవిషము, మహోదరము, పాండురోగము, క్రిమిరోగము, గుల్మరోగము, ప్లీహవృద్ధి, ఊరుస్తంభ వాతము, కామలారోగము, హనుగ్రహము (అంకిళ్లు పట్టికొనువాతవ్యాధి) స్కంధ గ్రహము (మూఁపులు స్తంభించువాతము), ఇవి మున్నగువ్యాధుల నన్నిటిని నిర్మూలము చేయును. విషముచేతను, ఉరిబోసుకొనుటచేతను, చచ్చినవారి వెంటనే నస్యాదుల నుప యోగించినచో బ్రతికించును. కావుననే నియ్యది అమృతఘృతమని పేరుచే నుతికెక్కి నానావిధవిషములను హరింప కల్గియుండును.

## సర్పాదినివర్తనోపాయము.

భవన్తి చాత్ర:—

మూ. ఛత్రీ ఝర్ఝరపాణిశ్చ చరేద్రాత్రౌ తథా దివా,

తచ్ఛాయాశబ్దవిత్రస్తాః ప్రణశ్యన్త్యాశు పన్నగాః. 250

వ్యా. మనుజుడు పగటియందు గొడుగును రాత్రియందు ఝర్ఝరి యనువాద్యమును వాయించుచు సంచరించినయెడ పగటియందు గొడుగుయొక్కనీడను చూచియు, రాత్రియందు వాద్యధ్వనిని వినియు సర్పములు భయపడి పారిపోవును. కాన సర్పముచే వానికి నపాయము కలుగ నేరదు.

పాము కరచినవెంటనే చేయదగినచికిత్స.

మూ. దష్టమాత్రో దశేదాశు తం సర్పం లోష్టమేవ వా,
ఉపర్యరిష్టాం బధ్నీయాత్ దంశం ఛిన్ద్యాద్దహేత్తథా. 251

వ్యా. పాము కరిచినవెంటనే కరవబడినమనుజుడు ఆపామునే కరువవలెను. పాముదొరకనియెడ మట్టిపెళ్లనయినను కొరకవలయును. మరియు పాముకరచినతోడనే కాటుకు పైభాగమున పైజెప్పినరీతిగ అభిమంత్రించబడిన గుడ్డపేలిక మున్నగువానిచే గట్టిగ బిగకట్టి కాటును ఛేదించి కొరివితో కాల్చవలయును. అట్లుచేసినయెడ విషము పైకి వ్యాపించక శాంతపడును.

విషహారమణ్యాదిధారణము.

మూ. వజ్రం మరకతస్సారః పిచుకో విషమూషికాః,
కర్కేతనః సర్పమణిః వైడూర్యం గజమౌక్తికమ్. 252
ధార్యం గరమణిర్యాశ్చ వరౌషధ్యో విషాపహాః,
ఖగాశ్చ శారికాక్రౌఞ్చ శిఖిహంసశుకాదయః. 253

వ్యా. వజ్రము, మరకతము, సారము, పిచుకము, విషమూషిక యన విషహారమైనమణివిశేషము, కర్కేతనము, (పద్మరాగము), సర్పములశిరస్సున నుండుమణి, వైడూర్యము, యేనుగుకుంభస్థలమునందలి ముత్యములు ఇవి మున్నగువిషహారములగు మణివిశేషములను, విషహారములగు ఓషధివిశేషములను ధరించినయెడ విషమువలని బాధ కలుగదు. మరియు గోరువంకలు, క్రౌంచపుపక్షులు, నెమళ్లు, హంసలు, చిలుకలు మున్నగు విషహారములయిన పక్షులను ఇండ్లలో సాకి యుంచుకొన్నయెడ పాము మున్నగువిషజంతువులు చేరవు.

అధ్యాయవిషయసంగ్రహము.

తత్ర శ్లోకః—

మూ. ఇతీదముక్తం ద్వివిధస్య విస్తరైః బహుప్రకారం విషరోగభేషజం,

అధీత్య విజ్ఞాయ తథా ప్రయోజయన్ ప్రజేద్విషాణామవిష
హ్యతాం బుధః. 254

వ్యా. ఇత్తెరంగున రెండువిధములయి (స్థావర-జంగమభేదములచే) న విషముల యొక్క విస్తరముచే నానావిధభేదములును, వానిచే గల్గిన విషరోగములను, ఆయా విషమునకుదగిన చికిత్సాభేదములును ఈవిషచికిత్సాధ్యాయమున వివరింపబడినది. ఈవిషయముల నన్నిటిని చక్కగ చదివి తెలిసికొని తత్తదుచితముగా నుపయోగించుకొనునెడ యట్టివానిని విషముతో చేరిన యాపత్తు నొకప్పుడును బాధింపనేరదు.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే,
దృఢబలసంపూరితే చికిత్సాస్థానే విషచికిత్సితం నామ
త్రయోవింశోఽధ్యాయః.

వ్యా. ఇత్తెరంగున నగ్నివేశకృతంబును చరకప్రతిసంస్కృతంబును నైన చరకసంహిత యను నాయుర్వేదతంత్రమున చికిత్సాస్థానమునందలి దృఢబలసంపూరితభాగమున విషచికిత్సిత మనునది ఇరువదిమూడవ యధ్యాయము సమాప్తము.

---

## చతుర్వింశాధ్యాయము.

(ఈయధ్యాయము చరకప్రతిసంస్కృతము.)

అవతరణిక:— విషమునుబోలె మద్యంబును మోహ (అజ్ఞాన) జనకము. మరియు విషరోగమును బోలె మదాత్యయంబును కేవలగుణములచేతనే కల్గును. కావున అట్టి సాజాత్యమునుబట్టి విషచికిత్సితమును జెప్పినపిదప మదాత్యయచికిత్సితము చెప్పబడును:—

### మదాత్యయచికిత్సితప్రారంభము.

మూ. అథాతో మదాత్యయచికిత్సితం వ్యాఖ్యాస్యామః. 1
ఇతి హ స్మాహ భగవానాత్రేయః. 2

వ్యా. విషచికిత్సితమును జెప్పినపిదప విషమునకు సమానగుణమైన మద్యపానముచే గల్గు మదాత్యయమునకు దగుచికిత్సలను భగవానుడగు నాత్రేయు లుపదేశించినదానికన్న న్యూనాతిరేకము లేకుండునట్లు వివరించి చెప్పెదనని యర్థము.

### మద్యప్రశంస.

మూ. సురైస్సురేశసహితైః యా సురా (పురా) పరిపూజితా,
సౌత్రామణ్యాం హూయతే యా కర్మభిర్యా ప్రతిష్ఠితా. 3

యజ్ఞాహీ యా యయా శక్రః సోమాఽతిపతితో భృశం,
నిరోజ స్తమసాఽఽవిష్టః తస్మాద్దుర్గాత్సముద్ధృతః. 4
విధిభిర్వేదవిహితైః యాయజద్భిర్మహాత్మభిః,
దృశ్యా స్పృశ్యా ప్రకల్ప్యా చ యజ్ఞీయా యజ్ఞసిద్ధయే 5

వ్యా. సుర యనునది తొలుత నింద్రాదిదేవతలచే పూజితమైనది. సౌత్రామణి యను యాగవిశేషము దేవతల నుద్దేశించి హోమము చేయుటకై ఆయాదేవతాస్తుతి రూపములైన మంత్రపూర్వకముగ గ్రహింపబడి విధ్యుక్తప్రకారము హోమము చేయ బడినది. వేదములను శ్రౌతములను చక్కగ దెలిసి వేదవిహితములగు యాగాది సత్కర్మల నాచరించు ద్విజోత్తములచే ప్రతిష్ఠనొందినది. సురాహోమవిధానమును ప్రధానముగ గలయజ్ఞముల నన్నిటిని వహించునది. మరియు సోమము నధికముగ పానము చేయుటవలన నింద్రుడు తమోగుణముచే నావేశమునొంది శరీరమునందలి ప్రాణములకు ముఖ్యాధారమైన యోజస్సు చెడియుండునపుడు అట్టి కష్టమునుండి యింద్రుని ఉద్ధరించుటకు కారణమైనది. వేదచోదితములగువిధానములచే యాగమున నొనరించు మహనీయులగు బ్రాహ్మణులకు చూచుటకును, అభిషవాదికర్మలచే స్పృశించుటకును సంధానాదివిధుల గల్పించుటకును అర్హమైనది. యజ్ఞపరిపూర్తికి కారణమగుటంజేసి యజ్ఞసంబంధమైనది.

ఇచ్చట—తొలుత సురలచే పూజింపబడినది యని చెప్పుటచే నీకారణమువలననే సుర యనుపేరు మద్యమునకు కల్గినదని తంత్రకారుల యభిప్రాయము. ('యజ్ఞాహీ' అనుపదము 'యజ్ఞం వహతీతి, యజ్ఞాహీ'యను వ్యుత్పత్తిచే సిద్ధమైనది. 'యజ్ఞ—వహ' అని యుండ "వాహఊఠ్" అను సూత్రముచే సంప్రసారణరూపమైన 'ఊఠ్' అనునాదేశమువచ్చి, 'యజ్ఞ—ఊహీ' అని యుండ "ఏత్యేధత్యూఠ్సు" అనుసూత్రముచే వృద్ధి వచ్చి, 'యజ్ఞాహీ' అని రూపమేర్పడును.)

### మద్యసామాన్యలక్షణము.

మూ. యోనిసంస్కారనామాద్యైః విశేషైర్బహుధా చ యా,
భూత్వా భవత్యేకవిధా సామాన్యాన్మదలక్షణాత్. 6

వ్యా. మరియు నీసురయనునది దానియుత్పత్తికారణములయిన ధాన్యములు ఫలములు మున్నగువిశేషములచేతను, సంస్కారవిశేషములచేతను, సుర, మధువు, మైరేయము మున్నగునామధేయవిశేషములచేతను పలుతెరంగులైయుండును. అయినను

మదమును కల్గించునది యను సామాన్యమయిన యొకలక్షణమువలన నేకరూపముగ మద్యమని వ్యవహరింపబడును. మద్యమున కుత్పత్తికారణములు ధాన్య-ఫల-మూల-సార-పుష్ప-పత్త్ర-కాణ్డ-త్వక్-శర్కర-యనుద్రవ్యములు తొమ్మిదియని సూత్రస్థానమున వివరింపబడినది. (అట్టికారణభేదములచే సురయనునది పలుతెరంగులైయున్నను అన్నిటియందును సామాన్యముగ మదరూపలక్షణము ఏకవిధముగ నుండుటవలన మద్యమనేపదముచేత చెప్పబడునని భావము.)

మూ. యా దేవానమృతం భూత్వా స్వధా భూతా పితౄంశ్చ యా,
సోమో భూత్వా ద్విజాతీన్ యా యుఙ్క్తే శ్రేయోభిరుత్తమైః.

వ్యా. మరియు నీసుర అమృతమున కధిష్ఠానమయిన దేవతారూపమునంది దేవతలకును స్వధాశబ్దవాచ్యమైన దేవతారూపము నొంది పితృదేవతలకును, సోమరూపము నొంది బ్రాహ్మణాది ద్విజులకును మిగుల నుత్తమములైన శుభము లొనగూర్చుచుండును. (ఇచ్చట సోమయాగప్రధానమయిన యజ్ఞముల నాచరించువారికి కేవల మైహిక సుఖములే గాక స్వర్గాద్యుత్తమలోకప్రాప్తిరూపమయిన పారత్రికసౌఖ్యమును కల్గించుటకు సోమరూపమైన మద్యమే కారణమైనదని కొనియాడబడినది. ఈవిషయమును గీతాచార్యులును నిట్లుపదేశించిరి:— "త్రైవిద్యా మాం సోమపాః పూతపాపాః యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయన్తే, తే పుణ్యమాసాద్య సురేంద్రలోకం అశ్నన్తి దివ్యాన్దివి దేవభోగాన్." (భగవద్గీత.)

## సురాప్రాశస్త్యము.

మూ. ఆశ్వినం యా మహత్తేజో బలం సారస్వతం చ యా,
వీర్యమైన్ద్రఞ్చ యా సిద్ధా సోమః సౌత్రామణౌ చ యా. 8
శోకారతిభయోద్వేగనాశినీ యా మహాబలా,
యా ప్రీతిర్యా రతిర్యా వాక్ యా పుష్టిర్యా చ నిర్వృతిః. 9

వ్యా. మరియు నీసుర అశ్వినీదేవసంబంధమయిన గొప్ప తేజోరూపమయి యుండును. వేదసంబంధమయిన మంత్రబలరూపమైయుండును. ఇంద్రసంబంధమైన వీర్యరూపము నొందియుండును. సౌత్రామణి యను యాగవిశేషమున సోమరూపము నొందియుండును. అట్టియీసుర శోకమును, అరతిని, భయమును, ఉద్వేగమును పోగొట్టునదియు, మహత్తరమైన బలమును కల్గించునదియునై ప్రీతిని, రతిని, వాక్కును, పుష్టిని, నిరతిశయసుఖమును, వరుసగ నానారూపముల బొంది కల్గించుచుండును.

### సురాపానప్రశంస

మూ. యా సురా సురగన్ధర్వయక్షరాక్షసమానుషైః,
రతిః సురేత్యభిహితా తాం సురాం విధినా పిబేత్. 10

వ్యా. మరియు నియ్యది దేవతలు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, మనుష్యులు అనువారందరిచేతను; ప్రీతిని కల్గించునట్టిది సురయని కొనియాడబడినది. అట్టి విశేషగుణములు గల సురయను మద్యమున నీక్రింద చెప్పబడువిధి ననుసరించి పానము చేయదగును.

ఇచ్చట "సురైః సురేశసహితైః" అని యుపక్రమించి మద్యముయొక్క యుత్కృష్టతయు దాన గల్గు గుణవిశేషంబులును పరిశుద్ధతయు, మున్నగునవి స్తుతిరూపముగను, సహేతుకముగను చెప్పబడినవి. అవియన్నియు విధివిహితప్రకారము చేయబడిన సురాపానమువలన కల్గునని యెరుంగునది. ఈవిషయమునే యుపసంహారమున "తాం సురాం విధినా పిబేత్" అని తంత్రకారు లుపదేశించిరి.

### సురాపానవిధి.

మూ. శరీరకృతసంస్కారః శుచిరుత్తమగన్ధవాన్,
ప్రావృతో నిర్మలైః వస్త్రైః యథర్త్వాద్దామగన్ధిభిః. 11
విచిత్రవివిధస్రగ్వీ రత్నాభరణభూషితః,
దేవద్విజాతీన్సంపూజ్య స్పృష్ట్వా మఙ్గళముత్తమమ్. 12
దేశే యథర్తుకే శస్తే కుసుమప్రకరీకృతే,
సంవాససమ్మతే (సరసాసమ్మతే) ముఖ్యే ధూపసంమోదబోధితే. 13
సోపధానే సుసంస్తీర్ణే విహితే శయనాసనే,
ఉపవిష్టోఽథ వా తిర్యక్ స్వశరీరసుఖే స్థితః. 14
సౌవర్ణై రాజితైశ్చాపి తథా మణిమయైరపి,
భాజనైర్విమలైశ్చాన్యైః సుకృతైశ్చ పిబేత్సదా. 15

వ్యా. మద్యమును పానముచేయ తలచినవాడు బాహ్యములగు స్నానవస్త్రాదులచేతను, అభ్యంతరములగు ప్రకృతి మున్నగువానికి అనుగుణములైన స్నిగ్ధోష్ణాది గుణములతో కూడిన యన్నపానాదులచేతను తన శరీరమునకు సంస్కారము చేసుకొని పరిశుద్ధమయిన మనస్సు కలవాడై మిగుల శ్రేష్ఠములయిన వాసనద్రవ్యములచే పరిమళముతో

కూడి స్వచ్ఛములైన ఆయాఋతువునకు అనుగుణములైన వస్త్రములధరించి చిత్రవర్ణములు గల్గి పలు తెరంగులైన పుష్పమాలికలను, రత్నఖచితమైన యాభరణములను ధరించి దేవతలను బ్రాహ్మణులను యథోచితముగ పూజించి మంగళకరమైన ద్రవ్యములను స్పృశించి ఆయాఋతువునకు తగిన శీతోష్ణపరిస్థితిచే ప్రశస్తంబును పుష్పములచే వ్యాప్తంబును వసించుటకు యోగ్యంబును పరిమళయుక్త ధూపములచే వ్యాపించినదియు తలగడలతో కూడిన శయనాసనములచే వ్యాప్తమైనదియు నగు ప్రదేశమున సుఖముగ కూర్చొనినయైనను, తనశరీరమునకు సుఖముగ నుండునట్లు శయ్యపై కొంచెముగ నొరగియైన నుండి బంగరు వెండిగిన్నెలచేనైనను, మణులతో చేయబడిన పాత్రలచేనైనను, నిర్మలములై రమ్యముగ చేయబడిన నితరములగు పాత్రలచేనైనను, పైజెప్పబడిన నిర్దుష్టమైనమద్యమును త్రాగవలయును.

## మద్యపానమున విశేషవిధి.

మూ. రూపయౌవనమత్తాభిః శిక్షితాభిర్విశేషతః,
వస్త్రాభరణమాల్యైశ్చ భూషితాభిర్యథర్తుకైః. 16
శౌచానురాగయుక్తాభిః ప్రమదాభిరితస్తతః,
సంవాహ్యమాన ఇష్టాభిః పిబేన్మద్యమనుత్తమమ్. 17

వ్యా. మరియు రూపముచేతను, యౌవనముచేతను, మదించినవారు, సమయోచితములగు నుపచారముల జేయుట కలవాటుపడినవారును, ఆయాఋతువునకు తగినట్లు వస్త్ర-ఆభరణ-పుష్పమాలికలచే నలంకరింపబడినవారును, పరిశుద్ధతయు అనురాగంబును కలవారును అగు స్త్రీలచేత నిరుప్రక్కల వారిహస్తములచే విలాసార్థమై పట్టుకొనబడి మనస్సు కింపుగ వారితో కూడి సంచరించుచు మద్యమును త్రాగవలయును.

## మద్యపానపూర్వనియమములు.

మూ. మద్యానుకూలైర్వివిధైః ఫలైర్హరితకైః శుభైః,
లవణైర్గన్ధపిశునైః అవదంశైర్యథర్తుకైః. 18
భృష్టైర్మాంసైర్బహువిధైః భూజలామ్బరచారిణాం,
పౌరోగవవర్గవిహితైః భక్ష్యైశ్చ వివిధాత్మకైః. 19
పూజయిత్వా సురాన్పూర్వం ఆశిషః ప్రాక్ప్రయుజ్య చ,
ప్రదాయ సజలం మద్యం అర్థిభ్యో వసుధాతలే. 20

(పిబేత్సంపూజ్య విబుధానాశిషస్సమ్ప్రయుజ్య చ,
ప్రదాయ యజనం చాగ్రే త్వర్థిభ్యః పృథివీతలే.)

వ్యా. మరియు మద్యమున కనుకూలమయిన గుణాదులు కల్గి పలుతెరంగులైన పండ్లను, ఆకుకూరలను, ఉప్పుతో కూడి పరిమళయుక్తములై ఆయాబుతువున కనుగుణ మగు నూరుగాయలను, భూమియందు సంచరించు కోడి మున్నగు జంతువులయొక్కయు, జలచరములయిన మత్స్యాదులయొక్కయు, మింట సంచరించు పక్షులయొక్కయు, పలు తెరంగులైన మాంసములను చక్కగ సంస్కరించి పక్వముచేయబడినవానిని పాకశాస్త్రమును చక్కగ నెరింగిన వంటవారిచే పలువిధములుగ చేయబడిన భక్ష్యములను, వీని నన్నిటిని సిద్ధముచేసికొని తొలుత నిష్టదేవతలను పూజించి యట్టి దేవతానుగ్రహము బడసి మద్యము నభిలషించువారికి తొలుత నొసంగి దేవతాప్రీతిగ కొంతమద్యమును భూమిపై నునిచి పిదప పైజెప్పినవ్యంజనముల నప్పుడప్పు డుపయోగించుకొనుచు సంతుష్టచిత్తుడై మద్యమును త్రాగవలయును. (ఇచ్చట "పౌరోగవర్గ" అన వంటవారని యర్థము.)

(ఇచ్చట "శరీరకృతసంస్కారః" అనుశ్లోకము మొదలుజేసి మద్యపానవిధి యింత దనుక చెప్పబడినది. ఈవిషయమునే వాగ్భటాచార్యులును "స్నాతః ప్రణమ్య...పిబేన్మద్యమ్" (అ. హృ. చి. అ. ౭ శ్లో. ౭౫-౮౫) అనుగ్రంథముచే విపులముగ జెప్పిరి.)

### వాతప్రకృతి ననుసరించి మద్యపానవిధి.

మూ. అభ్యఙ్గోత్సాదనస్నానవాసోధూపానులేపనైః,
స్నిగ్ధోష్ణైర్భావితశ్చాన్నైర్వాతికో మద్యమాచరేత్. 21

వ్యా. వాతప్రకృతికలమనుజుడు తైలాదులచే నభ్యంగనము చేసికొని, నలుగులు బెట్టికొని, స్నాన మాచరించి, వస్త్రములచేతను, ధూపములచేతను, చందనాద్యనులేపనములచేతను శరీరసంస్కారము చేసుకొని స్నిగ్ధంబులును ఉష్ణంబులు నైన భోజ్యపదార్థముల భుజించి, పిమ్మట మద్యము పానము చేయదగును.

### పిత్తప్రకృత్యనుగుణ మద్యపానవిధి.

మూ. శీతోపచారైర్వివిధైర్మధురస్నిగ్ధశీతలైః,
పైత్తికో భావితశ్చాన్నైః పిబన్మద్యం న సీదతి. 22

వ్యా. పిత్తప్రకృతికలమనుజుడు పలుతెరంగులైన శీతోపచారములు చేసికొని మధురంబులును, స్నిగ్ధంబులును, శీతవీర్యములు నైన యన్నపానములచే ఆభ్యంతరసంస్కారము చేసికొని విధ్యుక్తప్రకారము మద్యమును పానముచేసినయెడ చాల గుణవత్తరమైయుండును.

కఫప్రకృతియందు మద్యపానవిధి.

మూ. ఉపచారైరశిశిరైః యవగోధూమభుక్పిబేత్,
శ్లైష్మికో ధన్వజైః మాంసైః మద్యం మరిచకైస్సదా. 23

వ్యా. కఫప్రకృతికలమనుజుడు ఉష్ణములయిన జలాదులచే స్నానాభ్యంగాద్యుపచారముల చేసికొని యవలయొక్కయు గోధుమలయొక్కయు యన్నమును భుజించి జాంగలజంతువులమాంసమును మిరియములపొడిచే సంస్కరించి వాని నుపయోగించుచు మద్యమును పానముచేయదగును.

సామాన్యమైన యుపపత్తి కలవారికి మద్యపాననియమము.

మూ. విధిర్వసుమతామేష భవిష్యద్విభవాశ్చ యే,
యథోపపత్తికైర్మద్యం పాతవ్యం మాత్రయా హితమ్. 24

వ్యా. మద్యపానమును గూర్చి పైజెప్పబడినవిధానమంతయు మిక్కిలి ద్రవ్యవంతులుగ నున్నవారికే వలనుపడును కావున వారి నుద్దేశించి చెప్పబడినవి. అట్టివైభవము లేనివారలు వారివారి యుపపత్తికి తగినసంవిధానమును చేసికొని తగినపరిమాణముతో హితమయినమద్యమును త్రాగవలయును.

వాత-పిత్త-కఫాధికులకు హితకరమద్యములు.

మూ. వాతికేభ్యో హితం మద్యం ప్రాయో గౌడికపైష్టికం,
కఫపిత్తాధికేభ్యస్తు మార్ద్వీకం మాధవం చ యత్. 25

వ్యా. వాతప్రకృతి కలవారికి గుడముచే సిద్ధమైన (గౌడిక) మద్యంబును, పైష్టిక (పిష్టముచే సిద్ధమైన)మద్యంబును, హితముగ నుండును. కఫం బధికముగ కలవారికి మాధవ (తేనెతో సిద్ధమైన) మద్యంబును, పిత్తంబధికముగ కలవారికి మార్ద్వీక (ద్రాక్షపండ్లతో సిద్ధమైన) మద్యంబును హితకరములు. (ఇచ్చట "కఫపిత్తాధికేభ్యః" అనుదానికి "మార్ద్వీకం మాధవం" అనుపదములు విపర్యయముగ "కఫాధికేభ్యః మాధవం, పిత్తాధికేభ్యః మార్ద్వీకం" అని యన్వయించునది).

మద్యమున గుణ-దోషములు కలిసియుండుటకు కారణము.

మూ. బహుద్రవ్యం బహుగుణం బహుకర్మమదాత్మకం,
గుణైర్దోషైశ్చ తన్మద్యం ఉభయం చోపలక్ష్యతే. 26

వ్యా. మద్యము అనేకద్రవ్యములచే సిద్ధముచేయబడినది. కావున ననేకములగు లఘుసూక్ష్మాదిగుణములు కల్గియుండును. కావుననే లేఖనదీపనాదికర్మల ననేకముల

జేయును. మదమును (మత్తును) కల్గించునది. పైజెప్పినవిధముగ ద్రవ్యగుణాదు లనేకములు మిశ్రములై చేరియుండుటవలన గుణములతోడను దోషములతోడను గూడి యుభయాత్మకమై కనబట్టును. (కొందరికి యోగికమగుటంజేసి గుణకరంబుగను, కొందరికి యోగికము కామింజేసి దోషకరంబుగను పరిణమించునని యర్థము. మరియు క్రింద జెప్పబడు మూడువిధములైన మదములలో ప్రథమమదమున గుణకరంబును, రెండుమూడు మదములయందు దోషకరంబు నైయుండును).

{ విధ్యుక్తముగ సేవింపబడిన మద్యగుణములు, విధినతిక్రమించి సేవింపబడిన మద్యమున గల్గుదోషములును. }

మూ. విధినా మాత్రయాం కాలే హితైరన్నైర్యథాబలం,
ప్రహృష్టో యః పిబేన్మద్యం తస్య స్యాదమృతం యథా. 27
యథోపేతం పునర్మద్యం ప్రసఙ్గాద్యేన పీయతే,
రూక్షవ్యాయామనిత్యేన విషవద్యాతి తస్య తత్. 28

వ్యా. మద్యమును మద్యపానము నుద్దేశించి పైని చెప్పబడిన విధిప్రకారము తగిన పరిమాణముతో హితములైన యన్నాదుల సేవించి వారివారిబలానుగుణముగ సంతుష్టచిత్తుడై మద్యమునకు యుక్తమైనకాలమున త్రాగినయెడ నయ్యది యమృతమువలె శరీరమునకు బలము పుష్టి మున్నగుగుణములగల్గించును. మరియు రూక్షాహారములను చేయుచు శరీరవ్యాయామమును నిరంతరము చేయువాడు శ్రేష్ఠముకాని మద్యమును త్రాగినను, మితిమీరి పలుమారు మద్యమును త్రాగినను, అయ్యది విషమును బోలె ప్రాణాంతకరమగును.

మద్యముచే మదము కల్గువిధము.

మూ. మద్యం హృదయమావిశ్య స్వగుణైరోజసో గుణాన్,
దశభిర్దశ సంక్షోభ్య చేతో నయతి విక్రియామ్. 29

వ్యా. మద్యమును త్రాగినప్పుడు వెంటనే (యోజస్సునకు స్థానమైన) హృదయమున జేరి, తనయందలి (మద్యమునందలి) లఘూష్ణాది దశగుణములచే నోజస్సునందలి గురుశీతాదిగుణములను పదిటిని చెరిచి చిత్తమునకు వికారమును కల్గించును.

మద్యమునందలి పదిగుణములు.

మూ. లఘూష్ణతీక్ష్ణసూక్ష్మాఽమ్లవ్యవాయ్యాశుగమేవ చ,
రూక్షం వికాసి విశదం మద్యం దశగుణం స్మృతమ్. 30

వ్యా. లఘుత్వము (తేలిక), ఉష్ణము (వేడి), తీక్ష్ణత్వము, సూక్ష్మము, అమ్ల
(పులుపు), వ్యవాయి (జీర్ణముకాకయే వ్యాపించుస్వభావము), ఆశు (శీఘ్రకారి), రూక్ష
(జిడ్డులేకుండుట), వికాసి (తైలబిందువు నీటిలో వ్యాపించునట్లు విస్తరించుస్వభావము)
విశదము (విడివిడిగ నుండుస్వభావము), అనునీపదిగుణములును మద్యమున చేరియుండు

### ఓజస్సునందలి పదిగుణములు.

మూ. గురు శీతం మృదు శ్లక్ష్ణం బహలం మధురం స్థిరం,
ప్రసన్నం పిచ్ఛిలం స్నిగ్ధం ఓజో దశగుణం స్మృతమ్.

వ్యా. గురుత్వము, శీతము (చల్లదనము), మృదుత్వము (మెత్తన), శ్లక్ష్ణము, బ
లము, మాధుర్యము, స్థిరత్వము, ప్రసన్నత, పిచ్ఛిలము (జిగురు కల్గియుండుట), స్నిగ్ధ
(జిడ్డు), అను నీపదిగుణంబులును ఓజస్సున చేరియుండును.

### మద్యగుణములు ఓజోగుణముల జెరచువిధము.

మూ. గురుత్వం లాఘవాత్ శైత్యమౌష్ణ్యాత్ అమ్లస్వభావతః,
మాధుర్యం మార్దవం తైక్ష్ణ్యాత్ ప్రసాదం చాశుభావనాత్
రౌక్ష్యాత్ స్నేహం వ్యవాయిత్వాత్ స్థిరత్వం శ్లక్ష్ణతామపి,
వికాసిభావాత్ పైచ్ఛిల్యం వైశద్యాత్ సాన్ద్రతాం తథా.
సౌక్ష్మ్యాత్ మద్యం నిహన్త్యేవ మోజసః స్వగుణైర్గుణాన్,

వ్యా. మద్యమునందలి లఘుగుణమువలన నోజస్సునందలిగురుత్వమును హరించ
ఇత్తెరంగుననే ఉష్ణగుణమువలన శీతంబును, అమ్లరసము (పులుపు) మాధుర్యంబును,
గుణమువలన మార్దవమును, శీఘ్రకారిత్వమువలన ప్రసాదగుణమును, రూక్షగుణము
స్నిగ్ధత్వమును, వ్యవాయి (వ్యాపించు) గుణమువలన స్థిరత్వంబును, వికాసిస్వభా
వలన శ్లక్ష్ణతను, విశదస్వభావమువలన పిచ్ఛిలత్వంబును, సూక్ష్మగుణమువలన సా
త్వంబును వరుసగ నోజోగుణములు విషగుణములచే చెడును.

ఇచ్చట చెప్పబడినగుణములలో వికాసిత్వము ఆశుగత్వము మున్నగు కొన్ని
ములు వింశతిగుణములలో జెప్పబడలేదు. అయినను గుణము లనంతము లగుటవలన
గూడ గుణములనియే చెప్పబడును. వింశతిగుణపరిగణనమున ప్రవ్యక్తతరముగ న
నవియే సుప్రసిద్ధముగ జేర్కొనబడినవి యని యెరుంగునది.

### మద్యపానాధిక్యముచే మదము కల్గువిధము.

మూ. సత్వం తదాశ్రయం చాశు సంక్షోభ్య జనయేన్మదమ్.

రసవాతాది(రసధాత్వాది)మార్గాణాం సత్త్వబుద్ధీన్ద్రియాత్మనాం,
ప్రధానస్యౌజసశ్చైవ హృదయం స్థానముచ్యతే. 35
అతిపీతేన మద్యేన విహతేనౌజసా చ తత్,
హృదయం యాతి వికృతిం తత్రస్థా యే చ ధాతవః. 36

వ్యా. పైజెప్పిన రీతిగ మద్యము తనయందలి గుణములచేత ఓజస్సునందలి గుర్వాది గుణములను చెరిచి, అట్టియోజస్సు నాశ్రయించియుండు సత్త్వమును (మనస్సును) సంక్షోభమునొందించి మదమును కల్గించును.

మరియు రసాదిధాతువులకును వాతాదిదోషములకును శరీరమున సంచరించుటకు మార్గములైన పది ధమనులకును, మనస్సు బుద్ధి చక్షురాదీంద్రియములు చేతనాధాతురూపమైన యాత్మ అనువానికిని, (ప్రాణమునకు ముఖ్యాధారమగుటంజేసి) ప్రధానమైన యోజస్సుకును హృదయము స్థానము. మద్యమును అధికముగ (మితిమీరి) త్రాగుటవలన నోజస్సుచెడినయెడ దానికాశ్రయభూతమగు హృదయంబును, అట్టి హృదయమునాధారముగ జేసికొనియుండు సత్వము బుద్ధి ఇంద్రియములు మున్నగుధాతువులును స్వాభావికగుణములు మారి వికృతిజెందును. (ఇత్తెరంగున మద్యపానాధిక్యముచే మదము కల్గునని భావము.)

వివరణము:—సకలప్రాణులకును హృదయము ముఖ్యాధారము. ఎట్లనన—బాహువులు మున్నగు షడంగములతో కూడినశరీరంబును, విజ్ఞానంబును, చక్షురాదీంద్రియములును, శబ్దాదితన్మాత్రములును, సుఖాదిగుణములతో కూడినయాత్మయు, మనస్సును, మనస్సుకు విషయమైన సంకల్పంబును, హృదయము నాధారముగ జేసికొనియుండును. అట్టిహృదయము పైజెప్పిన భావముల నన్నిటిని (ఇంటికాధారభూతమైన స్తంభము ఆయింటికి సంబంధించిన పైసామానును ధరించి యుండునట్లు) ధరించియుండును. మరియు జీవాత్మకు ముఖ్యాధారమైన ఓజస్సునకును ముఖ్యస్థానమై యుండును. ఈవిషయముచే అర్థేదశమహామూలీయమున తంత్రకారు లిట్లు చెప్పిరి:—"షడఙ్గమఙ్గం విజ్ఞానం ఇంద్రియాణ్యర్థపఞ్చకమ్, ఆత్మా చ సగుణశ్చేతః చిన్త్యఞ్చ హృది సంశ్రితమ్. ప్రతిష్ఠార్థం హి భావానాం ఏషాం హృదయమిష్యతే, గోపానసీనామాగార కర్ణికే వార్థచిన్తకైః. ...............తత్పరస్యౌజసస్థానం తత్రచైతన్యసఙ్గ్రహః." (సూ. అ ౩౦ శ్లో. ౪-౬) ఇత్తెరంగున ప్రాణమునకు ముఖ్యాధారమై యోజస్సు హృదయము నాశ్రయించి యుండును.

అట్టి హృదయాశ్రయమైన యోజస్సునందలి గుర్వాదిగుణములను మద్యము తనయందలి లఘ్వాదిగుణములచే హరింపజేయును. మద్యమునందలి పదిగుణంబులును, ఓజో

నిష్ఠగుణములకు విరుద్ధములు గాన "వృద్ధిస్సమానస్సర్వేషాం విపరీతైర్విపర్యయః" యను న్యాయప్రకారము ఓజోగుణములను చెరచును. దానంజేసి యోజస్సు బలహీనమై వికృతి జెందినపుడు అట్టియోజస్సు నాశ్రయించియుండు సత్వము, బుద్ధి, ఇంద్రియములు మున్నగుధాతువు లన్నియు వికృతిజెందును. దానంజేసి మదాత్యయము కల్గును. ఇదియే మదాత్యయసంప్రాప్తిక్రమము.

### మదము మూడు తెరంగు లగుట కుపపత్తి.

మూ. ఓజస్యభిహతే పూర్వః హృది చ ప్రతిబోధితే,
మధ్యమోఽభిహతేఽల్పే చ, విహతే తూత్తమో మదః. 37

వ్యా. మద్యమును విధ్యుక్తప్రకారము మితముగ సేవించినయెడ ఓజస్సు అభిఘాతము గల్గకుండును. అట్టియెడ హృదయము నాశ్రయించి యుండు మనస్సు బుద్ధి మొదలగునవి ప్రబోధము నొందియుండును. ఇది మొదటి మదము. అట్టిమద్యమువలన ఓజస్సుకు స్వల్పముగ సంక్షోభము కల్గినయెడ మధ్యమమదము కల్గును. ఓజస్సుకు పూర్తిగ నభిఘాతము కల్గినప్పుడు ఉత్తమమదము కల్గును.

### పైష్టికమద్యమున గుణవిశేషము.

మూ. నైవం విఘాతం జనయేత్ మద్యం పైష్టికమోజసః,
వికాశిరూక్షవిశదా గుణాస్తత్ర హి నోల్బణాః. 38

వ్యా. పిష్టముచే సిద్ధమయిన మద్యమునందు మిక్కిలి యుద్రేకమును కల్గించు వికాసిరూక్షవిశదగుణములు మూడును లేవు కావున ఓజస్సును అత్యుత్కటముగ చెరుప నేరదు. కావున పైష్టికమద్యము పైజెప్పిన యుత్తమమదమును గలిగింపనేరదు.

### మదసామాన్యలక్షణము.

మూ. హృది మద్యగుణావిష్టే హర్షస్తర్షో రతిస్సుఖం,
వికారాశ్చ యథాసత్వం చిత్రా రాజసతామసాః. 39
జాయన్తే మోహనిద్రాన్తా మద్యస్యాతినిషేవణాత్,
స మద్యవిభ్రమో నామ్నా మద ఇత్యభిధీయతే. 40

వ్యా. మద్యముయొక్క గుణములు హృదయమున వ్యాపించినపుడు హర్షము (సంతోషము), తర్షము (అభిలాషము), రతి (అనురాగము), సుఖము, అనునవి కల్గును. మరియు ఆయాప్రకృతి ననుసరించి రజోగుణమునకును, తమోగుణమునకును సంబంధించిన

ఆయావికారములు కల్గును. అట్టి వికారములు మోహము (మూర్ఛ), నిద్రయు, నంతముగ కల్గియుండును. ఇవి మద్యము నధికముగ సేవించుటవలన కల్గును. మద్యముచే కల్గిన నీచిత్తవిభ్రమము మదమని చెప్పబడును. (ఇచ్చట రాజసగుణము కల్గినవారికి రాజసదోషమునకు వికారములును, తమోగుణము ప్రకృతిగాగలవారికి తామసదోషమునకు సంబంధించిన వికారములును సంభవించునని యెఱుంగునది.)

### మదత్రైవిధ్యము.

మూ॰ పీయమానస్య మద్యస్య విజ్ఞాతవ్యా స్త్రయో మదాః,
ప్రథమో మధ్యమోఽన్త్యశ్చ లక్షణైస్తాన్ప్రచక్ష్మహే. 41

వ్యా॰ త్రాగబడిన మద్యమువలన ప్రథమ-మధ్యమ-ఉత్తమభేదములచే మూడు విధములయిన మదములు సంభవించును. ఆమూటికిని ప్రత్యేకలక్షణములు నీక్రింద చెప్పబడును. ఆలక్షణములబట్టి మదభేదములు వేరువేరుగ నెఱుంగదగియుండును.

### ప్రథమమదలక్షణము.

మూ॰. ప్రహర్షణః ప్రీతికరః పానాన్నగుణదర్శకః,
వాద్యగీతప్రహాసానాం కథానాఞ్చ ప్రవర్తకః. 42
న చ బుద్ధిస్మృతిహరో విషయేషు న చాక్షమః,
సుఖనిద్రాప్రబోధశ్చ ప్రథమః సుఖదో మదః. 43

వ్యా॰ మద్యపానముచే కల్గిన ప్రథమమదమున మనస్సునకు సంతోషంబును, ప్రీతియు కల్గును. అన్నపానగుణములను చక్కగ తెలిసికొనగల్గియుండును. వాద్యముల వాయించుటయందును, సంగీతము పాడుటయందును, నవ్వుటయందును, కథలు చెప్పుటయందును, ఉత్సాహము కల్గించును. బుద్ధిని, జ్ఞాపకశక్తిని చెరుపదు. చక్షురాదీంద్రియ వ్యాపారములకు బలము చెడదు. సుఖముగ నిద్రపట్టి సకాలమున మేల్కొనగల్గియుండును. ఇట్టిలక్షణములు గలది ప్రథమమదము. ఇయ్యది సుఖమును గల్గించును.

### ద్వితీయమదలక్షణము.

మూ॰. ముహుః స్మృతిర్ముహుర్మోహో వ్యక్తా సజ్జతి వాఙ్ముహుః,
యుక్తాయుక్తప్రలాపశ్చ ప్రచలాయనమేవ చ. 44
స్థానపానాన్నసాంకథ్యయోజనా సవిపర్యయాః,
లిఙ్గాన్యేతాని జానీయాదావిష్టే మధ్యమే మదే. 45

వ్యా. మధ్యమమదము కల్గినప్పుడు మనుజుడు మాటిమాటికి జ్ఞాపకశక్తియు, యజ్ఞానంబును కల్గియుండును. (ఈరెండును నియతము లేక కొంతకాలము జ్ఞాపకశక్తి కల్గియు, కొంతకాలము యజ్ఞానముచే జ్ఞాపకశక్తిలేకయు, పలుమారు చిత్తవృత్తి మారుచుండునని యర్థము.) మాటలు ఒకప్పుడు స్ఫుటముగను, కొంతసేపవ్యక్తముగను మారుచు, నోట స్ఫుటముగ వెడలక పట్టుబడినట్లు వెడలును. యుక్తముగనైనను, యుక్తముగాకయైనను, తనకిచ్చవచ్చినట్లు అసంబద్ధముగ మాటలాడును. కారణము లేకయే తనకు తోచినవిధముగ పరువిడుచుండును. తననివాసస్థలమును తాను సేవించి యన్నపానగుణాదులను వ్యత్యస్థముగ చెప్పుచుండును. కథలను అసంబద్ధముగ గూర్చి వ్యత్యస్తముగనే చెప్పుచుండును. మధ్యమమదము వ్యాపించిన మనుజుని కీలక్షణములు కల్గియుండును.

### మధ్యమ-ఉత్తమమదసంధ్యవస్థ.

మూ. మధ్యమం మదముత్క్రమ్య మదమ(మా)ప్రాప్య చోత్తమం,
న కిఞ్చిన్నాశుభం కుర్యుః నరా రాజసతామసాః 46
కో మదం తాదృశం విద్వానున్మాదమివ దారుణం,
గచ్ఛేదధ్వాన మస్వస్థం బహుదోషమివాధ్వగః. 47

వ్యా. పైజెప్పిన మధ్యమమదము నతిక్రమించి ఉత్తమమదమును పొందకయుండు మధ్యమావస్థయందు చెడ్డపనులను ఒక్కనిమిషకాలమైన జేయకయుండరు. రాజసతామసగుణములను మిశ్రములుగనుండు మనుజులు ఆట్టి మధ్యమావస్థయందు నెట్టిసాహసకృత్యములనయినను, ఎట్టి యకృత్యముల నైనను, చేయుచునే యుందురు. ఉన్మాదమును బోలి మిక్కిలి క్రూరమైన యామదమును జ్ఞానవంతుడగు నేమనుజుడు పొందనుద్యమించును? ఎట్టితెలివిలేనివాడైనను నిర్బాధకమైన త్రోవను వదలి మిగుల కష్టభూయిష్ఠమై ప్రాణాంతకమైన మార్గమున నడువ నిచ్చగొనడు గదా! కావున నెట్టివాడైనను మిక్కిలి దారుణమైన తృతీయమదమును పొందకూడదని భావము.

### తృతీయమదలక్షణము.

మూ. తృతీయన్తు మదం ప్రాప్య భగ్నదార్వివ నిష్క్రియః,
మదమోహావృతమనాః జీవన్నపి మృతైః సమః. 48
రమణీయార్ న విషయాన్న వేత్తి న సుహృజ్జనం,
యదర్థం పీయతే మద్యం రతిం తాం చ నవిన్దతి. 49
కార్యాకార్యం సుఖం దుఃఖం లోకే యచ్చ హితాహితం,

యదవస్థో న జానాతి కోఽవస్థాం తాం వ్రజేద్బుధః. 50
స దూష్యః సర్వభూతానాం నిన్ద్యశ్చాగ్రాహ్య ఏవ చ,
వ్యసనిత్వాదుదర్కే చ స దుఃఖం వ్యాధిమశ్నుతే. 51

వ్యా. మనుజుడు మూడవ మదమును పొందినపుడు మదమువలన కల్గిన యజ్ఞానముచే నావరింపబడిన మనస్సు కలవాడై అంగచలనాది వ్యాపారముల నన్నింటి నుడిగి తమోగుణవ్యాప్తిచే నేమియు నెరుంగక తుదకు తెగనరకబడిన చెట్టువలె క్రిందపడియుండును. అట్టి యవస్థయందు మనుజుడు జీవమాత్రాఽవశిష్టుడై యుండియు చచ్చినవారితో సమానుడై యుండును. అట్టి మనుజుడు రమ్యములైన విషయములను, తనకమిత్రులైన జనమును ఎరుంగజాలడు. ఏవిషయమునందు ప్రీతి గల్గి మద్యమును త్రాగునో అట్టి ప్రీతినికూడ నొందజాలడు. అట్టి యవస్థయందు కార్యాకార్యములను, సుఖదుఃఖములను హితాఽహితములను ఇంచుకేనియు నెరుంగజాలడు. అట్టి దోషబహుళమైన యవస్థను ఏమానవుడు పొందును? ఆమనుజుడు లోకమున నందరకు దూషింపదగినవాడును నిందాపాత్రుడును, గ్రహింపదగనివాడును నగును. మరియు ఉత్తరకాలమున పొందదగిన (పారలౌకిక)సుఖమునకును దూరుడై వ్యసనాక్రాంతుడగును. ఇంతియగాక మిగుల క్రూరమైన మదాత్యయమనువ్యాధి నొందును.

వివరణము:—ఇచ్చట మద్యపానముచే గల్గుమదము ప్రథమ - మధ్యమ-ఉత్తమ భేదములచే మూడువిధముల నుండునని "పీయమానస్య మద్యస్య" అని యుపక్రమించి వానిని సప్రపంచముగ ప్రత్యేకలక్షణాదులు నిరూపింపబడినవి. అట్టి మదములు సత్త్వగుణప్రధానులుగ నున్నవారికి ప్రథమమదంబును, రాజసగుణము కలవారికి మధ్యమ మదంబును, తమోగుణము కలవారికి తృతీయమదంబును వరుసగ కల్గునని గుణభేదమును బట్టి నిర్ణయింపబడినది. అందును రాజసతామసగుణములు మిశ్రములుగ నుండువారికి మధ్యమమదమునకును తృతీయమదమునకు మధ్యమావస్థరూపమైన మిశ్రమదము కల్గునని "మధ్యమం మదముత్క్రమ్య... బహుదోషమివాధ్వగః" అను వాక్యముచే సదృష్టాంతముగ చెప్పబడినది. ఇయ్యది మధ్యమమదమును దాటి తృతీయమదము పూర్ణలక్షణయుక్తము గాకయుండు మధ్యమావస్థ యగుటంజేసి తృతీయమదప్రారంభకమగు పూర్వరూపమగును కాని మదాంతరము కాదని యుద్దేశించి యీతంత్రకారులు సత్త్వాదిగుణత్రయమూలమున మూడుమదము లనియే స్వసిద్ధాంతమును జెప్పిరి.

వాగ్భటాచార్యులును ఈమతమునే యవలంబించి మధ్యమ-ఉత్తమమదసంధి రూపముగ నిర్ణయించి యిట్లు చెప్పిరి:—"మధ్యమోత్తమయోః సన్ధిం ప్రాప్య సా రజసతా

మసః, నిరఙ్కుశ ఇవ వ్యాళః న కఞ్చిన్నాచరేజ్జడః." (అ. హృ. ని. అ. ౬)తృతీయ మదలక్షణమును "నిశ్చేష్టశ్శవవచ్ఛేతే......పాపతరాం దశామ్" అని ప్రత్యేకముగ నే చెప్పిరి. సుశ్రుతాది తంత్రకారులు నీమతమునే యవలంబించిరి. నిదానసంగ్రహకర్త యగు మాధవకరుడు మాత్రము మదభేదముల నాల్గువిధముల జెప్పుచు పైజెప్పిన మధ్యమావస్థను తృతీయమదముగ విభజించి "గచ్ఛేదగమ్యాన్......మదే తృతీయే పురుషోఽస్వతన్త్రః" అని తృతీయమదలక్షణమును; "చతుర్థేతు మదే...స్వవశః కృతీ" అని చతుర్థమదలక్షణమును వేరువేరుగ జెప్పిరి. మరియు నీవిషయమై మాచే రచియింప బడిన మాధవనిదానవ్యాఖ్యానమున సవిస్తరముగ నిరూపింపబడినది.

## మద్యసామాన్యదోషములు.

మూ. "ప్రేత్య చేహ చ యచ్ఛ్రేయః శ్రేయో మోక్షే చ యత్పరం,
మనస్సమాధౌ తత్సర్వం ఆయత్తం సర్వదేహినామ్. 52
మద్యేన మనసశ్చాఽస్య సంక్షోభః క్రియతే మహాన్,
మహామారుతవేగేన తటస్థస్యైవ శాఖినః. 53
మద్యప్రసక్తం తం చాఽజ్ఞాః మహాదోషం మహాగదం,
సుఖమిత్యభిగచ్ఛన్తి రజోమోహపరాజితాః 54
మద్యోపహతవిజ్ఞానాః వియుక్తాః సాత్త్వికైర్గుణైః,
శ్రేయోభిః విప్రయుజ్యన్తే మదాన్ధాః మదలాలసాః. 55
మద్యే మోహో భయం శోకః క్రోధో మృత్యుశ్చ సంశ్రితః,
సోన్మాదమదమూర్ఛాయాః సాఽపస్మారాఽపతానకాః. 56
యత్రైకః స్మృతివిభ్రంశః తత్ర సర్వమసాధువత్,"
ఇత్యేవం మద్యదోషజ్ఞాః మద్యం గర్హన్తి యత్నతః. 57

వ్యా. "లోకమున మానవుల కందరకును అభిలషితమైన యైహికసుఖంబును, పారలౌకికసుఖంబును, పరమశ్రేయోరూపమైన మోక్షంబును, తుదకు లౌకికవ్యవహారంబు లన్నియును కూడ మనస్సుయొక్క యేకాగ్రతకు అధీనముగ నుండును. (మనస్సు చంచలము గాక ఏకాగ్రత కల్గియుండినగాని యుక్తాఽయుక్తవివేకపూర్వముగ పైజెప్పిన వ్యాపారముల నిరపాయముగ జేయ వలనుపడదు. కావున సకలకృత్యములకును మనో నిశ్చయ మావశ్యకమని భావము.) అట్టి మనస్సుకు మద్యము మిక్కిలి సంక్షోభమును కల్గించి పొత్తుగ చెడగొట్టును. నదీతీరమున నుండు గొప్పవృక్షమును మిక్కిలి వేగముకల

ప్రచండవాతము అతలకుతలముగ చలింపజేసి క్రిందుమీదు చేయుఁతీరున మద్యము తనయందలి తీవ్రగుణములచేత చీకాకుపరిచి నిల్కడ లేక పలుపోకల బోవునట్లు చేయును. ఇత్తెరంగున ప్రబలమైన దోషములను కల్గి మోహాదిమానసికవ్యాధుల కన్నిటికిని ముఖ్యకారణమైన మద్యపానము లోకమున రజస్తమోదోషములకు లోనైన జ్ఞానహీనులు కొందరు మిక్కిలి సుఖమును కల్గించునదియని నిరంతరముగ జేయ గడంగెదరు. అట్టి తెలివిలేనిమూఢులు మద్యపానముచే జ్ఞానవిజ్ఞానములు బొత్తుగ నశించి సాత్విక గుణములచే విడువబడి మదప్రభావముచే కన్నుమిన్నెరుంగక మదమునందే మిక్కిలి యాసగొని తుదకు ఇహపరసుఖములకు దూరులగుదురు.

మరియుఁ మోహము (అజ్ఞానము), భయము, శోకము, క్రోధము, మృత్యువు (అకాలమరణము), ఇవి యన్నియు మద్యము నాశ్రయించి యుండును. ఉన్మాదము, మదము, మూర్ఛ, అపస్మారము, అపతానకము నను నీమానసికవ్యాధు లన్నియుం మద్యము వలన కల్గును. ఇంతియేకాక అకృత్యము లన్నియుఁ నొకబుద్ధి భ్రంశమును ముఖ్యస్థానముగ జేసికొని యుండును.'' ఇత్తెరంగున మద్యమునందలి దోషముల మాత్రము తెలిసికొనిన వారు మిక్కిలి పూనికతో నుద్యమును సామాన్యముగ నిందించెదరు.

యుక్తియుక్తముగ మద్యమును సేవించినయెడ కల్గుగుణములు.

మూ॥ సత్యమేతే మహాదోషాః మద్యస్యోక్తాః న సంశయః,
అహితస్యాఽతిమాత్రస్య పీతస్య విధివర్జితమ్. 58
కిన్తు మద్యం స్వభావేన యథైవాన్నం తథాఽమృతమ్. 59
ప్రాణాః ప్రాణభృతామన్నం తదయుక్త్యా నిహన్త్యసూన్,
విషం ప్రాణహరం తచ్చ యుక్తియుక్తం రసాయనమ్. 60

వ్యా॥ పైజెప్పబడిన మద్యమునందలి గొప్పదోషము లన్నియు అహితమైన మద్యపానమునను అధికముగ మితిమీరి త్రాగబడిన మద్యమునను మద్యపానవిధి నతిక్రమించి వ్యత్యస్తముగ త్రాగబడిన మద్యమునకు సంబంధించి నిశ్చయముగనే యుండును; కాని మద్యము అన్నమును బోలె స్వభావముచేత నమృతమునకు సమానముగ నుండును. సకల ప్రాణులకును ప్రాణమునుబోలె ప్రాణములకు ముఖ్యముగ నాధారమైనది; అట్టియన్నమును విధి ననుసరింపక భుజించినయెడ ప్రాణముల హింసించును. విషము స్వభావముచేతనే ప్రాణహరమైనను యుక్తియుక్తముగ తగిన ప్రమాణమును గల్పించి సేవించునెడ రసాయనమగును. (కావున మద్యమును విధ్యుక్తప్రకారము తగినపరిమాణమును కల్పించి దేశకాలదేహప్రకృతిదోషదూష్యాదుల ననుసరించి తత్తదనుగుణముగ సేవించునెడ

మిక్కిలి శ్రేష్ఠముగ నుత్సాహాదుల కల్గించును. అటుగాక వ్యత్యస్తముగ తనకిచ్చవచ్చిన రీతిగ తప్పత్రాగినయెడ పైజెప్పఁబడిన మహాదోషముల కన్నిటికిని ముఖ్యకారణ మగునది నిశ్చయమని భావము. రసాయనమున—"విషస్య తు తిలం దద్యాత్" (చి. అ. ౧) అని తిలప్రమాణముగ విషమును అభ్యాసము చేసినయెడ రసాయనమని విధింపబడినది. అత్తెరంగుననే మద్యమును విధ్యుక్తముగ సేవించిన గుణోత్తరమగునని ముఖ్యతాత్పర్యము.)

మూ. హర్షమూర్జం ముదం పుష్టిం ఆరోగ్యం పౌరుషం పరం (బలం),
యుక్త్యా పీతం కరోత్యాశు మద్యం మదసుఖావహమ్. 61

వ్యా. మద్యమును యుక్తియుక్తముగ త్రాగినయెడ శరీరమునకు సంబంధించిన యుత్సాహమును, బలమును, మనస్సుకు సంతోషమును, శరీరపుష్టిని, ఆరోగ్యమును, పౌరుషమును (శుక్రవృద్ధిని) వీని నన్నిటిని సుఖకరమైన ప్రథమమదమున నతిశీఘ్రముగ గల్గించును. (ఇచ్చట మద్యము జీర్ణమైన కొంతకాలమునకు గుణమును గల్గించు తక్కిన ద్రవ్యములవలె కాక త్రాగినవెంటనే (జీర్ణము కాకమునుపే) హర్షము మున్నగు మంచి గుణముల గల్గించునని 'కరోత్యాశు' అనుపదముచే సూచింపబడినది.)

మూ. రోచనం దీపనం హృద్యం స్వరవర్ణప్రసాదనం,
ప్రీణనం బృంహణం బల్యం భయశోకశ్రమాపహమ్. 62
స్వాపనం నష్టనిద్రాణాం మూకానాం వాగ్విబోధనం,
బోధనం చాఽతినిద్రాణాం విబద్ధానాం విబన్ధనుత్. 63
వధబన్ధపరిక్లేశదుఃఖానాం చాప్యబోధనం,
మదోత్థానాం చ రోగాణాం మద్యమేవ ప్రబాధకమ్. 64
రతిర్విషయసంయోగే ప్రీతిసంయోగవర్ధనం,
అపి ప్రవయసాం మద్యం ఉత్సవామోదకారకమ్. 65
పఞ్చస్వర్థేషు కాన్తే(మ్యే)షు యా రతిః ప్రథమే మదే,
యూనాం వా స్థవిరాణాం వా తస్యా నాస్త్యుపమా భువి. 66
బహుదుఃఖహతస్యాఽస్య శోకేనోపహతస్య చ,
విశ్రామో జీవలోకస్య మద్యం యుక్త్యా నిషేవితమ్. 67

వ్యా. మద్యమును క్రింద జెప్పబడురీతి యుక్తియుక్తముగ త్రాగినయెడ— రుచిని పుట్టించును. అగ్నిని దీపింపజేయును. హృదయమునకు బలమును కల్గించి హిత

ముగ నుండును. కంఠస్వరమును శరీరవర్ణమును నిర్మలముగ జేయును. ప్రీతిని కల్గించును. శరీరమును పుష్టినందించి బలమును కల్గించును. భయమును దుఃఖమును శరీరశ్రమమును పోగొట్టును. నిదురబట్టకుండువారికి నిద్ర కల్గించును. మూగవానివలె మాటలాడనేరని వారికి వాగ్ధోరణి కల్గించి చక్కగ మాట్లాడజేయును. అధికముగ నిద్రబోవువారిని సకాలమున మేల్కొలుపును. మలమూత్రాదులు బద్ధగించి యుండునెడ వెడలించును. బంధుగులు మున్నగువారి వధచేతను బంధముచేతను శరీరక్లేశముచేతను కల్గిన దుఃఖమును మనసుకు తెలియనీయక యుత్సాహమును కల్గించును. మరియు మద్యపానముచే సంభవించిన రోగముల కన్నిటికిని మద్యమే (తనయందలి ప్రభావముచేత) నివర్తించునది యగును. ఆసక్తిని కల్గించును. మద్యమును త్రాగునపుడు శబ్దాదివిషయములయం దాసక్తి కల్గియున్నచో నట్టిశబ్దాదుల గ్రహించుటయందు ప్రీతిని కల్గించి పలుమారు వానిని గ్రహించుటకే యుత్సాహమును పురిగొల్పుచుండును. వయసు చెల్లినముసలివారికిని మనసునం దుత్సాహమును సంతోషమును కల్గించును.

మరియు యౌవనవంతులకైనను ముసలులకైనను ఇంద్రియార్థములైన శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములై దిటియందును ప్రీతిని కల్గించుటకు మద్యపానముచేనైన ప్రథమమదమును బోలినసాధనము వేరొండు లేదు. (మద్యపానముచే గల్గిన ప్రథమ మదము యౌవనవంతులనైనను వృద్ధులనైనను శబ్దస్పర్శాదుల గ్రహించుటకు పురిగొల్పు విషయమున మిగుల శ్రేష్ఠమైనదని యర్థము.) అనేకదుఃఖములచే మనస్సు కభిఘాతము కల్గినవారికిని మానసికమైన శోకముచే పీడితులకును మనస్సు విశ్రాంతి కల్గుటకు యుక్తియుక్తముగ సేవింపబడినమద్యము ప్రశస్తమైన స్థానమై యుండును.

ఇచ్చట—అతిచింతనాదిమనోవ్యాపారములచే నిద్రబట్టకుండువారికి నిద్రకు భంగకరమైన మనోవ్యాపారమును మరపించి నిద్ర తెచ్చుననియు, అధికముగ నిద్రబోవు వారికి నిద్రకు కారకమైన మనస్సు వ్యాపింపజేయు స్రోతోమార్గమునకు కల్గిన యడ్డును వదలించి మనస్సును బహిర్ముఖముగ స్రోతోమార్గముల నుండు వ్యాపింపజేయుటంజేసి నిదురనుండి మేల్కొలుపుననియు, “స్వాపనం నష్టనిద్రాణాం” “బోధనం చాతి నిద్రాణాం” అని చెప్పబడినది. మరియు మద్యము ప్రభావమునంజేసి మద్యపానముచే గల్గిన వ్యాధుల నివర్తింపజేయుశక్తి కల్గియుండునని “మదోత్థానాం రోగాణాం మద్యమేవ ప్రబాధకమ్” అని చెప్పబడినది. మద్యపానముచే గల్గినరోగములకు మద్యమును త్రాగుట హేతువిపరీతార్థకారిచికిత్స యగును. అయ్యది ప్రభావకృతమని భావము.

### యుక్తిస్వరూపము.

మూ. అన్న-పాన-వయో-వ్యాధి-బల-కాలత్రికాణి షట్,
త్రీన్ దోషాన్ త్రివిధం సత్వం జ్ఞాత్వా మద్యం పిబేత్సదా. 68
తేషాం త్రికాణామష్టానాం యోజనా యుక్తిరుచ్యతే,
యయా యుక్త్యా పిబన్ మద్యం మద్యదోషైః న యుజ్యతే. 69

వ్యా. అన్నము, పానము, వయస్సు, వ్యాధి, బలము, కాలము, అనునవి యాఱును వేరువేర మూడేసి భేదములు కల్గియుండును: అట్టి మూడేసి భేదములతో గూడిన యన్నపానాదుల నారిటిని, శుద్ధ-రాజస-తామస భేదములచే మూడువిధములైన సత్త్వము (మనస్సు)ను చక్కగ గమనించి మద్యమును పానముచేయనగును. ప్రత్యేకము మూడేసి భేదములు కల యన్నపానాదుల నెనిమిదిటిని మద్యమును గుణాదుల ననుసరించి చేర్చుట యుక్తి యనబడును. అట్టి యుక్తియుక్తముగ గూర్చి త్రాగబడిన మద్యము నుద్దేశించి ("మద్యే మోహో భయం......మృత్యుశ్చ సంశ్రితః" అని) చెప్పబడిన దోషముల నొకప్పుడు నొందడు. (ఇది మూలమునకు అనుగుణమైన యర్థము).

వివరణము:—అన్నంబును పానంబును వాత-పిత్త-కఫకరంబు లనుభేదములచే వేరువేరగ మూడేసివిధముల నుండును. బాల్యము, యౌవనము, వార్ధక్యమునని వయస్సు మూడువిధములు. మృదు-మధ్య-తీవ్ర భేదములచే వ్యాధియు మూడువిధములు. ప్రవర-అవర-మధ్యను భేదములచే బలంబును మూడువిధములు. శీత-ఉష్ణ-వర్షాది భేదములచే కాలము మూడువిధములు. ఇత్తెఱంగున ప్రత్యేకము మూడేసి భేదములతో కూడిన యన్నపానాదులను, వాత-పిత్త-కఫముల మూడిటిగుణములను, శుద్ధ-రాజస-తామస భేదములచే మూడువిధములైన మనస్సును, ప్రత్యేకముగ నొక్కొకదానిని గమనించి మద్యమునకు పైజెప్పిన యన్నాదిభేదములకును పరస్పరవిరుద్ధముగ (ప్రతిద్వంద్విగ) యోజించి చేర్చుటయే యుక్తి. అది యెట్లనగ:—వాతకరమైన యన్నమును భుజించి వాతహరమగుమద్యమును త్రాగనగును. పిత్తకరమగు నన్నము నుపయోగించి పిత్తహరమగు మద్యమును, కఫకరాహారము నుపయోగించి కఫహరమద్య ముపయోగింపందగును. ఇత్తెఱంగుననే వాతపిత్త-కఫకరములగు పానీయముల నుపయోగించి వరుసగ వాత-పిత్త-కఫహరములగు మద్యముల త్రాగనగును. మరియు బాల్యమునందును వృద్ధత్వమునందును తీక్ష్ణమగు మద్యమును త్రాగదగదు. యౌవనమున మాత్రము తీక్ష్ణమద్యమును కూడ త్రాగవచ్చును. (ఇది వయోభేదముల బట్టి యోజనము). మూడువిధములైన వ్యాధులలో మృదువ్యాధ్యవస్థయందు తీక్ష్ణోష్ణ మద్యమును పానము జేయదగును. మరియు శీతకాలమున తీక్ష్ణోష్ణమద్యమును, ఉష్ణకాల

మున శీతమధురమద్యమును, వర్షాకాలమున స్నిగ్ధంబును దీపనంబు నైనమద్యమును త్రాగవలెను. (ఇది కాలము నపేక్షించిన యోజనవిధము). వాతమునందు వాతహరములగు స్నిగ్ధోష్ణగుణములు కల గౌడికాదిమద్యంబులును, పిత్తమున శీతమధురములైన శార్కరాది మద్యంబులును,కఫమున రూక్షతీక్ష్ణగుణములుకల మాధవాది మద్యంబులును ఉపయోగింపందగును. (ఇది దోషానుగుణయోజనము.) దోషములకు జెప్పిన క్రమమే వాత-పిత్త-కఫప్రకృతుల మూటికిని యుక్తముగ నుండును. మరియు సాత్వికమున మద్యమును భూయిష్ఠముగను, రాజస-తామసములయందు మిగుల స్వల్పముగను త్రాగవలెను. (ఇది సత్వము ననుసరించిన యోజనావిధి).

ఈవివరింపబడిన ప్రకారము ప్రత్యేకము మూడేసివిధములైన అన్నపానాదుల నెనిమిదింటికిని అనుగుణముగ మద్యమును కల్పించి యుపయోగించుట యోజనము. యుక్తియు నగునని భావము.

### యుక్తియుక్తమద్యపానప్రయోజనము.

మూ. మద్యస్య చ గుణాన్ సర్వాన్ యథోక్తాన్ స సమశ్నుతే,
ధర్మార్థయోరపీడాయై నరస్సత్త్వగుణోచ్ఛ్రితః                    70

వ్యా. మరియు యుక్తియుక్తముగ మద్యపానము చేసినయెడ పైజెప్పబడిన మద్యదోషముల బొరయకుండుటయేకాక సత్వగుణము మిగుల ప్రబోధమునొంది ధర్మార్థములకు నించుకేనియు బాధ కల్గనీయక, మద్యము నుద్దేశించి "రోచనం దీపనం"అని యుపక్రమించి చెప్పబడిన గుణముల నన్నిటిని పొందగలరు.

### మద్యము సాత్వికాదిప్రకృతుల దెలుపువిధము.

మూ. సత్త్వాని తు ప్రబుధ్యన్తే ప్రాయశః ప్రథమే మదే,
ద్వితీయేఽవ్యక్తతాం యాన్తి మధ్యే చోత్తమమధ్యయోః.    71
సస్యసంబోధకం వర్షం హేమప్రకృతిదర్శకః,
హుతాశః సర్వసత్త్వానాం మద్యన్తూభయకారకమ్.                    72
ప్రధానావరమధ్యానాం రూపాణాం వ్యక్తిదర్శకః,
యథాగ్నిరేవం సత్త్వానాం మద్యం ప్రకృతిదర్శకమ్.                    73

వ్యా. మద్యపానముచే గల్గిన ప్రథమమదమునందు మనస్సులు ప్రబోధమునొందును. ద్వితీయమదమునందును కొంచెముగ నవ్యక్తస్థితినందును. మధ్యమోత్తమమద

ముల మధ్యమావస్థయందు పూర్తిగ నవ్యక్తనుగును. ఉత్తమమదమున నంతకన్న పూర్తిగ నవ్యక్తదశ నొందును.

మరియు లోకమున వర్షము(కురిసినచో)పలుదెరంగులైన పైరులను (విత్తనములను) అంకురింపజేసి యభివ్యక్తముగ జేయును (మొలిపించును). అగ్ని బంగరుయొక్క శుద్ధ-అశుద్ధరూపమైన స్వభావగుణమును తెలుపును. మద్యమొక్కటి మాత్రము మనుజుల సత్వమును ప్రబోధమునొందించి, బంగరుయొక్క (ప్రధానావరమధ్యరూపముల నగ్ని దెలుపుకరణి) మనస్సుయొక్క యుత్తమ-మధ్యమ-అధమప్రకృతులను మదభేదములచే దెలుపును. ప్రథమమదమున మనస్సుకు (వర్షము సస్యముల నంకురింపజేయుకరణి) ప్రబోధమును కల్గించి, ద్వితీయతృతీయమధ్యమమదావస్థలయందు మనస్సుకు రాజసతామసగుణములతారతమ్యముచే నుత్తమ-మధ్యమ-అధమప్రకృతులను (అగ్ని బంగరుకు సంబంధించిన యుత్తమ-మధ్యమ-అధమరూపముల దెలుపుభంగి) స్ఫుటముగ వ్యక్తపరచును. కావున మద్యమొక్కటియే మనస్సుకు ప్రబోధము కల్గించునదియు, గుణతారతమ్యమును దెల్పునదియు నగును. ఈయర్థమునే 'మద్యస్తూభయకారకమ్' అనుపదముచే తంత్రకారులు చెప్పిరి).

## సాత్త్వికపానలక్షణము.

మూ. సుగన్ధిమాల్యగన్ధర్వం సుప్రణీతమనాకులం,
మిష్టాన్నపానవిశదం సదా మధురసఙ్కథమ్. 74
సుఖప్రపాణం (ప్రమాణం) సుమదం హర్షప్రీతివివర్ధనం,
స్వన్తం సాత్వికమాపానం న చోత్తమమదప్రదమ్ 75
వైగుణ్యం సహసా యాన్తి మద్యదోషైర్న సాత్వికాః,
మద్యం హి బలవత్సత్వం గృహ్ణాతి సహసా నతు. 76
(సహసా నాఽనగృహ్ణాతి మద్యం సత్త్వబలాధికమ్.)

వ్యా. మంచి పరిమళముకల పుష్పమాలికల ధరించి సంగీతము పాడుచు త్రాగబడినదియు, చక్కగ సిద్ధము చేయబడినదియు, నిర్మలమైనదియు, రసవంతములగు నన్నపానసంబంధమునంజేసి శుభ్రమైనదియు, నిరంతరముగ మనస్సుకు రమ్యములైన కథాప్రసంగమును కల్గించునదియు, సుఖముగ నుండుసమయమున త్రాగబడినదియు, త్రాగినపిమ్మట సుఖముగనుండు ప్రథమమదమును కల్గించునదియు, మనస్సుకు సంతోషమును ప్రీతిని వృద్ధినందించునదియు, మదాంతమున మోహమూర్ఛాదులు కల్గనీయక శుభమును కల్గించునదియు, నగు మద్యపానము సత్వగుణభూయిష్ఠమని యెరుంగునది. మరియు

నీసాత్త్వికపానమున ఉత్తమ (తృతీయ) మదము ఒకప్పుడును కొంచెమైన కల్గదు. సాత్త్విక గుణముకలవారు మద్యమునకు చెప్పబడిన దోషములచే శీఘ్రముగ మనోవైకల్యము నొందరు; (కావున నుత్తమమదమునకు జెప్పిన వికారములు కల్గవనుట). మరియు బలిష్ఠమైన సత్త్వగుణమును మద్యము శీఘ్రముగ చెరుపనేరదు. (సత్వగుణము కేవలము ప్రకాశాత్మకమైనది. మద్యము మోహమును (చిత్తవికారమును) కల్గించునది. అట్టియెడ సత్వగుణము ప్రబలముగ నుండుటవలన మనస్సును పైజెప్పిన సాత్త్వికమద్యమును త్రాగినపుడు వికృతినొందింపనేరదని భావము.)

### రాజసపానలక్షణము.

మూ. సౌమ్యాఽసౌమ్యకథాప్రాయం విశదావిశదం క్షణాత్,
చిత్రం రాజసమాపానం (మాపన్నం) ప్రాయేణాఽస్వన్తకా(మా)
కులమ్ 77

వ్యా. కొంచెము సౌమ్యముగను కొంచెము సౌమ్యము కాకయు మిశ్రముగ నుండు విషయములతోఁగూడిన కథాప్రసంగముల జేయించునదియు, కొంచెము ప్రసన్నముగను కొంచెము ప్రసన్నము కాకయు నుండు మాటలతోఁ గూడి, కొంచెము సంబద్ధముగను కొంచెము అసంబద్ధముగను మాటలాడించునదియు, ప్రాయికముగ నంతమున మోహాదులచే దుఃఖమును కల్గించునదియు, కలుష మైనదియు నగు మద్యపానము రాజసము (రజోగుణభూయిష్ఠము) అని యెరుంగునది. (ఇచ్చట సౌమ్యాఽసౌమ్యవిశదాఽవిశదాది విరుద్ధధర్మములు కలిసియుండుటవలన చిత్రమని చెప్పబడినది).

### తామసపానలక్షణము.

మూ. హర్షప్రీతికథాఽపేతం అతుష్టం పానభోజనే,
సమ్మోహక్రోధనిద్రాన్తం ఆపానం తామసం స్మృతమ్. 78

వ్యా. సంతోషమును ప్రీతిని కల్గించు కథలను ప్రసంగించక మనస్సుకు సంక్షోభ మును కల్గించు విషయముల వదరునట్లు చేయునదియు, పానభోజనములచే సంతుష్టిని కల్గించనిదియు, అంతమున మోహమును క్రోధమును నిద్రను కల్గించునదియు నగు మద్యపానము తామసము (తమోగుణభూయిష్ఠము) అని యెరుంగునది.

### మద్యపానమున విడువవలసిన సహచరులు.

మూ. ఆపానే సాత్త్వికాన్ బుద్ధ్వా తథా రాజసతామసాన్,
జహ్యాత్సహాయాన్ యైః పీత్వా మద్యదోషానుపాశ్నుతే. 79

వ్యా. పానము చేయువా రొకగోష్ఠిగ కూడినపుడు అందు పైఁజెప్పఁబడిన లక్షణములచే సాత్త్వికాదిపానముల జేయువారిని చక్కఁగ గమనించి, రాజస-తామసపానముల జేయువారి సహవాసమును బొత్తుగమాని, సాత్త్వికపానము చేయువారితో కలిసి యుండవలెను. అటుగాక రాజసతామసపానము చేయువారితో జేరినయెడ వారిసహవాసమును బట్టి వారు చేయురీతిగనే మద్యమును త్రాగవలసివచ్చును. దానం జేసి పానాధిక్యమున గల్గు ద్వితీయతృతీయమదములకు జెప్పిన దోషములపాల బడవలసివచ్చును. కావున వారితో కలియక సాత్త్వికపానాధికారులతో గలియవలెనని భావము.

మద్యపానమునకై చేర్చుకొనదగిన స్నేహితులు.

మూ. సుఖశీలాః సుసంభాషాః సుముఖాః సమ్మతాస్సతాం,
కలాస్వబాహ్యాః విశదాః విషయగ్రహణాశ్చ యే 80
పరస్పరవిధేయాః యే యేషామైక్యం సుహృత్తయా,
ప్రహర్షప్రీతిమాధుర్యైః ఆపానం వర్ధయన్తి యే. 81
ఉత్సవాదుత్సవతరం యేషామన్యోఽన్యదర్శనం,
తే సహాయాః సుఖాః పానే తైః పిబన్ సహ మోదతే. 82

వ్యా. ఇతరులకు సుఖము కల్గించు మంచిస్వభావముకలవారును, యోగ్యమైన మంచిమాటల సంభాషించువారును, చూచుటకు ప్రియమైన యాకారము కలవారును, పండితులగు సత్పురుషులకు ఇష్టులును, శాస్త్రచోదితపద్ధతులకు బాహ్యులు కాక అట్టి పద్ధతుల నవలంబించువారును, దోషరహితులును, శాస్త్రాది సమ్మతములగు విషయముల జెప్పినయెడ వానిని చక్కఁగ గ్రహించువారును, స్నేహభావముచే నొకరితో నొకరు కలిసి మెలసి యొండొరులకు విధేయులుగ నుండువారును, పానముచే గల్గిన ప్రసన్నతను సంతోషముచేతను ప్రీతిచేతను మృదుస్వభావముచేతను వృద్ధినొందించువారును, స్నేహితు లొకరినొకరు చూచుకొనినప్పుడు అట్టి పరస్పరసందర్శనము పండుగలో మిక్కిలి యుత్తమమైన పండుగ యని భావించి యానందించువారును నగు స్నేహితులు సత్త్వగుణస్వభావము కలవారు; వారు పానముసేయునెడ సహాయులుగ నున్నచో సుఖమును కల్గింతురు. (పానాధిక్యముచేనైన దోషములబారి పడనీయక సాత్త్వికమదమునకు జెప్పిన గుణముల నొందించి సుఖింపజేయ గల్గుదురని భావము). అట్టి స్నేహితులతో గూడి మద్యమును త్రాగినచో వారిం గలిసి యానందము నొందెదరు.

సుసహాయుల గూడి మద్యపానము చేసినయెడ ప్రాశస్త్యము.

మూ. రూపగన్ధరసస్పర్శైః శబ్దైశ్చాపి మనోరమైః,

పిబన్తి సుసహాయా యే తే వై సుకృతిభిస్సమాః. 83
పఞ్చభిర్విషయైరిష్టైః ఉపేతైః మనసః ప్రియైః,
దేశే కాలే పిబేన్మద్యం ప్రహృష్టేనాఽన్తరాత్మనా. 84

వ్యా. కంటికింపైన రూపముతోడను, ఘ్రాణమునకు హితమైన సువాసనతోడను, నోటికింపైన రసంబుతోడను, తాకిన సుఖమైన చందనాదులస్పర్శముతోడను, వీనులకు విందైన గీతవాద్యాదిశబ్దములతోడను కూడి, పైజెప్పిన సాత్వికస్వభావముకల మిత్రబృందముతో గలిసి యెవరు మద్యపానమును చేసెదరో, వారు మిక్కిలి పుణ్యముజేసిన వారితో సమానులుగ నుందురు. మరియు, మనస్సునకు ప్రీతిని బుట్టించునవియును చక్షురాదీంద్రియములకు గోచరములై సమీపించి యున్నవియు, తన కిష్టమైనవియు నగు రూపరసగంధస్పర్శశబ్దములనెడు నింద్రియార్థములైన దిటితో గూడి మిక్కిలి సంతోషముతో గూడిన మనస్సుకలవాడై యుక్తములైన దేశకాలములయందు (తదనుగుణముగ) మద్యమును త్రాగవలెను.

## మద్యపానముచే చిరకాలమునకు మదమునొందువారు.

మూ. స్థిరసత్త్వశరీరా యే పూర్వాన్నా మద్యపాన్వయాః,
బహుమద్యోచితా యే చ మాద్యన్తి సహసా న తే. 85

వ్యా. చంచలము గాక స్థిరమైన మనస్సును దృఢమైన శరీరమును కలవారును, మద్యమును త్రాగుటకు ముందే యన్నమును భుజించినవారును, వంశపరంపరగ మద్యము త్రాగువారివంశమున బుట్టినవారును, పలువిధరంగులైన మద్యమును పానముజేయుటకు అలవాటుబడినవారును, వీరందరును శీఘ్రముగ మద్యముచే మదముచు పొందజాలరు. ఇచ్చట మద్యపాన మలవాటైయున్నవారిసంతతిని బుట్టినవారికి మద్యము సాత్మ్యమై యుండును, కావున వారికి (విషమున బుట్టినజంతువునకు విషమువలనబాధకల్గకుండురీతిగ) మద్యపానముచే మదము కల్గనేరదని "మద్యపాన్వయాః" అనుపదముచే సూచింపబడినది).

## శీఘ్రముగ మదము నొందువారు.

మూ. ప్రాజ్మద్యాః క్షుత్పిపాసార్తాః దుర్బలా వాతపైత్తికాః,
రూక్షాఽల్పప్రమితాహారాః విస్తబ్ధాస్సత్త్వదుర్బలాః. 86
క్రోధినోఽనుచితాః క్షీణాః పరిశ్రాన్తా మదక్షతాః,
స్వల్పేనాపి మదం శీఘ్రం యాన్తి మద్యేన మానవాః. 87

వ్యా. భుజించుటకు ముందుగనే మద్యము త్రాగినవారును, ఆకలిదప్పులచే పీడింపబడినవారును, బలహీనులును, వాత-పిత్తముల ప్రకోపంబైనను ప్రకృతులైనను కలవారును, రూక్షమైన యాహారమును భుజించినవారును, మిక్కిలి కొంచెముగ భుజించు నలవాటు కల్గినవారును, భోజనము లేకయే యుపవాసము జేసినవారును, మలము బద్ధగించి యుండువారును, మిక్కిలి బలహీనమైన మనస్సు కలవారును, కోపోద్రేకము కలవారును, మద్యముత్రాగుట కలవాటులేనివారును, శరీరమున ధాతువులు క్షీణించిన వారును, మిక్కిలి బలిసినవారును, మదముచే నభిఘాతము నొందినవారును, వీరందరును మిక్కిలి కొంచెముగ మద్యపానము చేసినను అతిశీఘ్రముగ మదమునొందెదరు. (ఇంత వరకును మద్యపానముచే గల్గు గుణంబులును దోషంబులును సవిస్తరముగ జెప్పబడినది.)

## మదాత్యయనిదాన-లక్షణ-చికిత్సలసంగ్రహము.

మూ. ఊర్ధ్వం మదాత్యయస్యాతః సమ్భవం స్వస్వ లక్షణం,
అగ్నివేశ చికిత్సాం చ ప్రవక్ష్యామి యథాక్రమమ్. 88

వ్యా. పిమ్మట మదాత్యయమున కుత్పత్తికారణంబులును, ఆయామదాత్యయముల ప్రత్యేకలక్షణంబులును, వానివానికి దగిన చికిత్సలును వరుసగ నీక్రింద జెప్పబడును.

## వాతికమదాత్యయనిదానము.

మూ. స్త్రీశోకభయభారాధ్వకర్మభిః యోఽతికర్శితః,
రూక్షోఽల్పప్రమితాశీ చ యః పిబత్యతిమాత్రయా. 89
రూక్షం పరిణతం మద్యం నిశి నిద్రాం నిహత్య చ,
కరోతి తస్య తచ్ఛీఘ్రం వాతప్రాయం మదాత్యయమ్. 90

వ్యా. అధికముగ స్త్రీసంభోగము చేయుట, శోకము, భయము, అధికముగ భారమును మోచుట, త్రోవనడచుట, పనులజేయుట, ఇవిమున్నగు కారణములచే మిక్కిలి కృశించినవాడును; రూక్షముగ (జిడ్డులేక) నుండునాహారమునైనను, అతిస్వల్పముగ నైనను భుజించినవారును, ఉపవాసమున్నవారును రూక్షణగుణము కల్గి ప్రాతదియగు మద్యము నధికముగ త్రాగి రాత్రి నిద్రలేకుండు నెడ వానికి వాతం బధికముగ కలమదాత్యయమును చేయును.

ఇచ్చట 'వాతప్రాయం' అని చెప్పుటవలన మదాత్యయము లన్నియు త్రిదోషప్రకోపముచే గల్గుననియు అందు వాతమధికముగనున్నది వాతికమదాత్యయమనియు నెరుంగదగును. ఇత్తెరంగుననే "పిత్తప్రాయం, కఫప్రాయం" అనుచోటను ఎరుంగునది.

ఈవిషయమును వాగ్భటాచార్యులు—"సర్వేఽపి సర్వైర్జాయన్తే వ్యపదేశస్తు భూయసా" (అ. హృ. ని. అ. ౬) అనువాక్యముచే జెప్పిరి. ఈతంత్రకారులును:— "విషస్య యే గుణా దృష్టాః...తస్మాత్త్రిదోషజం లిఙ్గం సర్వత్రాపి మదాత్యయే" అను నీక్రిందిగ్రంథముచే సహేతుకముగ నిరూపించిరి.

### వాతికమదాత్యయలక్షణము.

మూ. హిక్కాశ్వాసశిరఃకమ్పపార్శ్వశూలప్రజాగరైః,
విద్యాద్బహుప్రలాపస్య వాతప్రాయం మదాత్యయమ్. 91

వ్యా. హిక్క(ఎక్కిళ్లు), శ్వాసము, తలవణకు, ప్రక్కశూల, నిదురబట్టకుండుట, తనకిచ్చవచ్చినట్లు అర్థములేని మాటల వదరుట, ఈలక్షణములు కల్గియున్న నయ్యది వాతం బధికముగ నుండు మదాత్యయమని యెరుంగునది.

### పైత్తికమదాత్యయనిదానము.

మూ. తీక్ష్ణోష్ణం మద్యమమ్లం చ యోఽతిమాత్రం నిషేవతే,
అమ్లోష్ణతీక్ష్ణభోజీ చ క్రోధనోఽగ్న్యాతపప్రియః 92
తస్యోపజాయతే పిత్తాత్ విశేషేణ మదాత్యయః,
స తు వాతోల్బణస్యాశు ప్రశమం యాతి హన్తి వా. 93

వ్యా. పులుపును ఉష్ణగుణమును తీక్ష్ణగుణమును కల్గియుండు నాహారపదార్థముల భుజించినవాడు తీక్ష్ణగుణమును ఉష్ణవీర్యమును అమ్లరసంబును కల్గిన మద్యమును త్రాగినను, మిక్కిలి కోపోద్దీపితుడై మద్యమును త్రాగినను, అగ్నిచేతను ఎండతాకుడుచేతను శరీరమున వేడి కల్గియున్నపుడు మద్యమును అధికముగ త్రాగినను, వానికి పిత్తం బధికముగ ప్రకోపించి మదాత్యయమును కల్గించును. మరియు నీపైత్తికమదాత్యయము వాతం బధికముగ నున్నవానికి సంభవించినయెడ (వెంటనే చికిత్సజేసినచో) శీఘ్రముగ శమించును. (లేక యుపేక్షించినచో శంఖకరోహిణీరోగములబోలె) శీఘ్రముగ చంపును.

### పైత్తికమదాత్యయలక్షణములు.

మూ. (లక్షణాని భవన్త్యస్య యాని తాని నిబోధ మే),
తృష్ణాదాహజ్వరస్వేదమూర్ఛాఽతీసారవిభ్రమైః,
విద్యాద్ధరితవర్ణస్య పిత్తప్రాయం మదాత్యయమ్. 94

వ్యా. పిత్తం బధికముగ నుండు మదాత్యయమున డప్పి యధికమగును. శరీరముపై మంట పుట్టును. జ్వరము వచ్చును. చెమట బట్టును. మూర్ఛ గ్రమ్మును. అతిసారము

కల్గును.) తిరుగుచుండు చక్రముపై నున్నవానివలె శరీరము దిరుగును. శరీరము పచ్చగ నుండును. ఈలక్షణములబట్టి పిత్తం బధికముగనుండు మదాత్యయమని యెరుంగునది.

## శ్లైష్మికమదాత్యయనిదానము.

మూ. తరుణం మధురప్రాయం గౌడం పైష్టికమేవ వా,
మధురస్నిగ్ధగుర్వాశీ యః పిబత్యతిమాత్రయా. 95
అవ్యాయామదివాస్వప్నశయ్యాసనసుఖే రతః,
మదాత్యయం కఫప్రాయం స శీఘ్రమధిగచ్ఛతి. 96

వ్యా. మధురరసంబును స్నిగ్ధగురుగుణంబులును కల యాహారమును భుజించినవాడును, శరీరవ్యాయామము జేయకుండువాడును, పగలు విశేషముగ నిద్రించువాడును, పరుండుటయందును నిర్వ్యాపారముగ కూర్చొనియుండుటయందును సుఖము మరిగినవాడును, క్రొత్తదియు తీపి యధికముగ కల్గిన మద్యమునైనను బెల్లముచేతను పిష్టముచేతను సిద్ధముచేయబడిన మద్యమునైనను మితిమీరి త్రాగినయెడ, వానికి కఫంబధికమైన మదాత్యయము శీఘ్రముగ సంభవించును.

## శ్లైష్మికమదాత్యయలక్షణములు.

మూ. ఛర్ద్యరోచకహృల్లాసతన్ద్రాస్తైమిత్యగౌరవైః,
విద్యాచ్ఛీతపరీతస్య కఫప్రాయం మదాత్యయమ్. 97

వ్యా. కఫజమదాత్యయము కలవానికి వాంతియు, అరోచకంబును, ఓకరింతలును కల్గును. మైకము గ్రమ్మును. శరీరముపై తడిగుడ్డ గప్పినవిధముగ జడమై బరువుగను చల్లబడియు నుండును. ఈలక్షణములచే కఫాధికమదాత్యయమని యెరుంగదగును.

## మద్యము త్రిదోషముల ప్రకోపింపజేయుటకు కారణము.

మూ. విషస్య యే గుణా దృష్టాః సన్నిపాతప్రకోపణాః,
త ఏవ మద్యే దృశ్యన్తే విషే తు బలవత్తరాః. 98
హన్త్యాశు హి విషం కిఞ్చిత్ కిఞ్చిద్రోగాయ కల్పతే,
యథా విషం తథైవాన్త్యో జ్ఞేయో మద్యకృతో మదః. 99
తస్మాత్త్రిదోషజం లిఙ్గం సర్వత్రాపి మదాత్యయే,
దృశ్యతే రూపవైశేష్యాత్ పృథక్త్వం చాస్య(పి) లక్ష్యతే. 100

వ్యా. విషమునకు సంబంధించిన గుణములు పది యేవి కలవో ఆగుణములే మద్యమునకు కలవు. అయ్యవి సన్నిపాతమును ప్రకోపింపజేయునవి. అట్టిగుణములు విషమునకును మద్యమునకును సామాన్యముగ నున్నను విషమున మాత్రము మిక్కిలి ప్రబలములై యుండును. అట్టిగుణములు కల్గి పలుతెరంగులైన విషములలో నొకటి చంపును. ఇంకొకటి రోగముల గల్గించును. అత్తెరంగుననే మద్యంబును తృతీయమదము కల్గినప్పుడు చంపును. ఒకసమయమున రోగముల గల్గించుచు. మద్యము విషముబోలె వాతాది త్రిదోషముల లక్షణములను మదాత్యయము లన్నిటియందును కనబరచుచు. ఐనను అట్టి త్రిదోషలక్షణములలో నేదోషలక్షణములు ప్రబలములై యధికముగ గనబడునో, ఆమదాత్యయము ఆదోషముచే జనించినదని వేరుగ వ్యవహరింపబడును.

### మదాత్యయసామాన్యలక్షణములు (సాన్నిపాతికమదాత్యయలక్షణము).

మూ. శరీరదుఃఖం బలవత్ సమ్మోహో హృదయవ్యథా,
అరుచిః ప్రతతా(స్తతం)తృష్ణా జ్వరశ్శీతోష్ణలక్షణః. 101
శిరఃపార్శ్వాస్థిసన్ధీనాం విద్యుత్తుల్యా చ వేదనా,
(వేదనా విక్షతే యథా)
జాయతేఽతిబలా జృమ్భా స్ఫురణం లేపనం శ్రమః. 102
ఉరోవిబన్ధః కాసశ్చ హిక్కా శ్వాసః ప్రజాగరః,
శరీరకమ్పః కర్ణాక్షిముఖరోగః త్రికగ్రహః. 103
ఛర్ద్యతీసారహృల్లాసాః వాతపిత్తకఫాత్మకాః,
భ్రమః ప్రలాపో రూపాణాం అసతాం చైవ దర్శనమ్. 104
తృణభస్మలతాపర్ణపాంసుభిశ్చావపూరణం,
ప్రధర్షణం విహఙ్గైశ్చ భ్రాన్తచేతాస్సమన్యతే. 105
వ్యాకులానామశస్తానాం స్వప్నానాం దర్శనాని చ,
మదాత్యయస్య రూపాణి సర్వాణ్యేతాని లక్షయేత్. 106

వ్యా. శరీరమునం దియ్యది యని చెప్పశక్యముగానిబాధ అధికమైన చిత్తభ్రమము, హృదయమున వేదన, అరుచి, తీవ్రమై యెడలేని దప్పి, చలిజ్వరము, శిరస్సునందును ఇరుప్రక్కలయందును ఎముకలయందును కీళ్లయందును మెరపుబోలె తటాలున క్షణకాలము పోటు మున్నగుబాధ కల్గుట, ప్రబలమైన యావలింతలు, శరీరమునం దేకదేశ

మున అదరుట, అవయవములలో నెండైన కంపము కల్గుట, బడలిక, రొమ్ము పట్టినట్లుండుట, కాసము, ఎక్కిళ్లు, శ్వాసము, నిదురబట్టకుండుట, శరీరమంతయు వణకుట, చెవుల యందును కన్నులయందును ముఖమునందును ఆయారోగములు కల్గుట, వెన్నెముకకు క్రింది సంధియందు నొప్పి, వాంతి, అతిసారము, గుండెదడ, ఇవి యన్నియు మదాత్యయము లన్నింటియందును త్రిదోషప్రకోపముచే సామాన్యముగ గల్గును.

మరియు మదాత్యయపీడితుడు చక్రముపై నున్నవానివలె నొడలు తిరుగును. తన కిచ్చవచ్చినట్లు వ్యర్థముగను అసంబద్ధముగను వదరుచుండును. వాస్తవ్యముగ లేని రూపములను చూచినట్లు భ్రమించును. భూమిపైనుండు గడ్డిపోచలను బూడిదెను తీగెలను ఆకులను ధూళిని చేతులతో నూడిచి శరీరముపై జల్లికొనును. చిత్తము భ్రమించి చీకాకుబడి పక్షులచే బెదరింపబడినట్లు తలంచి భయము నభినయించును. సంకులములై యప్రశస్తములైన స్వప్నముల గాంచును. ఇవియు గూడ మదాత్యయమున సామాన్యముగ గల్గు లక్షణములు. (ఇదియే సాన్నిపాతికమదాత్యయలక్షణంబునగును).

ఇచ్చట నీవివరణము నెరుంగునది:—"మదాత్యయమన—మద ఏవ ఆత్యయికః—మదాత్యయః" అను విగ్రహముచేత మదమే వ్యాధిరూపముగ మారినది మదాత్యయమని సంజ్ఞ చేయబడినది. అట్టి మదము వాత-పిత్త-కఫ-సన్నిపాతభేదములచే నాల్గు తెరంగుల నుండునని అష్టోదరీయాధ్యాయమున వ్యాధిభేదముల వివరించుతరి నిట్లు చెప్పబడినది:—"చత్వారోఽపస్మారాః ఇతి-వాత-పిత్త - కఫ-సన్నిపాతనిమిత్తజాః...చత్వారో మదాః......అపస్మారైర్వ్యాఖ్యాతాః" (సూ. అ. ౧౯. సూ. ౨౫) వాతాదిభేదముల జనించిన మదరూపమైన మదాత్యయంబును నాల్గువిధములుగ నేయుండుట యావశ్యకము. మరియు "యశ్చ మద్యమదః ప్రోక్తః విషజో రౌధిరశ్చ యః, సర్వ ఏతే మదానర్తే వాతపిత్తకఫత్రయాత్" (సూ. అ. ౨౪. శ్లో. 3౮) అనువాక్యముచేత మదము త్రిదోషప్రకోపము లేక జనించదని చెప్పబడినది. నాల్గు తెరంగులైన మదాత్యయములలో వాతికాదిమదాత్యయములకు వేరు వేరుగ లక్షణముల జెప్పి సాన్నిపాతికమదాత్యయ లక్షణము "శరీరదుఃఖం" అని యుపక్రమించి పైగ్రంథముచే జెప్పబడినది. ఇదియె మదాత్యయసామాన్యలక్షణంబునగును. ఈవిషయమును చక్రపాణిదత్తుడును వ్యాఖ్యానమున నిట్లు చెప్పిరి:—"శరీరదుఃఖమిత్యాదినా సర్వమదాత్యయస్య సామాన్యం లక్షణం బ్రూతే. కిం వా త్రిదోషమదాత్యయస్యైవ లక్షణమ్."

### మదాత్యయమున దోషాధిక్యమునుబట్టి చికిత్సావిధి.

మూ. సర్వం మదాత్యయం విద్యాత్ త్రిదోషమధికం తు యం,
దోషం మదాత్యయే పశ్యేత్ తస్యాదౌ ప్రతికారయేత్. 107

వ్యా. మదాత్యయము లన్నియు త్రిదోషములచే జనించును. ఐన నందు ఏదోష మధికముగ గనబడునో ఆదోషమునకు తొలుత చికిత్స జేయవలెను.

### సమత్రిదోషప్రకోపమున చికిత్సాక్రమము.

మూ. కఫస్థానానుపూర్వ్యా చ క్రియా కార్యా మదాత్యయే,
పిత్తమారుతపర్యన్తః ప్రాయేణ హి మదాత్యయః. 103

వ్యా. త్రిదోషములును సమములుగ ప్రకోపమునొందియుండు మదాత్యయమున తొలుత కఫస్థానగతదోషమునకు చికిత్స చేసి పిదప పిత్తమునకు వాతమునకును చికిత్స చేయవలెను. ఏలనన:—మదాత్యయమున తరుచుగ తొలుత కఫంబును పిమ్మట పిత్తవాతంబులును ప్రబలము లగును. (కావున దోషములు సమములుగ ప్రకుపితము లైనపుడు కఫమునకు తొలుత చికిత్స చేసి పిదప పిత్తవాతములకు చికిత్స జేయనగునని భావము.) ఇచ్చట త్రిదోషములు సమముగ నున్నపుడు పై చికిత్స చెప్పబడినది. ఈవిషయమును వాగ్భటులు:—"కఫస్థానానుపూర్వ్యా వా తుల్యదోషే మదాత్యయే" (అ. హృ. చి. అ. ౭) అని చెప్పిరి.

### మదాత్యయమునకు మద్యోపయోగవిధి.

మూ. మిథ్యాతిహీనపీతేన యో వ్యాధిరుపజాయతే,
సమపీతేన తేనైవ స మద్యేనోపశామ్యతి. 109
జీర్ణామమద్యదోషాయ మద్యమేవ ప్రదాపయేత్,
ప్రకాంక్షాలాఘవే జాతే యద్యదస్మై హితం భవేత్. 110
సౌవర్చలానుసంవిద్ధం శీతం సబిడసైన్ధవం,
మాతులుఙ్గార్ద్రకోపేతం జలయుక్తం ప్రమాణవిత్ (వత్) 111

వ్యా. మిథ్యాయోగముగ (విధివిపరీతముగ) నైనను, అతియోగముగ (ప్రమాణాతీతముగ) నైనను, హీనయోగముగ (తక్కువ పరిమాణముగ) నైనను మద్యమును సేవించుటచే కల్గిన మదాత్యయమునందు ఏజాతిలో చేరిన మద్యమును త్రాగుటచే మదాత్యయము సంభవించెనో ఆజాతికి చేరిన మద్యమును యుక్తియుక్తముగను సమయోగముగను మరల నుపయోగించినచో నామదాత్యయము శమించును. మరియు నట్టి మదాత్యయమున మద్యమునందలి యామదోషము జీర్ణమైన పిదప నాహారమునం దిచ్చబోడమి శరీరము చులకన కల్గియుండుతరి వానికి హితమై యలవాటుగను శీతవీర్యము

గను నున్న మద్యమున సౌవర్చలలవణమును బిడాలవణమును సైంధవలవణమును మాదీ ఫలరసమును అల్లపురసమును జలమును యథోచితముగ జేర్చి, విధ్యుక్తముగను సమ యోగముగను త్రాగించినయెడ హీనమిథ్యాదియోగముగ త్రాగబడిన మద్యముచే గల్గిన మదాత్యయము శమించునని భావము.

ఇచ్చట నీవిషయము నెఱుంగునది—మద్యపానవిషయమున సమయోగలక్షణ మును వాగ్భటాచార్యు లిట్లు చెప్పిరి:—"యావద్దృష్టేర్న సమ్భ్రాన్తిః యావన్న క్షోభతే మనః, తావదేవ విరన్తవ్యం మద్యాదాత్మవతా సదా" (అ. హృ. చి. అ. 7. శ్లో. 52) కండ్లు తిరగకయు, మనస్సు వికృతిచెందకయు, నుండునంతకు మునుపే మద్య పానమునుండి విరమించవలెను. ఇదియే సమయోగము. మద్యపానముచే మనస్సు సంక్షో భము జెందినపిమ్మట కూడ పానము చేయుచుండునెడ నతియోగమగును. తక్కువగ పానముచేసినచో హీనయోగమగును. కాల-దేశ-దోష-ప్రకృత్యాదుల ననుసరింపక విధి విరుద్ధముగ త్రాగిన నయ్యది మిథ్యాయోగమగును. అందు సమయోగముచే మద్యపాన మునకు జెప్పినసుగుణము లన్నియు కల్గును. హీన-మిథ్యా-తియోగములచే మదాత్య యము సంభవించును. అట్టి మదాత్యయమున నేమద్యముచే నయ్యది జనించునో ఆజాతికి జేరిన మద్యమును విధ్యుక్తప్రకారము సమయోగముగ త్రాగవలెను. అదియును జీర్ణదశ యందు సౌవర్చలాదిసహితముగ సేవింపదగు. దానంజేసి మిథ్యాయోగమున గల్గిన మదాత్యయము సమయోగముచే శమించును. మద్యము విషమును బోలె తీక్ష్ణాదిగుణములు కల్గియుండునని చెప్పబడినది. కావున అట్టి తీక్ష్ణాదిగుణములతో గూడిన మద్యమే సమయోగప్రభావమునంజేసి దాని శమింపగల్గునుగాని వేరొండు చికిత్స పొసగదని భావము. అందును ఏజాతిమద్యముయొక్క హీన-మిథ్యాఽ-తియోగములచే రోగము కల్గునో ఆజాతిమద్యమునే సమయోగముగ నుపయోగింపవలెనని "సమపీతేన తేనైవ" అనువాక్యముచే జెప్పబడినది.

మదాత్యయమున మద్యోపయోగము, దాన గల్గుగుణము.

మూ. తీక్ష్ణోష్ణేనాఽతిమాత్రేణ పీతేనాఽమ్లవిదాహినా,
మద్యేనాఽన్నరసోత్క్లేదో విదగ్ధః క్షారతాం గతః. 112
అన్తర్దాహం జ్వరం తృష్ణాం ప్రమోహం విభ్రమం మదం,
జనయత్యాశు తచ్ఛాన్త్యై మద్యమేవ ప్రదాపయేత్. 113
క్షారో హి యాతి మాధుర్యం శీఘ్రమమ్లోపసంహితః,
శ్రేష్ఠమమ్లేషు మద్యం చ యైర్గుణైస్తాన్ పరం శృణు. 114

మద్యస్యాఽమ్లస్వభావస్య చత్వారోఽనురసాః స్మృతాః,
మధురశ్చ కషాయశ్చ తిక్తః కటుక ఏవ చ. 115
గుణాశ్చ దశ పూర్వోక్తాః తైశ్చతుర్దశభిర్గుణైః,
సర్వేషాం మద్యమమ్లానాం ఉపర్యుపరి తిష్ఠతి 116

వ్యా. తీక్ష్ణోష్ణగుణంబులును, అమ్లరసంబును కల్గి విదాహావస్థను కల్గించు స్వభావముకలమద్యమును అధికముగ పానముచేయుటవలన భుజింపబడిన యన్నముయొక్క రసము విదాహావస్థ నొంది క్షారరసముగ పరిణమించును. దానివలన శరీరాంతర్భాగమున తాపంబును జ్వరంబును దప్పియు మోహంబును చిత్తభ్రమంబును మదంబును కల్గును. అయ్యది శమించుటకై శీఘ్రముగ మద్యమునే యిప్పించవలెను. మద్యము అమ్లరసప్రధానమగుటవలన పైజెప్పిన రీతిగ విదగ్ధమై క్షారత్వము నొందినయాహారరసము మధురముగ పరిణమించును. (క్షారము అమ్లరసముతో కలిసినయెడ శీఘ్రముగ మాధుర్యమునొందును).

మరియు నమ్లరసద్రవ్యములలో మద్యము కడుంగడు శ్రేష్ఠమైనది. ఏలనన:— మద్యము పుట్టుకలోనే యమ్లస్వభావము కల్గినది. దానికి మధుర-కషాయ-తిక్త-కటురసములు నాల్గును అనురసములుగ నుండును. పైజెప్పబడిన లఘుతీక్ష్ణాదిగుణములు పదియును మద్యమునం దిమిడియుండును. ఇత్తెరంగున నాలు గుపరసంబులును పదిగుణంబులును చేరి పదునాల్గుగుణంబులును కల్గి యమ్లస్వభావముకలమద్యము అమ్లరసద్రవ్యము లన్నింటిలో మిక్కిలి యుత్తమోత్తమం బై యుండును. (కావున నట్టి గుణాదులు కలమద్యము మద్యాతిపానముచే గల్గిన యాహారరసక్షారపరిపాకమును మధురముగ మార్చి దాన గల్గు దోషముల నన్నిటిని శమింపజేయుననని సముదితాశయము.) ఈవిషయమునే వాగ్భటాచార్యులును—"తీక్ష్ణోష్ణాద్యైః పురా ప్రోక్తైః దీపనాద్యైః తథా గుణైః, సాత్మ్యత్వాచ్చ తదేవాస్య ధాతుసామ్యకరం పరమ్." (అ. హృ. చి. అ. ౭. శ్లో. ౯) అని స్పష్టముగ జెప్పెను.)

మూ. మద్యోత్క్లిష్టేన దోషేణ రుద్ధః(క్రుద్ధః) స్రోతస్సు మారుతః,
కరోతి వేదనాం తీవ్రాం శిరస్యస్థిషు సన్ధిషు. 117
దోషవిష్యన్దనార్థం హి తస్మై మద్యం విశేషతః,
వ్యవాయి తీక్ష్ణోష్ణతయా దేయమప్యేషు(మద్యేషు) సత్స్వపి. 118
స్రోతోవిబన్ధనున్మద్యం మారుతస్యాఽనులోమనం,
రోచనం దీపనం చాగ్నేః అభ్యాసాత్సాత్మ్యమేవ చ. 119

రుజస్రోతస్వరుద్ధేషు(ఉరస్రోతస్సు శుద్ధేషు) మారుతే చాను లోమితే,
నివర్తన్తే వికారాశ్చ శామ్యన్త్యస్య మదోదయాః. 120

వ్యా. మద్యపానమువలన నుత్క్లేశమునొందిన దోషముచే స్రోతోమార్గము లడ్డగింపబడినప్పుడు వాతము తనకు సంచారమార్గము లేమింజేసి విశేషముగ ప్రకోపము నొంది శిరస్సునందును కీళ్లయందును తీవ్రమైన నొప్పిని కల్గించును. అట్టియెడ నమ్లరసముకల యితరౌషధము లనేకము లున్నను, వ్యవాయి (వ్యాపించుస్వభావము) తీక్ష్ణోష్ణ గుణములు కలమద్యము నే స్రోతస్సుల నడ్డగించిన దోషమును ద్రవింపజేసి వెడలించుటకై యుపయోగింపనగును. మరియు మద్యము స్రోతోమార్గముల విబంధమును పోగొట్టును. దానంజేసి వాత మనులోమముగ సంచరించును. రుచిని అగ్నిదీపనమును కల్గించును. అభ్యాసముచే శరీరతత్వమునకు సాత్మ్యము నై యుండును. (కావున మద్యము నే యుపయోగింపవలె ననుట.) పైజెప్పినరీతిగ స్రోతోబంధము నివర్తించి వాత మనులోమముగ సంచరించునెడ మదముచే గల్గు తాపము మున్నగురోగము లన్నియు నివర్తించును.

## వాతోల్బణమదాత్యయచికిత్స, అందు మద్యపానరూపమైన చికిత్స.

మూ॥ బీజపూరకవృక్షామ్లకోలదాడిమసంయుతం,
యవానీహపుషాఽజాజీశృఙ్గిబేరాఽవచూర్ణితమ్. 121
సస్నేహైస్సక్తుభిర్యుక్తం అవదంశై ర్విరోచితం,
దద్యాత్సలవణం మద్యం పైష్టికం వాతశాన్తయే. 122

వ్యా. వాతం బధికముగ నుండు మదాత్యయమున పిష్టముచే సిద్ధమైన మద్యమునందు మాదీఫలరసమును చింతపండురసమును రేగుపండ్లరసమును పుల్లదానిమ్మపండ్లరసమును జేర్చి; ఓమము, బోడతరము, జీలకర, శుంఠి, వీనిని సమభాగములుగ చూర్ణముచేసి కలిపి; నేతితో కూడిన సత్తుపిండిని కూడ చేర్చి, కొంచెము సైంధవలవణమును కలిపి త్రాగించవలెను. మరియు నామద్యమును త్రాగునప్పుడు యౌగికమైన శూల్యాదిమాంసమును (శూలమున గ్రుచ్చి నిప్పులలో పక్వముచేయబడిన మాంసమును) అవదంశమునకు (త్రాగునపుడు నంచుకొనుటకు) ఉపయోగింపవలెను. ఈయవదంశముచే మద్యపానమున రుచికల్గును. (అవదంశమన—అన్నపానాదుల నుపయోగించునపుడు రుచికల్గుటకై నడుమనడుమ నుపయోగింపబడు ఊరగాయలు పచ్చడులు మున్నగునవి యని యెరుంగునది.)

వాతోల్బణమదాత్యయమున హితములగు మాంసరసాదులు.

మూ. దృష్ట్వా వాతోల్బణం లింగం రసైశ్చైనముపాచరేత్,
లావతిత్తిరిదక్షాణాం స్నిగ్ధామ్లైశ్శిఖినామపి. 123
పక్షిణాం మృగమత్స్యానాం ఆనూపానాం చ సంస్కృతైః,
భూశయప్రసహానాం చ రసైః శాల్యోదనేన చ. 124
స్నిగ్ధోష్ణలవణామ్లైశ్చ వేసవారైర్ముఖప్రియైః,
చిత్రైర్గోధూమికైశ్చాన్నైః వారుణీమణ్డసంయుతైః. 125
పిశితార్ద్రికగర్భాభిః స్నిగ్ధాభిః పూపవర్తిభిః,
మాషపూపలికాభిశ్చ వాతికం సముపాచరేత్. 126

వ్యా- మదాత్యయమునందు వాతలక్షణంబులు మెండుగ గనబడినయెడ లావుకపిట్ట, తీతువుపిట్ట, కోడి, నెమలి, ఆనూపదేశమునందలి పక్షులు, మృగములు, జలచరములగు మత్స్యములు, పుడమిలోనిబొరియల నివసించు జంతువులు, ప్రసహములు (బలాత్కారముగ నాహారమును లాగికొనుజంతువులు), అను నీజంతువులమాంసరసములను, స్నేహద్రవ్యములను ఉష్ణవీర్యములగు ద్రవ్యములచేతను లవణముచేతను దానిమ్మమున్నగువానిరసములచేతను చక్కగ సంస్కరించి వానితో గూడ రాజనంపుబియ్యపు టన్నమును భుజింపజేయ నగును. మరియు నోటికింపైన గోధుమలతో సిద్ధముచేయబడిన చిత్రాన్నములచేతను, వేసవారముతో గూడిన వారుణీ మద్యములచేతను, మాంసమును శుంఠిని కలిపి నేతితో పక్వముచేయబడిన వర్తియొక్క యాకారముగ చేయబడిన యపూపములచేతను, ఉద్దిపప్పుతో చేయబడిన వడలు మున్నగు భక్ష్యవిశేషములచేతను అట్టి మదాత్యయరోగికి నుపచరించవలెను. (పైజెప్పినరీతిగ మద్యమును త్రాగించి మాంసరసాదులచే నుపచరించవలెనని భావము).

వాతాధికమదాత్యయమున హితములగు మాంసాదులు.

మూ. నాతిస్నిగ్ధం న చామ్లేన యుక్తం సమరిచార్ద్రికం,
మేధ్యం ప్రాగుదితం మాంసం దాడిమస్వరసేన వా. 127
పృథక్ త్రిజాతకోపేతం సధాన్యమరిచార్ద్రికం,
రసప్రలేపి సంపూపైః(రసప్రలేహయూషైశ్చ)సుఖోష్ణైస్సంప్రదాపయేత్. 128

వ్యా. వాతాధికమదాత్యయమునందు పైజెప్పబడిన లావాదిజంతువులమాం
లలో దేనినైనను మేదస్సుకు హితమైనదానిని నెయ్యిమొదలగుస్నేహమును కొద్దిగ
పులుపును బొత్తుగ జేర్చక, మిరియాలను శుంఠిని చేర్చి, పులుపుకై దానిమ్మపండ్లరస
కొద్దిగ జేర్చి సిద్ధముచేసి యైనను; లేక త్రిజాతకములను (దాల్చినచెక్క ఏలకులు ల
పత్రి,) దనియాలు, మిరియాలు, శుంఠి, వీనిని గూర్చి మాంసరసమును కూడ
లేహ్యరూపముగ జేసియైనను, లేక సుఖోష్ణముగ నుండు యూషముగ సిద్ధమ
యైన నుపయోగింపందగును. ఏమాంసమైనను మేదస్సుకు హితకరముగ నుండవలెను.

వాతాధికమదాత్యయమున హితములగు పానీయములు.

మూ. భుక్తే తు(న) వారుణీ మద్యం దద్యాత్పాతుం పిపాసవే,
దాడిమస్య రసం వాపి జలం వా పాఞ్చమూలికమ్.
ధాన్యనాగరతోయం చ దధిమణ్డమథాపి వా,
అమ్లకాఞ్జికమణ్డం వా శుక్తోదకమథాపి వా.

వ్యా. పైజెప్పిన విధిప్రకారము భుజించునపుడు దప్పి కల్గినయెడ వా
మద్యమునైనను, దానిమ్మపండ్లరసమునైనను, పంచమూలముల జేర్చి పానకపాం
ప్రకారము కాచబడిన జలమునైనను, దనియాలను శుంఠిని చేర్చి కాచబడిన
నైనను, పెరుగుమీదితేటనీటినైనను, పులిగంజితేటనైనను, శుక్తోదకమునైనను త్ర
వలెను.

మూ. కర్మణానేన సిద్ధేన వికార ఉపశామ్యతి,
మాత్రాకాలప్రయుక్తేన బలం వర్ణశ్చ వర్ధతే.

వ్యా. పైజెప్పబడిన చికిత్సావిధానమును ఆహారాదినియమములను పరి
కాలాద్యనుసారముగ నుపయోగించినచో వాతాధికమదాత్యయముచే గల్గిన వికా
లన్నియు శమించి బలంబును వర్ణంబును వృద్ధినొందును.

వాతాధికమదాత్యయమున హితోపచారములు.

మూ. రాగషాడబసంయోగైః వివిధైః భక్తరోచనైః,
పిశితైశ్శాకపిష్టాన్నైః యవగోధూమశాలిభిః.
అభ్యఙ్గోత్సాదనైః స్నానైః ఉష్ణైః ప్రావరణైః ఘనైః,
ఘనైరగురుపఙ్కైశ్చ ధూపైశ్చాఽగురుజైర్ఘనైః.

నారీణాం యౌవనోష్ణానాం నిర్దయైరుపగూహనైః,
శ్రోణ్యూరుకుచభారైశ్చ సంరోధోష్ణసుఖావహైః. 134
శయనాచ్ఛాదనై రుష్ణైః ఉష్ణైశ్చాన్తర్గృహైస్సుఖైః,
మారుతప్రబలః శీఘ్రం ప్రశామ్యతి మదాత్యయః. 135

వ్యా. రాగములు షాడబములు అను పానకములసంబంధముచేతను, అన్నమునకు రుచిని కల్గించు పలుదెరంగులైన మాంసవిశేషములచేతను, శాకములతో గూడిన పిష్టముచే చేయబడిన భక్ష్యాదులచేతను, యవలు గోధుమలు రాజనములు అనుధాన్యములచే సిద్ధములైన యన్నములచేతను, అభ్యంగనములచేతను, నలుగుపెట్టుటచేతను, కొంచెముగ నుష్ణమైనపానములచేతను, దట్టమైన బట్టల గట్టుటచేతను, అగరుచందనమును దట్టముగ పూయుటచేతను అగరుధూపమును దట్టముగ వేయుటచేతను, యౌవనోద్రేకముచే నుష్ణమైన ప్రకృతికలవారును, పిరుదులును తొడలును స్తనంబులును దట్టములై క్రిక్కిరిసియుండు ప్రౌఢాంగనలయొక్క సుఖకరంబులును ఉష్ణకరంబులునైన నిర్దయాలింగనములచేతను, ఉష్ణములగుశయ్యలచేతను పరుపులచేతను, గర్భగృహనివాసముచేతను ఉపచరించినయెడ వాతాధికమదాత్యయము శీఘ్రముగ శమించును.

### పిత్తాధికమదాత్యయచికిత్స, అందు మద్యపానము.

మూ. భవ్యఖర్జూరమృద్వీకాపరూషకరసైర్యుతం,
సదాడిమరసం శీతం సక్తుభిశ్చావచూర్ణితమ్. 136
సశర్కరం శార్కరం వా మార్ద్వీకమథవాఽపరం,
దద్యాద్బహూదకం కాలే పాతుం పిత్తమదాత్యయే. 137

వ్యా. పిత్తం బధికముగనుండు మదాత్యయమున తీయని ద్రాక్షపండ్లు ఖర్జూరపుపండ్లు ద్రాక్షపండ్లు అనుసీఫలములరసముతో కూడినదియు, దానిమ్మపండ్లరసముతో కూడినదియు, సత్తుపిండిని చేర్చబడినదియు, చక్కెరతో కూడినదియు నగు శార్కర (చక్కెరతో సిద్ధముచేయబడిన) మద్యమునైనను, మార్ద్వీకద్రాక్షారసముతో సిద్ధముచేయబడిన మద్యమునైనను, లేక వేరొండు మద్యమునైనను జలము నధికముగ జేర్చి సకాలమున త్రాగించవలెను.

### పిత్తాధికమదాత్యయమున అన్నపానములు.

మూ. శశాన్ కపిఞ్జలానేణాన్ లావానసితపుచ్ఛకాన్,
మధురామ్లాన్ ప్రయుంజీత భోజనే శాలిషష్టికాన్. 138

పటోలయూషమిశ్రం వా ఛాగలం కల్పయేద్రసం,
పతీవముద్గమిశ్రం వా దాడిమామలకాన్వితమ్. 139
ద్రాక్షామలకఖర్జూరపరూషకరసేన వా,
కల్పయేత్తర్పణాన్ యూషాన్ రసాంశ్చ వివిధాత్మకాన్. 140

వ్యా. పిత్తాధికమదాత్యయమున కుందేటిమాంసము, ఊరపిచ్చుకమాంసము, జింకమాంసము, లావుకపిట్టమాంసము, కాలపుచ్ఛము(నల్లనితోకకలజింకలో భేదము)ల మాంసము, అనుసీమాంసములను మధురరసమును పులుపును చేర్చి పక్వముచేసి యారస ముతో కూడిన రాజనంపుటన్నమునైనను అరువదినాళ్లసంబావుల యన్నమునైనను భోజనమునకై యుపయోగింపనగును. లేక పొట్లకాయలయూషముతో కూడిన మేక పోతుమాంసరసమునైన వ్యంజనమునకై యుపయోగింపనగును. మరియు బటాణుల నైనను పెసలనైనను దానిమ్మపండ్లరసమును ఉసిరికపండ్లరసమును కలిపి పక్వముచేసి యైన నుపయోగింపనగును. ద్రాక్షపండ్లయొక్కయు ఉసిరికపండ్లయొక్కయు ఖర్జూ రపు పండ్లయొక్కయు చిట్టీతపండ్లయొక్కయు రసములను గూర్చి సత్తుపిండితో గూడిన యూషములనైనను పలువెరంగులైన మాంసరసముల నైనను సిద్ధముచేసి యన్నమునందను పానముగ గల్పింపనగును.

## తృడ్విదాహాయుక్తపిత్తాధికమదాత్యయమున వమనవిధి.

మూ. ఆమాశయస్థముత్క్లిష్టం కఫపిత్తం మదాత్యయే,
విజ్ఞాయ బహుదోషస్య దహ్యామానస్య తృష్యతః. 141
(తృడ్విదాహాన్వితస్య చ)
మద్యం ద్రాక్షారసం తోయే(యం) దత్వా తర్పణమేవ వా,
నిశ్శేషం వామయేచ్ఛీఘ్రం ఏవం రోగాద్విముచ్యతే. 142
కాలే పునస్తర్పణాద్యం క్రమం కుర్యాత్ప్రికాంక్షితే,
తేనాఽగ్నిర్దీప్యతే తస్య దోషశేషాన్నపాచకః. 143

వ్యా. పిత్తాధికమదాత్యయమున ఆమాశయమున నుండు కఫపిత్త (రస) ములు ఉద్రేకమునొంది స్వస్థానమునుండి చలించి పైకి పెకలించుచున్నయెడ దోషము మిక్కిలి యధికమై కోష్ఠమున మంట పుట్టి దప్పి యధికముగ నుండునెడ, అట్టి లక్షణముల గమ నించి, ద్రాక్షారససిద్ధమైన మద్యమును నీళ్లు కలిపి సత్తుపిండిని తర్పణమునకై కలిపి త్రాగించి దోషమంతయు నిశ్శేషముగ వెడలునట్లు శీఘ్రముగ వాంతిచేయించవలెను. ఇట్లు వాంతి

చేయించుటవలన మదాత్యయము నివర్తించును. పిమ్మట నాహారకాలమునం దాహారముసై నిచ్చు బొడమియున్నయెడ సత్తుపిండి మున్నగు తర్పణమునుకూడ చేర్చి పేయాదిసంసర్జన క్రమమును (వమనవిధ్యుక్తముగ) అనుసరించి యాహారమునిడవలెను. ఈచికిత్సచేత జాఠరాగ్ని దీపించి దోషశేషమును ఆహారమును పచింపజేయును.

## పిత్తాధికమదాత్యయమున కాసరక్తనిష్ఠీవాదిహరచికిత్స.

మూ. కాసే సరక్తనిష్ఠీవే పార్శ్వస్తనరుజాసు చ,
తృష్యతే సవిదాహే చ సోత్క్లేశే హృదయోరసి. 144
గుడూచీభద్రముస్తానాం పటోలస్యాఽథవా భిషక్,
రసం సనాగరం దద్యాత్ తిత్తిరిప్రతిభోజనమ్. 145
(తైత్తిరైః ప్రతిభోజనమ్)

వ్యా. పిత్తాధికమదాత్యయమున రక్తము నుమియునట్టి కాసంబును, పార్శ్వముల యందును స్తనములయందును నొప్పియు, మంటతో కూడిన దప్పియు కల్గి, రొమ్మునందును హృదయమునందును దోషము వృద్ధినొంది యున్నయెడ తిప్పతీగెయొక్కయు భద్రముస్తలయొక్కయు రసము (కషాయము) నైనను, చేదుపొట్లరసము (కషాయము) నైనను, శుంఠిచూర్ణముతో కలిపి యిప్పించి, తీతువుపిట్టమాంసముతో కూడ నన్నమును భుజింపచేయనగును.

## మదాత్యయమున గల్గిన దప్పికి చికిత్స.

మూ. తృష్యతే చాతిబలవత్ వాతపిత్తే సముద్ధతే,
దద్యాద్ద్రాక్షారసం పాతుం శీతం దోషాఽనులోమనమ్. 146
జీర్ణే సమధురామ్లేన చ్ఛాగమాంసరసేన తత్,
భోజనం భోజయేన్మద్యం అనుతర్షం చ పాయయేత్. 147
అనుతర్షస్య మాత్రా సా యయా నో దూష్యతే మనః,
తృష్యతే మద్యమల్పాల్పం ప్రదేయం స్యాద్వ్యపహ్లాదకమ్ 148
తృష్ణా యేనోపశామ్యేత మదం యేన చ నాప్నుయాత్,
పరూషకాణాం పీలూనాం రసం శీతమథాపి వా. 149
పర్ణినీనాం చతసృణాం పిబేద్వా శిశిరం జలం,
ముస్తదాడిమలాజానాం తృష్ణాఘ్నం వా పిబేద్రసమ్. 150

కోలదాడిమవృక్షామ్లచుక్రీకాచుక్రికారసః,
పఞ్చామ్లకో ముఖాలేపః సద్యస్తృష్ణాం నియచ్ఛతి. 151

వ్యా. మదాత్యయమున మిక్కిలి తీవ్రముగ దప్పి కల్గి వాతపిత్తములు మిక్కిలి ప్రకోపము నొందినయెడ చల్లగను .వాతాదిదోషముల ననులోమముగ జేయునదియు నగు ద్రాక్షారసమును త్రాగించవలెను. అది జీర్ణమైనపిదప మధురామ్లరసముల జేర్చి పక్వము చేయబడిన మేకపోతుమాంసరసమును కలిపినయన్నమును భుజింపవలెను. భోజనసమయమున దప్పి కల్గినయెడ మద్యమును కొంచెము కొంచెముగ అనుపానముగ త్రాగవలెను. అట్టి యనుపానమును మనస్సు వికృతిజెందకుండునంత పరిమాణము గల్పించి మద్యమును త్రాగవలెను. మరియు దప్పి యధికముగ నున్నయెడ మద్యమున జలము నధికముగ జేర్చి, దప్పి శమించి మదమున కవకాశము గల్గనీయక తగుపరిమాణముతో నప్పుడప్పుడు త్రాగవలెను.

మరియు చిట్టీత కొండగోగు ఈరెంటిని శీతకషాయముగ జేసి యారసమునైన పర్ణీచతుష్టయముయొక్క శీతకషాయమునైనను, తుంగగడ్డలు, దానిమ్మ, పేలాలు, వీనిని చేర్చి సిద్ధముచేయబడిన శీతకషాయమునైనను దప్పిని హరించుటకై త్రాగవలెను.

మరియు దప్పి మిక్కిలి తీవ్రముగ నున్నప్పుడు రేగుపండ్లు, దానిమ్మపండ్లు, చింతపండు, పులిచింతాకు, చుక్కకూర, అనునీపంచామ్లములరసము నొకటిగ గూర్చి నోటికి బూసినయెడ శీఘ్రముగ దప్పిని శమింపచేయును. ("ఇచ్చట పర్ణినీనాం చతసృణాం" అనుచోట కోలపొన్న, నేలపొన్న, ముయ్యాకుపొన్న, నక్కతోకపొన్న అనునవి నాల్గును చేరి పర్ణీచతుష్టయమని యెరుంగునది.)

పిత్తజమదాత్యయహరశిశిరోపచారాదులు.

మూ. శీతలాన్యన్నపానాని శీతశయ్యాసనాని చ,
శీతవాతజలస్పర్శాః శీతాన్యుపవనాని చ. 152
క్షౌమపద్మోత్పలానాం చ మణీనాం మౌక్తికస్య చ,
చన్దనోదకశీతానాం స్పర్శాశ్చన్ద్రాంశుశీతలాః. 153
హేమరాజతకాంస్యానాం పాత్రాణాం శీతవారిభిః,
పూర్ణానాం హిమపూర్ణానాం దృతీనాం పవనాహతాః. 154
సంస్పర్శాశ్చన్దనార్ద్రాణాం నారీణాం చ సమారుతాః,
చన్దనానాం చ ముఖ్యానాం శస్తాః పిత్తమదాత్యయే 155

(సంస్పర్శశ్చన్దనార్ద్రాణాం స్త్రీణాం పిత్తమదాత్యయే)
శీతవీర్యం యదన్యచ్చ తత్సర్వం వినియోజయేత్.

వ్యా. (గుణ-వీర్య-స్పర్శములచే) శీతలములగు నన్నపానములు, చల్లనైయుండు శయనాసనములును, చల్లగనుండు గాలియొక్కయు జలముయొక్కయు స్పర్శములును, ఎండ సోకక చల్లనినీడగల యుద్యానవనములును, చందనోదకముచే చల్లనైన పట్టుబట్టల యొక్కయు తామరకమలములయొక్కయు నల్లకలువలయొక్కయు మణులయొక్కయు ముత్తెములయొక్కయుఁ జంద్రునికిరణములచే చల్లనైనస్పర్శంబులును, చల్లనినీళ్లచే నిండిన బంగరుపాత్రములయొక్కయు వెండిపాత్రములయొక్కయు, కంచుపాత్రముల యొక్కయు మంచునీళ్లచే నిండి గాలి తాకుడుచే చల్లబడిన తోలుతిత్తులయొక్కయు స్పర్శంబులును, చందనమును పూసికొని తడియైన శరీరము కల్గి యౌవనవతులగు స్త్రీల సంస్పర్శంబులును, గాలితోఁగూడి మిగుల ప్రశస్తములగు చందనములయొక్క స్పర్శంబును, పిత్తమదాత్యయమునందు మిగుల ప్రశస్తములై యుండును. మరియు నివిగాక శీతవీర్యము కల యాహారవిహారాదు లన్నియు పిత్తమదాత్యయమున మిగుల శ్రేష్ఠములై యుండును. (ఇచ్చట'హిమపూర్ణానాం దృతీనాం సంస్పర్శాశ్చ' అని చెప్పుటచేత ఇప్పటి యాంగ్లేయ చికిత్సాపద్ధతియందు ఆచరణముననున్న మంచుగడ్డ (ఐస్) నుపయోగించుటయు పురాతన చికిత్సాపద్ధతిలో నాచారమున నున్నట్లు తెలియుచున్నది.)

మదాత్యయమున కల్గిన తాపమునకు శమనోపాయము.

మూ కుముదోత్పలపత్రాణాం సిక్తానాం చన్దనామ్బునా. 156
హితాః స్పర్శాః మనోజ్ఞానాం దాహే మద్యసముత్థితే,

వ్యా. మదాత్యయమున శరీరముపై మంట పుట్టినయెడ తెల్లకలువలయొక్కయు నల్లకలువలయొక్కయు రేకులను చందనోదకముచే తడిపి దాని స్పర్శమును శరీరముపై సోకునట్లు శరీరముపై కప్పినయెడ మంట శమించును.

మూ. కథాశ్చ వివిధాశ్చిత్రాః (చిత్రాః) శబ్దాశ్చ శిఖినాం శివాః. 157
తోయదానాఞ్చ శబ్దా హి శమయన్తి మదాత్యయమ్,

వ్యా. విచిత్రములగు పురాతనకథలును, నెమళ్లయొక్క కర్ణసుఖములయిన ధ్వనులును, మేఘగర్జనయొక్క ధ్వనులును, మదాత్యయమున కల్గు బాధల శమింపజేయును.

మూ. జలయన్త్రాభివర్షీణి వాతయన్త్రవహాని చ. 158
కల్పనీయాని భిషజా దాహే ధారాగృహాణి చ,

వ్యా. మదాత్యయమున శరీరమునకు తాపము కల్గినప్పుడు జలయంత్రములచే నుదకమును వెదజల్లునవియు, గాలిని వ్యాపింపజేయు యంత్రములతో కూడినవియు నగు ధారాగృహములను (జలధారలతో కూడిన జలవిశేషము) రమ్యములుగ కల్పించి దాహపీడితునియం దుంచినచో తాపము శమించును. (ఇచ్చట జలయంత్ర వాతవహాయంత్ర ప్రస్తావముచేత చిరంతనకాలమునందును ఇప్పటి నవనాగరీకకాల్మమునందు నూత్నముగ నిర్మింపబడిన జలప్రణాళికలు (కొళాయిలు) గాలిని వ్యాపింపజేయు గొట్టములు మున్నగునవి యుండినట్లు యూహింప దగియున్నది.)

### మదాత్యయమున గల్గు శరీరతాపమునకు ప్రలేపాదులు.

మూ. ఫలినీసేవ్యలోధ్రామ్బుహేమపత్రకుటన్నటమ్ 159
కాలీయకరసోపేతం దాహే శస్తం ప్రలేపనమ్,
బదరీపల్లవోత్థశ్చ తథైవారిష్టకోద్భవః 160
ఫేనిలాయాశ్చ యః ఫేనః స్తైర్దాహే లేపనం శుభం,
సురా సమణ్డా దధ్యమ్లం మాతులుఙ్గరసో మధు. 161
సేకే ప్రదేహే శస్యన్తే దాహఘ్నాస్సామ్లకాఞ్జికాః,
పరిషేకావగాహేషు వ్యఞ్జనానాం చ సేవనే. 162
శస్యతే శిశిరం తోయం దాహతృష్ణాప్రశాన్తయే,

వ్యా. ప్రేంకణపుచెక్క, వట్టివేళ్లు, లొద్దుగు, కురువేరు, నాగకేసరములు, తుంగగడ్డలు, వీని నన్నిటిని పచ్చని చందనముయొక్క రసమును పోసి నూరి పట్టువేసిన యెడ మద్యపానముచే కల్గిన యొడలిమంట శమించును.

మరియు రేగుచిగుళ్లనైనను, వేపచిగుళ్లనైనను, కుంకుడుకాయలనైనను, నీళ్లలో వైచి కవ్వముచే చిల్కినయెడ నురుగు తేలును. ఆనురుగును శరీరముపై పట్టువేసినయెడ మద్యపానమున కల్గిన మంట శమించును.

మరియు సురయనెడి మద్యమునైనను, దానిపై తేటనైనను, పుల్లనిపెరుగునైనను, మాదీఫలరసమునైనను, తేనెనైనను, శరీరమున మంటపుట్టినప్పుడు తడుపుటకును పట్టువేయుటకును నుపయోగించుట చాల ప్రశస్తము. పై జెప్పిన ద్రవములను పుల్లనికాంజికమున కలిపి సేకాదుల కుపయోగించుట చాల హితకరము.

మరియు స్నానమునకును, శరీరముపై చల్లుటకును, శాకాదుల దడుపుటకును చల్లనినీళ్లను నుపయోగించుట చాల ప్రశస్తము. దీనివలన తాపము, దప్పియుం శమించును.

(మరియు వాగ్భటాచార్యులు మద్యపానముచే కల్గు తాపవిషయమై యిట్లు చెప్పిరి:—"త్వచం ప్రాప్తశ్చ పానోష్మా పిత్తరక్తాభిమూర్ఛితః, దాహం ప్రకురుతే ఘోరం తత్రాతిశిశిరో విధిః. అశామ్యతి రసైః తృప్తే రోహిణీం వ్యధయేత్సిరామ్" (అ. చి. అధ్యా. ౭) మద్యముయొక్క యుష్ణము చర్మము నాశ్రయించి పిత్తరక్తములతో కలసి మిక్కిలి దారుణమైన మంటను శరీరముపైనెల్ల కల్గించును. అట్టియెడ మిక్కిలి శీతములైన యుపచారముల చేయనగును. అట్టి శీతోపచారములచే శమింపకున్నయెడ రోగికి మాంసరసమును తృప్తిగ పానముచేయించి శరీరమునందలి రోహిణి యనుసిరను వేధించి రక్తమోక్షణము చేయనగునని యర్థము.)

మూ. మాత్రాకాలప్రయుక్తేన కర్మణానేన శామ్యతి. 163
ధీమతో వైద్యవశ్యస్య శీఘ్రం పిత్తమదాత్యయః,

వ్యా. పైజెప్పిన చికిత్సావిధానమును, పరిమాణమును, కాలదేశాదులును, చక్కగ గమనించి యుపయోగించునెడ బుద్ధిమంతుడును వైద్యునకువశుడై చెప్పినదాని నతిక్రమించక పథ్యసేవనాదుల నాచరించువాడును అగురోగికి పిత్తముచే కల్గిన మదాత్యయము అతిశీఘ్రముగ నివర్తించును.

### కఫాధికమదాత్యయచికిత్స.

మూ. ఉల్లేఖనోపవాసాభ్యాం జయేత్కఫమదాత్యయమ్. 164
తృష్యతే సలిలం చాస్మై దద్యాత్ హ్రీబేరసాధితం,

వ్యా. కఫము అధికముగ నుండు మదాత్యయమున తొలుత సామాన్యముగ వమనముచేతను, ఉపవాసముచేతను చికిత్స చేయనగును. దప్పి యధికముగ నున్నపుడు కురువేరును చేర్చి కాచబడిన జలమును త్రాగుటకై యిప్పించవలయును.

### కఫాధికమదాత్యయమున పాచనపానీయసేవనము.

మూ. బలయా పృశ్నిపర్ణ్యా వా కణ్టకార్యాఽథవా శృతమ్. 165
సనాగరాభిస్సర్వాభిః జలం వా శృతశీతలం,
దుఃస్పర్శేన సముస్తేన ముస్తపర్పటకేన వా. 166
జలం ముస్తైః శృతం వాపి దద్యాద్దోషవిపాచనం,
ఏతదేవ చ పానీయం సర్వత్రాపి మదాత్యయే. 167
నిరత్యయం పీయమానం పిపాసాజ్వరనాశనం,

వ్యా. చిట్టాముట్టినైనను, కోలపొన్ననైనను, వాకుడునైనను, చేర్చి కాచబడిన జలమును కఫాధికమదాత్యయమున త్రాగింపనగును. లేక చిట్టాముట్టి మొదలగు మూటి తోడను శుంఠిని కూడ చేర్చి జలమును కాచి చల్లార్చి త్రాగింపనగును. మరియు దురదగొండిని తుంగగడ్డలను చేర్చియైనను, తుంగగడ్డలను పర్పాటకమును చేర్చియైనను, లేక తుంగగడ్డలు మాత్రము చేర్చియైనను కాచబడిన జలమును చల్లార్చి త్రాగించినచో దోషము పరిపక్వమగును. ఈపానీయమును మదాత్యయము లన్నిటియందును త్రాగుట కుపయోగించినను నిర్బాధకముగ దప్పిని జ్వరమును శమింపజేయును.

### కఫాధికమదాత్యయమున శార్కరాదిమద్యపానము.

మూ. నిరామం కాఙ్క్షితం కాలే సక్షౌద్రం పాయయేత్తు తమ్. 168
శార్కరం మధు వా జీర్ణం అరిష్టం శీధుమేవ వా,
రూక్షతర్పణసంయుక్తం యవానీనాగరాన్వితమ్. 169
(రూక్షం తర్పణసంయుక్తం యావాన్నం వా ప్రదాపయేత్),

వ్యా. కఫం బధికముగ నుండు మదాత్యయమున ఆమదోషము లేక యుండు నపుడు ప్రాతదియగు శార్కర (చక్కెరతో చేయబడిన) మద్యముననైనను, తేనెతో చేయబడిన మద్యముననైనను, అరిష్టమను మద్యముననైనను, శీధుమద్యముననైనను, రూక్షగుణముగల తర్పణ (సత్తుపిండి మొదలగు చూర్ణమును) ఓమము, శుంఠి చూర్ణమును కలిపి తేనెను చేర్చి రోగి కిష్టమయిన మద్యమును త్రాగించవలయును.

### కఫాధికమదాత్యయమున నాహారవిధి.

మూ. యావగోధూమికం చాన్నం రూక్షయూషేణ భోజయేత్,
కులుత్థానాం సుశుష్కాణాం మూలకానాం రసేన వా. 170
తనునాల్పేన లఘునా కట్వమ్లేనాల్పసర్పిషా,
పటోలయూషమమ్లం వా యూషమామలకస్య వా. 171
ప్రభూతకటుసంయుక్తం సయవాన్నం ప్రదాపయేత్,
వ్యోషయూషమథామ్లం వా యూషం వా సామ్లవేతసమ్. 172
ఛాగమాంసరసం రూక్షమమ్లం వా జాఙ్గలం రసం,

వ్యా. పైజెప్పినరీతిగ శార్కరాది మద్యమును త్రావి అది జీర్ణమై యాకలి కల్గినప్పుడు యవాన్నము నైనను, గోధుమాన్నము నైనను, రూక్షగుణముగలయూష ముతో చేర్చి భుజింపవలయును. మరియు తేటగను, కొంచెము కటు అమ్లరసముల చేర్చ

బడినదిగను స్వల్పమగు నేతిని గల్పినదియు నగు ఉలవకట్టుతో నైనను, ఎండిన ముల్లంగిని చేర్చి చేయబడిన కట్టుతో నైనను, పులుపును చేర్చిన చేదుపొట్లను కూడ చేర్చి సిద్ధము చేయబడిన యూషము నైనను, ఉసిరికకాయలరసమును చేర్చిన యూషము నైనను, అధికముగ కారము చేర్చి సిద్ధము చేయబడిన యవాన్నము నైనను భుజింపవలయును. లేక త్రికటుకములను, అమ్లరసమును చేర్చి సిద్ధము చేయబడిన యూషము నైనను, అమ్లవేతసముతో కూడిన యూషము నైనను, రూక్షముగ నుండు మేకపోతు మాంస రసము నైనను, అమ్లరసముతో కూడిన జాంగలజంతుమాంసరసము నైనను యవాన్నమును కలిపి భుజింపనగును.

## కఫాధికమదాత్యయమున మాంసోపయోగము.

మూ. స్థాల్యాం వాథ కపాలే వా భృష్టం నిర్ద్రవ(నీరజ)వర్తితమ్. 173
కట్వమ్లలవణం మాంసం భక్షయన్ వృణుయాన్మధు,

వ్యా. మాంసమును మట్టిపిడతలో నైనను, మంటిపెంకులో నైనను ఉనిచి కారమును, పులుపును ఉప్పును చేర్చి ద్రవము లేకుండునట్లు వేచి మద్యపానము చేసినపుడు తినవలయును. (ఇచ్చట కపాలపదమునకు 'పుఱ్ఱె' అని యర్థము చేసి 'మనుష్యునియొక్క పుఱ్ఱెయందుగాని' అని యొకవ్యాఖ్యాత వ్రాసెను. ఈతనివ్రాత అనాలోచితము, అప్రశస్తము, అశ్లీలము.)

## కఫాధికమదాత్యయమున మాంసోపయోగవిధి.

మూ. వ్యక్తమారీచకం మాంసం మాతులుఙ్గరసాన్వితమ్. 174
ప్రభూతకటుసంయుక్తం యవానీనాగరాన్వితం,
భృష్టం దాడిమసారామ్లం ఉష్ణయూషోపవేష్టితమ్. 175
యథాగ్ని భక్షయేత్ కాలే ప్రభూతార్ద్రికపేషితం,
పిబేచ్చ నిగదం మద్యం కఫప్రాయే మదాత్యయే. 176

వ్యా. మాంసమున మిరియాలపొడిని విశేషముగ జేర్చి మాదీఫలరసమును కొద్దిగ చేర్చి పక్వముచేసినయెడల నుపయోగింపదగును. అధికముగ కారమును, ఓమ మును, శుంఠిని, దానిమ్మరసమును, చేర్చి వేయించబడిన మాంసమును అల్లము నధికముగ చేర్చి ఉష్ణమైన యూషమును కలిపి నూరి ముద్దచేసి జఠరాగ్నిబలానుసారముగ నామాంసమును తిని పైజెప్పిన శార్కరాదిమద్యమును పానముచేయవలయును. దీనివలన కఫాధికమయిన మదాత్యయము శాంతినొందును.

## కఫాధికమదాత్యయమునం దష్టాంగలవణప్రయోగము.

మూ. సౌవర్చలమజాజీ చ వృక్షామ్లం సామ్లవేతసం,
త్వగేలామరిచాఽర్ధాంశం శర్కరాభాగయోజితమ్. 177
ఏతల్లవణమష్టాఙ్గం అగ్నిసన్దీపనం పరం,
మదాత్యయే కఫప్రాయే దద్యాత్ స్రోతోవిశోధనమ్. 178
ఏతదేవ పునర్యుక్త్యా మధురామ్లైర్ద్రవీకృతం,
గోధూమాన్న యవాన్నానాం మాంసానాం చాఽతిరోచనమ్.

వ్యా. సౌవర్చలలవణము, జీలకర, చింతపండు, అమ్లవేతసము (పుల్లప్రబ్బలి), ఇవి ప్రత్యేక మొక్కొకభాగము; లవంగపుపట్ట, ఏలకులు, మిరియాలు ఇవి యొక్కొకటి యర్ధభాగము, చక్కెర యొక్కభాగము; ఇత్తెరంగున వీనినెనిమిదిటి నొకటిగ గూర్చి చూర్ణముచేసిన నయ్యది యష్టాంగలవణమని యన్వర్థముగ జెప్పబడును. ఇయ్యది యగ్ని సందీపనమునకు మిగుల శ్రేష్ఠమైనది. దీనిని కఫాధికమదాత్యయమున నుపయోగించినచో స్రోతోమార్గములను శుద్ధముగ జేయును. మరియు దీనిని మధురరసముచేతను దానిమ్మ పులుసు మున్నగు నమ్లరసములచేతను యుక్తియుక్తముగ ద్రవముగ జేసి యాహార పదార్థములయందుచేర్చి భుజించునపు డుపయోగించినచో గోధూమ-యవాన్నములకును పలుతెరంగులైన మాంసములకును రుచిని కల్గించును.

## ద్రాక్షచే సిద్ధమైన రాగము.

మూ. పేషయేత్కటుకైర్యుక్తాం శ్వేతాం బీజవివర్జితామ్,
మృద్వీకాం మాతులుఙ్గస్య దాడిమస్య రసేన వా. 180
సౌవర్చలైలామరిచైః అజాజీభృఙ్గదీప్యకైః,
స రాగః క్షౌద్రసంయుక్తః శ్రేష్ఠో రోచనదీపనః 181

వ్యా. (కాశ్మీరదేశమున ప్రసిద్ధిగాంచిన) తెల్లనిపెద్ద పచ్చద్రాక్షపండ్లను విత్తనము లూడదీసి దానితో శుంఠి పిప్పలి మిరియాలను యథోచితముగ కలిపి, మెత్తగ నూరి యందు మాదీఫలరసమును, దానిమ్మపండ్లరసమును బోసి, అందు సౌవర్చలలవణమును ఏలకులను మిరియాలను జీలకరను గుంటగలగరను ఓమమును వీని నన్నిటిని చూర్ణముచేసి కలిపి, తేనెను కూడ చేర్చిన నయ్యది శ్రేష్ఠమైన రాగమనబడును. ఇయ్యది రుచిని బుట్టించి జాఠరాగ్నిని దీపింపచేయును. (తెల్లద్రాక్ష కాశ్మీరదేశమున ప్రసిద్ధిజెందిన పెద్దద్రాక్ష యని యెరుంగునది.)

మూ. మృద్వీకాయాః విధానేన కారయేత్కారవీమపి,
శుక్తమత్స్యణ్డికోపేతం రాగం దీపనపాచనమ్. 182

వ్యా. పై జెప్పబడిన పెద్దద్రాక్షవిధానప్రకారము పిన్నద్రాక్షను కూడ రాగముగ సిద్ధముచేయునది. అందును శుక్తమును పులిసిన మద్యమును చక్కెరపాకమును గూర్చి సిద్ధముచేయనగును. ఇదియును అగ్నిని దీపింపజేసి యాహారమును జీర్ణింపజేయును.

### కొన్ని రాగకల్పనములు.

మూ. ఆమ్రామలకపేశీనాం రాగాన్ కుర్యాత్ పృథక్ పృథక్,
ధాన్యసౌవర్చలాఽజాజీ కారవీమరిచాన్వితాన్. 183
గుడేన మధుయుక్తేన వ్యక్తామ్లలవణీకృతాన్,
తైరన్నం రోచతే దిగ్ధం సమ్యగ్భుక్తం చ జీర్యతి. 184

వ్యా. మామిడిటెంకెలలోని పప్పులను, ఉసిరిక పప్పులను వేరువేరుగ గ్రహించి అందు దనియాలు, సౌవర్చలలవణము, జీలకర, ఓమము, మిరియాలు, వీనిచూర్ణమును కలిపి నూరి, బెల్లమును తేనెను కలిపి పులుపును లవణమును అధికముగ (వ్యక్తముగ తెలియునట్లు) కలిపి ద్రాక్షకు చెప్పిన విధిప్రకారము రాగముల సిద్ధముచేయునది. వీనిని కలిపి యన్నమును భుజించినచో చక్కగ జీర్ణమగును. రుచ్యముగ నుండును.

### కఫాధికమదాత్యయ శామకోపచారములు.

మూ. రూక్షోష్ణేనాఽన్నపానేన స్నానేనాఽశిశిరేణ చ,
వ్యాయామలఙ్ఘనాభ్యాం చ యుక్త్యా జాగరణేన చ. 185
కాలయుక్తేన రూక్షేణ స్నానేనోద్వర్తనేన చ,
ప్రాణవర్ణకరాణాం చ ప్రఘర్షాణాం చ సేవయా. 186
సేవయా వసనానాం చ గురూణామగురోరపి,
సజ్యోచ్చోష్ణసుఖాఙ్గీనాం అఙ్గనానాం చ సేవయా. 187
సుఖశిక్షితహస్తానాం స్త్రీణాం సంవాహనేస చ,
మదాత్యయః కఫప్రాయః శీఘ్రమేవోపశామ్యతి. 188

వ్యా. రూక్షగుణంబులును ఉష్ణవీర్యంబులు నగు నన్నపానముల సేవించుట, ఉష్ణస్పర్శమైన వేడినీళ్లు మున్నగువానిచే స్నానముచేయుట, శరీర పరిశ్రమమును చేయుట, లంకణముందుట, యుక్తియుక్తముగను కాలోచితముగను నిదుర మేల్కొంచి

యుండుట, ఆయాకాలమునకు యోగికంబును రూక్షగుణయుక్తంబులైన నలుగుపిండి మున్నగువానిచే నలుగుపెట్టికొని స్నానముచేయుట, శరీరబలకరంబును వర్ణకరంబును నగు సంఘర్షణమును (రాయిడిని) సేవించుట, దట్టములైన బట్టల ధరించుట, అగురుధూప మును సేవించుట, ఆలింగనములచే నుష్ణమును సుఖముగ కల్గించు స్త్రీల సేవించుట, చక్కగ నేర్చిన స్త్రీలచే జేయబడు సంవాహనముల జేయించికొనుట, ఈయుపచార ములచేత కఫాధికమైన మదాత్యయము శీఘ్రముగ శమించును. (సంవాహనములన హస్త పాదాద్యవయవములను చేతులతో బట్టి సుఖకరముగ మర్దించుట యని యర్థము.)

## సాన్నిపాతికమదాత్యయచికిత్సాకల్పనము.

మూ. యదిదం కర్మనిర్దిష్టం పృథక్ దోషబలం ప్రతి,
సన్నిపాతే దశవిధే తద్వికల్ప్యం భిషగ్విదా. 189
యస్తు దోషవికల్పజ్ఞః యశ్చౌషధివికల్పవిత్,
స సాధ్యాన్ సాధయేత్ వ్యాధీన్ సాధ్యాఽసాధ్యవిభాగవిత్.

వ్యా. వాత-పిత్త-కఫముల మూటియొక్క ప్రకోపమునకల్లు మదాత్యయమునందు అట్టి త్రిదోషములలో నొక్కొకదోషము ప్రబలముగ ప్రకోపించిన మదాత్యయ ముల మూడిటికిని వేరు వేరుగ చికిత్సావిధానము పైని చెప్పబడినది. తక్కిన ద్వ్యుల్బ ణాది సన్నిపాతభేదముల పదిటియందును ఏకోల్బణ సన్నిపాతములకు వేరువేరుగ జెప్ప బడిన రెండేసి చికిత్సలను మిశ్రములుగ గల్పించి వైద్యవరుడు చికిత్స చేయవలెను. (వాత-పిత్తముల రెండును బలాధికములైయున్న మదాత్యయమున వాతాధికమదాత్యయ మునకును పిత్తాధికమదాత్యయమునకు వేరువేరుగ జెప్పిన చికిత్స లన్నియు చేయవలెను. ఇత్తెరంగుననే తక్కినవానికి చికిత్సాద్వయసంసర్గకల్పనమును దోషాధిక్యానుసారముగ నెరుంగునది.)

మరియు దోష వికల్పభేదములను, ఔషధివికల్పభేదములను సాధ్యాసాధ్యభేద ములను చక్కగ నెరింగిన వైద్యవరుడు పైజెప్పినరీతిగ దోషముల తారతమ్యమున కను గుణముగ నౌషధమును కల్పించి సాధ్యావస్థనుండు రోగముల చక్కగ గమనించి చికిత్స చేయనగును.

వివరణము—మదాత్యయము లన్నియు త్రిదోషసన్నిపాతముననే కల్గునని "తస్మాత్త్రిదోషజం లిఙ్గం సర్వత్రాపి మదాత్యయే, దృశ్యతే రూపవైశేష్యాత్ పృథక్త్వం చాస్య లక్ష్యతే" (శ్లో. ౧౦౦) అనువాక్యముచే చెప్పబడినది. అట్టి సాన్నిపాతికమదా

త్యయమున నేదోషము మిక్కిలి బలిష్ఠముగ నుండునో అట్టి యేకదోషప్రాబల్యమునుబట్టి వాతిక-పైత్తిక-శ్లైష్మికమదాత్యయ భేదములు మూడువిధములుగ నిర్ణయించి వానికి ప్రత్యేకలక్షణంబులును, వేరువేరుగ చికిత్సలును పైగ్రంథముచే చెప్పబడినవి. అవి మూడును ఏకోల్బణసన్నిపాత భేదములు.

ఏకోల్బణ సన్నిపాతములు మూడుగాక ద్వ్యల్బణ-హీన-మధ్య-అధిక-సమదోష సన్నిపాత భేదముల పదిటియందును చికిత్సావిధానము "యదిదం కర్మ నిర్దిష్టం" అనుశ్లోకముచే నిర్దేశింపబడినది. ఆసన్నిపాత భేదము లెవ్వియన:—వాత మధికముగను, పిత్తశ్లేష్మములు మధ్యమములుగ నుండు సన్నిపాతమదాత్యయ మొకటి. వాతపిత్తము లధికముగను, శ్లేష్మము మధ్యమముగనుండు సన్నిపాతమదాత్యయము రెండవది. వాతము మధ్యమముగను, పిత్తకఫములు అల్పములుగ నుండు సన్నిపాత మదాత్యయము మూడవది. వాతమధికముగను, పిత్తకఫములు స్వల్పములుగ నుండు సన్నిపాతమదాత్యయము నాల్గవది. వాతపిత్తము లధికముగను, పిత్తకఫములు మధ్యమములుగ నుండుసన్నిపాతమదాత్యయము ఐదవది. వాతము స్వల్పముగను, పిత్తకఫములు మధ్యమములుగ నుండు సన్నిపాతమదాత్యయము ఆరవది. వాత-పిత్త-కఫములు మూడును స్వప్రమాణమునకన్న నధికముగ నుండు సన్నిపాతమదాత్యయము ఏడవది. వాతాది త్రిదోషములును మధ్యములుగ నుండు సన్నిపాతమదాత్యయము ఎనిమిదవది. వాతాదిత్రిదోషములును స్వల్పబలములుగ ప్రకుపితములై యుండు సన్నిపాతమదాత్యయము తొమ్మిదవది. వాతము స్వల్పముగను, పిత్తము మధ్యమముగను కఫము అధికముగ నుండు సన్నిపాతమదాత్యయము పదియవది.

ఈవివరమే సర్వాంగసుందరవ్యాఖ్యానమున శ్లోకరూపముగ నిట్లు చెప్పబడినది:—
"ఉత్కృష్టేణ యదా త్వేకః మధ్యేన ద్వౌ, తదాదిమః; ఉత్కృష్టేణ యదా ద్వౌ తు, మధ్యేనైకో ద్వితీయకః; ఏకో మధ్యేన దోషస్స్యాత్, ద్వావల్పేన తృతీయకః; ఉత్కృష్టేనైక ఏవ స్యాత్, అల్పేన ద్వౌ చతుర్థకః; ఉత్కృష్టేణ యదా ద్వౌతు, అల్పేనైకశ్చ పఞ్చమః; ఏకోఽల్పేన తు మధ్యేన ద్వౌ దోషావితి షష్ఠకః; ఉత్కృష్టైణస్సమస్తాస్స్యుః ఏవం భవతి సప్తమః; మధ్యేన సర్వేఽపి యదా తదా భవతి చాష్టమః; అల్పేన సర్వేఽపి యదా తదా తు నవమస్స్మృతః, అల్పేనైకో మధ్యేనైకస్తదాత్వన్య ఇతి స్ఫుటాః, సన్నిపాతస్య మునినా దశభేదాః ప్రకీర్తితాః."

ఈ పదిసన్నిపాతభేదములతో నేకోల్బణసన్నిపాతభేదములు మూడును చేరిన పదుమూడు సన్నిపాతము లగునని యెరుంగునది. ఏకోల్బణసన్నిపాతములకు వేరువేరుగ

జెప్పబడిన చికిత్సలను తక్కినసన్నిపాతముల పదిటియందును పైజెప్పబడిన దోషముల బలతారతమ్యమునుబట్టి తత్తదనుగుణముగ కల్పించి చికిత్సచేయనగునని ముఖ్యభావము.

మదాత్యయమున మనస్సు హర్షమును కల్గించునుపకరణములు.

మూ. వనాని రమణీయాని సపద్మాస్సలిలాశయాః,
విశదాన్యన్నపానాని సహాయాశ్చ ప్రహర్షణాః. 191
మాల్యాని గన్ధయోగాశ్చ వాసాంసి విమలాని చ,
గాన్ధర్వశబ్దాః కాన్తాశ్చ గోష్ఠ్యశ్చ హృదయప్రియాః. 192
సంకథాహాస్యగీతానాం విశదాశ్చైవ యోజనాః,
ప్రియాశ్చానుగతా నార్యో నాశయన్తి మదాత్యయమ్. 193

వ్యా. మనస్సుకు మిక్కిలి రమ్యములగు నుద్యానవనములు, తామరకమలములతో గూడిన సరోవరములు, పరిశుభ్రములగు నన్నపానములు మిక్కిలి మనస్సుకుల్లాసమును కల్గించు స్నేహితులు, పుష్పమాలికలు, పరిమళద్రవ్యములు, నిర్మలములైన వస్త్రములు, మనస్సుకు మిగుల రమ్యములైన సంగీతమును వినుట, మనస్సుకు మిక్కిలి ప్రీతిని బుట్టించువారితో గూడియుండుట, హాస్యమునకును సంగీతమునకును సంబంధించిన కథల మాట్లాడుట, మనస్సుకు నిర్మలతను కల్గించువిషయముల పర్యాలోచనము చేయుట, తనకు ప్రీతిపాత్రములైన ప్రియురాండ్రగలిసి యుండుట, ఇవి యన్నియు మదాత్యయమును నిశ్శేషముగ నివర్తింపజేయును.

మదాత్యయమున మనోహర్షణావశ్యకత.

మూ. నాఽక్షోభ్య హి మనో మద్యం శరీరమవిహత్య చ,
కుర్యాన్మదాత్యయం తస్మాత్ ఏష్టవ్యా హర్షణీ క్రియా. 194

వ్యా. మద్యము తొలుత మనస్సున సంక్షోభమును కల్గించి వికారమునొందించి పిమ్మట శరీరమును బాధించి మదాత్యయమును కల్గించును; కావున ఏవిధముననైన మనస్సుకు హర్షమును ఉల్లాసమును కల్గించుటకై ప్రయత్నము చేయవలెను. (పైజెప్పబడిన యుద్యానాదిపరికరములను తత్తదుచితముగ నుపయోగించుచు మనస్సుకు హర్షమును కల్గించుట మదాత్యయమునకు ముఖ్యమైన చికిత్సయని భావము.)

మదాత్యయమున క్షీరోపయోగవిధి

మూ. ఆభిః క్రియాభిస్సిద్ధాభిః శమం యాతి మదాత్యయః,
న చేత్, మద్యవిధిం ముక్త్వా క్షీరమస్య ప్రయోజయేత్. 195

వ్యా. పైజెప్పబడిన సిద్ధక్రియలచే మదాత్యయము శమించకుండునెడ మద్య ప్రయోగరూపమైన చికిత్సను మాని క్షీరమును ప్రయోగించునది.

మదాత్యయమున క్షీరోపయోగముచే గల్గు ప్రయోజనము.

మూ. లఙ్ఘనైః పాచనైః దోషశోధనైః శమనైరపి,
విమద్యస్య కఫే క్షీణే జాతే దౌర్బల్యలాఘవే. 196
తస్య మద్యవిదగ్ధస్య వాతపిత్తాధికస్య చ,
గ్రీష్మోపతప్తస్య తరోః యథా వర్షం తథా పయః. 197
పయసాఽభిహ్నతే రోగే బలే జాతే నివర్తయేత్,
క్షీరప్రయోగం మద్యం చ క్రమేణాఽల్పాల్పమాచరేత్. 198

వ్యా. పైని చికిత్సావిధానమున జెప్పబడిన లంకణములచేతను; పాచనౌషధ ప్రయోగములచేతను, వమనవిరేచనరూపదోషశోధనములచేతను, శమనౌషధాదులచేతను మద్యదోషము కొంతమట్టుకు శమించి కఫము క్షీణించి శరీరమున బలహీనము కల్గి తేలిక యైయుండునపుడు, మద్యపానముచే బాధితుడై వాతపిత్తము లధికముగ నున్నవానికి పాల నుపయోగించుట చాల మంచిది. అట్టి పరిస్థితియందు పాలను త్రాగించినచో గ్రీష్మకాలమునం దెండతాపముచే చాల హీనస్థితినుండు వృక్షమునకు వర్షమును బోలె మదాత్యయరోగికి ప్రాణసంరక్షణమును కల్గించి బలమును పుష్టిని కల్గించును.

పాల నుపయోగించుటచేత మదాత్యయరోగము నిశ్శేషముగ నివర్తించి శరీరమునకును మనస్సునకును బలము కల్గినపిదప క్షీరపానమును మాని, మద్యమును మాత్రము క్రమక్రమముగ నానాట కొంచెము కొంచెముగ త్రాగుచుండవలెను. (నానాట తగ్గించవలెనని యర్థము.)

ఇచ్చట నీవిషయము నెఱుంగునది:—"స్వాదు శీతం మృదు స్నిగ్ధం బహలం శ్లక్ష్ణపిచ్ఛిలమ్, గురు మన్దం ప్రసన్నం చ గవ్యం దశగుణం పయః. తదేవం గుణమేవౌజః సమానాదభివర్ధయేత్" అను వాక్యము చేత ఆవుపాలగుణాదులు చెప్పబడినవి. దీనివలన ఆవుపాలు మాధుర్యశీతాదిదశగుణముల గల్గినదనియు, నయ్యది యోజస్సుకు సమానగుణమగుటం జేసి యోజస్సును వృద్ధినందించుననియు స్ఫుటముగ తెలిసెడి. మద్యపానమునం జేసి యోజస్సు చాలక్షీణించి యుండునపుడు మద్యమునకు విరుద్ధగుణంబును, ఓజస్సుకు సమానగుణంబును నగు గవ్యము నుపయోగించినయెడ "వృద్ధిస్సమానైస్సర్వేషాం విపరీతైర్విపర్యయః" అను న్యాయప్రకారము మద్యమునకు విరుద్ధగుణమగుపాలు మద్యమునకల్గిన రోగమును శమింపజేసి, సమానగుణమైన యోజస్సును వృద్ధినొందించును. కావున మదా

త్యయమునం దావుపాల నుపయోగించుట చాల ప్రశస్తము. ఈవిషయమునే వాగ్భటాచార్యులును—"మద్యక్షీణస్య హి క్షీణం క్షీరమాశ్వేవ పుష్యతి, ఓజస్తుల్యం గుణైస్సర్వైః విపరీతం తు మద్యతః" (అ. హృ.చి. అ.౭. శ్లో. ౪౯)అనువాక్యముచే. క్లుప్తముగ చెప్పిరి.

మదాత్యయము నివర్తించినవెంటనే అధికమద్యపాననిషేధము.

మూ. విచ్ఛిన్నమద్యస్సహసా యోఽతిమాత్రం నిషేవతే,
ధ్వంసకో వి(ట్)క్షయశ్చైవ రోగస్తస్యోపజాయతే. 199
వ్యాధ్యుపక్షీణదేహస్య దుశ్చికిత్స్యతమౌ హి తౌ,
తయోర్లిఙ్గం చికిత్సా చ యథావదుపదేక్ష్యతే. 200

వ్యా. మదాత్యయమున మద్యపానమును వదలి యుండినవాడు మరల వెంటనే మద్యమును అధికముగ త్రాగినయెడ దానంజేసి ధ్వంసకము, విట్‌క్షయము అనువ్యాధులు సంభవించును. ఆవ్యాధులు రెండును మదాత్యయరోగముచే శరీరము క్షీణించినవానికి కల్గినయెడ మిక్కిలి క్రూరము చికిత్సాసాధ్యము కానేరదు. (కావున మదాత్యయము నివర్తించినపిదప కొంచెము కొంచెముగ నానాట మద్యమును త్రాగవలెనని భావము.) ధ్వంసక-విట్‌క్షయలక్షణంబులును చికిత్సయు నీక్రింద నుపదేశింపబడును.

ధ్వంసకలక్షణము.

మూ. శ్లేష్మప్రసేకః కణ్ఠాస్యశోషః శబ్దాఽసహిష్ణుతా,
తన్ద్రానిద్రాఽతియోగశ్చ జ్ఞేయం ధ్వంసకలక్షణమ్. 201

వ్యా. ధ్వంసకరోగమున నోట కఫము కారును, కుత్తుకయు నోరును ద్రవము లేక యెండును. ఏవిధమైనశబ్దమును విన సహింపకుండును. కునికిపాటును నిద్రయు నధికముగ కల్గును.

విట్‌క్షయలక్షణము.

మూ. హృత్కణ్ఠరోగః సమ్మోహః ఛర్దిరఙ్గరుజాజ్వరః,
తృష్ణా కాసః శిరశ్శూలం ఏతత్ విట్‌క్షయలక్షణమ్. 202

వ్యా. విట్‌క్షయమను రోగమున హృద్రోగంబును,కంఠరోగంబును, మూర్ఛయు, వాంతియు, ఒడలినొప్పులును, జ్వరంబును, దప్పియు, కాసంబును, తలనొప్పియు కల్గును.

### ధ్వంసక-విట్క్షయ చికిత్స.

మూ. తయోః కర్మ తదేవేష్టం వాతికే యన్మదాత్యయే,
తౌ హి ప్రక్షీణదేహస్య జాయతే దుర్బలస్య వై.　　203
వస్తయః సర్పిషః పానం ప్రయోగః క్షీరసర్పిషోః,
అభ్యఙ్గోద్వర్తనస్నానాన్యన్నపానం చ వాతనుత్.　　204
ధ్వంసకో విట్క్షయశ్చైవ కర్మణానేన శామ్యతి,

వ్యా. పైజెప్పిన రోగములు రెండును వ్యాధ్యాదులచే శరీరము కృశించి బలము నశించినవారికే సంభవించును కాన నారెంటికిని వాతిక మదాత్యయమునకు చెప్పిన చికిత్సనే చేయుట మంచిది. మరియు వాతహరములగు వస్తులను, పాలు త్రాగుటయు, క్షీరమును, ఘృతము నుపయోగించుటయు, అభ్యంగమును, ఉద్వర్తనస్నానంబులును, వాతహరము లగు నన్నపానంబులును, యుక్తముగ నుండును. ఈచికిత్సావిధానముచేత ధ్వంసకవిట్క్షయరోగములు రెండును శాంతినొందును.

### యుక్తమద్యసేవనముచే మదాత్యయము కల్గదనుట.

మూ. యుక్తమద్యస్య మదోత్థో న వ్యాధిరుపజాయతే.　　205

వ్యా. మద్యపానమునకు చెప్పినవిధినియమముల నాశ్రయించి దేశకాలసాత్మ్యాద్యనుగుణముగ యుక్తపరిమాణముతో మద్యమును సేవించినయెడ దానివలన సంభవించు మదాత్యయరోగము కలుగనేరదు.

### మద్యపాననివృత్తిచే గల్గు నుత్తమగుణము.

మూ. నివృత్తస్సర్వమద్యేభ్యో నరో యశ్చ జితేన్ద్రియః,
శారీరమానసైర్ధీమాన్ వికారైర్న స యుజ్యతే.　　206

వ్యా. నానావిధములయిన మద్యముల నన్నిటిని మానవుడు ఇంద్రియముల తన వశముగ నుంచుకొని త్రాగుటను బొత్తుగ మాని యున్నయెడ అట్టి మనుజుడు మద్యపానముచే సంభవించు శారీరమానసిక వ్యాధులచే నొకప్పుడును బాధింపబడడు. (ఇచ్చట "శారీరమానసైః" యనుపదముచేత ప్రకరణమునుపట్టి మద్యపానముచే సంభవించు శారీరమానసవ్యాధులు మాత్రము సంభవింపనేరవని యర్థము. ఇట్లు చెప్పుటచేత కారణాంతరముచే సంభవించు శారీరమానసవికారములకు మద్యపానము వదలుట నివర్తకము కానేరదని భావము.)

## అధ్యాయవిషయసంగ్రహము.

మూ. తత్ర శ్లోకాః—

యత్ప్రభావా భగవతీ సురా, పేయా యథా చ సా,
యద్ద్రవ్యా, యస్య యా చేష్టా, యోగం చాపేక్షతే యథా.
యథా మదయతే, యైశ్చ గుణైర్యుక్తా మహాగుణా,
యో మదో, మదభేదాశ్చ యే, త్రయస్స్వస్వలక్షణాః. 208
యే చ మద్యకృతా దోషా, గుణా యే చ మదాత్మకాః,
యచ్చ త్రివిధమాపానం, యథాసత్వఞ్చ లక్షణమ్. 209
యే సహాయాస్సుఖాః పానే, (యేచ) చిరక్షిప్రమదా నరాః,
మదాత్యయస్య యో హేతు, ర్లక్షణం, యత్ యథా చ యత్.
మద్యం మదోత్థితాన్రోగాన్ హన్తి యశ్చ క్రియాక్రమః,
సర్వం తదుక్తమఖిలం మదాత్యయచికిత్సితే. 211

వ్యా. మద్యముయొక్క ప్రభావము, మద్యమును త్రాగవలసినవిధము, మదోత్పత్తికి కారణమైన ద్రవ్యనిర్ణయము, వాతాదిప్రకృతి ననుసరించి హితములగు నాయా మద్యవిభాగము. ఎట్టియోగమున మద్యము నపేక్షించునదియు, మద్యము మదమును కల్గించువిధము, మద్యమునందలిగుణములు, మదలక్షణము, మదభేదములు, ఉత్తమ-మధ్యమ-అధమభేదములచే మూడువిధములయిన మదములయొక్క వేరువేరు లక్షణములు, మద్యపానమున కల్గుదోషములు, మద్యముయొక్క గుణములు, సత్వ-రజ-స్తమోగుణములకు సంబంధించి మూడువిధములయిన పానభేదములు, వాని ప్రత్యేకలక్షణములు మద్యపానమునకు యోగ్యులైన సహాయులు, చిరకాలమునకును శీఘ్రముగను మదమునొందు వారి నిర్ణయము, మదాత్యయము కల్గు కారణములు, మదాత్యయలక్షణములు, మద్యపానమున గల్గించు రోగములను మద్యము శమింపజేయువిధము, మదాత్యయములకు వేరువేరు చికిత్సాక్రమము ఈవిషయము లన్నియు మదాత్యయచికిత్సితమను నీయధ్యాయమున అగ్నివేశునిచే వివరించి చెప్పబడినది.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే,
దృఢబలసంపూరితే చికిత్సాస్థానే మదాత్యయచికిత్సితం నామ
చతుర్వింశోఽధ్యాయః.

ఇత్తెరంగున నగ్నివేశకృతంబును చరకప్రతిసంస్కృతంబును నగుచరకసంహిత యను నాయుర్వేదతంత్రమునందలి దృఢబలసంపూరితచికిత్సాస్థానమున మదాత్యయ చికిత్సిత మనునది యిరువదినాల్గవయధ్యాయము.

## పంచవింశాధ్యాయము.

(ఈయధ్యాయంబును చరకప్రతిసంస్కృతము)

అవతరణిక:—మద్యపానముచే మత్తుగొనిన సమయమున పదాతిరేకమునం జేసి యొడలెరుంగక పడుటవలన నొకవేళ గాయములు తగిలి వ్రణము సంభవించును. కావున నట్టి వ్రణచికిత్సితమును దెలుపుటకై మదాత్యయచికిత్సానంతరము ద్వివ్రణీయాధ్యాయము చెప్పబడును:—

మూ॥ అథాతో ద్వివ్రణీయచికిత్సితం వ్యాఖ్యాస్యామః. 1
ఇతి హ స్మాహ భగవానాత్రేయః. 2

వ్యా. మదాత్యయచికిత్సితమును చెప్పినపిదప ద్వివ్రణీయ (రెండువిధములయిన వ్రణములకు సంబంధించిన) చికిత్సితమును భగవానుడగు నాత్రేయు డుపదేశించినదానికి న్యూనాతిరేకము లేకుండునట్లు వివరించి చెప్పెదనని యర్థము.

—ద్వివ్రణీయము నుద్దేశించి యగ్నివేశునిప్రశ్నము—

మూ. పరావరజ్ఞమాత్రేయం గతమానమదవ్యథం,
అగ్నివేశో గురుం కాలే వినయాదిదమబ్రవీత్. 3
భగవన్పూర్వముద్దిష్టౌ ద్వౌ వ్రణౌ రోగసంగ్రహే,
తయోర్లింగం చికిత్సాం చ వక్తుమర్హసి శర్మద. 4

వ్యా. పరమశ్రేయోరూపమయిన మోక్షమును, లౌకికద్రవ్యసముదాయమును, చక్కగ నెరింగినవాడును, అభిమానమును, అహంకారమును, ఆధ్యాత్మికాదిబాధను వదలినవాడును, తనకు గురువర్యుడునగు నాత్రేయఋషి నుద్దేశించి అగ్నివేశుడు మిక్కిలి వినయముతో కూడి యుక్తమయిన కాలమున "లోకమునకెల్ల సుఖమును కలిగించు భగవత్స్వరూపుడయిన నోగురువర్యా! ఇంతకుముందు అష్టోదరీయాధ్యాయమున రోగములయొక్క భేదముల తెల్పుతరి "ద్వౌ వ్రణావితి, నిజశ్చ, ఆగన్తుజశ్చ" అని వ్రణములు నిజాగంతుభేదములచే రెండువిధముల నుండునని నిర్దేశింపబడినది. ఆ రెంటికి సంబంధించిన హేతులక్షణములను చికిత్సను చెప్ప వేడెద" నని యడిగెను.

—ఆత్రేయప్రతివచనము.—

మూ. ఇత్యగ్నివేశస్య వచో నిశమ్య గురురబ్రవీత్,
యౌ వ్రణౌ పూర్వముద్దిష్టౌ నిజశ్చాగన్తురేవ చ. 5
శ్రూయతాం విధివత్సౌమ్య తయోర్లింగం చ (స)భేషజం,

వ్యా. పైజెప్పినరీతిగ నడిగిన యగ్నివేశునివాక్యమును విని గురువగు నాత్రేయుఁడు ఇట్లు చెప్ప దొడంగెను:—ఇంతకుమున్ను నిజాగంతుభేదములచే రెండుతెరంగులుగ నిర్దేశింపబడిన వ్రణభేదములకు లక్షణములును చికిత్సయు వివరించి చెప్పెద వినుము.

## వ్రణద్వైవిధ్యము.

మూ. నిజశ్శరీరదోషోత్థః ఆగన్తుర్బాహ్యహేతుజః. 6

వ్యా. నిజమనియు, ఆగంతుకమనియు వ్రణములు రెండువిధములు. అందు శరీరమునందలి వాతాదిదోషములయొక్క ప్రకోపమువలన కల్గినది నిజవ్రణము. బహిర్భూతములగు కారణములచే జనించినది ఆగంతుకవ్రణము.

## ఆగంతువ్రణనిదానలిఙ్గములు.

మూ. వధబన్ధప్రపతనాత్ దంష్ట్రాదన్తనఖక్షతాత్,
ఆగన్తవో వ్రణాః, తద్వద్విషస్పర్శాగ్నిశస్త్రజాః. 7
మన్త్రాగదప్రలేపాద్యైర్భేషజైర్హేతుభిశ్చ తే,
లిఙ్గైకదేశైర్నిర్దిష్టా విపరీతా నిజైర్వ్రణాః. 8

వ్యా. చంపునుద్దేశముతో శత్రువులు మున్నగువారు నరుకుట, బంధించుట, ఉన్నతమైన స్థలమునుండి క్రిందబడుట క్రూరజంతువులయొక్క కోరలచేతను, దంతములచేతను, గోళ్లచేతను గాయములు తగులుట; విషముయొక్కయు, నిప్పుయొక్కయు స్పర్శము కల్గుట, ఆయుధములచే దెబ్బలు తగులుట ఇవి మున్నగు బాహ్యకారణములచే ఆగంతుకములు జనించును.

మరియు మంత్రప్రయోగములు, విషౌషధములు, ప్రలేపములు మున్నగునోషధులచేతను ఆగంతురూపమయిన కారణములచేతను; కొన్ని లక్షణములచేతను, ఆగంతుకవ్రణములు నిజవ్రణములకంటె భిన్నములుగ నిర్దేశింపబడినవి.

నిజాగంతుకవ్రణములు రెండును నేకరూపముగ నున్నను, ఆగంతుకవ్రణములకు బాహ్యరూపములగు వధబంధనాదిహేతువులును, ఔషధములును, చికిత్సయు, నిజమునకన్న భిన్నములుగ నుండును. మరియు ఆగంతుకవ్రణమునందు పతనాదికారణములు సంభవించినతోడనే బాధ కల్గి, పిమ్మట వాతాదిదోషలక్షణములు కనబడును. నిజవ్రణములయందు తొలుత వాతాదులు వానివాని కారణములచే ప్రకోపమునొంది పిమ్మట నాయాదోషమునకు సంబంధించిన పోటు, మంట, మున్నగుబాధల కల్గించును

కావున లక్షణములయందు నీరెంటికి కొంచెము మార్పు కల్గియుండునని "లిఙ్గైకదేశైః" అనుపదముచే సూచింపబడినది.

## ఆగంతువ్రణచికిత్సాసంగ్రహము.

మూ. వ్రణానాం నిజహేతూనాం ఆగన్తూనామశామ్యతాం,
కుర్యాద్దోషబలాపేక్షీ నిజానామౌషధం యథా. 9

వ్యా. ఆగంతువ్రణములు వానికి నిర్ణయింపబడిన మంత్రప్రయోగాది చికిత్సలచే శమించకుండునెడ అయ్యవి వాతాదిదోషసంబంధము కల్గినవని తెలిసి, నిజవ్రణముల నుద్దేశించి యీక్రింద జెప్పబడు చికిత్సలచే ఆగంతువ్రణములకును ఆయాదోషముల బలాబలముల ననుసరించి చికిత్స చేయవలెను.

## నిజవ్రణసంప్రాప్తి.

మూ. యథా స్వైః హేతుభిర్దుష్టాః వాతపిత్తకఫా నృణాం,
బహిర్మార్గం సమాశ్రిత్య జనయన్తి నిజాన్ వ్రణాన్. 10

వ్యా. వాత-పిత్త-కఫములు ఆయాదోషమునకు జెప్పబడిన కారణములచే ప్రకోపమునొంది శరీరమునందలి బాహ్యామార్గములైన చర్మమాంసాదుల నాశ్రయించి నిజవ్రణములను కల్గించును.

ఇచ్చట "యథా స్వైర్హేతుభిర్దుష్టాః" అనుటవలన వాతాదిప్రకోపములకు వేరువేరుగ జెప్పిన కారణములే ఆయావ్రణోత్పత్తికిని కారణములగును కాని ప్రత్యేక కారణములు లేవని తెలిసెడి. మరియు వాతాదులు వానివానికి నియతములగు కారణములచే ప్రకోపము నొందుటంజేసి స్వతంత్రములని తెలుపబడినది.

## వాతికవ్రణలక్షణము.

మూ. స్తబ్ధః కఠినసంస్పర్శః మన్దస్రావోఽతితీవ్రరుక్,
తుద్యతే స్ఫురతి శ్యావో వ్రణో మారుతసమ్భవః. 11

వ్యా. వాతముచే గల్గిన వ్రణము స్తంభించి చేత తాకినచో కఠినముగ నుండును. పూయాదులను కొంచెముగ స్రవించును. పోటు నొప్పి మున్నగుబాధలు మిక్కిలి తీవ్రముగ గల్గియుండును. సూదులతో గ్రుచ్చినవిధముగ పోటు గల్గి యదరుచుండును. శ్యామవర్ణము కల్గియుండును. (ఈలక్షణములబట్టి వాతికవ్రణమని యెరుంగునది.)

## వాతికవ్రణచికిత్సాసంగ్రహము.

మూ. సమ్పూరణైః స్నేహపానైః స్నిగ్ధైస్స్వేదోపనాహనైః,
ప్రదేహైః పరిషేకైశ్చ వాతవ్రణముపాచరేత్. 12

వ్యా. సంపూరణములు (సంతర్పణము), స్నేహపానము, స్నిగ్ధములైన స్నేహ విధులు, స్నిగ్ధములగు నుపనాహములు (కట్టు కట్టుట), స్నిగ్ధద్రవ్యములచే పట్టువేయుట, స్నిగ్ధములగు పరిషేకములు, అనునీచికిత్సలచే వాతికవ్రణము నుపచరించవలెను.

## పైత్తికవ్రణలక్షణము.

మూ. తృష్ణామోహజ్వరస్వే(క్లే)దదాహదుష్ట్యవదారణైః,
వ్రణం పిత్తకృతం విద్యాత్ గన్ధైస్స్రావైశ్చ పూతికైః. 13

వ్యా. పిత్తముచే కల్గినవ్రణమునందు దప్పియు మైకంబును జ్వరంబును కల్గును. ఒడలిపై చెమట పుట్టును. వ్రణమున మంట పుట్టి చెడి పగులదీయువిధముగ బాధ కల్గును. దుర్గంధమైన పూయాదుల స్రవము కల్గియుండును. ఈలక్షణములబట్టి పిత్తమున కల్గిన వ్రణమని యెరుంగునది.

## పైత్తికవ్రణచికిత్సాసంగ్రహము.

మూ. శీతలైర్మధురైస్తిక్తైః ప్రదేహపరిషేచనైః,
సర్పిష్పానైర్విరేకైశ్చ పైత్తికం శమయేత్ వ్రణమ్. 14

వ్యా. పిత్తముచే కల్గిన వ్రణమునందు చల్లనైనవియు, మధురతిక్తరసంబులు నైన ద్రవ్యములచే పట్టువేయుట, తడుపుట, ఘృతపానము, విరేచనము, అనునీచికిత్స లచే వ్రణమును శమింపజేయవలయును.

## కఫజవ్రణలక్షణము.

మూ. బహుపిచ్ఛో గురుః స్నిగ్ధః స్తిమితో మన్దవేదనః,
పాణ్డువర్ణోఽల్పసంక్లేదః చిరకారీ కఫవ్రణః. 15

వ్యా. కఫముచే కల్గిన వ్రణము అధికమైన చీముకల్గి పెద్దదిగను, స్నిగ్ధముగను, మొద్దుబారియు నుండును. బాధ కొద్దిగ కల్గి పాణ్డువర్ణమై స్వల్పముగ ద్రవము కల్గి యుండును. చాలకాలమునకు అనువర్తించి బాధించును. ఈలక్షణములు కలది కఫజవ్రణ మని యెరుంగునది.

### కఫజవ్రణచికిత్సాసంగ్రహము.

మూ. కషాయకటురూక్షోష్ణైః ప్రదేహపరిషేచనైః,
కఫవ్రణం ప్రశమయేత్ తథా లఙ్ఘనపాచనైః(శోధనైః)  16

వ్యా. కషాయకటురసంబులును, రూక్షోష్ణంబులునైన యౌషధములచే ప్రలేపనమును, పరిషేచనమును చేసి కఫజవ్రణమును శమింపజేయవలయును. మరియు లంఘనమును పాచనమును చేయనగును. (ఇచ్చట సుఖబోధమునకై వాతాదివ్రణచికిత్సలు వేరువేరుగ సూత్రరూపమున చెలుపబడినదని యెరుంగునది.)

### వ్రణభేద-పరీక్షాదిసంగ్రహము.

మూ. ద్వౌ నానాత్వభేదేన నిరుక్తా వింశతిర్వ్రణాః,
తేషాం పరీక్షా త్రివిధా ప్రదుష్టా ద్వాదశ స్మృతాః.  17
స్థానాన్యష్టౌ తథా గన్ధాః పరిస్రావాశ్చతుర్దశ,
షోడశోపద్రవా దోషాశ్చత్వారో వింశతిస్తథా.  18
తథా చోపక్రమాస్సిద్ధాః షట్త్రింశత్సముదాహృతాః,
విభజ్య(విభావ్య)మానాన్శృణు మే సర్వానేతాన్యథేరితాన్.  19

వ్యా. పైజెప్పబడిన నిజాగంతుభేదములచే రెండు తెరంగులైన వ్రణములును, పలుతెరంగులైన యవాంతరభేదములచే నిరువదితెరంగుల నుండును. మరియు, నావ్రణములకు సంబంధించిన పరీక్షించువిధములు మూడుతెరంగులును, పండ్రెండు దుష్టలక్షణములును, వ్రణములు జనించుస్థానము లెనిమిదియు, ఎనిమిదివిధము లయిన గంధములును, పదునాల్గువిధములయిన స్రావభేదములును, పదునారు విధములయిన యుపద్రవములును, ఇరువదినాల్గుదోషములును, ముప్పదియారుతెరంగులైన చికిత్సాభేదములును, కల్గియుండును. ఇవి యన్నియు వేరువేరుగ విభజించి యీక్రింద చెప్పబడును.

### ఇరువదివ్రణభేదములవివరణము

మూ. కృత్యోఽకృత్యస్తథా దుష్టోఽదుష్టో మర్మస్థితోన చ,
సంవృతో దారుణ స్స్రావీ సవిషో విషమస్థితః  20
ఉత్సఙ్గ్యుత్సన్న ఏవాఖ్యా వ్రణాన్విద్యాద్విపర్యయాత్,
ఇతి నానాత్వభేదేన నిరుక్తా వింశతిర్వ్రణాః.  21

వ్యా. కృత్యము (ఛేదనాదిచికిత్సలచే సాధింపదగినది), ఉత్కృత్యము. (ఛేదనాది చికిత్సల జేయకయే మాన్పదగినది), దుష్టము, అదుష్టము (దుష్టము కానిది), మర్మస్థితము (మర్మస్థానముల జనించినది), మర్మేతరస్థానమున పుట్టినది, సంవృతము, (ద్వారమును మూసికొనియుండునది), వివృతము (ద్వారమును తెరచికొని యుండునది,) దారుణము (క్రూరమయినది), దారుణము కానిది, స్రావి (పూయాదులస్రవించునది), స్రావము లేనిది, సవిషము, నిర్విషము, విషమస్థితము (విషమముగనుండునది), సమస్థితము, ఉత్సంగి (పైకి యుబికి యుండునది), క్రిందికి అణగి యుండునది, ఉత్సన్నము, (మాంసము పెరిగి యుండునది.), మాంసము పెరగక యుండునది, అనునీయాకారాదిభేదములచే వ్రణములు నిరువదిభేదముల కల్గియుండును. (ఇచ్చట మొదట కృత్య, అకృత్య, దుష్ట, అదుష్ట, మర్మస్థిత, మర్మేతరస్థితభేదములారు సవిపర్యయముల జేర్చి నిర్దేశింపబడినవి. పిదప సంవృతాదిభేదము లేడును వానివానివిపర్యయములతో కూడి పదునాల్గుభేదములగును. ఇవి యన్నియుం కలసి గుణభేదము లిరువది యని యెరుంగునది. ఈవిషయమునే తంత్రకారులు "వ్రణాన్విద్యాద్విపర్యయాత్......వింశతి ర్వ్రణాః" అని చెప్పిరి.)

### త్రివిధపరీక్షావిభాగము.

మూ. దర్శనప్రశ్నసంస్పర్శైః పరీక్షా త్రివిధా స్మృతా,
వయోవర్ణశరీరాణామిన్ద్రియాణాఞ్చ దర్శనాత్. 22
హేత్వర్తిసాత్మ్యాగ్నిబలం పరీక్ష్యం వచనాద్బుధైః,
స్పర్శాన్మార్దవశైత్యే చ పరీక్ష్యే సవిపర్యయే. 23

వ్యా. దర్శనము (ప్రత్యక్షముగ చూచుట), ప్రశ్నము (రోగియొక్క గుణాదుల నడుగుట), సంస్పర్శనము (చేత తాకుట), నని పరీక్ష మూడువిధములు. అందు రోగియొక్క వయస్సును, వర్ణమును, శరీరపరిస్థితిని, చక్షురాదీంద్రియములపరిస్థితిని, దర్శనముచే పరీక్షించవలయును. వ్యాధి జనించుటకు కారణములును, బాధావిశేషములును, రోగికి సాత్మ్యములు, (అలవాటులోనుండువిషయములును), జాఠరాగ్ని బలాబలములును, రోగిని నడిగి పరీక్షించవలయును. కాఠిన్యమును, మృదుత్వమును, చల్లదనమును, వేడిని, చేతితో స్పృశించి పరీక్షింపదగును.

ఇచ్చట చక్షురాదీంద్రియములు, చక్షుర్గోచరములు కాకున్నను, ఇంద్రియాధిష్ఠానములయిన గోళములు చక్షుర్గోచరములవును కావున వానిని దర్శనముచే పరీక్షించవలయునని యర్థము. మరియు జాఠరాగ్నిపరిస్థితి రోగియొక్క జీర్ణభేదమునుపట్టి

యనుమానముచే గమనింపవలసియుండును. అయినను రోగిని ప్రశ్నించియు తెలిసికొన దగియుండునని యిచ్చట చెప్పబడినది.

## పండ్రెండు దుష్టవ్రణములవివరణము

మూ॥ శ్వేతోఽవసన్నవర్త్మాఽతిస్థూలవర్త్మాఽతిపిఞ్జరః,
నీలశ్శ్యావోఽతిపిడకో రక్తః కృష్ణోఽతిపూతికః		24
రౌప్యః కుమ్భీముఖశ్చేతి ప్రదుష్టాః ద్వాదశ వ్రణాః,
చతుర్వింశతిరుద్దిష్టా దోషాః కల్పాన్తరేణ వై॥		25

వ్యా॥ శ్వేతము, (తెల్లనిరంగుకలది), అవసన్నవర్త్మము, (వ్రణముపై చర్మము సన్నగిలియుండునది), స్థూలవర్త్మము, చర్మము (మిక్కిలి స్థూలమై యుండునది), అతి పింజరము (మిక్కిలి పచ్చనిరంగుకలది), నీలిరంగుకలది, శ్యామవర్ణముకలది, దట్టమైన బొబ్బలు కలది, రక్తవర్ణమైనది, మిక్కిలి నలుపుకలది, అతిపూతికము, (అధికమైన చీముకలది), రోప్యము, (మాన్పదగినది), కుంభీముఖము (కుండమూతివలె పైకి యుబికినద్వారముకలది), అని యిత్తెరంగు దుష్టవ్రణములు పండ్రెండు విధములుగ నుండును. మరియు నీచెప్పబడిన పండ్రెండు దుష్టవ్రణభేదములును దుష్టికి కారకములగు స్నాయుక్లేదాదిదోషముల ఇరువదినాల్గిటి సంబంధమును జేసి యిరువదినాల్గువిధముల భేదములు కల్గియుండును.

## ఎనిమిది వ్రణస్థానముల వివరణము.

మూ॥ త్వక్సిరామాంసమేదోఽస్థిస్నాయుమర్మాంతరాశ్రయాః,
వ్రణస్థానాని నిర్దిష్టాన్యష్టావేతాని సఙ్గ్రహే.		26

వ్యా॥ చర్మము, సిరలు, (సన్ననినరములు), మాంసము, మేదస్సు, అస్థులు, స్నాయువులు, మర్మములు, అంతరాశ్రయము (కోష్ఠము) ఈయెనిమిదియును వ్రణములకు స్థానములగును.

## అష్టవిధగంధవిభాగము.

మూ॥ సర్పిస్తైలవసాపూయరక్తశ్యావామ్లపూతికాః,
వ్రణానాం వ్రణగన్ధజ్ఞైః అష్టౌ గన్ధాః ప్రకీర్తితాః.		27

వ్యా॥ నేతియొక్కవాసన, నూనెవాసన, మాంసరసముయొక్క వసాగంధము, చీముయొక్క వాసన, రక్తగంధము, శ్యావగంధము, (పెరుగుమున్నగునవి రాగిమున్నగు

వానితో చేరినపుడు కల్గు చిలుమువాసన) లేక శావగంధము (పీనుగకంపు), అమ్లగంధము (పులిసినవాసన), పూతిగంధము (కుళ్లువాసన), ఈయెనిమిదివిధములయిన గంధములును వ్రణములయొక్క అవస్థాభేదములచే కల్గును.

పదునాలుగు వ్రణస్రావములవివరణము.

మూ. లసీకాజలపూయాసృక్ హారిద్రారుణపిఙ్గరాః,
కషాయనీలహరితస్నిగ్ధరూక్షసితాఽసితాః. 28
ఇతి రూపైస్సముద్దిష్టా వ్రణస్రావాశ్చతుర్దశ,

వ్యా. లసీక, (త్వగ్గతమైననీరు), జలము, చీము, రక్తము, పచ్చనిద్రవము, అరుణవర్ణమైన ద్రవము, పింజలవర్ణముగలద్రవము, కషాయవర్ణముగలద్రవము, నీలవర్ణముగల ద్రవము, ఆకుపచ్చనిద్రవము, జిడ్డుతోకూడినద్రవము, జిడ్డు లేక రూక్షమయినద్రవము, నల్లని ద్రవము, తెల్లనిద్రవము, ఇట్లు రూపభేదములచే పదునాలుగువిధములయినద్రవములు వ్రణములనుండి స్రవించునవి.

పదునారు వ్రణోపద్రవములవివరణము.

విసర్పః పక్షఘాతశ్చ సిరాస్తమ్భోఽపతానకః. 29
మోహోన్మాదవ్రణరుజో జ్వరస్తృష్ణా హనుగ్రహః,
కాసశ్ఛర్దిరతీసారో హిక్కాశ్వాసస్సవేపథుః. 30
షోడశోపద్రవాః ప్రోక్తాః వ్రణానాం వ్రణచిన్తకైః,

వ్యా. విసర్పము, పక్షాఘాతము,శిరాస్తంభము (నరములు స్తంభించు వాతవ్యాధి) అపతానకము, మోహము (మూర్ఛ, మైకము) ఉన్మాదము, వ్రణబాధలు, జ్వరము, దప్పి, హనుగ్రహవాతము, కాసము, వాంతి, అతిసారము, ఎక్కిళ్లు, శ్వాసము, వణకు, అను నీపదునారును వ్రణమునకు సంబాధించిన యుపద్రవములని వ్రణలక్షణములు తెలిసినవారు చెప్పెదరు.

*వ్రణము దుష్టమగుటకు నిరువదినాల్గు కారణములవివరణము.

మూ. చతుర్వింశతిరుద్దిష్టా దోషాః కల్పాన్తరేణ చ,
స్నాయుక్లేదాత్, సిరాక్లేదాత్, గామ్భీర్యాత్, క్రిమిభక్షణాత్.
అస్థిభేదాత్, సశల్యత్వాత్, సవిషత్వాచ్చ, సర్పణాత్,
నఖకాష్ఠప్రభే(తో)దాచ్చ చర్మ, లోమా(తి)భిఘట్టనాత్. 32
మిథ్యాబన్ధాత్, అతిస్నేహాత్, అతిభైషజ్యకర్షణాత్,

అజీర్ణాత్, అతిభుక్తాచ్చ, విరుద్ధాఽసాత్మ్యభోజనాత్. 33
శోకాత్, క్రోధాత్, దివాస్వప్నాత్, వ్యాయామాత్,
మైథునాత్తథా, వ్రణాః న ప్రశమం యాన్తి నిష్క్రియత్వాచ్చ,
దేహినామ్. 34

వ్యా. స్నాయువులు కుళ్లుట, సిరలు కుళ్లుట, వ్రణము మిక్కిలి లోతున పోడ సూపుట, వ్రణమున క్రిములు చేరి తినుట, ఎముకలు విరుగుట, వ్రణమున ముండ్లు ఇనుపముక్కలు మొదలగు శల్యములు చేరియుండుట, వ్రణమున విషము చేరియుండుట, వ్రణము పలుతెరంగుల శరీరముపై వ్యాపించుట, వ్రణము గోళ్లు కట్టెలు మొదలగు వానిచే భేదింపబడుట, చర్మముయొక్క రాపిడి గల్గుట, రోమములు వొరిసికొనుట, విధి విరుద్ధముగ వ్రణములకు కట్టుకట్టుట, స్నేహముల నధికముగ నుపయోగించుట, చూర్ణము మొదలగు నౌషధములచే నధికముగ ఘర్షణము చేయబడుట, అజీర్ణము, అధికముగ భుజించుట, విరుద్ధాహారములు భుజించుట, సాత్మ్యములు కాని యాహారములు భుజించుట, శోకము, క్రోధము, పగలు నిదురించుట, దేహపరిశ్రమము నధికముగ చేయుట, స్త్రీసంభోగము చేయుట, వ్రణమునకు తగినచికిత్స చేయక యుపేక్షించుట, అను నీయిరువదినాలుగును వ్రణములకు సంబంధించిన దోషములు. ఈదోషముల సంబంధమువలన వ్రణములు శమింప నేరవు.

## వ్రణములకృచ్ఛ్రసాధ్యత్వకారణములు.

మూ. పరిస్రావాచ్చ గన్ధాచ్చ దోషాచ్చోపద్రవైస్సహ,
వ్రణానాం బహుదోషాణాం కృచ్ఛ్రత్వం చోపజాయతే. 35

వ్యా. పైజెప్పబడిన పరిస్రావభేదములవలనను, గంధమువలనను, దోషభేదము వలనను, విసర్పము మున్నగు నుపద్రవములవలనను, ననేకదోషములు గల వ్రణములు కష్టసాధ్యముగ నగును.

## సుఖసాధ్యవ్రణములు.

మూ. త్వఙ్మాంసజః సుఖే దేశే తరుణస్యాఽనుపద్రవః,
ధీమతోఽభినవః కాలే సుఖసాధ్యః స్మృతో వ్రణః. 36

వ్యా. చర్మమునైనను మాంసమునైనను ఆశ్రయించి జనించిన వ్రణంబును, మర్మములేని సుఖమైన స్థలమున నుపద్రవములు లేక యౌవనవంతునకు సంభవించిన

వ్రణంబును, జితాత్ముడైనవానికి నూతనముగ జనించిన వ్రణంబును, సుఖమైన కాలమున (హేమంతశిశిరఋతువులయందు) బొడమిన వ్రణంబును సుఖసాధ్యమగును.

### కృచ్ఛ్రసాధ్య-అసాధ్యవ్రణములు.

మూ. గుణైరన్యతమైర్హీనః తతః కృచ్ఛ్రో వ్రణః స్మృతః,
సర్వైర్విహీనో విజ్ఞేయ స్త్వసాధ్యో నిరుపక్రమః. 37

వ్యా. పైజెప్పబడిన సుఖసాధ్యలక్షణములలో కొన్ని లేకున్న నయ్యది కృచ్ఛ్రసాధ్యమగును. ఆగుణము లన్నియు లేనియెడల నసాధ్యమైయుండును, కావున చికిత్స జేయదగదు. (ఇచ్చట "నిరుపక్రమః" అనుటవలన ప్రత్యాఖ్యేయరూపాసాధ్యమని యర్థము.)

### వ్రణచికిత్సలలో శోధనచికిత్స, దానిప్రాధాన్యము.

మూ. వ్రణానామాదితః కార్యం యథాసన్నం విశోధనం,
ఊర్ధ్వభాగైః అధోభాగైః శస్త్రైర్వస్తిభిరేవ చ. 38
సద్యశ్శుద్ధశరీరాణాం ప్రశమం యాన్తి హి వ్రణాః,

వ్యా. వ్రణము లన్నిటియందు తొలుత శరీరమునం దూర్ధ్వభాగశోధనములైన వమనములచే నైనను, అధోభాగశోధనములగు విరేచనములచేనైనను, వ్రణశోధకములగు ఛేదనాదిశస్త్రచికిత్సలచేనైనను, వస్తిప్రయోగములచేనైనను వ్రణమునకు సన్నిహితముగ శోధనమును చేయనగును. అట్టి శరీరశోధనముచే శుద్ధమైన శరీరము కలవారికి వ్రణములు వెంటనే శాంతినొందును. (ఇచ్చట 'యథాసన్నం' అని చెప్పుటవలన శరీరమునం దూర్ధ్వభాగమున వ్రణము లున్నచో వమనరూపశోధనంబును, అధశ్శరీరమున నున్నచో విరేచనరూపశోధనంబును, చేయవలెనని తెలిసెడి.) మరియు నుద్దేశక్రమము ననుసరించి ముప్పదియారు చికిత్సాభేదముల వివరింపవలసియున్నను, అన్నిటిలో శోధనచికిత్స ప్రధానమని తెలుపుటకై తొలుత శోధనము చెప్పబడినది.

### ముప్పదియారువ్రణచికిత్సాభేదముల వివరణము.

మూ. యథాక్రమమతశ్శోర్ధ్వం శృణు సర్వానుపక్రమాన్. 39
శోఫఘ్నం, షడ్విధం చైవ శస్త్రకర్మావపీడనం,
నిర్వాపణం ససన్ధానం స్వేదశ్శమనమేషణమ్. 40
శోధనా రోపణీయా చ కషాయా, సప్రలేపనా,

ద్వే తైలే, తద్గుణే (ద్వే తైలే చ ఘృతే) పత్త్రం, ఛాదనే
ద్వే చ, బన్ధనే. 41
భోజ్య ముత్సాదనం దాహః ద్వివిధః సావసాదనః,
కాఠిన్యమార్దవకరే ధూపనాలేపనే శుభే. 42
వ్రణావచూర్ణనం వర్ణ్యం రోపణం లోమరోహణం,
ఇతి షట్త్రింశదుద్దిష్టాః వ్రణానాం సముపక్రమాః 43

వ్యా. వ్రణములకు సంబంధించిన చికిత్సలు ముప్పదియారని పైన నిర్దేశింపబడినది. ఆచికిత్సల వరుసగ నీక్రింద వివరించి, యథాక్రమముగ వానివిధానము లన్నియు చెప్పబడును:—శోఫఘ్నము (వ్రణశోఫముల హరించుచికిత్స) (1), పాటనాది భేదములచే నారువిధములైన శస్త్రకర్మములు [పాటనము (2), వ్యధనము (3), ఛేదనము (4), లేఖనము(5), ప్రచ్ఛనము (6), సీవనము (7)] అవపీడనము (వ్రణములయందలి చీమును వెడలించుటకై కల్కలేపనాదిరూపము) (8), నిర్వాపణము (వ్రణములయందలి మంటయు వేడియు శమించుటకైన యుపాయము) (9), సంధానము (శిథిలములైన మాంసమును సంధిబంధాదుల నొకటిగ జేర్చునుపాయము) (10); స్వేదము (చెమటబుట్టించుట) (11), శమనము (బాధను శమింపజేయుచికిత్స) (12), ఏషణము (శలాకాదులచే వ్రణమునందలిదోషమును గమనించుట) (13), శోధనకషాయము (14), శోధనలేపము (15), రోపణకషాయము (16), రోపణలేపము (17), శోధనతైల-ఘృతములు (18), రోపణతైల-ఘృతములు(19),పత్త్రము (వ్రణప్రచ్ఛాదనమునకైనఆకులు) (20), ఛాదనము (ఆకులచే వ్రణమునుగప్పుట, ఇదిబాహ్యాచ్ఛాదనము)(21),అంతరాచ్ఛాదనము (22), సవ్యబంధనము (23), దక్షిణబంధనము (24), భోజ్యము (25), ఉత్సాదనము (వ్రణమున మాంసము హరించుటచే పల్లము పడియున్నయెడ మరల మాంసము నుబికించి సమస్థితికి దెచ్చుచికిత్స) (26), అవసాదనము (వ్రణములో దుర్మాంసము ఎదిగియున్నయెడ దానిని కరగించి సమస్థితికి దెచ్చుచికిత్స) (27), స్నేహదాహకర్మ (28), రూక్షదాహకర్మ (29), కాఠిన్యకరధూపనము (30), మార్దవకరధూపనము (31), కాఠిన్యకరాలేపనము, (32), మార్దవకరాలేపనము (33), త్వగ్జననావచూర్ణనము (34), రోపణ (సవర్ణకర) అవచూర్ణనము (35), లోమరోహణావచూర్ణనము (36), అనునవి ముప్పదియారును వ్రణములకు చికిత్సాభేదములు.

ఇచ్చట 'ద్వే తైలే తద్గుణే' అనుచోట స్నేహసామాన్యవాచకమైన తైలశబ్దముచేత తైలఘృతములు రెండును గ్రహింపబడును. ఇవిరెండును ప్రత్యేకము శోధనరోపణ

భేదములచే రెండేసి భేదములవంతున నాల్గువిధములుగ నైనను, శోధనరోపణ క్రియా భేదముల మాత్రమును వివక్షించి రెండుచికిత్సలుగనే చెప్పబడినది. ఇచ్చట జూపిన సంఖ్యాక్రమము ననుసరించియే వరుసగ చికిత్సలును చెప్పబడును.

### 1. "శోఫఘ్ను" చికిత్సాక్రమము, అందు రక్తమోక్షణము.

మూ. పూర్వరూపం భిషగ్బుద్ధ్వా వ్రణానాం శోఫమాదితః,
రక్తావసేచనం కుర్యాత్ అజాతవ్రణశాన్తయే 44

వ్యా. వ్రణములు జనించుటకుముందుగ శోఫ జనించును; కావున నయ్యది వ్రణములకు పూర్వరూపమగును. అట్టి పూర్వరూపావస్థను తొలుత నెరింగి విధ్యుక్త ప్రకారము జలగలు మున్నగువానిమూలముగ రక్తమోక్షణము చేయనగును. అటుచేసిన యెడ వ్రణముగ పరిణమించక మునుపే శమించును. (ఈశోఫచికిత్స వ్రణములు కల్గకుండుటకై చేయబడునది కావున వ్రణచికిత్సలో జేరినది యగును.)

### వ్రణశోఫములయందు శోధన-లంఘనములు.

మూ. శోధయేద్బహుదోషాంస్తు, స్వల్పదోషాన్ విలఙ్ఘయేత్,
పూర్వం కషాయైస్సర్పిర్భిః జయేద్వా మారుతోత్తరమ్. 45

వ్యా. వ్రణశోఫలయందు దోషములు మిక్కిలి బలిష్ఠములుగ నున్నవారికి వమన విరేచనరూపశోధన చికిత్స చేయనగును. దోషములు స్వల్పములుగ నున్నయెడ లంక ణముచేయించవలెను. వాతము బలిష్ఠముగ నున్నయెడ తొలుత వాతహరములగు కషాయముల త్రాగించియు ఘృతముల నుపయోగించియు శమింపజేయవలెను.

### శోఫహరపంచవల్కలప్రలేపము.

మూ. న్యగ్రోధోదుమ్బరాశ్వత్థప్లక్షవేతసవల్కలైః,
ససర్పిష్కైః ప్రలేపస్స్యాత్ శోఫనిర్వాపణః పరమ్. 46

వ్యా. మఱ్ఱిపట్ట, అత్తిపట్ట, రావిపట్ట, జువ్విపట్ట, ప్రబ్బలిపట్ట, వీని నైదిటిని చూర్ణముచేసి నేతిలో కలిపి పట్టు వేసినచో వ్రణశోఫను శమింపజేయును. (ఇవి పంచ వల్కలము లనబడును.)

### శోఫహరవిజయాదిప్రదేహము.

మూ. విజయా మధుకం వీరా బిసగ్రన్థిః శతావరీ,
నీలోత్పలం నాగపుష్పం ప్రదేహస్స్యాత్సచన్దనః. 47

వ్యా. చిట్టాముట్టి, అతిమధురము, క్షీరకాకోళి, తామరగడ్డ, పిల్లిపీచరగడ్డ, నల్లకలువలు, నాగకేసరములు, శ్రీగంధము, వీని నన్నిటిని నూరి దట్టముగ పట్టువేసిన వ్రణశోఫము శమించును.

శోఫహరప్రదేహము, ఆహారంబును.

మూ. సక్తవో మధుకం సర్పిః ప్రదేహస్స్యాత్సశర్కరః,
అవిదాహీని చాన్నాని శోఫే భేషజముత్తమమ్. 48

వ్యా. సత్తుపిండి, అతిమధురము, నెయ్యి, చక్కెర, వీని నన్నిటిని మెత్తగ నూరి పట్టువేసిన వ్రణశోధమును హరించును. మరియు తాపమును కల్గించకుండునట్టి యాహారములు వ్రణశోఫలయందు మిగుల శ్రేష్ఠమైన యౌషధముగ నుండును.

శోఫము పక్వమగుట కుపనాహస్వేదవిధి.

మూ. స చేదేవముపక్రాన్తః శోఫో న ప్రశమం వ్రజేత్,
తస్యోపనాహైః పక్వస్య పాటనం హితముచ్యతే 49

వ్యా. వ్రణశోఫము పైజెప్పబడిన చికిత్సలచే శమించకున్నయెడ నీక్రింద జెప్పంబడునుపనాహముల (ఉష్ణముగను దట్టముగ నుండు ప్రలేపముల) చేత చికిత్సచేసి, పక్వమైనపిదప శస్త్రములచే పాటనము చేయుట మంచిది. (పాటనమన పక్వమైన వ్రణమును పగులదీయుట యని యర్థము.)

శోధమున కుపనాహము.

మూ తైలేన సర్పిషా వాపి తాభ్యాం వా సక్తుపిణ్డికా,
సుఖోష్ణా శోఫపాకార్థం ఉపనాహః ప్రశస్యతే. 50
సతిలాసాఽతసీబీజా దధ్యమ్లా సక్తుపిణ్డికా,
సకిణ్వకుష్ఠలవణా శస్తా స్యాదుపనాహనే. 51

వ్యా. సత్తుపిండి నుడికించి అందు తైలమునైనను నేతినైనను రెంటినైనను కలిపి సుఖోష్ణముగ నున్నపుడు శోఫ కల్గినస్థలమున బిళ్లగచేసి యునిచి శోఫము పక్వమగుటకై కట్టుగట్టుట చాల ప్రశస్తము.

మరియు సత్తుపిండియందు నువ్వులను అగసినిత్తులను మెత్తగనూరి కలిపి, అందు పుల్లనిపెరుగును సురాబీజమును ఉప్పును కలిపి వ్రణశోఫముపై నునిచి కట్టుగట్టుట చాల ప్రశస్తము. (ఇచ్చట "ఉపనహ్యతే(బధ్యతే) చర్మపట్టాదినా ఉపనాహః" అను

వ్యుత్పత్తిచేత పిండి మొదలగువాని నునిచి చర్మము గుడ్డమొదలగువానిచే కట్టుగట్టుట యుపనాహ మని యెరుంగునది) ఇత్తెరంగున "శోథయేద్బృహుదోషాస్తు" అని యుపక్రమించి శోఫహరమను మొదటి వ్రణచికిత్స చెప్పబడినది).

### పచ్యమాన-పక్వశోఫలక్షణములు.

మూ. రుగ్దాహరాగతోదైశ్చ విదగ్ధం శోఫమాదిశేత్,
జలవస్తిసమస్పర్శం సమ్పక్వం పీడితోన్నతమ్. 52

వ్యా. వ్రణశోఫము పక్వమునొందుచున్నపుడు నొప్పియు మంటయుకల్గి యెఱ్ఱనై సూదులతో పొడిచినట్లు పోటు కల్గును. (ఈలక్షణములచే వ్రణశోఫము పాకావస్థనొందుచున్నదని యెరుంగునది). మరియు వ్రణశోఫమును తాకినయెడ నీళ్లతో నిండిన తోలుతిత్తివలె నుండి వ్రేలితో నొత్తినపుడు అణగి మరల పైకినుబికిన నయ్యది పక్వమైనదని యెరుంగునది.

### పక్వమైనవ్రణమును భేదించు నౌషధగణము.

మూ ఉమాఽథో గుగ్గులుః సౌధం పయో, దక్షకపోతయోః,
విట్, పలాశభవః క్షారః హేమక్షీరీ మధూలకః. 53
ఇత్యుక్తో భేషజగణః పక్వశోఫప్రభేదనః,
సుకుమారస్య, కృచ్ఛ్రస్య శస్త్రం తు పరముచ్యతే. 54

వ్యా. అగసి, గుగ్గిలము, జెముడుపాలు, కోడిమలము, పావురములమలము, మోదుగక్షారము, కంకుష్ఠము, నేపాళము, ఈద్రవ్యములన్నియు వ్రణశోఫము పక్వమైయుండునపుడు దానిని పగులదీయును. ఈద్రవ్యములను సుకుమారశరీరులుగ నుండువారికి వ్రణభేదనమునకై యుపయోగింపనగును. సుకుమారులు కానివారికి శస్త్రకర్మము శ్రేష్ఠమగును. (కష్టమునకోరువజాలని సుకుమారులకు పైజెప్పిన శోధముల భేదించు అగసి మున్నగు ద్రవ్యములచే వ్రణశోఫమును పగులునట్లు చేయవలెననియు, బాధకోరువజాలినవారికి క్రింద జెప్పంబడు శస్త్రకర్మచే వ్రణశోఫమును పగులదీయవలెననియు భావము. ఇవి రెండును పరిపక్వమై వ్రణముగ పరిణమించు శోఫమును పగులంజేయునుపాయములు.)

### షడ్విధశస్త్రకర్మవివరణము.

మూ. పాటనం వ్యధనం చైవ ఛేదనం లేఖనం తథా,
ప్రచ్ఛన్నం సీవనం చైవ షడ్విధం శస్త్రకర్మ తత్. 55

వ్యా. పాటనము (పగులదీయుట), వ్యధనము (గ్రుచ్చుట), ఛేదనము (రెండుగ ఛేదించుట), లేఖనము (గీచుట), ప్రచ్ఛనము (కొంచెముగ చీల్చుట), సీవనము (చీలికలై యుండుదాని నొండొంట జేర్చి కుట్టుట), నని శస్త్రకర్మములు ఆరువిధములు. (త్రిస్రైషణీయాధ్యాయమున "శస్త్రప్రణిధానం పునః ఛేదనభేదన........జలౌక సశ్చేతి (సూ. అ. ౧౧) అని శస్త్రకర్మములు పదునొకండువిధములుగ జెప్పబడినవి. అం దధికములుగ నుండు దారణాదులును, ఈయారిటిలో నంతర్భూతము లగును. కావున స్వోక్తివిరోధము లేదని యెరుంగునది.)

## 2. పాటనకర్మోపయోగము.

మూ. నాడీవ్రణాః పక్వశోథాః తథా క్షతగుదోదరం,
అన్తశ్శల్యాశ్చ యే శోఫాః (దేశాః) పాట్యాస్తే తద్విధాశ్చ యే.

వ్యా. నాడీవ్రణములును, (నారికురుపులు), పక్వములైన శోఫములును, క్షతోదరంబును, బద్ధగుదోదరంబును, ఇనుపముక్కలు ముండ్లు మున్నగు శల్యములు లోపల చేరియుండు శోఫలును, (అంతశ్శల్యములు కలస్థలంబులును), ఇవి యన్నియు పాటనమునకు (పగులదీయుటకు) అర్హము లైనవి. మరియు వీనికి సమానములైన యితరవ్రణంబులును పాటనార్హము లగును.

## 3. వ్యధనకర్మోపయోగము.

మూ. దకోదరాణి సమ్పక్వాః గుల్మా యే, యే చ రక్తజాః,
వ్యధ్యాః శోణితరోగాశ్చ విసర్పపిడకాదయః. ౬7

వ్యా. జలోదరములు, పాకావస్థనొందిన గుల్మములు, రక్తగుల్మములు విధిశోణీయాధ్యాయమున జెప్పబడిన దుష్టరక్తముచే గల్గినవిసర్పము ప్రమేహపిడకలు మున్నగు రోగములు, ఇవి యన్నియు వ్యధనమునకు అర్హములగును.

ఇచ్చట వ్యధనమన సిరలను గ్రుచ్చి యందుండి రక్తము మున్నగు చెడుద్రవమును వెడలించుట యని యర్థము. మరియు విధిశోణితీయాధ్యాయమున—"తతశ్శోణితజా రోగాః......విజ్ఞేయాశ్శోణితాశ్రయాః"(సూ. అ. ౨౪. శ్లో. ౧౨-౧౬) అని చెప్పబడిన రక్తము నాశ్రయించి సంభవించు రోగములు 'శోణితరోగాశ్చ' అనుపదముచే గ్రహింపబడును. వీనికి సామాన్యచికిత్సయు "స్రావణం శోణితస్య వా" అని యచ్చటనే నిర్దేశింపబడినది.

## 4. ఛేదనకర్మోపయోగము.

మూ. ఉద్వృత్తాన్ స్థూలపర్యన్తాన్ ఉత్సన్నాన్ కఠినాన్ వ్రణాన్
అర్శః ప్రభృత్యధిమాంసం ఛేదనేనోపపాదయేత్, 58

వ్యా. మిక్కిలి పైకినుబికియుండు వ్రణంబులును, అంచులయందు వాచి స్థూలముగ నుండువ్రణంబులును, వ్రణములోని మాంసము పైకి పెరిగియుండు వ్రణంబులును, కఠినములుగ నుండు వ్రణంబులును, అర్శస్సు మున్నగు అధిమాంస (అధికముగ మాంసము పెరిగిన గుదాంకురములు) రూపము లైన వ్యాధులును, ఛేదనరూపమైన శస్త్రకర్మము నుపయోగింప దగియుండును.

## 5-6. లేఖన-ప్రచ్ఛనకర్మోపయోగము.

మూ. కిలాసాని సకుష్ఠాని లిఖేల్లేఖ్యాని బుద్ధిమాన్,
వాతాసృక్ గ్రన్థిపిడకాః సకోఠా ర_క్తమణ్డలమ్. 59
కుష్ఠాన్యభిహతం చాఙ్గం శోథాంశ్చ ప్రచ్ఛయేద్భిషక్,

వ్యా. లేఖనమునకు తగిన యవస్థనుండు కిలాసమును కుష్ఠములను లేఖనము చేయ దగును. మరియు వాతర_క్తము, గ్రంథులు, పిటకలు, కోఠములు, ర_క్తముచే గల్గిన మండలకుష్ఠము, ఇతరకుష్ఠములు, అవయవములయందు దెబ్బతగులుటవలన కల్గిన కదుములు, వాపులు ఇవి యన్నియు ప్రచ్ఛనము చేయదగును.

## 7. సీవనకర్మోపయోగము.

మూ. సీవ్యం కుక్ష్యుదరాద్యం తు గమ్భీరం యద్విపాటితమ్. 60
ఇతి షడ్విధముద్దిష్టం శస్త్రకర్మ మనీషిభిః,

వ్యా. మహోదరము మున్నగు వ్యాధులయందు దోషమును వెడలించుటకై కుక్షి మున్నగుప్రదేశములయందు మిక్కిలి లోతుకు తెగునట్లుపాటనము చేసినయెడ, అట్టి చీలువబడిన చోట నొండొంట చీలికలు కలియుటకై సీవనమును చేయదగును. (రెండుచీలికల నొకటిగ చేర్చి కుట్టవలెననుట). ఇత్తెరంగున నారువిధములగు శస్త్రకర్మల నుపయోగింపదగిన విషయములు వివరింపబడినవి.

## 8. అవపీడనము (వ్రణమునందలి ద్రవమును వెడలించుచికిత్స.

మూ. సూక్ష్మాననాః కోష (శ) వన్తః యే వ్రణాః తాన్ ప్రపీడయేత్. 61
కలాయాశ్చ మసూరాశ్చ గోధూమాస్సహరేణవః,
కల్కీకృతాః ప్రశస్యన్తే నిస్స్నేహాః వ్రణపీడనే. 62

వ్యా. వ్రణములు మిగుల సూక్ష్మమైనరంధ్రము కల్గి వ్రణము సంచివలె విస్తారముగ లోపల వ్యాపించి యుండునపుడు లోపలనుండుచీము మున్నగు దుష్టద్రవము ధారాళముగ బైట వెడలుటకై చేయబడు వ్రణలేపాది చికిత్స ప్రపీడనము, అవపీడనము నని చెప్పబడును. అట్టి సూక్ష్మరంధ్రములు కలవ్రణములకు బటాణిలు, చిరుసెనగలు, గోధుమలు, రేణుకలు, వీనిని కల్కములుగ జేసి స్నేహద్రవ్యముల జేర్పక వ్రణపీడనమునకై యుపయోగించుట చాల ప్రశస్తము. (పైజెప్పిన ద్రవ్యములను స్నేహముల జేర్చకయే నూరి కల్కముగ జేసి యుండికించి వ్రణద్వారముండుస్థలమును మాత్రము వదలి, వ్రణము వ్యాపించి యున్నంతవరకును పట్టువేయదగును. ఇది అవపీడనము నెనిమిదవ చికిత్స.)

### 9. నిర్వాపణ (మంటను శమింపజేయు) చికిత్స.

మూ. శాల్మలీత్వక్ బలా మూలం తథా న్యగ్రోధపల్లవాః,
న్యగ్రోధాదికముద్దిష్టం బలాదికమథాపి వా. 63
ఆలేపనం నిర్వాపణం తద్విద్యాత్తైశ్చ సేచనమ్,
(తద్విధాన్యైశ్చ సేచనమ్)
సర్పిషా శతధౌతేన పయసా మధుకామ్బునా. 64
నిర్వాపయేత్ సుశీతేన రక్తపిత్తోత్తరాన్ వ్రణాన్,

వ్యా. (వ్రణమునందలి మంటను ఉష్ణంబును శమింపజేయు చికిత్స నిర్వాపణము) బూరుగచెట్టుపట్ట, చిట్టాముట్టివేరు, మఱ్ఱిచిగుళ్లు, ఈమూడిటినైనను; శోఫహరచికిత్సితమున "న్యగ్రోధోదుమ్బరా... పరమ్" "విజయా... సచందనః" (శ్లో. ౪౬. ౪౭) అని చెప్పబడిన పంచవల్కలములనైనను, బలాది ద్రవ్యములనైనను నూరి కల్కము జేసి వ్రణమునందలి మంట శమించుటకై పట్టువేయుటకును సేచనమునకు నుపయోగింపనగును.

మరియు శతధౌతఘృతముచేనైనను, ఆవుపాలచేనైనను, అతిమధురకషాయముచేనైనను, పిత్తాధికవ్రణములకు పరిషేకము చేసినచో దాహాదులు శమించును. (ఇది నిర్వాపణమను తొమ్మిదవచికిత్స.)

### 10. సంధానచికిత్స.

మూ. లమ్బాని వ్రణమాంసాని ప్రలిప్య మధుసర్పిషా. 65
సన్దధీత సమం వైద్యః బన్ధనైశ్చోపపాదయేత్,

తాన్ సమాన్ సుస్థితాన్ జ్ఞాత్వా ఫలినీలోధ్రకట్ఫలైః. 66
సమఙ్గాధాతకీయుక్తైః చూర్ణితైరవచూర్ణయేత్,
పఞ్చవల్కలచూర్ణైర్వా శుక్తిచూర్ణసమాయుతైః. 67
ధాతకీలోధ్రచూర్ణైర్వా తథా రోహన్తి తే వ్రణాః,

వ్యా. (వ్రణమునందలి శిథిలములై వ్రేలుచుండు మాంసాదుల నొకటిగ కలియుటకై చేయుచికిత్స సంధానము) అట్లు శిథిలములై వ్రేలుచుండు వ్రణమాంసములకు తేనెను నేతిని పూసి యొండొంట సమముగ జతపరిచి యవి మరల విడిపోకయుండునట్లు కట్టుగట్టి యుంచవలెను. మాంసము లొండొంటకలిసి యతికి సమస్థితి నున్నవానిని చక్కగ గమనించి, ప్రేంకణము, లొద్దుగుచెక్క, టేకుమ్రానిచెక్క, మంజిష్ఠి, ఆరెపువ్వు, వీని నన్నిటిని చూర్ణముచేసి వ్రణముపై చల్లవలెను. మరియు మఱ్ఱి, అత్తి, రావి, జువ్వి, ప్రబ్బలి, అను నీరైదిటిపట్టలను చూర్ణముచేసి యందు శుక్తిచూర్ణమును కలిపియైనను, ఆరెపువ్వు, లొద్దుగు, ఈరెండిటిచూర్ణముసైనను వ్రణముపై చల్లవలెను. ఈచికిత్సచేత శిథిలములైనమాంసము లేకములై వ్రణము మానును.

## అస్థిభంగ-సంధివిశ్లేషములకు సంధానచికిత్స.

మూ. అస్థిభగ్నం చ్యుతం సన్ధిం సన్దధీత సమం పునః. 68
సమేన సమభఙ్గేన కృత్వాఽన్యేన విచక్షణః,
స్థిరైః కబలికాబన్ధైః కుశికాభిశ్చ సంస్థితమ్. 69
పట్టైః ప్రభూతసర్పిష్కైః బధ్నీయాదచలం సుఖం,

వ్యా. శరీరావయవమునందలి యెముకలు విరిగినను, మోచేతులు మోకాళ్లు మొదలగువానికీళ్లు జారి తొలగినను, విరిగినయెముకలను ఒండొంట జేర్చి చక్కగనుండు నంగముతో సమానముగ నుండునట్లు జతపరిచియు, తొలగిన కీలును మునుపటివలె సమముగ (చక్కగ నుం.ు వేరొకయంగముతో సమానముగ) నుండునట్లుమర్చి, మరియు కబలికమనియు కుశికమనియు (శల్యతంత్రమున) సుప్రసిద్ధములగు బంధనవిధిప్రకారము కట్టుగట్టి, దానిపై నేతిని అధికముగ బూసి నేతితో తడపబడిన దృఢమైన బట్టలచే కదలకుండునట్లు బిగకట్టవలెను(ఇచ్చట కబలికా-కుశికాబంధములు సుశ్రుతమున జెప్పబడినవి.)

## అస్థిభంగాదులయందు పథ్యనియమము.

మూ. అవిదాహిభిరన్నైశ్చ పైష్టికైస్తముపాచరేత్. 70

గ్లానిర్హి న హితా తస్య సన్ధివిశ్లేషకారికా,

వ్యా. పైజెప్పినరీతిగ కట్టు గట్టినపిదప విదాహకరములగు మిరపకాయలు ఆవాలు మున్నగువానిని వదిలి మధురాది యుక్తములగు నన్నములను పిండితో జేయబడిన భక్ష్యములను ఆహారముగ భుజింపవలెను. అస్థిభంగాదులచే బాధితునకు కొంచెము కూడ బడలిక కల్గినయెడ సమముగ జేర్చబడిన సంధిబంధములు చక్కగ కలియక సడలును. (కావున కారమును జేర్చక యాహారమును భుజింపవలెనని భావము.)

## అస్థిభంగాదులయుపద్రవచికిత్స.

మూ. విచ్యుతాభిహతాఙ్గానాం విసర్పాదీనుపద్రవాన్. 71
ఉపాచరేత్ (ఉపక్రమేత్)యథాకాలంకాలజ్ఞఃస్వాచ్చికిత్సితాత్,

వ్యా. మరియు అస్థిభంగము సంధివిశ్లేషములచే బాధితులకు విసర్పము పక్షాఘాతము మున్నగు వ్రణోపద్రవములు సంభవించినయెడ ఆయుపద్రవములకు వానివానికి ప్రత్యేకముగ నిర్దేశింపబడిన ఆయాచికిత్సలను ఆయాకాలములయందు వైద్యవరుడు చేయవలెను. (ఇది సంధానమను పదియవ వ్రణచికిత్స.)

## 11. స్వేదరూపమైన వ్రణచికిత్స.

మూ. శుష్కా మహారుజః స్తబ్ధాః యే వ్రణా మారుతోత్తరాః 72
స్వేద్యాః సఙ్కరకల్పేన తే స్యుః కృసరపాయసైః,
గ్రామ్య-బైలాఽమ్బుజాఽనూపైః వేసవారైశ్చ సంస్కృతైః 73
ఉత్కారికాభిశ్చోష్ణాభిః సుఖీ స్యాత్ వ్రణిత స్తథా,

వ్యా. వాతం బధికముగ గలవ్రణములు రూక్షములై ద్రవములేక శుష్కించి మిక్కిలి బాధతో గూడి స్తంభించి కఠినములై యుండును. అట్టివ్రణములకు సంకరస్వేదమునకు జెప్పిన విధిప్రకారము వేడిగనుండు కృసరము (నువ్వులను ఉద్దిపప్పును బియ్యము నొకటిగ జేర్చి పక్వముచేయబడిన యన్నము) చేనైనను, పాయసముచేనైనను, గ్రామముల నివసించు జంతువులయొక్కయు, బిలములనుండు జంతువులయొక్కయు, జలచరములయొక్కయు మాంసములచేనైనను, సంస్కరింపబడిన వేసవారములచేనైనను, ఉత్కారిక(పిడుచకుడుము)లచేనైనను, కాపడము బెట్టి స్వేదవిధ్యుక్తప్రకారము చెమట బుట్టింపవలెను. అట్లు చేసినచో వ్రణరోగము కలవానికి సుఖము కల్గును.

సంకరస్వేదస్వరూపము స్వేదాధ్యాయమున నిట్లు చెప్పబడినది:—"తత్ర వస్త్రాంతరితైః అవస్త్రాంతరితైర్వా పిణ్డైః యథోక్తైః ఉపస్వేదనం సఙ్కరస్వేద ఇతి విద్యాత్"

(సూ. అ. ౧౪. సూ. ౪౧) అయాస్వేదవిధికి జెప్పబడిన ఔషధద్రవ్యములను పక్వము జేసి ముద్దజేసి దానిచే కాపడముబెట్టి చెమట బుట్టించుట సంకరస్వేదము. వ్రణములు వాతాధిక్యమునం జేసి రూక్షములై కఠినముగ నున్నపుడు అయ్యవి మెత్తబడుటకై స్వేదవిధి చేయనగును. ఇచ్చట ఎముకలు లేక మెత్తనిమాంసమును సంస్కారించిన నయ్యది వేసవారమని యెరుంగునది.

## వ్రణములయందు రుగ్దాహశమనలేపము.

మూ. సదాహా వేదనావన్తో యే వ్రణాః మారుతోత్తరాః 74
తేషామమాం తిలాంశ్చైవ భృష్టాన్ పయసి నిర్వృతాన్,
తేనైవ పయసా పిష్ట్వా కుర్యాదాలేపనం భిషక్. 75

వ్యా. మంటయు నొప్పియు నధికముగనుండు వాతాధికమునందు వ్రణములకు ఆగసివిత్తులను నువ్వులను వేయించి యావుపాలయందు బోసి చల్లార్చి యాపాలను కలిపి నూరి వ్రణములపై పట్టువేయవలెను.

## శూలహరస్నేహశర్కరలేపము.

మూ. బలా గుడూచీ మధుకం పృశ్నిపర్ణీ శతావరీ,
జీవన్తీ శర్కరా క్షీరం తైలం మత్స్యవసా ఘృతమ్. 76
సంసిద్ధా సమధూచ్ఛిష్టా శూలఘ్నీ స్నేహశర్కరా,

వ్యా. చిట్టాముట్టి, తిప్పతీగె, అతిమధురము, కోలపొన్న, పిల్లిపీచరగడ్డ, మనుబాల, చక్కెర, పాలు, తైలము, మత్స్యములవస, నెయ్యి, మైనము వీనిని చేర్చి ఉత్కారికల (పిడుచకుడుములుగ) సిద్ధముచేసిన నియ్యది స్నేహశర్కర యనబడును. దీనిచే స్వేదవిధిచేసిన వ్రణమునందలి పోటు మున్నగుబాధల హరించును.

ఇచ్చట చిట్టాముట్టి మొదలు మనుబాలవరకుంగల ద్రవ్యములను మెత్తగ నూరి, యందు చక్కెర, పాలు, నూనె, మత్స్యవస, ఘృతము, మైనము, అనువానిని సమభాగములుగ గూర్చి కలిపి కుడుములుగ జేసి సుఖోష్ణముగ నున్నపుడు వ్రణముపై బెట్టి కట్టవలెను. లేక చిట్టాముట్టి మున్నగుద్రవ్యములను కల్కముజేసి తైల-మత్స్యవస-ఘృతములతో కలిపి, నాలుగింతలు పాలుజేర్చి పక్వముజేసి, స్నేహమునకు నాల్గవపంతు మైనమును కలుపునది. ఈస్నేహము చక్కెరతో గూడి ఘనీభవించి యుండుటంజేసి స్నేహశర్కరయని వ్యవహరింపబడును.

## వ్రణములకు పరిషేకస్వేదము.

మూ. ద్విపఞ్చమూలక్వథితేనాఽమ్భసా పయసాఽథ వా (మస్తునాథ వా.)
సర్పిషా వా సతైలేన కోష్ణేన పరిషేచయేత్,

వ్యా. దశమూలములను చేర్చి కాచబడి సుఖోష్ణముగనుండు జలముచే నైనను, పాలచేనైనను, ఘృతముచేనైనను, తైలముచే నైనను వ్రణమును తడిపి శుభ్రముచేసిన వ్రణమునందలి బాధలు నివర్తించును. (ఇది పరిషేకస్వేదము. ఇయ్యది స్వేదమను పదునొకండవవ్రణచికిత్స.)

## 12. వ్రణములకు దాహశూలశమనలేపము.

మూ. యవచూర్ణం సమధుకం సతిలం సహసర్పిషా. 78
దద్యాదాలేపనం కోష్ణం దాహశూలోపశాన్తయే,

వ్యా. యవలు, నువ్వులు, అతిమధురము వీనిని చూర్ణముచేసి నేతిని చేర్చి యుడికించి సుఖోష్ణముగ నున్నపుడు పట్టువేయవలెను. దీనివలన వ్రణమునందలి మంటయు పోటును శమించును.

## రుగ్దాహశమన ఉపనాహము.

మూ. ఉపనాహశ్చ కర్తవ్యః సతిలో ముద్గపాయసః. 79
రుగ్దాహయోః ప్రశమనః వ్రణేష్వేవ విధిర్హితః,

వ్యా. నువ్వులను పెసలపప్పును చేర్చి పాయసము చేసి వ్రణములపై బూసి కట్టుగట్టినచో నొప్పియు మంటయు శమించును. (ఇది శమనమను పండ్రెండవచికిత్స.)

## 13. ఏషణకర్మవిధి.

మూ. సూక్ష్మాననా బహుస్రావాః కోశవన్తశ్చ యే వ్రణాః. 80
న చ మర్మాశ్రితాః తేషా మేషణం హితముచ్యతే,

వ్యా. వ్రణములు తోలుతిత్తివలె పైకుబికి లోపల చీము మున్నగుద్రవము లధికముగ నుండి మిగుల సూక్ష్మముగ స్రవించుచుండునపుడు వానిని శలాకాదులచే వెదకి గమనించుట యేషణము. అట్టి వ్రణముల గమనించి చీము మున్నగువానిని వెడలించుట హితకరము. వ్రణములు మర్మస్థలముల నాశ్రయించి యుండునెడ వానికి మాత్రము ఏషణచికిత్స జేయదగదు.

## ఏషణద్వైవిధ్యము, దానిప్రత్యేకోపయోగము.

మూ. ద్వివిధామేషణీం విద్యాత్ మృద్వీం చ కఠినామపి. 81
ఔద్భిదైర్మృదుభిః నాళైః లోహానాం వా శలాకయా,
గమ్భీరే మాంసలే దేశే పాట్యం లౌహశలాకయా. 82
ఏష్యం విద్యాద్వ్రణం నాళైః విపరీతమథో భిషక్,

వ్యా. ఏషణకర్మ మృదు-కఠినభేదములచే రెండు తెరంగులు. అందు మృదువుగ నుండు పుడకలు మున్నగువానిచే చేయబడునది మృదువు, కఠినములైన ఇనుపసలాకులచే చేయబడునది కఠినము. మిక్కిలి లోతులో మాంసలస్థలమున కల్గి పాటనమునకు దగిన వ్రణమునకు శలాకములచే నేషణము చేయదగును. మాంసలము కాని ప్రదేశమున పైభాగమునసే కల్గినవ్రణమును మృదువైననాళములచే నేషణము చేయదగును. (ఇది ఏషణమను పదుమూడవ వ్రణచికిత్స.)

## అశుద్ధవ్రణములు, వానికి శోధనవిధి.

మూ. పూతిగన్ధాన్ వివర్ణాంశ్చ బహుస్రావాన్ మహారుజః. 83
వ్రణానశుద్ధాన్ విజ్ఞాయ శోధనైస్సముపాచరేత్,

వ్యా. దుర్గంధముతో కూడిన వ్రణంబులును, వివర్ణములుగ నుండు వ్రణంబులును, పూయాదుల నధికముగ స్రవించు వ్రణంబులును, మిక్కిలి తీవ్రమైన బాధకల వ్రణంబులును, అశుద్ధములు; వానిని చక్కగ గమనించి శోధనౌషధములచే చికిత్స చేయనగును. (ఈశోధనము కషాయ-ఆలేపభేదములచే రెండువిధములు.)

## 14. వ్రణశోధనకషాయము.

మూ. త్రిఫలా ఖదిరో దార్వీ న్యగ్రోధాదిః (న్యగ్రోధాऽఽది) బలా కుశః.
నిమ్బకోలకపత్రాణి కషాయాః శోధనా మతాః,

వ్యా. త్రిఫలములు, చండ్ర, పసుపు, న్యగ్రోధాది (పంచవల్కల) ద్రవ్యములు, (మర్రి మున్నగువానిపట్టలు), చిట్టాముట్టి, దర్భవేళ్లు, వేపచిగురు, రేగిఆకు వీనికషాయములు వ్రణములను శుద్ధములుగ జేయును. (పైజెప్పిన ద్రవ్యములను యథాలాభముగ గ్రహించి కషాయము గాచి యశుద్ధవ్రణముల కడుగుటకై యుపయోగింపవలెనని భావము. ఇది పదునాల్గవవ్రణచికిత్స.)

## 15. వ్రణశోధనలేపము.

మూ. తిలకల్కస్సలవణో ద్వే హరిద్రే త్రివృద్ఘృతమ్. 85
మధుకం నిమ్బపత్రాణి ప్రలేపో వ్రణశోధనః,

వ్యా. నువ్వులు, పసుపు, మ్రానిపసుపు, తెగడ, అతిమధురము, వేపాకు, వీనిని నూరి కల్కముచేసి అందు సైంధవలవణమును, నేతిని కలిపి పట్టువెట్టినయెడ వ్రణమునందు దోషములు హరించి శుద్ధమగును. (ఇది పదునైదవ వ్రణచికిత్స.)

## శుద్ధవ్రణలక్షణము.

మూ. నాతిరక్తో నాతిపాణ్డుర్నాతిశ్యావో న చాతిరుక్. 86
న చోత్సన్నో న చోత్సఙ్గీ శుద్ధో రోప్యః పరం వ్రణః,

వ్యా. మిక్కిలి రక్తవర్ణంబును, మిక్కిలి పాండువర్ణంబును, శ్యామవర్ణంబును కాక, మిక్కుటమైన బాధ లేక, మిక్కిలి పైకుబ్బినదియు, ఇరుపార్శ్వములగుందున్నతముగాక యుండు వ్రణము శుద్ధమైనదని యెరుంగునది. అట్టి శుద్ధవ్రణమును క్రింద జెప్పబడురోపణచికిత్సచే మాన్పదగును.

## 16. వ్రణరోపణకషాయము.

మూ. న్యగ్రోధోదుమ్బరాశ్వత్థకదమ్బప్లక్షవేతసాః. 87
కరవీరార్కకుటజాః కషాయాః వ్రణరోపణాః,

వ్యా. మఱ్ఱిపట్ట, అత్తిపట్ట, రావిపట్ట, కడిమిపట్ట, జువ్విపట్ట, ప్రబ్బలిపట్ట, గన్నేరుపట్ట, జిల్లేడుపట్ట, కొడిసెపాలపట్ట, వీనికషాయములు వ్రణములను మాన్పును. (ఇచ్చట బహువచనము "కషాయాః" అని నిర్దేశించియుండుటచేత న్యగ్రోధాదులను వేరువేరుగనైనను, యథాసంభవముగ గూర్చియైనను కషాయములచేసి యుపయోగింపదగునని తెలిసెడి; ఇది పదునారవ వ్రణచికిత్స.)

## 17. వ్రణరోపణలేపము.

మూ. చన్దనం పద్మకిఞ్జల్కం దార్వీత్వఙ్నీలముత్పలమ్. 88
మేదే మూర్వా సమఙ్గా చ యష్ట్యాహ్వం వ్రణరోపణం,
ప్రపౌణ్డరీకం జీవన్తీ గోజిహ్వా ధాతకీ బలా. 89
రోపణం సతిలం దద్యాత్ప్రలేపం సఘృతం వ్రణే,

వ్యా. చందనము, తామరపువ్వులోని కేసరములు, మ్రానిపసుపుపట్ట, నల్లకలువలు మేద, మహామేద, చాగిపట్ట, మంజిష్ఠి, అతిమధురము, వీని నన్నిటిని కూర్చి నూరి కల్కముచేసి వ్రణములు మానుటకు పట్టువేయనగును.

మఱియు ప్రపౌండరీకమను గంధద్రవ్యము, మనుబాల, గోజిహ్వ (యెద్దు నాలుకచెట్టు), ఆరెపువ్వు, చిట్టాముట్టి, నువ్వులు, వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి నూరి నేతిలో కలిపి పట్టువేసినను వ్రణముల మాన్పును (ఇది పదునేడవ వ్రణచికిత్స.)

18. వ్రణశోధన తైల-ఘృతయోగములు.

మూ కమ్పిల్లకం విడఙ్గాని వత్సకం త్రిఫలాం బలామ్. 90
పటోలం పిచుమర్దం చ లోధ్రం ముస్తం ప్రియఙ్గుకమ్,
ఖదిరం ధాతకీం సర్జమేలామగురుచన్దనే. 91
పిష్ట్వా సాధ్యం భవేత్తైలం తత్పరం వ్రణశోధనం,

వ్యా. కంపిల్లకము, వాయువిడంగములు, కొడిసెపాల, త్రిఫలములు, చిట్టాముట్టి చేదుపొట్ల, వేపపట్ట, లొద్దుగపట్ట, తుంగగడ్డలు, ప్రేంకణము, చంద్ర, ఆరెపువ్వు సర్జరసము, ఏలకులు, అగరు, చందనము, వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి నూరి కల్కముచేసి కల్కమునకు నాల్గింతలు, తైలమును, (నువ్వులనూనెను) తైలమునకు నాల్గింతలు నీళ్లను కలపి తైలపాకవిధి ప్రకారము పక్వముచేయబడిన తైలము వ్రణముల శుభ్రముచేయును. (మరియు పైజెప్పిన ద్రవ్యములను చేర్చి విధ్యుక్తప్రకారము పక్వముచేయబడినఘృతంబును వ్రణశోధనమగును. ఇది పదునెనిమిదవ చికిత్స.)

19. వ్రణరోపణ తైల-ఘృతములు.

మూ. ప్రపౌండరీకం మధుకం కాకోల్యౌ ద్వే చ చన్దనే. 92
సిద్ధమేతైస్సమైస్తైలం పరం స్యాద్వ్రణరోపణం,

వ్యా. ప్రపౌండరీకము, అతిమధురము, కాకోళి, క్షీరకాకోళి, శ్వేతచందనము రక్తచందనము, వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి కల్కముచేసి పరిభాషానుసారము సిద్ధముచేయబడిన తైలము వ్రణముల మాన్పును. (ఈద్రవ్యములచే సిద్ధముచేయబడి ఘృతంబును వ్రణరోపణం బగును.)

వ్రణరోపణతైల-ఘృతము, రెండవపద్ధతి.

మూ. దూర్వాస్వరససిద్ధం వా తైలం కమ్పిల్లకేన వా. 9
దార్వీత్వచశ్చ కల్కేన ప్రధానం వ్రణరోపణం,

వ్యా. గఱికయొక్క స్వరసమును, కంపిల్లకము, మ్రానిపసుపుపట్ట, ఈరెంటి యొక్క కల్కమును చేర్చి విధ్యుక్తప్రకారము పక్వముచేయబడిన తైలము వ్రణముల మాన్పుటకు ప్రధానమైయుండును. (మరియు పైజెప్పిన విధిననుసరించి పక్వముచేయ బడిన ఘృతంబును వ్రణరోపణమగును.) (పైయోగములు రెండును చేరి పందొమ్మిదవ చికిత్స.)

### శోధన-రోపణఘృతోపయోగవిధి.

మూ. యేనైవ విధినా తైలం ఘృతం తేనైవ సాధయేత్. 94
రక్తపిత్తోత్తరం దృష్ట్వా రోపణీయం వ్రణం భిషక్,

వ్యా. పైజెప్పిన తైలవిధి ననుసరించి శోధనఘృతమును, రోపణఘృతమును, సిద్ధముచేసి అందు రక్తపిత్తాధికమైన వ్రణముల మాన్పుటకు రోపణఘృతము నుపయో గింపదగును. (తక్కినవానిని వాతకఫవ్రణముల కుపయోగింపవలెనని భావము.)

ఇచ్చట శోధనము నుద్దేశించియు, రోపణము నుద్దేశించియు తైలయోగములు రెండువిధములుగ జెప్పబడినవి. అట్టి శోధనరోపణతైలయోగములనే శోధనరోపణ ఘృతయోగములుగ గూడ సిద్ధముచేసి, అందు రోపణఘృతములను మాత్రము రక్త పిత్తాధికములైన వ్రణములయొక్క రోపణమునకై యుపయోగింపవలెనని పైశ్లోకముచే విధింపబడినది. ఇత్తెరంగున ఘృత-తైల-రూపములగు శోధనరోపణభేదములచే నాల్గు తెరంగులున్నను స్నేహసామాన్యత ననుసరించి తైలఘృతభేదములను వేరువేరుగ గణింపక శోధనరోపణరూపచికిత్సాభేదములు రెండుమాత్రము గ్రహింపబడినది. కావున చికిత్సలు ముప్పదియారువిధములు అనుపరిగణనమునకు హానిలేదని యెఱుంగునది. ఇది చక్రపాణి దత్తవ్యాఖ్యానసమ్మతము.

### 20. 21. 22. వ్రణప్రచ్ఛాదనపత్రము, ప్రచ్ఛాదనభేదములు రెండును.

మూ. కదమ్బార్జుననిమ్బానాం పాటల్యాః పిప్పలస్య చ. 95
వ్రణప్రచ్ఛాదనే విద్వాన్పత్రాణ్యర్కస్య చాదిశేత్,

వ్యా. కడిమి, మద్ది, వేము, కలిగొట్టు, రావి, జిల్లేడు, అనునీచెట్లయొక్క ఆకులను వ్రణముల కప్పుటకై గ్రహింపదగును. (ఇచ్చట పైశ్లోకముచేత వ్రణములపై నాచ్ఛాదనము జేయుటకు పత్రములు మాత్రము నిర్దేశింపబడినది. ఆచ్ఛాదనము వ్రణాంతర్భాగమున చేయబడునది అభ్యంతరమనియు, వ్రణమునకు పైభాగమున చేయు నది బాహ్యమనియు రెండువిధముల నుండును. చికిత్సాభేదముల పరిగణనము చేయు

నప్పుడు పత్రనిర్దేశము మాత్రము నొకచికిత్స యనియు, ఛాదనకర్మ బాహ్యా-అభ్యంతర భేదములచే రెండుచికిత్సలనియు "పత్రం ప్రచ్ఛాదనే" అను వాక్యముచే నిర్దేశింపబడి నది. చక్రపాణిదత్తవ్యాఖ్యయందును "పత్రం ఏక ఉపక్రమః; ఛాదనం తు ద్వివిధం బాహ్యాభ్యంతరభేదేన" అని వివరింపబడినది. కావున ఛాదనపత్రము, బాహ్యాభ్యంతర భేదములచే రెండు తెరంగులైన ఛాదనములును చేరి మూడుచికిత్సలుగ గ్రహింపవలెను.)

## 23. 24. ద్వివిధబంధనములు.

మూ. వార్క్షోఽథ వాఽఽజినః క్షౌమః పట్టో వ్రణహితః స్మృతః 96
బన్ధశ్చ ద్వివిధశ్శస్తో వ్రణానాం సవ్యదక్షిణః,

వ్యా. వృక్షములయొక్క నారచే చేయబడిన గుడ్డనైనను, జింకమొదలగువాని యొక్క రోమములచే నేయబడిన కంబళినైనను, పట్టుగుడ్డనైనను, వ్రణముల గట్టుటకు గ్రహించుట మంచిది. అట్టిగుడ్డచేత వ్రణములను సవ్యముగనైనను, దక్షిణముగనైనను, మార్చి బంధనము చేయనగును. అట్టిభేదములచే సవ్యబంధమనియు, దక్షిణబంధమనియ బంధనము రెండుభేదములు కల్గియుండును.

## 25. భోజననియమము, అందు వర్జ్యములు.

మూ. లవణామ్లకటూష్ణాని విదాహీని గురూణి చ. 97
వర్జయేదన్నపానాని వ్రణీ మైథునమేవ చ,

వ్యా. ఉప్పు, పులుపు, కారము, అనుసీరసములు కల్గినవియు, గుణవీర్యములచే నుష్ణంబును, విదాహకరంబులును, గురుత్వమును కల్గించునవియు నగు నన్నపానములను స్త్రీసంభోగమును వ్రణపీడితుడు వర్జించవలయును.

## వ్రణితునకు హితకరాన్నపానములు.

మూ. నాతిశీతగురుస్నిగ్ధమవిదాహి యథావ్రణమ్. 98
అన్నపానం వ్రణహితం హితం చాస్వపనం దివా,

వ్యా. మిక్కిలి శీతంబును, గురుత్వము కల్గినదియు, స్నిగ్ధంబును కాక వ్రణము నకు విదాహమును కల్గించక యుండు అన్నపానంబులును, పగలు నిదురించక యుండు టయు, వ్రణితునకు చాల హితకరములు. (ఇది భోజ్యమను నిరువదియైదవ చికిత్స).

## 26. ఉత్సాదన (నిమ్నవ్రణోత్థాపన) చికిత్స.

మూ. స్తన్యాని జీవనీయాని బృంహణీయాని యాని చ. 99
ఉత్సాదనార్థం నిమ్నానాం వ్రణానాం తాని కల్పయేత్,

వ్యా. వ్రణములు మిక్కిలి లోతునకు వ్యాపించి వ్రణస్థలము పల్లముగనున్న
యెడ నందు మాంసము వృద్ధినొంది సమస్థితికి వచ్చుటకై స్తన్యమును గల్గించునదియు,
జీవనీయగణమున చెప్పబడిన ద్రవ్యములును, బృంహణద్రవ్యములును నుపయోగింప
దగును. (ఇచ్చట స్తన్య-జీవనీయ-బృంహణీయగణములను షడ్విరేచనశతాశ్రితీయా
ధ్యాయమున జెప్పబడినవానిని గ్రహించునది. ఇది ఉత్సాదనము నిరువదియారవ
చికిత్స.)

## 27. అవసాదనము (దుర్మాంసహరచికిత్స.

సూ. భూర్జగ్రన్థ్యశ్మ కాసీసమధోభాగాని గుగ్గులుః. 100
వ్రణాఽవసాదనం తద్వత్ కలవిఙ్కకపోతవిట్,

వ్యా. వ్రణములయందు దుర్మాంసము పెరిగి పైకుబికి యుండు నెడ నవి హరించి
సమస్థితికి వచ్చుటకై భుజపత్రి, గ్రంథితగరము, ధాతుకాసీసము, విరేచనకరంబులగు
తెగడ మున్నగునవి, గుగ్గిలము, పిచ్చుకయొక్కయు పావురముయొక్కయు మలము,
వీనిని లేపనము చేయదగును.

## 28. 29. దాహకర్మ, దాహకర్మార్హవ్రణములు.

సూ. రుధిరేఽతిప్రవృత్తే తు ఛిన్నే చ్ఛేద్యేఽధిమాంసకే. 101
కఫగ్రన్థిషు గణ్డేషు వాతస్తబ్ధాఽనిలార్తిషు,
గూఢపూయలసీకేషు గమ్భీరేషు స్థిరేషు చ. 102
శ్లిష్టేషు (సుప్తేషు) చాఽఙ్గదేశేషు కర్మాగ్నేః సంప్రశస్యతే,

వ్యా. వ్రణములయందు రక్తము అధికముగ వృద్ధినంది స్రవించుచున్నను, ఛేద
నార్హమైన యధి మాంసమును ఛేదించినప్పుడును, కఫముచే గల్గినగ్రంథులయందును,
గండమాలలయందును, వాతముచే స్తంభించిన వాతరోగములయందును, వ్రణము లోప
లనే యణగి చీమును లసీకయు (వ్రణద్రవంబును) బైట వెడలకున్నను, మిక్కిలి
లోతుగ వ్యాపించి యుండు వ్రణములయందును, కఠినములైన వ్రణములయందును,
రెండుగ కత్తిరించబడిన అవయవప్రదేశములయందును, అగ్నికర్మను చేయుట చాల
ప్రశస్తము.

## దాహకర్మద్వివిధభేదములు.

సూ. మధూచ్ఛిష్టేన తైలేన మజ్జ-క్షౌద్ర-వసా-ఘృతైః. 103
తప్తైర్వా వివిధైర్లోహైః దహేత్ దాహవిశేషవిత్,

వ్యా. మైనము, తైలము, మజ్జ, తేనె, వస, ఘృతము, వీనిని నిప్పున కాచియైనను, పలు దెరంగులైన లోహముల కాచియైనను పైజెప్పిన దాహకర్మార్హములగు వ్రణాదుల కాల్చవలెను. (ఇచ్చట "దాహవిశేషవిత్" అని చెప్పుటచేత దాహకర్మకు సంబంధించిన విశేషముల పూర్తిగ నెరింగిన వైద్యుడే దాహకర్మను చేయవలెనుగాని సామాన్యులు చేయదగరని యర్థము నెరుంగునది.) స్నేహ-రూక్ష భేదములచే దాహకర్మ రెండువిధములు. అందు మైనము మున్నగువానిచే చేయబడునది స్నిగ్ధము, లోహముచే చేయబడునది రూక్షము.

## ద్వివిధదాహకర్మోపయోగము.

మూ. రూక్షాణాం సుకుమారాణాం గమ్భీరాన్ మారుతోత్తరాన్.
దహేత్ స్నేహమధూచ్ఛిష్టైః, లౌహైః క్షౌద్రైస్తతోఽన్యథా,

వ్యా. రూక్షమైన శరీరము కలవారికిని, సుకుమారులకును, మిక్కిలి లోతుగ వ్యాపించిన వ్రణములకును, వాతం బధికముగ కల వ్రణములకును, స్నేహములచేనైనను మైనముచేనైనను దాహకర్మను చేయదగును. వీనికి వ్యతిరేకముగ స్నిగ్ధశరీరులకును, సుకుమారులు కానివారికిని, పైభాగముననే వ్యాపించిన వ్రణములకును, పిత్తకఫాధిక వ్రణంబులకును, కాల్చబడిన లోహములచే నైనను, తేనెచే నైనను దాహము చేయవలెను.

## దాహకర్మానర్హవిషయములు.

మూ. బాలదుర్బలవృద్ధానాం గర్భిణ్యాః రక్తపిత్తినామ్. 105
తృష్ణాజ్వరపరీతానాం అబలానాం విషాదినాం,
నాఽగ్నికర్మోపదేష్టవ్యం స్నాయుమర్మవ్రణేషు చ. 106
సవిషేషు చ శల్యేషు నేత్రకుష్ఠవ్రణేషు చ,

వ్యా. బాలులు, వృద్ధులు, బలహీనులు, గర్భిణీస్త్రీలు, రక్తపిత్తరోగులు, దప్పిచేనైనను జ్వరముచేనైనను బాధింపబడినవారు, పుట్టుకతో బలము లేనివారు, విషమును తినినవారు, వీరికందరకును అగ్నికర్మ చేయంజనదు. మరియు స్నాయువులయందును మర్మములయందును బొడమిన వ్రణములయందును, విషముతోడను శల్యముల (ఇనుప మేకులు మున్నగునవి) తోడను కూడిన వ్రణములయందును, నేత్రములయందును కుష్ఠములయందును సంభవించిన వ్రణములయందును దాహకర్మ చేయంజనదు.

## క్షారప్రయోగవిధి.

మూ. రోగదోషబలాపేక్షీ మాత్రాకాలాఽగ్నికోవిదః. 107
శస్త్రకర్మాఽగ్నికృత్యేషు క్షారమప్యవచారయేత్,

వ్యా. ఔషధముయొక్క పరిమాణమును, కాలభేదమును అగ్నికర్మవిధానమును చక్కగ తెలిసిన వైద్యవరుడు, శస్త్రకర్మను అగ్నికర్మను చేయవలసిన వ్రణములయందు, రోగములయొక్కయు దోషములయొక్కయు బలాఽబలముల జక్కగ గమనించి తత్తదనుసారముగ విధ్యుక్తప్రకారము క్షారప్రయోగమును కూడ చేయదగును. (వ్రణచికిత్సల పరిగణనము చేయునపుడు క్షారకర్మను చెప్పియుండలేదు; అయినను శస్త్రాగ్నికర్మలు చేయుపనినే క్షారకర్మయు చేయును కావున వానిలో నంతర్భూతమని యెరుంగునది).

## 30. 31. ద్వివిధరూపములు.

మూ. కఠినత్వం వ్రణా యాన్తి గన్ధైస్సారైశ్చ ధూపితాః. 108
సర్పిర్మజ్జవసాధూపైః శైథిల్యం యాన్తి హి వ్రణాః,
రుజస్స్రావాశ్చ గన్ధాశ్చ కృమయశ్చ వ్రణాశ్రితాః. 109
శైథిల్యం మార్దవం వాఽపి ధూపనేనోపశామ్యతి,

వ్యా. చందనము మున్నగు బంధద్రవ్యములచేతను, సర్జరసము మున్నగు సారములచేతను వ్రణమునకు ధూపము వేసినయెడ మెత్తబడియుండు వ్రణములు బిరుసెక్కును. నెయ్యి, మజ్జ, వస అను స్నేహద్రవ్యములచే వ్రణములకు పొగబట్టినయెడ కఠినమై స్తంభించియుండు వ్రణములు శిథిలములై మెత్తబడును. మరియు నీ రెండువిధములయిన ధూపముచేత వ్రణములయందలి బాధలు నివర్తించును. పూయాదిస్రావము నిలచును. దుర్గంధము నివర్తించును. వ్రణముల నాశ్రయించిన క్రిములు నశించును. కఠినముగ నుండు వ్రణములు మృదువుగను, మృదువుగ నుండు వ్రణములు కఠినముగ నగును.

## 32. వ్రణకాఠిన్య-మార్దవకరఉన్మర్దన (లేపము.)

మూ. లోధ్రన్యగ్రోధశుఙ్గాని ఖదిరస్త్రిఫలాఘృతమ్. 110
ప్రలేపో వ్రణకాఠిన్యసౌకుమార్యప్రసాధకః,

వ్యా. లొద్దుగచెక్క, మఱ్ఱియూడలు, చండ్రచేవ, త్రిఫలములు, వీనిని చూర్ణముచేసి వ్రణములపై పూసి మర్దనము చేసినయెడ కఠినముగ నుండు వ్రణములు, మృదువుగను, మెత్తగనుండు వ్రణములు కఠినముగను అగును.

## 33. వ్రణమార్దవకర ఉన్మర్దన(లేప)ము.

మూ. సరుజః కఠినాః స్తబ్ధాః నిరాస్రావాశ్చ యే వ్రణాః 111
యవచూర్ణైస్ససర్పిష్కైర్బహుశస్తాన్ప్రలేపయేత్,

వ్యా. మిక్కిలి బాధతోఁగూడి స్తంభించి కఠినములై పూయాదుల స్రవించక యుండు వ్రణములకు యవలపిండిని నేతిలోఁ కలిపి పలుమారు పూయుచుండవలయును.

వ్రణతర్పణాలేపము.

మూ. ముద్గషష్టికశాలీనాం పాయసైర్వా యథాక్రమమ్. 112
సఘృతైర్జీవనీయైర్వా తర్పయేత్తానభీక్ష్ణశః,

వ్యా. మరియుఁ పైఁజెప్పిన పరిస్థితి నుండు వ్రణములకు పెసలు, అరువదినాళ్ల సంబావుబియ్యము రాజనంపుబియ్యము, వీనిని చేర్చి పాయసము చేసి యీపాయసమున ఘృతమును చేర్చి పలుమారు పూయుచుండవలయును, లేక జీవనీయగణద్రవ్యములను నూరి నేతిలోఁ కలిపి తర్పణమునకై పట్టువేయనగును.

34. త్వక్జననావచూర్ణము, (వ్రణములపై చర్మమును కల్గించుచూర్ణము.)

మూ. కకుభోదుమ్బరాశ్వత్థలోధ్రజామ్బవకట్ఫలైః. 113
త్వచమాశ్వేవ గృహ్ణన్తి త్వక్చూర్ణైశ్చూర్ణితా వ్రణాః,

వ్యా. మద్ది, అత్తి, రావి, లొద్దుగు, నేరేడు, టేకు, అనునీచెట్లయొక్క పైపట్టను, మెత్తని చూర్ణముగ జేసి, శుద్ధమైన వ్రణములపై చల్లినయెడ నతిశీఘ్రముగ వ్రణములపై చూర్ణము కరిగి శీఘ్రముగ మానును.

వ్రణములకు చర్మకరచూర్ణలేపము.

మూ. మనశ్శిలాలమఞ్జిష్ఠాలాక్షా చ రజనీద్వయమ్. 114
ప్రలేపస్సఘృతక్షౌద్రస్త్వగ్విశుద్ధికరః పరః,

వ్యా. మణిశిల, హరిదళము, మంజిష్ఠి, లక్క, పసుపు, మ్రానిపసుపు, వీనినన్నిటిని చూర్ణముచేసి నేతిని తేనెను కలిపి వ్రణములపై పూసిన చర్మమునందలి దోషములు నివర్తించి క్రొత్తచర్మమును కల్గించును.

35. సవర్ణకరచూర్ణలేపము.

మూ. అయోరజస్సకాసీసత్రిఫలాకుసుమాని చ. 115
కరోతి లేపః కృష్ణత్వం సద్య ఏవ నవత్వచి,

వ్యా. ఇనుపరాపొడి, కాసీసము (అన్నబేది) త్రిఫలాకుసుమములు (కరక-తాని-ఉసిరికచెట్లయొక్క పువ్వులు), వీనిని చూర్ణము చేసి నేతియందైనను, తేనెయందైనను, కలిపి వ్రణముపై పూసినయెడ అప్పుడే క్రొత్తగ పుట్టుచుండు చర్మము తెలుపును వదలి నల్లబడును.

### సవర్ణకరచూర్ణలేపము రెండవది.

మూ. కాలీయకనతామ్రాస్థిహేమకాలారసోత్తమైః 116
లేపస్సగోమయరసః సవర్ణీకరణః పరః,

వ్యా. మ్రానిపసుపు, గ్రంథితగరము, మామిడిపప్పు, మంజిష్ఠ, పాదరసము, వీని నన్నిటిని కూర్చి చూర్ణముచేసి ఆవుపేడరసములో కలిపి వ్రణములపై పూసిన వ్రణము నందలి మచ్చ మాసి, శరీరముతో సమానమైన వర్ణము కల్గును.

### సవర్ణకరచూర్ణలేపము మూడవది.

మూ. ధ్యామకాశ్వత్థనిచులమూలం లాక్షా సగైరికా. 117
సహేమశ్చామృతాసజ్జః కాసీసం చేతి వర్ణకృత్,

వ్యా. కామంచిగడ్డి, రావి, ప్రబ్బలివేరు, లక్క, కావిరాయి, నాగకేసరములు, మైలుతుత్తము, అన్నభేది వీనిని నూరి లేపనము చేసిన వ్రణముచే కల్గినమచ్చ శరీరముతో సమానమైన వర్ణము కల్గియుండును.

### 36. లోమముల మొలిపించు అవచూర్ణనము.

మూ. చతుష్పదానాం త్వగ్లోమఖురశృఙ్గాస్థిభస్మనా. 118
తైలాక్తా చూర్ణితా భూమిర్భవేల్లోమవతీ పునః,

వ్యా. నాలుగుకాళ్లుగలజంతువులయొక్క చర్మమును, వెండ్రుకలను, గిట్టలను, కొమ్ములను, నిప్పున కాల్చి బూడిదచేసి యాభస్మమును నువ్వులనూనెలో కలిపి మానిన వ్రణముయొక్క మచ్చపై పూసినను, లేక చూర్ణమును పూసినను మచ్చపైని వెండ్రుకలు మరల మొలచును.

(వ్రణావచూర్ణనమన వ్రణముపై చూర్ణము నుపయోగించు చికిత్స. ఇయ్యది త్వగ్జననము (క్రొత్తచర్మమును కల్గించునది), వర్ణకరము (వ్రణములేచిన స్థలమున శరీర సమవర్ణమును కల్గించునది), లోమజననము. (మచ్చలపై రోమముల గల్గించునది), నని మూడువిధములు. ఇవి "వ్రణావచూర్ణనం వర్ణ్యం రోపణం లోమరోహణమ్" (౪-౨ శ్లో) అనువాక్యముచే మూడుచికిత్సలుగ నిర్దేశింపబడినవి).

### వ్రణోపద్రవచికిత్సావిధి.

మూ. షోడశోపద్రవా యే చ వ్రణానాం పరికీర్తితాః. 119
తేషాం చికిత్సా నిర్దిష్టాః యథాస్వం స్వే చికిత్సితే,

వ్యా. వ్రణముల కుపద్రవములైన విసర్పము మున్నగు పదునారింటికిని నాయా వ్యాధినుద్దేశించి ఆయాచికిత్సాభాగమునందు చెప్పబడిన వానివాని చికిత్సలనే చేసి శాంతింప చేయనగును. (ఇత్తెరంగున నిర్దేశక్రమానుసారముగ ముప్పదియారువిధములైన వ్రణచికిత్సలు వరుసగ జెప్పబడినవి).

## అధ్యాయవిషయసంగ్రహము.

తత్ర శ్లోకాః—

మూ. ద్వౌ వ్రణౌ వ్రణభేదాశ్చ పరీక్షా దుష్టిరేవ చ. 120
స్థానాని గన్ధాః స్రావాశ్చ సోపసర్గాః క్రియాశ్చ యాః,
వ్రణాధికారే సప్రశ్న మేతన్నవకముక్తవాన్,
మునిర్వ్యాససమాసాభ్యాం అగ్నివేశాయ ధీమతే. 121

వ్యా. రెండువిధములగు వ్రణములు, ఆరెండిటి యవాంతరభేదములు, పరీక్షాక్రమము, వ్రణములకు సంబంధించిన దోషములు, వ్రణములు జనించుస్థానములు, వాని గంధవిశేషములు, స్రావభేదములు, ఉపద్రవములు, చికిత్సలు అను నీతొమ్మిదివిషయములను వ్రణము నధికరించి చెప్పబడిన యీచికిత్సాధ్యాయమున సంగ్రహరూపముగను విస్తరరూపముగను ఆత్రేయులు అగ్నివేశున కుపదేశించెను.

## అధ్యాయసమాప్తి.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే,
దృఢబలసంపూరితే చికిత్సాస్థానే ద్వివ్రణీయచికిత్సితం నామ
పఞ్చవింశోఽధ్యాయః.

వ్యా. ఇత్తెరంగున అగ్నివేశకృతంబును చరకప్రతిసంస్కృతంబును నగు చరకసంహితయను ఆయుర్వేదతంత్రమునందలి చికిత్సాస్థానమున దృఢబలసంపూరితభాగమున ద్వివ్రణీయచికిత్సితమనునది యిరువదియైదవ యధ్యాయము.

---

# షడ్వింశాధ్యాయము.

అవతరణిక:—ద్విసంఖ్యావశిష్టమైన నిజాగంతు వ్రణరోగములచికిత్సల చెప్పు ద్వివ్రణీయ చికిత్సితాధ్యాయమును చెప్పినపిదప సంఖ్యాసాజాత్యమును బట్టి శిరో-వస్తి-హృదయమర్మముల మూడిటికి సంబంధించినరోగములకు జేరిన చికిత్సల వివరింపబడును. (ఈయధ్యాయముల పౌర్వాపర్యమునకు రోగములసంఖ్యాక్రమము కారణము.)

## త్రిమర్మీయాధ్యాయప్రారంభము.

మూ. అథాతస్త్రిమర్మీయచికిత్సితం వ్యాఖ్యాస్యామః. 1
ఇతి హ స్మాహ భగవానాత్రేయః. 2

వ్యా. ద్వివ్రణీయచికిత్సితమును జెప్పినపిదప శిరస్సు, వస్తి, హృదయము, అను నీమూడు మర్మములయందు సంభవించు రోగములకు దగినచికిత్సల బోధించు త్రిమర్మీయచికిత్సితాధ్యాయమును వివరించి చెప్పెదనని యర్థము. (ఇచ్చట "త్రిమర్మీయ రోగానధికృత్య కృతం చికిత్సితం త్రిమర్మీయచికిత్సితం" అనువిగ్రహముచేత మూడు మర్మములయందు సంభవించు రోగములచికిత్స నధికరించి చెప్పబడు అధ్యాయము త్రిమర్మీయచికిత్సితమని యధ్యాయసంజ్ఞ నెరుంగునది.)

## వస్తి-హృదయ-శిరస్సులను మర్మములప్రాధాన్యము.

మూ. సప్తోత్తరం మర్మశతం యదుక్తం శరీరసంఖ్యామధికృత్య తేభ్యః,
మర్మాణి వస్తిం హృదయం శిరశ్చ ప్రధానభూతాని వదన్తి తజ్జ్ఞాః.
ప్రాణాశ్రయాత్ (౬) తాని హి పీడయన్తో
వాతాదయోఽసూనపి పీడయన్తి,
తత్సంశ్రితానామనుపాలనార్థం
మహాగదానాం శృణు సౌమ్య! రక్షామ్. 4

వ్యా. శరీరసంఖ్య శరీరమున శరీరవిభాగముల వివరించునప్పుడు ఆవివరణము వలన నేర్పడిన నూటయేడు మర్మములలో వస్తి, హృదయము, శిరస్సు, అను మూడు మర్మములును ప్రాణములకు ఆశ్రయము లైయుండుటవలన ప్రధానములని మర్మముల జక్కగ దెలిసిన వైద్యవరులు చెప్పెదరు. ప్రాణముల కాశ్రయములైన యామర్మముల మూటిని ప్రకుపితములగు వాతపిత్తకఫములు బాధించినచో వాని నాశ్రయించిన ప్రాణములకూడ బాధించును. (లోకమున నొక గోడకు శైథిల్యము కల్గినప్పుడు ఆగోడపై వ్రాయబడియుండు చిత్రపు ప్రతిమకును హాని కల్గును కదా; ఆతీరుననే ప్రాణముల కాశ్రయములైన వస్తి మున్నగు మర్మములకు వాతాదిదోషములవలన బాధ సంభవించి నపుడు వానినాధారముగ జేసికొనియుండు ప్రాణములకును హాని సంభవించునని భావము.)

కావున ప్రాణముల కాధారములును గొప్పవ్యాధులకు ఆశ్రయములును నగు వస్త్యాదిమర్మముల మూడిటిని (రోగముల బారిపడనీయక) కాపాడువిధమును జెప్పెద వినుమని యర్థము.

మర్మత్రయప్రాధాన్యము నీతంత్రకారులు త్రిమర్మీయసిద్ధియందు ట్లుపదేశించిరి:—"సప్తోత్తరం మర్మశతం అస్మిన్ శరీరే స్కంధ శాఖాశ్రితమగ్నివేశ......తత్ర శాఖాశ్రితేభ్యో మర్మభ్యః స్కంధాశ్రితాని గరీయాంసి శాఖానాం తదాశ్రితత్వాత్, స్కంధాశ్రితేభ్యోఽపి హృద్వస్తిశిరాంసి, తన్మూలత్వాచ్ఛరీరస్య" (సిద్ధి. అ. ౯)

ఇచ్చట 'మహాగదానాం' అనుచోట 'మహాన్తః గదాః యేషు తే' అను విగ్రహముచేత గొప్పవ్యాధుల కాశ్రయములైన మర్మము లనియర్థము. లేక 'తత్సంశ్రితానాం, అనుపాలనార్థమ్' "వస్త్యాది మర్మముల నాశ్రయించి యందు ప్రాణముల కాపాడుటకై", 'మహాగదానాం రక్షాం' "వస్త్యాదుల నాశ్రయించి సంభవించు విసర్పము మున్నగు గొప్పవ్యాధులయొక్క చికిత్సను వినుము" అనియైన నన్వయించవచ్చును. ఈయన్వయమున రక్షాపదమునకు చికిత్సయని యర్థము.

### వస్తిమర్మమునాశ్రయించి కల్గువ్యాధులలో ఉదావర్తనిదాన-సంప్రాప్తులు.

మూ. కషాయతిక్తోషణరూక్షభోజ్యైః
సన్ధారణాఽభోజన(ణోదీరణ)మైథునైశ్చ,
పక్వాశయే కుప్యతి చేదపానః
స్రోతాంస్యధోగాని బలీ స రుద్ధ్వా. 5
కరోతి విణ్మారుతమూత్రసఙ్గం
క్రమాదుదావర్తమతస్సుఘోరమ్,

వ్యా. కషాయ-తిక్త-కటురసములును రూక్షంబులు నగు పదార్థముల భుజించినను, మలమూత్రాదివేగముల నిరోధించినను, భోజనముచేయక యుపవాసమున్నను, అధికముగ స్త్రీసంభోగము చేసినను పక్వాశయమునందలి యపానవాతము ప్రకోపము నొందును. అట్టియెడ ప్రబలమైన వాతము శరీరమునందలి నాభికి క్రిందిభాగమున నుండు స్రోతోమార్గముల నడ్డగించి పురీషమును అపానవాతమును మూత్రమును బైట వెడలనీయక నిరోధించును. దానంజేసి వెంటనే మిగుల క్రూరమైన యుదావర్తమును కల్గించును.

ఇచ్చట కషాయతిక్తాదులచే నపానవాతము దుష్టమై దానివలననే అపానవాతము బైట వెడలకుండునని "మారుతమూత్రసంగం" అని చెప్పబడినది. మనోనిగ్రహమునకు మనస్సే కారణమైనవిధమున అపానవాతము దుష్టమై తనకు తానే బైటవెడలకుండును. కావున వాతసంగమునకు దుష్టవాతమే కారణమగునని యెరుంగునది.

### ఉదావర్తలక్షణము.

మూ. రుక్ వస్తిహృత్కుక్ష్యుదరేష్వభీక్ష్ణం
సపృష్ఠపార్శ్వేష్వతిదారుణా స్యాత్. 6

ఆధ్మానహృల్లాసవికర్తికాశ్చ
తోదోఽవిపాకశ్చ సవస్తిశోథః,
వర్చోఽప్రవృత్తిః జఠరే చ గణ్డా
న్యూర్ధ్వంచ వాయుర్విహతో గుదే స్యాత్. 7
కృచ్ఛ్రేణ శుక్రస్య చిరాత్ప్రవృత్తిః
స్యాద్వా తనుస్స్యాత్ ఖరరూక్షశీతా,

వ్యా. వస్తియందును, హృదయమునందును, కుక్షియందును, ఉదరమునందును, వీపునందును, ఇరుప్రక్కలయందును, మిక్కిలి క్రూరమైన నొప్పి యెడలేక కల్గుట, కడుపుబ్బరము, హృల్లాసము (ఓకరింతలు), కర్తరిచే కత్తిరించినవిధముగ బాధ, పోటు, అజీర్ణము, వస్తియందువాపు, ఇవి యన్నియు నుదావర్తమున కల్గును. మరియు మలము బైటవెడలదు, ఉదరముపై గ్రంథులు కల్గును. అపానవాతము గుదస్థానమునం దడ్డగింపబడి పైకి వ్యాపించును. అట్టియెడ శుక్రము చాలకాలమునకు మిగుల కష్టనుచే వెడలును లేక మిక్కిలి రూక్షముగను కఠినముగను రూక్షముగను శీతముగను మిగుల స్వల్పముగను వెడలును.

### ఉదావర్తమున కల్గురోగములు.

మూ. తతశ్చ రోగాః జ్వరమూత్రకృచ్ఛ్ర
ప్రవాహికాహృద్గ్రహణీప్రదోషాః. 8
వమ్యాన్ధ్యబాధిర్యశిరోఽభితాప
వాతోదరాఽష్ఠీలమనోవికారాః,
తృష్ణాఽస్రపిత్తాఽరుచిగుల్మకాస
శ్వాసప్రతిశ్యార్దితపార్శ్వరోగాః. 9
అన్యే చ రోగాః బహవోఽనిలోత్థాః
భవన్త్యుదావర్తకృతాస్సుఘోరాః,

వ్యా. పైజెప్పిన యుదావర్తమువలన జ్వరము, మూత్రకృచ్ఛ్రము, ప్రవాహిక, రొమ్మునొప్పి, గ్రహణీదోషము, వాంతి, అంధత్వము, చెవుడు, తలమంట, వాతోదరము, అష్ఠీల యనువాతరోగము, మనోవికారము, దప్పి, రక్తపిత్తము, అరుచి, గుల్మము, కాస శ్వాసములు, పీనసము, అర్దితవాతము, ప్రక్కశూల, ఈరోగంబులును, వాతముచే గల్గిన యితరక్రూరరోగము లనేకములును సంభవించును.

### ఉదావర్త చికిత్సాక్రమము.

మూ. చికిత్సితం చాస్య యథావదూర్ధ్వం
ప్రవక్ష్యతే తచ్ఛృణు చాగ్నివేశ!. 10
తం తైలశీతజ్వరనాశనాక్తం
స్వేదైర్యథోక్తైః ప్రవిలీనదోషం,
ఉపాచరేత్ వర్తి-నిరూహవస్తి-
స్నేహైః విరేకైరనులోమనాన్నైః. 11

వ్యా. ఉదావర్తరోగముచే పీడింపబడినరోగికి శీతజ్వరహరమగు అగుర్వాది తైలమును బూసి, శీతజ్వరహరములగు స్వేదవిధులను చేసి, దోషములు మార్దవమునొందిన పిదప ఫలవర్తులను, నిరూహవస్తులను, స్నేహములను, విరేచనవిధులను చేసి; వాతమును అనులోమముగ జేయు నన్నపానములచే నుపచరించవలెను.

### ఉదావర్తమున ఫలవర్తివిధానము.

మూ. శ్యామాత్రివృన్మాగధికాం సదన్తీం
గోమూత్రపిష్టాం దశభాగమాషాం,
సనీలికాం ద్విర్లవణాం గుడేన
వర్తిం కరాఙ్గుష్ఠనిభాం విదధ్యాత్. 12
పిణ్యాకసౌవర్చలహిఙ్గుభిర్వా
ససర్షపత్ర్యూషణయావశూకైః,
క్రిమిఘ్నకమ్పిల్లకశఙ్ఖినీభిః
సుధాఽర్కజక్షీరగుడైర్యుతాభిః. 13
స్యాత్పిప్పలీసర్షపరాఢవేశ్మ
ధూమైః సగోమూత్రగుడైశ్చ వర్తిః,
శ్యామాఫలాఽలాబుకపిప్పలీనాం
నాడ్యాఽథవా తత్ ప్రధమేత్తు చూర్ణమ్. 14

వ్యా. నల్లతెగడ, తెల్లతెగడ, పిప్పళ్లు, నేపాళపుగింజలు (లేక వేళ్లు), నీలివేళ్లు, వీనిని ఒక్కొకభాగమువంతునను, పది భాగములు ఉద్దులను, రెండుభాగములు సైంధవ లవణమును గూర్చి గోమూత్రమును బోసి మెత్తగనూరి అందు యథోచితము బెల్లమును

కూడ కలిపి చేతిబొటనవ్రేలంతలావు కల్గియుండునట్లు వర్తిని (కణికను) చేయనగును. మరియు నువ్వులపిండి, సౌవర్చలలవణము, ఇంగువ, ఆవాలు, త్రికటుకములు, యవక్షారము,వీనిని సమభాగములుగ గ్రహించి నూరి వర్తిచేయుట కనుకూలముగ నుండునంత బెల్లమును ఉద్దులను చేర్చి నూర్చి వర్తిని చేసి యుపయోగింపనగును. లేక వాయువిడంగములు, కంపిల్లకము, శంఖపుష్పి, వీనిని జెముడుపాలను జిల్లేడుపాలను బోసి నూరి బెల్లమును కలిపి వర్తిని చేసి యుపయోగింపనగును. లేక పిప్పళ్లు ఆవాలు, మ్రంగకాయ, కరిదూపము, వీని నన్నిటిని గోమూత్రమున నూరి బెల్లమును కలిపి వర్తిచేసి యుపయోగించవలెను. లేక నల్లతెగడ, మ్రంగకాయలు, చేదుసొర, పిప్పళ్లు వీని నన్నిటిని చూర్ణము చేసి గొట్టముతో గుదద్వారమునుండి లోనికి బోవునట్లు ఊది ప్రయోగించవలెను.

### ఫలవర్తిప్రయోగము.

మూ. రక్షోఘ్నతుమ్బ్యాకరహాటకృష్ణాచూర్ణం సజీమూతకసైన్ధవం వా,
స్నిగ్ధే గుదే తాన్యనులోమయన్తి నరస్యవర్చోఽనిలమూత్రసఙ్గమ్.

వ్యా. ఆవాలు, చేదుసొర, మ్రంగకాయ, పిప్పళ్లు, చేదుబీర, సైంధవలవణము, వీని నన్నిటిని, సమభాగములుగగూర్చి చూర్ణముచేసి గుదమున స్నేహద్రవ్యమును బూసి గొట్టమున నునిచి గుదద్వారమునుండి లోనికి బోవునట్లు ఊదవలెను.

ఇచ్చట పైజెప్పిన యోగముల ప్రకారము వర్తిని (కణికను) బొటనవ్రేలిలావు కల్గియుండునట్లు సిద్ధముచేసికొని, గుదద్వారమున ఆముదము మున్నగు తైలమును బూసి పైజెప్పిన వర్తిని గుదద్వారమునుండి యెక్కించవలెను. అత్తెరంగుననే పైజెప్పబడిన చూర్ణముల రెంటిని గుదద్వారమునుండి లోనికి పోవునట్లు గొట్టముమూలముగ నూది ప్రయోగించవలెను. ఇదియే ఫలవర్తిప్రయోగమని చెప్పబడును. దీనిప్రయోగమువలన వాతము అనులోమగతి నొందును. దానంజేసి మల-మూత్రవాతములు బద్ధకము వదలి సరళముగ వెడలును. ఈఫలవర్తివిధానము పరిభాషయం దిట్లు చెప్పబడినది:—"ఘృతాభ్యక్తే గుదే క్షిప్తా శ్లక్ష్ణా స్యాదఙ్గుష్ఠసన్నిభా, మలప్రవర్తినీ వర్తిః ఫలవర్తిశ్చ సా స్మృతా."

### ఉదావర్తమున నిరూహవస్తిప్రయోగము.

మూ. తేషాం విఘాతే తు భిషగ్విదధ్యాత్
స్వభ్యక్తసుస్విన్నతనోర్నిరూహమ్,
ఊర్ధ్వానులోమౌషధమూత్రతైల
క్షారామ్లవాతఘ్నయుతం సుతీక్ష్ణమ్. 16

వాతేఽధికేఽమ్లం లవణం సతైలం
క్షీరేణ పిత్తే తు కఫే సమూత్రం,
స మూత్రవర్చోఽనిలసఙ్గమాశు
గుదం సిరాశ్చ ప్రగుణీకరోతి. 17

వ్యా. పైజెప్పబడిన వర్తిప్రయోగముచే నుదావర్తము శమించి మలమూత్రాది బంధకము నివర్తించకున్నయెడ రోగికి తొలుత నభ్యంజనమును చేయించి స్వేదవిధిచేసి, ఊర్ధ్వముగనుండు దోషముల ననులోమముగ జేయునట్టి స్వభావముకల ఔషధములను, మూత్రములను, తైలములను, క్షారములను, అమ్లరసద్రవ్యములను, వాతహరౌషధములను చేర్చి, మిక్కిలి తీక్ష్ణమైన నిరూహవస్తిని ప్రయోగించవలెను.

అందు వాతమధికముగ నున్నయెడ అమ్లలవణములతో కూడిన తైలమును చేర్చియు, పిత్త మధికముగ నున్నయెడ ఆవుపాలచేతను, కఫమధికముగ నున్నయెడ గోమూత్రమును చేర్చియు నిరూహవస్తిని ప్రయోగించవలెను. నిరూహవస్తి మలమూత్రవాతముల బద్ధకమును వెంటనే వదలించి, గుదమును దాని నాశ్రయించిన సిరలను నిర్దుష్టములుగ జేయును

## ఉదావర్తమునం దన్నపానవిధి.

మూ. త్రివృత్సుధాపత్రతిలాదిశాక
గ్రామ్యౌదకానూపరసైర్యవాన్నం,
అన్యైశ్చ సృష్టాఽనిలమూత్రవిడ్భిః
అద్యాత్ ప్రసన్నాగుడశీధుపాయీ. 18

వ్యా. ఉదావర్తరోగి తెగడఆకు, జెముడాకు, నువ్వులు మున్నగువానిశాకములతోడను, గ్రామ్య-ఔదక-ఆనూపజంతువులమాంసరసముతోడను యవాన్నమును భుజింపవలెను. మరియు వాతమూత్రపురీషములను వెడలింపజేయు నితరపదార్థములతో గూడ యవాన్నమును భుజింపవలెను. దప్పి యెత్తినయెడ మద్యము పైతేటనైనను, బెల్లముచే సిద్ధముచేయబడిన శీధుమద్యమునైనను అన్నమున కనుపానముగ త్రాగవలెను.

## ఉదావర్తమున విరేచనవిధి.

మూ. భూయోఽనుబద్ధే తు భవేద్విరేచ్యః
మూత్రప్రసన్నాదధిమణ్డశుక్తైః,

స్వస్థం తు పశ్చాదనువాసయేత్తం
రౌక్ష్యాద్ధి సజ్గోఽనిలవర్చసోశ్చేత్ 19

వ్యా. పైజెప్పినవిధముగ నిరూహవస్తి ప్రయోగము చేసినను ఉదావర్తము శమింపక అనుసరించియే యున్నయెడ గోమూత్రముతో నైనను సురామద్యము పైతేటతో నైనను పెరుగుమీది తేటతో నైనను శుక్తముతో నైనను విరేచనౌషధమును కలిపి త్రాగించి విరేచనము చేయించవలెను. పిమ్మట స్వస్థతనుండుసమయమున నొకవేళ రూక్షత వలన వాతపురీషములు బద్ధగించి యున్నయెడ అనువాసనవస్తిని ప్రయోగించవలెను.

ఇచ్చట నిరూహవస్తిని చేసినవెంటనే విరేచనము చేయించనియెడ కోష్ఠము శూన్యముగ నుండుటంజేసి శరీరమును కృశింపజేయును, కావున నిరూహవస్తిని చేసిన పిదప నేడుదినములు పథ్యాహారమును చేయుచుండి, పిమ్మట విరేచనము చేయించవలెను. విరేచనమునకు పిమ్మట వస్తిప్రయోగమునకు నిదియే నియమము. ఈవిషయమును సిద్ధిస్థానమున నీతంత్రకారు లిట్లుపదేశించిరి:—"నరో విరిక్తస్తు నిరూహదానం వివర్జయేత్ సప్తదినాన్యవశ్యమ్, శుద్ధో నిరూహేణ విరేచనం చ, తద్ధ్యస్య శూన్యం వికషేచ్ఛరీరమ్." (సిద్ధి. అ. ౧ శ్లో. ౨౬).

## ఉదావర్తాదిహరహింగ్వాదిచూర్ణపానము.

మూ. ద్విరుత్తరం హిఙ్గువచాగ్నికుష్ఠం (వచాసకుష్ఠం)
సువర్చికా చైవ విడఙ్గచూర్ణం,
సుఖామ్బునాఽనాహవిషూచికార్తి (విలమ్బికార్శో)
హృద్రోగగుల్మోర్ధ్వసమీరణఘ్నమ్. 20

వ్యా. ఇంగువ, వస, చిత్రమూలము, చెంగల్వకోష్టు, స్వర్జక్షారము, వాయువిడంగములు, వీనిని ఒకటికన్నొకటి ద్విగుణితముగ (రెండేసిభాగములుగ) నుండునట్లు భాగముల గల్పించి చేర్చి చూర్ణము చేసి సుఖోష్ణముగ నుండుజలమున కలిపి త్రాగిన విషూచిక, (అర్శోరోగము), హృద్రోగము, గుల్మము, ఉదావర్తము, అనుసిరోగముల నన్నిటిని హరించును.

## వచాదిచూర్ణము.

మూ. వచాఽభయాచిత్రకయావశూకాః
సపిప్పలీకాఽతివిషాః సకుష్ఠాః,

ఉష్ణాఽమ్బునానాహవిమూఢవాతో
పీత్వా జయేదాశు రసౌదనాశీ. 21

వ్యా. వస, కరకకాయలబెరడు, చిత్రమూలము పట్ట, యవక్షారము, పిప్పళ్లు, అతివస, చెంగల్వకోష్టు, వీనిని సమభాగములుగ గూర్చి చూర్ణముచేసి వేడినీళ్లలో కలిపి త్రాగి మాంసరసముతో నన్నమును భుజించినయెడ కడుపుబ్బరము, మూఢవాతము శమించును.

## హింగూగ్రగంధాదిచూర్ణము.

మూ. హిఙ్గూగ్రగన్ధాబిడశుణ్ఠ్యజాజీ హరీతకీపుష్కరమూలకుష్ఠం,
యథోత్తరం భాగవివృద్ధమేతత్ప్లీహోదరాజీర్ణవిషూచికాసు. 22

వ్యా. ఇంగువ ఒకభాగము, ఓమము రెండుభాగములు, బిడాలవణము మూడు భాగములు, శుంఠి నాలుగుభాగములు, జీలకఱ్ఱ అయిదుభాగములు, కరకకాయల బెరడు ఆరుభాగములు, పుష్కరమూలము ఏడుభాగములు, చెంగల్వకోష్టు ఎనిమిది భాగములు, వీనినన్నిటిని పైజెప్పినభాగములు ప్రకారము చేర్చి చూర్ణముచేసి సుఖోష్ణ జలమున కలిపి త్రాగినచో ప్లీహవృద్ధి, ఉదరరోగము, అజీర్ణము, విషూచికా అనునీరోగములు శమించును.

## ఉదావర్తహరలఘుపంచమూలాదిఘృతము.

మూ. స్థిరాదివర్గస్య పునర్నవాయాః
శమ్పాకపూతీకకరఞ్జయోశ్చ,
సిద్ధః కషాయే ద్విపలాంశికానాం
ప్రస్థో ఘృతాత్ స్యాత్ ప్రతిరుద్ధవాతే. 23

వ్యా. హ్రస్వపంచమూలములు, (ముయ్యాకుపొన్న, కోలపొన్న, వాకుడు, పెద్ద ములక, పల్లేరు) గలిజేరు, రేల, పూతీకకరంజము, (దుర్గంధముతో కూడిన కానుగ), వీనిని ప్రత్యేకము రెండేసిపలముల వంతున గూర్చి కషాయము కాచి అందు ప్రస్థపరిమితము ఘృతమును చేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి యాఘృతమును అపానవాతము బంధింపబడినపుడు సేవించినయెడ బాధ నివర్తించును.

## ఆనాహహరపంచలవణచూర్ణోపయోగము.

మూ. ఫలం చ మూలం చ విరేచనోక్తం
హిఙ్గ్వర్కమూలం దశమూలమగ్ర్యం,

స్నుక్చిత్రకశ్చైవ పునర్నవా చ
తుల్యాని, సర్వైర్లవణాని పఞ్చ. 24
స్నేహైస్సమూత్రైస్సహ జర్జరాణి
శరావసన్ధౌ విపచేత్సులిప్తే,
పక్వం సుపిష్టం లవణం తదన్నైః
పానైస్తథాఽఽనాహరుజాఘ్నమద్యాత్. 25

వ్యా. విరేచనప్రస్తావమున చెప్పబడిన విరేచనకరములగు ఫలములు, మూలములును, ఇంగువ, జిల్లేడువేళ్లు, దశమూలములు, జెముడు, చిత్రమూలము, గలిజేరు, వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి వీని నన్నిటికి సమభాగముగ పంచలవణములను చేర్చునది. పైజెప్పిన ద్రవ్యములను చేర్చి అందు ఘృతము మున్నగు స్నేహములను, గోమూత్రమును కలిపి నూరి పెళ్లచేసి యొకశరావమున నునిచి వేరొకశరావముచే మూతమూసి సంధికి చీలమన్ను లేపనముచేసి పుటమువేయునది. పక్వమైన యాలవణమును చూర్ణము చేసి యన్నపానములయందు చేర్చి భుజించినయెడ కడుపుబ్బరంబును, ఉదావర్తమున గల్గు బాధలును నివర్తించును. ఇచ్చట దశమూలములు స్థలాంతరమున వివరింపబడినది.

ఇచ్చట దీర్ఘంజీవితీయాధ్యాయమున "హస్తిదన్తీ హైమవతీ... ప్రయోజ్యాస్తా విరేచనే" అని చెప్పబడిన విరేచనకరములగు మూలములును, "శంఖిన్యతవిడఙ్గాని... తాన్యుక్తాని విరేచనే...ఫలాన్యేకోనవింశతిః" (చ. సూ. అ. శ్లో. ౭౭-౮౫) అని చెప్పబడిన విరేచనకరఫలంబులును, "ఫలం చ మూలం చ విరేచనోక్తం" అనువాక్యముచే యథాసంభవముగ గ్రహింపదగును. లేక కల్పస్థానమున విరేచనయోగములయందు చెప్పబడిన ఫలమూలములైనను గ్రహింపనగును.

## ఆనాహలక్షణము, చికిత్స.

మూ. హృత్స్తంభమూర్ధామయగౌరవాభ్యాం ఉద్గారసఙ్గేన సపీనసేన,
ఆనాహమామప్రభవం జయేత్తు ప్రచ్ఛర్దనైః లఙ్ఘనపాచనైశ్చ. 26

వ్యా. హృదయము స్తంభించియుండుట, తలనొప్పి మున్నగు శిరోవ్యాధులు, శరీరమంతయు బరువుగనుండుట, త్రేనుపులు ధారాళముగ వెడలక యడ్డుపడుట, పడిశము, ఈలక్షణములు కల్గి యామదోషమువలన ఆనాహము సంభవించును. వానికి వమనములచేతను, లంఘనముచేతను, పాచనౌషధములచేతను, చికిత్సచేయవలయును. (ఇచ్చట నుదావర్తమే హేతులక్షణవిశేషములచే నానాహమని చెప్పబడును.)

ఉదావర్తగుల్మాదులయం దేరండతైలోపక్రమము.

మూ. గుల్మోదరబ్రధ్నార్శః ప్లీహోదావర్తయోనిశుక్రగదే,
మేదః కఫసంసృష్టే మారుతరక్తేఽవగాఢే చ 27
గృధ్రసి పక్షవధాదిషు విరేచనార్హేషు వాతరోగేషు,
వాతే విబద్ధమార్గే మేదః కఫపిత్తరక్తేన. 28
పయసా మాంసరసైర్వా త్రిఫలారసయూషమూత్రమదిరాభిః,
దోషానుబన్ధయోగాత్ ప్రశస్తమేరణ్డజం తైలమ్ 29

వ్యా. గుల్మము, ఉదరము, బ్రధ్నము (గజ్జలలోని నరము వాచురోగము), అర్శస్సు, ప్లీహము, ఉదావర్తము, యోనిరోగములు, శుక్రరోగములు, మేదస్సుతోడను కఫముతోడను కూడిన వాతరక్తము, గంభీరవాతరక్తము, గృధ్రసీవాతము పక్షవధము మున్నగు విరేచనముల కర్హములయిన వాతరోగములు, ఈరోగములయందును; మేదస్సు చేతను కఫముచేతను పిత్తరక్తములచేతను వాతసంచారమార్గ మడ్డగింపబడినప్పుడును, ఆముదమును పాలతోనైనను, మాంసరసములతోనైనను, త్రిఫలాకషాయముతోనైనను, యూషములతోనైనను, గోమూత్రముతోనైనను, మదిరయను మద్యముతో నైనను, కూర్చి, ఆయాదోషానుబంధము ననుసరించి యుక్తియుక్తముగ నుపయోగించుట చాల ప్రశస్తము.

ఏరండతైలము వాతమును హరించువిధము.

మూ. తద్వాతనుత్ స్వభావాత్ సంయోగవశాత్ విరేచనాచ్చ జయేత్
మేదోఽసృక్పిత్తకఫోన్మిశ్రాఽనిలరోగజిత్తస్మాత్. 30

వ్యా. ఆముదము స్వభావముచేతనే వాతమును హరించును. పైజెప్పబడిన పాలు మున్నగువాని సంయోగమువలనను, దానంజేసి విరేచనము లగుటంజేసియు, మేదస్సు రక్తము పిత్తము కఫము అనువానితోగూడిన వాతమును హరించును.

ఏరండతైలమాత్రనియమము.

మూ. బలకోష్ఠవ్యాధివశాత్ ఆపఞ్చపలా భవేన్మాత్రా,
మృదుకోష్ఠాఽల్పబలానాం సహభోజ్యం తత్ర యోజ్యం స్యాత్.
(ఇత్యుదావర్తచికిత్సా.)

వ్యా. మరియు రోగియొక్క బలమును కోష్ఠభేదమును వ్యాధిపరిస్థితిని గమనించి తదనుగుణముగ ఏనుపలములవరకును పరిమాణమును కల్పించి యాముదము నుపయోగింప

వలెను. మృదుకోష్ఠము కలవారికిని, అల్పబలము కలవారికిని భోజనపదార్థములతోఁ గూర్చి యుపయోగింపనగును. (ఇత్తెరంగున వస్తిమర్మము నాశ్రయించి జనించు వ్యాధులలో నుదావర్తవ్యాధిచికిత్సితము చెప్పబడినది.)

### వస్త్యాశ్రయరోగములలో మూత్రకృచ్ఛ్రములు, వానినిదానము.

మూ. వ్యాయామతీక్ష్ణౌషధరూక్షమద్య
ప్రసఙ్గనిత్యద్రుతపృష్ఠయానాత్
ఆనూపమత్స్యాఽధ్యశనాత్, అజీర్ణాత్
స్యుర్మూత్రకృచ్ఛ్రాణి నృణామిహాష్టౌ. 32

వ్యా. దేహపరిశ్రమము నధికముగ జేయుట, తీక్ష్ణములగు నౌషధములను రూక్షంబగు మద్యమును అధికముగ నెడలేక సేవించుట, ఎల్లప్పుడును అతివేగముగ పరువిడుట, గుఱ్ఱములు మున్నగు వాహనములపై నెక్కి సవారిచేయుట, ఆనూపజంతుమాంసములను, మత్స్యములను, అధికముగ తినుట; భుజించినతోడనే మరల భుజించుట, అజీర్ణకరములగు పదార్థముల భుజించుట, ఈకారణములచే మూత్రకృచ్ఛ్రములు ఎనిమిది సంభవించును.

### మూత్రకృచ్ఛ్రసంప్రాప్తి.

మూ. పృథఙ్మలాః స్వైః కుపితాః నిదానైః
సర్వేఽథ వా కోపముపేత్య వస్తౌ,
మూత్రస్య మార్గం పరిపీడయన్తి
యదా తదా మూత్రయతీహ కృచ్ఛ్రాత్. 33

వ్యా. వాతాదిదోషములు వానివానికి నిదానములుగ పైజెప్పబడిన కారణముల వేరువేరుగనైనను అన్నియు కలిసియైనను ప్రకోపము నొంది వస్తియందు (మూత్రాశయమున) జేరి మాత్రము వెడలుమార్గమును నిరోధించి బాధించినయెడ మిగుల కష్టముచే మూత్రమును వెడలించును.

### 1. వాతికమూత్రకృచ్ఛ్రలక్షణము.

మూ. తీవ్రాహిరుగ్వఙ్క్షణవస్తిమేఢ్రే
స్వల్పం ముహుర్మూత్రయతీహ వాతాత్,

వ్యా. వాతముచే జనించన మూత్రకృచ్ఛ్రమునందు గజ్జలయందును, మూత్రాశయమునందును, మేఢ్రమునందును, మిక్కిలి తీవ్రమైన నొప్పి పోటు మున్నగుబాధతోఁ గూడి మాటిమాటికి కొంచెము కొంచెముగ మూత్రము వెడలును.

## 2. పైత్తికమూత్రకృచ్ఛ్రలక్షణము.

మూ. పీతం సరక్తం సరుజం సదాహం
కృచ్ఛ్రాన్ముహుర్మూత్రయతీహ పిత్తాత్. 34

వ్యా. పిత్తముచే కల్గిన మూత్రకృచ్ఛ్రమునందు పచ్చనిరంగు కల్గి రక్తముతో కూడి తీవ్రమైన మంటయు పోటును కల్గి మిక్కిలి కష్టముచే పలుమారు మూత్రము వెడలును.

## 3. కఫజమూత్రకృచ్ఛ్రలక్షణము.

మూ. వస్తేస్సలిఙ్గస్య గురుత్వశోథౌ
మూత్రం సపిచ్ఛం కఫమూత్రకృచ్ఛ్రే,

వ్యా. కఫముచే కల్గిన మూత్రకృచ్ఛ్రమున వస్తియందును, మేఢ్రమునందును, వాపు కల్గి బరువై, మూత్రము చిక్కనై కలకబారి మిక్కిలి కష్టముతో పలుమారు వెడలును.

## 4. సాన్నిపాతికమూత్రకృచ్ఛ్రలక్షణము.

మూ. సర్వాణి రూపాణి తు సన్నిపాతా
ద్భవన్తి తత్కృచ్ఛ్రతమం హి కృచ్ఛ్రమ్. 35

వ్యా. వాతాదులకు ప్రత్యేకముగ చెప్పినకారణము లన్నిటిచే మూడుదోషములును సమకాలమున ప్రకోపమునొంది వస్తియందు చేరి వాతికాది మూత్రకృచ్ఛ్రములకు వేరువేరుగ చెప్పబడిన లక్షణము లన్నిటితో కూడి మూత్రమును మిగుల కష్టముచే వెడలించును. ఇయ్యది సాన్నిపాతికమూత్రకృచ్ఛ్రము. ఇది మిగుల కష్టసాధ్యమై యుండును.

## అశ్మరీసంప్రాప్తిః భేదములు.

మూ. విశోషయేద్వస్తిగతం సశుక్రం
మూత్రం సపిత్తం పవనః కఫం వా,
యదా తదాఽశ్మర్యుపజాయతే తు
క్రమేణ పిత్తేష్వివ రోచనా గోః. 36

వ్యా. వాతము ప్రకోపమునొంది వస్తియందు చేరి వస్తిద్వారము నడ్డగించి కేవలమూత్రమునైనను, శుక్రముతో కూడిన మూత్రమునైనను, ద్రవరూపమయిన పిత్తముతో కూడిన మూత్రమునైనను, కఫముతో కూడిన మూత్రమునైనను, (తన

యందలి శోషణస్వభావముచే) శోషింప జేయును. అట్లు శోషింపబడినమూత్రమున గోవుయొక్క పిత్తమున గోరోచనము కల్గువిధమున మూత్రమునందు కఠినమయిన యుండ కల్గును. ఇయ్యది యశ్మరి యనబడును.

ఇచ్చట నీనిర్ణయము నెరుంగునది:—ప్రకోపమునొందినవాతము, మూత్రద్వారము నడ్డగించి మూత్రమును మాత్రము శోషింపజేసినయెడ నయ్యది మూత్రాశ్మరి యనబడును. అట్టి యశ్మరీరోగము వాత-పిత్త-కఫ-శుక్ర భేదములచే నాల్గు తెరంగుల నుండును. అందు వాతము మూత్రమును మాత్రము శోషింపజేసినపుడు కల్గినది వాతాశ్మరి. ఇత్తెరంగునసే పిత్త-కఫ-శుక్రములతో వాతము వేరువేరుగ చేరి శుష్కింపజేసినపుడు కల్గునది వరుసగ పిత్త-కఫ-శుక్రాశ్మరులని చెప్పబడును. ఇత్తెరంగు అశ్మరీరోగము వాతాదిభేదములచే నాల్గు తెరంగులని యెరుంగునది.

ఈక్రమము ననుసరించియే వాగ్భటాచార్యులును ఇట్లుపదేశించెను:—"యదా వాయుర్ముఖం వస్తేః ఆవృత్య పరిశోషయేత్, మూత్రం సపిత్తం సకఫం సశుక్రం వా యదా క్రమాత్.సంజాయతేఽశ్మరీ ఘోరా పిత్తాద్గోరివ రోచనా,శ్లేష్మాశ్రయా చ సర్వా స్యాత్" (అ. హృ. ని. అ. ౯. శ్లో. ౬) ఈవాక్యముచేత పైజెప్పినరీతి వాతాదిక్రమమున జనించిన యశ్మరీభేదములు నాల్గిటియందు నొకదానికన్న నొకటి మిక్కిలి దారుణముగ నుండుననియు, అన్నిటియందును శ్లేష్మముయొక్క సంబంధము కల్గియే యుండుననియు తెలియుచున్నది. కఫప్రాధాన్యమునే సుశ్రుతాచార్యులును ఇట్లు చెప్పిరి:—"సంహన్త్యాపో యథా దివ్యాః మారుతోఽగ్నిశ్చ వైద్యుతః,తద్వద్బలాసం వస్తిస్థ ఊష్మా సంహన్తి సానిలః" (సు. ని. అ. ౩) బాహ్యవాతంబును విద్యుత్సంబంధమయిన అగ్నియు కలిసి దివ్యోదకమును శోషింపజేసి యందు ఘనపదార్థమైన వడగండ్లను కల్గించు విధముగ శరీరమునందలి వాతము పిత్తముయొక్క వేడితో కలిసి వస్తియందలి కఫమును శోషింపజేసి ఘనీభవించునట్లు చేయును. అదియే యశ్మరి యని యర్థము. ఈవాక్యమునుపట్టి అశ్మరీభేదము లన్నిటియందును త్రిదోషసంబంధము పూర్తిగ నున్నట్లు తేలుచున్నది. అయినను అందు వాతాదిదోషప్రాబల్యమునుబట్టి నాల్గు తెరంగుల నుండునని యెరుంగునది. (ఇచ్చట వాతాశ్మరి కదంబ పుష్పసదృశమై మూడు పొరల గల్గియుండుననియు, పిత్తాశ్మరి నునుపు కల్గి కఠినముగ నుండుననియు, కఫశుక్రములచే మృదువుగ నుండుననియు దోషవిభాగము నెరుంగునది).

## అశ్మరీలక్షణము.

మూ. కదమ్బపుష్పాకృతిరశ్మతుల్యా
శ్లక్ష్ణా త్రిపుట్యప్యథవాపి మృద్వీ,

మూత్రస్య చేన్మార్గముపైతి రుద్ధ్వా
మూత్రం రుజం తస్య కరోతి వస్తౌ. 37

వ్యా. అట్టి అశ్మరి యను మూత్రమునందలి యుండ కడిమిపువ్వులతో సమానమైన కాంతియు ఆకృతియు కల్గి రాతివలె కఠినముగను, నునుపుకల్గి మూడుపుటముల (పొరల)తో కూడినదిగను, లేక మెత్తగ నుండును. అట్టి యశ్మరి మూత్రముయొక్క మార్గమున జేరినపుడు మూత్రమును బైటవెడలనీయక యడ్డగించి వస్తియందు తీవ్రమైన నొప్పిని పోటును పుట్టించును.

5. అశ్మరీజమూత్రకృచ్ఛ్రలక్షణము.

మూ. ససేవనీమేహనవస్తిశూలం
విశీర్ణధారం చ కరోతి మూత్రమ్,
మృద్నాతి మేఢ్రం సతు వేదనార్తః
ముహుశ్శకృన్ముఞ్చతి, మేహనే చ. 38
క్షోభాత్ క్షతే, మూత్రయతీహ సాసృక్
తస్యాస్సుఖం మేహతిచ వ్యపాయాత్,

వ్యా. పైజెప్పినరీతిగ అశ్మరి మూత్రద్వారమున జేరి మూత్రము నడ్డగించినపుడు మేఢ్రమునందలి సేవనియను నరమునందును, మేఢ్రమునందును, వస్తియందును తీవ్రమైన శూలము కల్గి మూత్రము ధారగ వెడలక చీలికలై వెడలును. అట్టిరోగి బాధ కోరువజాలక మేఢ్రమును చేత మర్దించి బలవంతముగ మూత్రము వెడలింప ప్రయత్నము చేసినయెడ మూత్రమునకు మారుగ పురీషము కొంచెము కొంచెముగ నప్పుడప్పుడు వెడలును. (కాని మూత్రము మాత్రము సరళముగ వెడలదు). మేఢ్రమును పిసుకుటచే గల్గిన యభిఘాతమునంజేసి మేఢ్రమున గాయముపడి పుండై రక్తముతోకూడిన మూత్రము మిగుల కష్టముచే కొంచెము కొంచెముగ వెడలును. అడ్డుపడియుండు అశ్మరి మర్దనాభిఘాతమువలన మేఢ్రమునుండి యూడి పడినయెడ బాధలేక మూత్రము వెడలును. (ఇది అశ్మరీనిరోధముచే గల్గినది కావున అశ్మరీజమూత్రకృచ్ఛ్రము. వాతికాద్యశ్మరులన్నిటియందును మూత్రకృచ్ఛ్ర మేకరూపముగనే యుండును కావున నిది యొకటియే యగును.)

7. శర్కరాస్వరూపము, శర్కరాజమూత్రకృచ్ఛ్రము.

మూ. ఏషాశ్మరీ మారుతభిన్నమూర్తిః
స్యాత్ శర్కరామూత్రపథాత్ క్షరన్తీ. 39

వ్యా. పైని వివరింపబడిన స్వరూపముకల యశ్మరి వాతముచే పలువిధములుగ భేదింపబడి తుత్తునియలై మూత్రమార్గమునుండి పోటు మున్నగుబాధల గల్గించి మిక్కిలి కష్టముతో బైట వెడలును. (వాతముచే భేదింపబడిన యశ్మరీఖండములు శర్కరయని యర్థము. ఈవిషయమునే తంత్రాంతరమున నిట్లు చెప్పిరి:—"అశ్మర్యేవ తు శర్కరా అణుశో వాయునాభిన్నా" అశ్మరి యనునది ధారాళముగ మూత్రముతో కూడ నొకప్పుడు బైటవెడలక మూత్రము నడ్డగించియే యుండును. శర్కర యనునది చిక్కముక్కలుగ నుండుటంజేసి వాత మనులోమముగ నుండుతరి మూత్రముతో కలిసి బైటవెడలును. వాతము ప్రతిలోమముగ సంచరించునపుడు బైటవెడలక మూత్రము నడ్డగించును. ఇదియే యీరెంటికిని భేదము. ఇది శర్కరాజమూత్రకృచ్ఛ్రము.)

మూ. (రేతోఽభిఘాతాఽభిహతస్య పుంసః
ప్రవర్తతే యస్య తు మూత్రకృచ్ఛ్రం
స్యాద్వేదనా వంక్షణవస్తిమేఢ్రే
తస్యాఽతిశూలం వృషణాతివృత్తే. 40
శుక్రేణ సంరుద్ధగతిప్రవాహః
మూత్రం స కృచ్ఛ్రేణ విముఞ్చతీహ
తమణ్డయోః స్తబ్ధమితి బ్రువన్తి
రేతోఽభిఘాతాత్ ప్రవదన్తి కృచ్ఛ్రమ్.) 41

వ్యా. శుక్రమును వెడలనీయక నిరోధించుటచేత పురుషులకు మూత్రము మిగుల కష్టముచే వెడలును. ఈమూత్రకృచ్ఛ్రమునందు గజ్జలయందును వస్తియందును మేఢ్రమునందును అధికముగ బాధ కలుగును. మరియు వృషణములయందు మూత్రము శుక్రముచే నడ్డగింపబడిన సరళముగ వెడలక మిగుల కష్టముచే వెడలును. ఈవ్యాధిని అండస్తంభమనియు శుక్రముయొక్క యభిఘాతముచే కల్గిన కృచ్ఛ్రము (శుక్రాభిఘాతజకృచ్ఛ్రము) అనియు చెప్పెదరు. (ఈరెండుశ్లోకములును అనార్షమని తోచెడిని).

## 8. శుక్రజమూత్రకృచ్ఛ్రసంప్రాప్తి, లక్షణము.

మూ. శుక్రం మలాశ్చైవ పృథక్ పృథక్ వా
మూత్రాశయస్థాః ప్రతివారయన్తి,
తదావ్యాహతం మేహనవస్తిశూలం
మూత్రం సశుక్రం కురుతే విబద్ధమ్. 42

స్తబ్ధశ్చ శూనో భృశవేదనశ్చ
తుద్యేత వస్తిః వృషణే చ తస్య,

వ్యా. వాతాదిదోషములు వేరువేరుగ నైనను అన్నియు కలిసియైనను ప్రకోపమునొంది మూత్రము వెడలుమార్గమున జేరి శుక్రమును నిరోధించును. దానంజేసి మేఢ్రమునందును వస్తియందును శూలను కల్గించును. అట్టియెడ మూత్రము శుక్రముతో గూడి మిగుల కష్టముచే వెడలును. ఈవ్యాధియందు మేఢ్రము స్తంభించి వాపు గల్గి మిక్కిలి బాధతో గూడియుండును. వస్తియందును వృషణములయందును సూదుల గ్రుచ్చినవిధముగ పోటు పుట్టును. (ఇది శుక్రనిరోధమున కల్గిన మూత్రకృచ్ఛ్రము).

రక్తజమూత్రకృచ్ఛ్రసంప్రాప్తి, లక్షణము.

మూ. క్షతాభిఘాతాత్ క్షతజం క్షయాద్వా
ప్రకోపితం వస్తిగతం విబద్ధమ్. 43
తీవ్రార్తమూత్రేణ సహాఽశ్మరీత్వం
ఆయాతి తస్మిన్నతి సఞ్చితే చ,
ఆధ్మాతతాం విందతి గౌరవం చ
వస్తిర్లఘుత్వం చ వినిస్సృతేఽస్మిన్. 44

(ఇతి మూత్రకృచ్ఛ్రనిదానం).

వ్యా. మూత్రమును వహించు స్రోతోమార్గమున ముల్లు మొదలగువానిచే గాయము తగులుటచే నైనను, అభిఘాతము కల్గుటచేనైనను, శుక్రక్షయముచేనైనను రక్తము ప్రకోపమునొంది వస్తియందు చేరి నిరోధింపబడి మిక్కిలి తీవ్రమైన బాధతో గూడి మూత్రముతోకూడ మిగుల కష్టముచే వెడలును. అయ్యది బైట వెడలక నానాట చేరియున్నయెడ నానాట ఘనీభవించి అశ్మరిని బోలె కఠినమగును. అట్టియెడ దానిచే మూత్రద్వారము అడ్డగింపబడి వస్తిమూత్రముచే పూరితమగును. దానంజేసి బరువుగ నుండును. అయ్యది మూత్రమున కలిసి బైట వెడలినప్పుడు చులకనగ నుండును. (ఇత్తెరంగున "స్యుర్మూత్రకృచ్ఛ్రాణి నృణా మిహాష్టౌ" అను నిర్దేశానుసారముగ నెనిమిది విధములైన మూత్రకృచ్ఛ్రముల లక్షణములు వేరువేరుగ జెప్పబడినవి).

ఇచ్చట నీవివరణము నెరుంగునది:—అష్టోదరీయాధ్యాయమున రోగభేదముల నిర్దేశించుతరి "అష్టౌ మూత్రాఘాతా ఇతి, వాత-పిత్త-కఫ-సన్నిపాత-అశ్మరీ-శర్కరా-శుక్ర-శోణితజా ఇతి" (సూ. అ. ౧౯. సూ. ౫) అని మూత్రాఘాతము వాతాది

కారణభేదములచే నెనిమిదివిధములుగ నుండునని నిర్దేశింపబడినది, కాని మూత్రకృచ్ఛ్రములు వేరుగ నిర్దేశింపబడలేదు. మూత్రాఘాతమున మూత్రము శోషించును. లేక మూత్రము బైటవెడలక అడ్డగింపబడును. మూత్రకృచ్ఛ్రమున పైజెప్పినరీతిగ నడ్డుపడిన మూత్రము మిక్కిలి కష్టముచే ననేకబాధల గల్గించుచు పలుమారు బైటవెడలును. అందును మూత్రాఘాతమున బాధలు స్వల్పముగను, మూత్రకృచ్ఛ్రమున బాధ లధికముగ నుండును. ఇంతమాత్రము భేదమే కాని తక్కిన లక్షణము లన్నియు రెంటికి సమానములని యుద్దేశించి సూత్రస్థానమున నిర్దేశింపబడిన మూత్రాఘాతభేదములనే మూత్రకృచ్ఛ్రములుగ నిట నిర్దేశించి వానిలక్షణముల వరుసగ నీతంత్రకారుడు వివరించెను.

సుశ్రుతులు మాత్రము ఈరెంటికిని వేరువేరుగ నధ్యాయముల రెంటిచే వివరించి చెప్పెను. ఈపద్ధతి నవలంబించి వాగ్భటాదితంత్రకారులును వేరుగనే యీరెంటిని వివరించిరి. ఎవ రెట్లు చెప్పినను ఈరెంటికిని నిదానలక్షణాదులు సమానము లనుట నిర్వివాదాంశము. ఈయుద్దేశముచేతనే యీతంత్రకారులును రూపలక్షణాదుల నేకముగనే యుపదేశించిరి.

## మూత్రకృచ్ఛ్రచికిత్సితము, అందు వాతికమూత్రకృచ్ఛ్రచికిత్స.

మూ. అభ్యఞ్జనస్నేహనిరూహవస్తిస్నేహోపనాహోత్తరవస్తిసేకాన్,
స్థిరాదిభిర్వాతహరైశ్చ సిద్ధాన్ దద్యాద్రసాంశ్చానిలమూత్రకృచ్ఛ్రే.

వ్యా. వాతముచే కల్గిన మూత్రకృచ్ఛ్రమునందు స్థిరాది హ్రస్వపంచమూలములను అచ్చటచ్చట వాతహరములుగ జెప్పబడిన ద్రవ్యములను చేర్చి సిద్ధములుచేయబడిన తైలాదులచే నభ్యంగము, స్నేహము, నిరూహవస్తి, స్నేహద్రవ్యములచే నుపనాహము, ఉత్తరవస్తి, సేకము, వాతహరద్రవ్యముల జేర్చి పక్వముచేయబడిన మాంసరసములు వీనిని తత్తదుచితముగ నుపయోగించి చికిత్స చేయనగును.

## వాతికమూత్రకృచ్ఛ్రహరద్విపంచమూలాదిఘృతము.

మూ. పునర్నవైరణ్డశతావరీభిః
పత్తూరవృశ్చీరబలాఽశ్మభిద్భిః,
ద్విపఞ్చమూలేన కులుత్థకోల
యవైశ్చ తోయోత్క్వథితే కషాయే.

తైలం వరాహర్క్షవసా ఘృతం చ
తైరేవ కల్కైర్లవణైశ్చ సాధ్యం,
తన్మాత్రయాశు ప్రతిహన్తి పీతం
శూలాన్వితం మారుతమూత్రకృచ్ఛ్రమ్. 47

వ్యా. గలిజేరు, ఆముదపువేరు, పిల్లిపీచరగడ్డలు, ఉత్తరేణి, తెల్లగలిజేరు, చిట్టాముట్టివేరు, పాషాణభేది (పిండిబొద్ది), ద్విపంచమూలములు (దశమూలములు), ఉలవలు, రేగువేళ్లు, యవలు, వీనినన్నిటిని జలమున జేర్చి నాల్గవపాలు మిగుల కషాయము కాచి, నువ్వులనూనెను, అడవిపంది క్రొవ్వును, ఎలుగుబంటిక్రొవ్వును, ఘృతమును చేరి కషాయమునకు నాల్గవపాలగునట్లు చేర్చి, పైజెప్పబడిన గలిజేరు మున్నగుక్వాథ్యద్రవ్యములను పంచలవణములను కల్కము చేసి స్నేహమునకు నాల్గవపాలు కలిపి స్నేహపాకవిధి ప్రకారము పక్వముచేసి యీఘృతమును అగ్నిబలాద్యనుసారముగ మాత్ర కల్పించి త్రాగినచో తీవ్రమైన శూలతో గూడిన వాతజమూత్రకృచ్ఛ్రమును హరించును.

వాతికమూత్రకృచ్ఛ్రమున నుపనాహస్వేదము.

మూ. ఏతాని చాన్యాని వరౌషధాని పిష్టాని శస్తాన్యపి చోపనాహే,
స్యుర్లాభతస్తైలఫలాని చైవ స్నేహామ్లయుక్తాని సుఖోష్ణవన్తి 48

వ్యా. పైజెప్పబడిన క్వాథ్యద్రవ్యములను, వీనికి సమానగుణములై వాతహరములైన యితరద్రవ్యములను దొరకినవట్టుకు చేర్చియైనను, చమురుతో గూడిన నువ్వుకాయలు అగసికాయలు మున్నగువానినైనను, మెత్తగ నూరి, యందు ఆముదము మున్నగు స్నేహములను, పులిమజ్జిగ పుల్లని నీళ్లు మున్నగుద్రవములను చేర్చి యుడికించి సుఖోష్ణముగ జేసి యుపనాహస్వేదమున కుపయోగించిన వాతిక మూత్రకృచ్ఛ్రము నివర్తించును.

(వాగ్భటాచార్యులు "ద్రవ్యాణ్యేతాని పానాన్నే తథా పిణ్డోపనాహనే" (అ. హృ. చి. అ. ౧౧) అని చెప్పెను. పైజెప్పిన ద్రవ్యములను అన్నపానములయందును ఉపనాహ (కట్టుగట్టుట) స్వేదమునకు జేర్పదగునని వీరియాశయము.) ఇది వాతికమూత్రకృచ్ఛ్రచికిత్స.

పైత్తికమూత్రకృచ్ఛ్రచికిత్సితము.

మూ. సేకాఽవగాహాః శిశిరాః ప్రదేహాః
గ్రైష్మో విధిః వర్తిపయోవిరేకాః,

ద్రాక్షావిదారీక్షురసైః ఘృతైశ్చ
కృచ్ఛ్రేషు పిత్తప్రభవేషు కార్యాః. 49

వ్యా. పిత్తజమూత్రకృచ్ఛ్రమునందు గుణవీర్యస్పర్శములచే మిక్కిలి శీతములుగ నుండు పరిషేకములును,అవగాహనంబులును, ప్రదేహంబులును, గ్రీష్మఋతువునకు చెప్పబడిన విధానంబులును మిక్కిలి హితకరములు. మరియు ద్రాక్షపండ్లరసము, గుమ్మడిరసము, చెరకురసము, ఘృతము, పాలుఅను నీద్రవములచే వస్తికర్మమును విరేచనములను చేయించవలెను.

ఇచ్చట తస్యాశితీయాధ్యాయమున "స్వాదుశీతం ద్రవం స్నిగ్ధమన్నపానం తదా హితమ్" (సూ. ౬. ౬.) అని యుపక్రమించి చెప్పబడిన గ్రీష్మఋతుసంబంధములగు నాహారవిహారాదు లన్నియు హితకరములని 'గ్రైష్మో విధిః' అని నిర్దేశింపబడినది.

## పైత్తికమూత్రకృచ్ఛ్రమున శతావర్యాదికషాయము.

మూ. శతావరీకాశకుశశ్వదంష్ట్రా
విదారిశాలీక్షుకశేరుకాణాం,
క్వాథం సుశీతం మధుశర్కరాభ్యాం
యుక్తం పిబేత్పైత్తికమూత్రకృచ్ఛ్రీ. 50

వ్యా. పిల్లిపీచరగడ్డలు, రెల్లుదర్భవేళ్లు, కుశదర్భవేళ్లు, సన్నపల్లేరు, నేలగుమ్మడిగడ్డ, వరివైరువేళ్లు, చెరకువేళ్లు, నమ్మదుంపలు (నిమ్మటారి) వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి నాల్గవపాలు మిగులునట్లు కషాయము కాచి, అందు తేనెను చక్కెరను యథోచితముగ కలిపి చల్లార్చి త్రాగినయెడ పిత్తముచే గల్గిన మూత్రకృచ్ఛ్రము శమించును.

## పైత్తికమూత్రకృచ్ఛ్రమున కొన్నికషాయయోగములు.

మూ. పిబేత్కషాయం కమలోత్పలానాం
శృఙ్గాటకానామథ వా విదార్యాః,
దణ్డైరకాణాం (దణ్డోత్పలానాం) అథవాపి మూలం
పూర్వేణ కల్పేన తథాఽమ్బు శీతమ్. 51

వ్యా. తామరదుంపలు కలువదుంపలనైనను, సింగాణిదుంపలనైనను, నేలగుమ్మడిదుంపనైనను, పాషాణభేదివేళ్లనైనను పై జెప్పినరీతిగ క్వాథముచేసి, అందుచల్లారినపిదప

తేనెను చక్కెరను కలిపి త్రాగవలెను. లేక పైజెప్పినవానిని చల్లని నీళ్లలో నునిచి శీత
కషాయవిధిప్రకారము నానబెట్టి త్రాగవలెను.

పిత్తజమూత్రకృచ్ఛ్రహరవిర్వారుబీజాదికల్కము.

మూ. ఏర్వారుబీజం త్రపుసాత్ కుసుమ్భాత్
సకుఙ్కుమస్స్యాత్ వృషకశ్చ పేయః,
ద్రాక్షారసేనాఽశ్మరిశర్కరాసు
సర్వేషు కృచ్ఛ్రేషు ప్రశస్త ఏషః. 52

వ్యా. ద్రాక్షపండ్లను జలమున వైచి పిసికి జలమును వడగట్టి యాజలములో
నక్కదోసవిత్తులను దోసవిత్తులను కుసుమవిత్తులను అడ్డసరమును చూర్ణముచేసి కలిపి,
అందు కుంకుమపువ్వును కూడ చేర్చి త్రాగిన మూత్రకృచ్ఛ్రము లన్నియు అశ్మరియు
శర్కరామూత్రకృచ్ఛ్రంబును నివర్తించును. మూత్రకృచ్ఛ్రము లన్నిటియందును ఇది
మిగుల శ్రేష్ఠముగ నుండును.

రెండవకల్కము.

మూ ఏర్వారుబీజం మధుకం సదారు (దార్వీ)
పైత్తే పిబేత్తణ్డులధావనేన,
దార్వీం తథైవామలకీరసేన
సమాక్షికాం పిత్తకృతే తు కృచ్ఛ్రే. 53

వ్యా. నక్కదోసవిత్తులు, అతిమధురము, మ్రానిపసుపు, వీనిని సమభాగములుగ
చూర్ణముచేసి, బియ్యపుకడుగు నీళ్లలో కలిపి పిత్తజమూత్రకృచ్ఛ్రమున త్రాగనగును.
మరియు మ్రానిపసుపుపొడిని ఉసిరికకాయలరసమున కలిపి, అందు తేనెను చేర్చి పిత్త
మూత్రకృచ్ఛ్రమున త్రాగవలెను. (ఇంతదనుక పైత్తికమూత్రకృచ్ఛ్రచికిత్స.)

కఫజమూత్రకృచ్ఛ్రచికిత్సితము.

మూ. క్షారోష్ణతీక్ష్ణౌషధమన్నపానం
స్వేదో యవాన్నం వమనం నిరూహః,
తక్రం సతిక్తౌషధసిద్ధతైలం
అభ్యఙ్గపానం కఫమూత్రకృచ్ఛ్రే. 5

వ్యా. కఫముచే గల్గిన మూత్రకృచ్ఛ్రమునందు క్షారంబును ఉష్ణవీర్యంబు
తీక్ష్ణగుణంబును కల యౌషధములును, అట్టి యన్నపానంబును, స్వేదవిధియు, య

స్నంబును, వమనవిధియు, నిరూహవస్తులును, తిక్తరసము కల ఔషధముల జేర్చి సంస్కరింపబడిన మజ్జిగను త్రాగుటయు, ఆట్టి తైలములచే నభ్యంగనంబును, మిగుల హితముగ నుండును.

కఫజమూత్రకృచ్ఛ్రమున వ్యోషాదిచూర్ణపానము

మూ. వ్యోషం శ్వదంష్ట్రాత్రుటి సారసాస్థి (క్రిమిమారకాస్థి)
కోలప్రమాణం మధుమూత్రయుక్తం,
పిబేత్ త్రుటిం క్షౌద్రయుతాం కదళ్యా
రసేన కైడర్యరసేన వాపి. 55

వ్యా. త్రికటుకములు, పల్లేరు, పిన్నయేలకులు, తామరపిత్తులు, వీనిని సమభాగములుగ చూర్ణముచేసి గోమూత్రమున కలిపి యందు తేనెను చేర్చి కఫజమూత్రకృచ్ఛ్రమున త్రాగవలెను. లేక పిన్నయేలకులను చూర్ణము చేసి ఆరటిగడ్డ రసమున నైనను టేకుపట్టరసముననైనను కలిపి తేనె చేర్చి త్రాగినను కఫజమూత్రకృచ్ఛ్రము శమించును.

మూ. తక్రేణ యుక్తం శితివారకస్య బీజం పిబేత్ కృచ్ఛ్రవినాశహేతోః,
పిబేత్తథా తణ్డులధావనేన ప్రవాళచూర్ణం కఫమూత్రకృచ్ఛ్రే.
సప్తచ్ఛదారగ్వధకేబుకైలాధవం కరఞ్జం కుటజం గుడూచీం,
పక్త్వా జలే తేనపిబేద్యవాగూం సిద్ధం కషాయం మధుసంయుతం వా.

వ్యా. కానుకగింజలను మెత్తగ చూర్ణముచేసి మజ్జిగలో కలిపి త్రాగినను, మూత్రకృచ్ఛ్రము శమించును. లేక పగడపు భస్మమును, బియ్యపుకడుగు నీళ్లలో కలిపి కఫజమూత్రకృచ్ఛ్రమున త్రాగవలెను.

మరియు ఏడాకులపొన్న, రేల, కెబుకము (కురువేరు), ఏలకులు, చంద్రచేవ, కానుగుపట్ట, కొడిసెపాల విత్తులు, తిప్పతీగ, వీనిని నీళ్లతో చేర్చి కాచి యాకషాయమును యవాగువున కలిపి త్రాగవలెను. లేక పైజెప్పిన కషాయమున తేనె కలిపి త్రాగినను మూత్రకృచ్ఛ్రము శమించును. (ఇది కఫజమూత్రకృచ్ఛ్రచికిత్సావిధానము.)

సాన్నిపాతికమూత్రకృచ్ఛ్రచికిత్స.

మూ. సర్వం త్రిదోషప్రభవే తు వాయోః
స్థానానుపూర్వ్యా ప్రసమీక్ష్య కార్యం,

త్రిభ్యోఽధికే ప్రాగ్వమనం కఫే స్యాత్
పిత్తే విరేకః పవనే తు వస్తిః. 58

(ఇతి మూత్రకృచ్ఛ్రచికిత్సా.)

వ్యా. వాతాది త్రిదోషములును సమములుగ ప్రకోపమునొందిన సన్నిపాతముచే గల్గిన మూత్రకృచ్ఛ్రమున పైజెప్పిన చికిత్సల నన్నిటిని చేయనగును. అందును వాత స్థానమునకు తొలుత చికిత్సజేసి పిదప తక్కిన స్థానముల కనుగుణముగ చికిత్స చేయ వలెను. మరియు వాతాది త్రిదోషములలో నొక్కొకటి యధికముగనుండు సన్నిపాత ములలో కఫం బధికముగ నున్నపుడు కఫమును ప్రధానమైన వమనంబును, పిత్తం బధిక ముగ నున్నపుడు (పిత్తమునకు ప్రధానమైన) విరేచనంబును, వాతం బధికముగ నున్న పుడు (వాతమునకు ప్రధానమైన) వస్తికర్మంబును తొలుత చేయనగును. (సన్నిపాత మూత్రకృచ్ఛ్రమున త్రిదోషములును సమములుగ ప్రకోపము నొందియున్నను వాతస్థాన మునకు తొలుత చికిత్స చేసి, పిదప తక్కినదోషములకు చికిత్స చేయవలెను. విషమ సన్నిపాతమున దోషాధిక్యమును బట్టి ఆయాదోషమునకు ప్రధానమైన వమన - విరేచన- వస్తిచికిత్సల జేయవలెను.) ఇత్తెరంగున మూత్రకృచ్ఛ్రచికిత్స చెప్పబడినది.

## అశ్మరీచికిత్సితము.

మూ. క్రియా హితా సాశ్మరిశర్కరాభ్యాం
కృచ్ఛ్రే యథైవేహ కఫాఽనిలాభ్యాం,
కార్యాఽశ్మరీభేదనపాతనాయ
విశేషముక్తం శృణు! కర్మ సిద్ధిమ్. 59

వ్యా. అశ్మరిచేతను శర్కరచేతను సంభవించిన మూత్రకృచ్ఛ్రమునందు పైని కఫమున బుట్టిన మూత్రకృచ్ఛ్రమునకు చెప్పిన చికిత్సను వాతికమూత్రకృచ్ఛ్రమునకు జెప్పిన చికిత్సను వరుసగ చేయనగును. మరియు అశ్మరిని భేదించి బైటవెడలింపజేయు టకు దగినచికిత్స యీక్రింద చెప్పబడును.

## వాతాశ్మరికి పాషాణభేదాదిచూర్ణము, ఘృతంబును.

మూ. పాషాణభేదం వృషకం శ్వదంష్ట్రా
పాఠాఽభయావ్యోషశఠీనికుమ్భాః,
హింస్రాఖరాశ్వాశితివారకాణాం
ఏర్వారుకాణాం త్రపుసస్య బీజమ్. 60

ఉత్కుఞ్చికా హిఙ్గు సవేతసామ్లం
స్యాత్ ద్వే బృహత్యౌ హపుషా వచా చ,
చూర్ణం పిబేదశ్మరి భిత్ విపక్వం
సర్పిశ్చ గోమూత్ర చతుర్గుణం తైః 61

వ్యా. పాషాణభేది (పిండిబొద్ది) వేళ్లు, అడ్డసరము, పల్లేరు, చిరుబొద్ది, కరక కాయలబెరడు, త్రికటుకములు, కచోరములు, నేపాళపువేళ్లు, జటామాంసి, ఓమము, ఉత్తరేణిగింజలు, నక్కదోసవిత్తులు, పెద్దదోసవిత్తులు, జీలకర, ఇంగువ, అమ్లవేతసము, వాకుడు, ములక, బోడతరము, వస, వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి యాచూర్ణ మును జలానుపానముతో త్రాగినను; లేక యాద్రవ్యమును కల్కముచేసి, కల్కమునకు నాల్గింత ఘృతమున జేర్చి, ఘృతమునకు నాల్గింత గోమూత్రమును కలిపి ఘృతపాకవిధి ప్రకారము పక్వముచేయబడిన ఘృతమును త్రాగినను అశ్మరిని భేదించును.

### వాతాశ్మరికి శ్వదంష్ట్రాదిమూలకల్కము.

మూ. మూలం శ్వదంష్ట్రేక్షురకోరుబూకాత్
క్షీరేణ పిష్టం బృహతీద్వయాచ్చ,
ఆలోడ్య దధ్నా మధురేణ పేయం
దినాని సప్తాऽశ్మరిభేదనాని. 62

వ్యా. పల్లేరువేళ్లు, నీరుగొబ్బివేళ్లు, ఆముదపువేళ్లు, వాకుడువేళ్లు, ములకవేళ్లు, వీనిని సమభాగములుగ గూర్చి ఆవుపాలు బోసి నూరి తీపిగలపెరుగులో కలిపి త్రాగునది. ఇత్తెరంగున నేడుదినములు త్రాగిన అశ్మరిని కరుగజేయును.

### అశ్మరీశర్కరలకు పునర్నవాదికల్కము.

మూ. పునర్నవాయోరజనీశ్వదంష్ట్రా ఫల్గుప్రవాళాశ్చ సదర్భపుష్పాః,
క్షీరామ్బుమద్యేక్షురసైః సుపిష్టం పేయం భవేదశ్మరిశర్కరాసు.

వ్యా. గలిజేరు, లోహభస్మము, పసుపు, పల్లేరువేళ్లు, బ్రహ్మమేడిచిగుళ్లు, దర్భ పుష్పములు (రెల్లుపువ్వులు), వీనిని సమభాగములుగగూర్చి ఆవుపాలతోనైనను జలముతో నైనను, మద్యముతోనైనను, చెరకురసముతోనైనను కలిపి మెత్తగ నూరి కలిపి త్రాగిన యెడ అశ్మరియు శర్కరయు శమించును.

అశ్మరికి త్రుట్యాదిచూర్ణము.

మూ. త్రుటిం సురాహ్వాం (శతాహ్వాం) లవణాని పఞ్చ
యవాగ్రజం కున్దురుకాశ్మభేదౌ,
కమ్పిల్లకం గోక్షురకస్య బీజం
ఏర్వారుబీజం త్రపుసస్య బీజం. 64
చూర్ణీకృతం చిత్రకహిఙ్గుమాంసీ
యవానితుల్యం త్రిఫలాద్విభాగం,
అమ్లైరశుక్తైః రసమద్యయూషైః
పేయం హి గుల్మాశ్మరిభేదనార్థమ్. 65

వ్యా. ఏలకులు, దేవదారుచెక్క, పంచలవణములు, యవక్షారము, కుందురుష్క మను గంధద్రవ్యము, పాషాణభేది, కంపిల్లకము, పల్లేరువిత్తులు, నక్కదోసవిత్తులు, దోసవిత్తులు, చిత్రమూలము, ఇంగువ, జటామాంసి, ఓమము, ఇవి యన్నియు సమభాగములు, త్రిఫలములు రెం.డుభాగములు, ఇత్తెరంగున వీనినన్నింటిని గూర్చి చూర్ణముచేసి, యా చూర్ణమును శుక్తమొక్కటి దక్క తక్కిన పులిగంజి మున్నగు పుల్లనిద్రవములలోనైనను, నెద్దానితోనైనను, మాంసరసముతోనైనను, మద్యముతోనైనను, యూషములతోనైనను కలిపి త్రాగిన అశ్మరిని గుల్మమును భేదించును.

ఇచ్చట అమ్లశబ్దముచేతనే మద్యంబును గ్రహింపబడినను అయ్యాది వస్తిశోధనంబును అశ్మరిని భేదించునదియు నగుటచే ప్రధానమని తెలుపుటకై మరల చెప్పబడినది. మరియు "అశుక్తైరితి శుక్తవర్జితైః, కాఞ్జికాదిభిః" అని చక్రపాణిదత్తవ్యాఖ్యానుసారముగ "అమ్లైరశుక్తైః" అను పాఠము సమంజసము కాని, "అమ్లైస్సశుక్తైః" అను పాఠము అనార్షము.

శిగ్రుమూలకల్కము.

మూ. బిల్వప్రమాణో ఘృతతైలభృష్టో
యూషః కృతః శిగ్రుకమూలకల్కాత్,
శీతోఽశ్మభిత్ స్యాత్ దధిమణ్డయుక్తః
పేయః ప్రకామం లవణేన యుక్తః. 66
జలేన శోభాఞ్జనమూలకల్కః
శీతో హితశ్చాశ్మరిశర్కరాసు,

వ్యా. మునగవేరును నూరి కల్కముచేసి దానిచే యూషమును సిద్ధముచేసి ఘృతమునైనను తైలమునైనను తిరుగబోతబెట్టి యందు పలమాత్రమును చల్లారినపిదప గ్రహించి పెరుగుమీది తేటతో కలిపి లవణమును జేర్చి త్రాగినయెడ అశ్మరిని భేదించును. మరియు మునగవేరును నూరి కల్కము చేసి చల్లనిజలమున జేర్చి త్రాగినచో అశ్మరిని శర్కరను భేదించును.

## మూత్రకృచ్ఛ్రములకు యవక్షారోపయోగము.

మూ. సితోపలా వా సమయావశూకా
కృచ్ఛ్రేషు సర్వేష్వపి భేషజం స్యాత్. 67

వ్యా. శీనాకల్కండను యవక్షారమును సమభాగములుగ గూర్చి జలమున కలిపి త్రాగినను సర్వమూత్రకృచ్ఛ్రములందును చక్కగ పనిచేయును.

## అశ్మరీభేదనోపాయము.

మూ. పీత్వాథ మద్యం విగదం రథేన
హయేన వా శీఘ్రజవేన యాయాత్,
తైశ్శర్కరా ప్రచ్యవతేఽశ్మరీ తు
శామ్యేన్న చేత్ శల్యవిదుద్ధరేత్తామ్. 68

వ్యా. రోగమును కల్గించక శుభ్రమైనదిగనుండు మద్యమును యుక్తియుక్తముగ త్రాగి రథముపైనైనను, మిక్కిలి వేగముగ పరువిడు గుఱ్ఱముపైనైనను, ఎక్కి శీఘ్రముగ నతివేగముతో సవారిచేసినయెడ శరీరము కదలి మూత్రనాళమున కద్దుపడియుండు శర్కర జారి యూడిపడును. అశ్మరియు శమించును. పైచెప్పిన చికిత్సావిధానముచేత నశ్మరి బైటవెడలి శమించకున్నచో శల్యశాస్త్రవిధానమును చక్కగ నెరింగినవైద్యవరుడు దానిని విడదీయవలెను.

## శుక్రజమూత్రకృచ్ఛ్రచికిత్స.

మూ. రేతోఽభిఘాతప్రభవే తు కృచ్ఛ్రే
సమీక్ష్య దోషం ప్రతికర్మ కుర్యాత్,
కార్పాసమూలం వృషకాశ్మభేదా
బలాస్థిరాదీని గవేధుకా చ. 69
వృశ్చీర ఐన్ద్రీ చ పునర్నవా చ
శతావరీ మధ్వసనాఖ్యపర్ణ్యౌ,

తత్రాప్యథసిద్ధః పవనే రసస్స్యాత్;
పిత్తేఽధికే క్షీరమథాపి సర్పిః. 70
కఫే చ యూషాధికమన్నపానం;
సంసర్గజే సర్వహితః క్రమస్స్యాత్,

వ్యా. శుక్రముయొక్క అభిఘాతమువలన కల్గిన యశ్మరియందు వాతాదిదోష సంబంధమును చక్కగ గమనించి ఆయాదోషానుసారముగ నీక్రింద చెప్పబడువిధముగ చికిత్స చేయవలెను.

అందు వాతమధికముగ నున్నచో పత్తివేళ్లు, అడ్డసరము, పాషాణభేది, చిట్టాముట్టి, స్థిరాది(హ్రస్వ)పంచమూలములు, అడవిగోధుమలు, తెల్లగలిజేరు, ఏటిపుచ్చవేళ్లు, ఎఱ్ఱగలిజేరు, పిల్లిపీచర, మధుపర్ణి (తిప్పతీగె), అసనపర్ణీ (తెల్లదింటెన), వీనిని సమభాగములుగ పరిభాషానుసారముగ క్వాథముచేసి యాకషాయముతో సిద్ధముచేయబడిన మాంసరసము నుపయోగించునది. శేతోనిరోధముచే కల్గిన పైత్తికమూత్రకృచ్ఛ్రమున పైజెప్పిన ద్రవ్యముల చేర్చి చేయబడిన కషాయముతో క్షీరమునైనను, ఘృతమునైనను, సిద్ధముచేసి యుపయోగించునది. కఫం బధికమైనచో పైజెప్పిన క్వాథముతో కూడిన యూషముల నైనను, యన్నపానములనైనను నుపయోగింపనగును. రెండేసి దోషములు సంసర్గము కల్గియున్నయెడ పైని వాతాదిదోషములకు వేరువేరుగ జెప్పబడినవానిని మిళితముగ జేసి దోషసంసర్గానుసారముగ చికిత్స చేయనగును.

## శుక్రజమూత్రకృచ్ఛ్రమున సురాద్యుపయోగము.

మూ. ఏవం న చేచ్ఛామ్యతి తస్య యుఞ్జ్యా
త్సురాం పురాణాం మధుకాసవం వా. 71
విహఙ్గమాంసాని చ బృంహణాని
వస్తీంశ్చ శుక్రాశయశోధనార్థం,
శుద్ధస్య తృప్తస్య చ వృష్యయోగాః
ప్రియానుకూలాః ప్రమదా విధేయాః. 72

వ్యా. పైజెప్పిన చికిత్సచేత శుక్రజమూత్రకృచ్ఛ్రము శమింపకున్నయెడ ప్రాతదియగు సురయను మద్యమునైనను, మధ్వాసవమునైనను నుపయోగింపదగును. మరియు పక్షులయొక్క మాంసమును, బృంహణమునకును, శుక్రాశయము పరిశుద్ధమగుటకై వస్తులను ప్రయోగించవలయును. శుక్రాశయము శుద్ధమై వృష్యములగు యోగములచే తృప్తి

నొందిన పిదప మిక్కిలి ప్రీతికలవారును అనుకూలురును నగుయౌవనవతులతో సంబంధము కల్గించవలయును.

## రక్తజమూత్రకృచ్ఛ్రమునకు చికిత్స.

మూ. రక్తోద్భవే తూత్పలనాలతాలకానేక్షువాలేక్షుకశేరకాణి,
పిబేత్సితాక్షౌద్రయుతాని ఖాదేదిక్షుం విదారీం త్రపుసాని చైవ.

వ్యా. రక్తముచే కల్గినమూత్రకృచ్ఛ్రమునందు నల్లకలువలకాడలు, తాటిచెట్టులోని లేతమోవు, తెల్లచెరుకు, పాలేక్షు (చెరకులోనిభేదము), నమ్మమంపలు వీనిరసమున చక్కెర తేనెను కలిపి త్రాగవలయును. లేక చెరకును, నేలగుమ్మడిగడ్డను, దోసకాయలును, నమలి తినవలయును. లేక వీనిరసమునైనను త్రాగవలయును.

## రక్తజమూత్రకృచ్ఛ్రమున శ్వదంష్ట్రాదిఘృతము.

మూ. ఘృతం శ్వదంష్ట్రాస్వరసేన సిద్ధం క్షీరేణ చైవాష్టగుణేన పేయం,
స్థిరాదికానాం కతకాదికానాం ఏకైకశో వా విధినైవ తేన. 74

వ్యా. ఏనుగుపల్లేరు స్వరసమును ఘృతమునకు సమముగ జేర్చి ఆవుపాలను ఘృతమునకు ఎనిమిదిభాగములును, చేర్చి పక్వముచేయబడిన ఘృతమును త్రాగవలయును. లేక స్థిరాదిహ్రస్వపంచమూలములయొక్క స్వరసమును, మధురస్కంధమున చెప్పబడిన కతకాది (చిల్లగింజలు మొదలగు) గణద్రవ్యముల స్వరసమును, పైజెప్పినరీతిగ ఘృతమున కలిపి పక్వముచేయబడిన ఘృతము నుపయోగింపదగును. ఈరెండుగణములలో వేరువేరుగ నైనను, చేర్చి పక్వము చేసియైన నుపయోగింపదగును.

## రక్తజమూత్రకృచ్ఛ్రమున వస్తిప్రయోగము.

మూ. క్షీరేణ వస్తిర్మధురౌషధైస్స్యా
త్తైలేన వా స్వాదుఫలోత్థితేన,
యన్మూత్రకృచ్ఛ్రే విహితన్తు పైత్తే
కార్యన్తు తచ్ఛోణితమూత్రకృచ్ఛ్రే. 75

వ్యా. మధురములగు నౌషధగణద్రవ్యముల చేర్చబడిన క్షీరముచేనైనను, అతిమధురము, అక్రోటు, మున్నగు మధురఫలములను జేర్చి సిద్ధముచేయబడిన తైలముచేనైనను, వస్తికర్మ చేయవలయును. మరియు పిత్తముచే కల్గిన మూత్రకృచ్ఛ్రమునకు జెప్పిన చికిత్సావిధాన మంతయు రక్తజమూత్రకృచ్ఛ్రమునందును చేయదగును.

### మూత్రకృచ్ఛ్రమునందు వర్జ్యములు.

మూ. వ్యాయామసన్ధారణశుష్కరూక్ష
పిష్టాన్నవాతార్కకరవ్యవాయాన్,
ఖర్జూరశాలూరకపిత్థజమ్బూ
బిసం కషాయం నరసం భజేత. 76

వ్యా. వ్యాయామము, మలమూత్రవాతాది వేగముల నిరోధించుట, యెండిరూక్షములయిన భక్ష్యములను పిండివంటకములను తినుట, గాలిని, యెండను సేవించుట, స్త్రీ సంభోగము చేయుట, ఖర్జూరపుకాయలను, తామర మొదలగువాని దుంపలను, వెలగకాయలను, నేరేడుపండ్లను, తామరకాడలను, వగరురసమును, వీనినన్నిటిని మూత్రకృచ్ఛ్రము, అశ్మరి మొదలగు రోగములు కలవారు త్యజించవలయును.

(ఇత్తెరంగున వస్తిమర్మము నాశ్రయించిన ఉదావర్త-మూత్రకృచ్ఛ్ర చికిత్సితములు విస్తరముగ జెప్పబడినవి).

### హృదయమర్మాశ్రితరోగనిదానము, అందు హృద్రోగకారణములు.

మూ. వ్యాయామతీక్ష్ణాతివిరేకవస్తి
చిన్తాభయత్రాసగదాతిచారాః,
ఛర్ద్యామసన్ధారణకర్శనాని
హృద్రోగకర్తౄణి తథాఽభిఘాతః. 77

వ్యా. వ్యాయామము నధికముగ జేయుట, తీక్ష్ణగుణము కల ద్రవ్యముల సేవించుట, అధికముగ విరేచనములగుట, వస్తికర్మము నధికముగ జేసికొనుట, అధికముగ చింతించుట, భయము, మనసు కుద్వేగము కల్గుట, జ్వరాదిరోగములయందు వ్యత్యస్తముగ చికిత్స జేసికొనుట, వాంతులగుట, అజీర్ణము, మలమూత్రాది వేగముల నిరోధించుట, వ్యాధులు మున్నగు కారణములచే శరీరము కృశించుట, ఇవియన్నియు హృద్రోగము జనించుటకు కారణములు. (హృద్రోగములు వాత-పిత్త-కఫ-సన్నిపాత-క్రిమికారణములచే జనించుటం జేసి యైదువిధములనుండునని అష్టోదరీయాధ్యాయమున 'పఞ్చశిరో రోగాః... వాత-పిత్త-కఫ-సన్నిపాత-క్రిమిజాఇతి, పఞ్చహృద్రోగాః, ఇతి శిరోరోగైర్వ్యాఖ్యాతాః' (సూ. అ. ౧౯ సూ. ౨౧) అని నిర్దేశింపబడినది. కియన్తశ్శిరసీయాధ్యాయమున 'శోకోపవాసవ్యాయామ' (సూ. అ. ౧౭ సూ. ౩౦) అని యుపక్రమించి యీయైదిటికిని నిదానలక్షణాదులును వేరువేరుగ చెప్పబడినవి. ఐనను ఇచ్చట చికిత్సాప్రస్తావవశమునం జేసి వాని నిదానాదులు సంగ్రహముగ నిర్దేశింపబడినదని యెరుంగునది).

### హృద్రోగసామాన్యలక్షణములు, లేక ఉపద్రవములు.

మూ. వైవర్ణ్యమూర్ఛాజ్వరకాసహిక్కా
శ్వాసాస్యవైరస్యతృషాప్రమోహాః,
ఛర్దిః కఫోత్క్లేశరుజోఽరుచిశ్చ
హృద్రోగజాః స్యుః వివిధాస్తథాన్యే. 78

వ్యా. శరీరమున వర్ణము మారుట, మూర్ఛ, జ్వరము, దగ్గు, హిక్కా-శ్వాసములు, నోట రుచి తెలియకుండుట, దప్పి, మైకము, వాంతి, నోట కఫము వెడలుట, నొప్పి మున్నగుబాధలు కల్గుట, అరోచకము, ఇవి మున్నగు పలుదెరంగులైన రోగములు హృద్రోగమువలన కల్గును.

ఇచ్చట "హృద్రోగజాః" అని చెప్పుటవలన నీరోగములు హృద్రోగము జనించినపిదప దానగల్గు నుపద్రవము లని తెలిసెడి. లేక "హృద్రోగేణ సమం జాయన్త ఇతి హృద్రోగజాః" అని విగ్రహమును వివక్షించి హృద్రోగము సంభవించునపుడే కూడ పుట్టునవి యని యర్థముచేయునెడ హృద్రోగమునకు సామాన్యలక్షణములు వైవర్ణ్యాదులని చెప్పదగును.

### వాతికాదిహృద్రోగముల వేరువేరులక్షణములు.

మూ. హృచ్ఛూన్యభావద్రవశోషభేద
స్తమ్భాస్సమోహాః పవనాద్విశేషః;
పిత్తాత్తమోదూయనదాహమోహాః
సన్త్రాసతాపజ్వరపీతభావాః. 79
స్తబ్ధం గురు స్యాత్ స్తిమితం చ మర్మ
కఫాత్ ప్రసేకజ్వరకాసతన్ద్రాః,
విద్యాత్ త్రిదోషం త్వతిసర్వలిఙ్గం
తీవ్రార్తితోదం క్రిమిజం సకణ్డూమ్. 80

వ్యా. వాతజహృద్రోగమున హృదయమున నేదియు దోచక శూన్యముగ నుండును. ద్రవము శోషించును. పగులదీయునట్లు బాధ కల్గును. హృదయము స్తంభించియుండును, మూర్ఛ గ్రమ్మును, పిత్తమున జనించిన హృద్రోగమున మైకము గ్రమ్మును, కంపము కల్గును, మంట పుట్టును, మూర్ఛ గ్రమ్మును, భయము పుట్టును, తాపంబును

జ్వరంబును కల్గును, శరీరము పచ్చబడును, కఫమున గల్గిన హృద్రోగమున హృదయము స్తంభించును, బరువుగ నుండును, తడపబడినట్లు జడముగ నుండును, నోట జొల్లు కారును, జ్వరంబును కాసంబును కునికిపాటును కల్గును, సన్నిపాతహృద్రోగమున త్రిదోషములకును వేరువేర జెప్పినలక్షణములు మిశ్రములుగ నుండును. క్రిమిజహృద్రోగమున మిగుల తీవ్రమైన నొప్పియు పోటును కల్గి, గులగులయని జిల గల్గియుండును.

## హృద్రోగచికిత్స.

మూ. తైలం ససౌవీరకమస్తు తక్రం
వాతే ప్రదేయం లవణం సుఖోష్ణం,
మూత్రాంబుసిద్ధం లవణైశ్చ తైలం
ఆనాహగుల్మార్తిహృదామయఘ్నమ్. 81

వ్యా. సౌవీరకమును కాంజికము, పెరుగుమీదితేట, మజ్జిగ, నువ్వులనూనె, వీనిని సమభాగములుగ గూర్చి సైంధవలవణమును జేర్చి పక్వముజేసి వాతికహృద్రోగమున త్రాగించవలెను. మరియు తైలమునకు సమభాగముగ జలమును, సమభాగము గోమూత్రంబును లవణముల ఒకటిగ గూర్చి పక్వముచేసి త్రాగినచో ఆనాహంబును గుల్మంబును హృద్రోగంబును శమించును.

## వాతికహృద్రోగహారపునర్నవాదితైలము.

మూ పునర్నవాం దారు సపఞ్చమూలం
రాస్నాం యవాన్ బిల్వకులుత్థకోలం,
పక్త్వా జలే తేన విపాచ్య తైలం
అభ్యఙ్గపానేఽనిలహృద్గదఘ్నమ్. 82

వ్యా. గలిజేరు, దేవదారు, పంచమూలములు, సన్నరాష్ట్రము, యవలు, మారేడు, ఉలవలు, రేగు, వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి నాలుగింత జలమున వైచి నాల్గవపాలు మిగులునట్లు కషాయము గాచి, దానికి నాల్గవపాలు తైలమును కలిపి విధ్యుక్తప్రకారము పక్వముజేసి, యాతైలమును అభ్యంగనమునకును పానమునకును ఉపయోగించినయెడ వాతముచే గల్గిన హృద్రోగమును హరించును.

## వాతికగుల్మాదిహారహరీతక్యాదిఘృతము.

మూ. హరీతకీనాగరపుష్కరాహ్వైః
వయఃకయస్థాలవణైశ్చ కల్కైః,

సహిఙ్గుభిః సాధితమగ్ర్యసర్పిః
గుల్మే సహృత్పార్శ్వగదేఽనిలోత్థే. 83

వ్యా. కరకకాయలు, శుంఠి, పుష్కరమూలము, వయఃస్థ (తిప్పతీగె), కాయస్థ ఉసిరికకాయలు, పంచలవణములు, ఇంగువ, వీనిని కల్కము జేసి ఘృతపాకవిధిప్రకారము సిద్ధముచేయబడిన ఘృతము వాతముచే గల్గిన గుల్మమునందును హృద్రోగము నందును పార్శ్వశూలమునందు నుపయోగింపందగును.

ఇచ్చట తిప్పతీగెస్వరసమును ఉసిరికకాయలస్వరసమును ప్రత్యేకము ఘృతము నకు సమభాగములుగ గూర్చి, తక్కిన హరీతక్యాదిద్రవ్యములకల్కమును ఘృతమునకు నాల్గవవంతు కలిపి, ఘృతపాకవిధిప్రకారము పక్వము చేయనగును. ఇది చక్రపాణిదత్త వ్యాఖ్యానుగృహీతకల్పనము. మరియు "వయః కయస్థా" అనుచోట వయఃస్థా, కయస్థా (కాయస్థ), అని సమన్వయము చేయుడినది. 'కాయస్థా' అనుటకు బదులు ఛందోభంగ భయముచే 'కయస్థ' యని హ్రస్వోచ్చారణము ఆర్షము.

మూ. సపుష్కరాహ్వం ఫలపూరమూలం
మహౌషధం శట్యభయా చ కల్కాః,
క్షారామ్బుసర్పిః లవణై ర్విమిశ్రాః
స్యుర్వాతహృద్రోగవికర్తికాఘ్నాః. 84

వ్యా. పుష్కరమూలము, మాదీఫలవృక్షముయొక్క వేళ్లు, శుంఠి, కచోరములు, కరకకాయలబెరడు, వీనిని కల్కముచేసి యీకల్కమును క్షారోదకమును ఘృతమును లవణమును ఒకటిగ కలిపి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి యుపయోగించినచో వాతమున గల్గిన హృద్రోగంబును, హృదయమున కత్తిరించిన విధముగ గల్గు బాధయు నివర్తించును.

## వాతికహృద్రోగమునకు పౌష్కరమూలాది క్వాథపానము.

మూ. క్వాథః కృతః పౌష్కరమాతులుఙ్గ
పలాశభూతీకశటీసురాహ్వైః,
సనాగరాఽజాజివచాయవానీ
క్షారస్సుఖోష్ణో లవణాశ్చ పేయః. 85

వ్యా. పుష్కరమూలము, మాదీఫలపువేళ్లు, మోదుగచెక్క, కామంచిపూరి, కచోరములు, దేవదారుచెక్క, వీనిని సమభాగములుగ గూర్చి క్వాథముచేసి అందు

శుంఠి, జీలకర, వస, ఓమము, యవక్షారము, పంచలవణములను వీనిని కల్కముచేసి కలిపి సుఖోష్ణముగ నున్నపుడు త్రాగిన వాతికహృద్రోగము శమించును.

హృదయశూలాదులకు పథ్యాదికల్కపానము.

మూ. పథ్యాశటీపౌష్కరపఞ్చకోలాత్
సమాతులుఙ్గాత్ యమకేన కల్కః,
గుడప్రసన్నాలవణైశ్చ భృష్టో
హృత్పార్శ్వపృష్ఠోదరయోనిశూలే 86

వ్యా. కరకకాయలబెరడు, కచోరములు, పుష్కరమూలము, పంచకోలములు (పిప్పళ్లు, మోడి, చవ్యము, చిత్రమూలము, శుంఠి), మాదీఫలములు, వీనిని సమభాగములుగ గూర్చి యమకస్నేహముతో (నెయ్యి నూనె సమములుగ గూడినస్నేహముతో) వేయించి నూరి కల్కముచేసి, మద్యముపై తేటలో కలిపి, అందు బెల్లమును లవణమును కలిపి త్రాగినయెడ హృదయమునందును పార్శ్వములయందును వీపునందును ఉదరమునందును యోనియందును కల్గిన శూల నివర్తించును. (ఇచ్చట "పిప్పలీపిప్పలీమూలం చవ్యచిత్రకనాగరమ్, పఞ్చకోలమిదం ప్రాహుః" అనుపారిభాషికపంచకోలముల నెరుంగునది.)

త్ర్యూషణాదిఘృతము.

మూ. స్యాత్త్ర్యూషణం ద్వే త్రిఫలే సపాఠే
నిదిగ్ధికా గోక్షురకా బలే ద్వే,
ఋద్ధిస్త్రుటిస్తామలకీ స్వగుప్తా
మేదే మధూకం మధుకం స్థిరా చ. 87
శతావరీ జీవకపృశ్నిపర్ణ్యౌ
ద్రవ్యైరిమైరక్షసమైః సుపిష్టైః,
ప్రస్థం ఘృతస్యైహ పచేద్విధిజ్ఞః
ప్రస్థేన దధ్నా త్వథ మాహిషేణ. 88
మాత్రాం పలం చార్ధపలం పిచుం వా
ప్రయోజయేన్మాక్షికసమ్ప్రయుక్తాం,
శ్వాసే సకాసే త్వథ పాణ్డురోగే
హలీమకే హృద్గ్రహణీప్రదోషే. 89

వ్యా. త్రికటుకములు, త్రిఫలములు (కరక-తాని-ఉసిరికకాయలు), స్వాదుత్రిఫలములు (ద్రాక్షపండు, ఖర్జూరపుపండు, గుమ్మడిపండు), చిరుబొద్ది, వాకుడు, పల్లేరు, చిట్టాముట్టి, పేరాముట్టి, బుద్ధి పిన్నయేలకులు, నేలయుసిరిక, దూలగొండి, మేద, మహామేద, ఇప్ప, అతిమధురము, కోలపొన్న, పిల్లిపీచర, జీవకము, ముయ్యాకుపొన్న, వీనిని ప్రత్యేకము కర్షప్రమాణమువంతున కూర్చి మెత్తగ నూరి కల్కముచేసి, ఒకప్రస్థపరిమితమైన ఘృతమున జేర్చి, ప్రస్థపరిమితమైన యెనుపపెరుగును కూడ కలిపి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేయునది.

ఈఘృతమును ఒకపలము, అరపలము, లేక అక్షు (కాలుపలము) పరిమాణముగ గ్రహించి, అందు తేనెను కలిపి ప్రతిదినంబును సేవించవలెను. ఇయ్యది శ్వాసకాసముల యందును, పాండురోగమునందును, హలీమకమునందును, హృద్రోగమునందును, గ్రహణిరోగమునందును విశేషముగ నుపయోగింపందగును.

(ఇచ్చట 'ద్వే త్రిఫలే' అనుచోట రెండవ త్రిఫలములు మధురత్రిఫలములని యెరుంగునది. ('ద్రాక్షాఖర్జూరకాశ్మర్యఫలానీతి ఫలత్రయం' అని పరిభాష) ఇంతదనుక వాతికహృద్రోగచికిత్స.

## పైత్తికహృద్రోగచికిత్స.

మూ. శీతాః ప్రదేహాః పరిషేచనాని
తథా విరేకో హృది పిత్తదుష్టే,
ద్రాక్షాసితాక్షౌద్రపరూషకైః స్యాత్
శుద్ధే తు పిత్తాపహమన్నపానమ్. 90

వ్యా. పిత్తజహృద్రోగమునందు శీతప్రధానములుగ నుండు ద్రవ్యములచే ప్రలేపములను పరిషేకములను చేయదగును. విరేచనౌషధములయందు ద్రాక్షపండును చక్కెరను తేనెను ఈతపండ్లను కలిపి మృదువిరేచనము చేయవలెను. విరేచనములచే కోష్ఠము శుద్ధమైన పిదప పిత్తహరంబులగు నన్నపానముల సేవింపనగును.

## పిత్తజహృద్రోగమున కల్కాదులు.

మూ. యష్ట్యాహ్వకాతిక్తకరోహిణీభ్యాం
కల్కం పిబేచ్చాపి సితాజలేన,
(పిష్ట్వా పిబేచ్చాపి సితాజలేన
యష్ట్యాహ్వయం తిక్తకరోహిణీం చ)

క్షతే చ సర్పీంషి హితాని, సర్పి
ర్గుడాశ్చ యే తాఙ్ప్రసమీక్ష్య సమ్యక్. 91
దద్యాద్భిషక్ ధన్వరసాంశ్చ గవ్య
క్షీరాశినాం పిత్తహృదామయేషు,
తైరేవ సర్వైః ప్రశమం ప్రయాన్తి
పిత్తామయాః శోణితసంశ్రయా యే. 92

వ్యా. అతిమధురము, కటుకరోహిణి, ఈరెండిటిని జలముతో నూరి కల్కముజేసి చక్కెర కలిపి పిత్తజహృద్రోగమున త్రాగవలెను. మరియు క్షతక్షీణరోగమునకు జెప్పిన ఘృతంబులును, సర్పిర్గుడంబులును, రోగియొక్క బలకాలాదుల జక్కగ గమనించి యుపయోగింపందగును. మరియు జాంగలమాంసరసములను పిత్తజహృద్రోగము కల వారు త్రాగి పాలతో నన్నమును భుజింపవలెను. అట్టి చికిత్సలచే పిత్తము కల్గినరోగంబులును రక్తముచే కల్గినరోగంబులును శమించును.

## ద్రాక్షాదిఘృతము.

మూ. ద్రాక్షాబలాశ్రేయసి శర్కరాభిః
ఖర్జూరవీరర్షభకోత్పలైశ్చ,
కాకోలిమేదాయుగజీవకైశ్చ
క్షీరేణ సిద్ధం మహిషీఘృతం స్యాత్. 93

వ్యా. ద్రాక్షపండ్లు, చిట్టాముట్టి, సన్నరాష్ట్రము, చక్కెర, ఖర్జూరపుపండు, మనుబాల, ఋషభకము, నల్లకలువలు, కాకోళి, మేద, మహామేద, జీవకము, వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి కల్కము చేసి బఱ్ఱెనేతితో కలిపి ఆవుపాలను కలిపి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేయబడినఘృతమును పిత్తమున కల్గిన హృద్రోగమున సేవించునది.

## పిత్తజహృద్రోగమున కశేరుకాదిఘృతయోగము.

మూ. కశేరుకాశైవలశృఙ్గబేర
ప్రపౌణ్డరీకం మధుకం బిసస్య,
గ్రన్థిశ్చ సర్పిః పయసా పచేత్తైః
క్షౌద్రాన్వితం పిత్తహృదామయఘ్నమ్. 94

వ్యా. నమ్మదుంప, పాచితీగెలు, అల్లము, ప్రపౌండరీకమను గ్రంథ్యము, అతి మధురము, తామరగడ్డ, వీనిని సమభాగములుగ కల్కముచేసి కల్కమునకు నాల్గింత ఘృతమును చేర్చి, ఘృతమునకు సమభాగము ఆవుపాలు కలిపి విధ్యుక్తముగ పక్వము చేయబడిన ఘృతమున నాల్గవవంతు తేనె కలిపి సేవించిన పిత్తజహృద్రోగము శమించును.

## హ్రస్వపంచమూలాదిసిద్ధఘృతము.

మూ. స్థిరాదికల్కైః పయసా చ సిద్ధం ద్రాక్షారసేనేక్షురసేన వాపి,
సర్పిర్హితం స్వాదుఫలేక్షుజాశ్చ రసాస్సుశీతాః హృది పిత్తదుష్టే.

వ్యా. ఘృతమునందు స్థిరాది (హ్రస్వ) పంచమూలకల్కమును కలిపి యందు ఆవుపాలనైనను, ద్రాక్షపండ్లరసమునైనను, చెరకురసమునైనను ఘృతమునకు సమముగ గూర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి పిత్తజహృద్రోగమున సేవింపదగును. మరియు ద్రాక్షపండు మున్నగు మధురరసముకల పండ్లయొక్క స్వరసమునైనను, చెరకు రసమునైనను పిత్తాజహృద్రోగములయందు త్రాగనగును. (ఇది పిత్తజహృద్రోగచికిత్స).

## కఫజహృద్రోగచికిత్సాక్రమము.

మూ. స్విన్నస్య వాన్తస్య విలఙ్ఘితస్య క్రియా కఫఘ్నీ కఫమర్మరోగే,

వ్యా. కఫముచే జనించిన హృద్రోగమున తొలుత స్వేదవిధిని వమనమును చేయించి, లంఘనముచేసి పిదప కఫహరముగు చికిత్సావిధానమును చేయదగును.

## కఫజహృద్రోగమునం దన్నపానములు.

మూ. కౌలుత్థధాన్యైశ్చ రసైర్యవాన్నం
పానాని తీక్ష్ణాని చ శర్కరాణి (సశర్కరాణి.)  96

వ్యా. ఉలవలకట్టుగా దనియాలను చేర్చి పక్వముచేసి దానితో యవాన్నమును భుజింపవలెను. తీక్ష్ణద్రవ్యములతో గూడిన పానములును కఫజహృద్రోగమున సుఖకరములగును.

## కఫజహృద్రోగమున చూర్ణయోగములు.

మూ. మూత్రే శృతాః కట్ఫలశృఙ్గిబేర
పీతద్రుపథ్యాతివిషాః ప్రదేయాః,
కృష్ణాశటీపుష్కరమూలరాస్నా
వచాభయానాగరచూర్ణకం చ.  97

వ్యా. కాయఫలము, శుంఠి, మ్రానిపసుపు, కరకకాయబెరడు, అతివస, వీనిని సమభాగములు గూర్చి గోమూత్రమున నునుకబెట్టి యెండించి చూర్ణముచేసి యుపయోగించదగును. మరియు పిప్పళ్లు, కచోరములు, పుష్కరమూలము, సన్నరాష్ట్రము, వస, కరకకాయబెరడు, శుంఠి వీనిని సమభాగములుగ గూర్చి చూర్ణముచేసి కఫజహృద్రోగమున నుపయోగించునది.

## కఫజహృద్రోగహరలేహము.

మూ. ఉదుమ్బరాశ్వత్థవటార్జునాఖ్యే
పాలాశరోహీతకఖాదిరే చ,
క్వాథే త్రివృత్త్ర్యూషణచూర్ణసిద్ధో
లేహః కఫఘ్నోఽశిశిరామ్బుయుక్తః. 98

వ్యా. అత్తి, రావి, మఱ్ఱి, మద్ది, మోదుగ, ములుమోదుగ, చండ్ర వీనిచెక్కలను సమభాగములుగ గూర్చి పరిభాషానుసారముగ నాల్గవపాలు మిగులునట్లు కషాయము కాచి, అందు తెగడను, త్రికటుకములును చూర్ణముచేసి లేహపాకవిధిప్రకారము లేహముచేసి అగ్నిబలానుసారముగ వేడినీళ్లను అనుపానముగ జేసి సేవించినయెడ కఫముచే జనించిన హృద్రోగము శమించును.

ఇచ్చట "ద్రవం చతుర్గుణం దద్యాత్" అనుపరిభాష ననుసరించి తెగడ మున్నగు చూర్ణమునకు నాల్గింతలు ఉదుమ్బరాది సిద్ధక్వాథమును చేర్చి చూర్ణమునకు రెట్టింత బెల్లమునైనను, చక్కెరనైనను చేర్చి లేహపాకము చేయదగును.

## కఫజహృద్రోగమున శిలాజతుమున్నగురసాయనయోగములు.

మూ. శిలాహ్వయం వా భిషగప్రమత్తః
ప్రయోజయేత్కల్పవిధానదృ(ది)ష్టం,
ప్రాశం తథాఽగస్త్యమతాపి లేహం
(ప్రాశ్య తథాఽగస్త్య హరీతకీ చ)
రసాయనం బ్రాహ్మ మథామలక్యా. 99

వ్యా. మరియు కఫజహృద్రోగమునందు శిలాజతువును, కరప్రచతీయరసాయనపాదమున చెప్పబడిన కల్పమున చెప్పబడిన కల్పము ననుసరించి విధ్యుక్తప్రకారము

సేవింపదగును. మరియు రసాయనప్రకరణమున చెప్పబడిన చ్యవనప్రాశమును, అగస్త్య ప్రోక్తఅగస్త్యహరీతకీలేహమును కరప్రచతీయరసాయనమునచెప్పబడిన ఆమలకరసాయనమును బ్రాహ్మీరసాయనమును విధ్యుక్తప్రకారము సేవింపదగును. (ఇది కఫజహృద్రోగ చికిత్స.)

సాన్నిపాతికహృద్రోగచికిత్సావిధి.

మూ. త్రిదోషజే లఙ్ఘనమాదితః స్యాత్
అన్నం చ సర్వేషు హితం విధేయం,
హీనాతిమధ్యత్వమవేక్ష్య చైవ
కార్యం త్రయాణామపి కర్మ శస్తమ్. 100

వ్యా. త్రిదోషప్రకోపమున కల్గిన హృద్రోగమునందు తొలుత లంఘనము చేయదగును. త్రిదోషములకును హితముగ చెప్పబడిన అన్నపానవిధి ననుసరించి మిశ్రముగ చేయనగును. అందును వాతాదిదోషముల మూటిలో హీనాధిక-మధ్యరూపమయిన తారతమ్యమును చక్కగ గమనించి ఆయాదోషానుసారముగ నాహారాదివిధుల గల్పింపదగును.

ఇచ్చట త్రిదోషప్రకోపమునందు రోగమునకు ప్రధానాశ్రయమయిన హృదయము కఫమునకు స్థానమగుటంజేసి అట్టి కఫమును జయించుటకై తొలుత లంఘనము విధింపబడినది. పిమ్మట వాతాదిదోషములతారతమ్యము ననుసరించి ఆయాదోషములకు వేరువేరు జెప్పబడిన యాహారౌషధముల గల్పింపవలయునని ముఖ్యభావము.

సన్నిపాతహృద్రోగమున దోషాధిక్యమునుబట్టి చికిత్స.

మూ. భుక్తేఽధికం, జీర్యతి శూలమల్పం
జీర్ణే స్థితం చేత్సురదారుకుష్ఠం,
సతిల్వకం ద్వే లవణే విడఙ్గ
ముష్ణామ్బునా సాతివిషం పిబేత్సః. 101

వ్యా. సాన్నిపాతిక హృద్రోగమునందు భుజించినవెంటనే శూలమధికమై జీర్ణమగునపుడు స్వల్పముగనుండి జీర్ణమైనపిదప శమించియున్నయెడ నయ్యది కఫాధిక హృద్రోగమని యెఱుంగునది. అట్టియెడ దేవదారుచెక్క, చెంగల్వకోష్టు, లొద్దుగుచెక్క, సౌవర్చలవణము సైంధవలవణము అను లవణద్వయము, వాయువిడంగములు, అతివస,

వీనిని సమభాగములుగ గూర్చి చూర్ణముచేసి వేడినీళ్ల నను పానముగ జేసికొని త్రాగ వలయును.

హృద్రోగమున దోషాధిక్యమునుబట్టి విరేచనవిధి.

మూ. జీర్ణేఽధికే స్నేహవిరేచనం స్యా
త్ఫలైర్విరేచ్యో యది జీర్యతి స్యాత్,
త్రిష్వేవ కాలేష్వధికే తు శూలే
తీక్ష్ణం హితం మూలవిరేచనం స్యాత్. 102

వ్యా. భుజింపబడిన యాహారము జీర్ణమయినవెంటనే హృదయమున శూలమధికముగ నయినయెడ నయ్యది వాతాధిక హృద్రోగమని యెరుంగునది. అట్టియెడ ఆముదము మున్నగు స్నేహద్రవ్యములచే విరేచనము చేయించుట మంచిది. మరియు ఆహారము జీర్ణమగునప్పుడు శూలమధికమైనయెడ నయ్యది పిత్తాధికమని యెరుంగునది. అట్టియెడ ద్రాక్షపండ్లు మొదలగు ఫలములచే మృదువిరేచనము నుపయోగించునది. భుజింపబడిన యాహారము జీర్ణమగు సమయమునందును, జీర్ణముకాకముందును, జీర్ణమయిన పిమ్మటను కూడ హృదయమున శూలము ఏకరీతిగ బాధించుచున్నయెడ నయ్యది సమముగ ప్రకోపమునొందిన త్రిదోషముచే కల్గినదని తెలియందగును. అట్టియెడ తెగడవేళ్లు మున్నగు తీక్ష్ణద్రవ్యములచే విరేచనము చేయించుట మిగుల హితకరము.

హృద్రోగమున శోధనావశ్యకత.

మూ, ప్రాయోఽనిలో రుద్ధగతిః ప్రకుప్య
త్యామాశయే శోధనమేవ తస్మాత్,
కార్యం తథా లఙ్ఘనపాచనం చ.

వ్యా. హృద్రోగము లన్నిటియందును వాతము నడ్డగింపబడినదియై ప్రకోపము నొంది ఆమాశయమున చేరియుండును. కావున త్రిదోషప్రకోపమునజనించిన హృద్రోగములయందు ఆమాశయమునందు వాతమును జయించుటకై తొలుత విరేచనమును చేయించవలయును. పిమ్మట లంఘనపాచనముల చేయనగును. (వాతహరచికిత్సలలో వస్తికర్మ విధానము చెప్పబడినను ఆమాశయమును శుద్ధముగ జేయుటకై ఇచ్చట విరేచనము విధింపబడినదని యెరుంగునది.

క్రిమిజహృద్రోగచికిత్స.

మూ. సర్వం క్రిమిఘ్నం కృమిజేహృద్గదే చ. 103

(ఇతి హృద్రోగచికిత్స.)

వ్యా. క్రిములచే సంభవించిన హృద్రోగమునందు వ్యాధితరూపీయము క్రిమిహారములుగ జెప్పబడిన చికిత్సలు చేయవలయును. ఇచ్చట విమానస్థానమునందలి వ్యాధితరూపీయాధ్యాయమున "చికిత్సితం తు ఖల్వేషాం" అని యుపక్రమించి చెప్పబడిన క్రిమిచికిత్సావిధానము సెరుంగునది. (ఇంతదనుక హృదయమర్మము నాశ్రయించిన రోగముల చికిత్స చెప్పబడినది.)

శిరోమర్మము నాశ్రయించినరోగములు, వానిచికిత్సలు.

(అధ్యాయప్రారంభమున "మర్మాణి వస్తిం హృదయం శిరశ్చ ప్రధానభూతాని" అని మర్మములలో ప్రధానములుగ నిర్దేశింపబడిన మూటిలో వస్తి హృదయమర్మముల రెంటిని ఆశ్రయించిన రోగములును వానిచికిత్సలును వేరువేరుగ వివరింపబడినవి. పిమ్మట ప్రధానభూతమలయిన శిరోమర్మము నాశ్రయించిన రోగములును వాని చికిత్సలును క్రింద వివరింపబడును. అందు అట్టి మర్మమునాశ్రయించిన రోగములలో పీనసము ప్రధానము. అనేకరోగములకు హేతువైనది. ఈవిషయమునే శాలాక్యతంత్రమున నిట్లుపదేశించిరి:—"భూయిష్ఠం వ్యాధయః సర్వే ప్రతిశ్యాయనిమిత్తజాః, తస్మాద్రోగః ప్రతిశ్యాయః పూర్వమేవోపదిశ్యతే" శిరోరోగము లన్నియు ప్రతిశ్యాయ (పీనస)మును కారణముగ జేసికొని సంభవించును. కావున నియ్యది శిరోరోగముల కన్నిటికిని ప్రధానమని భావము.

మరియు రాజయక్ష్మచికిత్సితమున ప్రతిశ్యాయము విస్తరముగ జెప్పబడినది. అయినను అచ్చట రాజయక్ష్మమునకు పూర్వరూపముగ జెప్పబడెను. ఇచ్చట స్వతంత్రముగ జెప్పబడునని విశేషము సెరుంగునది. పైజెప్పినరీతిగ శిరోరోగము లన్నిటియందును ప్రధానమగుటవలన ప్రతిశ్యాయము తొలుత చెప్పబడును.)

ప్రతిశ్యాయనిదానము.

మూ　సంధారణాజీర్ణరజోఽతిభాష్యక్రోధర్తువైషమ్యశిరోఽభితాపైః,
ప్రజాగరాతిస్వపదామ్బుశీతైః అవశ్యయా మైథునబాష్పధూమైః.
సంస్త్యానదోషే శిరసి ప్రవృద్ధో వాయుః ప్రతిశ్యాయముదీరయేత్తు,

వ్యా. మలమూత్రాదివేగముల నిరోధించుట, అజీర్ణకరములగు ఆహారముల భుజించుట, దుమ్ము మొదలగునవి నాసాదిరంధ్రములయందు ప్రవేశించుట, అధికముగ మాటలాడుట, క్రోధము, ఋతుధర్మము వ్యత్యస్తముగ నుండుట, లేక ఋతుచర్యాధ్యాయమున చెప్పబడిన ఆయాఋతుచర్యలను వ్యత్యస్తముగ నాచరించుట, శిరస్సునం దభిఘాతముచే తాపము గల్గుట, రాత్రులయందు నిదుర మేల్కాంచి యుండుట,

పగటియం దధికముగ నిదురించుట, చల్లని జలము నుపయోగించుట, మంచులో సంచరించుట, స్త్రీసంభోగము నధికముగ జేయుట, దుఃఖముచే కన్నీళ్లు కార్చుట ఈకారణములచేత శిరస్సునందలి దోషములు మూడును ప్రకోపించి ఘనీభవించును. అందు వాతము మిక్కిలి వృద్ధినొంది ప్రతిశ్యాయమనురోగమును కల్గించును.

పీనససామాన్యలక్షణము తంత్రాంతరమున నిట్లుచెప్పబడినది:—"మస్తులుఙ్గోచితః శ్లేష్మా యదా పిత్తాఽవదహ్యతే, తదాసృక్పిచ్ఛిలం నాసా బహుసింఘాణకం స్రవేత్. సకణ్డూదాహపాకం చ తంతవిద్యాద్ధిపీనసం." శిరమునందలి మెదడుకు సంబంధించిన శ్లేష్మము పిత్తముచే తపింపబడి రక్తముతో కూడి పిచ్ఛిలమై నాసారంధ్రములనుండి యెడలేక స్రవించుచుండును. అట్టియెడ దురదయు మంటయు గల్గి నాసారంధ్రములు పుండగును. ఇవియే ప్రతిశ్యాయస్వరూపము.

### వాతికాదిపీనసముల వేరువేరులక్షణములు.

మూ. ఘ్రాణార్తితోదౌ శ్వయథుర్జలాభస్రావోఽనిలాత్స్వరమూర్ధరోగః
నాసాగ్రపాకజ్వరవక్త్రశోషతృష్ణోష్ణపీతస్రవణాని పిత్తాత్,
కాసారుచిస్రావఘనప్రసేకాః కఫాద్గురుః స్రోతసి చాపి కణ్డూః. 106
సర్వాణి రూపాణి తు సన్నిపాతాత్స్యుః పీనసే తీవ్రరుజేఽతిదుఃఖే,

వ్యా. వాతముచే గల్గినపీనసమునందు నాసారంధ్రములలో నొప్పియు సూదులు పొడిచినట్లు పోటును గల్గును. తుమ్ములు వెడలును, నీళ్లవలె పలుచనైన ద్రవము ముక్కుల నుండి కారును. కంఠధ్వని మారును, తల నొచ్చును.

పిత్తమున గల్గిన పీనసమునందు ముక్కు కొనస పుండగును. జ్వరమువచ్చును. నోరు తడిలేక యెండును. దప్పి కల్గును. పచ్చనిరంగు కల్గి వేడిగ నుండుద్రవము ముక్కులనుండి స్రవించును.

కఫముచే కల్గిన పీనసమునందు దగ్గు, అరుచియు కల్గును. నాసారంధ్రములనుండి చిక్కనైన ద్రవము స్రవించును. నోట చిక్కనైన జొల్లుకారును. నాసారంధ్రముల యందు తీవ్రమైన దురదకల్గును.

సన్నిపాతమున కల్గిన పీనసమునందు వాతాదులకు వేరువేరుగ జెప్పిన లక్షణము లన్నియు కల్గును. మిక్కిలి కష్టమును కల్గించు తీవ్రమైనబాధలు కల్గును. (అష్టోదరీయాధ్యాయమున రోగభేదముల నుద్దేశించుతరి "చత్వారః ప్రతిశ్యాయాః వాత-పిత్త-కఫ-సన్నిపాతనిమిత్తజా" అని (సూ. 19 అధ్యాయమున) నిర్దేశించబడిన పీనసభేదముల నాల్గిటికిని ఇచ్చట లక్షణముల చెప్పబడినవి.)

## దుష్టప్రతిశ్యాయము దాన గల్గురోగములును.

మూ. సర్వోతివృద్ధోహితభోజనాత్తు దుష్టప్రతిశ్యాయ ఉపేక్షితస్స్యాత్
తతస్తు రోగాః క్షవథుశ్చ నాసాశోషః ప్రతీనాహపరిస్రవౌ చ,
ఘ్రాణస్యపూతిత్వమపీనసశ్చ సపాకశోథార్బుదపూయరక్తాః. 108
అరూంషి శీర్షశ్రవణాక్షిరోగఖాలిత్యహర్యర్జునలోమభావాః,
తృట్ శ్వాసకాసజ్వరరక్తపిత్తవైస్వర్యశోషాశ్చ తతో భవన్తి.

వ్యా. పైజెప్పిన పీనసరోగములయందు తగిన చికిత్స జేయక యుపేక్షించి అపథ్యములగు నన్నపానాదుల సేవించుటవలన యవి మిక్కిలి దుష్టములగును. దానంజేసి తుమ్ము లధికముగ వెడలును. నాసారంధ్రములు ద్రవము లేక యెండును. నాసారంధ్రములు బిగదీసి బలవంతముగ కొంచెము ద్రవము స్రవించును. నాసారంధ్రములు పుండగును. మరియు శోథము, నాసార్బుదము కల్గును. నాసారంధ్రములనుండి చీమును రక్తమును వెడలును. బొబ్బలు లేచును. శిరోరోగంబులును, కర్ణరోగంబులును, నేత్రరోగంబులును సంభవించును. తలవెండ్రుక లూడి బట్టకట్టును. లేక వెండ్రుకలు పచ్చగనైనను, తెల్లగనైనను, వర్ణము మారియుండును. దప్పియు శ్వాసకాసంబులును, జ్వరంబును, రక్తపిత్తంబును, స్వరభేదంబును, శోషంబును, పైజెప్పిన దుష్టప్రతిశ్యాయము వలన కల్గును. (ఇచ్చట శిరోరోగశబ్దముచేతనే ముఖరోగము కూడ సంగృహీతమని యెరుంగునది.)

## దుష్టపీనసలక్షణములు.

మూ. రోధాభిఘాతస్రవశోషపాకైః
ఘ్రాణం యుతం యశ్చ న వేత్తి గన్ధం,
దుర్గన్ధి చాస్యం బహుళః ప్రకోపి
దుష్టప్రతిశ్యాయముదాహరేత్తమ్. 110

వ్యా. పైజెప్పబడిన దుష్టప్రతిశ్యాయమున నాసారంధ్రములు బిగదీసి శ్వాస నడ్డగింపబడును. అట్టి యభిఘాతముతో కూడి ద్రవము స్రవించును. ముక్కులు శోషించి పుండగును. ఘ్రాణేంద్రియము గంధమును గ్రహింపనేరదు. నోరు దుర్గంధము కల్గియుండును. కారణము లేకయే రోగము పలుమారు ప్రకోపము నొందును. ఈలక్షణములు కల్గినది దుష్టప్రతిశ్యాయమని చెప్పబడును. (దీనినే విషపడిసెమని చెప్పెదరు.

మరియుం "మూర్ఛన్తి చాత్ర కృమయో దీర్ఘస్స్నిగ్ధసితాణవః" అను వాగ్భటవాక్య ప్రకారము సన్నని పురుగులు నాసారంధ్రములలో కల్గునని తెలిసెడి.)

### క్షవథులక్షణము.

మూ. సంప్రశ్య మర్మాణ్యనిలస్తు మూర్ధ్ని విష్వక్పథస్థః క్షవథుం కరోతి,

వ్యా. వాతము ప్రకోపమునొంది శిరస్సునందలి మార్గము లన్నిటియందును వ్యాపించి నాసికయందలి మర్మముల జేరి నాసారంధ్రములనుండి గొప్ప శబ్దముతో గూడి బైట వెడలును. అయ్యది క్షవథువని చెప్పబడును.

క్షవథులక్షణమును మాధవకరు లిట్లు చెప్పెను:—"ఘ్రాణాశ్రితే మర్మణి సమ్ప్రదుష్టః యస్యానిలో నాసికయా నిరేతి, కఫానుజాతో బహులోఽతిశబ్దః తం రోగమాహుః క్షవథుం విధిజ్ఞాః" (మాధ-నాసారోగము) నాసిక నాశ్రయించిన శృంగాటకమను మర్మమునందు వాతము దుష్టమై కఫముతో గలసి మిక్కిలి శబ్దమును గల్గించుచు నాసారంధ్రములనుండి బైట వెడలును. దీనిని క్షవథు (తుమ్ము) రోగమని చెప్పెదరు అని యర్థము. ఈవాక్యముచేత కఫము వాతము చేరియుండునని తెలిసెడి. (ఘ్రాణమును శ్రోత్రములను నేత్రములను తృప్తినందించు సిరలు చేరునట్టి నాసామూలస్థానము శృంగాటకమర్మమని యెరుంగునది.)

### నాసాశోషణలక్షణము.

మూ. క్రుద్ధస్స సంశోష్య కఫం తు నాసాశృంగాటకఘ్రాణవిశోషణం చ.

వ్యా. వాతము ప్రకోపమునొంది కఫమును ద్రవము లేక యెండించి నాసారంధ్రములయందును శృంగాటకమను నాసామర్మమునను ద్రవమును శుష్కింపజేయును. ఇయ్యది నాసాశోషణమను నాసికారోగము. (వాగ్భటాచార్యులు—"శూకపూర్ణాభనాసాత్వం కృచ్ఛ్రాదుచ్ఛ్వసనం తతః" (అ. హృ. ఉ. అ. ౧౯) అని చెప్పిరి. కావున నీరోగమున నాసారంధ్రములయందు ముండ్లు నిండియుండునట్లు బాధయు కల్గి నిశ్వాసవాతము చాల కష్టముతో వెడలునని తెలిసెడి).

### ప్రతీనాహలక్షణము.

మూ. ఉచ్ఛ్వాసవాతం తు కఫస్సవాతో
రున్ధ్యాత్ప్రతీనాహముదాహరేత్తమ్,

వ్యా. కఫము ప్రకుపితమై వాతముతో గలిసి నాసారంధ్రముల నడ్డగించును. దానంజేసి ఉచ్ఛ్వాసము మిగుల కష్టముచే వెడలును. ఇయ్యది ప్రతీనాహమను నాసారోగము. (దీనిని వాగ్భటాచార్యులు నాసానాహమని చెప్పిరి).

## పరిస్రవలక్షణము.

మూ. యో మస్తులుఙ్గాద్ఘనపీతపక్వః కఫస్స్రవేదేష పరిస్రవస్తు. 112
(ఘ్రాణాద్ఘనః పీతసితస్తనుర్వా దోషస్స్రవేత్ స్రావముదాహరేత్తం)

వ్యా. శిరస్సునందలి బుద్ధికి స్థానమైన మస్తిష్కము (మెదడు) నుండి కఫము ఘనీభవించి పచ్చనిరంగు కల్గి పక్వమై నిరంతరముగ స్రవించిన నయ్యది పరిస్రవమను నాసారోగ మనబడును. (వాగ్భటమున "విశేషాన్నిశి జాయతే" అని యుండుటవలన నీస్రావము రాత్రులయందు మిక్కుటముగ నుండునని తెలిసెడి).

## పూతినస్యలక్షణము.

మూ. వైవర్ణ్యదౌర్గన్ధ్యముపేక్షయా తు
స్యాత్ పూతినస్యం శ్వయథుః భ్రమశ్చ,

వ్యా. పైజెప్పబడిన స్రావమును చికిత్సజేయక యుపేక్షించినచో కఫము వివర్ణమై దుర్గంధము కల్గి నాసారంధ్రములనుండియు నోటినుండియు వెడలును. దీనివలన నాసికయందు వాపును భ్రమంబును కల్గును. ఇయ్యది పూతినస్యమను నాసారోగమని చెప్పబడును. (ఈరోగమును పూతినాసమని వాగ్భటులు చెప్పిరి.)

## అపీనసలక్షణము.

మూ. ఆనహ్యతే యస్య విశుష్యతే చ
ప్రక్లిద్యతే ధూప్యతి చాపి నాసా. 113
న వేత్తి యో గన్ధరసాంశ్చ జన్తుః
జుష్టం వ్యవస్యేత్తమపీనసేన,
తం చానిలశ్లేష్మభవం వికారం
బ్రూయాత్ప్రతిశ్యాయసమానలిఙ్గమ్. 114

వ్యా. నాసారంధ్రములు బిగదీసి ద్రవము శుష్కించి కుళ్లి పొగవెడలువిధముగ బాధను కల్గించును. అట్టియెడ ముక్కుకు వాసనయు నోటికి మధురాదిరసంబులును (రుచియు) తెలియదు. ఈలక్షణములు కలవ్యాధి అపీనసమని చెప్పబడు. ఇయ్యది వాతకఫములచే జనించును. మరియు నిది ప్రతిశ్యాయమునకు సమానము లైన లక్షణములగల్గియుండును.

ఈవ్యాధిలక్షణములను వాగ్భటాచార్యులు ఇట్లు చెప్పెను:—"కఫః ప్రవృద్ధో నాసాయాం రుద్ధ్వా స్రోతాంస్యపీనసమ్. కుర్యాత్సఘుర్ఘురం శ్వాసం పీనసాధికవేదనమ్,

అవేరివ స్రవత్యస్య ప్రక్లిన్నా లేన నాసికా,అజస్రం పిచ్ఛిలం పీతం పక్వం సింఘాణకం ఘనమ్'' (అ. హృ. ఉ. అ. ౧౯.) ఈవాక్యమునుబట్టి యీవ్యాధియందు కఫము వృద్ధి నొంది నాసారంధ్రముల నడ్డగించుటచేత శ్వాసము గుఱుగుఱుమనుశబ్దముతో కూడి వెడలుననియు, దుష్టమైన నాసామలము ముక్కులనుండి యెడలేక గొట్టెలకు కారు విధముగ ముక్కున కారుచుండుననియు, పీనసమునకంటె నధికమైన బాధ కల్గుననియు తెలిసెడి.

## ఘ్రాణపాకలక్షణము.

మూ. సదాహరాగశ్శ్వయథుస్సపాకః
స్యాత్ ఘ్రాణపాకోఽపి చ రక్తపిత్తాత్,

వ్యా. నాసికలయందు మంటయు రక్తవర్ణంబును కల్గినశోఫము జనించి పుండైన నయ్యది ఘ్రాణపాకమను నాసారోగము. ఇయ్యది రక్తపిత్తములచే జనించును.

## నాసాశ్వయథులక్షణము.

మూ. ఘ్రాణాశ్రితాసృక్ప్రభృతీన్ ప్రదూష్య
కుర్వన్తి నాసాశ్వయథుం మలాశ్చ. 115

వ్యా. వాతాదిదోషములు ప్రకోపమునొంది నాసాపుటము నాశ్రయించిన రక్తమాంసాదుల చెరిచి నాసాపుటమున వాపును కల్గించును. ఇయ్యది నాసాశ్వయథువను నాసారోగము.

## నాసార్బుదలక్షణము.

మూ. ఘ్రాణే తథోచ్ఛ్వాసగతిం నిరుధ్య
మాంసాస్రదోషాదపి చార్బుదాని,

వ్యా. వాతాదిదోషములు ప్రకుపితములై నాసారంధ్రముల జేరి రక్తమాంసముల చెరిచి ఉచ్ఛ్వాసనిశ్వాసముల వెడలనీయక నిరోధించి నాసార్బుదముల గల్గించును. (ఈనాసార్బుదములయందు వాతాదిదోషముల సామాన్యలక్షణములబట్టి దోషభేదముల నిర్ణయించునది. ఈవిషయమునే వాగ్భటులు ''అర్శోఽర్బుదాని విభజేద్దోషలిఙ్గై ర్యథాయథమ్''(అ. హృ. ఉ. అ. ౧౯.) అను వాక్యముచే జెప్పిరి.)

## పూయరక్తలక్షణము.

మూ. ఘ్రాణాత్ స్రవేద్వా శ్రవణాన్ముఖాద్వా
పిత్తాక్తమస్రం త్వపి పూయరక్తమ్. 116

వ్యా. నాసారంధ్రములనుండి యైనను, చెవులనుండియైనను, నోటినుండియైనను పిత్తద్రవముతో కూడినరక్తము స్రవించుచున్నయెడ నయ్యాది పూయరక్తమని చెప్పబడును.

ఈవ్యాధి లక్షణమును వాగ్భటు లిట్లు చెప్పెను:—"నిచయాదభిఘాతాద్వా పూయాసృఙ్నాసికా స్రవేత్, తత్పూయరక్తమాఖ్యాతం శిరోదాహరుజాకరమ్." (అ. హృ. ఉ. అ. ౧౯.) ఈవాక్యమువలన నీవ్యాధి సన్నిపాతముచేనైనను అభిఘాతముచేనైనను కల్గుననియు, శిరస్సునందు మంటను నొప్పిని కల్గించుననియు, చీముతో కూడిన రక్తము వెడలుననియు తెలిసెడి.

## అరూంషికాదీప్తలక్షణములు.

మూ. కుర్యాత్సపిత్తః పవనస్త్వగాదీన్ సన్దూష్య చారూంషి సపాకవన్తి,
నాసా ప్రదీప్తేవ నరస్య యస్య దీప్తం తు తం రోగముదాహరన్తి.

వ్యా. పిత్తముతో కూడిన వాతము చర్మము మున్నగువాని చెరచి నాసారంధ్రములయందు బొబ్బల కల్గించును. అయ్యది పక్వములై పుండగును. ఇయ్యది అరూంషిక యనబడును. (ఇయ్యది శిరస్సున కల్గును.)

మరియు రక్తదోషమువలన నాసారంధ్రములయందు నిప్పునకాల్చినవిధముగ మంటపుట్టిన నయ్యాది దీప్తమను నాసారోగమని యెరుంగునది.

అరూంషికాలక్షణము తంత్రాంతరమున క్షుద్రరోగప్రకరణమున నిట్లు చెప్పబడినది:—"అరూంషి బహువక్త్రాణి బహుక్లేదాని మూర్ధ్ని తు, కఫాసృక్క్రిమికోపేన నృణాం విద్యాదరూంషికా" (మా. ని.) ఈవాక్యముచే నివి కఫ-రక్త- క్రిమిప్రకోపముచే శిరస్సున కల్గునని తెలిసెడి. ఈనాసారోగములలో జెప్పిన యరూంషిక యనునదియు శిరస్సుకు సంబంధించియే కల్గునని చెప్పవలసియున్నది. ఈవిషయమునే చక్రపాణిదత్తవ్యాఖ్యానమున "కుర్యాత్సపిత్త ఇత్యాదినా అరూంషికా మాహ; సాతు శిరోభవా జ్ఞేయా" అని చెప్పియున్నది. వాగ్భటులును "కపాలే క్లేదబహుళాః పిత్తాసృక్శ్లేష్మజన్తుభిః, కణ్డుస్థిద్రాకఫనిభాః పిటికాస్స్యురరూంషికాః" (అ. హృ. ఉ అ. ౨౩) అని చెప్పిరి. నాసికారోగములలో నీతంత్రకారులు దీనిని పఠించిరి. మరియు దుష్టప్రతిశ్యాయముచే గల్గు రోగములను "తతస్తు రోగాః క్షవథుశ్చ......అరూంషి, శీర్షశ్రవణాక్షి...తతో భవన్తి" అని పరిగణనము చేయునప్పుడు దీప్తమనురోగమును వేరుగ జెప్పియుండలేదు. వాగ్భటాదులు దీప్తమను రోగమును నాసారోగములలో జెప్పియున్నారు. వీని కన్నిటికిని సమంజసముగ నీతంత్రకారుల యాశయ మిట్టు లూహింప

దగియున్నది—శిరస్సున జనించిన యరూంషికారోగమునందు నాసారంధ్రములలో నిప్పున కాల్చిన విధముగ మంట బుట్టినయెడ నదియే దీప్తమనియు చెప్పబడునని యీ తంత్రకారుల యభిమతముగ నుండనోపును.

(ఇత్తెరంగున పీనసరోగనిదానంబును, దాన గల్గు నాసారోగములనిదానంబును వివరించి చెప్పబడినది.)

### శిరోరోగనిదానము; లక్షణములును.

మూ. భృశార్తిశూలం స్ఫురతీహ వాతాత్
పిత్తాత్సదాహార్తి కఫాద్గురు స్యాత్,
సర్వైస్త్రిదోషం క్రిమిభిస్తు కణ్డూః
దౌర్గన్ధ్యతోదార్తియుతం శిరస్స్యాత్. 118

(ఇతి శిరోరోగనిదానమ్)

వ్యా. వాతముచే జనించిన శిరోరోగమున మిక్కిలి తీవ్రమైన నొప్పియు శూలమున గ్రుచ్చినవిధముగ పోటును కల్గి శిరస్సు అదరుచుండును. పిత్తమున కల్గిన శిరోరోగమున మంటయు నొప్పియు తీవ్రముగ గల్గును. కఫముచే కల్గిన శిరోరోగమున తల మిక్కిలి బరువుగ నుండును. త్రిదోషములచే గల్గిన శిరోరోగమున వాతాదులకు వేరువేరుగ చెప్పబడిన లక్షణము లన్నియు కల్గును. క్రిములచే గల్గిన శిరోరోగమున తలయందు దురదయు, దుర్గంధంబును, సూదులబొడిచినవిధముగ పోటును, నొప్పియు కల్గును.

అష్టోదరీయాధ్యాయమున రోగముల పరిగణనము చేయుతరి "పఞ్చ శిరోరోగా ఇతి పూర్వోద్దేశమభిసమస్య వాత-పిత్త-కఫ-సన్నిపాత-క్రిమిజా ఇతి" (సూ. అ. ౧౯. సూ. ౨౧.) అని యైదువిధములని చెప్పబడినది. వాని కైదిటికిని యిచ్చట సామాన్య లక్షణము వేరువేరుగ నిర్దేశింపబడినది.

మరియు నీప్రకరణమున ప్రతిశ్యాయమున గల్గిన శిరోరోగలక్షణముల జెప్ప నుద్దేశించి పైశ్లోకమున వేరువేరుగ లక్షణము చెప్పబడినది; అయినను నీలక్షణములే స్వతంత్రముగ జనించిన శిరోరోగములయందును కల్గియుండునని యెరుంగునది. క్రింద జెప్పబడు ముఖరోగాదిలక్షణములను ఇత్తెరంగుననే యెరుంగునది.

### ముఖరోగనిదానము, అందు వాతికముఖరోగలక్షణము.

మూ. ముఖామయే మారుతజే తు శోష
కార్కశ్యరౌక్ష్యాణి చలాః రుజశ్చ,

కృష్ణారుణం నిష్పతనం సశీతం
ప్రస్రంసనస్పన్దనతోదభేదాః. 119

వ్యా. (ముఖరోగములు వాత-పిత్త-కఫ-సన్నిపాతభేదములచే నాల్గువిధములుగ అష్టోదరీయాధ్యాయమున నిర్దేశింపబడినవి. వానివేరువేరులక్షణము లిచ్చట వివరింపబడును.)

వాతముచే గల్గిన ముఖరోగమున నోట ద్రవములేక యెండి గరకు గల్గి రూక్షముగ నుండును. నొప్పి పోటు మున్నగుబాధలు నియమము లేక యుండును. నోరు నల్లగ నైనను అరుణవర్ణముగ నైన నుండును. నోట జొల్లు కారుచుండును. చల్లబడి సడలి చలించుచు సూదుల గ్రుచ్చినవిధముగను పగులదీయురీతిని బాధ కల్గియుండును.

## పైత్తికముఖరోగలక్షణము.

మూ. తృష్ణాజ్వరస్ఫోటకతాలుదాహాః (దాహాపాకాః)
ధూమాయనం చాప్యవదీర్ణతా చ,
పిత్తాత్సమూర్ఛా వివిధా రుజశ్చ
వర్ణాశ్చ శుక్లారుణవర్ణవర్జ్యాః. 120

వ్యా. పిత్తముచే గల్గిన ముఖరోగమున దప్పియు, జ్వరంబును, స్ఫోటకములును, దాళువులయందు మంటయు కల్గును. నోట పొగవెడలునట్లుండును. ముఖము పగులునట్లుండును. మూర్ఛ గ్రమ్మును. నొప్పి పోటు మున్నగు పలుదెరంగులైన బాధలును, శుక్ల-అరుణవర్ణములు దక్క తక్కిన నీలపీతాది వర్ణంబులును కల్గియుండును.

## కఫజముఖరోగలక్షణము.

మూ. కణ్డూర్గురుత్వం సితవిజ్జలత్వం స్నేహోఽరుచిర్జాడ్యకఫప్రసేకౌ,
ఉత్క్లేశమన్దానలతా చ తన్ద్రా రుజశ్చ మన్దాః కఫవక్త్రరోగే. 121

వ్యా. కఫముచే గల్గిన ముఖరోగమున నోట దురద కల్గి బరువుగ నుండును. నోట తెల్లనిజొల్లు కారును. నోటిలో నాముదము పూసినవిధముగ జిడ్డు కల్గియుండును. అరోచకము కల్గి జడముగ (మొద్దుబారి) యుండును. కఫము వెడలును. ఓకరింతలు కల్గును. జఠరాగ్ని మందగించును. కునికిపాటు కల్గును. బాధలు మందములుగ నుండును.

## సాన్నిపాతికముఖరోగలక్షణము.

మూ. సర్వాణి రూపాణి తు వక్త్రరోగే భవన్తియస్మిన్ సతు సర్వజస్స్యాత్,

వ్యా. పైజెప్పబడిన వాతాదిముఖరోగ లక్షణము లన్నియుం కల్గియున్నయెడ నయ్యది సన్నిపాతమున జనించిన ముఖరోగమని యెఱుంగునది.

అనుక్తముఖరోగసంగ్రహము.

మూ. సంస్థానదూష్యాకృతినామభేదా
చ్చైతే చతుష్షష్టివిధా భవన్తి. 122
శాలాక్యతన్త్రేఽభిహితాని తేషాం
నిమిత్తరూపాకృతిభేషజాని,
యథాప్రదేశం తు చతుర్విధస్య
క్రియాం ప్రవక్ష్యామి ముఖామయస్య. 123

(ఇతి ముఖరోగనిదానమ్.)

వ్యా. ముఖరోగములు వాతాదిదోషభేదములచేతను సన్నిపాతముచేతను జనించునవి నాల్గువిధముల నుండునని వాని ప్రత్యేకలక్షణములు పైని వివరింపబడినవి. అయ్యవి వానికి సంబంధించిన యోష్ఠాది స్థానభేదములచేతను, రక్తాది దూష్యభేదములచేతను, లక్షణములచేతను, శీతాదిదంతపుప్పుకాదినామభేదములచేతను, అరువదినాల్గువిధముల నుండును. వానికారణంబులును, స్వరూపంబులును, లక్షణంబులును, వానిచికిత్సలును వేరువేరుగ విస్తరించి శాలాక్యతంత్రమున విపులముగ జెప్పబడినవి. ఇచ్చట చికిత్సావిధానమున పైజెప్పబడిన నాల్గువిధములగు ముఖరోగములకు మాత్రము చికిత్స చెప్పబడును. (ఈతంత్రము కాయచికిత్సాప్రధానము కావున శాలాక్యతంత్రవక్తవ్యాంశమగు ముఖరోగచికిత్సితము ప్రకరణపరిపూర్తికై సంగ్రహముగ జెప్పబడునని యీతంత్రకారులయాశయము. సుశ్రుతమున ముఖరోగములు అఱువదియైదు విధములుగ నిరూపింపబడినవి. ఇచ్చట విదేహమతానుసారముగ నరువదినాల్గని చెప్పబడినది. ఇది ముఖరోగనిదానము.)

అరోచకనిదానము.

మూ. వాతాదిభిశ్శోకభయాఽతిలోభక్రోధైర్మనోఘ్నాశనగన్ధరూపైః,
అరోచకాస్స్యుః

వ్యా. వాత-పిత్త-కఫములచేతను, శోకము, భయము, అతిలోభము, క్రోధము, అనుకారణములచేతను, మనసుకింపుకాని పదార్థముల భుజించుట, గంధము నాఘ్రాణించుట అట్టిరూపముల జూచుట అనునీకారణములచే నరోచకములు కల్గును.

అరోచకంబును ముఖరోగములలో నంతర్భూతము కావున వానిని దానమిచ్చట చెప్పబడినదని యెరుంగునది. మరియు రాజయక్ష్మనిదానమందును అరోచకము వివరింపబడినది. అయినను ఇచ్చట భయశోకాదికారణములచే గల్గునరోచకములు విశేషముగ జెప్పబడును కావున పునరుక్తము కానేరదు.

### వాతాదిదోషజారోచకముల లక్షణములు.

మూ.　పరిహృష్టదన్తః కషాయవక్త్రశ్చ మతోఽనిలేన.　124
కట్వమ్లముష్ణం విరసం చ పూతి పిత్తేన విద్యాల్లవణం చ వక్త్రం,
మాధుర్యపైచ్ఛిల్యగురుత్వశైత్యవిబద్ధసమ్బద్ధయుతం కఫేన

వ్యా. వాతముచే గల్గిన యరోచకమునందు పండ్లు పులిసి నమలుటకు సాధ్యము కాకుండును. నోరు వగరు కల్గియుండును పిత్తమున కల్గిన యరోచకమున నోరు చేదుగను పుల్లగను వేడిగనుండి మధురాదిరసముల నెరుంగజాలక దుర్గంధము కల్గి యుండును. కఫముచే గల్గినయరోచకమున నోరు ఉప్పగనైనను తీపిగల్గియైన నుండును. నోట జిగట గల్గి మొద్దుబారి రుచినెరుంగక చల్లబడియుండును. నోరుపట్టినట్లుండి, భుజింపబడిన యాహారము సరళముగ లోన ప్రవేశించక యడ్డుపడియుండును.

### భయశోకాదిజ-సాన్నిపాతికారోచకలక్షణములు.

మూ　అరోచకే శోకభయాతిలోభ
క్రోధాద్యహృద్యాఽశనగన్ధజే స్యాత్,
స్వాభావికం వక్త్రమథాఽరుచిశ్చ
త్రిదోషజేనైకరసం భవేత్తు　126
(ఇత్యరోచకనిదానమ్.)

వ్యా. దుఃఖము, భయము, అతిలోభము (భోజ్యపదార్థములయందధికమైనయాస) క్రోధము (శత్రుదర్శనాదులచే గల్గిన మనః ప్రజ్వలనము), ఇవి మున్నగు కారణముల చేతను, మనసు కింపుగాని యపరిశుద్ధములగు పదార్థముల భుజించుటచేత, అట్టి గంధాదులనాఘ్రాణించుటచేతను కల్గిన యరోచకమున నోరు మామూలుగ రసగ్రహణశక్తికి హాని లేకుండును గాని యాహారపదార్థములయందు రుచి తప్పి నోటి కింపు లేకుండును. (ఇది యాగంతుకారోచకము.)

మరియు త్రిదోషసన్నిపాతమున గల్గిన యరోచకమున వాతాదులకు వేరువేరుగ జెప్పబడిన రసము లన్నియు మిశ్రములుగ నుండును. దానంజేసి యాహారము రుచింపదు. (ఇది యరోచకనిదానము.)

### కర్ణరోగనిదానము, అందు వాతికలక్షణము.

మూ. నాదోఽతిరుక్ కర్ణమలస్య శోషః
స్రావస్తనుశ్చాఽశ్రవణం చ వాతాత్,

వ్యా. వాతముచే గల్గిన కర్ణరోగమున చెవులలో ధ్వని కల్గును. పోటు అధికముగ కల్గును. చెవులలోనిమలము శోషించును. చెవులలో పలుచని చీముకారును. చెవులకు శబ్దము వినబడదు. (ఈలక్షణములు కల్గినది వాతికకర్ణరోగమని యెరుంగునది.)

### పైత్తికకర్ణరోగలక్షణము.

మూ. శోఫస్సరాగో దరణం విదాహః సపీతపూతిశ్రవణం చ పిత్తాత్.

వ్యా. పిత్తమున కల్గిన కర్ణరోగమున శోఫము కల్గును. చెవు లెఱ్ఱగ నుండును. పగులదీయుచున్నట్లు బాధకల్గును. అధికమైన మంట కల్గును. చెవులనుండి పచ్చనై దుర్గంధముతో గూడినద్రవము స్రవించును.

### కఫజకర్ణరోగలక్షణము.

మూ. వైశ్రుత్యకణ్డూస్థిరశోథశుక్లస్నిగ్ధస్రుతిః శ్లేష్మభవేఽల్పరుక్చ,

వ్యా. కఫముచే గల్గినకర్ణరోగమున చెవులకు శబ్దము వినబడదు. చెవులలో దురద కల్గును. కఠినమైనవాపు కల్గి శుక్లవర్ణంబును స్నిగ్ధంబు నైన చీము స్రవించును. బాధ స్వల్పముగ నుండును.

### సాన్నిపాతికకర్ణరోగలక్షణము.

మూ. సర్వాణి రూపాణి తు సన్నిపాతాత్
స్రావశ్చ తత్రాఽధికదోషవర్ణః. 123

(ఇతి కర్ణరోగనిదానమ్.)

వ్యా. సన్నిపాతమున కల్గిన కర్ణరోగమున వాతికాదులకు వేరువేరుగ చెప్పిన లక్షణము లన్నియు కల్గును. మరియు వాతాదిదోషములలో నేదోషము అధికముగ నుండునో ఆదోషమునకు చెప్పిన రంగుతో గూడిన ద్రవము స్రవించును. (ఇది కర్ణరోగనిదానము.)

శాలాక్య తంత్రమున కర్ణరోగములు ఇరువదియెనిమిది విధములుగ జెప్పబడినవి. అవియన్నియు పైజెప్పిన నాల్గు భేదములలోనే యంతర్భూతములగునని యీతంత్రకారులు నాల్గువిధములుగ నే చెప్పిరి. అష్టోదరీయాధ్యాయమునను "చత్వారః కర్ణరోగాః" అనియే నిర్దేశింపబడినది.

### నేత్రరోగనిదానము, అందు వాతికనేత్రరోగలక్షణము.

మూ. అల్పస్తు రాగోఽనుపదేహవాంశ్చ
సతోదభేదోఽనిలజాక్షిరోగే,
(ఆల్పాఽశ్రురాగాఽనుపదేహతాశ్చ
ప్రస్పన్దతోదాఽతిరుజశ్చ వాతాత్.)

వ్యా. వాతముచే సంభవించిన నేత్రరోగమునందు కన్నులు కొంచెముగ నెరుపు కల్గి కంటిపుసి లేక యుండును. కంటిలో నదరుపాటును పోటును తీవ్రమైన నొప్పియుం కల్గియుండును.

### పైత్తికనేత్రరోగలక్షణము.

మూ. పిత్తాత్సదాహోఽతిరుజస్సరాగః పీతోపదేహః సుభృశోష్ణవాహీ.

వ్యా. పిత్తజనేత్రరోగమున మంటయు అధికమైన నొప్పియుం కల్గును, కన్నులు ఎరుపు కల్గి పచ్చనిపుసితో కూడి మిక్కిలి వేడిగ నుండు కన్నీళ్లు కారును.

### కఫజ-సాన్నిపాతికనేత్రరోగలక్షణములు.

మూ. శుక్లోపదేహం బహుపిచ్ఛిలాశ్రు
నేత్రం కఫాత్ స్యాత్ గురుతా సకణ్డుః,
సర్వాణి రూపాణి తు సన్నిపాతాత్

వ్యా. కఫముచే గల్గిన నేత్రరోగమున కంటిపుసి తెల్లగనుండును. జిగట కల కన్నీరు అధికముగ వెడలును. కన్నులు బరువుగ జిలకల్గియుండును. సన్నిపాతమున కల్గిన నేత్రరోగమున వాతాది నేత్రరోగములకు వేరువేరుగ జెప్పబడినలక్షణము లన్నియు కల్గియుండును.

(అష్టోదరీయాధ్యాయమున "చత్వారః కర్ణరోగాః" (సూ. అ. ౧౯) అని నిర్దేశింపబడిన ప్రకారము కర్ణముల నాల్గిటి లక్షణంబులును పైగ్రంథముచే చెప్ప బడినది.)

### అనుక్తనేత్రరోగసంగ్రహము.

మూ. నేత్రామయాష్షణ్ణవతేస్తు భేదాత్. 130
తేషామభివ్యక్తిరభిప్రదిష్టా
శాలాక్యతన్త్రేషు చికిత్సితం చ,

పరాధికారేతు న విస్తరోక్తిః
శస్తేతి తేనాత్ర న నః ప్రయాసః. 131

(ఇతి నేత్రరోగనిదానమ్.)

వ్యా. ఈతంత్రమునం దుద్దేశించిన ప్రకారము నేత్రరోగభేదముల నాల్గిటికిని వేరువేరు లక్షణములు చెప్పబడినవి. మరియు నీరోగములు అభిష్యందాదిభేదములచే తొంబదియారు విధములగును. వానిస్వరూపలక్షణాదులును చికిత్సితములును విస్తరముగ శాలాక్యతంత్రములయందు నిరూపించుట యుక్తము కాని, కాయచికిత్స నధికరించి (ప్రధానముగ జేసి) చెప్పుచుండు నీతంత్రమున విస్తరించుట ప్రశస్తము కాదని వాని వివరణవిషయమై శ్రద్ధతీసికొన లేదని యర్థము.

ఇచ్చట నీవిషయము నెఱుంగునది:—నేత్రరోగముల భేదము విషయమై యాతంత్రకారుల యభిప్రాయములు భిన్నభిన్నములుగ కానంబడుచున్నది. సుశ్రుతాచార్యులు "తైస్త్రిభిః త్రింశదుక్తాస్తే......షట్సప్తతిర్నేత్రరోగాః సంగ్రహేణ ప్రకీర్తితాః" అని డెబ్బదియారు నేత్రరోగముల జెప్పిరి. విదేహులును ఈమతానుగుణముగ డెబ్బదియారు నేత్రరోగములనే చెప్పిరి. సాత్యకి యెనుబది నేత్రరోగముల నిరూపించిరి. కరాలుడు—"వింశతిస్సప్తవర్త్మస్థాః, నవసన్ధౌ ప్రకీర్తితాః, త్రయోదశతు శుక్లస్థాః, షడ్రోగాః కృష్ణభాగజాః, వింశతిః పఞ్చ దృష్టిస్థాః, షోడశైవ చ సర్వగాః" అని తొంబదియారు నేత్రరోగముల పరిగణనము చేసి చెప్పిరి. ఈమతములలో కరాళమతము ననుసరించి యీతంత్రకారులును "నేత్రామయాః షణ్ణవతిస్తు భేదాత్" అని తొంబదియారువిధములనియే సంగ్రహమున జూపిరి అని తోచెడి. (ఇది నేత్రరోగనిదానము.)

## ఖాలిత్య-పలితలక్షణములు.

మూ. తేజోఽనిలాద్యైస్సహ కేశభూమిం
దగ్ధ్వాశు కుర్యాత్ ఖలతిం నరస్య,
కిఞ్చిత్తు దగ్ధ్వా పలితాని కుర్యాత్
హరిత్ప్రభత్వం చ శిరోరుహాణామ్. 132

వ్యా. శరీరమునందలి యుష్ణము వాతాదిదోషములతో గూడి తలయందు వెండ్రుకలుమొలచు ప్రదేశమును పూర్తిగ తపింపజేసి వెండ్రుకల నూడజేయును. దానంజేసి తల బట్టగట్టును. ఇది ఖలతి యని చెప్పబడును. అట్టి యుష్ణము వెండ్రుకలప్రదే

శమును కొంచెముగ తపింపజేసిన వెంద్రుకలు తెల్లబడి నెరియును. ఈరోగము పలితమన బడును. లేక వెండ్రుకలు పింగళవర్ణము లగును. ఇదికూడ పలితమున జేరినది. (ఇచ్చట "తేజస్సవాతం" అను పాఠాంతరమున తేజశ్శబ్దమునకు పిత్తమని యర్థము.)

మూ. ఇత్యూర్ధ్వజత్రూత్థగదైకదేశః
తన్త్రే నిబద్ధోఽయమశూన్యతార్థం,
అతఃపరం భేషజసంగ్రహం తు
నిబోధ సంక్షేపత ఉచ్యమానమ్. 133

(ఇత్యూర్ధ్వజత్రూత్థగదైకదేశః
ప్రోక్తః చికిత్సాం తు పరం నిబోధ,
విస్తారతస్సఙ్గ్రహతశ్చ సమ్యక్
యథాక్రమం సౌమ్య మయోచ్యమానమ్.)

(ఇతి ఖాలిత్యరోగనిదానమ్.)

వ్యా. ఇత్తెరంగున జత్రువునకు (కంఠమునకు క్రిందిభాగమున నుండు సంధిప్రదేశమునకు) పైనుండు నాసిక కన్నులు మున్నగు నవయవములకు జేరిన వ్యాధులలో నేకదేశము (సంగ్రహముగ) జెప్పబడినది. అట్టి సంగ్రహము కాయచికిత్సాప్రధానమైన యీతంత్రమునందు శల్యశాలాక్యాద్యష్టాంగములకు లోపము లేక యుండుటకై సూచనామాత్రముగ జెప్పబడినది. అట్టి జత్రూర్ధ్వగతరోగములకు చికిత్సయు నిదానక్రమము ననుసరించి వరుసగ సంగ్రహరూపముగనే యీక్రింద వివరింపబడును. (ఇత్తెరంగున శిరోమర్మాశ్రయరోగముల నిదానము చెప్పబడినది.)

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—ఆయుర్వేదమునకు శల్యశాలాక్యాదులు అంగము లెనిమిది. ఈయెనిమిదిటిలో నొక్కొక యంగమును ప్రధానముగ గ్రహించి ఆయాతంత్రకారులు తంత్రముల రచించుచు ప్రధానముగ గ్రహింపబడిన యంగమును మాత్రము విస్తరముగ వివరించి తక్కిన యంగముల నుపసర్జనముగ నంగలోపము లేకుండుటకై చెప్పుట సంప్రదాయము. ఆపద్ధతి నవలంబించియే యీతంత్రకారులును కాయచికిత్సను ప్రధానముగ జేసి వివరించుచు లోపము లేకుండుటకై తక్కిన శల్యశాలాక్యాద్యంగములను సంగ్రహముగ నుపదేశించిరి. ఈవిషయమునే అచ్చటచ్చట 'పరాధికారేషు న విస్తరోక్తిః' ఇది మున్నగు వాక్యములచే తంత్రకారులు స్వాభిప్రాయమును సూచించిరి. శల్యతంత్రాదిప్రధానములగు నితరతంత్రములయందును తక్కిన యంగములును క్లుప్తముగ జెప్పబడి యున్నవి.

మరియు ప్రాచీనముద్రితప్రతులలో పైని జెప్పబడిన నాసాదిరోగనిదానముల చెప్పుచు ఆయానిదానముల క్రిందనే ఆయాచికిత్సలను గూడ చేర్చి ముద్రించియున్నది. కాని యీయానుపూర్వి యార్షసమ్మతముగ దోచదు:—ఈత్రిమర్మీయచికిత్సితమున వస్తిమర్మమునకు చేరిన రోగముల నిదానమును జెప్పి వరుసగ వానిచికిత్సలను చెప్పి, హృదయమర్మము నాశ్రయించిన రోగములనిదానమును చెప్పి, దాని క్రిందనే వానిచికిత్సలను చెప్పియున్నది. ఆపద్ధతి ననుసరించి శిరోమర్మమునకు జేరిన వ్యాధుల కన్నిటికిని నిదానముల జెప్పి, పిమ్మట చికిత్సలు చెప్పుట సమంజసము. ఈవిషయమును తంత్రకారులే "ఇత్యూర్ధ్వజత్రూర్ధ్వ......సంక్షేపత ఉచ్యమానమ్" అను పైశ్లోకముచే స్ఫుటముగ దెలిపిరి. చక్రపాణియు తనవ్యాఖ్యానమున "రోధాభిఘాతే త్యాదినా దుష్టప్రతిశ్యాయాదీనా మర్జునలోమపర్యన్తానాం క్రమేణ లక్షణాన్యాహ" నాసాదిరోగనిదాన ప్రారంభమున నవతారిక జూపెను. వానిచికిత్సాప్రారంభమునను "అస్మైతేషాం క్రమచికిత్సాభిధీయతే" అని చెప్పెను. ఈవ్యాఖ్యానమును బట్టియుఁ నాసాదిరోగనిదానానంతరము వరుసగ చికిత్సల జెప్పినట్లే స్ఫుటమగుచున్నది. కావున నీపాఠక్రమమే సమంజసము.

## శిరోమర్మవ్యాధిచికిత్సితము, అందు వాతికపీనసచికిత్స.

మూ. వాతాత్సకాసవైస్వర్యే సక్షారం పీనసే ఘృతం,
పిబేద్రసం పయశ్చోష్ణం స్నైహికం ధూమమేవ వా. 134

వ్యా. దగ్గుతోడను స్వరభేదముతోడను గూడి వాతముచే గల్గిన పీనసమునందు యవక్షారముతో గూడిన ఘృతమును, మాంసరసమును, వేడిగ నుండుపాలను త్రాగవలెను. స్నేహద్రవ్యములచే సిద్ధముచేయబడిన ధూమమును పీల్చవలెను.

## వాతికపీనసమున స్నైహికధూమపానము.

మూ. శతాహ్వాత్వగ్బలామూలం శ్యోనాకైరణ్డబిల్వజం,
సారగ్వధాం పిబేద్వర్తిం మధూచ్ఛిష్టవసాఘృతైః. 135
అథవా సఘృతాన్ సక్తూన్ కృత్వా మల్లకసంపుటే,
నవప్రతిశ్యాయవతాం ధూమం వైద్యః ప్రయోజయేత్. 136

వ్యా. సదాపవిత్తులు, దాల్చినిచెక్క, చిట్టాముట్టివేళ్లు, దుండిగపుచెక్క, ఆముదపుగింజలు, బిల్వవేళ్లు, రేలవేళ్లు, వీని నన్నిటిని నూరి, అందు మైనమును నేతిని వసను చేర్చి ధూమవర్తిని సిద్ధముచేసి విధ్యుక్తప్రకారము ధూమపానము చేయునది. మరియుఁ సత్తు

పిండిని నేతితో గూర్చి గుడ్డయొక్క సంపుటమున నునిచి దానిమూలమున పొగపీల్చ వలెను. ఈధూమపానమును ప్రతిశ్యాయము ప్రారంభమున నుండునపుడు వైద్యుడు చేయించవలెను.

## వాతికపీనసమున స్వేదవిధి.

మూ. శఙ్ఖమూర్ధలలాటార్తౌ పాణిస్వేదోపనాహనం,
స్వభ్యక్తే క్షవథుస్రావరోధాదౌ సఙ్కరాదయః. 137

వ్యా. వాతమున కల్గిన ప్రతిశ్యాయమునందు కణతలయందును శిరస్సునందును నుదుటియందును నొప్పి కల్గి యున్నయెడ పాణిస్వేదమును ఉపనాహస్వేదమును చేయవలెను. తుమ్ములు వెడలుచున్నను, ముక్కున ద్రవము కారుచున్నను, ముక్కులు బిగబట్టి శ్వాస మడ్డగింపబడి యున్నను, ఇట్టిపరిస్థితులయందు అభ్యంజనముచేయించి సంకరప్రస్తరాదిస్వేదముల విధ్యుక్తప్రకారము చేయవలెను. (ఇచ్చట రోధశబ్దముచే ప్రతీనాహమను నాసారోగము గ్రహింపబడును).

## వాతికపీనసమున నస్యచూర్ణము.

మూ. శ్రేయాశ్చ రోహిషాఽజాజీవచాతర్కారిచోరకాః,
త్వక్పత్రమరిచైలానాం చూర్ణా వా సోపకుఞ్చికాః. 138

వ్యా. కామంచిగడ్డి, జీలకర, వస, తక్కెల, కచోరములు, లవంగపుపట్ట లవంగపుపత్రి, మిరియాలు, ఏలకులు, నల్లజీలకర, వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి చూర్ణముచేసి దాని నాఘ్రాణించుచున్నచో పైజెప్పిన బాధలు నివర్తించి పీనసము శమించును.

## తైలనస్యము.

మూ. స్రోతశ్శృఙ్గాటనాసాక్షిశోషే తైలం చ నావనం,

వ్యా. నాసాదిరంధ్రములయందలి స్రోతస్సులును శృంగాటకమును ముక్కులును, కన్నులును ద్రవము లేక యెండినయెడ నీక్రింద చెప్పబడు తైలముచే నస్యము చేయవలెను. (ఇచ్చట నాసారంధ్రమున నుండి ఘ్రాణేంద్రియమునకు తృప్తి నొందించు సిరలును శ్రోత్రనేత్రములకు తృప్తినందించు సిరలును చేరునట్టి సంధిస్థానము శృంగాటకమను మర్మమని యెరుంగునది).

## అణుతైలకల్పనావిధానము.

మూ. ప్రభావ్యాఽఽజే తిలాన్ క్షీరే తేన పిష్టాం స్తదూష్మణా. 139

మన్ధస్విన్నాం సయష్ట్యాహ్వాచూర్ణాం స్తైనైవ పీడయేత్,
దశమూలస్య నిష్క్వాథే రాస్నామధుకకల్కవత్. 140
సిద్ధం ససైన్ధవం తైలం దశకృత్వోఽణు తత్ స్మృతం,

వ్యా. నువ్వులను మేకపాలయందు తొలుత నానబెట్టి (భావనచేసి) పిదప మేకపాలయందే మెత్తగ నూరి, యాపిష్టమునకు నాల్గవపాలు అతిమధురచూర్ణమును చేర్చి మేకపాలయొక్క యావిరిచే కొద్దిగ నుడికించి, మేకపాలను చేర్చి పిసికి మర్దనచేసి యాపిష్టమునుండి తైలమును తీయవలెను. ఆతైలమునకు నాలుగింతలు దశమూలకషాయమును, సన్నరాష్ట్రమును అతిమధురమును సైంధవలవణమును కల్కముచేసి తైలమునకు నాల్గవపాలును కలిపి తైలపాకవిధిప్రకారము పక్వముచేయునది. ఇత్తెరంగున పదిపర్యాయములు పైజెప్పిన దశమూలక్వాథమును రాస్నాదికల్కమును కలుపుచు పక్వముచేసిన నయ్యది అణుతైల మనబడును. దీనిని పైజెప్పిన నాసాస్రోతస్సులు మున్నగువాని శోషమునందు నస్యమున కుపయోగింపనగును.

ఇచ్చట నీతైలము భావనవిశేషముచేతను మర్దనమువలనను, అనేకపర్యాయములు పక్వమగుటవలనను మిగుల చులకన కల్గి సూక్ష్మరూపములగు స్రోతోమార్గములయందు వ్యాపించు ప్రభావము కల్గియుండుటంజేసి అణుతైలమని యన్వర్థముగ చెప్పబడును. ఈవిషయమును విదేహు డిట్లు చెప్పెను:—"భావనాత్ పాచనాద్వాపి తైలానామణుతైలతా, మర్దనాదపి సర్వేషాం దేహానామణుతైలతా".

వాతికపీనసమున నాస్థాపనవస్తివిధి.

మూ. స్నిగ్ధస్యాస్థాపనైర్దోషం నిర్హరేత్ వాతపీనసే. 141

వ్యా. మరియు వాతపీనసమునందు రోగికి తొలుత స్నేహవిధిచే స్నిగ్ధకోష్ఠునిగ చేసి పిమ్మట ఆస్థాపనవస్తిప్రయోగముచే దోషమును వెడలించవలెను.

వాతికపీనసమునం దాహారవిహారాదినియమము.

మూ. స్నిగ్ధాఽమ్లోష్ణైశ్చ లఘ్వన్నం గ్రామ్యాదీనాం రసైర్హితం,
ఉష్ణాంబునా స్నానపానే నివాతోష్ణప్రతిశ్రయః. 142
చిన్తావ్యాయామవాక్చేష్టావ్యవాయవిరతో భవేత్,
వాతజే పీనసే ధీమా నిచ్ఛన్నే వాత్మనో హితమ్. 143

వ్యా. వాతజపీనసముచే బాధితుడు స్నిగ్ధంబులును అమ్లంబులును ఉష్ణవీర్యంబులును లఘుగుణంబులును నగు పదార్థములతోడను, గ్రామ్యాదిజంతువుల మాంసరసంబుల

తోడను హితమై తేలికగ జీర్ణమగు నన్నమును భుజింపవలెను. స్నానమునకును పానమునకును వేడినీళ్ల నుపయోగింపనగును. గాలి లేక ఉష్ణముగనుండు గృహములలో నివసించవలెను.

మరియు — చింత, వ్యాయామము, వాక్కునకు సంబంధించిన సంభాషణరూపచేష్ట, స్త్రీసంభోగము, అనునీవ్యాపారములను తనకు హితమును కోరు వాతికపీనసరోగి విసర్జించవలెను.

## పైత్తికపీనసచికిత్స.

మూ. పైత్తే సర్పిః పిబేత్సిద్ధం (పిబేత్తిక్తం) శృఙ్గబేరశృతం పయః,
పాచనార్థం పిబేత్ పక్వే కార్యం మూర్ధవిరేచనమ్. 144

వ్యా. పిత్తముచేగల్గిన పీనసమున (ఆమావస్థ నున్నపుడు) అల్లమును చేర్చి పక్వము చేయబడిన ఘృతమునైనను, పాలనైనను పాచనమునకై త్రాగవలెను. పీనసము పక్వముగ నున్నయెడ శిరోవిరేచనము చేయించవలెను.

## పక్వపీనసమున శిరోవిరేచనతైలనస్యము.

మూ. పాఠాద్విరజనీమూర్వాపిప్పలీజాతిపల్లవైః,
దన్త్యా చ సాధితం తైలం నస్యం స్యాత్ పక్వపీనసే. 145

వ్యా. చిరుబొద్ది, పసుపు, మ్రానిపసుపు, చాగ, పిప్పళ్లు, జాజిచిగుళ్లు, నేపాళపువేళ్లు, వీనినిచేర్చి పక్వముచేయబడిన తైలమును పక్వపీనసమున శిరోవిరేచనమునకై నస్యము చేయవలెను.

## పూయరక్తాదిచికిత్స.

మూ. పూయాస్రే రక్తపిత్తఘ్నాః కషాయా నావనాని చ,
పాకదాహాఢ్యరూక్షేషు శీతా లేపాః ససేచనాః. 146
ఘ్రేయ (స్నేహా) నస్యోపచారాశ్చ కషాయాః స్వాదుశీతలాః,

వ్యా. పూయరక్తమునందు రక్తపిత్తచికిత్సితమున జెప్పబడిన రక్తపిత్తహరకషాయములును నస్యములును హితకరములగును. మరియు నాసారంధ్రములయందు పుండై యధికముగ మంటగల్గి రూక్షముగ నున్నపుడు శీతలంబులగు లేపంబులును సేచనంబులును ఘ్రేయంబులును నస్యంబులును ఉపచారంబులును హితకరములు. మధురంబులును శీతంబులును నగుకషాయముల నుపయోగించుట చాల హితము.

పీనసమున విరేచనవిధి.

మూ. మన్దపిత్తే ప్రతిశ్యాయే స్నిగ్ధైః కుర్యాద్విరేచనమ్. 147

వ్యా. పిత్తము మందముగ నుండు ప్రతిశ్యాయమున స్నిగ్ధములగు నౌషధములచే విరేచనము చేయించవలెను.

పైత్తికపీనసమునం దాహారనియమము.

మూ. ఘృతం క్షీరం యవాః శాలిర్గోధూమాః జాఙ్గలా రసాః,
శీతామ్లాః తిక్తశాకాని యూషా ముద్గాదిభిర్హితాః. 148

వ్యా. ప్రతిశ్యాయమున ఘృతము, క్షీరము, యవలు, రాజనములబియ్యము, గోధుమములు, జాంగలజంతువులమాంసరసములు, శీతవీర్యంబులును అమ్లరసంబులును నగు వ్యంజనాదులు, చేదుకలశాకములు, పెసలు మున్నగువాని జేర్చి సిద్ధముచేయబడిన యూషములు. ఇవి యన్నియు నాహారమున కుపయోగించుట చాల హితకరముగ నుండును. (ఇది పైత్తికపీనసచికిత్స).

కఫజపీనసచికిత్స.

మూ. గౌరవారోచకేష్వాదౌ లఙ్ఘనం కఫపీనసే,
స్వేదాన్సేకాశ్చ పాకార్థం లిప్తే శిరసి సర్పిషా. 149
లశునం ముద్గచూర్ణేన వ్యోషక్షారఘృతైర్యుతం,
దేయం కఫఘ్నవమనముత్క్లిష్టశ్లేష్మణే హితమ్. 150

వ్యా. కఫముచే జనించిన పీనసమున తల బరువై అరోచకము కల్గియున్నయెడ తొలుత లంకణము చేయించవలెను. పీనసము పక్వమగుటకై శిరస్సున నేతిని బూసి స్వేదముల చేసి పరిషేకముల జేయనగును. మరియు వెల్లుల్లిపాయలతో పెసలపిండిని త్రికటుకచూర్ణమును యవక్షారము నేతిని కలిపి యియ్యవలెను. మరియు శ్లేష్మము బైటవెడలనున్నపుడు కఫహరములగు నౌషధములచే వమనము చేయించుట హితకరము.

అపీనసాదినాసారోగములయందు శిరోవిరేచనము.

మూ. అపీనసే పూతినస్యే ఘ్రాణస్రావే సకణ్డుకే,
ధూమశ్నస్తోఽవపీడశ్చ కటుభిః కఫపీనసే. 151

వ్యా. అపీనసము, పూతినస్యము, పరిస్రవము, అనునాసారోగములయందును, నాసారంధ్రములయందు జిల కల్గినపుడును, కఫజపీనసమునందును, మిరియాలు పిప్పళ్లు మున్నగు కటుద్రవ్యములచూర్ణముచేత ధూమపానమును అవపీడనస్యమును చేయవలెను.

ఇచ్చట అవపీడనస్యము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"కల్కైర్వైరవపీడస్తు తీక్ష్ణైర్మూర్ధవిరేచనమ్" మిక్కిలి తీక్ష్ణములగు ద్రవ్యకల్కాదులచే శిరోవిరేచనము చేయుట అవపీడనమని యర్థము.

### నాసారోగములయందు తీక్ష్ణశిరోవిరేచనము.

మూ. మనశ్శిలా వచా వ్యోషం విడఙ్గం హిఙ్గు గుగ్గులుః,
చూర్ణో ఘ్రేయః ప్రధమనం కటుభిశ్చ ఫలైస్తథా. 152

వ్యా. మరియు మణిశిల, వస, త్రికటుకములు, వాయువిడంగములు, ఇంగువ, గుగ్గిలము, మిరియాలు, పిప్పళ్లు మున్నగు కటుకద్రవ్యములు, వీని నన్నిటిని చూర్ణముచేసి ప్రధమననస్యమును చేయవలెను. (తీక్ష్ణద్రవ్యములచూర్ణమును గొట్టమునుండి నాసారంధ్రములచే పీల్చుట ప్రధమననస్యము).

### కఫజపీనసమున భార్గ్యాదితైలనస్యము.

మూ. భార్గీమదనతర్కారీసురసాడివిపాచితే,
మూత్రే లాక్షా వచా లమ్బా విడఙ్గం కుష్ఠపిప్పలీ. 153
కృత్వా కల్కం కరఞ్జం చ తైలం తైస్సార్షపం పచేత్,
పాకాన్ముక్తే ఘనే నస్యం ఏతన్మేదోనిభే కఫే 154

వ్యా. గంటుభారంగి, మ్రంగకాయలు, తక్కెల, తులసి మున్నగు ద్రవ్యములను గోమూత్రమున చేర్చి కాచి వడగట్టి, దీనికి నాల్గవపాలు ఆవనూనె కలిపి, అందు లక్క, వస, చేదుసొర, వాయువిడంగములు, చెంగల్వకోష్టు, పిప్పళ్లు, కానుగుపట్ట, వీనిని సమభాగములుగ గూర్చి కల్కముచేసి తైలమునకు నాల్గవవంతు కలిపి తైలపాకవిధి ప్రకారము పక్వముచేసి, యీతైలమును కఫము పరిపక్వమై నాసారంధ్రములనుండి పట్టువదలి జారి ఘనీభవించి మేదస్సుతో సమముగ నున్నపుడు నస్యమునకై యుపయోగింపవలెను.

### కఫజపీనసమున వమనవిధి.

మూ. స్నిగ్ధస్య వ్యాహతే వేగే చ్ఛర్దనం కఫపీనసే,
వమనీయశ్శృతక్షీరతిలమాషయవాగునా. 155

వ్యా. కఫజపీనసము పైజెప్పినచికిత్సావిధానముచే వేగము తగ్గియుండునప్పుడు రోగికి కోష్ఠమును స్నిగ్ధముగజేసి మ్రంగకాయ మున్నగు వమనద్రవ్యముల జేర్చి

పక్వముచేయబడిన క్షీరముచేతను, లేక తిలలను ఉద్దులను చేర్చి పక్వముచేయబడిన యవాగువుచేతను వమనము చేయించవలెను.

కఫజపీనసమున నన్నపానములు.

మూ. వార్తాకకులకవ్యోషకులుత్థాఢకీముద్గజాః,
యూషాః కఫఘ్నమన్నం చ శస్తముష్ణాంబుసేచ(వ)నమ్. 156

వ్యా. వంకాయలు, చేదుపొట్ల, త్రికటుకములు, ఉలవలు, కందులు, పెసలు, వీనిని చేర్చి సిద్ధముచేయబడిన యూషములును, కఫహారమైన యన్నంబును, వేడినీళ్లను స్నానపానముల కుపయోగించుటయు కఫజపీనసమున చాల ప్రశస్తము.

దుష్టప్రతిశ్యాయ-నాసార్బుదాదిచికిత్స.

మూ. సర్వజిత్ పీనసే దుష్టే కార్యం శోఫే చ శోఫజిత్,
క్షారోఽర్బుదాఽధిమాంసేషు క్రియా శేషేష్వవేక్ష్య చ. 157
(ఇతి పీనసనాసారోగచికిత్సా.)

వ్యా. త్రిదోషప్రకోపముచే జనించిన దుష్టపీనసమునందు పైజెప్పిన చికిత్సల నన్నిటిని మిశ్రముగ జేయనగును. నాసారంధ్రములయందు శోఫకల్గినయెడ శోఫనాశక చికిత్సలజేయవలెను. మరియు నాసికయందు అర్బుదంబును అధిమాంసంబును కల్గినయెడ విధ్యుక్తప్రకారము క్షారము నుపయోగింపవలెను. తక్కిన అరూంషిక మున్నగునాసారోగములయందు తత్తదనుగుణముగ చికిత్సల గమనించి చేయవలెను. (ఇత్తెరంగున పీనస-నాసారోగములచికిత్సలు వివరించి చెప్పబడినవి).

శిరోరోగచికిత్స, అందు వాతికశిరోరోగచికిత్సాక్రమము.

మూ. వాతికే శిరసో రోగే స్నేహాన్ స్వేదాన్ సనావనాన్,
పానాఽన్నముపనాహాంశ్చ కుర్యాద్వాతామయాఽపహాన్. 158

వ్యా. వాతముచే గల్గిన శిరోరోగమున వాతహారములగు స్నేహవిధులను స్వేదములను, నస్యములను చేయవలెను. మరియు వాతహారములగు నన్నపానములను, వాతహారద్రవ్యములచే నుపనాహములను కూడ చేయవలెను.

వాతికశిరోరోగమునం దుపనాహస్వేదము.

మూ. తైలభృష్టైరగుర్వాద్యైః సుఖోష్ణైరుపనాహనం,
జీవనీయైః సుమనసా మత్స్యైర్మాంసైశ్చ శస్యతే. 159

వ్యా. అగరు మున్నగు ద్రవ్యములను నూనెలో వేయించి సుఖోష్ణముగ జేసి యుపనాహాస్వేదము చేయవలెను. మరియు జీవనీయగణద్రవ్యములచేతను జాజిపువ్వులచేతను మత్స్యములచేతను మాంసములచేతను ఉపనాహము చేయుట ప్రశస్తము.

వాతికశిరోరోగహరనస్యతైలము.

మూ. రాస్నాస్థిరాదిభిస్సిద్ధం సక్షీరం నస్యమర్తినుత్,
త్తైలం రాస్నాద్వికాకోలీశర్కరాభిరథాపి వా. 160

వ్యా. సన్నరాష్ట్రము, స్థిరాది(హ్రస్వ)పంచమూలములు, వీనిని కల్కముచేసి ఆవుపాలను చేర్చి పక్వముచేయబడిన తైలమును నస్యము చేసినయెడ శిరోరోగముల శమింపజేయును.

లేక సన్నరాష్ట్రమును, కాకోళిని, క్షీరకాకోళిని చేర్చి కల్కముచేసి యాకల్కమును చక్కెరను చేర్చి ఆవుపాలు కలిపి సిద్ధముచేయబడిన తైలమునైనను వాతికశిరోరోగమున నస్యముచేయదగును.

నస్యమునకు తైలయోగములు.

మూ. బలామధూకయష్ట్యాహ్వావిదారీచన్దనోత్పలైః,
జీవకర్షభకద్రాక్షాశర్కరాభిశ్చ సాధితః. 161
ప్రస్థస్తైలస్య సక్షీరో జాఙ్గలార్ధతులారసే,
నస్యం సర్వోర్ధ్వజత్రూత్థవాతపిత్తామయాపహమ్. 162

వ్యా. చిట్టాముట్టి, ఇప్పపట్ట, అతిమధురము, నేలగుమ్మడి, చందనము, నల్లకలువలు, జీవకము, ఋషభకము, ద్రాక్షపండు, చక్కెర, వీనినన్నిటిని కల్కముచేసి, ప్రస్థపరిమితమగు తైలమున నాల్గవపాలు(నాల్గుపలములు)గ కలిపి, అందు తైలమునకు సమభాగము ఆవుపాలను జాంగలజంతువులమాంసరసమును ఏబదిపలములును కలిపి, తైలపాకవిధిప్రకారము పక్వముచేసి, యాతైలమును నస్యముగ నుపయోగించినచో మెడకొంకులకు పైభాగమున వాతపిత్తములచే జనించిన రోగముల నన్నిటిని శమింపజేయును.

ఊర్ధ్వజత్రురోగములకు మాయూరఘృతము.

మూ. దశమూలబలారాస్నాత్రిఫలామధుకైస్సహ,
మయూరం పక్షపిత్తాన్త్రశకృత్తుణ్డాఙ్ఘ్రివర్జితమ్. 163
జలే పక్త్వా ఘృతప్రస్థం తస్మిన్ క్షీరసమం పచేత్,

మధురైః కార్షికైః కల్కైః శిరోరోగార్దితాపహమ్. 1
కర్ణాక్షినాసికాజిహ్వాతాల్వాస్యగళరోగనుత్,
మాయూరమితి విఖ్యాతం ఊర్ధ్వజత్రుగదాఽపహమ్. 1
(ఇతి మాయూరఘృతమ్

వ్యా. దశమూలములు, చిట్టాముట్టి, సన్నరాష్ట్రము, త్రిఫలములు, అతిమధుర వీని ప్రత్యేకము మూడేసి పలములవంతున జేర్చునది. నెమలిని దాని యీకలను ము మును ప్రేగులను మలమును మూతిని కాళ్లను ఛేదించి పారవైచి శుభ్రమైన తక్కి మాంసమును మాత్రము పైజెప్పిన ద్రవ్యసముదాయముతో జేర్చి, అన్నిటిని చేర్చినస దాయమును క్వాథ్యముగ నుంచుకొని, అందు ద్రోణపరిమితజలమును జేర్చి, నా పాలు (నాలుగుప్రస్థములు) మిగులునట్లు కషాయము కాచి వడగట్టి, అందు ప్రస్థము ఆవునేతిని, నేతికి సమభాగము ఆవుపాలను కలిపి, అందు మధురగణ (జీవనీ గణ) ద్రవ్యముల పదిటిని ప్రత్యేక మొక్కొక కర్షప్రమాణమువంతున కల్కము కలిపి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేయునది. ఇది మాయూరఘృత మనబడు ఈఘృతము శిరోరోగముల నన్నిటిని తాపమును హరించును. మరియు మెడకొంకు పైభాగమున కల్గు కర్ణరోగములను, నేత్రరోగములను, నాసారోగములను, జిహ్వారో ములను, తాలురోగములను, ముఖరోగములను, కంఠరోగములను కూడ హరించు జత్రూర్ధ్వగతరోగముల నన్నిటిని శమింపజేయనిది ప్రశస్తమైనది.

కల్పనము:—ఇచ్చట దశమూలాదిద్రవ్యములను ప్రత్యేకము మూడేసిపలవ వంతున చేర్చునది. పైజెప్పినరీతిగ పక్షాదిరహితమైన మయూరమాంసమును కూడ చే నచో క్వాథ్యసముదాయము అరువదినాలుగుపలము లగునట్లు క్వాథ్యపరిమాణము కలి చునది. అందు ద్రోణపరిమితమైన జలమును చేర్చి సామాన్యపరిభాషానుసారమ నాల్గవపాలు మిగుల క్వాథము చేసినయెడ నాలుగుప్రస్థములు కషాయము అవ మగును. అందు ప్రస్థపరిమితమైన ఘృతమును, ఘృతమునకు సమముగ క్షీరమును, నీయగణద్రవ్యముల పదిటిని ప్రత్యేకము కర్షప్రమాణమువంతునచేర్చి చేయబడిన క మును కల్పి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేయునది. ఇది పరిభాషానుసారకై కల్పనాక్రమము.

లేక సామాన్యపరిభాష ననుసరించి దశమూలాదిద్రవ్యంబులును నెమలి మాం బును వేరువేరు సమభాగములుగ జేరి యాఢకపరిమితమైన క్వాథ్యమును, కల్పించి, అ ద్రోణపరిమితజలమును చేర్చి పాదాంశము మిగుల కషాయము కాచినచో నాల్గ

ములు క్వాథ మేర్పడును. అంచు క్వాథమునకు నాల్గవవంతు (ప్రస్థపరిమితమగు) ఘృతమును, ఘృతమునకు సమభాగము క్షీరమును జేర్చి ప్రత్యేకము కర్షపరిమితమైన జీవనీయగణద్రవ్యములకల్కమును కలిపి ఘృతపాకము చేయునది. (దశమూల, జీవనీయగణద్రవ్యములు స్థలాంతరమున వివరింపబడినది).

మరియు వాగ్భటాచార్యులును ఈయోగమును చెప్పిరికాని అందు త్రిఫలముల చెప్పియుండలేదు. క్వాథ్యద్రవ్యపరిమాణము మాత్రము "దశమూలబలారాస్నామధుకైస్త్రిఫలైర్యుతమ్" అని నిర్దేశింపబడినది. ఇచ్చటను "త్రిఫలా" అనుచోట, "త్రిఫలైః" అనుపాఠ మున్నచో మతభేదము కన్పట్టదు.

మూ. ఏతేనైవ కషాయేణ ఘృతప్రస్థం విపాచయేత్,
చతుర్గుణేన పయసా కల్కైరేభిశ్చ కార్షికైః. 166
జీవన్తీత్రిఫలామేదామృద్వీకర్ధిపరూషకైః,
సమఙ్గాచవికాభార్గీకాశ్మరీసురదారుభిః. 167
ఆత్మగుప్తామహామేదా తాలఖర్జూరమస్తకైః,
మృణాలబిసశాలూకశృఙ్గీజీవకపద్మకైః. 168
(మృణాలబిసఖర్జూరమధుకైశ్చ సజీరకైః)
శతావరీవిదారీక్షుబృహతీసారిబాయుగైః,
మూర్వాశ్వదంష్ట్రర్షభకశృఙ్గాటకకసేరుకైః. 169
రాస్నాస్థిరాతామలకీసూక్ష్మైలాశటిపుష్కరైః,
పునర్నవాతుగాక్షీరీకాకోలీధన్వయాసకైః. 170
ఖర్జూరా (మధుకా) క్షోటవాతామముఞ్జాతాభిషుకైరపి,
ద్రవ్యైరేభిర్యథాలాభం పూర్వకల్పేన సాధితమ్. 171
నస్యే పానే తథాభ్యఙ్గే వస్తౌ చైవ ప్రయోజయేత్,
శిరోరోగేషు సర్వేషు కాసే శ్వాసే చ దారుణే. 172
మన్యాపృష్ఠగ్రహే శోషే స్వరభేదే తథార్దితే,
యోన్యసృక్ శుక్రదోషేషు శస్తం వన్ధ్యాసుతప్రదమ్. 173
ఋతుస్నాతా తథా నారీ పీత్వా పుత్రం ప్రసూయతే,
మహామాయూరమిత్యేతద్ఘృతమాత్రేయపూజితమ్. 174

(ఇతి మహామాయూరఘృతమ్.)

వ్యా. పైయోగమున చెప్పబడిన దశమూలాదిద్రవ్య మయూరమాంసముల
సిద్ధమయిన కషాయమున ప్రస్థపరిమితమైన ఘృతమును, ఘృతమునకు నాల్గింతలు క్షీ
మును నీక్రింద జెప్పబడు జీవన్త్యాది ద్రవ్యకల్కమును చేర్చి ఘృతమును పక్వ
చేయునది. కల్కద్రవ్యములు—మనుబాల, త్రిఫలములు, మేద, ద్రాక్షపండు, ఋ
చిట్టీతపండు, మంజిష్ఠి, చవ్యము, గంటుభారంగి, పెద్దగుమ్ముడు, దేవదారు, దురదగొం
మహామేద, తాటిచెట్టుయొక్కయు ఖర్జూరపుచెట్టుయొక్కయు కొనయందుండు
మోవు, తామరకాడలు, తామరగడ్డ, కర్కాటకశృఙ్గి, జీవకము, పద్మకాష్ఠము,
కీచరగడ్డ, తెల్లనేలగుమ్మిడిగడ్డ, చెరకు, వాకుడు, పిన్నసుగంధపాల, పెద్దసుగంధపా
చాగ, పల్లేరు, ఋషభకము, పరికెగడ్డ, నమ్మదుంప, సన్నరాష్ట్రము, ముయ్యాకుపొన
నేలయుశిరిక, పిన్నయేలకులు, కచోరములు, పుష్కరమూలము, గలిజేరు, తవక్షీ
(వెదురుప్పు), కాకోలి, రేగటిదూలగోవిల, ఖర్జూరపుపండు, అక్రోడుపండు, బా
పప్పు, ముంజాతమను పుష్పశాకము, అభిషుకము, (అనుఫలవిశేషము), అనునీద్ర
ములలో దొరికినమట్టుకు, ప్రత్యేకము ఒక్కొక్క కర్షమువంతున చేర్చి కల్కము
పైజెప్పిన క్వాథక్షీరములతో కూడిన ఘృతమున కలిపి, ఘృతపాకవిధిప్రకారము పక్వ
చేసిన ఇయ్యది మహామాయూరఘృతమని ఆత్రేయులచే కొనియాడబడినది.

ఈఘృతము నస్యమునకును, పానమునకును, అభ్యంగనమునకును వస్తికర్మకును,న
యోగించునది. శిరోరోగములయందును, మిక్కిలి క్రూరమైన శ్వాసకాసలయందు
మన్యాస్తంభమునందును, వీపునొప్పియందును, శోషమునందును, స్వరభేదమునందు
అర్దితవాతమునందును, యోనిరోగములయందును, శుక్రార్తవదోషములయందును,
యోగించుట చాలప్రశస్తము. సంతానము లేనిస్త్రీ ఋతుస్నానమయినపిదప ఋ
దినములలో నీఘృతము త్రాగినయెడ వంధ్యాదోషమువదలి పుత్రోత్పత్తి యగును. ఇచ్చ
"యథాలాభం" యనుపదము కల్కద్రవ్యములకు మాత్రము నన్వయించుటచేత జీవ
మున్నగు కల్కద్రవ్యములలో దొరికినంతమట్టుకు చేర్చవలెనని యర్థము. క్వాథ్యద్ర
ములు మాత్రము పూర్వయోగసిద్ధమగుటవలన క్వాథ్యములవిషయమై ఈపద
నన్వయింపదగదు.

మూ. ఆఖుభిః కుక్కుటైర్హంసైః శశైశ్చాపి హి బుద్ధిమాన్,
కల్పేనానేన విపచేత్ సర్పిరూర్ధ్వగదాపహమ్. 1

వ్యా. పైయోగములలో జెప్పబడిన దశమూలాదిక్వాథ్యద్రవ్యములలో నెమ
ళ్లమాంసమునకు బదులుగ పందికొక్కుమాంసమునైనను కోడిమాంసమునైనను హంస

నైనను కుందేటినైనను జేర్చి క్వాథముచేసి, అందు పైజెప్పిన కల్కమునుజేర్చి ఆకల్ప విధిప్రకారముగనే ఘృతమును పక్వముచేసి నస్యాదుల కుపయోగించినచో పైజెప్పిన గుణముల గల్గించును.

### పైత్తికశిరోరోగచికిత్స.

మూ. పైత్తే ఘృతం పయః సేకాః శీతా లేపాః సనావనాః,
జీవనీయాని సర్పీంషి పానాన్నం చాపి పిత్తనుత్. 176

వ్యా. పిత్తమున కల్గిన శిరోరోగమున ఘృతంబును, క్షీరంబును, శీతలంబులైన సేచనంబులును, లేపంబులును, నస్యంబులును, జీవనీయద్రవ్యములచే సిద్ధములగు ఘృతంబులును, పిత్తహరములగు నన్నపానంబులును హితకరములు.

### పైత్తికశిరోరోగమున లేపపరిషేకములు.

మూ. చన్దనోశీరయష్ట్యాహ్వబలావ్యాఘ్రనఖోత్పలైః,
క్షీరపిష్టైః ప్రదేహః స్యాత్ శృతైర్వా పరిషేచనమ్. 177

వ్యా. చందనము, వట్టివేళ్లు, అతిమధురము, చిట్టాముట్టి, పులిగోరుచెట్టువేరు, వీని నన్నిటిని చేర్చి ఆవుపాలతో నూరి పట్టువేసినను, పైజెప్పిన ద్రవ్యములను చేర్చి కాచబడిన పాలచే పరిషేకము (స్నానము) చేసినను, పిత్తజశిరోరోగము శమించును.

### పైత్తికశిరోరోగమున శిరోవిరేచననస్యము.

మూ. త్వక్పత్రశర్కరాకల్కః సుపిష్టస్తణ్డులామ్బునా,
కార్యోఽవపీడసర్పిశ్చ నస్యం తస్యాఽనుపైత్తికే. 178

వ్యా. లవంగపుపట్ట, లవంగపుపత్రి, చక్కెర, వీనిని బియ్యపుకడుగునీళ్లు పోసి మెత్తగ నూరి అవపీడనస్యము చేసి, పిదప నేతిని నస్యము చేయనగును.

### ఘృతనస్యయోగము.

మూ. యష్ట్యాహ్వచన్దనానన్తాక్షీరసిద్ధం ఘృతం హితం,
నావనం శర్కరాద్రాక్షామధూకైర్వాపి పైత్తికే. 179

వ్యా. అతి మధురము, చందనము, సుగంధపాల, వీని నన్నిటిని క్షీరమును చేర్చి పక్వముచేయబడినఘృతమునైనను, చక్కెర, ద్రాక్షపండు, అతిమధురము, వీనిని చేర్చి సిద్ధముచేయబడిన ఘృతమునైన పిత్తమున కల్గిన శిరోరోగమునందు నస్యముచేయవలెను.

### కఫజశిరోరోగచికిత్స.

మూ. కఫజే స్వేదితం ధూమనస్యప్రధమనాదిభిః,

శుద్ధం ప్రలేపపానాన్నైః కఫఘ్నైస్సముపాచరేత్. 180

వ్యా. కఫముచే కల్గిన శిరోరోగమున తొలుత స్వేదనము చేసి ధూమపానము నస్యము ప్రధమననస్యము మున్నగువానిచే చికిత్స చేసి శుద్ధమైన పిదప కఫహరములైన యౌషధద్రవ్యములచే ప్రలేపనము చేతను అన్నపానములచేతను ఉపచరింపవలెను.

### శిరోరోగమున దాహ-రక్తమోక్షణములు.

మూ. పురాణసర్పిషః పానైః తీక్ష్ణైర్వస్తిభిరేవ చ,
కఫానిలోత్థితే దాహః శేషయోః రక్తమోక్షణమ్. 181

వ్యా. మరియు కఫజశిరోరోగమున ప్రాతదియగు ఘృతము నుపయోగించుట చేతను, తీక్ష్ణౌషధములచే గల్పింపబడిన వస్తిప్రయోగముచేతను చికిత్స చేయవలెను. మరియు కఫముచేతను వాతముచేతను సంభవించిన శిరోరోగమున విధ్యుక్తప్రకారము నిప్పున కాల్చబడిన శలాకాదులచేత లలాటశంఖప్రదేశములయందు రక్ష పెట్టవలెను. తక్కిన రక్తజ-సన్నిపాతజశిరోరోగముల రెంటియందును రక్తమోక్షణము చేయవలెను.

(దాహవిధానము సుశ్రుతమున నిట్లు చెప్పబడినది:—"శిరోరోగాధిమన్థప్రభృతిషు భ్రూలలాటశఙ్ఖప్రదేశేషు దహేత్" (సు. సూ. అ. ౧౨) ఈవాక్యముచేత శిరోరోగమునందు కనుబొమలయందును నుదుటియందును కణతలయందును కాలువ నగునని తెలిసెడి.)

### ధూమపానవిధి.

మూ. ఏరణ్డనలదధ్యామగుగ్గుల్వగురుచన్దనైః,
ధూమవర్తిం పిబేద్గన్ధైః అకుష్ఠతగరైస్తథా. 182

వ్యా. ఆముదపువిత్తులు, వట్టివేళ్లు, పట్టుగుడ్డ, గుగ్గిలము, అగరు, చందనము, వీనిచే ధూమవర్తిని సిద్ధముచేసి విధ్యుక్తప్రకారము ధూమపానము చేయనగును. లేక చెంగల్వకోష్టు గ్రంథితగరము దక్క తక్కినఅగరు మున్నగు సుగంధద్రవ్యములచే వర్తిని సిద్ధముచేసి దానిమూలమున ధూమపానము చేయనగును.

ఇచ్చట గంధద్రవ్యములలో చేరిన చెంగల్వకోష్టువు గ్రంథితగరము ఈరెండును ధూమవర్తిలో చేరినయెడ శిరస్సునందలి మస్తులుంగమును కరగించి స్రవింపజేయును. కావున "అకుష్ఠతగరైస్తథా" అని నిషేధింపబడినది. ఈవిషయము శాలాక్యతంత్రమున నిట్లు చెప్పబడినది:—"నతకుష్ఠే స్రావయతః ధూమవర్తిప్రయోజితే, మస్తులుఙ్గం

ప్రకర్షేణ తస్మాత్తేనైవ యోజయేత్" ఈవిషయమును గమనింపక "సకుష్ఠతగరై స్తథా" అని కల్పితమైన పాఠము అనార్షము.

### సాన్నిపాతికశిరోరోగచికిత్స.

మూ. సన్నిపాతభవే కార్యా సన్నిపాతహితా క్రియా,

వ్యా. సన్నిపాతముచే కల్గినశిరోరోగమున వాతాదిదోషములకు వేరువేరుగ జెప్పిన చికిత్సల నన్నిటిని మిశ్రముగ చేయనగును.

### క్రిమిజశిరోరోగచికిత్స.

మూ. క్రిమిజే చైవ కర్తవ్యం తీక్ష్ణం మూర్ధవిరేచనమ్. 183

వ్యా. క్రిములచే గల్గిన శిరోరోగమున తీక్ష్ణమైన యౌషధములచే శిరోవిరేచనమును చేయవలెను.

### క్రిమిజరోగహరనస్యాదులు.

మూ. త్వగ్గన్ధిర్వ్యాఘ్రకరజవిడఙ్గనవమాలికాః,
అపామార్గఫలం బీజం నక్తమాలశిరీషయోః. 184
కువకోఽశ్మన్తకో బిల్వం హరిద్రా హిఙ్గు యూథికా,
ఫణిజ్ఝకశ్చ తైస్తైలం అవిమూత్రే చతుర్గుణే. 185
సిద్ధం స్యాన్నావనం; చూర్ణం చైషాం ప్రధమనం హితం,
ఫలం శిగ్రుకరఞ్జాభ్యాం సవ్యోషం చాఽవపీడకః 186
కషాయః స్వరసః క్షారః చూర్ణం కల్కోఽవపీడకః,

(ఇతి శిరోరోగచికిత్సా.)

వ్యా. లవంగపుపట్ట, నేపాలపువేళ్లు వ్యాఘ్రనఖమనెడు గంధద్రవ్యము (నఖముచిప్పలు), వాయువిడంగములు, జాజిపువ్వులు, ఉత్తరేణిగింజలు, కానుగవిత్తులు, దిరిసెనపువిత్తులు, నల్లావాలు, కొండపిండిచెట్టువేరు, మారేడువేరు, పసుపు, ఇంగువ, మొల్ల, మరువము, వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి కల్కముచేసి, కల్కమునకు నాలుగింత నూనెతో చేర్చి, అందు తైలమునకు నాల్గింత మేకల మూత్రమును కలిపి తైలపాకవిధిప్రకారము పక్వముచేసి యాతైలమును నస్యమున కుపయోగింపనగును. లేక పైజెప్పిన కల్కద్రవ్యములను చూర్ణముచేసి యైనను క్రిమిజశిరోరోగమున ప్రధమననస్యమున కుపయోగింపవలెను.

మరియు మునగవిత్తులను కానుగవిత్తులను త్రికటుకములను కషాయము
యైనను, స్వరసము చేసియైనను, క్షారముగ చేసియైనను, చూర్ణము చేసియైనను, క
చేసియైనను అవపీడన నస్యమునకు క్రిమిజశిరోరోగమున నుపయోగించునది.

### ముఖరోగచికిత్సాక్రమసంగ్రహము.

మూ. శుక్తతిక్తకటుక్షౌద్రకషాయైః కవలగ్రహాః.
ధూమః ప్రధమనం శుద్ధిః అధః చ్ఛర్దనలఙ్ఘనం,
భోజ్యం చ ముఖరోగేషు యథాస్వం దోషనుద్ధితమ్.

వ్యా. ముఖరోగములయందు శుక్తమును(పులిసిన మద్యమును), తిక్తకటుర
గల కషాయములు, తేనె, వగరురసము గల ద్రవము, అను నీయౌషధములచే
గ్రహంబును, ధూమపానంబును, ప్రధమననస్యంబును, విరేచనరూపమయిన
కాయశోధనంబును, వమనరూపమయిన శోధనంబును, లంఘనంబును, ఆయాదో
హరించు నన్నపానంబులును, తత్తద్దోషానుసారముగ నుపయోగించుట హితము.

ఇచ్చట కబలగ్రహమన ఔషధద్రవ్యములు కల్కముగ నూరి ముద్దచేసి
యందు కదలించుటకు అనుకూలముగ నుండునంత పరిమాణమును నోటనుంచు
యని యెరుంగునది. ఈవిషయము "కల్కేనకబలస్స్మృతః సుఖం సంచార్యతే
సామాత్రాకబలేహితా" అని పరిభాషచే చెప్పబడినది. ప్రధమననస్యమన—
మున్నగు తీక్ష్ణద్రవ్యచూర్ణమును గొట్టమునందునిచి నాసారంధ్రములచే పీల్చుట
తీక్ష్ణనస్య మనబడును.

### ముఖరోగములయందు పిప్పల్యాదికబలగ్రహము.

మూ. పిప్పల్యగురుదార్వీత్వగ్యవక్షారరసాంజనం,
పాఠాం తేజోవతీం పథ్యాం సమభాగం విచూర్ణయేత్.
ముఖరోగేషు సర్వేషు సక్షౌద్రం తద్విధారయేత్,
శీధుమాధవమాధ్వీకైః శ్రేష్ఠోఽయం కబలగ్రహః.

వ్యా. పిప్పళ్లు, అగరు, మ్రానిపసుపుపట్ట, యవక్షారము, రసాంజనము, చిర
మాల్కంగుని, కరకకాయబెరడు, వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి చూర్ణ
అందు తేనెను కలిపి శీధుమద్యమునైనను, మాధవమద్యమునైనను, మాధ్వీకమద్యము
కలిపి ముద్దచేసి కబలగ్రహముచేయుట ముఖరోగములయందు చాల ప్రశస్త
నుండును.

### రక్తస్రావహరదంతఘర్షణచూర్ణము.

మూ. తేజోహ్వామభయాం మేలాం సమఙ్గాం కటుకాం ఘనం,
పాఠాం జ్యోతిష్మతీం లోధ్రం దార్వీం కుష్ఠం చ చూర్ణయేత్.
దన్తానాం ఘర్షణం రక్తస్రావకణ్డూరుజాపహం,

వ్యా. పిన్నమెుక్కుడుతీగె, కరకకాయబెరడు, ఏలకులు, మంజిష్ఠి, కటుకరోహిణి, తుంగగడ్డలు, చిరుబొద్ది, జ్యోతిష్మతి (పెద్దమెుక్కుడుతీగె), లొద్దుగపట్ట, మ్రానిపసుపుపట్ట, చెంగల్వకోష్టు, వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి, చూర్ణముచేసి దంతములపై రుద్దిన పండ్లనుండి రక్తస్రావమును దురదను పండ్లనొప్పిని హరించును.

### కంఠరోగమునందు పంచకోలాదిగుటికలు.

మూ. పఞ్చకోలకతాలీసపత్రైలామరిచత్వచః 192
పలాశముష్కకక్షారయవక్షారాశ్చ చూర్ణితాః,
గుడే పురాణే ద్విగుణే క్వథితే గుడికాః కృతాః. 193
కర్కన్ధుమాత్రాః సప్తాహం స్థితా ముష్కకభస్మని,
కణ్ఠరోగేషు సర్వేషు ధార్యాస్స్యురమృతోపమాః 194

వ్యా. పఞ్చకోలములు, తాలీసపత్రి, ఏలకులు, మిరియాలు, లవంగపుచెక్క, మోదుగక్షారము, మొక్కపుచెట్టు క్షారము, యవక్షారము, వీనినన్నిటిని సమభాగములుగ చూర్ణముచేసి ప్రాతబెల్లమును పాకముపట్టి అందు పైచూర్ణమును కలిపి రేగుపండంత మాత్రలుగ చేసి మొక్కపుచెట్టు ఆకులచేసైనభస్మమునం దేడుదినములునిచి, పిమ్మట కంఠరోగము లన్నిటియందును ఒక్కొక్కటి నోటనుంచుకొనినయెడ అమృతమునుబోలె కంఠరోగముల నన్నిటిని శమింపజేయును.

(పంచకోలములనః—పిప్పలి, మోడి, చవ్యము, చిత్రమూలము, శుంఠి.)

### గలరోగహరకాలకచూర్ణము.

మూ. గృహధూమో యవక్షారః పాఠా వ్యోషం రసాఞ్జనం,
తేజోహ్వా త్రిఫలా లోధ్రం చిత్రకశ్చేతి చూర్ణితమ్. 195
సక్షౌద్రం ధారయేదేతద్గలరోగవినాశనం,
కాలకం నామ తచ్చూర్ణం దన్తాస్యగలరోగనుత్. 196

(ఇతి కాలకచూర్ణమ్)

వ్యా. కరిదూపము, యవక్షారము, చిరుబొద్ది, త్రికటుకములు, రసాంజ
మాల్కంగుని, త్రిఫలములు, లొద్దుగుచెక్క, చిత్రమూలముపట్ట, వీనినన్నిటిని
భాగములుగ గూర్చి చూర్ణముచేసి తేనెతో కలిపి నోటనుంచుకొనిన గళరోగ
నన్నిటిని హరించును. ఇది కాలకచూర్ణమనబడును. దంతరోగములయందును, ముఖ
ములయందును, కంఠరోగములయందును దీని నుపయోగింపనగును. (ఈయోగ
సుశ్రుతాచార్యులు నిట్లు చెప్పెను:—"పాఠా రసాంజనం వ్యోషం తేజోహ్వా
లాగ్నికః, గృహధూమో యవక్షారః శస్తం చూర్ణం తు కాలకమ్" కొందరు లో
నకు బదులు లోహమను పాఠమును చెప్పెదరు.)

కంఠరోగములయందు పీతకచూర్ణము.

మూ. మనఃశిలాయవక్షారో హరితాలం ససైన్ధవం,
దార్వీత్వక్చేతి తచ్చూర్ణం మాక్షీకేణ సమాయుతమ్.
మూర్ఛితం ఘృతమణ్డేన కణ్ఠరోగేషు ధారయేత్,
ముఖరోగేషు చ శ్రేష్ఠం పీతకం నామ కీర్తితమ్.

(ఇతి పీతకచూర్ణ

వ్యా. మణిశిల, యవక్షారము, హరిదళము, సైంధవలవణము, మ్రాని
పట్ట, వీనిని సమభాగములుగ గూర్చి చూర్ణముచేసి తేనెలో కలిపి యుండలుగ చేసి
మీది పైమీగడలో భావనచేసి ముఖరోగములయందు నోట నుంచుకొనవలెను. ఇం
పీతకచూర్ణమని చెప్పబడును. ముఖరోగములయందు చాల ప్రశస్తమయినది.

మృద్వీకాదిచూర్ణము.

మూ. మృద్వీకా కటుకా వ్యోషం దార్వీత్వక్త్రిఫలాఘనం,
మూర్ఛితం ఘృతమణ్డేన కణ్ఠరోగేషు దారయేత్.

(ఇతి మృద్వీకాదిచూర్ణ

వ్యా. ద్రాక్షపండు, కటుకరోహిణి, త్రికటుకములు, మ్రానిపసుపుపట్ట, త్రి
ములు, తుంగగడ్డలు, వీనిని సమభాగములుగ చూర్ణముచేసి నేతిపైతేటయందు భ
జేసి కంఠరోగములయందు నోట నుంచుకొనునది.

పాఠాదిచూర్ణము.

మూ. పాఠా రసాఞ్జనం మూర్వాం తేజోహ్వేతి చ చూర్ణితం,
క్షౌద్రయుక్తం విధాతవ్యం గలరోగే భిషగ్జితమ్.
యోగాస్త్వేతే త్రయః ప్రోక్తా వాతపిత్తకఫాపహాః,

వ్యా॥ చిరుబొద్ది, రసాంజనము, చాగపట్ట, మాల్కాంగుని వీనిని సమభాగములుగ చూర్ణముచేసి తేనెతో కలిపి నోట నుంచుకొనిన గళరోగముల నన్నిటిని శమింపజేయును. పైజెప్పబడిన యోగములలో కాలక, పీతక, మృద్వీకాచూర్ణయోగములు మూటిలో నొక్కొక్కటియు వాతపిత్తకఫములు మూటిని హరించునవి యైయుండును.

(ఇచ్చట "మృద్వీకా—పాఠా" అనుచూర్ణయోగములు రెంటి నొక్కటిగ గూర్చినయెడ "యోగాస్త్వేతే త్రయః ప్రోక్తా" అను వాక్యమునకు సమంజసముగ నుండును వ్యాఖ్యయందును "కాలాదయః త్రయో యోగా త్రిదోషహరాః"అని చెప్పబడినది.)

### కంఠరోగహరక్వాథములు.

మూ. కటుకాతివిషా పాఠా దార్వీముస్తకలిఙ్గకాః,
గోమూత్రక్వథితాః పేయాః కణ్ఠరోగవినాశనాః. 201

వ్యా॥ కటుకరోహిణి, అతివస, చిగుబొద్ది, మ్రానిపసుపు, తుంగగడ్డలు, కొడిశపాలపట్ట, (లేక విత్తులు), వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి నాలుగింతల గోమూత్రమున నాల్గవపాలు మిగుల క్వాథము చేసి త్రాగినచో కంఠరోగములు హరించును. (ఇచ్చట "గోమూత్రక్వథితాః" అని బహువచనముండుటచేత కటుకరోహిణి మున్నగు వానిని వేరువేరుగ గోమూత్రమున క్వథితముచేసి ఒక్కొక్కయోగముగ నుపయోగింపవలయునని తోచుచున్నది.)

### ముఖరోగాదులకు దార్వీరసక్రియ.

మూ. స్వరసః క్వథితో దార్వ్యాః ఘనీభూతో రసక్రియాః,
సక్షౌద్రా ముఖరోగాసృక్ దోషనాడీవ్రణాపహా. 202

వ్యా॥ మ్రానిపసుపు నూరి స్వరసముచేసి యాస్వరసమును, ఘనీభావమందునట్లు పాకముచేసిన నయ్యది రసక్రియ యనబడును. దీనిని తేనెలో కలిపి యుపయోగించినచో ముఖరోగములును, రక్తదోషములును, నాడీవ్రణములును హరించును.

### తాలుశోషమున సర్పిష్పానవిధి.

మూ. తాలుశోషే త్వతృష్ణస్య సర్పిరౌత్తరభక్తికం,
నావనం మధురాః స్నిగ్ధాః శీతాశ్చైవ రసా హితాః. 203

వ్యా॥ దప్పిలేనిదానికి కేవలము తాలుశోషముమాత్రము సంభవించినయెడ అట్టి తృష్ణారహితతాలుశోషమున భోజనానంతరము ఘృతపానము చేయదగును. మరియు

నస్యమును మధురములును స్నిగ్ధములును, శీతవీర్యములునైన, మాంసరసములు హితము లుగ నుండును.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—స్నేహాధ్యాయమున "సంశోధనాద్యృతే యేషాం............తృష్ణామూర్ఛాపరీతాశ్చ గర్భిణ్యస్తాలుశోషిణః............న స్నేహ్యాః" సూ. అ. ధా. 13 శ్లో. 56. అనునీ వాక్యముచే తృష్ణారోగమునందును, తాలుశోషమునందును, స్నేహపానము నిషేధింపబడినది. ఇచ్చట అట్టినిషేధమునకు ప్రతిప్రసవముగ ఔత్తరాభక్తికి ఘృతపానము (భోజనానంతరము చేయదగిన ఘృత పానము), విధింపబడినది. అందును "అతృష్ణస్య" అని చెప్పుటవలన నీఘృతపానము తృష్ణారహితమైన తాలుశోషమునందు మాత్రము చేయదగునుగాని తృష్ణాయుక్త తాలు శోషము సామాన్యవిధిచేతనే నిషిద్ధమని యెరుంగునది. ఇది మూలమునకు సమరసమైన యర్థము. "అతృష్ణస్య" యనుచోట "సతృష్ణస్య, సుతృష్ణస్య" అను పాఠములు ఆర్ష సమ్మతములు కావు. వాగ్భటాచార్యులును "అతృష్ణస్య" అనుపాఠమునే చెప్పిరి.

### ముఖపాకమున సిరావ్యధనాదిచికిత్స.

మూ. ముఖపాకే సిరాకర్మ శిరఃకాయవిరేచనం,
మూత్రతైలఘృతక్షౌద్రక్షీరైశ్చకబలగ్రహాః. 204
సక్షౌద్రాస్త్రిఫలాపాఠామృద్వీకాజాతిపల్లవాః,
కషాయతిక్తకాశ్శీతాః క్వాథాశ్చ ముఖధావనాః. 205

వ్యా. ముఖపాకరోగము (నోటపుండు) నందు, తాలువులయందును, నాలుక యందును సిరావ్యధనము చేయవలయును. పిదప శిరోవిరేచనమును, కాయవిరేచనమును చేయదగును. మూత్రముచేతను, తైలముచేతను, ఘృతముచేతను, తేనెచేతను, పాల చేతను, కబలధారణముచేయదగును. త్రిఫలములు, చిరుబొద్ది, ద్రాక్షపండు, జాజిచిగుళ్లు, మొదలగువానిని తేనెతో కూర్చి కబలగ్రహముల కుపయోగింపదగును. కషాయతిక్త రసంబులును, శీతవీర్యంబులు నైనక్వాథములు, నోటిని శుభ్రముగ చేయును. (ఇచ్చట సిరావ్యధనవిధి సుశ్రుతోక్తము ననుసరించునది.)

### ఖదిరాదివటి, తైలంబును.

మూ. తులాం ఖదిరసారస్య ద్విగుణామరిమేదసః,
ప్రక్షాల్య జర్జరీకృత్య చతుర్ద్రోణేఽమ్బసః పచేత్. 206
ద్రోణశేషం కషాయం తం పూత్వా భూయః పచేత్ శనైః,

తత స్తస్మిన్ ఘనీభూతే చూర్ణీకృత్యాక్షభాగికమ్. 207
చన్దనం పద్మకోశీరం మఞ్జిష్ఠా ధాతకీ ఘనం,
ప్రపౌణ్డరీకం యష్ట్యాహ్వాత్వగేలాపద్మకేసరమ్. 208
లాక్షాం రసాఞ్జనం మాంసీ త్రిఫలాలోధ్రవాలకం,
రజన్యౌ ఫలినీమేలాం సమఙ్గాం కట్ఫలం వచామ్. 209
యవాసాగురుపత్తఙ్గగైరికాఞ్జనమావపేత్,
లవఙ్గనఖకక్కోలజాతికోశాన్పలోన్మితాన్. 210
కర్పూరకుడవం చాపి క్షిపేచ్ఛీతేఽవతారితే,
తతస్తు గులికాః కార్యాః శుష్కాశ్చాస్యే విధారయేత్. 211
తైలం చానేన కల్కేన కషాయేణ చ సాధయేత్,
దన్తానాం చలనభ్రంశసౌషిర్యక్రిమిరోగనుత్. 212
ముఖపాకాస్యదౌర్గన్ధ్యజాడ్యారోచకనాశనం,
స్రావోపలేపపైచ్ఛిల్యవైస్వర్యగలశోషనుత్. 213
దన్తాస్యగలరోగేషు సర్వేష్వేతత్పరాయణం,
(ఖదిరాదిగుటీకేయం తైలం చ ఖదిరాదికమ్.) 214

(ఇతి ఖదిరాదిగుటికా తైలం చ.)

వ్యా. నూరుపలములు ఖదిరసారమును (కాచును), రెండువందలపలములు నల్లతుమ్మపట్టను శుభ్రముగ నీళ్లలో కడిగి చిన్నముక్కలుగ ఖండించి చిదుకగొట్టి నాల్గు ద్రోణముల పరిమితమైన జలమున వైచి, ద్రోణమాత్రము (నాల్గవపాలు) మిగులునట్లు కషాయముకాచి, వడగట్టి యాకషాయమును మరల మందాగ్నిలో మెలమెల్లగ కాచవలెను. అయ్యది చిక్కనగు సమయమున—చందనము, పద్మకాష్ఠము, వట్టివేళ్లు, మంజిష్ఠి, ఆరెపువ్వు, తుంగగడ్డలు, ప్రపౌండరీకమనుగంధద్రవ్యము, అతిమధురము, లవంగపుపట్ట, ఏలకులు, తామరపువ్వులయందలికేసరములు, లక్క, రసాంజనము (సుర్మారాయి), జటామాంసి, త్రిఫలములు, లొద్దుగుపట్ట, కురువేరు, పసుపు, మ్రానిపసుపు, ప్రేంకణపుచెక్క, సన్నయేలకులు, ముణుగుదామర, టేకుమ్రానిపట్ట, పస, దూలగొండి, అగరు, రక్తచందనము, గైరికము (కాచిరాయి), సౌవీరాంజనము, అనునీద్రవ్యములను ఒక్కొకకర్షప్రమాణమువంతున చేర్చి మెత్తని చూర్ణముచేసి, పైజెప్పినరీతిగ పక్వమగుచుండు కషాయమున కలిపి లేహపాకవిధిప్రకారము పక్వముచేసి దింపి, చల్లబడిన పిదప

అందు లవంగములు, నఖము చిప్పలు, తక్కోలములు, జాజికాయ, (జాజికాయపత్రి), వీనిని దినుసుకొక్కొకపలమువంతున చూర్ణముచేసి కలిపి, కుడవపరిమితమైన (నాల్గుపలములు) పచ్చకర్పూరమును కూడ చేర్చి, (అన్నియు నొకటిగ కలియునట్లు కలియబెట్టి) గుళికలు చేసి నీడనే యెండించి నోట నుంచుకొనవలెను. (ఇయ్యది ఖదిరసారాదిగుటిక యనబడును.)

మరియు పైజెప్పిన ఖదిరసారాదికషాయమున నాల్గవవంతు నువ్వులనూనెను, చందనాది కల్కద్రవ్యములను చేర్చి తైలపాకవిధిప్రకారము పక్వముచేసి, లవంగము మున్నగు నావాపద్రవ్యములను కలిపియుంచుకొనునది. (ఇయ్యది ఖదిరసారాదితైల మనబడును).

ఈగుటికలను తైలమును ఉపయోగించుటవలన దంతములు కదలుటయు, ఊడుటయు, దంతములయందు రంధ్రములు ఏర్పడుటయు, క్రిమిదంతరోగంబును, ముఖపాకంబును (నోటిపుండును), నోటికంపును, నోటికి రుచి తెలియక మొద్దుబారియుండుటయు, అరోచకంబును, నోట జొల్లుకారుటయు, నోరు పిచ్ఛిలముగ నుండుటయు, జిగట కల్గియుండుటయు, కంఠస్వరము మారియుండుటయు, కుత్తుకలో ద్రవము లేకయుండుటయు ఇవి యన్నియు నివర్తించును. మరియు దంతరోగములయందును ముఖరోగములయందును కంఠరోగములయందును తక్కినముఖరోగము లన్నిటియందును ఈ గుటికలను తైలమును చాల ప్రశస్తమగు నౌషధము. ఇది ఖదిరాది గుటికలనియు, ఖదిరాదితైలమనియు చెప్పబడును.

(ఈయోగమే వాగ్భటాచార్యులచే జెప్పబడెను. కాని అందు "ఖదిరసారాత్ ద్వేతులే, పచేద్వల్కాత్తులాం చారిమేదసః" (అ. హృ. ఉ. అ. ౨౨) అని ఖదిరసార, అరిమేదముల పరిమాణము దీనికి వ్యత్యస్తముగ జెప్పబడినది.)

## అరోచకచికిత్సాసంగ్రహము.

మూ. అరుచౌ కబలగ్రాహాః ధూమాస్సముఖధావనాః,
మనోజ్ఞమన్నపానం చ హర్షణాశ్వాసనాని చ. 215

వ్యా. అరోచకమునందు కబలగ్రహంబులును, ధూమపానంబులును, ముఖమును శుభ్రపరుచువిధానంబులును, మనసు కింపైన యన్నపానంబులును, మనసుకు హర్షమును కల్గించు పనులును, ఆశ్వాసనంబులును చేయనగును.

## వాతికాద్యరోచకములచికిత్స.

మూ. కుష్ఠసౌవర్చలాऽజాజీశర్కరామరిచం బిడం,

ధాత్రీ్యలాపద్మకోశీరపిప్పల్యుత్పలచన్దనమ్. 216
లోధ్రం తేజోవతీ పథ్యా త్ర్యూషణం సయవాగ్రజం,
ఆర్ద్రిదాడిమనిర్యాసశ్చాఽజాజీశర్కరాయుతః. 217
సతైలమాక్షికా స్త్వేతే చత్వారః కబలగ్రహాః,
చతుర్ోఽరోచకాన్ హన్యుః వాతాద్యేకజసర్వజాన్. 218

వ్యా. చెంగల్వకోష్టు, సౌవర్చలలవణము, జీలకర, చక్కెర, మిరియాలు, బిడా
లవణము వీనిని సమభాగములుగ చూర్ణముచేసి తైలమును తేనెను కలిపి వాతముచే జనిం
చిన యరోచకమున కబలగ్రహము చేయనగును.

ఉసిరికకాయలబెరడు, ఏలకులు, పద్మకాష్ఠము, వట్టివేళ్లు, పిప్పళ్లు, నల్లకలువలు,
చందనము వీనిని సమభాగములుగ జేర్చి చూర్ణముచేసి తైలమాక్షికముల కలిపి పిత్తజా
రోచకమున కబలగ్రహము చేయనగును.

లొద్దుగుపట్ట, మాల్కంగుని, కరకకాయలబెరడు, త్రికటుకములు, యవక్షారము
వీని సమభాగములుగ గూర్చి చూర్ణముచేసి నూనెను తేనెను కలిపి కఫమున గల్గిన
యరోచకమున కబలగ్రహము చేయనగును.

అల్లపురసము, దానిమ్మరసమును, జీలకర, చక్కెర వీని నొకటిగ గూర్చి అందు
నూనెను తేనెను కలిపి సన్నిపాతమున కల్గిన యరోచకమున కబలగ్రహము చేయనగును.
కావుంగున పైజెప్పబడిన నాల్గు అర్ధశ్లోకములచే నైన నాల్గుయోగములను వరుసగ
వాత-పిత్త-కఫ-సన్నిపాతారోచకముల నాల్గిటియందును కబలగ్రహముల కుపయోగించ
వలెనని భావము.

## అరోచకహరద్రవ్యములు.

౧. కారవీమరిచాఽజాజీద్రాక్షావృక్షామ్లదాడిమం,
సౌవర్చలం గుడః క్షౌద్రం సర్వారోచకనాశనమ్. 219

వ్యా. నల్లజీలకర, మిరియాలు, జీలకర, ద్రాక్షపండు, చింతపండు, దానిమ్మ
పండువిత్తులు, సౌవర్చలలవణము, బెల్లము, తేనె ఇవి యన్నియు నరోచకముల నన్ని
టిని శమింపజేయును.

## అరోచకమున శోధనవిధి.

౧. వస్తిం సమీరణే, పిత్తే విరేకం వమనం కఫే,

కుర్యాచ్ఛద్ధ్యనుకూలాని హర్షణం చ మనోఘ్నజే. 220
(ఇత్యరోచకచికిత్సా.)

వ్యా. వాతికారోచకమున వస్తికర్మయు, పైత్తికమున విరేచనంబును, కఫజమున వమనంబును శోధనమునకై యుపయోగింపవలెను. మనసు కింపుగాని దర్శనాదులచే మనసు కేవగింపు కల్గి, దాన జనించిన యరోచకమునందు మనస్సుకు హర్షమును కల్గించు నౌషధ అన్నవిహారాదుల నాచరించవలెను.

## కర్ణరోగచికిత్సాసంగ్రహము.

మూ. కర్ణశూలే తు వాతఘ్నీ హితా పీనసవత్క్రియా,
ప్రదేహః పూరణం నస్యం పాకస్రావే వ్రణక్రియాః. 221
భోజ్యాని చ యథాదోషం కుర్యాత్ స్నేహాంశ్చ పూరణాన్,

వ్యా. కర్ణశూలమునందు పీనసరోగమునకు వలె వాతహరమైన చికిత్సావిధానము హితముగ నుండును. మరియు ప్రలేపములు కర్ణపూరణము, నస్యమును కూడ హితముగ నుండును. కర్ణపాకమునందును, స్రావమునందును, వ్రణమునకు చెప్పిన శోధనరూపణాది చికిత్సలు హితకరములు. ఆయాదోషము ననుసరించి యన్నపానవిధుల నాచరించదగును స్నేహద్రవ్యములచే కర్ణపూరణము చేయదగును.

## కర్ణశూలహర తైలము.

మూ. హిఙ్గుతుమ్బురుశుణ్ఠీభిః తైలం తు సార్షపం పచేత్. 222
ఏతద్ధి పూరణం శ్రేష్ఠం కర్ణశూలనివారణం,

వ్యా. ఇంగువ, తుంబురులు, శుంఠి ఈమూటిని కల్కముచేసి కల్కమునకు నాల్గింతలు ఆవనూనెను, నూనెకు నాల్గింతలు జలమును చేర్చి తైలపాకవిధిప్రకారము పక్వముచేసిన నీతైలము చెవిపోటునందు చెవిలో పోసినయెడ నివర్తించును.

## కర్ణశూలహారకకర్ణపూరణతైలము.

మూ. దేవదారువచాశుణ్ఠీశతాహ్వాకుష్ఠసైన్ధవైః 22
తైలం సిద్ధం బస్తమూత్రే కర్ణశూలనివారణం,

వ్యా. దేవదారుచెక్క, వస, శుంఠి, సదాపవిత్తులు, చెంగల్వకోష్ఠు, సైంధవలవణము వీనిని కల్కముచేసి ఆవనూనెలో చేర్చి నూనెకు నాల్గింతలు మేకమూత్రము చేర్చి తైలమును పక్వముచేసి చెవిలో నింపిన చెవిపోటు నిమ్మళించును.

### కర్ణశూలహరతైలము.

మూ. వరాటకాన్సమాహృత్య దహేన్మృద్భాజనే నలే. 224
తద్భస్మ శ్చ్యోతయేత్ (స్రావయేత్) తేన గన్ధతైలం విపాచయేత్,
రసాంజనస్య శుణ్ఠ్యాశ్చ కల్కాభ్యాం కర్ణశూలనుత్. 225

వ్యా. గవ్వలను తెచ్చి క్రొత్తకుండలో నునిచి కాల్చి బూడిదచేసి యాభస్మమును వస్త్రగళితముచేసి, అగరు మున్నగు సుగంధద్రవ్యములను కల్కముచేసి గవ్వల భస్మమును కూడ కలిపి రసాంజనము శుంఠిని గూడ కల్కముచేసి తైలమున కలిపి తైలపాకవిధిప్రకారము పక్వముచేసి యాతైలమును చెవిలో బోసికొనిన కర్ణశూలము నివర్తించును.

### బాధిర్యాదులకు క్షారతైలము.

మూ. శుష్కమూలక(బాలమూలక)శుంఠీనాంక్షారో హిఙ్గుమహౌషధం,
శతపుష్పా వచా కుష్ఠం దారు శిగ్రు రసాఞ్జనమ్. 226
సౌవర్చలయవక్షారస్వర్జికోద్భిదసైన్ధవం,
భూర్జగ్రన్థిబిడం ముస్తం మధుశుక్తం చతుర్గుణమ్. 227
మాతులుఙ్గరసశ్చైవ కదల్యా రస ఏవ చ,
సర్వైరేతైర్యథోద్దిష్టైః క్షారతైలం విపాచయేత్. 228
(తైలమేతద్విపక్తవ్యం కర్ణశూలహారం పరమ్)
బాధిర్యం కర్ణనాదశ్చ పూయస్రావశ్చ దారుణః,
క్రిమయః కర్ణశూలం చ పూరణాదస్య నశ్యతి. 229
(పూరణాదస్య తైలస్య క్రిమయః కర్ణమాశ్రితాః,
క్షిప్రం ప్రణాశం గచ్ఛన్తి కృష్ణాత్రేయస్య శాసనాత్
క్షారతైలమిదం శ్రేష్ఠం ముఖదన్తామయాపహమ్.)

వ్యా. చక్కగ నెండిన ముల్లంగిగడ్డలను తునియలుగ చేసి క్షారవిధిప్రకారము నిప్పున కాల్చి క్షారముచేసి, యాక్షారము ఇంగువ, శుంఠి, సదాప, వస, చెంగల్వకోష్టు, దేవదారు, మునగపట్ట, రసాంజనము, సౌవర్చలలవణము, యవక్షారము, సర్జక్షారము, ఔద్భిదలవణము, సైంధవలవణము, భుజపత్రి, గ్రంథితగరము, బిడాలవణము, తుంగగడ్డలు వీనినన్నిటిని సమభాగములుగ జేర్చి నూరి కల్కముచేసి, యాకల్కమునకు

వ్యా. కావిరాయి, సైంధవలవణము, తుంగగడ్డలు, గోరోచనము, వీనిని క్రియచేసియైనను; ప్రేంకణము, మనశ్శిల ఈరెంటిని తేనెతో కలిపి రసక్రియ యైనను, కఫముచే కల్గిన నేత్రరోగమునందు కనురెప్పలపై పట్టువేయనగును.

మరియు సన్నిపాతమున కల్గిన నేత్రరోగమునందు వాతాది నేత్రరోగము వేరువేరుగ చెప్పబడిన ప్రలేపద్రవ్యముల నన్నిటిని చేర్చి కనురెప్పలపై పట్టువేయనగు

## వాతిక-పైత్తిక నేత్రరోగములకు ఆశ్చ్యోతనము.

మూ. పక్ష్మణ్యస్పృశ్యతా కార్యం సమ్పక్వే త్వం జనంత్ర్యహాత్. 2
ఆశ్చ్యోతనం మారుతజే క్వాథో బిల్వాదిభిర్హితః,
కోష్ణః సైరణ్డతర్కారీబృహతీమధుశిగ్రుభిః. 2
మృద్వీకాదార్వీమంజిష్ఠాలాక్షాద్వీమధుకోత్పలైః,
క్వాథస్సశర్కరః శీతః పూరణం రక్తపిత్తనుత్. 2

వ్యా. నేత్రరోగములు మూడుదినములకు పక్వమైన పిదప ఆశ్చ్యోతన నంజనమును చేయవలెను. అట్టి యంజనమును చేయునపుడు చేతితో కనురెప్పల నంట చేయవలెను.

వాతముచే కల్గిన నేత్రరోగములయందు బిల్వాదిగణద్రవ్యములను, ఆము వేళ్లను, తక్కోలవేళ్లను, ములకవేళ్లను, ఎఱ్ఱమునగపట్టను జేర్చి సిద్ధముచేయ సుఖోష్ణకషాయముతో నాశ్చ్యోతనమును చేయవలెను. ద్రాక్షపండు, మ్రానిప మంజిష్ఠి, లక్క, ఇప్పపట్ట, అతిమధురము, నల్లకలువలు వీనిని సమభాగములుగ గ క్వాథముచేసి అందు చక్కెరను కలిపి చల్లారినపిదప కన్నులయందు నింపిన పి చేతను రక్తముచేతను గల్గిన నేత్రరోగములు శమించును.

ఇచ్చట నేత్రరోగములు సామాన్యముగ మూడుదినములకు పక్వమగునని య శించి 'త్ర్యహాత్' అని నిర్దేశింపబడినది. మరియు ఆశ్చ్యోతనస్వరూపము తంత్రా మున నిట్లు చెప్పబడినది:—"ఉన్మీలితేఽక్ష్ణి దృక్మధ్యే బిన్దుభిః ద్వ్యఙ్గులాద్ధితమ్, క్షౌద్రాసవస్నేహబిన్దూనాం యత్తు పాతనమ్, యద్వ్యఙ్గులోన్మితే నేత్రే ప్రోక్తమాశ్చ తనం హి తత్" కన్నుల తెరచి రెండంగుళముల యెత్తునుండి కషాయము ము ద్రవములను కంటినడుమ విడచుట ఆశ్చ్యోతనమని యర్థము. పక్వాక్షిరోగలక్ష తంత్రాంతరమున నిట్లుచెప్పబడినది:—"ప్రస్తవర్త్మతా చాక్ష్ణోః సంరమ్భశ్రుప్రశా మన్దవేదనతా కణ్డూః పక్వాక్షిగదలక్షణమ్."

### కఫజ-సాన్నిపాతికనేత్రరోగములయం దాశ్చ్యోతనము.

మూ. నాగర త్రిఫలాముస్తనిమ్బవాసారసః కఫే,
కోష్ణమాశ్చ్యోతనం మిశ్రైః ఔషధైస్సాన్నిపాతికే. 239

వ్యా. శుంఠి, త్రిఫలములు, తుంగగడ్డలు, వేపపట్ట, ఆడ్డసరము, వీనిని సమభాగములుగ గూర్చి క్వాథముచేసి కఫజనేత్రరోగమునందు ఆశ్చ్యోతనము చేయునది. మరియు వాతికాదినేత్రరోగములకు వేరువేరుగ చెప్పిన యౌషధములను మిశ్రములుగ జేసి సాన్నిపాతిక నేత్రరోగమునం దాశ్చ్యోతనమును చేయనగును.

### వాతికనేత్రరోగహరవర్తి.

మూ. బృహత్యేరణ్డమూలత్వక్ శిగ్రోః పుష్పం ససైన్ధవం,
అజాక్షీరేణ పిష్టం స్యాత్ వర్తిర్వాతాక్షిరోగనుత్. 240

వ్యా. వాకుడువేరుపట్ట, ఆముదపువేరుపట్ట, మునగపువ్వులు, సైంధవలవణము, వీనిని సమభాగములుగ గూర్చి మేకపాలతో నూరి వర్తిని (కణికను) చేసి కన్నులకు కలికము వేసిన వాతముచే గల్గిన నేత్రరోగములను హరించును.

### పైత్తికనేత్రరోగహరవర్తి.

మూ. సుమనఃకోరకాశ్శఙ్ఖః త్రిఫలా మధుకం బలా,
పిత్తరక్తాఽపహా వర్తిః పిష్టా దివ్యేన వారిణా. 241

వ్యా. జాజిమొగ్గలు, శంఖచూర్ణము, త్రిఫలములు, అతిమధురము, చిట్టాముట్టి, వీనిని సమభాగములుగ గూర్చి దివ్యోదకము (వర్షధారాజలము)చే మెత్తగ నూరి కణిక చేసి కన్నులలో కలికము వేసిన పిత్తము చేతను రక్తముచేతను కల్గిన నేత్రరోగముల హరించును.

### కఫజనేత్రరోగహరవర్తి.

మూ. సైన్ధవం త్రిఫలా వ్యోషం శఙ్ఖనాభిః సముద్రజః,
ఫేనః శైలేయకం సర్జో వర్తిః శ్లేష్మాక్షిరోగనుత్. 242

వ్యా. సైంధవలవణము, త్రిఫలములు, త్రికటుకములు, శంఖమున లోభాగమున నుండు చిన్నశంఖము, సముద్రపునురుగు, శిలాజతువు, సర్జరసము, వీనిని సమభాగములుగ గూర్చి మెత్తగ నూరి కణికచేసి కన్నులలో కలికము వేసిన కఫముచే గల్గిన నేత్రరోగముల హరించును.

## సాన్నిపాతికనేత్రరోగహర అమృతాదివర్తి.

మూ. అమృతాహ్వా బిసం బిల్వం పటోలం ఛాగలం శకృత్,
ప్రపౌణ్డరీకం యష్ట్యాహ్వాం దార్వీం కాలాఽనుసారిబా. 24
ఏషామష్టఫలాన్ భాగాన్ సుధౌతాన్ జర్జరీకృతాన్,
తోయే పక్త్వా రసే పూతే భూయః పక్వే రసే ఘనే. 24
కర్షం చ శ్వేతమరిచాత్ జాతీపుష్పాన్నవాత్పలం,
చూర్ణం క్షిప్త్వా కృతా వర్తిః సర్వఘ్నీ దృక్ప్రసాదనీ. 24

వ్యా. తిప్పతీగె, తామరకాడలు, బిల్వవేరు, చేదుపొట్ల, మేకపేడ, పొండరీ
మనుగంధద్రవ్యము, అతిమధురము, మ్రానిపసుపు, పీతచందనము, వీనిని ప్రత్యేకవ
ఎనిమిదేసి పలములవంతున భాగముల గల్పించి శుభ్రముగ నీళ్లతో కడిగి నలుగగొ
నాలుగింతనీళ్లలో బోసి నాల్గవపాలు మిగుల కషాయము కాచి వడగట్టి, మర
ప్రొయ్యిమీద పక్వముచేయునది. అయ్యది చక్కగ పక్వమగునపుడు అందు మున
విత్తులు ఒకకర్షమును, క్రొత్తజాజిపువ్వులు ఒకపలమును మెత్తగ చూర్ణముచేసి కలి
మైనమువలె పక్వముగజేసి గుళికలుగ చేసి నీడనెండించునది. దీనిని కండ్ల కుపయోగించి
త్రిదోషజనేత్రరోగములన్నియు నివర్తించి దృష్టిని నిర్మలముగజేయును. (ఇచ్చ
"శ్వేతమరిచం—శ్వేతశోభాఞ్జనబీజమ్" అని చక్రపాణిదత్తవ్యాఖ్యలో నున్న
తెల్లమిరియాలు అని చెప్పుట సమంజసముగ నున్నది.)

## సర్వాక్షిరోగహరవర్తి.

మూ. శఙ్ఖప్రవాళవైడూర్యలౌహతామ్రప్లవాఽస్థిభిః,
స్రోతోజశ్వేతమరిచైః వర్తిః సర్వాక్షిరోగనుత్. 24

వ్యా. శంఖము, పగడములు, వైడూర్యము, ఇనుము, రాగి, నీరుకోడియెముకలు
స్రోతోంజనము (సుర్మారాయి), తెల్లమిరియాలు, వీనిని నూరి గుటికలుచేసి నేత్రరో
ముల కుపయోగించిన నేత్రరోగములన్నియు నివర్తించును.

## కాచాదిహరచూర్ణాంజనము.

మూ. శాణార్ధం మరిచాత్ ద్వౌ చ పిప్పల్యర్ణవఫేనయోః,
శాణార్ధం సైన్ధవాత్ శాణానవసౌవీరకాఞ్జనాత్. 24
పిష్టం సుసూక్ష్మం చిత్రాయాం చూర్ణాఞ్జనమిదం శుభం,
కణ్డూకాచకఫార్తానాం మలానాం చ విశోధనమ్. 24

వ్యా. మిరియాలు అర్ధశాణము, పిప్పళ్లు రెండుశాణములు, సముద్రపునురుగు రెండుశాణములు, సైంధవలవణము అర్ధశాణము, సౌవీరకాంజనము తొమ్మిదిశాణములు, ఈభాగముల వంతున వీనినన్నిటిని చేర్చి చిత్రానక్షత్రమునాడు మెత్తగ కాటుకవలె నూరి చూర్ణము చేసి కండ్లకంజనముచేసిన కండ్లదురదయు, కాచరోగంబులును, కఫముచే గల్గిన నేత్రరోగంబులును శమించును. కంటిమలములను శుద్ధముగ జేయును.

## తిమిరాదిహరచూర్ణాంజనము.

మూ. బస్తమూత్రే త్ర్యహం స్థాప్యం ఏలాచూర్ణం(బిడచూర్ణం)
సుభావితం, చూర్ణాఽఞ్జనం హి తైమిర్యక్రిమిపిల్లమలాపహమ్.

వ్యా. ఏలకులను చూర్ణముచేసి మేకమూత్రమున మూడుదినము లూరబెట్టి యెండించి చూర్ణముచేసి కండ్లకంజనమువేసిన తిమిరము, క్రిమిరోగము, పిల్లము అను నేత్రరోగములు శమించి కన్నులమలమును హరించును.

## తిమిరాదిహరవర్తి.

మూ. సౌవీరమఞ్జనం తుత్థం తాప్యో ధాతుః మనశ్శిలా,
చక్షుష్యా మధుకం లోహాః మణయః పౌష్పమఞ్జనమ్. 250
సైంధవం సౌకరీదంష్ట్రా కతకం చాఞ్జనం శుభం,
తిమిరాదిషు చూర్ణం వా వర్తిర్వేయమనుత్తమా. 251

వ్యా. సౌవీరాంజనము, మైలుతుత్తము, తాప్యము, (తాపీనదిలో బుట్టిన మాక్షికధాతువిశేషము), మణిశిల, అడవియుంలవలు, అతిమధురము, లోహములు, మణులు, పుష్పాంజనము, సైంధవలవణము, అడవిపందికోరలు, చిల్లగింజ, వీనినన్నిటిని చేర్చి మెత్తగ నూరి చూర్ణముగనైనను, వర్తిగ (గుళికగ) నైనను చేసిన నియ్యది తిమిరాది నేత్రరోగముల కన్నిటికిని యుత్తమమైన యౌషధముగ నుండును.

## తిమిరాదిహరసుఖావతీవర్తి.

మూ. కతకస్య ఫలం శంఖః సైన్ధవం త్ర్యూషణం సితా,
ఫేనో రసాఞ్జనం క్షౌద్రం విడఙ్గాని మనశ్శిలా. 252
కుక్కుటాణ్డకపాలాని వర్తిరేషా వ్యపోహతి,
తిమిరం పటలం కాచం మలం చాశు సుఖావతీ. 253

(ఇతి సుఖావతీవర్తిః.)

నస్యైస్తైలైశ్శిరోవక్త్రప్రలేపైశ్చాప్యుపాచరేత్,

వ్యా. ఖాలిత్యము (తలవెండ్రుకలూడి బట్టగట్టుట) నందును, ఫలితము (వెం
కలు తెల్లబడుట) నందును, శరీరమున ముడతలుబడునప్పుడును, వెండ్రుకలు పచ్చ
నప్పుడును, తొలుత శోధనచికిత్సను (వమనరూపమైనచికిత్సను) చేసి, పిదప నస్య
చేతను, తైలములచేతను, శిరస్సునందును ముఖమునందును ప్రలేపముల చేయుటచే
చికిత్స చేయవలెను.

ఖాలిత్యమునకు నస్యము.

మూ. సిద్ధం విదారీగన్ధాద్యైః జీవనీయైరథాపి చ. 2
నస్యం స్యాదణుతైలం వా ఖాలిత్యపలితాపహం,

వ్యా. విదారిగంధాదిగణద్రవ్యములచేనైనను, జీవనీయగణద్రవ్యములచేనైన
సిద్ధము చేయబడిన తైలముచే నస్యముచేయించినను, లేక నాసారోగచికిత్సలో చెప
అణుతైలముచేనైన నస్యము చేయించినను ఖాలిత్యంబును పలితంబును నివర్తించును.

ఇచ్చట:—"ప్రభౌవ్యాజే తిలాన్ క్షీరే......తత్స్మృతమ్" (శ్లో. ౧
౧౪౦). అని చెప్పబడిన అణుతైలమును గ్రహించునది.

పలితహరనస్యము.

మూ. క్షీరాత్ సహచరాత్ భృఙ్గరాజాచ్చ సురసాద్ధ్రివాత్.
ప్రస్థైస్తు కుడవస్తైలాత్ యష్ట్యాహ్వాపలకల్కితః,
సిద్ధశ్శిలాసమే భాణ్డే మేషశృఙ్గాదిషు స్థితః.
నస్యం స్యాత్ భిషజా సమ్యక్ యోజితం పలితాపహం,

వ్యా. ఆవుపాలు, గోరంటాకురసము, గుంటకలగరాకురసము, తులసియాకురస
అనునీద్రవములు ఒక్కొకప్రస్థము, నువ్వుల నూనె యొకకుడవము (నాల్గుపలము
అతిమధురము కల్కము ఒకపలము, వీనినన్నిటి నొకటిగ గూర్చి తైలపాకవిధి ప్రకా
పక్వముచేసి యాతైలమును రాతితోచేయబడిన పాత్రమునందైనను పొట్టేలుకొమ్ము
నైన నుంచుకొని నస్యముచేసినయెడ పలితరోగము నివర్తించును.

పలితహరలేపము.

మూ. భిషజా క్షీరపిష్టో వా దుగ్ధికా కరవీరకా.
ఉత్పాట్య పలితే దేయా తావుభౌ పలితాపహౌ,

వ్యా. పిన్నపాలను గన్నేరు నొకటిగ కలిపి మేకపాలతో నూరి నెరసినవెండ్రుకల నూడదీసి యచ్చోట బూసిన వెండ్రుకలు నెరయుట మానును.

## పలితమునకు నస్యతైలము.

మూ. మార్కవస్వరసాత్ క్షీరాత్ ద్విప్రస్థం మధుకాత్ పలమ్. 267
తైః పచేత్ కుడవం తైలాత్ తన్నస్యం పలితాపహం,

వ్యా. భృంగరాజస్వరసము ఒకప్రస్థమును, ఆవుపాలు ఒకప్రస్థమును, అతిమధురకల్కము నొకపలమును, నాల్గుపలములు నూనెను కలిపి తైలపాకవిధిప్రకారము పక్వముచేసి నస్యము చేసిన పలితమును హరించును.

## పలితమునకు మహానీలతైలము.

మూ. ఆదిత్యవల్ల్యా మూలాని కృష్ణసైరేయకస్య చ. 268
సురసస్య చ పత్రాణి పత్రం కృష్ణశణస్య చ,
మార్కవః కాకమాచీ చ మధుకం దేవదారు చ. 269
పృథగ్దశపలాంశాని పిప్పల్యస్త్రిఫలాఽఞ్జనం,
ప్రపౌణ్డరీకం మఞ్జిష్ఠా లోధ్రం కృష్ణాఽగురూత్పలమ్. 270
ఆమ్రాస్థి కర్దమః కృష్ణో మృణాళం రక్తచన్దనం,
నీలీభల్లాతకాస్థీని కాసీసం మదయన్తికా. 271
సోమరాజ్యసనః శస్త్రం కృష్ణా పిణ్డీతచిత్రకౌ,
పుష్కరార్జునకాశ్మర్యాణ్యామ్రజమ్బూఫలాని చ. 272
పృథక్పఞ్చ పలాంశాని తైః పిష్టైరాఢకం పచేత్,
వైభీతకస్య తైలస్య ధాత్రీరసచతుర్గుణమ్. 273
కుర్యాదాదిత్యపాకం వా యావచ్ఛుష్కో భవేద్రసః,
లోహపాత్రే తతః పూతం సంశుద్ధముపయోజయేత్. 274
పానే నస్యక్రియాయాం చ శిరోఽభ్యఙ్గే తథైవ చ,
ఏతచ్చక్షుష్యమాయుష్యం శిరసస్సర్వరోగనుత్. 275
మహానీలమితి ఖ్యాతం పలితఘ్నమనుత్తమం,

(ఇతి మహానీలతైలమ్.)

వ్యా. ప్రొద్దుతిరుగుడుచెట్టుయొక్క వేళ్లు, నల్లగోరింటవేళ్లు, తులసియాకు, జనుములయాకు, గుంటకలగర, కాచి, అతిమధురము, దేవదారుచెక్క, ఇవి యొక్కొ పదేసిపలములు, పిప్పళ్లు, త్రిఫలములు, సుర్మారాయి, పౌండరీకమను గంధద్రవ మంజిష్ఠి,లొద్దుగుపట్ట,కృష్ణాగరు,నల్లకలువలు, మామిడిముట్టెలలోని పప్పు,నల్లనిబురుద తామరదుంపలు, రక్తచందనము, నీలివిత్తనములు, జీడిగింజలు, అన్నభేది, అడవి బావంచివిత్తులు, వేగిస, ఉక్కరాపొడి, నల్లని మ్రంగచెట్టుపట్ట, నల్లని చిత్రమూ పుష్కరమూలము, మద్దిపట్ట, నేలగుమ్మడు, మామిడిపండ్లు, నేరేడుపండ్లు, ఇవి వేరు నైదేసి పలములు; పైజెప్పిన భాగములవంతున నన్నిటిని జేర్చి నూరి కల్కము తానికాయల నూనె నొకయాఢకపరిమితమును కలిపి, తైలమునకు నాలుగింతలు ఉ కాయలరసమును కలిపి తైలపాకవిధిప్రకారము పక్వముచేయనగును. లేక యెం తైలమునందలి రసమంతయు చుండునట్లునిచి, పక్వమైన పిదప శుభ్రముగ వడియ పానమునకు నస్యమునకును శిరస్సున కభ్యంగనము చేసికొనుటకు నుపయోగించన ఇయ్యది నేత్రములకు హితకరంబును, ఆయువును వృద్ధినందించునదియు, శిరోరోగ నన్నిటిని హరించునదియు నగు మహానీలతైలమని చెప్పబడును. పలితమును హరిం కిది యుత్తమ మైనతైలము.

(ఈతైలయోగమున కల్కపరిమాణము అధికముగ తంత్రకారులచే విధింపబ కావున ఉత్సర్గపరిభాష ననుసరింపక యీయపవాదశాస్త్రము ననుసరించి యథోక్త గ్రహింపనగును. మరియు నీయోగమున బహువచననిర్దేశముచేతనే కల్కద్రవ్యా వేరువేరుగ భాగనిర్ణయ మేర్పడుచున్నను "పృథగ్దశపలాంశాని పిప్పలీత్రిఫలాఽఞ్జ అని 'పృథక్' అనుపదమును చెప్పుటవలన త్రిఫలములు మూడును కూడ వేరు పదేసిపలముల గ్రహింపవలెనని తంత్రకారుల యభిప్రాయము. దీనిచేత పరిమాణ ప్రధానముగజేసి నిర్దేశించు స్థలములయందు త్రిఫల-దశమూలాదులను సముదాయ ములు గ్రహింపవలెననియు, ద్రవ్యప్రధాననిర్దేశస్థలమున త్రిఫలాదివస్తుసము మునకు వేరువేరు భాగకల్పనమనియు తంత్రకారులయాశయమని యెరుంగునది.)

## పలితాదులకు ప్రతిమర్శనస్యము.

మూ. ప్రపౌణ్డరీకమధుకపిప్పలీచన్దనోత్పలైః.
కార్షికైస్తైలకుడవో ద్విగుణామలకీరసః,
సిద్ధః సప్రతిమర్శస్స్యాత్ సర్వమూర్ధగదాపహః.
(పలితఘ్నో విశేషేణ కృష్ణాత్రేయేణ భాషితః,)

వ్యా. ప్రపౌండరీకము, అతిమధురము, పిప్పళ్లు, చందనము, నల్లకలువలు, వీనిని ప్రత్యేక మొక్కొకకర్ష మువంతున గూర్చి నూరి కల్కము జేసి, నాల్గుపలముల నూనెలో కలిపి, తైలమునకు రెట్టింతలు యుసిరికకాయలరసమును కలిపి తైలపాకవిధిప్రకారము పక్వముచేసి ప్రతిమర్శమను నస్యమున కుపయోగించినచో శిరోరోగము లన్నియు నివర్తించును. ఈతైలము పలితమును విశేషముగ హరించునని కృష్ణాత్రేయులచే జెప్పబడినది.

ప్రతిమర్శనస్యస్వరూపము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"ప్రతి మర్శనస్య మాత్రా తు ద్విద్విబిన్దుమితా మతా, ప్రత్యేకశో నాసికయోః స్నేహేనేతి వినిశ్చితమ్." నస్యమునకు నిర్ణీతములగు తైలము ఘృతము మున్నగు ద్రవౌషధ ములను ఒక్కొక నాసారంధ్రమునను రెండేసి బిందువులవంతున ప్రయోగించిన నస్యాది ప్రతిమర్శనస్యమని యర్థము. (ఈసంజ్ఞ ప్రయోగింపబడు నౌషధపరిమాణము వలన కలిగినదని యెరుంగునది.)

## పలితహరముఖాలేపము.

మూ. క్షీరం ప్రియాలయష్ట్యాహ్వా జీవకాద్యో గణస్తిలాః. 278
కృష్ణా వక్త్రే ప్రలేపస్స్యాత్ హరిలోమనివారణః,

వ్యా. చారపప్పు, అతిమధురము, జీవకాదిగణద్రవ్యములు, నువ్వులు, పిప్పళ్లు, వీనినన్నిటిని గూర్చి యావుపాలతో నూరి ముఖమునకు బూసికొనిన పింగళవర్ణము కల్గి యుండు వెంట్రుకలు నల్లబడును.

## కేశరంజనప్రలేపము.

మూ. తిలాస్సామలకాశ్చైవ కిఞ్జల్కో మధుకం మధు. 279
బృంహయేద్రఞ్జయేచ్చైతత్ కేశాన్ మూర్ధప్రలేపనాత్,

వ్యా. నువ్వులు, ఉసిరికకాయలబెరడు, తామరకమలములలోని కేసరములు, అతిమధురము, వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి మెత్తగ తేనె బోసి నూరి తలకు పూసినయెడ వెంట్రుకల కుదుళ్లకు బలమును కల్గించి వృద్ధినందించి తెల్లబడిన వెంట్రుకల నల్లగ జేయును.

## కేశరంజనప్రలేపము, రెండవది.

మూ. పచేత్తైలన్వయుక్తాభ్యాం అయశ్చూర్ణం సతణ్డులమ్. 280
తేనాఽఽలిప్తం శిరశ్శుద్ధం అస్నిగ్ధముషితం నిశి,
తత్ప్రాతః త్రిఫలాక్వాథం స్యాత్కృష్ణమృదుమూర్ధజమ్. 281

వ్యా. సైంధవలవణమును, ఇనుపరాపాడిని, బియ్యమును సమభాగములుగ గూర్చి మెత్తని చూర్ణముగజేసి శుక్తము మున్నగు ద్రవముల కలిపి యుడికించి, శిరస్సున నూనె జిడ్డు లేక శుభ్రముగ నుండునట్లు స్నానముచేసిన పిదప పైజెప్పిన యౌషధమును బూసి రాత్రియంతయు నూరున ట్లునిచి, మరుసటిదినముదయమున త్రిఫలముల జేర్చి కాచబడిన నీళ్లచే శుభ్రముగ కడిగిన వెండ్రుకలు నల్లబడి మెత్తనై చక్కగ పెరుగును.

కేశరంజన ప్రలేపము, మూడవది.

మూ. అయశ్చూర్ణోఽమ్లపిష్టశ్చ రాగస్త్రిఫలో వరః,

వ్యా. ఇనుపరాపాడిని త్రిఫలములను సమములుగ గూర్చి అమ్లరసద్రవముల కలిపి మెత్తగ నూరి వెండ్రుకలకు పూసిన నెరసిన వెండ్రుకలు నల్లబడి వృద్ధినొందును. ఇయ్యది వెండ్రుకలకు రంగునుకల్గించుటకు ప్రశస్తమైన యౌషధము.

అనుక్తచికిత్సాసంగ్రహము.

మూ. కుర్యాచ్ఛేషేషు రోగేషు క్రియాం స్వాం స్వాచ్చికిత్సితాత్,
శేషేష్వాదౌ చ నిర్దిష్టా సిద్ధౌ చాన్యా ప్రవక్ష్యతే. 282

వ్యా. ఇత్తెరంగున పీనసరోగమువలన సంభవించు నుపద్రవరూపముగ నిర్దేశింపబడిన వ్యాధులలో పలితముపరకుంగలరోగములకు నిదానక్రమానుసారముగ చికిత్స చెప్పబడినది. తక్కుంగల దప్పి, శ్వాసకాసములు, జ్వరము, రక్తపిత్తము, అను పీనసోపద్రవములకు, ఆయాస్వతంత్రరోగముల చికిత్సితములలో జెప్పబడిన ఆయా రోగ చికిత్సలను చేయనగును. మరియు వస్తి-హృదయ-శిరోరూపములగు మర్మముల మూడిటి యందు జనించురోగముల నుద్దేశించి యిచ్చట చెప్పబడినవి గాక తక్కిన (త్రిమర్మ సంబంధములగు) రోగములకు ఈ త్రిమర్మీయచికిత్సితమున వాతాదిదోషసంబంధమును జెప్పక సామాన్యముగ జెప్పబడిన చికిత్సలను ఆయారోగములకు చేయనగును. మరియు నిచ్చట చెప్పబడిన త్రిమర్మీయ రోగములకు సిద్ధిస్థానమున త్రిమర్మీయసిద్ధియను తొమ్మిదవయధ్యాయమున జెప్పబడు చికిత్సల నాచరింపందగును.

స్వరభేదచికిత్స, అందు వాతికస్వరభేదచికిత్స.

మూ. సర్పీంష్యుపరిభక్తాని స్వరభేదేఽనిలాత్మకే,
తైలైశ్చతుష్ప్రయోగైశ్చ బలారాస్నామృతాహ్వయైః. 283
బర్హిత్తిత్తిరిదక్షాణాం పంచమూలశృతాన్ రసాన్,
మాయూరం క్షీరసర్పిర్వా పిబేత్త్ర్యూషణమేవ వా. 284

వ్యా. వాతముచే గల్గిన స్వరభేదమునందు ఆహారమును భుజించిన పిదప ఘృతపానము చేయుట చాల ప్రశస్తము. మరియు వాతవ్యాధిచికిత్సితమున చెప్పబడు బలాతైలమును రాస్నాతైలమును అమృతాతైలమును పానము అభ్యంగము గండూషము వస్తికర్మము అను నాల్గువిధములగు చికిత్సలయందు నుపయోగించవలెను. మరియు పంచమూలముల జేర్చి పక్వముచేయబడిన నెమలియొక్కయు తీతువుపిట్టయొక్కయు కోడియొక్కయు మాంసరసములను, (ఈయధ్యాయమున శిరోరోగచికిత్సలో చెప్పబడిన) మాయూరఘృతమును, క్షీరమును, (కాసచికిత్సితమున చెప్పబడిన త్ర్యూషణఘృతమును త్రాగవలెను.

ఇచ్చట వాతవ్యాధిచికిత్సితమున "బలాశతం గుడూచ్యాశ్చ......వాతవ్యాధివినాశనమ్" (చి. అ. ౨౮) అని చెప్పబడిన బలాతైలమును "రాస్నాసహస్రనిర్యూహే ...అనిలార్తినుత్" (చి. అ. ౨౮) అని చెప్పబడు రాస్నాతైలమును; "తులాః పఞ్చ గుడూచ్యాస్తు......తైలాగ్ర్యమమృతాహ్వయమ్" (చి. అ. ౨౮) అని చెప్పబడు అమృతాతైలమును; పానాభ్యంజనగండూషవస్తివిధానములకు గ్రహించునది. మరియు "వాతికే శిరసో రోగే...గలరోగనుత్." మాయూరమితి విఖ్యాతం ఊర్ధ్వజత్రుగదాపహమ్" అని యీయధ్యాయమున జెప్పబడిన మాయూరఘృతమును; కాసచికిత్సితమున "త్ర్యూషణం త్రిఫలాం......త్ర్యూషణం నామ విఖ్యాతం ఏతద్ఘృతమనుత్తమమ్" (చి. అ. ౧౮. శ్లో. ౩౬. ౩౮) అని చెప్పబడిన త్ర్యూషణాది ఘృతమును పానమునకు గ్రహించునది.

"చతుష్ప్రయోగైః" అను పదముచేత పాన-అభ్యంగ-గండూష-వస్తిప్రయోగములు నాల్గును గ్రహింపబడును.

మరియు ప్రతిశ్యాయముచే జనించు రోగముల నిర్దేశించునపుడు "వైస్వర్యశోషాశ్చ తతో భవన్తి" అని స్వరభేదము నిర్దేశింపబడినది. కాని వాతాదిభేదలక్షణములు వివరింపబడలేదు. ఐనను రాజయక్ష్మచికిత్సితమున—"వాతాత్పిత్తాత్కఫాత్ రక్తాత్ కాసవేగాత్సపీనసాత్, స్వరభేదో భవేత్." (చి. అ. ౮. శ్లో. ౫౩) అని యుపక్రమించి చెప్పబడిన వాతాదిస్వరభేదలక్షణముల గ్రహించునది. చికిత్సలు అచ్చటనే చెప్పబడినను ఈప్రకరణమున నధికృతంబగుటచేత మరల విస్తారముగ చెప్పబడినది.

## పైత్తికస్వరభేదచికిత్స.

మూ. పైత్తికే తు విరేకస్స్యాత్ పయశ్చ మధురైః శృతం,
సర్పిర్గుడాఘృతం తిక్తం జీవనీయం వృషస్య వా. 285

వ్యా. పిత్తముచే కల్గిన స్వరభేదమున విరేచనము చేయించి, మధురద్రవ్యముల జేర్చికాచి సిద్ధముచేయబడిన పాలను త్రాగవలెను. మరియు క్షతక్షీణచికిత్సితమున జెప్పబడిన సర్పిర్గుడములను, తిక్తద్రవ్యముల జేర్చి, పక్వముచేయబడిన ఘృతమును, వాతరక్తచికిత్సితమున జెప్పబడుజీవనీయఘృతమును, రక్తపిత్తచికిత్సితమున చెప్పబడిన వాశాఘృతమును ఉపయోగింపందగును.

(ఇచ్చట క్షతక్షీణచికిత్సితమున "బలా విదారీ హ్రస్వా చ......శస్తాః పార్శ్వ శిరశ్శూలే భేదే చ స్వరవర్ణయోః" (చి. అ. ౧౧. శ్లో. ౫౬. ౬౧) అని యుపక్రమించి చెప్పబడిన సర్పిర్గుడయోగములను: వాతరక్తచికిత్సితమున "ద్వే పఞ్చమూలే వర్షాభూ......జీవనీయమిదం సర్పిః వృష్యం వన్ధ్యాసుతప్రదమ్" (చి. అ. ౪. శ్లో. ౮౮) అని చెప్పబడినవాశాఘృతయోగమును గ్రహించునది.)

## కఫజస్వరభేదచికిత్స.

మూ. కఫజే స్వరభేదే తు తీక్ష్ణం మూర్ధవిరేచనం,
విరేకో వమనం ధూమః యవాన్నకటుసేవనమ్. 286
చవ్యభార్గ్యభయావ్యోషక్షారమాక్షికచిత్రకాన్,
లిహ్యాద్వా పిప్పలీపథ్యే జీర్ణం మద్యం పిబేచ్చ సః. 287

వ్యా. కఫముచే గల్గిన స్వరభేదమున తీక్ష్ణమైన యౌషధముచే శిరోవిరేచనమును కాయవిరేచనవమనములను.ధూమపానమును,కటురసవ్యంజనముతోగూడిన యవాన్నమును సేవింపదగును. మరియు చవ్యము, భారంగి, కరకకాయలబెరడు, త్రికటుకములు, యవక్షారము, చిత్రమూలము, వీనిని సమభాగములుగ గూర్చి చూర్ణముచేసి తేనెతో కలిపి సేవించవలెను. లేక పిప్పళ్లను కరకకాయలను చూర్ణముచేసి యైనను తేనెతో కలిపి సేవించి ప్రాతమద్యమును వెంటనే త్రాగవలెను.

## రక్తజస్వరభేదచికిత్స.

మూ. రక్తజే స్వరభేదే తు సఘృతాః (సంస్కృతాః) జాఙ్గలా రసాః,
ద్రాక్షావిదారీక్షురసాః సఘృతక్షౌద్రశర్కరాః 288
యచ్చోక్తం క్షయకాసఘ్నం తచ్చ సర్వం చికిత్సితం,
పిత్తజస్వరభేదఘ్నం సిరావేధశ్చ రక్తజే. 289

వ్యా. రక్తముచే కల్గిన స్వరభేదమున జాంగలజంతువులమాంసరసములను ఘృతమును చేర్చి యుపయోగింపనగును. మరియు ద్రాక్షపండ్లరసమును, నేలగుమ్మడిగడ్డరసమును, చెరకురసమును, అందు నేతిని తేనెను చక్కెరను కలిపి త్రాగవలెను.

మరియు క్షయజకాసహరమైన చికిత్సయు, పిత్తజస్వరభేదమునకు జెప్పబడిన చికిత్సయు, సిరావ్యధనంబును రక్తజస్వరభేదమున నుపయోగింపదగును.

## సాన్నిపాతికస్వరభేదచికిత్స.

మూ. సన్నిపాతే హితాః సర్వాః క్రియా న తు సిరావ్యధః,
ఇత్యుక్తం స్వరభేదస్య సమాసేన చికిత్సితమ్. 290

(ఇతి స్వరభేదచికిత్సా.)

వ్యా. సన్నిపాతమున కల్గిన స్వరభేదమున వాతికాదులకు పైని వేరువేరుగ చెప్పబడిన చికిత్సల నన్నిటిని చేయదగును. సిరావ్యధనమును మాత్రము చేయంజనదు. ఇత్తెరంగున స్వరభేదచికిత్సితము సంగ్రహముగ జెప్పబడినది.

## ఉక్త-అనుక్తచికిత్సాసంగ్రహము.

భవన్తి చాత్ర:—

మూ. వాతపిత్తకఫాః నృణాం వస్తిహృన్మూర్ధసంశ్రయాః,
తస్మాత్తత్స్థానసామీప్యాత్ హర్తవ్యా వమనాదిభిః. 291

వ్యా. శరీరమునందలి వాత-పిత్త-కఫములు మూడును క్రమముగ వస్తియందును హృదయమునందును శిరస్సునందును ఆశ్రయించి నియతముగ నుండును. (వాతము వస్తియందును, పిత్తము హృదయమునందును, కఫము శిరస్సునందును ఆశ్రయించి యుండు ననుట). కావున వాతాదిస్థానముల సమీపమును బట్టియు ఆయాస్థానమునుబట్టియు నాదోషమునకు జెప్పిన వమనాదికర్మలచే చికిత్స జేయనగును. (వాతమునకు వస్తికర్మయు, పిత్తమునకు విరేకంబును, కఫమునకు వమనంబును నియతమైన చికిత్స యగును. కావున, వాతాదులు ప్రకోపమునొంది స్థానాంతరమున జేరునపుడు, అయ్యది యేస్థానమున జేరునో ఆస్థానమున నియతముగ నుండు దోషమునకు విధించిన వమనాది చికిత్సలచే సామీప్యమునుబట్టి యుపచరించుట యుక్తమని భావము).

## త్రిదోషములు విరోధములేకుండుటకు కారణము.

మూ. అధ్యాత్మలోకో వాతాద్యైః లోకో వాతరవీన్దుభిః,
పీడ్యతే ధార్యతే చైవ వికృతాఽవికృతైస్తథా. 292
విరుద్ధైరపి న త్వేతే గుణైర్ఘ్నన్తి పరస్పరం,
దోషాస్సహజసాత్మ్యత్వాత్ విషం ఘోరమహీనివ. 293

వ్యా. గాలియు, సూర్యుడును, చంద్రుడును వానివానికి స్వభావసిద్ధములగు ధర్మములు మిక్కుటముగ నైనను తక్కువగ నైనను ఉన్నచో జగత్తునకు బాధకల్గించును,

అటుగాక స్వాభావికములగు శీతోష్ణాదిధర్మములు న్యూనాతిరేకము లేక సమస్థితి నుండు చెడ మూడును కలిసి జగమునకు ఆధారభూతమై చెడనీయక పోషించును. అత్తెరంగు ననే వాత-పిత్త-కఫములు మూడును స్వప్రమాణమునకన్న న్యూనాతిరేకము లైనచో జీవలోకమును జ్వరాదిరోగముల గల్గించి బాధించును. సమస్థితి నున్నయెడ ప్రాణికోటిని పోషించును.

మరియు నీవాతపిత్తకఫములు మూడును పరస్పరవిరుద్ధములగు గుణములు కల్గి యున్నను, అయ్యవి శరీరముతో కూడ పుట్టి సాత్మ్యము లైయుండుటంజేసి (సర్పమునకు స్వభావసిద్ధమై శరీరముతోడ పుట్టిన క్రూరమైనవిషము సర్పములను చంపకుండువిధముగ) యొకదాని నింకొకటి విరుద్ధగుణములచే హరింపనేరవు. (దోషములు మూడును బాహ్య వాతాదిసాదృశ్యమునుబట్టి వాతము గాలిని బోలె లాఘవాదిగుణములు కల్గినదియనియు, పిత్తము సూర్యునిబోలె తీవ్రగుణములు కల్గినది యనియు, కఫము చంద్రునిబోలె శీతాదిగుణములు కల్గినదియనియు తెలిసెడి. మరియు శ్లేష్మము స్నేహపైచ్ఛిల్యగౌరవాది గుణములు కల్గినది. వాతము ఈగుణములకు విరుద్ధములైన రౌక్ష్యలాఘవాదిగుణముల కల్గి యుండును. అట్టి విరుద్ధగుణములు కల్గియున్నను నయ్యవి సహజసాత్మ్యము లగుటంజేసి పరస్పరము హానినొందక వానివానికృత్యముల జేయుచు సమస్థితియందును శరీరమును పోషించును. వికృతి జెందినపుడు శరీరమును రోగములచే బాధించును. అని ముఖ్య భావము.)

## అధ్యాయవిషయసంగ్రహము.

తత్ర శ్లోకః—

మూ. త్రిమర్మజానాం రోగాణాం నిదానాకృతిభేషజం,
విస్తరేణ పృథగ్దిష్టం త్రిమర్మీయే చికిత్సితే. 294

వ్యా. త్రిమర్మీయచికిత్సితమను నీయధ్యాయమున వస్తి, హృదయము, శిరస్సు అనునీ ప్రధానమర్మముల మూటియందును సంభవించు రోగములనిదానంబులును, లక్షణం బులును, చికిత్సలును వేరువేర విస్తరముగ వివరింపబడినవి.

ఇత్యగ్నివేశకృతే తంత్రే చరకప్రతిసంస్కృతే దృఢబలసంపూరితే
చికిత్సాస్థానే త్రిమర్మీయచికిత్సితం నామ
షడ్వింశోఽధ్యాయః.

వ్యా. ఇత్తెరంగున నగ్నివేశకృతంబును, చరకప్రతిసంస్కృతంబును, నగు చరక సంహితయను నాయుర్వేదతంత్రమున సూత్రస్థానమునందలి దృఢబలసంపూరితభాగ మున త్రిమర్మీయచికిత్సిత మనునది యిరువదియారవ యధ్యాయము.

## సప్తవింశాధ్యాయము.

అవతరణిక:—త్రిమర్మీయచికిత్సితమున ననేకరోగములు పంచకర్మసాధ్యములుగ గనబడుచున్నవి. అట్టిరోగముల చికిత్సావిధానమును వివరించునపుడు, వానికి విరుద్ధముగ పంచకర్మములచే సాధింపరాని యూరుస్తంభమనువ్యాధి తంత్రకారునికి స్మృతిపథగోచరమై యట్టి యూరుస్తంభచికిత్సితము నిచ్చట చెప్పదొడంగెను. లోకమున పరస్పరవిరుద్ధములుగ నుండువస్తువులలో నొకదాని జూచునపుడు దానికి విరోధిగ నుండు వేరొండువస్తువు జ్ఞప్తికివచ్చుట సాజము:—ముంగిసను చూచినప్పుడు దానికివిరోధియగు సర్పము జ్ఞప్తికివచ్చును కదా? ఆతీరున పంచకర్మసాధ్యరోగముల దలంచుటచే పంచకర్మాసాధ్యమగు నూరుస్తంభము ఆచార్యునకు స్మృతిపథారూఢమై దానిచికిత్సితమును వెంటనే యీక్రింద వివరించెను.

### అధ్యాయప్రారంభము.

మూ. అథాత ఊరుస్తమ్భచికిత్సితం వ్యాఖ్యాస్యామః. 1

ఇతి హ స్మాహ భగవానాత్రేయః. 2

వ్యా. త్రిమర్మీయచికిత్సితమును జెప్పినపిదప నూరుస్తంభచికిత్సితమును భగవానుడగు నాత్రేయుడుపదేశించినదానికన్న న్యూనాతిరేకము లేకుండునట్లు వివరించి చెప్పెదనని యర్థము.

### అగ్నివేశునిప్రశ్నము.

మూ. శ్రియా పరమయా బ్రాహ్మ్యా పరయా చ తపశ్శ్రియా,
అహీనం చన్ద్రసూర్యాభ్యాం సుమేరుమివ పర్వతమ్. 3
(అహీనపూర్వం చన్ద్రార్కాదిభ్యో మేరుమివాఽచలమ్)
ధీధృతిస్మృతివిజ్ఞానజ్ఞానకీర్తిక్షమాలయం,
అగ్నివేశో గురుం కాలే సంశయం పరిపృష్టవాన్. 4

వ్యా. మిగుల శ్రేష్ఠమైన బ్రహ్మతేజస్సుతోడను, తపస్సంపత్తితోడను నిరంతరముగ కూడికొని, చంద్రసూర్యులతో నెడలేక కూడియుండు మేరువును బోలినవాడును, బుద్ధియు, ధారణాశక్తియు, జ్ఞానవిజ్ఞానంబులును, కీర్తియు, ఓర్పును కలవాడును, గురువర్యుడును నగునాత్రేయునింగని యుక్తమైన సమయమున నగ్నివేశులు తనకు గల్గిన సంశయము నిట్లడుగం దొడంగెను.

మూ. భగవన్ ! పఞ్చకర్మాణి సమస్తాని పృథక్తథా,
నిర్దిష్టాన్యామయానాం హి సర్వేషామేవ భేషజమ్. 5
దోషజోఽస్త్యామయః కశ్చిత్ యస్య తాని భిషగ్వర!
న స్యుశ్శక్తాని శమనే సాధ్యస్య క్రియయా సతః? 6
"అస్త్యూరుస్తమ్భః" ఇత్యుక్తే గురుణా తస్య కారణం,
సలిఙ్గభేషజం భూయః పృష్టస్తేనాఽబ్రవీద్గురుః. 7

వ్యా. త్రికాలజ్ఞానసంపన్నుడును వైద్యవరుడును నగు నోగురువర్యా ! వమన విరేచనాది పంచకర్మములును వేరువేరుగను అన్నియు కలిసియు సకలరోగములకును చికిత్స యగునని నిర్దేశింపబడినది. అట్టి పంచకర్మములచే శమింపజేయ వలనుపడనివ్యాధి, సాధ్యావస్థలో జేరినదోషజవ్యాధులలో నెద్దియైన నొకటి కలదా? యని యడుగ నూరుస్తంభమను వ్యాధి పంచకర్మములచే శమింపనిది యొకటి కలదని గురువు చెప్పెను. అయ్యది జనించుటకు కారణములను దానిలక్షణములను చికిత్సను చెప్పుమని మరల నగ్నివేశు లడుగ గురువర్యులగు నాత్రేయు లిట్లు చెప్పందొడంగెను.

ఊరుస్తంభనిదానము, సంప్రాప్తియు.

మూ. స్నిగ్ధోష్ణలఘు(గురు)శీతాని జీర్ణాఽజీర్ణే సమశ్నతః,
ద్రవశుష్కదధిక్షీరగ్రామ్యానూపౌదకామిషైః. 8
పిష్టవ్యాపన్నమద్యాతిదివాస్వప్నప్రజాగరైః,
లఙ్ఘనాఽధ్యశనాయాసభయవేగవిధారణైః. 9
స్నేహోచ్చామం చితం కోష్ఠే వాతాదీన్ మేదసా సహ,
రుద్ధ్వాశు గౌరవాదూరూ యాత్యధోగైః సిరాదిభిః. 10
పూరయన్ సక్థిజఙ్ఘోరు దోషో మేదోబలోత్కటః,
అవిధేయపరిస్పన్దం జనయత్యల్పవిక్రమమ్. 11
మహాసరసి గమ్భీరే పూర్ణేఽమ్బు స్తిమితం యథా,
తిష్ఠతి స్థిరమక్షోభ్యం తద్వదూరుగతః కఫః. 12
గౌరవాయాస(మ)సఙ్కోచదాహారుక్సుప్తికమ్పనైః,
భేదస్ఫురణతోదైశ్చ యుక్తో దేహం నిహన్త్యసూన్. 13
ఊరూ శ్లేష్మా సమేదస్కో వాతపిత్తేఽభిభూయ తు,
స్తమ్భయేత్ స్థైర్యశైత్యాభ్యాం ఊరుస్తమ్భస్తతస్మృతః. 14

వ్యా. భుజింపబడినయాహారము కొంచెముగ జీర్ణమై యజీర్ణ శేష ముండునట్టి యవస్థయందు స్నిగ్ధోష్ణములును, లఘుశీతంబులును; ద్రవ-శుష్కంబులును నగు పరస్పర విరుద్ధగుణాదులు కల పదార్థములను ఒకటిగ జేర్చి భుజించినను; పెరుగు పాలు, గ్రామ్య-అనూప-ఔదకజంతువులమాంసముల నొకటిగ గూర్చి భుజించినను, పిండితో జేయబడిన భక్ష్యాదులను చెడినమద్యమును అధికముగ త్రాగినను, పగటియం దధికముగ నిద్రపోయినను, రాత్రులయందు నిదురమేల్కాంచియున్నను, ఉపవాసము జేసినను, భుజించిన వెంటనే మరల భుజించినను, శరీరమునకు శ్రమనుకల్గించు పనుల విశేషముగ జేసినను, భయపడినను, మలమూత్రవాతాది వేగముల నిరోధించినను, స్నేహము నధికముగ త్రాగినను, (ఈకారణములచేత) రసశేషరూపమైన యామరసము కోష్ఠమున నానాట సంచితమై నిలచి వృద్ధినొంది మేదస్సుతోకూడి వాతపిత్తకఫమార్గములను అడ్డగించి యాత్రిదోషములతో గూడి గురుత్వముచేత హృదయమునుండి క్రిందికి వ్యాపించుసిరలయందును ధమనులయందును వ్యాపించి శీఘ్రముగ నాసిరాధమనులమూలముగ క్రిందికి దిగజారి, మేదస్సుయొక్క బలముచేత మరింత బలమునొంది తొడలయందును పిక్కలయందును పూరించును. దానంజేసి స్పర్శము స్వాధీనమున లేక చలనాది వ్యాపారముల జేయ సామర్థ్యము లేకుండును. అట్టియెడ (మిక్కిలి లోతుకల సరస్సున జలము పరిపూర్ణముగ నిండియున్నపుడు అట్టిజలము నిశ్చలముగ కదలకుండువిధముగ) తొడలయందు నిండియుండు కఫము సంచలనము లేక నిల్కడగ నిలచి స్థిరముగ నుండును. అట్టియెడ మిక్కిలి భారమై ఆయాసమును సంకోచమును మంటను నొప్పిని కల్గించును. స్పర్శజ్ఞానముడుగును. కంపము కల్గును. పగులదీయునట్లు బాధయు కల్గును. అదరును, ఇట్టి బాధల గల్గించి శరీరమును ప్రాణములను హింసించును. మరియు కఫము మేదస్సుతో గూడి వాతపిత్తముల ధిక్కరించి యుత్కటమై తనయందలి స్థిరత్వశీతగుణములచేత తొడలను స్తంభింపజేయును. (ముడుచుటకును చాచుటకును వలనుపడకుండజేయును.) కావున నీవ్యాధి యూరుస్తంభమని యన్వర్థముగ జెప్పబడునని భావము.

ఇచ్చట కఫంబును మేదస్సును సమానగుణము లగుటంజేసి కఫము మిక్కిలి వృద్ధినొంది బలిష్ఠమై వాతపిత్తములు కలిసి యున్నను నారెండిటిని తిరస్కరించి యూరువులను తనయందలి స్థైర్యశీతగుణములచేత స్తంభింపజేయును. ఈవిషయమునే తంత్రకారులు "ఊరూ శ్లేష్మా సమేదస్కః" అనుశ్లోకముచే నుపదేశించిరి. మరియు వాగ్భటాచార్యులు "తమూరుస్తమ్భమిత్యాహుః ఆఢ్యవాతమథాపరే" (అ. హృ. ని. అ. ౧౫) అని చెప్పిరి. కావున నీవ్యాధికి ఆఢ్యవాతమని నామాంతరము కూడ నున్నట్లు తెలిసెడి.

ఊరుస్తంభపూర్వరూపము.

మూ. ప్రాగ్రూపం ధ్యాననిద్రాఽతిస్తైమిత్యాఽరోచకజ్వరాః,
లోమహర్షశ్చ ఛర్దిశ్చ జంఘోర్వోస్సదనం తథా. 15

వ్యా. ఊరుస్తంభము కలుగుటకుముందు మనుజున కధికముగ చింతారూపమైన మనోవ్యాపారము కల్గును. అధికముగ నిద్రవచ్చును. శరీరము మొద్దుబారి జడముగ నుండును. అరోచకంబును జ్వరంబును కల్గును. గగుర్పాటు కల్గును. వాంతి యగును. పిక్కలయందును తొడలయందును నొప్పి పుట్టును. (ఇవి యన్నియు నూరుస్తంభమునకు పూర్వరూపములని భావము.)

ఊరుస్తంభమున స్నేహప్రయోగముచే గల్గుదోషము.

మూ. వాతశఙ్కిభిరజ్ఞానాత్ తస్య స్యాత్ స్నేహనాత్పునః,
పాదయోస్సదనం సుప్తిః కృచ్ఛ్రాదుద్ధరణం తథా. 16

వ్యా. పైజెప్పబడిన యూరుస్తంభము వాతవ్యాధి యని పొరబాటుపడి వాతమును హరించుటకై స్నేహమును పానాభ్యంగాదుల కుపయోగించినయెడ పాదములయందు తీవ్రమైన నొప్పి కల్గి స్పర్శమును బొత్తుగ నెరుంగకుండును. కాలు పైకెత్తుటకు మిగులకష్టముగ నుండును. (ఇచ్చట సంప్రాప్తియందు చెప్పబడిన సుప్తి-సంకోచాదుల బట్టి వాతవ్యాధి యని శంక కల్గునని భావము.)

ఊరుస్తంభలక్షణము.

మూ. జఙ్ఘోరుగ్లానిరత్యర్థం శశ్వచ్చాదాహవేదనే,
పదం చ వ్యథతే న్యస్తం శీతస్పర్శం న వేత్తి చ. 17
సంస్థానే పీడనే గత్యాం చాలనే చాప్యనీశ్వరః,
అన్యనేయౌ హి సమ్భగ్నౌ ఊరూపాదౌ చ మన్యతే. 18

వ్యా. ఊరుస్తంభమునందు పిక్కలయందును తొడలయందు తీవ్రమైన బాధ కల్గును. కాళ్లయందు మాటిమాటికి కొంచెముగ మంటయు నొప్పియు కల్గును. పాదములను క్రింద నునిచినయెడ బాధకల్గును. చల్లనిస్పర్శము కొంచెమైన తెలియబడదు. పాదములను సమముగ క్రింద నుంచుటకును, పీడనమునకును, నడచుటకును, కదలించుటకును సామర్థ్యము లేక, కాళ్లను తొడలును తనశరీరమునకు సంబంధము లేక వేరొకరిదానిని మోసికొని పోవుచున్నట్లు తలచును. (ఇది యూరుస్తంభస్వరూపలక్షణము.)

### ఊరుస్తంభాఽసాధ్యలక్షణము.

మూ. యదా దాహార్తితోదార్తో వేపనః పురుషో భవేత్,
ఊరుస్తమ్భస్తదా హన్యాత్ సాధయేదన్యథా నవమ్. 19

వ్యా. ఊరుస్తంభమున మంటయు నొప్పియు సూదుల గ్రుచ్చినట్లు పోటును అధికముగ కల్గి, వణకు పుట్టినచో నయ్యాది యసాధ్యమై చంపును. అట్టి యుపద్రవములు లేకున్నయెడ చికిత్సచే సాధింపందగును.

### ఊరుస్తంభమున స్నేహనాదికర్మనిషేధము.

మూ. తస్య న స్నేహనం కార్యం న వస్తిర్న విరేచనం,
న చైవ వమనం యస్మాత్తన్నిబోధత కారణమ్. 20
వృద్ధయే శ్లేష్మణో నిత్యం స్నేహనం వస్తికర్మ చ,
తత్ప్రస్యోద్ధరణే చైవ న సమర్థం విశోధనమ్. 21
కఫం కఫస్థానగతం పిత్తం చ వమనాత్సుఖం,
హర్తుమామాశయస్థౌ చ స్రంసనాత్తావుభావపి. 22
పక్వాశయస్థాన్సర్వేఽపి వస్తిభిర్మూలనిర్జయాత్,
శక్యాః న త్వామమేదోభ్యాం స్తబ్ధాః జఙ్ఘోరుసంస్థితః 23
వాతస్థానే హి తచ్చైత్యాత్ వాయోస్త్సమ్భాచ్చ తద్గతాః,
న శక్యాః సుఖముద్ధర్తుం జలం నిమ్నాదివ స్థలాత్. 24

వ్యా. ఊరుస్తంభవ్యాధియందు పాన-అభ్యంగనరూపమైన స్నేహనంబును, నిరూహానువాసనవస్తికర్మంబును, విరేచనంబును, వమనంబును చేయంజనదు. ఏలనన:—

స్నేహనంబును స్నేహౌషధములచే జేయబడు వస్తికర్మంబును (ఊరుస్తంభము నకు ప్రధానకారణమైన) కఫమును వృద్ధిచేయును కావున స్నేహనము చేయంజనదు.

మరియు కఫమును కఫస్థానమున నుండుపిత్తమును మూలచ్ఛేదముగ సుఖవమనము వెడలింప సమర్థమగును. ఆమాశయమున నుండుపిత్తమును కఫమును గూడ విరేచనము సుఖముగ నిశ్శేషముగునట్లు వెడలింప సమర్థమగును. అట్టి పిత్తకఫములు మూడును పక్వాశయము నాశ్రయించి యున్నపుడు వానిని వస్తికర్మముచే నిశ్శేషముగ వెడలింప వలనుపడును. (కఫస్థానమున జేరిన పిత్తమును కఫమును వమనము వెడలించుననియు, ఆమాశయమున జేరినపిత్తమును కఫమును విరేచనముచే వెడలింపదగుననియు, పక్వాశయమున జేరినదోషముల మూడిటిని వస్తికర్మములచే వెడలింపనగుననియు భావము).

అటుగాక దోషములు ఊరువులయందు వ్యాపించి సరశ్లేష్మామముచేతను మేదస్సుచేతను నిరోధింపబడి స్థిరముగనిలచియుండు దోషములనుపై జెప్పిన వమన-విరేచన-వస్తికర్మములు వెడలింపనేరవు. కావున శోధనము ఊరువులయందు వ్యాపించిన దోషములను వెడలింప సమర్థము కానోపదు.

మరియు వాతస్థానమైన పిక్కలయందును ఊరువులయందును జేరిన దోషములు వాతము స్తంభించియుండుటవలనను, వాతమునందలి శీతగుణమువలనను, (మిక్కిలి లోతున నుండు జలమును మిట్ట కెక్కించి ప్రవహింపజేయ వలనుపడనిభంగి) శరీరము నందు క్రిందిభాగమైన యూరువుల నుండుదోషముల పైకి వ్యాపింపజేసి వెడలింప వమన-విరేచన వస్తిరూపశోధనము సమర్థము కానోపదు.

ఇచ్చట స్నేహనశబ్దముచేత పానాభ్యంగరూపస్నేహనంబును స్నేహములతో నిర్వర్తింపబడు అనువాసనవస్తియు గ్రహింపబడును. విరేచనశబ్దముచేత నిరూహవస్తియు గ్రహింపబడును. నస్యము ఊరుగతదోషముల వెడలింప ప్రసక్తము కాదు కావున నయ్యదియు నీరోగమున నకించిత్కరమని వేరుగ గ్రహింపబడలేదు.

## ఊరుస్తంభచికిత్సాక్రమము.

మూ. తస్య సంశమనం నిత్యం క్షపణం శోషణం తథా,
యుక్త్యపేక్షీ భిషక్కుర్యా దధికత్వాత్కఫామయోః. 25

వ్యా. ఊరుస్తంభమునకు శమనంబును, ముఖ్యముగ చేయనగును. కఫంబును ఆమ రసంబును మిక్కిలి యధికములుగ నుండుటవలన, ఆరెంటిని పూర్తిగ నశింపజేయు చికిత్సను, ద్రవమును శోషింపజేయుచికిత్సను యుక్తి ననుసరించి చేయనగును. కానిశోధ నము నొకప్పుడు చేయదగదని భావము.

## ఊరుస్తంభమున పథ్యాహారములు.

మూ. సదా రూక్షోపచారాయ యవశ్యామాకకోద్రవాః,
శాకై రలవణై ర్దద్యాత్ జలతై లోపసాధితైః. 26
సునిషణ్ణకనిమ్బార్కవేత్రాగ్రవథపల్లవైః,
వాయసీవాస్తుకై రన్యైః తిక్తైశ్చ కులకాదిభిః. 27

వ్యా. ఎల్లప్పుడు రూక్షములగు నుపచారముల చేసికొనుచున్న రోగికి నీరు చెంచలియాకు, వేపచిగుళ్లు, జిల్లేడుచిగుళ్లు, పేముచిగుళ్లు, రేలచిగుళ్లు, కాచియాకు, చెంచలియాకు, కాకరకాయలు మున్నగు చేదుప్రధానముగ గల శాకములను ఉప్పు

చేర్చక నీళ్లలో నుడికించి తైలముచే తిరుగబోతబెట్టి పక్వము చేయబడిన కూరలతో యవాన్నమును చామలయన్నమును కొఱ్ఱలయన్నమును భుజింపజేయవలెను.

## ఊరుస్తంభహరక్షారాదిప్రయోగము.

మూ. క్షారాఽరిష్టప్రయోగాశ్చ హారీతక్యాస్తథైవ చ,
మధూదకస్య పిప్పల్యాః ఊరుస్తమ్భవినాశనః. 28

వ్యా. యవక్షారము మున్నగు క్షారములు, అరిష్టములు, కరకకాయలు, తేనెతో కూడినజలము, పిప్పళ్లు, వీనిని యథాయోగముగ ప్రయోగించినచో నూరుస్తంభమును హరించును.

## ఊరుస్తంభహరచూర్ణయోగములు.

మూ. సమఙ్గాం శాల్మలీం బిల్వం మధునా సహ నా పిబేత్,
తథా శ్రీవేష్టకోదీచ్యదేవదారునతాన్యపి. 29
చన్దనం ధాతకీం కుష్ఠం తాలీసం నలదం తథా,

వ్యా. మంజిష్ఠి, బూరుగబంక, మారేడు, వీనిని సమభాగములుగ గూర్చి చూర్ణముచేసి తేనెలో కలిపి సేవించినను; దేవదారుబంక, కురువేరు, దేవదారుచెక్క, గ్రంథితగరము, చందనము, ఆరెపువ్వు, చెంగల్వకోష్టు, తాలిసపత్రి, వట్టివేరు, వీనిని చూర్ణము చేసి తేనెతో కలిపి త్రాగినను ఊరుస్తంభము శమించును.

## ఊరుస్తంభనాశకకల్కయోగములు.

మూ. ముస్తం హారీతకీం లోధ్రం పద్మకం తిక్తరోహిణీమ్. 30
దేవదారుహరిద్రే ద్వే వచాం కటుకరోహిణీం,
పిప్పలీం పిప్పలీమూలం సరలం దేవదారు చ. 31
చవ్యం చిత్రకమూలాని దేవదారు హారీతకీం,
భల్లాతకం సమూలాం చ పిప్పలీం పఞ్చ తాః పిబేత్. 32
సక్షౌద్రానర్ధశ్లోకోక్తాః కల్కానూరుగ్రహాఽపహాః,

వ్యా. తుంగగడ్డలు, కరకకాయలబెరడు, లొద్దుగుపట్ట, పద్మకాష్ఠము, కటుకరోహిణి, ఈద్రవ్యములనైనను; దేవదారుచెక్క, పసుపు, మ్రానిపసుపు, వస, కటుకరోహిణి, ఈద్రవ్యములనైనను; పిప్పళ్లు, మోడి, సరళమను వృక్షముయొక్క చెక్క, దేవదారుచెక్క, ఈద్రవ్యములనైనను; చవ్యము, చిత్రమూలపువేళ్లు, దేవదారుచెక్క,

కరక కాయలరెండు, ఈ ద్రవ్యములనైనను; జీడిగింజలు, మోడి, పిప్పళ్లు, ఈ ద్రవ్యములనైనను, మెత్తగనూరి కల్కముచేసి తేనెతో కలిపి త్రాగినను ఊరుస్తంభమును హరించును. ఇచ్చట పైజెప్పబడిన శ్లోకములలో నైదర్ధశ్లోకములచే జెప్పబడి ద్రవ్యగణముల నైదిటిని వేరువేరుగ నైదుకల్కములుగ గల్పించి యుపయోగింపవలెను.

## ఊరుస్తంభహరచూర్ణ యోగములు.

మూ. శార్ఙ్గేష్టాం మదనం దన్తీ వత్సకస్య ఫలం వచాం (త్వచామ్.) 33
మూర్వామారగ్వధం పాఠాం కరఞ్జం కులకం తథా,
పిబేన్మధుయుతం తుల్యం చూర్ణం వా వారిణాప్లుతమ్. 34
సక్షౌద్రం దధిమణ్డైర్వాపూర్వ్యూరుస్తమ్భవినాశనం,

వ్యా. గురిగింజ, మ్రంగకాయ, నేపాళపువేళ్లు, కొడిసెపాలవిత్తులు, వస, చాగపట్ట, రేలపట్ట, చిరుబొద్ది, కానుగపట్ట, కాకరవేళ్లు, వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి చూర్ణము చేసి నీళ్లలో కలిపి, అందు తేనెను చేర్చి త్రాగవలెను. లేక పైజెప్పిన చూర్ణమును పెరుగుమీది తేటనీటితో కలిపి తేనె చేర్చి యైనను త్రాగవలెను. దీనిచేత నూరుస్తంభము నివర్తించును.

## మూర్వాదిచూర్ణము.

మూ. మూర్వామతివిషాం కుష్ఠం చిత్రకం కటురోహిణీమ్. 35
పూర్వవత్; గుగ్గులుం మూత్రే రాత్రిస్థితమథాపి వా,

వ్యా. చాగపట్ట, అతివస, చెంగల్వకోష్ఠు, చిత్రమూలము, కటుకరోహిణి వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి చూర్ణముచేసి పైని చెప్పబడిన యోగమువలె నీళ్లలో కలిపి తేనె గూర్చి త్రాగవలెను. గుగ్గిలమును రాత్రియంతయు గోమూత్రమున నూరబెట్టి చూర్ణముచేసి నీళ్లలో కలిపి తేనె గూర్చి త్రాగినను ఊరుస్తంభమును హరించును.

## స్వర్ణక్షీర్యాదిచూర్ణము.

మూ. స్వర్ణక్షీరిమతివిషాం ముస్తం తేజోవతీం వచామ్ 36
సురాహ్వాం చిత్రకం కుష్ఠం పాఠాం కటుకరోహిణీం,
లేహయేన్మధునా చూర్ణం సక్షౌద్రం వా జలాప్లుతమ్. 37

వ్యా. కంకుష్ఠము, అతివస, తుంగగడ్డలు, ఎక్కుడుతీగె, వస, దేవదారు, చిత్రమూలము, చెంగల్వకోష్టు, చిరుబొద్ది, కటుకరోహిణి, వీనినన్నిటిని చూర్ణముచేసి తేనెతో కలిపి సేవించవలెను, లేక నీళ్లలో కలిపి తేనెను చేర్చి త్రాగవలెను.

### ప్రియంగ్వాదిచూర్ణయోగములు.

మూ. ఫలీం వ్యాఘ్రనఖం హేమ పిబేద్వా మధుసంయుతం,
త్రిఫలాం పిప్పలీం ముస్తం చవ్యం కటుకరోహిణీమ్. 38
లిహ్యాద్వా మధునా చూర్ణం ఊరుస్తమ్భార్దితో నరః,

వ్యా. ప్రేంకణము, పులిగోరుచెట్టువేరు, నాగకేసరములు, వీనిని సమభాగములుగ గూర్చి చూర్ణముచేసి తేనెతో చేర్చి నీళ్లలో కలిపి త్రాగవలెను. మరియు త్రిఫలములు, పిప్పళ్లు, తుంగగడ్డలు, చవ్యము, కటుకరోహిణి, వీనిని సమభాగములుగ గూర్చి చూర్ణముచేసి తేనెలో కలిపి సేవించవలెను. ఈచూర్ణములవలన నూరుస్తంభము శమించును.

### ఊరుస్తంభమునం దవస్థానుసారముగ చికిత్సావిధి.

మూ. అపతర్పణజశ్చేత్స్యాత్ దోషస్సన్తర్పయేద్ధితమ్. 39
యుక్త్యా జాఙ్గలజైర్మాంసైః పురాణైశ్చైవ శాలిభిః,

వ్యా. అపతర్పణముచే కల్గిన యూరుస్తంభమున జాంగలమాంసములచేతను ప్రాతరాజనముల బియ్యపుటన్నముచేతను రోగికి సంతర్పణము చేయవలెను. (ధాతువులకు పుష్టినొందించవలె ననుట.)

### ఊరుస్తంభమున వాతమును శమించుచికిత్స.

మూ. రూక్షణాద్వాతకోపశ్చేత్ నిద్రానాశార్తిపూర్వకః. 40
స్నేహస్వేదక్రమస్తత్ర కార్యో వాతామయాపహః,

వ్యా. రూక్షణరూపమైన చికిత్సచేత వాతము ప్రకోపించిన నిదురబట్టక బాధ కల్గినయెడ స్నేహము స్వేదము మున్నగు వాతహరమైన చికిత్సాక్రమము నాచరింపదగును. (ఇచ్చట రూక్షణముచే ప్రకుపితమైన వాతమును శమింపజేయుటకై స్నేహనాదిచికిత్స అవస్థానుసారముగ విధింపబడినది కావున సామాన్యముగ విధింపబడిన స్నేహనిషేధమునకు విరోధము లేదని యెరుంగునది.)

### ఆవస్థికదోషహరతైలము.

మూ. పీలుపర్ణీ పయస్యా చ రాస్నా గోక్షురకో వచా. 41
సరళాఽగురుపాఠాశ్చ తైలమేభిర్విపాచయేత్,
సక్షౌద్రం ప్రసృతం తస్మాదఞ్జలిం వాఽపి నా పిబేత్. 42

వ్యా. చాగ, మనుబాల, సన్నరాష్ట్రము, పల్లేరు, వస, తెగడ, అగరు, చిరుబొ
వీని నన్నిటిని సమభాగములుంగగూర్చి కల్కముచేసి, కల్కమునకు నాల్గింతలు నూనెయు
నూనెకు నాలుగింతలు జలమును గూర్చి తైలపాకవిధిప్రకారము పక్వముచేసి, అం
ప్రసృత (రెండుపలముల) పరిమితమైనను, అంజలి (నాల్గుపలముల) పరిమితమైన
తైలమును గ్రహించి తేనె కలిపి త్రాగవలెను. (ఇచ్చట సామాన్యపరిభాషచే తైలకల్ప
నెరుంగునది.)

## కుష్ఠాదితైలము.

మూ. కుష్ఠశ్రీవేష్టకోదీచ్యసరళం దారు కేసరం,
అజగన్ధాఽశ్వగన్ధా చ తైలం తైస్సార్షపం పచేత్.
సక్షౌద్రం మాత్రయా తచ్చాప్యూరుస్తమ్భార్దితః పిబేత్,

వ్యా. చెంగల్వకోష్ఠు, శ్రీవేష్టమను గంధద్రవ్యము (దేవదారుబంకతో జే
గంధద్రవ్యవిశేషము), కురువేరు, సరళవృక్షముయొక్క వేరు, దేవదారుచెక్క, న
కేసరములు, ఓమము, పెన్నేరుగడ్డ, వీనిని సమభాగములుంగ గూర్చి కల్కముచేసి య
నూనె నాల్గుభాగములును, నూనెకు నాల్గుభాగములు జలమును జేర్చి తైలమును పక్వ
చేసి నాల్గవవంతు తేనెను కలిపి తగిన మాత్రతో సేవించిన నూరుస్తంభము శమించును

మూ (రౌక్ష్యేన్ముక్త ఊరుస్తమ్భాత్ తతశ్చ స విముచ్యతే.)

వ్యా. పైజెప్పబడిన తైలములను సేవించినయెడ రూక్షోపచారములచే గ
వాతప్రకోపము శమించి యూరుస్తంభంబును శమించును.

## సైంధవాదితైలము.

మూ. ద్వే పలే సైన్ధవాత్ పఞ్చ శుణ్ఠ్యాః గ్రన్థికచిత్రకాత్,
ద్వే ద్వే భల్లాతకాస్థీని వింశతిః ద్వే తథాఢకే.
ఆరనాళాత్ పచేత్ ప్రస్థం తైలస్యైతైరపత్యదం,
గృధ్రస్యూరుగ్రహార్శోఽర్తిసర్వవాతవికారనుత్.

వ్యా. సైంధవలవణము రెండుపలములు, శుంఠి ఐదుపలములు, గ్రంథితగర
రెండుపలములు, చిత్రమూలము రెండుపలములు, జీడిగింజలు ఇరువది, వీని నన్ని
కల్కముచేసి ప్రస్థపరిమిత తైలమున జేర్చి అందు రెండాఢకములు ఆర
మును కలిపి తైలపాకవిధిప్రకారము పక్వముచేయునది. ఈతైలము నుపయోగిం
యెడ సంతానము కల్గును. మరియు గృధ్రసీవాతము, ఊరుస్తంభము, అర్శోవా

వాతవ్యాధు లన్నియు నీతైలోపయోగమువలన శమించును. (ఇచ్చట "భల్లాతకాస్థీని వింశతిః" అనుచోట గింజలు ఇరువది యని యర్థము.)

## అష్టకట్వరతైలము.

మూ. పలాభ్యాం పిప్పలీమూలనాగరాదష్టకట్వరః,
తైలప్రస్థస్సమో దధ్నా గృధ్రస్యూరుగ్రహాపహః. 47
(ఇత్యష్టకట్వరతైలమ్.)

వ్యా. పిప్పళ్లను మోడియు శుంఠియు చేరిన సముదాయము రెండుపలములను కల్కముచేసి ప్రస్థపరిమితమైన నూనెతో జేర్చి, అందు తైలమునకు నెనిమిది భాగములు (ఎనిమిదిప్రస్థములు) మజ్జిగను, ఒకప్రస్థము పెరుగును గూర్చి అన్నింటి నొకటిగ కలిపి తైలపాకవిధిప్రకారము పక్వముచేసి, యుపయోగించిన గృధ్రసీవాతంబును, ఊరుస్తంభంబును నివర్తించును. ఇది అష్టకట్వరతైల మనబడును.

## ఊరుస్తంభమున శ్లేష్మహరప్రలేపాదిబాహ్యచికిత్స.

మూ. ఇత్యాభ్యన్తరముద్దిష్టం ఊరుస్తమ్భస్య భేషజం,
శ్లేష్మణః క్షపణం త్వన్యత్ బాహ్యం శృణు చికిత్సితమ్. 48

వ్యా. ఇత్తెరంగున నూరుస్తంభమునకు సంబంధించిన ఆభ్యంతర (పానాదిరూపముగ శరీరమునందలి యంతర్భాగమున నుపయోగింపదగిన) ఔషధము చెప్పబడినది. ఊరుస్తంభమునకు ప్రధానకారణమైన కఫమును హరించునట్టి బాహ్య (శరీరమునందలి పైభాగమున ప్రలేపాదిరూపముగ నుపయోగింపదగిన) ఔషధములు ఈక్రింద వివరింపబడును.

## కఫహరఉత్సాదనము.

మూ. వల్మీకమృత్తికామూలం కరఞ్జస్య ఫలం త్వచం,
ఇష్టకానాం తతశ్చూర్ణైః కుర్యాదుత్సాదనం భృశమ్. 49

వ్యా. పుట్టమట్టి, కానుగవేరు, కానుగవిత్తులు, కానుగపట్ట వీనినన్నిటిని చూర్ణముచేసి, అందు ఇటికెరాతిపొడిని కలిపి శరీరముపై రుద్దిన నూరుస్తంభమున కఫము నశించి బాధ నివర్తించును.

## కఫనాశకోద్వర్తనము.

మూ. మూలైర్వాప్యశ్వగన్ధాయాః మూలైరర్కస్య వా భిషక్,
పిచుమర్దస్య వా మూలైః అథ వా దేవదారుణః. 50

క్షౌద్రసర్షపవల్మీకమృత్తికాసంయుతైర్భిషక్,
గాఢముత్సాదనం కుర్యాత్ ఊరుస్తమ్భే ప్రలేపనమ్. 51

వ్యా. పెన్నేరుగడ్డలనైనను, జిల్లేడువేళ్లనైనను, వేపవేళ్లనైనను, దేవదారువేళ్లనైనను మెత్తగ చూర్ణముచేసి, తేనెను ఆవాలను పుట్టమట్టిని కలిపి మెత్తగ నూరి యూరుస్తంభమున శరీరముపై నలుగుపెట్టి గాఢముగ రుద్దవలెను. పైజెప్పిన యౌషధముచే పట్టు వేయవలెను.

## ఊరుస్తంభహర ప్రలేపము, సేచనము.

మూ॥ దన్తీద్రవన్తీసురసాసర్షపైశ్చాపి బుద్ధిమాన్,
తర్కారీశిగ్రుసురసావిశ్వావత్సకనిమ్బజైః. 52
పత్రమూలఫలైస్తోయం శృతముష్ణం చ సేచయేత్,

వ్యా. దంతి (నేపాళపు) వేళ్లు, ద్రవంతి (పెద్దనేపాళపు) వేళ్లు, తులసి, ఆవాలు వీనిని నూరి పట్టువేయవలెను. మరియు తక్కాల, మునగ, తులసి, శుంఠి, కొడిసెపాల, వేము వీనియొక్క ఆకులను వేళ్లను కాయలను (యథాసంభవముగ) జేర్చి నీళ్లు కాచి వేడిగ నున్నపుడు స్నానముచేసిన నూరుస్తంభము నివర్తించును.

## కొన్ని ప్రలేపములు.

మూ. పిష్టస్తు సర్షపం మూత్రే ఒధ్యుషితం స్యాత్ ప్రలేపనమ్. 53
వత్సకస్సురసం కుష్ఠం గన్ధస్తుమ్బురుశిగ్రుకా,
హింస్రా ఒర్కమూల(హిఙ్గ్వర్కమూల)వల్మీకమృత్తికాః
సకుతేరకాః. 54
దధిసైన్ధవసంయుక్తం కార్యమేతైః ప్రలేపనం,
ఊరుస్తమ్భవినాశాయ భిషజా జానతా క్రమమ్. 55

వ్యా. ఆవాలను గోమూత్రము పోసి నూరి రాత్రియం దూరపెట్టి మరునాడు పట్టువేయవలెను. మరియు కొడిసెపాలవిత్తులు, తులసి, చెంగల్వకోష్టు, అగరు మున్నగు గంధద్రవ్యము, తుంబురులు (గంధద్రవ్యవిశేషము), మునగపట్ట, జటామాంసి (ఇంగువ), జిల్లేడువేరు, పుట్టమట్టి, నల్లగగ్గెర (నల్లతులసి), వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి మెత్తగ నూరి, అందు పెరుగును సైంధవలవణమును కలిపి పట్టువేయవలెను. ఈ ప్రలేపములచేత నూరుస్తంభము శమించును.

### ఊరుస్తంభహరసేక-ప్రలేపములు.

మూ. శ్యోనాకం ఖదిరం బిల్వం బృహత్యౌ సరలాఽసనౌ,
శోభాఞ్జనకతర్కారీశ్వదంష్ట్రాసురసార్జకాః. 56
అగ్నిమన్థకరఞ్జౌ చ జలేనోత్క్వాథ్య సేచయేత్,
ప్రలేపో మూత్రపిష్టైర్వాఽప్యూరుస్తమ్భనివారణః. 57

వ్యా. పెద్దమ్రానిచెక్క, చండ్రచెక్క, మారేడువేళ్లు, ములక, వాకుడు, సరస దేవదారుచెక్క, వేగిచెట్టుపట్ట, మునగపట్ట, తక్కెల, పల్లేరు, తులసి, నల్లతులసి, కూర నెల్లి, కానుగపట్ట వీని నన్నిటిని సమములుగ గూర్చి క్వాథముచేసి యాకషాయముచే తడుపవలెను. లేక పైజెప్పిన ద్రవ్యముల నన్నిటిని గోమూత్రమున నూరి పట్టువేసినను ఊరుస్తంభము నివర్తించును.

### ఊరుస్తంభమును హరించువిహారములు.

మూ. కఫక్షయార్థం శక్యేషు వ్యాయామేష్వనుయోజయేత్,
స్థలాన్యాక్రామయేత్ కల్యం శర్కరాస్సికతాస్తథా. 58
ప్రతారయేత్ ప్రతిస్రోతః నదీం శీతజలాం శివాం,
సరశ్చ విమలం శీతం స్థిరతోయం పునఃపునః. 59
తథా విశుష్కేఽస్య కఫే శాన్తిమూరుగ్రహో వ్రజేత్,

వ్యా. ఊరుస్తంభరోగపీడితుని వాడు నెరవేర్చుటకు తగిన వ్యాయామ (శరీరమునకు శ్రమమును కల్గించు) కృత్యముల జేయుటకై పురికొల్పవలెను. ప్రాతఃకాలమున వానిని మిట్టప్రదేశములయందును, రాళ్లు విశేషముగ కల్గిన ప్రదేశములయందును, ఇసుక దిబ్బలయందును నడిపించవలెను. చల్లని నీళ్లుకల్గి మొసళ్లు మొదలైన క్రూరజంతువులు లేక సుఖముగ సంచరింపదగిన నదీప్రవాహమున నెదురీదునట్లు చేయవలెను. పాచితీగెలు మున్నగునవి లేక శుభ్రమై మిక్కిలి చల్లనైన జలము కల్గి ప్రవహించక స్థిరముగ నిల్కడకల్గిన సరోవరములయందును అవగాహనముచేసి పలుమారు ఈతకొట్టునట్లు చేయవలెను. ఈవ్యాయామకృత్యములచేత నూరువులయందు వ్యాపించి ఘనీభవించిన కఫము కరగి యెండి, దాన గల్గిన యూరుస్తంభము శాంతినొందును.

ఇచ్చట జలమున నీదునపుడు జలసంబంధమునంజేసి కఫము వృద్ధినొందవలసియున్నను శరీరమునకు ఆయాసము కల్గుటవలనను, శరీరముపై వ్యాపించియున్న యూష్మము జలసంబంధమునంజేసి లోపలికి మరలి యడగియుండుటంజేసియు కఫము

శుష్కించుచునని యెరుంగునది. మరియు జలమునం దీదుట కఫమునకు సమానగుణకర క్రియ యైనను కఫశోషణరూపఫలమును కల్గించునది కావున సుఖకరమయి యాచరణయోగ్య మగును. ఈవిషయము నీతంత్ర కారుడు "భవేత్కదాచిత్కార్యాపి విరుద్ధాఽభిమత క్రియా" (చి. అ. 30) అని యోనివ్యాపచ్చికిత్సితమున నుపదేశించిరి. ఇది విప తార్థకారిచికిత్స యని భావము.

## అనుక్తచికిత్సాసంగ్రహము.

మూ. శ్లేష్మణః క్షపణం యత్స్యాత్ న చ మారుతమావహేత్,
(న చ మారుతకోపనమ్) 6

తత్సర్వం సర్వదా కార్యం ఊరుస్తమ్భస్య భేషజం,
శరీరం బలమగ్నిం చ కార్యైషా రక్షతా క్రియా. 6

వ్యా. ఊరుస్తంభమున వాతమును ప్రకోపింపజేయకయే శ్లేష్మమును నశింపజేయు నట్టి ఔషధ-ఆహారవిహారములన్నియు నెడలేక చేయుట యూరుస్తంభమునకు చికిత్స యగును. మరియు నీవ్యాధికి చికిత్స జేయునపుడు శరీరమును శరీరబలమును జాఠరా గ్నిని చెడనీయక కాపాడుచు మిక్కిలి మెలకువతో చికిత్స చేయనగును.

## అధ్యాయవిషయసంగ్రహము.

తత్ర శ్లోకః—

మూ. హేతుః ప్రాగ్రూపలిఙ్గాని కర్మాఽయోగ్యత్వకారణం,
ద్వివిధం భేషజం చోక్తం ఊరుస్తమ్భచికిత్సితే. 6

వ్యా. ఊరుస్తంభము జనించుకారణములు, పూర్వరూపము, లక్షణములు, ఊరు స్తంభమున పంచకర్మములు చేయదగదనుటకు కారణములు, బాహ్య - అభ్యంతరరూపవ లైన యౌషధములు, ఇవి యన్నియు నూరుస్తంభచికిత్సితమను నీయధ్యాయమున చెప బడినవి.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే దృఢబలసమ్పూరితే
చికిత్సాస్థానే ఊరుస్తమ్భచికిత్సితం నామ
సప్తవింశోఽధ్యాయః.

ఇత్తెరంగున నగ్నివేశకృతంబును చరకప్రతిసంస్కృతంబును నగుచరకసంహితయను నాయుర్వేదతంత్రమునందలి చికిత్సాస్థానమున దృఢబలసంపూరితభాగమునం దూరు స్తంభచికిత్సితమనునది సప్తవింశాధ్యాయము సమాప్తము.

## అష్టవింశాధ్యాయము.

అవతరణిక:—ఊరుస్తంభచికిత్సితమున "రూక్షణాద్వాతకోపశ్చేత్" అని యూరుస్తంభమున రూక్షణముచే వాతము ప్రకోపించినచో దానికి తగిన స్నేహనాది చికిత్స చెప్పబడినది. అట్టి వాతప్రకోపప్రస్తావమునం జేసి యూరుస్తంభచికిత్సితానంతరము వాతవ్యాధిచికిత్సితము చెప్పబడును:—

### అధ్యాయప్రారంభము.

మూ. అథాతో వాతవ్యాధిచికిత్సితం వ్యాఖ్యాస్యామః. 1

ఇతి హ స్మాహ భగవానాత్రేయః. 2

వ్యా. ఊరుస్తంభచికిత్సితానంతరము వాతవ్యాధిచికిత్సితమును భగవానుడగు నాత్రేయుఁ డుపదేశించినదానికన్న న్యూనాతిరేకము లేకుండునట్లు వివరించి చెప్పెదనని యర్థము.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—వాతవ్యాధిశబ్దమునకు "వాత ఏవ వ్యాధిః వాతవ్యాధిః" అని విగ్రహమును వివక్షించినయెడ వాతమే ఆయాదూష్యముల జేరి సర్వాఙ్గ-ఏకాఙ్గవాతాదిరూపమునొంది పలుదెరంగులైన బాధల గల్గించునది వాతవ్యాధి యని యర్థము. లేక 'వాతాత్ వ్యాధిః=వాతవ్యాధిః' అని విగ్రహమును వివక్షించునెడ, వాతదోషమువలన దోషదూష్యసమ్మూర్ఛనవిశేషరూపమై సర్వాఙ్గ-ఏకాఙ్గాదిరూపమైన వ్యాధి వాతవ్యాధి యని యర్థము. జ్వరాదిరోగములును వాతముచే కల్గినను, అయ్యవి వాతముచే గాక పిత్తకఫములచేఁగూడ సంభవించును. వాతవ్యాధి మాత్రము కేవలము వాతముచేతనే సంభవించునది యగుటంజేసి వాతవ్యాధి యని వ్యవహరింపబడును. గాని కఫపిత్తములచే గూడ సంభవించు జ్వరాదిరోగములకు వాతవ్యాధి వాతవ్యాధిశబ్ద వాచ్యత్వము లేదని యెరుంగునది.

### వాతముయొక్క నైజస్వభావము.

మూ. వాయురాయుర్బలం వాయుః వాయుర్ధాతా శరీరిణాం,

వాయుర్విశ్వమిదం సర్వం ప్రభుర్వాయుశ్చ కీర్తితః. 3

వ్యా. వికృతి జెందక సమస్థితినుండు శారీరవాతము (మనుజులకు శరీర-ఇంద్రియ-సత్వ-ఆత్మసంయోగరూపమైన యాయుష్యమునకు ప్రధాన మగుటంజేసి) యాయుస్స్వరూపముగ నుండును. శారీరమానసబలంబునకును కారణమగుటంజేసి బలమనియు చెప్పబడును. శరీరధారణమునకు ముఖ్యకారణము. ఈ ప్రపంచమంతయు వాయువు వ్యాపించి

యుండుటంజేసి విశ్వరూపమనియు, ప్రపంచమున కాధారమగుటంజేసి ప్రభువనియు
చెప్పబడును.

వాతము ఆయువునకు హేతువగుటకు కారణము.

మూ॥ అవ్యాహతగతిర్యస్య స్థానస్థః ప్రకృతౌ స్థితః,
వాయుస్స్యాత్ సోఽధికం జీవేత్ వీతరోగః సమాశ్శతమ్.

వ్యా. లోకమునం దెవరికి వాతము తనసంచారమార్గమున కడ్డులేక స్వభావసిద్ధమై
సంచారము కల్గి, వాతమునకు నియమితమైన స్థానమునందే న్యూనాతిరేకములు లే
సమస్థితినుండునో అట్టిమానవుడు రోగపీడితుడు కాక నూరువత్సరములకు నధికముగ
సుఖముగ జీవించును.

ప్రాణాదివాతభేదములు.

మూ. ప్రాణోదానసమానాఖ్యవ్యానాఽపానైః స పఞ్చధా,
దేహం తన్త్రయతే సమ్యక్ స్థానేష్వవ్యాహతశ్చరన్.

వ్యా. పైజెప్పిన గుణములు కలవాతము ప్రాణము, ఉదానము, సమానము
వ్యానము, అపానము నని యైదుభేదములు కల్గి, వానివాని కీక్రిందవేరువేరు చెప్పబడు
స్థానములయం దయ్యది యడ్డులేక సంచరించుచు శరీరమును చక్కగ ధరించును.

ప్రాణవాతస్థానములు, కృత్యములును.

మూ. స్థానం ప్రాణస్య మూర్ధోరః కణ్ఠ(కర్ణ)జిహ్వాస్యనాసికాః,
ష్ఠీవనక్షవథూద్గారశ్వాసాహారాది కర్మ చ.

వ్యా. ఐదువిధములైన వాతములలో ప్రాణవాతమునకు శిరస్సును కంఠంబును
నాలుకయు నోరును నాసికయు స్థానములు. ష్ఠీవనము (నోటిద్రవము నుమియుట
తుమ్ముట, ఉద్గారము (త్రేనుపుల వెడలించుట), నిశ్వాసమును వెడలించుట, ఆహారమును
లోనికి ప్రవేశింపజేయుట, ఇవిమున్నగు క్రియలను ప్రాణవాతము చేయును. (ఇచ్చ
'ఆహారాది' అను ఆదిశబ్దముచేత ఆహారధారణము మున్నగుకృత్యములు ప్రాణవాతమున
సంబంధించినదని యెఱుంగునది.)

ఉదానవాతస్థానములు, దానికృత్యములును.

మూ. ఉదానస్య పునః స్థానం నాభ్యురః కణ్ఠ ఏవ చ,
వాక్ప్రవృత్తిః ప్రయత్నోర్జో బలవర్ణాదికర్మ చ.

వ్యా. ఉదానవాతమునకు నాభియు, రొమ్మును, కంఠంబును స్థానములు. అయ్యది సంభాషణమును, కార్యములయందు ప్రయత్నమును, ఉత్సాహమును, శరీరబలమును, శరీరవర్ణము మున్నగువానిని కల్గించును. (ఇచ్చట ప్రాణ-ఉదానవాతముల రెంటికిని ఉరస్సు స్థానమగుటవలన సమానస్థానములైనను వానివానికృత్యములు వేరు వేరుగ నుండుటంజేసి (ఒకయింటిలో కాపురముండు మాలాకారునకును కుమ్మరివానికిని స్థానము సమానముగ నున్నను కృత్యభేదములచే నామభేదములు కల్గువిధముగ) నామభేదములచే వ్యవహరింపబడునని యెరుంగునది.)

## సమానవాతస్థానములు, దానికృత్యములు.

మూ. స్వేదదోషామ్బువాహీని స్రోతాంసి సమధిష్ఠితః,
అంతరగ్నేశ్చ పార్శ్వస్థః సమానోఽగ్నిబలప్రదః. 8

వ్యా. సమానవాతము శరీరమునందలి చెమటను వాతాదిదోషములను, జలమును, వ్యాపింపజేయునట్టి స్రోతోమార్గములయందును, కాయాగ్నికి సమీపమునను చేరియుండి జాఠరాగ్నికి బలమును కలిగించి వృద్ధినొందించుచుండును.

మరియు నీసమానవాతము కాయాగ్నికి సమీపమున ముఖ్యముగనుండి కోష్ఠమునందంతటను సంచరించుచు భుజింపబడిన యాహారమును గ్రహించి జాఠరాగ్నిచే పచింపజేసి విభజించి శరీరమునం దధోభాగమున చేర్చును. ఈవిషయమునే వాగ్భటులు నిట్లు చెప్పిరి:—"సమానోఽగ్నిసమీపస్థః కోష్ఠే చరతి సర్వతః, అన్నం గృహ్ణాతి పచతి వివేచయతి ముఞ్చతి."

మరియు స్రోతోవిమానము"నిస్వేదవహానాం స్రోతసాం మేదో మూలం రోమకూపాశ్చ" అని చెప్పబడిన స్వేదోవహస్రోతస్సులను, "ఉదకవహానాం స్రోతసా తాలుమూలం క్లోమచ" అని చెప్పబడిన ఉదకవహస్రోతస్సులను నెరుంగునది. వాతాది దోషములు స్రోతస్సు లన్నింటియందును వ్యాపించి శరీరమునందంతట సంచరించునని "వాతపిత్తశ్లేష్మణాం పునః సర్వశరీరచరాణాం సర్వాణి స్రోతాంసి అయనభూతాని" అనువాక్యముచే అచ్చటనే చెప్పబడినది.

## వ్యానవాతస్థానములు, దానికృత్యములు.

మూ. దేహం వ్యాప్నోతి సర్వం తు వ్యానశ్శీఘ్రగతిర్నృణాం,
గతిప్రసారణాక్షేపనిమేషాదిక్రియస్సదా. 9

వ్యా. వ్యానవాతము అతిశీఘ్రమైన గమనము కల్గి శరీరమునందంతట వ్యాపించి నడచుట, ప్రసారణము (కాళ్లు చేతులు మున్నగునవయవములను చాచుట ముడుచుట

మున్నగునవి) ఆక్షేపము (చలనము), రెప్పలు మూయుట, తెరచుట మున్నగు వ్యాపారముల నెల్లప్పుడు చేయుచుండును.

అపానవాతస్థానములు, దానికృత్యములు.

మూ. వృషణౌ వస్తిమేఢ్రం చ నాభ్యూరూ వంక్షణౌ గుదం,
అపానస్థానమన్త్రస్థః శుక్రమూత్రశకృన్తి చ. 10
సృజత్యార్తవగర్భౌ చ యుక్తాః స్థానస్థితాశ్చ తే,
స్వకర్మ కుర్వతే దేహో ధార్యతే తైరనామయః. 11

వ్యా. అపానవాతము వృషణములను, వస్తిని (మూత్రాశయమును), మేఢ్రమును, (గుహ్యమును), నాభిని, తొడలను, గజ్జలను, గుదమును, ఆంత్రమును (ప్రేవులను) ఆశ్రయించియుండి శుక్రమూత్రపురీషములను, ఋతురక్తమును, గర్భమును, ఆయామార్గములనుండి బైటవెడలించును.

పైజెప్పబడిన ప్రాణాదివాతము లైదును వికృతిజెందక సమస్థితిని వానివానికి పైని కనుబరచబడిన స్థానములయందు నియతముగ నున్నయెడ వానివానికి చెప్పబడిన కృత్యముల జేయును. దానంజేసి అట్టిపంచాత్మకమైన వాతభేదములచే మనుజుడు రోగములు లేక శరీరమున ధరించి సుఖముగ నుండగలడు.

విగుణవాతము చేయుకృత్యము.

మూ. విమార్గస్థాః హ్యయుక్తా వా రోగైః స్వస్థానకర్మజైః,
శరీరం పీడయన్త్యేతే ప్రాణానాశు హరన్తి చ. 12
సఞ్జ్ఞ్యమప్యతివృత్తానాం తజ్జానాం హి ప్రధానతః,
అశీతిర్నఖభేదాద్యా రోగాస్సూత్రే నిదర్శితాః. 13
తానుచ్యమానాన్పర్యాయైస్సహేతూపక్రమాన్శృణు,
కేవలం వాయుముద్దిశ్య స్థానభేదాత్తథాఽఽవృతమ్ 14

వ్యా. పైజెప్పబడిన ప్రాణాదివాతములు వానివానికి చెప్పబడిన మార్గములను వదలి ఇతరమార్గముల సంచరించినను, సమస్థితి నుండక వికృతిజెందినను, వానివానికి చెప్పబడిన శిరస్సు మున్నగుస్థానములకును క్షీవనాదికృత్యములకును సంబంధించినరోగములను అనేకముల కల్గించి శరీరమును బాధించును. అట్టివ్యాధులు మిక్కిలి బలవత్తరములయినయెడ యారోగముల చేతనే మనుజుని చంపును.

ఆయ్యవి సంఖ్యాతీతమైయుండినను ఈరోగములను సంగ్రహించి నఖభేదము మున్నగునామభేదములచే నెనుబదివిధముల నున్నదని సంగ్రహించి ప్రధానముగ సూత్రస్థానమున (మహారోగాధ్యాయమున) నిర్దేశింపబడినవి.

ఆరోగములనే ఇచ్చట పర్యాయనామాంతరములచే జూపుచు వానికారణములును, లక్షణములును, ఆయావ్యాధికి చేయదగిన చికిత్సలును ఈక్రింద వివరించబడును. మరియు కేవలము వాతమును మాత్ర ముద్దేశించి వానిస్థానభేదములబట్టియు పిత్తాద్యావరణభేదములబట్టియు సంభవించు వాతవ్యాధులుమాత్రము ఈప్రకరణమున చెప్పబడును.

ఇచ్చట వాతమునుమాత్ర ముద్దేశించి ప్రాణాదిభేదములును స్థానభేదములచే నిర్ణయింపబడినవి కాన అట్టి స్థానభేదములను వానివానిక్రియాభేదములను అనుసరించి ప్రాణాదివాతప్రకోపముచే కల్గువ్యాధులు మాత్రము చెప్పబడుననియు, ఆవరణభేదముచే గల్గులక్షణములును చెప్పబడుననియు భావము.

### వాతవ్యాధినిదానము.

మూ. రూక్షశీతాఽల్పలఘ్వన్నవ్యవాయాఽతిప్రజాగరైః,
విషమాదుపచారాచ్చ దోషాఽసృక్స్రవణాదతి. 15
లఙ్ఘనప్లవనాత్యధ్వవ్యాయామాతివిచేష్టితైః,
ధాతూనాం సంక్షయాచ్చిన్తాశోకరోగాఽతికర్శనాత్. 16
దుఃఖశయ్యాసనాత్ క్రోధాత్ దివాస్వప్నాద్భయాదపి,
వేగసన్ధారణాదామాత్ అభిఘాతాదభోజనాత్. 17
మర్మాఘాతాద్గజోష్ట్రాశ్వశీఘ్రయానాఽపతంసనాత్,
దేహే స్రోతాంసి రిక్తాని పూరయిత్వాఽనలో బలీ. 18
కరోతి వివిధాన్ వ్యాధీన్ సర్వాఙ్గైకాఙ్గసంశ్రితాన్,

వ్యా. రూక్షశీతగుణములు కలపదార్థములను భుజించుట, తనకు కావలసిన పరిమితి కన్న తక్కువగ భుజించుట, అధికముగ స్త్రీసంభోగముచేయుట, రాత్రులయం దధికముగ నిదురమేల్కొంచుట, ఉపచారములను వ్యత్యస్తముగ జేసికొనుట, శరీరమునందలి కఫపిత్తములనైనను రక్తమునైనను అధికముగ వెడలించుట, లంకణముండుట, మిట్టపల్లములుగనుండు ప్రదేశములయందు ఎగిరిదుముకుట, అధికముగ త్రోవనడచుట, శరీరవ్యాయామము నధికముగ జేయుట, ఆంగికాదిచేష్టల (వ్యాపారముల) నధికముగ జేయుట,

శరీరమునందలి రక్తాదిధాతువులు క్షీణించుట, చింతచేనైనను దుఃఖముచేనైనను జ్వరాది రోగములచేనైనను మిక్కిలి శరీరము కృశించుట, శరీరమునకు కష్టమును కల్గించువిషమ స్థితినుండు శయ్యలపై బరుండుట, లేక అట్టియాస్తరణములపై గూర్చుండుట, కోపము, పగటిపూట నిదురించుట, భయపడుట, వాతమలమూత్రాదివేగముల నిరోధించుట, ఆమరసము శేషించియుండుట, శరీరమున కభిఘాతముకలుగుట, ఆహారమును భుజించక యుపవాసముండుట, కణతలు మున్నగు మర్మస్థలములయందు అభిఘాతము కల్గుట, ఏనుగలు ఒంటెలు గుఱ్ఱములు మున్నగువానిపై నెక్కి మిక్కిలి వేగముగ పరువిడుట, వానిపై నెక్కి సవారిచేయునపుడు క్రిందపడుట, ఈకారణములచేత వాతము ప్రకోపమునొంది బలవత్తరమై స్నేహాదిగుణవిహీనములైన స్రోతస్సులను పూరించి సర్వాంగములను ఏకాంగములను ఆశ్రయించిన వాతరోగములను కల్గించును.

ఇచ్చట "గజోష్ట్రా...అపతంసనాత్" అనుచోట ఏనుగులు మున్నగువాహనములపై నెక్కి యతివేగముతో సవారిచేయుటవలననైన శరీరమునందలి ధాతువులు కృశించుటవలన వాతము ప్రకోపించునని యర్థముకూడ చెప్పదగును. అపతంసశబ్దమునకు కర్షణమనునర్థము ఖరనాదమున నిట్లు చెప్పబడినది:—"విలిఖత్యతితైక్ష్ణ్యాద్యత్ స్మృతముల్లేఖనం హి తత్, వికర్షత్యతిధాతూన్ యత్ తచ్చోక్తమవ(ప)తంసనమ్." తీక్ష్ణగుణముచే శరీరమునందలి ధాతువులను లేఖనముచేయునది యుల్లేఖనమనియు, ధాతువుల కృశింపజేయునది అప(అవ)తంసనమనియు నర్థము.

### వాతవ్యాధిపూర్వరూపము.

మూ. అవ్యక్తం లక్షణం తేషాం పూర్వరూపమితి స్మృతమ్. 19
ఆత్మరూపం తు తద్వ్యక్తం అపాయో లఘుతా పునః,

వ్యా. వాతవ్యాధులకు చెప్పినలక్షణములు సూక్ష్మములుగ నగపడినచో నయ్యది వాతవ్యాధులకు పూర్వరూపమని యెరుంగునది. మరియు ఆలక్షణములే స్ఫుటములుగా గానవచ్చినచో వాతవ్యాధికి స్వరూపలక్షణమనియు, అట్టితీవ్రలక్షణము లుడిగి శరీరము చుల్కనై యున్నయెడ వ్యాధినివృత్తియనియు నెరుంగునది.

### వాతవ్యాధిసామాన్యరూపము, ప్రకుపితవాతకృత్యములు.

మూ. సఙ్కోచః పర్వణాం స్తమ్భో భేదోఽస్థ్నాం పర్వణామపి. 20
లోమహర్షః ప్రలాపశ్చ పాణిపృష్ఠశిరోగ్రహః,
ఖఞ్జపాఙ్గుల్యకుబ్జత్వం శోషోఽఙ్గానామనిద్రతా. 21

గర్భశుక్రరజోనాశః స్పన్దనం గాత్రసుప్తతా,
శిరోనాసాక్షిజత్రూణాం గ్రీవాయాశ్చాపి హుణ్డనమ్. 22
భేదస్తోదార్తిరాక్షేపః మోహశ్చాయాస ఏవ చ,
ఏవంవిధాని రూపాణి కరోతి కుపితోఽనిలః. 23
హేతుస్థానవిశేషాచ్చ భవేద్రోగవిశేషకృత్,

వ్యా. శరీరమునందలి సంధిబంధములు స్తంభించి కదలకుండుట, లేక సంకుచితములై ముడుచుకొనియుండుట, కీళ్లును ఎముకలును పగులుట, శరీరమునందలి రోమములు జలదరించి స్తంభించుట, సంబంధము లేక మాట్లాడుట, చేతులును వీపును శిరస్సును పట్టుబట్టి లాగబడినట్లుండుట, అవయవములు కుంటియగుట, గూను, శరీరము యుక్తముగ పెరుగక పొట్టియగుట, చేతులు కాళ్లు ముఖము మున్నగు నవయవములు శుష్కించుట, నిదురబట్టకుండుట, గర్భంబును శుక్రంబును ఋతురక్తంబును నశించుట, హస్తపాదాదులు వణకుట, శరీరమున స్పర్శము తెలియక మొద్దుబారియుండుట, శిరస్సు నాసాపుటము కన్నులు కంఠమూలము మెడ అను నీయవయవములు లోపలికి లాగబడుట, గొడ్డలిచే చీలువబడినట్లును సూదుల బొడిచినట్లును బాధకల్గుట, ఆక్షేపము శరీరావయవములు మాటిమాటికిని కుదిలించినట్లు వణకుట, మూర్ఛగ్రమ్ముట, ఆయాసము, ఇవి మున్నగురోగములను ప్రకోపమునొందిన వాతము కల్గించును. మరియు పిత్తావరణము మున్నగుకారణ భేదములబట్టియు, కోష్ఠము మున్నగుస్థానవిశేషములబట్టియు తత్తదనుగుణముగ నాయారోగవిశేషముల గల్గించును.

ఇచ్చట చెప్పబడిన పర్వసంకోచము మున్నగునవి వాతవ్యాధిసామ్యలక్షణములగును. ఇవియే స్వతంత్రములుగ ప్రత్యేకవ్యాధులు నగును. ఇత్తెరంగుననే జ్వరాది రోగములకు లక్షణములుగ జెప్పబడినక్రమము, అరతి వివర్ణత్వము మున్నగులక్షణంబులును స్వతంత్రవ్యాధులుగ జనించుటయు కలదు. ఈవిషయమునే నిదానస్థానమున తంత్రకారు లిట్లు చెప్పిరి.—

"జ్ఞానార్థం యానిచోక్తాని వ్యాధిలిఙ్గాని సఙ్గ్రహే, వ్యాధయస్తే తదాత్వేతు లిఙ్గానీష్టాని నామయాః" (ని. అ. ౮. శ్లో. ౪౪) దీనివివరమంతయు నచ్చటనే సూచునది.

కోష్ఠగతప్రకుపితవాతలక్షణము.

మూ. తత్ర కోష్ఠాశ్రితే దుష్టే నిగ్రహో మూత్రవర్చసోః. 24
బ్రధ్నహృద్రోగగుల్మార్శః పార్శ్వశూలం చ మారుతే,

వ్యా. వాతము దుష్టమై కోష్ఠము నాశ్రయించినయెడ మలమూత్రములు బైట వెడలక బంధింపబడును. అండకోశమునకు సంబంధించిన నరము వాచును. హృదయ రోగంబును గుల్మంబును ఆర్శోరోగంబును పార్శ్వశూలంబును సంభవించును.

### సర్వాంగకుపితవాతలక్షణము.

మూ. సర్వాఙ్గకుపితే వాతే గాత్రస్ఫురణభఞ్జనే. 25
వేదనాభిః పరీతశ్చ స్ఫుటన్తీవాఽస్యసన్ధయః,

వ్యా. సర్వశరీరమున వ్యాపించినవాతము ప్రకోపమునొందినపుడు శరీరమునం దచ్చుటచ్చుట నదరును. పగులును. సంధిబాధములు పలుదెరంగులైన బాధలతో గూడి పగులునట్లుండును.

### గుదస్థితకుపితవాతలక్షణము.

మూ. గ్రహో విణ్మూత్రవాతానాం శూలాధ్మానాఽశ్మశర్కరాః. 26
జఙ్ఘోరుత్రికపాత్పృష్ఠరోగశోషా గుదస్థితే,

వ్యా. గుదమునందలి వాతము ప్రకోపము నొందినపుడు మలమూత్రంబులును అపానవాతంబును బంధింపబడును. శూలంబును, కడుపుబ్బరంబును మూత్రద్వారమున రాయియు శర్కరయు కల్గును. పిక్కలకును తొడలకును కటిభాగమునకు క్రిందిసంధికిని పీపుకును సంబంధించినరోగములు కల్గును. ఈప్రదేశములయందు వాపును కల్గును.

### ఆమాశయప్రకుపితవాతలక్షణము.

మూ. హృన్నాభిపార్శ్వోదరరుక్ తృష్ణోద్గారవిసూచికాః. 27
కాసః కణ్ఠాస్యశోషశ్చ శ్వాసశ్చామాశయస్థితే,

వ్యా. ఆమాశయమునందలివాతము ప్రకోపించినయెడ హృదయమునందును నాభిస్థానమునను ఇరుప్రక్కలయందును ఉదరమునందును నొప్పికల్గును. దప్పియు, త్రేనుపులును, విషూచియు, కాసంబును సంభవించును. కుత్తుకయు నోరును ద్రవములేక యొండును. శ్వాసము వెడలును.

### పక్వాశయస్థకుపితవాతలక్షణము.

మూ. పక్వాశయస్థోఽన్త్రకూజం శూలాటోపౌ కరోతి చ 28
కృచ్ఛ్రమూత్రపురీషత్వం ఆనాహం త్రికవేదనాం,

వ్యా. పక్వాశయమున నుండువాతము ప్రకోపించినయెడ ప్రేవులలో కూఁతలు పుట్టి శూలనొప్పికల్గును. గడబిడశబ్దము పుట్టును. మూత్రపురీషములు మిక్కిలి కష్టముతో వెడలును. కడుపుబ్బును. త్రికస్థానమున (వెన్నెముకకు క్రిందిసంధిలో) బాధకల్గును.

### ఇంద్రియగత-త్వగ్గతవాతలక్షణములు.

మూ. శ్రోత్రాదిష్విన్ద్రియవధం కుర్యాద్దుష్టసమీరణః. 29
త్వగ్రూక్షా స్ఫుటితా సుప్తా కృశా కృష్ణా చ తుద్యతే,
ఆతన్యతే సరాగా చ పర్వరుక్ త్వక్స్థితేఽనిలే. 30

వ్యా. ప్రకుపితవాతము శ్రోత్రము నేత్రములు మున్నగునింద్రియస్థానముల జేరినపుడు ఏయేయింద్రియమున చేరునో ఆయాయింద్రియములను చెరిచి ఆయాయింద్రియముయొక్క శక్తిని నశింపజేయును.

మరియు ప్రకుపితవాతము త్వక్కునచేరిన నయ్యది రూక్షమై పగులును. స్పర్శము నెరుంగలేకుండును. చర్మము కృశించి నల్లబడి సూదులబొడిచినవిధముగ పోటుపుట్టును. ఎఱ్ఱగనైన నుండును. గణుపులయందు నొప్పిపుట్టును. చర్మము విస్తరించును. (ఇచ్చట త్వక్ శబ్దమునకు రసధాతువని యర్థము.)

### రక్తగతవాతలక్షణము.

మూ. రుజస్తీవ్రాః ససన్తాపాః వైవర్ణ్యం కృశతాఽరుచిః,
గాత్రే వాఽరూంషి భుక్తస్య స్తమ్భశ్చాఽసృగ్గతేఽనిలే. 31

వ్యా. వాతము ప్రకుపితమై రక్తమున జేరినచో మంటయు మిగుల తీవ్రములైన నొప్పి పోటు మున్నగుబాధలును కల్గును. శరీరమున స్వాభావికమైన వర్ణము మారి వికృతరూపము కల్గును. శరీరము కృశించును. అరుచి కల్గును. శరీరముపై బొబ్బలు లేచి పుండగును. భుజించినవెంటనే శరీరము స్తంభించును.

### మాంస-మేదోగతప్రకుపితవాతలక్షణము.

మూ. గుర్వఙ్గం తుద్యతేఽత్యర్థం దణ్డముష్టిహతం తథా (యథా),
సరుక్ శ్రమిత(స్తిమిత)మత్యర్థం మాంసమేదోగతేఽనిలే. 32

వ్యా. వాతము మాంసమునందును మేదస్సునందును ప్రకోపమునొంది చేరినప్పుడు శరీరము బరువై కట్టెలచేతను పిడికిలిచేతను కొట్టబడినవిధముగ బాధయు, తీవ్రమైన పోటును కల్గును. శరీరముపై తడిగుడ్డ గప్పినవిధముగ మొద్దుబారియుండును. (ఇచ్చట మాంస-మేదోగతవాతములకు లక్షణములు సమానములు.)

## మజ్జ-అస్థికుపితవాతలక్షణము.

మూ. భేదోఽస్థిపర్వణాం సన్ధిశూలం మాంసబలక్షయః,
అస్వప్నః సన్తతారుక్చ మజ్జాఽస్థికుపితేఽనిలే. 33

వ్యా. మజ్జయందును అస్థులయందును ప్రకుపితవాతము చేరినపుడు అస్థులయందును కీళ్లయందును పగులుదీయునట్లు బాధయు, సంధులయందు శూలమున పొడిచినట్లు పోటును కల్గి, శరీరమునందలి మాంసంబును బలంబును క్షీణించును. నిదుర బట్టదు. నిరంతరముగ నొప్పి కల్గును. (ఇచ్చట అస్థి-మజ్జల రెంటికిని లక్షణములు సమానములుగ జెప్పబడినవి. వివిధాశితపీతీయమునం దస్థిమజ్జలదుష్టిలక్షణములు వేరువేరుగ జెప్పబడినవి. ఆవిశేషలక్షణముల గూడ గ్రహించునది. ఇత్తెరంగుననే మాంసమేదోదుష్టిలక్షణములను వేరువేరుగ జెప్పబడినవాని విశేషముల గమనించునది.)

## శుక్రగతకుపితవాతలక్షణము.

మూ. క్షిప్రం ముఞ్చతి బధ్నాతి శుక్రం గర్భమథాపిచ,
వికృతిం జనయేచ్చాపి శుక్రస్థః కుపితోఽనిలః. 34

వ్యా. శుక్రగతవాతము ప్రకోపించినచో శుక్రమునుగర్భమును శీఘ్రముగ వెడలించును. ఒకసమయమున బైటవెడలనీయక బంధించును. లేక శుక్రమునకు గర్భమునకును సంబంధించినవ్యాధుల గల్గించును.

ఇచ్చట శుక్రశబ్దముచేత శోణితము గూడ గ్రహింపబడును. గర్భోత్పత్తికి కారణమైన శుక్రశోణితము వాతముచే దుష్టమైనయెడ గర్భమును శీఘ్రముగ వెడలించును. లేక ప్రసవనియతకాలమునకు నధికకాలము కూడ ప్రసవము కానీయక బంధించును. లేక గర్భస్థశిశువునకు అంగవైకల్యాది వికృతరూపమును కల్గించుననియు నెరుంగునది.

## స్నాయుగతకుపితవాతలక్షణము.

మూ. బాహ్యాభ్యన్తరమాయామం ఖల్లిం కుబ్జత్వమేవ చ,
సర్వాఙ్గైకాఙ్గరోగాంశ్చ కుర్యాత్ స్నాయుగతోఽనిలః. 35

వ్యా. శరీరమునందలి స్నాయువులను (సన్ననినరములను) ఆశ్రయించి వాతము ప్రకోపమునొందినయెడ బాహ్యాయామము, అంతరాయామమును, ఖల్లీవాతము, కుబ్జవాతము, సర్వాంగవాతము, ఏకాంగవాతము అనువాతరోగములను కల్గించును. (ఇచ్చట సిరాగతవాతలక్షణములుగ జెప్పబడిన బాహ్యాయామాదివ్యాధిలక్షణములు క్రిందచెప్పబడును.)

### సిరాగతకుపితవాతలక్షణము.

మూ. శరీరం మన్దరుక్ శోఫం శుష్యతి స్పన్దతే తథా,
సుప్తాస్తన్వ్యో మహత్యో వా సిరాః వాతే సిరాగతే. 36

వ్యా. శరీరమునందలి సిరల నాశ్రయించి ప్రకుపితమైన వాతమున శరీరమున స్వల్పముగ నొప్పియు వాపును కల్గును. శరీరము శుష్కించి యదరును. సిరలు మిగుల సన్నగనైనను లావుగనైన నగును. చలనము లేకుండును.

### సంధిగతకుపితవాతలక్షణము.

మూ. వాతపూర్ణదృతిస్పర్శః శోథస్సన్ధిగతేఽనిలే,
ప్రసారణాకుఞ్చనయోః ప్రవృత్తిశ్చ (అప్రవృత్తిః) సవేదనా. 37

వ్యా. సంధుల(కీళ్ల) యందు చేరినవాతము ప్రకుపితమైనపుడు సంధులయందు తాకినయెడ గాలితో నిండిన తోలుతిత్తివలె నుండు వాపుకల్గును. కాళ్లుచేతులను చాచునపుడును ముడుచునపుడు బాధకల్గును. ఒకసమయమున ప్రసారణాదులకును సాధ్యము కాకుండును.

మూ. ఇత్యుక్తం స్థానభేదేన వాయోర్లక్షణమేవ చ,

వ్యా. ఇత్తెరంగున కోష్ఠాదిస్థానభేదముచే గల్గువాతలక్షణములు వేరువేరుగ జెప్పబడినవి.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—వాతవ్యాధిని నిర్దేశించునపుడు ప్రకుపితమైనవాతము కోష్ఠముమున్నగుస్థానముల నాశ్రయించినయెడ నాయాస్థానవిశేషములబట్టి వాతము తత్తదనుగుణముగ కొన్నివ్యాధుల గల్గించి బాధించుననియు, వానిలో కొన్ని మిక్కిలి బలిష్ఠములగువ్యాధులు ప్రాణముల గూడ హింసించుననియు, వాతము పిత్తాదులచే తనసంచారమార్గమును అడ్డగించుటచే కొన్నివ్యాధుల గల్గించుననియు నిర్దేశించి వానినన్నిటి నీక్రింద వివరించెనని—"విమార్గస్థాః హ్యాయుక్తా వా... ప్రాణానాశు హరన్తి చ... కేవలం వాయుముద్దిశ్య స్థానభేదాత్తథా శృణు." అనువాక్యముచే తంత్రకారులు నిర్దేశించిరి. అందు స్థానభేదముచే గల్గు వాతలక్షణములు "తత్ర కోష్ఠాశ్రితే" అని యుపక్రమించి యింతదనుక వివరింపబడినవి. పిదప బలిష్ఠములై ప్రాణాంతకరములగు అర్దితవాతాదిక్రూరవ్యాధు లీక్రింద వివరింపబడును. పిత్తాద్యావరణముచే ప్రకోపము నొందిన వాతలక్షణములు "లిఙ్గం పిత్తావృతే" అని యుపక్రమించి చెప్పబడును.

మరియు వాతము ప్రకోపించుటకు ముఖ్యకారణములు రెండు. అందొకటి ధాతుక్షయము, రెండవది మార్గావరణము. దీనిని తంత్రకారులే "వాయోర్ధాతుక్షయాత్కోపోమార్గస్యావరణేన చ" అని యాక్రిందనే చెప్పెదరు.

అర్దితవాతలక్షణములు.

మూ. అతివృద్ధశ్శరీరార్ధం ఏకం వాయుః ప్రపద్యతే,
యదా తదోపశోష్యాఽసృక్ బాహుం పాదం చ జాను చ. 38
తస్మిన్ సఙ్కోచయత్యర్ధే ముఖం జిహ్మం కరోతి చ,
వక్రీకరోతి నాసాభ్రూలలాటాక్షిహనూస్తథా. 39
తతో వక్రం వ్రజత్యాస్యే భోజనం వక్రనాసికమ్,
స్తబ్ధం నేత్రం కథయతః క్షవథుశ్చ నిగృహ్యతే. 40
దీనా జిహ్మా సముత్క్షిప్తా కలా (అబలా, అఫలా) సజ్జతి చాస్య వాక్,
దన్తాశ్చలన్తి బాధ్యేతే శ్రవణౌ, భిద్యతే స్వరః. 41
పాద (పార్శ్వ) హస్తాక్షిజఙ్ఘోరుశఙ్ఖశ్రవణగణ్డరుక్,
అర్ధే తస్మిన్ ముఖార్ధే వా కేవలే స్యాత్ తదర్దితమ్ 42

వ్యా. వాతము మిక్కిలి యుత్కటముగ వృద్ధినొంది ప్రకుపితమై శరీరమునందలి కుడియెడమభాగములలో నొకభాగమున జేరినపుడు ఆభాగమునందలి రక్తమును చక్కగ వ్యాపింపనీయక శోషింపజేసి యాపార్శ్వమున హస్తమును పాదమును తొడను సంకోచింపజేయును. ఆభాగమునందు ముఖమునం దర్ధభాగము వంకరగ నీడ్చుకొనును. మరియు నాభాగమునందే ముక్కును కనుబొమను నుదుటిని కంటిని దవుడనుకూడ వంకరగ జేయును. అట్టియెడ నోట నుంచుకొనబడిన యాహారమును ముక్కు వంకరగనై నోరు ఒకప్రక్క కొరగియుండుటవలన నొకప్రక్కగనే గ్రహించును. అట్టి యాహారంబును నాప్రక్కనుండియే నోట ప్రవేశించును. మాటలాడునప్పుడును ముక్కు వంకరగనుండును. కన్ను స్తంభించియుండును. తుమ్ము సరళముగ వెడలక యడ్డుపడి నిలచును. మాటలాడునపుడు మాట దీనమై (గంభీరత లేక) వక్రమై త్వరితముగల్గి అవ్యక్తముగ కొతుకుకల్గి వెడలును. దంతములు కదలును. చెవులరెంటియందును నొప్పి కల్గును. కంఠస్వరము మారును. వాతము వ్యాపించిన భాగమునందలి కాళ్లు చేతులయందును, కంటియందును, పిక్కయందును, తొడయందును, కణతయందును, చెవియందును, గడ్డమునందును నొప్పికల్గును. లేక ముఖమాత్రమునం దర్ధభాగమున నొప్పి కల్గును. ఇయ్యది అర్దితవాతమని చెప్పబడును.

ఈవ్యాధి శరీరమునం దర్ధభాగమున వ్యాపించునదియైనను వ్యాధిప్రభావమునం జేసి రెండుచెవులయందును నొప్పికల్గునని "బాధ్యేతే శ్రవణౌ" అని చెప్పబడినది. మరియు నియ్యాది శరీరమునం దర్ధభాగమున సంభవించుటం జేసి అర్ధాంగవాతమునకు సమానముగనున్నను, ఈవ్యాధియందు పైజెప్పబడినలక్షణములన్నియు పూర్తిగ నుండుననియు, అర్ధాంగవాతమున కొన్నిలక్షణములు మాత్ర ముండుననియు భేదము నెరుంగునది. మరియు నర్ధాంగవాతమున బాధ యెడలేక నిరంతరముగ నుండును. అర్దితవాతమున వాతవేగకాలమున మాత్ర మప్పుడప్పుడు బాధకల్గును.

మరియు నీవ్యాధిని చెప్పునపుడు వాగ్భటులు "జత్రోరూర్ధ్వం రుజా తీవ్రా శరీరార్ధేఽథ రేఽపి వా, తమాహురర్దితం కేచిత్ ఏకాయామమథాఽపరే" (అ. హృ. ని. అ. ౧౫. శ్లో. ౩౬) అని చెప్పిరి. ఈవాక్యమునుబట్టి ఈవ్యాధి కంఠమునకు పైభాగమునందైనను, శరీరమునందునిలువున సగభాగమునందైనను, లేక బొడ్డుకు క్రింది భాగమునందైనను తీవ్రమైన బాధకల్గుననియు, ఈయర్దితవాతమును ఏకాయామమని కొందరు చెప్పెదరనియు తెలిసెడి. మరియు నీవ్యాధివిశేషలక్షణములు కొన్ని మాధవనిదానవ్యాఖ్యానమున మాచే వివరింపబడినవి. వాని నచ్చట గమనించునది.

## అంతరాయామలక్షణము.

మూ. మన్యే సంశ్రిత్య వాతోఽన్తః యదా నాడీః ప్రపద్యతే,
మన్యాస్తమ్భం తదా కుర్యాత్ అన్తరాయామసంజ్ఞితమ్. 43
అన్తరాయమ్యతే గ్రీవా మన్యా చ స్తభ్యతే భృశమ్,
దన్తానాం దంశనం లాలా పృష్ఠాక్షేపః శిరోగ్రహః
(పృష్ఠాయామః శిరోగ్రహః.) 44
జృమ్భా వదనసఙ్గశ్చాఽస్యాన్తరాయామలక్షణమ్,
(ఇత్యుక్తస్త్వన్తరాయామో బహిరాయామ ఉచ్యతే). 45

వ్యా. మెడకు వెనుకప్రక్క నిరుపార్శ్వములనుండు పెద్దనరములు మన్యాశబ్దముచే జెప్పబడును. అట్టి నరములను వాతము చేరి ప్రకోపమునొంది శరీరమునందలి నాడులలో వ్యాపించినపుడు మన్యలను స్తంభింపజేయును. దానంజేసి మెడను లోప్రక్కకు లాగి వంచి మెడనరములను స్తంభింపజేయును. అట్టియెడ పండ్లు పటపట కొరుకును. నోట జొల్లుకారును. వీపు ముందుకు వంగును. తల నొప్పిపుట్టును. ఒడలివిరుపులును ఆవలింతలును కల్గును. నోరు పట్టుపట్టినట్లుండును. ఇది అంతరాయామమను

మన్యాస్తంభము (ఇచ్చట కొందరు మన్యాస్తంభము అంతరాయామమునకు పూర్వరూప మని చెప్పెదరు.)

## బాహ్యాయామలక్షణము.

మూ. పృష్ఠమన్యాశ్రితాః బాహ్యాః శోషయిత్వా సిరాః బలీ,
వాయుః కుర్యాద్ధనుస్తమ్భం బహిరాయామసంజ్ఞకమ్. 46
చాపవన్నామ్యమానస్య పృష్ఠతో నీయతే శిరః,
ఉర ఉత్క్షిప్యతే మన్యాస్తబ్ధా గ్రీవాఽవమృద్యతే. 47
దన్తానాం దంశనం జృమ్భా లాలాస్రావశ్చ వాగ్గ్రహః,
జాతవేగో నిహన్త్యేషః వైకల్యం వా ప్రయచ్ఛతి. 48

వ్యా. వాతము మిక్కిలి బలిష్ఠమై వీపున వ్యాపించియుండు మెడనరముల యందును వీపునందలి బాహ్యమున వ్యాపించియుండు సిరలయందును జేరి, వానిని శోషింపజేసి బహిరాయామమను మన్యాస్తంభమును కల్గించును. ఈవ్యాధియందు వీపు ధనుస్సువలె వెనుకప్రక్కకు వంగును. శిరంబును వెనుక వీపుప్రక్క కీడువబడును. రొమ్ము పైకి యుబుకును. మెడనరములు ముందుప్రక్కకు వంగక స్తంభించును. మెడ స్తంభించి నొచ్చును. పండ్లను కొరుకును. ఒడలివిరుపులును ఆవలింతలును కల్గును. నోట జొల్లుకారుచు మాట సరళముగ వెడలక పట్టినట్లుండును. ఈవ్యాధి మిక్కిలి తీవ్రమై రోగిని చంపును. లేక అవయవములకు వైకల్యమునైన కల్గించును.

ఇచ్చట సిరాశబ్ద ముపలక్షణము కావున వీపునందలి సిరలను స్నాయువులను కండరములను కూడ శోషింపజేసి వాతము వెనుకప్రక్కకు లాగి ధనుస్సువలె వంచునని యర్థము. ఈవిషయము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"మహాహేతుః బలీ వాయుః సిరాస్సస్నాయుకణ్డరాః. మన్యాపృష్ఠాశ్రితాః బాహ్యాః సంశోష్యాయామ యేద్బహిః."

మరియు వాగ్భటాచార్యులు—'దన్తేష్వాస్యే చ వైవర్ణ్యం ప్రస్వేదస్స్రస్త గాత్రతా, బాహ్యాయామం ధనుస్తమ్భం బ్రువతే వేగినం చ తమ్" (అ. హృ. ని. అ. ౧౫. శ్లో. ౨౬) అని చెప్పిరి. (దంతములయందును నోటియందును వైవర్ణ్యంబును, చెమటయు కల్గి, అవయవములు శిథిలములై యుండుననియు, ఈవ్యాధి శరీరము వెను ప్రక్కకు వంగుటంజేసి బాహ్యాయామమనియు, విల్లువలె వంగి స్తంభించుటంజేసి ధనుస్తంభమనియు, మిక్కిలి వేగముగ బాధించుటంజేసి. వేగియనియు చెప్పబడును.)

### హనుగ్రహవాతలక్షణము.

మూ. హనుమూలే స్థితో బన్ధాత్ సంస్రయత్యనిలో హనూ,
వివృతాస్యత్వమథ వా కుర్యాత్ స్తమ్భమవేదనమ్. 49
హనుగ్రహం చ సంస్తభ్య హనుం (నూ) సంవృతవక్త్రతామ్,

వ్యా. వాతము ప్రకోపించి తాలువులకీళ్లయందు జేరి తాలువులను వాని సంధినుండి సడలించి నోరు తెరచికొనునట్లు చేసి మూయుటకు వలనుపడక స్తంభింప జేయును. లేక మూసికొనియున్న నోరును తెరచుటకు వీలుపడనీయక కీళ్లను స్తంభింప జేయును. ఈరెండువిధములగు వ్యాధిని హనుస్తంభమని చెప్పబడును.

### ఆక్షేపకవాతలక్షణము.

మూ. ముహురాక్షిపతి క్రుద్ధో గాత్రాణ్యాక్షేపకోఽనిలః. 50
పాణిపాదం చ సంశోష్య సిరాస్స్నాయుకణ్డరాః,

వ్యా. వాతము ప్రకోపమునొంది శరీరమునందలి ధమనులలోను స్నాయుకండరములలోను జేరి అవయవముల నన్నిటిని మాటిమాటికి కదలించును. హస్తపాదముల శోషింపజేయును. ఇయ్యది యాక్షేపకవాతమని చెప్పబడును. (ఇయ్యది పలుమారు అవయవముల నాక్రమించుటం జేసి యాక్షేపకమని యన్వర్థముగ జెప్పబడును.)

### దండకవాతలక్షణము.

మూ. పాణిపాదశిరఃపృష్ఠశ్రోణీః స్తభ్నాతి మారుతః. 51
దణ్డవత్ స్తబ్ధగాత్రస్య దణ్డకస్సోఽనుపక్రమః,

వ్యా. పైజెప్పినరీతిగ సిరాస్నాయుకండరముల జేరినవాతము మిక్కిలి ప్రకోపమునొంది కాళ్లను చేతులను శిరస్సును వీపును పిరుదులను దండమువలె కదలనీయక స్తంభింప జేయును. ఇయ్యది దండకవాతమని చెప్పబడును. ఇయ్యది యసాధ్యము.

### అర్దితాదివాతములకు వేగనియమము.

మూ. స్వస్థస్స్యాదర్దితాద్యానాం ముహుర్వేగే గతే గతే. 52
పీడ్యతే పీడనైస్తైస్తైః భిషగేతాన్ వివర్జయేత్,

వ్యా. పైజెప్పబడిన అర్దితవాతము మొదలుజేసి దండకవాతమువరకుంగల వాతవ్యాధులయందు అప్పుడప్పుడును అవస్థానుసారముగ వేగము గల్గుచు నివర్తించుచుండును. అట్టియెడ వేగము లేనప్పుడు బాధ నివర్తించి స్వస్థత నొందును. అటుగాక

బాధాజనకములగు నాయాకారణములచేత నెడలేక బాధకల్గునప్పుడు అవియన్నియు నసాధ్యములగును. కావున వైద్యవరుడు వానిని చికిత్స్యమాని విడువందగును.

(అర్దిత-హనుస్తంభాది వాతవ్యాధులయందు వాతము పీడాకరములగు కొన్ని కారణములు కల్గినప్పుడు మాత్రము వేగము జూపి లేనప్పుడు శమించియున్నయెడ నవి యన్నియు నర్దితవాతభేదములో నంతర్భూతములనియు, అటుగాక నిరంతరము బాధించు చున్నయెడ హనుస్తంభాదినామాంతరములచే జెప్పబడుననియు నవస్థాభేదమునుబట్టి నియమము నెరుంగునది.

## సర్వాంగ-ఏకాంగవాతలక్షణములు.

మూ. హత్వైకం మారుతః పక్షం దక్షిణం వామమేవ వా. 53
కుర్యాచ్చేష్టానివృత్తిం హి రుజం వాక్స్తమ్భ(సంగ)మేవ చ,
గృహీత్వార్ధం శరీరస్య సిరాః స్నాయూర్విశోష్య చ. 54
పాదం సఙ్కోచయత్యేకం హస్తం వా తోదశూలకృత్,
ఏకాఙ్గరోగం తం విద్యాత్ సర్వాఙ్గం సర్వదేహజమ్. 55
(పవనాత్ కుశలో భిషక్.
సర్వాఙ్గరోగం తద్వచ్చ సర్వదేహానుగేऽనిలే)

వ్యా. వాతము ప్రకోపమునొంది శరీరమునందు అర్ధభాగమునందలి కుడిప్రక్కనైనను ఎడమప్రక్కనైనను సగభాగమున వ్యాపించి యాభాగమునందలి సిరలను స్నాయువులను శోషింపజేసి చలనాద్యాంగికవ్యాపారముల జేయ వలనుపడకుండునట్లు నిశ్చేష్టముగ జేయును. లేక తీవ్రమైన నొప్పి పోటు మున్నగుబాధల నాభాగమున గల్గించును. ఆపార్శ్వమున నందలి హస్తపాదములను సంకోచింపచేయును. (ముడుచుకొనజేయును). నొప్పియు పోటును కల్గును. ఇయ్యది యేకాంగవాతమని చెప్పబడును. (ఈవ్యాధిని వాగ్భటాచార్యులు "ఏకాఙ్గరోగంతం కేచిత్ అన్యే పక్షవధం విదుః" (అ. హృ. ని. అ. ౧౫. శ్లో. ౪౦) అనువాక్యముచే ఏకాంగవాతమనియు పక్షవధ మనియు జెప్పిరి.)

మరియు పైజెప్పినవిధముగ ప్రకోపించినవాతము శరీరమునందెల్ల పూర్తిగ వ్యాపించి సిరాస్నాయువుల శోషింపజేసి శరీరమునందలి సంధిబంధముల నన్నిటిని కదలించి అవయవములనన్నిటిని నిశ్చేష్టములుగ జేసిన నయ్యది సర్వాంగవాత మనబడును.

### గృధ్రసీవాతలక్షణము.

మూ. స్ఫిక్పూర్వా కటిపృష్ఠోరుజానుజఙ్ఘాపదం క్రమాత్,
గృధ్రసీ స్తమ్భరుక్తోదైః గృహ్ణాతి స్పన్దతే ముహుః. 56
వాతాత్ వాతకఫాత్తన్ద్రాగౌరవారోచకాన్వితా,

వ్యా. వాతము ప్రకోపమునొంది తొలుత పిరుదులకు పైభాగమునను, పిమ్మట నడుము వీపు తొడలు మోకాళ్లు పిక్కలు పాదములు అను నీయవయవముల యందును వరుసగ వ్యాపించుచు, స్తంభము (స్తంభించుట)ను నొప్పిని పోటును వరుసగ కల్గించును. అట్టియెడ మాటిమాటికిని పైజెప్పినస్థలములయందు అదరుపాటు కల్గును. ఈలక్షణములు కల్గినది కేవలము వాతముచేతనే కల్గినగృధ్రసీవాతవ్యాధి. మరియు నయ్యది కఫముతోగూడిన వాతముచే కల్గినయెడ పైజెప్పినలక్షణములతోకూడ కునికిపాటును గురుత్వంబును అరోచకమును కల్గును.

అష్టోదరీయాధ్యాయమున "ద్వే గృధ్రస్యామితి:—వాతాత్, వాతకఫాచ్చ" (సూ. అ. ౧౯.) అని వాత-వాతకఫభేదములచే గృధ్రసీవాతము రెండువిధములని నిర్దేశింపబడినది. ఆరెండుభేదములకు నిచ్చట లక్షణములు వేరువేర వివరింపబడినవి.

మరియు వాగ్భటాచార్యులు ఈవ్యాధిలక్షణము నిట్లు చెప్పిరి:—"పార్ష్ణిప్రత్యం గుళీనాం యాకణ్డరా మారుతార్దితా, సక్థ్యుత్క్షేపం నిగృహ్ణాతి గృధ్రసీం తాం ప్రచక్షతే." (అ. హృ. ని. అ. ౧౫) చీలమండ కభిముఖముగ వ్యాపించియుండు అంగుళుల కండరములలో వాతముచేరి నొప్పికల్గించి తొడలను పైకెత్తనీయక నిరోధించినచో నయ్యది గృధ్రసీవాతమని యర్థము. ఈతంత్రకారుడు చెప్పిన పైలక్షణములకును దీనికి భేదము కన్పట్టుచున్నది.

### ఖల్లీవాతలక్షణము.

మూ. ఖల్లీ తు పాదజఙ్ఘోరుకరమూలావమోటనీ 57

వ్యా. వాతము ప్రకోపించి పాదములయందును పిక్కలయందును తొడల యందును మణికట్టునందును వ్యాపించి (యచ్చటి సిరల బంధించి) చలనాదివ్యాపారముల జేయ నిరోధించిన నయ్యది ఖల్లీవాతమని చెప్పబడును. (గృధ్రసీవాతముననే బాధ మిగుల తీవ్రముగ నున్న నదియే ఖల్లీవాతమని వాగ్భటులు చెప్పిరి )

### అనుక్తవాతరోగసంగ్రహణము.

మూ. స్థానానామనురూపైశ్చ లిఙ్గైశ్శేషాన్వినిర్దిశేత్,

వ్యా. ఈవాతరోగములుదక్క తక్కిన నఖభేదాదివాతరోగములను ఆయాస్థానముల కనురూపములైన చిహ్నములబట్టి ఆయావ్యాధిలక్షణముల నిర్ణయింపదగును.

మహారోగాధ్యాయమునందు "తత్రాదౌ వాతవికారా ననువ్యాఖ్యాస్యామః, తద్యథా—నఖభేదశ్చ, విపాదికా చ, పాదశూలశ్చ......అనవస్థితత్వం చేతి అశీతి ర్వాతవికారాః" (సూ. అ. ౨౦. సూ. ౧౪) అని యెనుబదివాతరోగములు క్లృప్తముగ నిర్దేశింపబడినవి. అందు కొన్ని నామాంతరములచే నిచ్చట జూపుచు వానిలక్షణములును జెప్పబడినవి. ఇచ్చట చెప్పబడిన వాతరోగములుదక్క తక్కిన నఖభేద-పాదశూలాది వ్యాధులలక్షణములను ఆయాపదములయర్థమునుబట్టి (గోళ్లు పగిలినది నఖభేదము, పాదములయందు కల్గుశూల-పాదశూలము, ఇవి మున్నగునర్థమున కనుగుణముగ) ఆయారోగ లక్షణముల నిర్ణయింపనగునని "స్థానానామనురూపైశ్చ లిఙ్గైః" అని సంగ్రహముగ జెప్పబడినదని యెరుంగునది.

మూ. సర్వేష్వేతేషు సంసర్గం పిత్తాద్యైరుపలక్షయేత్. 58

వ్యా. పైజెప్పబడిన వాతవ్యాధులయం దన్నిటియందును పిత్తము, కఫము, రక్తము, పురీషము, మున్నగుదోషదూష్యసంసర్గమును వానివానిలక్షణములబట్టి యూహించునది.

### వాతప్రకోపమునకు ముఖ్యకారణద్వయము.

మూ. వాయోర్ధాతుక్షయాత్కోపః మార్గస్యావరణేన చ (వా),
వాతపిత్తకఫా దేహే సర్వస్రోతోఽనుసారిణః. 59
వాయురేవ హి సూక్ష్మత్వాత్ ద్వయోస్తత్రాప్యుదీరణః,
కుపితస్తౌ సముద్ధూయ తత్ర తత్ర క్షిపన్ గదాన్. 60
కరోత్యావృతమార్గత్వాత్ రసాదీంశ్చోపశోషయేత్,

వ్యా. శరీరమునందలి సారరూపమైన ధాతువులు క్షీణించుటవలనను, వాత సంచారమార్గములను పిత్తకఫాదు లడ్డగించుటచేతను వాతమునకు ప్రకోపము కల్గును. మరియు వాత-పిత్త-కఫములు మూడును శరీరమునందలి స్రోతస్సులం దన్నిటియందును అనుసరించియే యుండును. అందును వాతము మిగుల సూక్ష్మరూపమగుటంజేసి తక్కిన పిత్తకఫములరెంటిని ప్రేరేపించును. (కావున వాతము స్వతంత్రమనియు, పిత్తకఫములు వాతమునకు అధీనములనియు నర్థము). అట్టి స్వతంత్రశక్తి కల్గి ప్రధానమైన వాతము

ప్రకోపమునొందినపుడు వాతపిత్తము లనువానిచే తనసంచారమార్గము లడ్డగింపబడి యున్నను పిత్తకఫములను నతిక్రమించి ఆయాస్థలములకు నిరసించుచు రసాదిధాతువుల శోషింపచేయుచు నాయారోగముల గల్గించును.

## పిత్తావృతవాతలక్షణము.

మూ. లిఙ్గం పిత్తాఽఽవృతే దాహః తృష్ణా శూలం భ్రమ స్తమః (క్లమః)
కట్వమ్లలవణోష్ణైశ్చ విదాహశ్శీతకామితా,

వ్యా. వాతము పిత్తముచే నావరింపబడినయెడ తాపంబును దప్పియు శూల నొప్పియు భ్రమంబును కల్గును. చీకటిలో నున్నట్లు మైకము గ్రమ్మును. లేక బడలిక కల్గును. కారము పులుపు లవణము ఉష్ణవీర్యములును నగుపదార్థముల సేవించుటచే తాప మధికమగును. విశేషముగ చల్లదనమును గోరును.

## కఫావృతవాతలక్షణము.

మూ. శైత్యగౌరవశూలాని కట్వాద్యుపశయోఽధికమ్. 62
లఙ్ఘనాయాసరూక్షోష్ణకామితా చ కఫావృతే,

వ్యా. వాతము కఫముచే నావరింపబడినప్పుడు శరీరమున చల్లదనంబును భారంబును శూలంబును కల్గును. కటురసము మున్నగు కఫహరములచే శమించును. లంకణ మును, శరీరమున కాయాసమును కల్గించుపనులను రూక్షములను ఉష్ణపదార్థములను విశేషముగ కోరును.

## రక్తావృతవాతలక్షణము.

మూ. రక్తావృతే సదాహా ర్తిః త్వఙ్మాంసాఽన్తరజే భృశమ్. 63
భవేత్సరాగః శ్వయథుః జాయన్తే మణ్డలాని చ,

వ్యా. వాతము రక్తముచే నావరింపబడినప్పుడు చర్మమాంసములకు నడుమ మంటయు నొప్పియు కల్గును. ఎఱ్ఱనిరంగుతో గూడిన వాపుకల్గును. మండలాకారములైన పొడలు కల్గును.

## మాంసావృతవాతలక్షణము.

మూ. కఠినాశ్చ వివర్ణాశ్చ పిడకాశ్శ్వయథు స్తథా. 64
హర్షః పిపీలికానాం చ సఞ్చార ఇవ మాంసగే,

వ్యా. వాతము మాంసముచే నావరింపబడినప్పుడు శరీరమున కఠినంబులును వివర్ణంబును నగుపిటికలును వాపును కల్గును. హర్షము(గగుర్పాటు) కలుగును. శరీరముపై చీమలు సంచరించునట్లు గులగుల యనుబాధ కల్గును. (రక్తమాంసాదిగతవాతలక్షణములు "రుజాస్తీవ్రాః సస్తాపాః......అసృగతేఽనిలే" (శ్లో-3౧) ఇదిమున్నగు వాక్యములచే జెప్పబడినను ఇచ్చట రక్తమాంసాద్యావృతవాతలక్షణములు చెప్పబడినవి, కావున పరస్పరభేదము నెరుంగునది.)

మేదోవృతవాతలక్షణము.

మూ. చలస్స్నిగ్ధో మృదుశ్శీతః శోఫోఽఙ్గేష్వరుచి స్తథా. 65
ఆఢ్యవాత ఇతి జ్ఞేయః స కృచ్ఛ్రో మేదసా వృతః,

వ్యా. వాతము మేదస్సుచే నావరింపబడినప్పుడు శరీరావయవములపై చంచలంబును స్నిగ్ధంబును మృదువును శీతంబును నగుశోఫము కలుగును. నోటి కరుచికల్గును. ఇయ్యది ఆఢ్యవాతమని చెప్పబడును. మేదస్సుచే నావృతమైన యీవాతము మిగుల కృచ్ఛ్రసాధ్యముగ నుండును.

అస్థ్యావృతవాతలక్షణము.

మూ. స్పర్శమస్థ్నాఽఽవృతే తూష్ణం పీడనం చాభినన్దతి. 66
సంభజ్యతే సీదతి చ సూచీభిరివ తుద్యతే,

వ్యా. వాతము అస్థిచే నావరింపబడినప్పుడు ఉష్ణస్పర్శమును పిసికించుకొనుటను కోరుచుండును. పగులదీయునట్లు బాధయు కల్గును. శరీరము కృశించును. సూదుల గ్రుచ్చినవిధముగ పోటుపుట్టును.

మజ్జావృతవాతలక్షణము.

మూ. మజ్జాఽఽవృతే వినామస్స్యాత్ (వినమతి)జృమ్భణం పరివేష్టనమ్.
శూలన్తు పీడ్యమానే చ పాణిభ్యాం లభతే సుఖం,

వ్యా. వాతము మజ్జచే నావరింపబడినప్పుడు అస్థులు వంగును. ఆవలింతలు వెడలును. అవయవములు మెలిపెట్టినవిధముగ బాధకల్గును. శూలమున గ్రుమ్మినట్లు పోటు కల్గును. చేతులతో పిసికినయెడ బాధ కొంచెము సుఖముగ నుండును.

శుక్రావృత-అన్నావృతవాతలక్షణములు.

మూ. శుక్రావేగోఽతివేగో వా నిష్ఫలత్వం చ శుక్రగే. 68
భుక్తే కుక్షౌ చ రుక్ జీర్ణే శామ్యత్యన్నావృతేఽనిలే,

వ్యా॥ వాతము శుక్రముచే నావరింపబడినయెడ శుక్రవేగము కల్గదు. (శుక్రము బైటవెడలదు) లేక శుక్రము అధికముగ పలుమారు వెడలును. అట్టిశుక్రము గర్భమును గల్గింప సమర్థము కానోపదు.

అన్నముచే నావరింపబడినప్పుడు భుజించినవెంటనే కడుపులో నొప్పికల్గును. ఆహారము జీర్ణమైనప్పుడు నొప్పి శమించును.

### మూత్ర-పురీషావృతవాతలక్షణములు.

మూ॥ మూత్రాఽప్రవృత్తిరాధ్మానం వస్తౌ మూత్రావృతేఽనిలే. 69
వర్చసోఽతివిబన్ధోఽధః స్వే స్థానే పరికృన్తతి,
వ్రజత్యాశు జరాం స్నేహః భుక్తే చానహ్యతే నరః. 70
చిరాత్పీడితమన్నేన దుఃఖం శుష్కం శకృత్ సృజేత్,
శ్రోణీవంక్షణపృష్ఠేషు రుగ్విలోమశ్చ మారుతః. 71
అస్వస్థం హృదయం చైవ వర్చసా త్వావృతేఽనిలే,

వ్యా॥ వాతము మూత్రముచే నావరింపబడినప్పుడు మూత్రము సరళముగ వెడలదు. వస్తి (మూత్రపుతిత్తి) యుబ్బును. మరియు పురీషముచే వాత మావరింపబడినప్పుడు పురీషము బైటవెడలక బద్ధగించును. వాతమునకు స్వస్థానమైన పక్వాశయమునందు కత్తెరచే కత్తిరింపబడినట్లు బాధకల్గును. ఆహారమునందలి స్నేహభాగము శీఘ్రముగ జీర్ణమగును. భుజించినవెంటనే కడుపుబ్బరించును. ఆహారముచే పీడింపబడినపురీషము శుష్కించి చిరకాలమునకు మిగుల కష్టముచే బైటవెడలును. పిరుదులయందును గజ్జలయందును వీపునందును నొప్పిపుట్టును. వాతము విలోమముగ సంచరించును. హృదయమున స్వస్థతలేక బాధకల్గును.

### వాతవ్యాధి సాధ్యాఽసాధ్యవిభాగము.

మూ॥ సన్ధిచ్యుతిః(గాత్రశ్లేషః)హనుస్తమ్భః కుఞ్చనం కుబ్జతాఽర్దితః. 72
పక్షాఘాతోఽఙ్గసంశోషః పఙ్గుత్వం ఖుడవాతతా,
స్తమ్భనం చాఢ్యవాతశ్చ రోగా మజ్జాస్థిగాశ్చ యే. 73
ఏతే స్థానస్య గామ్భీర్యాత్ యత్నాత్సిద్ధ్యన్తి వా న వా,
నవాన్ బలవతస్త్వేతాన్ సాధయేన్నిరుపద్రవాన్. 74

వ్యా॥ సంధిచ్యుతి (కీళ్లుసడలిన) వాతరోగము, హనుస్తంభము, సిరాకుంచనము (సిరలకు సంకోచమును కల్గించువాతము), కుబ్జవాతము (గుజ్జరితనము), అర్దితవాతము,

పక్షఘాతము, అంగసంశోషము (అవయవముల శుష్కింపజేయువాతము), పంగ
వాతము, ఖుడవాతము (చీలమండను కదలనీయక జేయువాతము), అవయవము
స్తంభింపజేయు (ఆక్షేపక) వాతము, ఆఢ్యవాతము, ఇవిగాక మజ్జయందును అ
యందును నిరోధింపబడుటచే గల్గిన వాతరోగములును, ఈరోగములు సంభవించుస్థా
ములు మిగుల శరీరమునందలి లోభాగమున జనించునవి యగుటంజేసి మిక్కిలి పూనికతో
(జ్ఞానవంతుడగు వైద్యుడు) చికిత్సజేసినచో నొకసమయమున నివర్తించును. ఒకవే
నసాధ్యముగ నగును. మరియు నీవ్యాధులు బలిష్ఠునకు సంభవించి ప్రారంభదశయం
దేయుపద్రవములు సంభవించక మునుపు చికిత్సజేసినచో నొకవేళ నివర్తించును. (అట
గాక బలహీనునకు జనించి ప్రాతబడి యుపద్రవములతో కూడియుండునెడ బొత్తుగ
సాధ్యములు కావని భావము.)

ఇచ్చట చెప్పబడిన వాతవ్యాధులలో కొన్నిలక్షణముల వివరింపబడనివి కలవు
వానిని ఆయానామస్థానాదిభేదములచే తెలియవలెనని తంత్రకారులు "స్థానానామన
రూపైశ్చ లిఙ్గైః శేషాన్ వినిర్దిశేత్" అని యతిదేశించిరి కావున స్థానాదిభేదములబట్టి
నిర్ణయించుకొనునది. మరియు నీవాతవ్యాధ్యుపద్రవములు ఈయధ్యాయాంతమున
"హృద్రోగో విద్రధిః......ముపేక్షణాత్" అని చెప్పబడును. ఇత్తెరంగున నుద్దేశాను
సారముగ స్థానభేదముచే గల్గు వాతవ్యాధులకును, మిక్కిలి బాధాకరములగు బలిష్ఠమ
లైన యర్దితాదివాతవ్యాధులకును, పిత్తాద్యావరణవాతాదులకు వేరువేరుగ లక్షణాదుల
వివరింపబడినవి.)

## వాతవ్యాధిసామాన్యచికిత్స, అందు స్నేహస్వేదవిధులు.

మూ. క్రియామతఃపరం సిద్ధాం వాతరోగాఽపహాం శృణు,
కేవలం నిరుపస్తమ్భమాదౌ స్నేహైరుపాచరేత్. 75
వాయుం సర్పిర్వసాతైలమజ్జపానైః నరం తతః,
స్నేహక్లాన్తం సమాశ్వాస్య పయోభిస్స్నేహయేత్పునః. 76
యూషైః గ్రామ్యాఽమ్బుజాఽఽనూపరసైర్వా స్నేహసంయుతైః
పాయసైః కృసరైః సామ్లలవణైరనువాసనైః. 77
నావనైస్తర్పణైశ్చాన్నైః (న్యైః) సుస్నిగ్ధం స్వేదయేత్తతః,
స్వభ్యక్తం స్నేహసంయుక్తైః నాడీప్రస్తరసఙ్కరైః. 78
తథాన్యైర్వివిధైః స్వేదైః యథాయోగముపాచరేత్,

వ్యా. వాతరోగనిదానలక్షణాదులు పైనివివరింపబడినవి; పిదప నట్టివాతరోగహరమగు చికిత్సావిధాన మీక్రింద వివరింపబడును:—

ఇతరదోషసంబంధము లేకయు పిత్తకఫాదులచే నావరింపబడక శుద్ధముగ నుండునదియునగు కేవల వాతమునందు స్నేహప్రాయములగు చికిత్సలచే నుపచరించవలెను:— అందు తొలుత ఘృతము, వస, తైలము, మజ్జ, అనుస్నేహములను త్రాగించవలెను. అట్టి స్నేహపానముచే బడలియున్నవానికి కొంచెము సేదదీర్చికొనినపిదప నావుపాలను త్రాగించుటచే స్నేహనమును చేయించవలెను. దానివలన కొంచెము బలము కల్గినపిదప యూషములను గ్రామముల నివసించుజంతువులయొక్కయు నీటబుట్టినజంతువులయొక్కయు జలప్రాంతముననుండు జంతువులయొక్కయు మాంసరసములను ఘృతమును కలిపి యుపయోగింపవలెను. పాయసము, అమ్లలవణములతో గూడిన కృసరము, అనువాసనవస్తి, నస్యములు, ధాతువుల నాప్యాయతనందించునన్నములు, వీనిని యథోచితముగ నుపయోగించి స్నిగ్ధకోష్ఠుడై బలముకల్గిన యారోగికి స్నేహములచే శరీరమున కభ్యంగమును చేయించి, స్నేహద్రవ్యములతో గూడిన నాడీస్వేదము చేతను ప్రస్తరస్వేదము చేతను సంకరస్వేదముచేతను, ఇతరములగు కుటీస్వేదము భూస్వేదము మున్నగు స్వేదముల చేతను స్వేదవిధ్యుక్తప్రకారము స్వేదనముచేసి యుపచరించవలెను.

(ఇచ్చట వాతహరములలో తైలము ముఖ్యమైనదియైనను ఘృతము పుట్టుక మొదలు సాత్మ్యమై యుండుటంజేసి నిరుపాధికముగ నుండునని ప్రధానముగ జేసి "సర్పిర్వసామజ్జపానైః" అని తొలుతనిర్దేశింపబడినది స్నేహస్వేదవిధులను సూత్రస్థానమునందలి పదుమూడుపదునాలుగధ్యాయముల జూచునది.)

### స్నేహ-స్వేదకర్మలచే గల్గుగుణములు.

మూ. స్నేహోక్తం స్విన్నమఙ్గం తు వక్రం స్తబ్ధమథాపి వా. 79
శనైర్నామయితుం శక్యం యథేష్టం శుష్కదారువత్,

వ్యా. వాతప్రకోపమునంజేసి వక్రముగనైనను స్తంభించియైన నుండునవయవముకు స్నేహాభ్యంగనముచేసి స్వేదవిధిచే స్విన్నముగ జేసినయెడ నాశరీరమును (ఎండిన కొయ్యనువలె) మెలమెల్లగ తనకిచ్చవచ్చినట్టులు వంచుటకు యుక్తముగ నుండును. (లోకమున ఎండి వంకరటెంకరగ నుండుకఱ్ఱలను ఆముదమును బూసి నిప్పున కాచినయెడ మెత్తబడి వంకరను సరిగదిద్దుటకు వంగును. అత్తెరంగుననే స్నేహమును పానముచేయుట చేతను అభ్యంజనముచేయుటచేతను బాహ్యాంతర్భాగముల స్నిగ్ధమైన శరీరమునకు స్వేద

విధిజేసిన శరీరంబును కోష్ఠంబును మెత్తబడి, వాతప్రకోపమునగల్గిన వక్రత్వస్తబ్ధత్వములు నివర్తించి యథాస్థితి నుండునని భావము.)

స్వేదనగుణము.

మూ. హర్షతోదరుజాయామశోథస్తమ్భగ్రహాదయః. 80
స్విన్నస్యాశు ప్రశామ్యన్తి మార్దవం చోపజాయతే,

వ్యా. వాతవ్యాధిపీడితునకు స్వేదకర్మనుచేసి చెమటబుట్టించినచో వాతప్రకోపమున కల్గినహర్షము, తోదము(సూదుల బొడిచినవిధముగ గల్గుపోటు),నొప్పి, లాగిపట్టినవిధముగ గల్గుబాధ, శోథము, స్తంభము, బిగదీసి కీళ్లు కదలకుండుట ఇవి మున్నగుబాధలు శమించి శరీరము మృదువగును.

స్నేహగుణము.

మూ. స్నేహశ్చ ధాతూన్ సంశుష్కాన్ పుష్ణాత్యాశు ప్రయోజితః 81
బలమగ్నిబలం పుష్టిం ప్రాణాంశ్చాప్యభివర్ధయేత్,

వ్యా. పానాభ్యంగనములకు స్నేహము నుపయోగించినచో నయ్యది శుష్కించిన రసరక్తాదిధాతువులకు పుష్టిని కల్గించును. శరీరబలమును, అగ్నిబలమును, శరీరపుష్టిని కల్గించి వృద్ధినందించి, ప్రాణములకు సుఖమును కల్గించి పనులయందు సామర్థ్యమును కల్గించును.

స్నేహస్వేదవిధులచే వాతహరత్వము.

మూ. అసకృత్తం పునస్స్నేహైః స్వేదైశ్చాప్యుపపాదయేత్. 82
తథా స్నేహమృదౌ కోష్ఠే న తిష్ఠన్త్యనిలామయాః,

వ్యా. పైజెప్పినరీతిగ గుణములుకల్గిన స్నేహస్వేదవిధులచే వాతరోగికి చికిత్స చేసినయెడ కోష్ఠము మృదుత్వమునొందును. దానంజేసి వానికోష్ఠమున వాతరోగము నిలువక పూర్తిగ శమించును. కావున వాతరోగికి స్నేహస్వేదములను మాటిమాటికిని చేయించుట ముఖ్యమైనచికిత్స యని భావము.

వాతవ్యాధియందు విరేచనవిధి.

మూ. యద్యనేన సదోషత్వాత్ కర్మణా న ప్రశామ్యతి. 83
మృదుభిః స్నేహసంయుక్తైః ఔషధైస్తం విశోధయేత్,

వ్యా. పైజెప్పబడిన స్నేహస్వేదరూపమైన చికిత్సావిధానముచే (నయ్యాది దోషయుక్తముగ నుండుటవలన) వాతవ్యాధి శమించకున్నయెడ మృదువైన (కొండ గోగువేళ్లు మున్నగు) విరేచనౌషధములలో స్నేహద్రవ్యమును కూడ చేర్చి వానిచే విరేచనము చేయించవలెను.

ఇచ్చట చికిత్సాప్రారంభమున "కేవలం నిరుపస్తమ్భం" అని చెప్పుటచేత ఇతర దోషసంబంధంబును వానిచే నిరోధంబును లేనివాతము నుద్దేశించి యీచికిత్సావిధానము చెప్పబడును. అట్టియెడ 'సదోషత్వాత్' అనుపదమునకు 'ఇతరదోషసంబంధము కల్గి యుండుటవలన' అనునర్థము సమంజసము కాదు; కావున పైజెప్పబడిన చికిత్స యౌగికము కానియెడ నీక్రిందజెప్పబడు శోధనము చేయవలెనని యర్థము చేయనగును.

వాతరోగికి మృదువిరేచనమునకు స్నేహపానము.

మూ. ఘృతం తిల్వకసిద్ధం వా సాతలాసిద్ధమేవ వా. 84
పయస్యైరణ్డతైలం వా పిబేద్దోషహరం శివం,

వ్యా. లొద్దుగుచెక్కను చేర్చి పక్వముచేయబడిన ఘృతమునైనను, సంబరేణును చేర్చి కాచబడిన ఘృతమునైనను, ఆవుపాలను చేర్చిన యాముదమునైనను త్రాగినయెడ విరేచనమై సంచితములైన దోషముల హరించును. వాతము ననులోమగతి నందించును. శరీరమునకు సుఖమును కల్గించును.

వాతరోగికి వాతానులోమనవిధి.

మూ. స్నిగ్ధామ్లలవణోష్ణాద్యైః ఆహారైర్హి మలశ్చితః. 85
స్రోతో బద్ధ్వాఽనిలం రున్ధ్యాత్ తస్మాత్తమనులోమయేత్,

వ్యా. స్నిగ్ధగుణంబును అమ్లరసంబును లవణరసంబును ఉష్ణవీర్యంబును మున్నగు నన్నపానములచే సంచితమైనమలము స్రోతస్సుల నడ్డగించి వాతసంచారమార్గమును అడ్డగించును. కావున, పైజెప్పిన విరేచనములచే దోషమును వెడలించినయెడ వాతము బద్ధకముపదలి యనులోమముగ సంచరించును.

(చికిత్సాప్రారంభమున వాతము నిరుద్ధము కాకున్నను పైజెప్పబడిన స్నేహ ప్రధానమగు స్నేహస్వేదవిధులయందు స్నిగ్ధ-అమ్లాద్యాహారములచే మలము సంచితమై వాతమును నిరోధించును; దానంజేసి వాతము ప్రతిలోమముగ నగును, దానంజేసి వాత వ్యాధి శమించకుండును; కావున నట్టియెడ స్నేహస్వేదవిధులచే వ్యాధి శమించకుండు సమయమున నిచ్చట చెప్పబడిన తిల్వకాదిస్నేహపానము చేసినచో మృదువుగ విరేచనమై

సంచితమైనమలము వెడలి వాతమున కనులోమగమనము కల్గును. దానంజేసి వ్యా
శమించునని భావము. ఈవిషయమునే "యద్యనేన సదోషత్వాత్" అనువాక్యము
కనబరిచి మృదువిరేచనము విధింపబడినది.)

### వాతరోగికి నిరూహవస్తివిధి.

మూ. దుర్బలో యోఽవిరేచ్యస్స్యాత్ తం నిరూహైరుపాచరేత్.
పాచనైర్దీపనీయైర్వా భోజనైస్తద్యుతైర్నరం,

వ్యా. రోగి చాల బలహీనుడగుటవలన విరేచనమున కర్హుడు కానిచోయెడ వాని
నాహారమును పచింపజేయునవియు అగ్నిని దీపింపజేయునవియు నగు కషాయాద్యౌష
ములచే నిరూహవస్తిని చేయనగును. మరియు నట్టిపాచనదీపనము లగుద్రవ్యములతో
గూడిన యాహారమును భుజింపజేయనగును.

### వాతరోగికి శోధనానంతరము స్నేహస్వేదవిధి.

మూ. సంశుద్ధస్యోత్థితే చాగ్నౌ స్నేహస్వేదౌ పునర్హితౌ.
స్వాద్వమ్లలవణస్నిగ్ధైః ఆహారైస్సతతం పునః,
నావనైర్ధూమపానైశ్చ సర్వానేవోపపాదయేత్.

వ్యా. పైజెప్పబడిన శోధముచే కోష్ఠము శుద్ధమై దీపనపాచనములచే నగ్నిదీ
కల్గియున్నపుడు మరల స్నేహస్వేదవిధుల జేయుట చాల హితకరము. పిమ్మట మధు
అమ్ల-లవణరసంబులును, స్నిగ్ధంబులు నగు నాహారములచేతను, నస్యములచేతను, ధూ
పానములచేతను వాతరోగికి చికిత్సచేయవలెను.

మూ. ఇతి సామాన్యతః ప్రోక్తం వాతరోగచికిత్సితం,

వ్యా. ఇత్తెరంగున వాతవ్యాధికి స్థానాదివిశేషభేదముల నపేక్షించక సామా
చికిత్స చెప్పబడినది. స్థానాదిభేదము ననుసరించి విశేషచికిత్స యీ క్రింద చెప్పబడును

### వాతవ్యాధివిశేషచికిత్స అందు; కోష్ఠగతవాతచికిత్స.

మూ. విశేషతస్తు కోష్ఠస్థే వాతే క్షారం (క్షీరం) పిబేన్నరః.
పాచనైర్దీపనైర్యుక్తైః అమ్లైర్వా పాచయేన్మలాన్,

వ్యా. కోష్ఠమున వాతము చేరి కల్గిన వాతవ్యాధియందు యవక్షారమును జలమ
చేర్చి త్రాగవలెను. మరియు పాచనంబులును దీపనంబులు నగుద్రవ్యములతో గూ
యమ్లరసములను త్రాగించి మలములను పచింపజేయవలెను.

ఇచ్చటి అగ్ర్యాధికారమున "యావశూకః స్రంసనీయ-పాచనీయ-అర్శోఘ్నానామ్" (సూ. అ. ౨౫. సూ. ౪౨) అనువాక్యముచే దీపనీయములలో యవక్షారము ప్రధానముగ చెప్పబడినది కావున నిచ్చట క్షారశబ్దముచే యవక్షారమును గ్రహించుట యుక్తము. లేక గ్రహణ్యాదులయందు దీపనములుగ నిర్దేశింపబడిన క్షారములపైన గ్రహింపదగును.

### గుద-పక్వాశయాదిగతవాతచికిత్స.

మూ. గుదపక్వాశయస్థే తు కర్మోదావర్తనుద్ధితమ్. 90
ఆమాశయస్థే శుద్ధస్య యథాదోషహరీః క్రియాః,
సర్వాఙ్గకుపితేఽభ్యఙ్గో వస్తయః సానువాసనాః. 91

వ్యా. వాతము గుదమునందును పక్వాశయమునందును జేరి ప్రకోపమునొందిన యెడ నుదావర్తహరములుగ జెప్పబడిన చికిత్సలు హితములుగ నుండును. ఆమాశయమున వాతము చేరినపుడు తొలుత శోధనముచే దోషమును వెడలించి ఆయాదోషమునకు దగినచికిత్సల జేయనగును. వాతము సర్వాంగమున జేరి ప్రకోపమునొందినపుడు అభ్యంగనంబును వస్తికర్మమును అనువాసనవస్తియు హితకరములు.

### రసాదిధాతుగతవాతచికిత్స.

మూ. స్వేదాఽభ్యఙ్గాఽవగాహాశ్చ హృద్యం చాన్నం త్వగాశ్రితే,
శీతాః ప్రదేహాః రక్తస్థే విరేకో రక్తమోక్షణమ్. 92
విరేకో మాంసమేదస్థే నిరూహాశ్శమనాని చ,
బాహ్యాఽభ్యన్తరతః స్నేహైః అస్థిమజ్జగతం జయేత్. 93

వ్యా. వాతము త్వక్కును (రసధాతువును) ఆశ్రయించి ప్రకోపమునొందినయెడ స్వేదనవిధియు, అభ్యంగనంబును, అవగాహంబును, హృదయమున కనుకూలమైన యన్నంబును హితములుగ నుండును. రక్తమున జేరినప్పుడు స్పర్శ-వీర్యములచే శీతములైన ద్రవ్యముల ప్రలేపముచేయుటయు, విరేచనంబును, రక్తమోక్షణంబును హితకరములు. మాంసమునందును మేదస్సునందును వాతము ప్రకోపించినపుడు నిరూహవస్తులును, దోషశమనంబులును హితకరములు. వాతము అస్థులయందును మజ్జయందును జేరినపుడు, శరీరముపైని స్నేహములచే నభ్యంగాద్ధుల జేయుటయు, లోపలకు స్నేహపానము చేయుటయు వాతహరమగును.

### శుక్రగతవాతచికిత్స.

మూ. హర్షోఽన్నపానం శుక్రస్థే బలశుక్రకరం హితం,
విబద్ధమార్గం దృష్ట్వా వా శుక్రం దద్యాద్విరేచనమ్. 94
విరక్తప్రతిభుక్తస్య పూర్వోక్తాం కారయేత్క్రియాం,

వ్యా. వాతము శుక్రమున జేరి ప్రకోపమునొందినయెడ మనస్సునకు హర్షమును కల్గించుటయు, బలమును శుక్రమును వృద్ధినందించు నన్నపానంబులును మిగుల హితకరములు. అందును శుక్రము వెడలుమార్గమును అడ్డగించియున్నపుడు విరేచనముచేయించి, విరక్తునకు చెప్పినపద్ధతి ననుసరించి భోజనవిధిని చేసినవానికి పైజెప్పిన మనోహర్షణంబును, బలశుక్రకరంబులగు నన్నపానంబులును మరల చేయవలెను.

### వాతశుష్కగర్భచికిత్స.

మూ. గర్భే శుష్కే తు వాతేన బాలానాం చాపి శుష్యతామ్. 95
సితాకాశ్మర్యమధుకైః వాతముత్థాపనే పయః,

వ్యా. వాతప్రకోపముచేత గర్భము శుష్కించినను, బాలురు నానాట శుష్కించుచున్నను పుష్టిని కల్గించుటకై చక్కెరను నేలగుమ్మడిగడ్డను అతిమధురమును చేర్చి కాచబడినపాలను త్రాగించుట చాల హితకరము. దీనిచేత పుష్టికల్గును.

### హృదయ-నాభిస్థానముల ప్రకుపితమైన వాతచికిత్స.

మూ. హృది ప్రకుపితే సిద్ధమంశుమత్యా పయో హితమ్. 96
మత్స్యాన్ నాభిప్రదేశస్థే సిద్ధాన్ బిల్వశలాటుభిః,

వ్యా. వాతము హృదయమున జేరి ప్రకోపమునొందినయెడ ముయ్యాకుపొన్నను చేర్చి కాచబడినపాలను త్రాగవలెను. నాభిస్థానమున జేరిన వాతమున బిల్వకాయలచేర్చి పక్వముచేయబడిన మత్స్యముల నుపయోగించవలెను. (ఇచ్చట నాభిస్థానప్రకుపితవాతమును నిర్దేశించకున్నను అచ్చట కల్గుశూలాదులబట్టి యెరుంగునది.)

### సిరాగతవాతచికిత్స.

మూ. వాయునా వేష్ట్యమానే తు గాత్రే స్యాదుపనాహనమ్. 97
తైలం సఙ్కుచితేఽభ్యఙ్గః మాషసైన్ధవసాధితం,

వ్యా. వాతము సిరలయందుచేరి ప్రకోపమునొంది శరీరమునందట్టి సిరలచే జుట్టబడియున్నచో వాతహరములగు నౌషధములచే నచ్చోటకట్టుకట్టవలెను. వాతము

అవయవములలో జేరి ప్రకుపితమై అవయవముల ముడుచుకొనునట్లు చేసినచో మినుము లను సైంధవలవణమును సమభాగములుగ గూర్చి పక్వముచేయబడిన తైలమును పూసి యభ్యంగనము చేయవలెను.

## శిరోగతవాతచికిత్స.

మూ. బాహుశీర్షగతే నస్యం పానం చౌత్తరభక్తికమ్. 98
వస్తికర్మ త్వధో నాభేః శస్యతే చాఽవపీడకః,

వ్యా. బాహువులయందైనను శిరస్సునందైనను వాతము చేరినయెడ (స్నేహములతో) నస్యమునుచేసి స్నేహపానమును చేయవలెను. నాభికి క్రిందిభాగమున (పొత్తికడుపున) వాతము చేరియున్నయెడ అవపీడకమను ఘృతపానము చేయవలెను. (తొలుత నేతిని త్రాగి వెంటనే భుజించిన నయ్యది యవపీడక మనబడును).

ఇచ్చట "తత్ర కోష్ఠాశ్రితే దుష్టే......ఇత్యుక్తం స్థానభేదేన వాయోర్లక్షణమేవచ" (౨౮. ౩౭. శ్లో)అనుగ్రంథముచే వాతమునకు కోష్ఠాదిస్థానభేదములవలన గల్గు లక్షణములు వేరువేరుగ నిర్దేశింపబడినవి. ఆట్టి స్థానభేదక్రమము ననుసరించి చికిత్సలు పైగ్రంథముచే వివరింపబడినవని యెరుంగునది.

## అర్దితవాతచికిత్స.

మూ. అర్దితే నావనం మూర్ధ్ని తైలం తర్పణమేవ చ. 99
నాడీస్వేదోపనాహాశ్చాప్యానూపపిశితైర్హితాః,

వ్యా. అర్దితవాతమునందు నస్యమును, శిరస్సునందు తైలాభ్యంగనమును, కన్నులు చెవులు వీనియందు తైలమును పోసి సంతర్పణమును చేయవలెను. మరియు నాడీస్వేదమును ఉపనాహస్వేదమును జలప్రాంతమున నుండుజంతువులమాంసములచే చేయవలెను.

## పక్షాఘాత (పక్షవధ) గృధ్రసీవాతచికిత్స.

మూ. స్వేదనం స్నేహసంయుక్తం పక్షాఘాతే విరేచనమ్. 100
అన్తరా కణ్డరా గుల్ఫం (జ్గుల్ఫ్యోః) సిరావస్త్యగ్నికర్మ చ,
గృధ్రసీషు ప్రయుఞ్జీత

వ్యా. పక్షాఘాతమునందు స్నేహద్రవ్యములచే స్నేహమును స్వేదవిధిని చేసి, స్నేహయుక్తమైన విరేచనమును చేయించవలెను. మరియు గృధ్రసీవాతమునందు కండరములకును చీలమండకును నడుమనుండు సిరలను వ్యధనముచేసి, వస్తికర్మను అగ్నికర్మను చేయవలెను.

## ఖల్లీవాతచికిత్స.

మూ. ఖల్ల్యాం తూష్ణోపనాహనమ్. 101
పాయసైః కృసరైర్మాంసైః శస్తం తైలఘృతాన్వితైః,

వ్యా. ఖల్లీవాతమునందు పాయసమునందును కృసరమునందును మాంసమునందును తైలఘృతములఁజేర్చి వేడిగనుండునపుడు వానిచే నుపనాహము చేయవలెను.

## హనుగ్రహవాతచికిత్స.

మూ. వ్యాత్తాననే హనుం స్విన్నాం అఙ్గుష్ఠాభ్యాం ప్రపీడ్య చ. 102
ప్రదేశినీభ్యాం చోన్నామ్య చిబుకోన్నామనం హితం,
స్రస్తం స్వం గమయేత్ స్థానం స్తబ్ధం స్విన్నం వినామయేత్.

వ్యా. హనుగ్రహవాతమున అంకిళ్లు సడలి నోరు తెరచికొనియున్నచో దవుడలకు స్నేహమును బూసి చెమటబుట్టించి బొటనవేళ్లచే గట్టిగ నొక్కిపట్టి, బొటనవ్రేళ్లకు ప్రక్కనుండు చూపుడువ్రేళ్లచే జారినదవుడను పైకెత్తి గడ్డమును పైకి నొక్కి కీళ్లనొండొంట చేర్పనగును. నోరు మూయబడి తెరచుటకు వీలుగాక స్తంభించియున్నచో స్వేదముచేసి తెరవవలెను.

## అనుక్తవాతవ్యాధివిశేషచికిత్సాసంగ్రహము.

మూ. ప్రత్యేకం స్థానదూష్యాదిక్రియావైశేష్యమాచరేత్,
(క్రియాం సర్వత్ర కారయేత్)

వ్యా. ఇచ్చట చెప్పబడని వాతవ్యాధిచికిత్సలను వాతమునకు జేరిన పక్వాశయాదిస్థానవిశేషములను రసరక్తాదిదూష్యములను పిత్తాద్యావరణభేదములను ఆయాలక్షణములచే చక్కగ గమనించి తత్తదనుగుణముగ నాయావిశేషచికిత్సల నిర్ణయించి యాచరింపదగును.

## వాతవ్యాధిసామాన్యచికిత్స.

మూ. సర్పిస్తైలవసామజ్జసేకా(పానా)భ్యఞ్జనవస్తయః. 104
స్నిగ్ధాః స్వేదాః నివాతం చ స్థానం ప్రావరణాని చ,
రసాః పయాంసి భోజ్యాని స్వాద్వమ్లలవణాని చ. 105
బృంహణం యచ్చ తత్సర్వం ప్రశస్తం వాతరోగిణాం,

వ్యా. ఘృతము, తైలము, వస, మజ్జ, అను స్నేహములను సేకమును అభ్యంజనమును, వస్తికర్మను చేయుటయు, స్నేహద్రవ్యముల గూర్చి చేయబడిన స్వేదములును, గాలిలేని ప్రదేశమున నుండుటయు, ఉల్లుతో చేయబడిన కంబళ్లు మున్నగువానిని గప్పికొనుటయు, మాంసరసంబులును, పాలును, మధుర-అమ్ల-లవణరసభూయిష్ఠములైన భోజ్యపదార్థంబులును, బృంహణమగు (శరీరమునకు పుష్టినికల్గించు) ఔషధాన్నవిహారాదులన్నియు వాతరోగపీడితులకు చాల ప్రశస్తములుగ నుండును. (కావున వానినన్నింటిని వ్యాధిస్వభావాదులను, దేశకాలసాత్మ్యాదులను చక్కగ గమనించి తత్తదనుగుణముగ యుక్తియుక్తముగ నుపయోగింపనగునని భావము.)

### వాతవ్యాధిహరబలాదస్థిమాంసములు.

మూ. బలాయాః పఞ్చమూలస్య దశమూలస్య వా రసే 106
అజశీర్షాఽమ్బుజానూపమాంసాదపిశితైః పృథక్,
సాధయిత్వా రసాన్ స్నిగ్ధాన్ దధ్యమ్లవ్యోషసంస్కృతాన్. 107
భోజయేద్వాతరోగార్తం తైర్వ్యక్తలవణైర్నరం,
ఏతైరేవోపనాహాంశ్చ పిశితైస్సమ్ప్రకల్పయేత్. 108
ఘృతతైలయుతైస్సామ్లైః క్షుణ్ణస్విన్నైరనస్థిభిః,

వ్యా. చిట్టాముట్టి, పంచమూలములు, దశమూలములు, ఈమూడిటిని వేరువేరుగ క్వాథకల్పనాప్రకారము కషాయముల సిద్ధముచేసికొని మేకపోతు తలమాంసమునైనను, నీటపుట్టిన జంతువులమాంసములైనను, అనూపజంతువుల మాంసమునైనను, మాంసాద (మాంసమును తినునట్టి పులిమొదలగుజంతువుల మాంసమునైనను, పైజెప్పిన మూడుకషాయములలో నొక్కొక్కదానియందు వేరువేరుగ జేర్చి పక్వముచేసి యామాంసరసములలో నేతినిచేర్చి పెరుగును, దానిమ్మపండ్లరసము మున్నగు నమ్లరసములను, త్రికటుకములనుచేర్చి సంస్కరించి సిద్ధముచేయబడిన మాంసరసములలో లవణమును విశేషముగ చేర్చి వానిని యన్నాదులలో కలిపి వాతరోగపీడితునకు భుజింపచేయవలయును. మరియు పైజెప్పిన మాంసములను మెత్తగ దంచి యుడకపెట్టి యెముకల వేరుపరచి యందు ఘృతమును తైలమును, పులుపుగసమును చేర్చి వాతరోగము కలవానికి యుపనాహముల గల్పింపవలయును.

ఇచ్చట మాంసరసకల్పనమునే బల-పఞ్చమూల-దశమూలకషాయముల మూటిలో నొక్కొక్కదానియందు నజశీర్ష - అంబుజ - అనూప - మాంసజంతువులమాంసములను

నొక్కొక్కదానిని చేర్చి మాంసరసముల వేరువేరుగ పక్వముచేయునది. అట్లుచేసినచో పండ్రెండుమాంసరసముల భేదములగునని యెరుంగునది.

### వాతవ్యాధిహరావగాహము.

మూ॥ పత్రోత్క్వాథపయస్తైలద్రోణ్యస్స్యాదవగాహనే. 109
స్వభ్యక్తానాం ప్రశస్యన్తే సేకాశ్చానిలరోగిణాం,

వ్యా॥ వాతహరములైన యాకులను చేర్చి కాచబడిన కషాయమునైనను, పాలనైనను, తైలములనైనను, తొట్టిలో పోసి వాతరోగికి శరీరమునందెల్ల తైలముచే నభ్యంగనముచేయించి యాతొట్టిలో నవగాహనము చేయించుట ప్రశస్తము, లేక పైచెప్పిన కషాయాదులచే స్నానము చేయించవలయును.

### వాతవ్యాధిహరస్వేదాభ్యంగములు.

మూ॥ ఆనూపౌదకమాంసాని దశమూలం శతావరీమ్. 110
కులుత్థాన్బదరాన్మాషాన్ తిలాన్ రాస్నాం యవాన్బలాం,
వసాదధ్యారనాలాద్యైః సహ కుమ్భ్యాం విపాచయేత్. 111
నాడీస్వేదం ప్రయుఞ్జీత పిష్టైశ్చాప్యుపనాహనం,
తైశ్చ సిద్ధం ఘృతం తైలం అభ్యఙ్గం పానమేవ చ. 112

వ్యా॥ ఆనూపజంతువులయొక్కయు ఉదకముననుండు జంతువులయొక్కయు మాంసములు, దశమూలము, పిల్లిపీచర, ఉలవలు, రేగుపండ్లు, మినుములు, నువ్వులు, సన్నరాష్ట్రము, యవలు, చిట్టాముట్టి, ఈద్రవ్యములను సమభాగములుగ గూర్చి వస, పెరుగు పులిగంజి ఈమూటియందును కలిపి యొకకుండలో చేర్చి పక్వముచేయునది. దీని యావిరిచేత విధ్యుక్తప్రకారము నాడీస్వేదము చేయదగును. లేక పైజెప్పినద్రవ్యముల వసాదిద్రవములలో చేర్చి నూరి వాతరోగికి బాధకలిగినస్థలమున యాపిష్టముచే కట్టుకట్టవలయును. మరియు నాద్రవ్యములను కల్కముగ చేర్చి పైజెప్పినద్రవముల కూడ కలిపి తైలమునైనను, ఘృతమునైనను, పక్వముచేసి యభ్యంగనమునకును పానమునకును నుపయోగించునది.

### వాతరోగికుపనాహస్వేదము.

మూ॥ ముస్తం కిణ్వం తిలాః కుష్ఠం సురాహ్వాం లవణం నతం,
దధిక్షీరచతుస్స్నేహైః సిద్ధం స్యాత్ ఉపనాహనమ్. 113

వ్యా. తుంగగడ్డలు, సురాబీజము, నువ్వులు, చెంగల్వకోష్ఠు, దేవదారుచెక్క, సైంధవలవణము, గ్రంథితగరము, వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి, అందు పెరుగును, ఆవుపాలను, నేయి-నూనె-వస-మజ్జ అను నాలుగుస్నేహములను కూడ కలిపి పక్వముచేసి వాతరోగి కుపనాహనమును చేయునది.

వాతరోగమునం దుపనాహవిధి.

మూ. ఉత్కారికావేసవారక్షీరమాషతిలౌదనైః,
ఏరణ్డబీజగోధూమయవకోలస్థిరాదిభిః. 114
సస్నేహైః సరుజం గాత్రం ఆలిప్య బహలం భిషక్,
ఏరణ్డపత్రైః బధ్నీయాత్ రాత్రౌ కల్యం విమోక్షయేత్. 115
క్షీరామ్బునా తతస్సిక్తం పునశ్చైవోపనాహితం,
ముఞ్చేద్రాత్రౌ దివాబద్ధం చర్మభిశ్చ సలోమభిః. 116

వ్యా. ఉత్కారిక(పిండి మొదలగువానిని నీటియావిరిచే నుడికించి చేయు భక్ష్యవిశేషము) వేసవారము (మాంసమును యెముకలు మొదలయినవి లేకుండ శుద్ధముచేసి మెత్తగ నూరి యుడికించబడిన పిష్టము), క్షీరము, మినపపిండి, నువ్వులపిండి, అన్నము, ఆముదపుగింజలు, గోధుమపిండి, యవలపిండి, పంచకోలములు, హ్రస్వపంచమూలములు, ఇవి మున్నగువానియందు ఆముదము మున్నగుస్నేహముల జేర్చి యుడికించి వాతవ్యాధిచే బాధకలిగిన అవయవములపైని దట్టముగ పూసి దానిపై ఆముదపాకులనుంచి కట్టుకట్టవలయును. ఇత్తెరంగున రాత్రియందు కట్టినదానిని మరుసటియుదయమున విడదీసి పాలచేతను, నీళ్లచేతను తడిపి శుభ్రముగ కడిగి మరల పైజెప్పినరీతిగ పట్టువేసి రోమములతోకూడిన చర్మముచే కట్టుకట్టవలయును. ఇత్తెరంగున పగలు కట్టినకట్టును రాత్రియు రాత్రియందు కట్టినకట్టును పగటియందును విడదీసి పలుమారు కట్టుచుండవలయును.(ఇది యుపనాహస్వేదవిధి.)

వాతవ్యాధిహరములగు కొన్ని ప్రలేపములు, ఉపనాహములు.

మూ. ఫలానాం తైలయోనీనాం అమ్లపిష్టాన్సుశీతలాన్,
ప్రదేహానుపనాహాంశ్చ గన్ధైర్వాతహరైరపి. 117
పాయసైః కృసరైశ్చైవ కారయేత్స్నేహసంయుతైః,

వ్యా. నూనెమొదలగు తైలములకు నుత్పత్తికారణమైన నువ్వులు, ఆముదాలు, అగసివిత్తులు, మున్నగువానిని కాంజికము మున్నగు పుల్లనిద్రవముల చేర్చి మెత్తగ నూరి

యుడికించి చల్లారినపిదప నాపిష్టముచే ప్రదేహములను (పట్టులను), ఉపనాహములను, చేయదగును. మరియు వాతహరములయిన అగరు మున్నగు గంధద్రవ్యములను, పాయసములను, కృసరములను, స్నేహద్రవ్యములతో కూర్చి ప్రలేపమునకును, ఉపనాహమునకును నుపయోగింపనగును. (ఇచ్చట మిగుల దట్టముగ పట్టువేసిన నుపనాహమనియు దానికన్న కొంచెము పలుచగ పూయబడినది ప్రదేహమనియు భేదము నెరుంగునది.

మూ. రూక్షశుద్ధానిలార్తానాం అతః స్నేహాన్ప్రచక్ష్మహే. 118
వివిధాన్వివిధవ్యాధిప్రశమాయామృతోపమాన్,

వ్యా. రూక్షశరీరులును, కేవలము వాతమాత్రముచేతనే బాధితులు నగువారికి పలుతెరంగులైన వాతవ్యాధుల శమింపజేయ నమృతతుల్యంబులైన నానావిధస్నేహయోగములు నీక్రింద చెప్పబడును.

### దశమూలాదిఘృతము.

మూ. ద్రోణేఽమ్భసః పచేద్భాగాన్ దశమూలాచ్చతుష్పలాన్. 119
యవకోలకులుత్థానాం భాగైః ప్రస్థోన్మితైస్సః,
పాదశేషే రసే పిష్టైః జీవనీయైః సశర్కరైః. 120
తథాఖర్జూరకాశ్మర్యద్రాక్షాబదరఫల్గుభిః,
సక్షీరైః సర్పిషః ప్రస్థః సిద్ధః కేవలవాతనుత్. 121
నిరత్యయః ప్రయోక్తవ్యః పానాభ్యంజనవస్తిషు,

వ్యా. దశమూలములు నాలుగుపలములు; యవలు, రేగువిత్తులు, ఉలవలు ఇవి ప్రత్యేకము ఒక్కొక్క ప్రస్థము; వీనిని ద్రోణపరిమితమైన జలమున చేర్చి నాల్గవవంతు మిగుల కషాయము కాచి యాకషాయమును, జీవనీయగణద్రవ్యములను, చక్కెరను, ఖర్జూరపుకాయలను, నేలగుమ్మడిని, ద్రాక్షపండ్లను, రేగుపండ్లను, బ్రహ్మమేడిపట్టను, వీనిననన్నిటి కల్కమును; ప్రస్థపరిమితమైన ఘృతమున చేర్చి ఘృతమునకు సమభాగము ఆవుపాలను కూడ కల్పి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి యాఘృతమును పానమునకును, అభ్యంగనమునకును, వస్తికిని యుపయోగించినయెడ నిరపాయముగ కేవలవాతమును హరించును.

### వాతరోగహరచిత్రకాదిఘృతము.

మూ. చిత్రకం నాగరం రాస్నాం పౌష్కరం పిప్పలీం శటీమ్. 122
పిష్ట్వా విపాచయేత్సర్పిః వాతరోగహరం పరం,

వ్యా. చిత్రమూలము, శుంఠి, సన్నరాష్ట్రము, పుష్కరమూలము, పిప్పళ్లు, కచోరములు వీని నన్నిటిని నూరి కల్కముచేసి ఘృతమున జేర్చి విధిప్రకారము ఘృతపాకము చేసి పానాభ్యంగనాదుల కుపయోగించినచో వాతరోగముల హరించును. (ఇచ్చట చిత్రకాదిద్రవ్యకల్కమునకు నాల్గుభాగములు ఘృతమును, ఘృతమునకు నాల్గింతలు జలమును చేర్చి పక్వముచేయునది. కల్కాదులకు పరిమితి చెప్పనిచోట్ల నీసామాన్యపరిభాషానుసారముగ కల్క-స్నేహ ద్రవములపరిమాణము నెరుంగునది. మరియు "ద్రవేష్వనుక్తే జలమేవ దేయమ్" అనుపరిభాష ననుసరించి కషాయాదిద్రవమును చెప్పనిచోట పానమునకై జలమును చేర్చునది.)

## శిరోగతవాతరోగమున నస్యము.

మూ. బలాబిల్వశృతే క్షీరే ఘృతమణ్డం విపాచయేత్. 123
తస్య శుక్తిః ప్రకుఞ్చో వా నస్యం మూర్ధగతేఽనిలే,

వ్యా. చిట్టాముట్టివేరును బిల్వవేరును చేర్చి కాచబడిన పాలలో నేతిమీది మీగడను చేర్చి కాచి, యాఘృతమునం దర్ధపలమునైనను ఒకపలమునైనను శిరోగత వాతరోగము కలవానికి నస్యము చేయవలెను. (ఇది బృంహణనస్యము.)

## వాతవ్యాధిహరదశమూలాదిసిద్ధస్నేహము.

మూ. గ్రామ్యానూపౌదకానాం తు భిత్వాఽస్థీని పచేజ్జలే. 124
తం స్నేహం దశమూలస్య కషాయేణ పునః పచేత్,
జీవకర్షభకాఽఽస్ఫోతావిదారీకపికచ్ఛుభిః. 125
వాతఘ్నైః జీవనీయైశ్చ కల్కైః ద్విక్షీరభాగికం,
తత్సిద్ధం నావనాఽభ్యఙ్గాత్ తథా పానాఽనువాసనాత్. 126
సిరాపర్వాఽస్థికోష్ఠస్థం ప్రణుదత్యాశు మారుతం,
యే స్యుః ప్రక్షీణమజ్జానః క్షీణశుక్రౌజసశ్చ యే. 127
బలపుష్టికరం తేషాం ఏతత్ స్యాదమృతోపమం,

వ్యా. గ్రామముల నుండు జంతువులయొక్కయు జలజంతువులయొక్కయు జలప్రాంతమున నుండుజంతువులయొక్కయు నెముకలను చీల్చి తునియలు చేసి నీళ్లలో చేర్చి యుడికించినచో నందుండి వెడలు చమురును గ్రహించి; అందు దశమూలకషాయమును; జీవకము, ఋషభకము, అడవిమల్లె, నేలగుమ్మడు, దూలగొండి, (ఈద్రవ్యములను) వాతహరములగు నితరద్రవ్యములను, జీవనీయ (బలమును కల్గించు) గణద్రవ్యము

లను కల్కముచేసి యాకల్కమును స్నేహమునకు రెండింతలు పాలను కూడ క
పక్వముచేసి, నస్యమునకును, అభ్యంగమునకును, పానమునకును, అనువాసనవస్తికిని య
యోగించునది. దీని నుపయోగించుటవలన సిరాగతవాతంబును, కీళ్లయందు కల్గినవా
రోగంబును, కోష్ఠగతవాతంబును శమించును. మరియు మజ్జయు ఓజస్సును శుక్రంబు
క్షీణించినవారికి బలంబును శరీరపుష్టియు కల్గును. ఇయ్యది వాతవ్యాధిపీడితులకు అమృ
మునుబోలె సుఖకరమైయుండును.

## వాతవ్యాధిహరనక్రాదివసాప్రయోగము.

మూ. తద్వత్సిద్ధా వసా నక్రకూర్మమత్స్యచులూకజా. 1
ప్రత్యగ్రా విధినాఽనేన నస్యపానేషు శస్యతే,

వ్యా. నక్రము (పెనుగుడు లాగుమొసలి), తాబేలు, మత్స్యము, చులూకవ
(మొసలిజాతిలో చేరిన జలజంతువు), అనునీజంతువుల క్రొత్తవసను పైని చెప్పబడ
రీతిగ బలాబిల్వసిద్ధక్షీరమును చేర్చి పక్వముచేసి యాస్నేహమును నస్యమునకును పా
మునకును వాతవ్యాధియం దుపయోగించుట చాల ప్రశస్తము.

## సిరా-మజ్జాదిగతవాతవ్యాధికి మహాస్నేహము.

మూ. ప్రస్థస్స్యాత్ త్రిఫలాయాస్తు కులుత్థకుడవద్వయమ్. 12
కృష్ణగన్ధాత్వగాఢక్యోః పృథక్పఞ్చపలం భవేత్,
రాస్నాచిత్రకయోర్ద్వే ద్వే దశమూలం పలోన్మితమ్. 13
జలద్రోణే పచేత్ పాదశేషే ప్రస్థోన్మితం పృథక్,
సురారసాలదధ్యమ్లసౌవీరకతుషోదకమ్. 13
కోలదాడిమవృక్షామ్లరసం తైలం వసాం ఘృతం,
మజ్జానం చ పయశ్చైవ జీవనీయపలాని షట్. 13
కల్కం దత్వా మహాస్నేహం సమ్యగేనం విపాచయేత్,
సిరామజ్జాఽస్థిగే వాతే సర్వాఙ్గైకాఙ్గరోగిషు. 13
వేపనాక్షేపశూలేషు తదభ్యఙ్గే ప్రయోజయేత్,

వ్యా. త్రిఫలములు ఒకప్రస్థము (పదునారుపలములు), ఉలవలు రెండుకుడ
ములు (ఎనిమిదిపలములు), మునగపట్ట ఐదుపలములు, కందులు ఐదుపలములు, స
రాష్ట్రము రెండుపలములు, చిత్రమూలము రెండుపలములు, దశమూలములు ఒకపలవ

ఈభాగముల ప్రకారముగ పైజెప్పిన ద్రవ్యములను ద్రోణపరిమితమైన జలమున చేర్చి నాల్గవపాలు (ఒకఆఢకము) మిగులునట్లులు కషాయముకాచి, అందు సురామద్యము, ఆర నాళము (కాంజికము), పులిసినపెరుగు, సౌవీరకము, తుషోదకము, రేగుపండ్లరసము, పుల్ల దానిమ్మరసము, చింతపండురసము, నువ్వులనూనె, వస, నెయ్యి, మజ్జ, పాలు వీనిని ఒక్కొక్కదానిని ఒక్కొక్క ప్రస్థపరిమితముగ చేర్చి జీవనీయగణద్రవ్యములను ఆరు పలములు కల్కము చేసి కలిపి స్నేహపాకవిధిప్రకారము చక్కగా పక్వముచేయునది. ఇది మహాస్నేహమనబడును. వీనిని సిరలయందును, మజ్జయందును, అస్థులయందును కల్గు వాతవ్యాధులయందును, సర్వాంగ-ఏకాంగ వాతరోగములయందును, కంపవాతమునందును, ఆక్షేపకవాతమునందును శూలముతో కూడిన వాతరోగమునందు అభ్యంగనమునకై యుపయోగింపనగును.

ఇచ్చట పొట్టొలిచిన పచ్చి గోధుమలను కుండలో పోసి అందు గంజిమొదలగు ద్రవములను, జలమును చేర్చి మూతమూసి కొన్నిదినము లుంచిన పులుపెక్కిన యా జలము కాంజికమనియు; పొట్టుతో కూడినయవలను దంచి కుండలో పోసి పైజెప్పిన రీతిగ ద్రవమును జేర్చి యుంచిన నయ్యది తుషోదకమనియు; అత్తెరంగుననే పొట్టొలి చినయవలనైనను, గోధుమలనైనను, వేయించి పైజెప్పినరీతిగ సిద్ధముచేయబడినవి సౌవీ రకమనియు నెరుంగునది. వీనిలక్షణము తంత్రాంతరమున నిట్లుచెప్పబడినది:—"ఆరనాళస్తు గోధూమైః ఆమైస్స్యాన్నిస్తుషీకృతైః" "తుషోదకం యవైరామైః సతుషైశ్శకలీ కృతైః" "సౌవీరన్తు యవైరామైః పక్వైర్వా నిస్తుషైః కృతమ్."

## వాతములకు నిర్గుండ్యాదితైలము.

మూ. నిర్గుణ్ద్యా మూలపత్త్రాభ్యాం గృహీత్వా స్వరసం తతః. 134
తేన సిద్ధం సమం తైలం నాడీకుష్ఠానిలార్తిషు,
హితం పామాపచీనాం చ పానాభ్యంజనపూరణమ్. 135
కార్పాసాస్థికులత్థానాం రసే సిద్ధం చ వాతనుత్,

వ్యా. తెల్లవావిలివ్రేళ్లను ఆకులను నలుగగొట్టి స్వరసము తీసి యారసమునకు సమముగ నువ్వుల నూనెను కలిపి విధిప్రకారము తైలము కాచి దానిని నాడీవ్రణముల యందును, కుష్ఠములయందును, వాతవ్యాధులయందును, తీటయందును అపచీవ్రణముల యందును, పాన-అభ్యంజన-పూరణములకు నుపయోగించునది. మరియు పత్తివిత్తులును ఉలవలను చేర్చి క్వాథము చేసి దానికి సమముగ నువ్వుల నూనెను చేర్చి పక్వముచేసి యుపయోగించిన వాతవ్యాధుల హరించును.

### వాతములకు మూలకస్వరసాది తైలము.

మూ. మూలకస్వరసే క్షీరసమే స్థాప్యం త్ర్యహం దధి. 136
తస్యామ్లస్య త్రిభిః ప్రస్థైః తైలప్రస్థం విపాచయేత్,
యష్ట్యాహ్వాశర్కరారాస్నాలవణార్ద్రకనాగరైః. 137
సుపిష్టైః పలికైః పానాత్ తదభ్యఙ్గాచ్చ వాతనుత్,

వ్యా. ముల్లంగిగడ్డలరసము ఒకప్రస్థము, దానికి సమభాగము ఆవుపాలు, పెరుగు ఒకప్రస్థము ఈమూటిని యొకకుండలో పోసి మూడుదినములు వాసెనకట్టి పదిలముగ నుంచునది. పులిసినయీద్రవము మూడుప్రస్థములును నువ్వులునూనె యొక్కప్రస్థమును చేర్చి అందు అతిమధురము, చక్కెర, సన్నరాష్ట్రము, సైంధవలవణము, అల్లము, శుంఠి వీనిని ప్రత్యేక మొకొక్కపలమువంతున గ్రహించి మెత్తగ నూరి కల్కముచేసి తైలపాకవిధిప్రకారము పక్వముచేయునది. ఈతైలమును త్రాగినను, అభ్యంగనము చేసినను వాతవ్యాధి నివర్తించును.

### వాతవ్యాధులకు పంచమూలాదితైలము.

మూ. పఞ్చమూలకషాయేణ పిణ్యాకం బహువార్షికమ్. 138
పక్త్వా తస్య రసం పూత్వా (పక్త్వాంభసి రసే తస్మిన్)
తైలప్రస్థం విపాచయేత్,
పయసాష్టగుణేనైతత్ సర్వవాతవికారనుత్. 139
సంసృష్టే శ్లేష్మణా చైతత్ వాతే శస్తం విశేషతః,

వ్యా. హ్రస్వపంచమూలములను జలమున చేర్చి క్వాథపరిభాషానుసారముగ నాల్గవపాలు మిగుల కషాయము కాచి ఆకషాయమున అనేకవత్సరములు గడచి ప్రాతదియైన నువ్వులతెలికపిండిని చేర్చి మరల కాచి యారసమును వడకట్టి, అందు నువ్వుల నూనెను ఒకప్రస్థమును కలిపి నూనెకుయెనిమిదింతలు ఆవుపాలను చేర్చి తైలపాకవిధి ప్రకారము పక్వముచేసి యీతైలమును పానాభ్యంగనాదుల కుపయోగించిన వాత వ్యాధు లన్నియు నివర్తించును. మరియు శ్లేష్మముతో గూడిన వాతవ్యాధియందు ఈ తైలమును విశేషముగ నుపయోగింపదగు.

ఇచ్చట పంచమూలకషాయమును తెలికపిండిని చేర్చి కాచబడినజలమును వేరు వేరుగ తైలమున చేర్చవలయునని కొందరు చెప్పెదరు. ఈపద్ధతి ప్రకృతిమూలమునకు సమన్వితము కాదు కావున ప్రశస్తము కాదు. జతూకర్ణతంత్రమున నీపద్ధతినే యవలం

బించి యిట్లు చెప్పిరి:—"పిణ్యాకం బహువార్షికమ్ క్షీరాదిసలిలే పచేత్, రసే తస్మిన్ అష్టగుణేన పయసా తైలం సాధ్యం" వాగ్భటాచార్యులు పంచమూలములను, పిణ్యాకమును వేరువేరుగ కషాయము చేయవలెనని యిట్లు చెప్పెను:—"జీర్ణం పిణ్యాకం పఞ్చమూలం పృథక్చ క్వాథ్యం, క్వాథాభ్యాం ఏకతస్తైలమాభ్యాం క్షీరాదష్టాంశం...... విశేషాత్."

వాతవ్యాధులకు యవకోలాదితైలము.

మూ. యవకోలకులుత్థానాం శ్రేయస్యాశ్శుష్కమూలకాత్. 140
బిల్వాచ్చాఞ్జలిమేకైకం ద్రవైరష్టైర్విపాచయేత్,
తేన తైలం కషాయేణ ఫలామ్లైః కటుభిస్తథా. 141
పిష్టైస్సిద్ధం మహావాతైరార్తశ్శీతే ప్రయోజయేత్,

వ్యా. యవలు, రేగుపండ్లవిత్తులు, ఉలవలు, కరకకాయబెరడు, ఎండినముల్లంగిగడ్డలు, మారేడువేరు వీనిని యొక్కొక్కటి నాలుగేసి పలములవంతున పుల్లనిగంజి మున్నగు పులిసినద్రవములతో చేర్చి క్వాథపరిభాషానుసారముగ కషాయము కాచి కషాయమునకు నాలుగవపాలు తైలమును, దానిమ్మపండ్లు మున్నగుఫలములను, కటురసము ప్రధానముగగల ద్రవ్యములను నూరి కల్కముచేసి తైలమునకు నాల్గవవంతు కలిపి తైలపాకవిధిప్రకారము పక్వముచేసి చల్లారిన పిదప యీతైలమును పానాభ్యంగనాదుల కుపయోగించినయెడ అర్దితవాతము మున్నగు గొప్పవాతవ్యాధులు నివర్తించును.

సర్వవాతములకు తైలయోగములు.

మూ. సర్వవాతవికారాణాం తైలాన్యన్యాన్యతశ్శృణు. 142
చతుష్ప్రయోగాణ్యాయుష్కబలవర్ణకరాణి చ,
రజశ్శుక్రప్రదోషఘ్నాన్యపత్యజననాని చ. 143
నిరత్యయాని సిద్ధాని సర్వదోషహరాణి చ,

వ్యా. వాతవ్యాధుల కన్నిటికిని సంబంధించి సిద్ధయోగములైన సహచరాదితైలయోగములు నీక్రింద వివరింపబడును. ఆతైలయోగము లన్నియు పానము, అభ్యంగనము, నస్యము, అనువాసనము, అను నాలుగువిధములయిన చికిత్సావిధానమునకు యోగికములుగ నుండును. శరీరబలమును, వర్ణమును, ఆయువును కల్గించి వృద్ధినొందిం

చును. స్త్రీలయొక్క ఆర్తవమునకును, పురుషుల శుక్రమునకును సంబంధించినదో
ముల హరించి సంతానమును కల్గించును. ఈసిద్ధయోగముల నుపయోగించుట వ
నితరబాధ లెవ్వియును కల్గనేరవు. వాతాదిదోషముల నన్నిటిని హరించునట్టి సి
యోగములు.

## వాతవ్యాధులకు సహచరతైలము.

మూ. సహచరతులాయాశ్చ రసే తైలాఢకం పచేత్. 14
మూలకల్కాద్దశపలం పయోదత్వా చతుర్గుణం,
సిద్ధేఽస్మిన్ శర్కరాచూర్ణాత్ అష్టాదశపలం భిషక్. 14
వినీయ దారుణేష్వేతత్ వాతవ్యాధిషు యోజయేత్,

వ్యా. నూరుపలములపరిమితమైన గోరింటవేళ్లరసమున ఆఢకపరిమితమైన నువ్వు
నూనెను కలిపి ఆగోరింటవేళ్ల కల్కమును పదిపలములను కూడ చేర్చి తైలమున
నాల్గింతలు (నాలుగాఢకములు) ఆవుపాలను కలిపి తైలపాకవిధి ననుసరించి పక్వ
చేయునది. సిద్ధమయిన ఈతైలమునందు పదునెనిమిదిపలములు శిరాకల్కండపొ
కలిపి మిగుల క్రూరమయిన వాతవ్యాధులయం దుపయోగించునది.

## శ్వదంష్ట్రాతైలము.

మూ. శ్వదంష్ట్రాస్వరసప్రస్థౌ ద్వౌ సమౌ పయసా సహ. 1
షట్పలం శృఙ్గిబేరస్య గుడస్యాఽష్టపలం తథా,
తైలప్రస్థం విపక్వం తైః దద్యాత్ సర్వాఽనిలార్తిషు. 1
జీర్ణే తైలే చ దుగ్ధేన పేయా కల్పః ప్రశస్యతే,

వ్యా. పల్లేరుయొక్క స్వరసము రెండుప్రస్థములు, ఈస్వరసమునకు సమభాగ
(రెండుప్రస్థములు) ఆవుపాలు, (ఇదిశ్రవము) శుంఠి యారుపలములు, బెల్లము ఎని
పలములు, (ఇది కల్కము) నువ్వులనూనె యొక ప్రస్థము, వీని నన్నిటి నొకటిగ గూ
తైలపాకవిధిగ పక్వముచేసి వాతవ్యాధు లన్నిటియందు త్రాగనగును. ఈతైలమును త్రా
జీర్ణమైనపిదప పాలతో కలిపిన యవాగువును త్రాగుట చాల ప్రశస్తము.

## బలాతైలము.

మూ. బలాశతం గుడూచ్యాశ్చ పాదం రాస్నాఽష్టభాగికమ్.
జలాఢకశతే పక్త్వా దశభాగస్థితే రసే,
దధిమస్త్విక్షునిర్యాసశుక్తైః తైలాఢకం సమైః.

పచేత్ సాజపయోఽర్ధాంశైః, కల్కైరేభిః పలోన్మితైః,
శటీ సరళదార్వేలా మఞ్జిష్ఠాఽగురుచన్దనైః. 150
పద్మకాతివిషాముస్తశూర్పపర్ణీహరేణుభిః,
యష్ట్యాహ్వసురసవ్యాఘ్రనఖర్షభకజీవకైః. 151
పలాశరసకస్తూరీనలికాజాతికోశకైః,
స్పృక్కాకుఙ్కుమశైలేయ జాతీకటుఫలామ్బుభిః. 152
త్వచా కున్దురుకర్పూర (త్వక్చన్దనైలాకర్పూర)
తురుష్కశ్రీనివాసకైః,
లవఙ్గనఖకక్కోలకుష్ఠమాంసీప్రియఙ్గుభిః. 153
స్థౌణేయతగరధ్యామవచామదనపల్లవైః (మదనకప్లవైః),
సనాగకేసరైః సిద్ధే క్షిపేచ్చాఽత్రాఽవతారితే. 154
పత్రకల్కం తతః పూతం విధినా తత్ప్రయోజయేత్,
శ్వాసం కాసం జ్వరం హిక్కాం (మూర్ఛాం) ఛర్దిం గుల్మాన్ క్షతం
క్షయమ్. 155
ప్లీహశోషావపస్మారం అలక్ష్మీం చ ప్రణాశయేత్,
బలాతైలమిదం శ్రేష్ఠం వాతవ్యాధివినాశనమ్. 156
అగ్నివేశాయ గురుణా కృష్ణాత్రేయేణ భాషితం,
(ఇతి బలాతైలమ్)

వ్యా. చిట్టాముట్టివేళ్లు నూరుపలములు, దీనికినాల్గవవంతు తిప్పతీగె (ఇరువది యైదుపలములు), చిట్టాముట్టికి నెనిమిదవపాలు సన్నరాష్ట్రము (పండ్రెండున్నరపలము), ఈద్రవ్యములను నూరు ఆఢకములజలమున వైచి పదియవభాగము (పదియాఢకములు) మిగులునట్లు కషాయముకాచి వడగట్టి యుంచుకొని, అందు పెరుగుమీదిమీగడను, చెరకురసమును, శుక్తమనుపులిగంజిని, నువ్వులనూనెను ప్రత్యేక మొక్కొకయాఢకము వంతునను (సమభాగములుగను) తైలమునకు అర్ధభాగము (అర్ధాఢకము) మేకపాలను కలిపి; అందు—కచోరములు, సరళదేవదారుచెక్క, ఏలకులు, మంజిష్ఠ, అగరుచెక్క, చందనపుచెక్క, పద్మకాష్ఠము, అతివస, తుంగగడ్డలు, అడవిపెసర, అడవిమినుము, రేణుకలు, అతిమధురము, తులసి, వ్యాఘ్రనఖము (పులిగోరుచెట్టు, లేక గంధద్రవ్య

విశేషము), ఋషభకము, జీవకము, మోదుగుబంక, కస్తూరి, లతాకస్తూరి, జాజికాయల పైబెరడు (జాపత్రి), స్పృక్కయను గంధద్రవ్యము, కుంకుమపువ్వు, రాతిపువ్వు, జాజికాయ, పెద్దఏలకుమ్రానిచెక్క, కురువేరు, లవంగపుపట్ట, కుందురు (పరంగిసాంబ్రాణి, కుందురుగుగ్గులు అను గంధద్రవ్యము), పచ్చకర్పూరము, (లేక కర్పూరము), తురుష్కమనెడు గంధద్రవ్యము, శ్రీనివాసకము (సరళదేవదారుబంక), లవంగములు, నఖము చిప్పలు, తక్కోలములు, చెంగల్వకోష్టు, జటామాంసి, ప్రేంకణము, స్థౌణేయకమను గంధద్రవ్యము (మాచిపత్రి), గ్రంథితగరము, ధ్యామకము (కామంచిగడ్డి), వస, మ్రంగచెట్టుచిగుళ్లు, (లేక మ్రంగకాయ, కైవర్తముస్తలు) నాగకేసరములు, ఈద్రవ్యములను ప్రత్యేక మొక్కొకపలమువంతునగూర్చి కల్కముచేసి కలిపి, (పైజెప్పిన క్వాథాదిద్రవములను తైలమును కల్కమును అన్నింటి నొకటిగగూర్చి), తైలపాకవిధి ప్రకారము పక్వముచేసి దింపినపిదప ఆకుపత్రికల్కమును (సుగంధమునకై) కలిపి వడ కట్టియుంచునది.

ఈతైలమును విధిప్రకారము అభ్యంగాదుల కుపయోగించినచో శ్వాసకాసంబులను, జ్వరమును, ఎక్కిళ్లను, వాంతిని, గుల్మములను, ఉరఃక్షతమును, ధాతుక్షయమును, ప్లీహమును, శోషమును, అపస్మారమును, అలక్ష్మిని, పూర్తిగ హరించును. ఈతైలము వాతవ్యాధులను హరించుటకు మిగుల శ్రేష్ఠమైనది. ఇయ్యది గురువైన కృష్ణాత్రేయులచే తనశిష్యుడగు నగ్నివేశున కుపదేశింపబడిన **బలాతైలము.**

ఇచ్చట బలాదిస్నేహకషాయకల్పనమున "జలాఢకశతే పక్త్వా దశభాగస్థితే రసే" అని చెప్పుటచేత బలాదిక్వాథ్యములను నూరుఆఢకములపరిమితమైన జలమున చేర్చి పదియవభాగము మిగుల క్వాథముచేయవలెనని స్ఫుటముగ తెలియుచున్నది. పదియవ భాగము పదియాఢకము లగును. పెరుగుతేట, చెరకురసము శుక్తమును ప్రత్యేకము తైలమునకు సమములైనయెడ మూడుఆఢకములగును. మేకపాలు అర్ధాఢకము, ఇవియన్నియు చేరి ద్రవము పదుమూడున్నరయాఢకములును, తైల మొకయాఢకమును చేర్చి, కచోరములు మున్నగుద్రవ్యముల నొక్కొకపలమువంతున చేర్చి కల్కముచేసి కలిపి తైలపాకము చేయవలెనని సముదితార్థము.

ఈకల్పనమున ద్రవము తైలమునకు పదుమూడుభాగములకన్న నధికముగ నగును. వాగ్భటాచార్యులు "శతభాగస్థితే రసే" (అ. హృ. చి. అ. ౨౧) అని చెప్పిరి. ఈపక్షమున కషాయము ఆఢకపరిమితంబును తక్కినద్రవములు నాల్గునుచేరి తైలమునకు నాలుగింతలకన్న కొంచెము అధికమగును. సర్వాంగసుందరవ్యాఖ్యయందు—"ఏతచ్చ జలాఢకశతే పక్త్వా, అఢకమాత్రస్థితే క్వాథే, దధ్యాదిభిస్తుల్యైః తైలాఢకం, అజాక్షీరస్యా

ఉర్ధ్వాఢకం, శమ్యాదిభిః పలోన్మితైః పచేత్" అని వివరింపబడినది. ఈభాగకల్పనము సమంజసమని తోచెడి. ఈపద్ధతి ననుసరించి ప్రకృతమూలమునను "శతిభాగస్థితే రసే" అనుపాఠమును అవలంబించుట చాల యుక్తియుక్తమని నాయభిమతము. ఒకవేళ ముద్రాపణమున నీపాఠము 'శత' అనుచోట 'దశ' అని పొరబాటుపడియుండునేమో!

మరియు నిచ్చట కర్పూరము మున్నగుగంధద్రవ్యములను తైలము సిద్ధమైనపిదప దింపి చల్లారినవెనుక చేర్పనగును. ఈవిషయమును "క్షిపేచ్చాత్రావతారితే, పత్రకల్కం తతః పూతం" అని సూచించిరి. తంత్రాంతరమునందు నిట్లుచెప్పబడినది:—"చూర్ణస్వరసపుష్పాణాం సిద్ధశీతేఽవతారితే, దీయతే గన్ధవృద్ధ్యర్థం పత్రకల్కో మనీషిభిః." ఈవచనముచేత గంధప్రధానమైన తైలమున వాసనద్రవ్యములను తైలాదులు చల్లారినపిదప జేర్పవలెనని తెలిసెడి.

### అమృతాదితైలము.

మూ. అమృతాయాః తులాః పఞ్చ ద్రోణేష్వష్టస్వపాం పచేత్. 157
పాదశేషే సమక్షీరం తైలస్య ద్వ్యాఢకం పచేత్,
ఏలామాంసీనతోశీరసారిబాకుష్ఠచన్దనైః. 158
బలాతామలకీమేదా శతపుష్పర్ధిజీవకైః,
(శతపుష్పా బలా మేదా మహామేదర్ధిజీవకైః,)
కాకోలీక్షీరకాకోలీశ్రావణ్యతిబలానఖైః. 159
మహాశ్రావణిజీవన్తీవిదారీకపికచ్ఛుభిః,
శతావరీమహామేదాకర్కటాఖ్యావృహారేణుభిః. 160
వచాగోక్షురకైరణ్డరాస్నాకాలాసహాచరైః,
వీరాశల్లకిముస్తత్వక్పత్రర్షభకవాలకైః. 161
సహైలాకుఙ్కుమస్పృక్కాత్రిదశాహ్వాశ్చ కార్షికైః,
మంజిష్ఠాయాస్త్రికర్షేణ మధూకాష్టపలేన చ. 162
కల్కైః తత్ క్షీణవీర్యాగ్నిబలసంమూఢచేతసః,
ఉన్మాదారత్యపస్మారైరార్తాంశ్చ ప్రకృతిం నయేత్. 163
వాతవ్యాధిహరం శ్రేష్ఠం తైలాగ్ర్యమమృతాహ్వయం,
కృష్ణాత్రేయేణ గురుణా భాషితం వైద్యపూజితమ్. 164
(ఇత్యమృతాద్యం తైలం.)

వ్యా. తిప్పతీగ అయిదునూర్లుపలములను నలియగొట్టి ఎనిమిదిద్రోణములజలమున పైచి నాల్గవపాలు (రెండుద్రోణములు) మిగులునట్లుకాచి యాకషాయమున రెండాఢకములు నువ్వులనూనెను, తైలమునకు సగము (రెండాఢకములు) ఆవుపాలను చేర్చి, అందు ఏలకులు, జటామాంసి, గ్రంథితగరము, వట్టివేళ్లు, సుగంధపాల, చెంగల్వకోష్ఠు, గంధపుచెక్క, చిట్టాముట్టి, నేలయుసిరిక, మేద, సదాపవిత్తులు, ఋద్ధి, జీవకము, కాకోలి, క్షీరకాకోలి, బోడతరము, పేరాముట్టి, నఖముచిప్పలు, పెద్దబోడతరము, మనుబాల, నేలగుమ్మడి, దూలగొండి, పిల్లిపీచర, మహామేద,కర్కాటకశృంగి, రేణుకలు, వస, పల్లేరు, ఆముదపువేళ్లు, సన్నరాష్ట్రము, నల్లసుగంధిపాల, గోరింటవేళ్లు, పిన్నపాపర, జీడిగింజలు, తుంగగడ్డలు, లవంగపుపట్ట,లవంగపుపత్రి, ఋషభకము, కురువేరు, ఏలకులు, కుంకుమపువ్వు, స్పృక్కయను గంధద్రవ్యము, దేవదారుచెక్క, ఇవి ఒక్కొక్కటి ఒక్కొక్కకర్షము; మంజిష్ఠి మూడుకర్షములు, అతిమధురము ఎనిమిదిపలములు, వీని నన్నిటిని నూరి కల్కముచేసి కలిపి(పైజెప్పిన క్వాథతైలకల్కముల నన్నిటి నొకటిగజేర్చి) తైలపాకవిధిప్రకారము తైలమును సిద్ధముచేయునది. దీని నుపయోగించుటవలన శరీరబలంబును, అగ్నిబలంబును క్షీణించినవారికి బలమును కల్గించును. ప్రజ్ఞతప్పినవారికి తెలివికల్గించును. ఉన్మాదము, అరతి, అపస్మారము, అను నీవ్యాధులచే పీడితులను, పైవ్యాధుల నివర్తింపజేసి సుఖము నొందించును. ఇయ్యది అమృతాదితైలమని చెప్పబడును. వాతవ్యాధుల హరించుటకిది మిగుల శ్రేష్ఠమయినది. ఆయుర్వేదమునకు గురువైన కృష్ణాత్రేయులచే నుపదేశింపబడి వైద్యవరులచే పూజింపబడినది.

(ఈతైలయోగమున అమృతాక్వాథము 8 ఆఢకములును క్షీరము రెండాఢకములును చేరి ద్రవము పదియాఢకములగును. రెండాఢకముల పరిమితమైన తైలమునపైజెప్పినద్రవమును ఏలాదిద్రవ్యకల్కమును చేర్చి తైలపాకమును సిద్ధముచేయునది.)

## రాస్నాతైలము.

మూ. రాస్నాసహస్రనిర్యూహే తైలద్రోణం విపాచయేత్,
గన్ధైర్హైమవతైః పిష్టైః ఏలాద్యైర్వాతనుత్. 165

(ఇతి రాస్నాతైలమ్.)

వ్యా. వేయిపలముల సన్నరాష్ట్రమును నాల్గింతలజలమున జేర్చి పాల్గవపాలు, (వేయిపలములు) మిగులునట్లు కషాయముకాచి, అందు ద్రోణ (నాలుగాఢకములు) నువ్వులనూనెను, హిమాచలమునపుట్టిన అగరు, చెంగల్వకోష్ఠు మున్నగుగంధద్రవ్యములను పైని అమృతాదితైలయోగమున కల్కద్రవ్యములుగ చెప్పబడిన ఏలకులు జటామాంసి

మున్నగు ద్రవ్యములను నూరి కల్కముచేసి కలిపి తైలపాకవిధిప్రకారము పక్వముచేయు నది. ఇది రాస్నాతైల మనబడును. వీని నుపయోగించిన వాతవ్యాధుల నన్నిటిని హరించును.

## అశ్వగంధాది తైలములు.

మూ. కల్కోఽయమశ్వగన్ధాయాం ప్రసారణ్యాం బలాద్వయే,
క్వాథకల్కపయోభిర్వా బలాదీనాం పచేత్పృథక్. 166

వ్యా. రాస్నాతైలమున చెప్పబడిన కల్పప్రకారము పెన్నేరుగడ్డను, గొంతెమ గోరును, చిట్టాముట్టిని, పేరాముట్టిని ఈనాల్గిటిని వేరువేరుగ పైజెప్పిన రాస్నాకషాయమువలె క్వాథములచేసికొని, అందు పైజెప్పిన యేలాది కల్కమును, ఆవుపాలను, తైలమును చేర్చి తైలయోగములను వేరువేరుగ సిద్ధముచేయునది. లేక అశ్వగంధాదులను నాల్గిటిని వేరువేరుగ క్వాథములచేసి, అందు ఆయాక్వాథమును కల్కముచేసి కలిపి ఆవుపాలను తైలమును చేర్చి తైలపాకవిధిప్రకారము తైలముల నాల్గిటిని సిద్ధముచేయునది.

## మూలకాది తైలము.

మూ. మూలకస్వరసక్షీరం తైలం దధ్యమ్లకాంజికం,
తుల్యం విపాచయేత్కల్కైర్బలాచిత్రకసైన్ధవైః. 167
పిప్పల్యతివిషారాస్నాచవికాగురుశిగ్రుకైః,
భల్లాతకవచాకుష్ఠశ్వదంష్ట్రావిశ్వభేషజైః. 168
పుష్కరాహ్వశటీబిల్వశతాహ్వానతదారుభిః,
తత్సిద్ధం పీతమత్యుగ్రాన్ హన్తి వాతాత్మకాన్ గదాన్. 169
(ఇతి మూలకాద్యం తైలమ్.)

వ్యా. ముల్లంగిగడ్డలరసము, ఆవుపాలు, నువ్వులనూనె, పెరుగు, పుల్లనిగంజి వీని నన్నిటిని సమభాగములుగగూర్చి, అందు చిట్టాముట్టి, చిత్రమూలము, సైంధవలవణము, పిప్పళ్లు, అతివస, నన్నరాష్ట్రము, చవ్యము, కృష్ణాగరు, మునగపట్ట, జీడిగింజలు, వస, చెంగల్వకోష్టు, పల్లేరుకాయలు, శుంఠి, పుష్కరమూలము, కచోరములు, మారేడువేరు, సదాపవిత్తులు, గ్రంథితగరము, దేవదారుచెక్క, వీనినన్నిటిని సమభాగములుగగూర్చి, కల్కముచేసి తైలమునకు నాల్గవవంతు కల్కమును కలిపి తైలపాకవిధిప్రకారము పక్వము చేయునది. దీనిని త్రాగినయెడ మిక్కిలి క్రూరములగు వాతవ్యాధులన్నియు నివర్తించును. ఇయ్యది మూలకాదితైల మనబడును.

### వృషమూలాది తైలము.

మూ. వృషమూలగుడూచ్యోశ్చ ద్విశతస్య శతస్య చ,
చిత్రకాత్ సాఽశ్వగన్ధాచ్చ క్వాథే తైలాఢకం పచేత్. 170
సక్షీరం వాయునా భగ్నే దద్యాజ్జర్జరితే తథా,
ప్రాక్తైలావాపసిద్ధం చ భవేదేతద్గుణోత్తరమ్. 171
(ఇతి వృషమూలాదితైలం)

వ్యా. ఆడ్డసరపువేళ్లు, తిప్పతీగె, ఈరెండును వేరువేరుగ నూరుపలముల వంతున చేరి రెండువందలపలములును; చిత్రమూలము, పెన్నేరుగడ్డ ఈరెండును వేరువేరుగ ఏబదిపలములవంతున చేరి నూరుపలములును; నాలుగింతలజలమున చేర్చి నాల్గవపాలు మిగుల కషాయముకాచి యీకషాయమున ఒకఆఢకము నువ్వులనూనెను, తైలమునకు సమభాగము ఆవుపాలను చేర్చి తైలపాకవిధిప్రకారము పక్వముచేసి పానాదుల కుపయోగించిన యెడ వాతవ్యాధిచే బ్రద్దలుగ పగులగొట్టినవిధముగను, తుత్తునియలుగ ఛేదింపబడినవిధముగను కల్గుబాధలు నివర్తించును.

మరియు పైజెప్పిన వృషమూలాదికషాయముతో కూడ మూలకాదితైలమున చెప్పబడిన, చిట్టాముట్టి, చిత్రమూలము మున్నగుద్రవ్యముల కల్కమునుకూడ కలిపి సిద్ధము చేయబడినతైలము మిక్కిలి గుణాధికమై యుండును. ఇది వృషమూలాదితైలము.

### మూలక (రాస్నాది) తైలము.

మూ. రాస్నాశిరీషయష్ట్యాహ్వాశుణ్ఠీసహాచరామృతాః,
శ్యోనాకదారుశమ్పాకహయగన్ధాత్రికణ్టకాః. 172
ఏషాన్దశపలాన్భాగాన్కషాయముపకల్పయేత్,
తతస్తేన కషాయేణ సర్వగన్ధైశ్చ కార్షికైః. 173
దధ్యారనాలమూషామ్బు(ష్ము)మూలకేక్షురసైః శుభైః,
పృథక్ప్రస్థోన్మితైస్సార్ధం తైలప్రస్థం విపాచయేత్. 174
ప్లీహామూత్ర(పార్శ్వ)గ్రహశ్వాసకాసమారుతరోగనుత్,
ఏతన్మూలకతైలాఖ్యం (రాస్నాతైలమితి ఖ్యాతమ్) వర్ణాయుర్బల
వర్ధనమ్. (ఇతి మూలక(రాస్నాది)తైలమ్.) 175

వ్యా. సన్నరాష్ట్రము, దిరిసెనపువేరు, అతిమధురము, శుంఠి, గోరింటవేరు, తిప్పతీగవేరు, పెద్దమ్రానువేరు, దేవదారువేరు, రేలవేరు, పెన్నేరుగడ్డ, పల్లేరువేళ్లు వీనిని ప్రత్యేకము పదేసిపలములవంతున భాగముల గల్పించి ఈకాష్ఠ్యసముదాయమునకు నాలుగింతలు జలము చేర్చి నాల్గవపాలు మిగుల కషాయమును సిద్ధముచేయునది. ఈకషాయమున బలాతైలమున చెప్పబడినయేలకులు మున్నగు గంధద్రవ్యములను ప్రత్యేక మొక్కొక్క కర్షము వంతున కూర్చి కల్కము చేసి, ఈకల్కమును పెరుగు, కాంజికము, మినుములు కషాయమును, ముల్లంగి స్వరసము, చెరకురసము, అను నీద్రవములను ఒక్కొక్క ప్రస్థము వంతున కలిపి ప్రస్థపరిమితమైన తైలముచు కూడ కలిపి (వీనినన్నిటి నొకటిగ గూర్చి), తైలపాకవిధిప్రకారము తైలమును పక్వముచేయునది. దీని నుపయోగించుటవలన ప్లీహమును, మూత్రబంధమును, శ్వాస-కాసములును, వాతవ్యాధుల నన్నిటిని హరించును. ఇయ్యది సన్నరాష్ట్రము మున్నగు మూలములను (వేళ్లను) చేర్చి సిద్ధము చేయబడినది కావున మూలకతైల మనియు, సన్నరాష్ట్రమును మొదలుగ చెప్పియుండుటవలన రాస్నాతైలమనియు చెప్పబడును. ఇయ్యది శరీరవర్ణమును, ఆయువును, బలమును మిక్కిలి వృద్ధి నొందించును.

## యవకోలాది తైలయోగములు.

మూ. యవకోలకులుత్థానాం మత్స్యానాం శిగ్రుబిల్వయోః,
రసేన మూలకానాం చ తైలం దధిపయోఽన్వితమ్. 176
సాధయిత్వా భిషగ్దద్యాత్ సర్వవాతామయాపహం,
లశునస్వరసే సిద్ధం తైలమేభిశ్చ వాతనుత్. 177

వ్యా. యవలు, రేగుపండ్లు, ఉలవలు, మత్స్యములు, మునగపట్ట, మారేడుపట్ట, వీనికషాయమును, ముల్లంగిస్వరసమును, పెరుగును, పాలును తైలమున సమభాగములుగ గూర్చి విధ్యుక్తప్రకారము తైలమును పక్వముచేసి యుపయోగించినచో వాతరోగముల నన్నిటిని హరించును. మరియు పైయోగమున జెప్పబడిన యవలు మున్నగువానికషాయమును మూలకస్వరసాదులను తెల్లగడ్డలస్వరసమును తైలమున జేర్చి పక్వముచేసి యుపయోగించినను వాతరోగముల హరించును.

## పైజెప్పబడిన తైలయోగములవిశేషగుణములు.

మూ. తైలాన్యేతాన్యృతుస్నాతామజ్జనాం పాయయేత చ,
పీతాన్యేతమమేషాం హి వన్ధ్యాపి జనయేత్సుతమ్. 178

వ్యా. సహాచర తైలము మొదలుచేసి పైఁజెప్పబడిన తైలములలో నెద్దానినైన ఋతుస్నానము చేసినస్త్రీకి త్రాగించినయెడ నాస్త్రీ గొడ్రాలైనను సంతతిబడయును. (స్త్రీపురుషులరజశ్శుక్రములు వాతముచే దుష్టమైనయెడ సంతానమునకు భంగము కలుగును. అందును స్త్రీలకు రజస్సును గర్భాశయంబును వాతముచే దుష్టమైనప్పుడు శోణితము గర్భోత్పత్తికి సమర్థము కాక స్త్రీలకు వంధ్యాత్వము సంభవించును. అట్టియెడ నీతైలముల పానాదుల కుపయోగించుటవలన ఆర్తవసంబంధమైన వాతదోషము శమించి, వంధ్యాత్వము తొలఁగి పుత్రోత్పత్తి కల్గునని భావము.)

వాతవ్యాధిహరములగునితరతైలయోగములు.

మూ. యచ్చ శీతజ్వరే తైలం అగుర్వాద్యముదాహృతం,
అనేకశతశ స్తచ్చ సిద్ధం స్యాద్వాతరోగనుత్. 179
వక్ష్యన్తే యాని తైలాని వాతశోణితకేఽపి చ,
తాని చాఽనిలశాన్త్యర్థం సిద్ధికామః ప్రయోజయేత్. 180

వ్యా. జ్వరచికిత్సితమున శీతజ్వరము నుద్దేశించి చెప్పబడిన తైలమును అచ్చట చెప్పబడిన తైలవిధానము ననుసరించియే యనేకపర్యాయములు మాటిమాటికి పక్వము చేసి యాతైలమును పానాదుల కుపయోగించినను వాతరోగముల నన్నిటిని హరించును. (ఇచ్చట జ్వరచికిత్సితమున 'అగురుకుష్ఠతగర' అని యుపక్రమించి చెప్పబడిన అగుర్వాది తైలము నెరుంగునది.)మరియుఁ వాతహరచికిత్సితమున చెప్పబడు సుకుమార-మధుపర్ణ్యాది అమృతాదితైలములు మున్నగు తైలములును వాతరోగములు శమించుటకై విశేషముగ నుపయోగింపనగును. (ఇచ్చట వాతరక్తచికిత్సితమున (౨౯. అ.) చెప్పబడిన సుకుమార తైలము, మధుపర్ణ్యాదితైలము మున్నగు తైలయోగముల నెరుంగునది).

వాతహరౌషధములలో తైలమునకు ప్రాశస్త్యము.

మూ. నాస్తి తైలాత్పరం కిఞ్చిత్ ఔషధం మారుతాఽపహం,
వ్యవాయ్యుష్ణగురుస్నేహాత్ సంస్కారాద్బలవత్తరమ్. 181
గణై ర్వాతహరై స్తస్మాత్ శతశోఽథ సహస్రశః,
సిద్ధం క్షిప్రతరం హన్తి సూక్ష్మమార్గస్థితాన్ గదాన్. 182

వ్యా. వాతరోగమును హరించుటకు తైలము దక్క వేరొండు ఔషధము లేదు. ఏలయనః—తైలమునందు వ్యవాయి (తొలుత శరీరమున వ్యాపించి పిమ్మట జీర్ణమగునది), ఉష్ణము, గురుత్వము, స్నిగ్ధత్వము, అనుగుణములు (వాతగుణములకు విరుద్ధములైనవి)

నైజముగ నుండుటవలన వాతమున కల్గినరోగములు సూక్ష్మమార్గముల జేరి యున్నను, ఆచ్చట వ్యాపించివానిని హరింప సమర్థమై యుండును. మరియు తైలము వస్త్వంతర సంయోగరూపమైన సంస్కారమును అనువర్తించి యుండును. కావున వాతహరములగు ద్రవ్యగుణముల జేర్చి పలుమారు సిద్ధముచేసినయెడ నతిశీఘ్రముగ సూక్ష్మమార్గముల నుండు వాతవ్యాధులనెల్ల హరింపగల్గును. (కావున వాతహరౌషధములలో తైలమును బోలిన వేరొండు ఔషధము లేదనుట.)

## పిత్తాదిసంసృష్టవాతచికిత్స.

మూ. క్రియా సాధారణీ సర్వా సంసృష్టే చాపి శస్యతే,
వాతే పిత్తాదిభిః స్రోతస్స్వావృతేషు విశేషతః. 183

వ్యా. వాతవ్యాధిచికిత్సాప్రారంభమున వాతాసాధారణముగ జెప్పబడిన సామాన్యచికిత్సను వాతమున కితరదోషసంసర్గము కల్గినప్పుడును పిత్తాదులు స్రోతస్సుల నావరించినపుడు చేయుట చాల ప్రశస్తము. అందును స్రోతస్సులను పిత్తాదు లావరించిన వాతసామాన్యచికిత్స విశేషముగ చేయనగును.

## పిత్తావృతవాతచికిత్స.

మూ. పిత్తావృతే విశేషేణ శీతాముష్ణాం తథా క్రియాం,
వ్యత్యాసాత్కారయేత్ సర్పిర్జీవనీయం చ శస్యతే. 184

వ్యా. స్రోతోమార్గము పిత్తముచే నావరింపబడినప్పుడు శీతరూపమైన చికిత్సను చేసి వెంటనే ఉష్ణరూపమైనచికిత్సను, మరల నుష్ణమును చేసి శీతక్రియను మార్చి మార్చి వ్యత్యాసముగ చేయుచుండవలెను. మరియు జీవనీయగణద్రవ్యముల జేర్చి సిద్ధముచేయబడిన ఘృతము నుపయోగించుటయు చాల ప్రశస్తము.

## పిత్తావృతవాతమునం దాహారాదులు.

మూ. ధన్వమాంసం యవాశ్శాలిః యాపనాః క్షీరవస్తయః,
విరేకః క్షీరపానం చ పఞ్చమూలీబలాశృతమ్. 185
మధుయష్టిబలాతైలఘృతక్షీరైశ్చ సేచనం,
పఞ్చమూలకషాయేణ కుర్యాద్వా శీతవారిణా. 186

వ్యా. జాంగలజంతువులమాంసంబును, యవలును, రాజనంపుబియ్యంబును ఆహారమున కుపయోగింపనగును. మరియు (సిద్ధిస్థానమున చెప్పబడు) యాపనవస్తులను, క్షీర

వస్తులను, విరేచనౌషధంబును ప్రయోగించుటయు, పంచమూలములను చిట్టాముట్టిని చేర్చి కాచబడిన యూవుపాలను త్రాగుటయు, అతిమధురమును చిట్టాముట్టిని చేర్చి కాచబడిన తైలముచేనైనను ఘృతముచేనైనను క్షీరముచేనైనను తడుపుటయు, లేక పంచమూలకషాయముచేనైనను చల్లనినీళ్లచేనైనను తడుపుటయు, పిత్తముచే వాతమార్గ మడ్డగింపబడినప్పుడు మిక్కిలి హితకరము.

## కఫావృతవాతచికిత్స.

మూ. కఫావృతే యవాన్నాని జాఙ్గలాః మృగపక్షిణః,
స్వేదా స్తీక్ష్ణాః నిరూహాశ్చ వమనం సవిరేచనమ్. 187
జీర్ణం సర్పిః తథా తైలం తిలసర్షపజం హితం,

వ్యా. వాతము కఫముచే నావరింపబడినప్పుడు యవాన్నంబును, జాంగలదేశము నందలి మృగములయొక్కయు పక్షులయొక్కయు మాంసంబులును, తీక్ష్ణములగు స్వేద విధులును, నిరూహవస్తిని ప్రయోగించుటయు, వమనవిరేచనంబులును, ప్రాతనెయ్యియు, నువ్వులయొక్కయు ఆవాలయొక్కయు తైలంబులును మిక్కిలి హితకరములు.

## కఫపిత్తసంసృష్టవాతచికిత్స.

మూ. సంసృష్టే కఫపిత్తాభ్యాం పిత్తమాదౌ వినిర్జయేత్,

వ్యా. వాతము కఫపిత్తముల రెండింటితో సంసర్గము కల్గియున్నపుడు తొలుత పిత్తమునకు చికిత్సచేసి శాంతమైనపిదప కఫమునకు చికిత్సచేయవలెను. (కఫమునకన్న పిత్తము శీఘ్రకారికావున తొలుత పిత్తమును శమింపజేసి పిమ్మట కఫమునకు చికిత్సచేయ వలెనని భావము.)

## స్థానవిశేషమునుబట్టి వాతచికిత్సావిధి.

మూ. ఆమాశయగతం మత్వా (దృష్ట్వా) కఫం వమనమాచరేత్. 188
పక్వాశయే విరేకం తు పిత్తే సర్వత్రగే తథా,
స్వేదైర్విష్యన్దితః శ్లేష్మా యదా పక్వాశయే స్థితః. 189
పిత్తం వా దర్శయేల్లిఙ్గం వస్తిభిస్తా వినిర్హరేత్,

వ్యా. (వాతానుబంధమైన) కఫము ఆమాశయమున చేరినపుడు వమనరూపమైన చికిత్స చేయనగును. (కఫము వాతమున కనుబంధముగ నున్నను ఆమాశయము కఫస్థాన మగుటంజేసి కఫనిర్హరణమునకై స్థానానుగుణమైన వమనమును చేయనగునని భావము.) మరియు నట్టి కఫము పక్వాశయమున చేరియున్నయెడ విరేచనము చేయింపవలెను,

పిత్తము పక్వాశయమున చేరియున్నను స్థానాంతరమున చేరియున్నను (వాతమున కను బంధమైనపుడు) విరేచనమును చేయించుట యుక్తము.

మరియుం స్వేదవిధిచే కఫము పలుచనై కరగి పక్వాశయమున చేరియున్నపుడును, పిత్తము పక్వాశయముననుండి తన లక్షణముల జూపుచున్నను అట్టి కఫపిత్తములను వస్తి ప్రయోగములచే వెడలించవలెను.

## శ్లేష్మానుబంధవాతచికిత్స.

మూ. శ్లేష్మణానుగతం వాతం ఉష్ణైర్గోమూత్రసంయుతైః. 190
నిరూహైః, పిత్తసంసృష్టం నిర్హరేత్ క్షీరసంయుతైః,
మధురౌషధసిద్ధైశ్చ తైలైస్తం అనువాసయేత్. 191

వ్యా. శ్లేష్మతో కలసిన వాతమున గోమూత్రముతో కూడిన యుష్ణవీర్యములగు పదార్థములచే సిద్ధముచేయబడిన నిరూహవస్తులచే చికిత్స చేయనగును. అట్టివాతము పిత్తముతో కూడినపుడు పాలతోకూడిన నిరూహవస్తుల ప్రయోగించవలయును. మరియు మధురద్రవ్యముల చేర్చి పక్వముచేయబడిన తైలములచే అనువాసనవస్తి ప్రయోగము చేయనగును.

## శిరోగతవాతచికిత్స.

మూ. శిరోగతే తు సకఫే ధూమనస్యాది కారయేత్,
హృతే పిత్తే కఫే యస్యాదురస్రోతోఽనుగోఽనిలః. 192
సశేషః స్యాత్ క్రియా తత్ర కార్యా కేవలవాతికీ,

వ్యా. కఫముతో కూడిన వాతము శిరస్సున చేరియున్నయెడ ధూమపానము, నస్యము మున్నగు చికిత్సల జేయనగును. పైజెప్పిన చికిత్సావిధానముచే వాతమున కనుబంధమయిన కఫమును, పిత్తమును వెడలినపిదప కేవలము వాతమునుమాత్రము శమింపక సశేషమై యురస్సునందును స్రోతస్సులయందును చేరియున్నయెడ కేవలము వాతమునకు మాత్రము చెప్పియుండుచికిత్స చేయనగును.

## రక్తావృతవాతచికిత్స.

మూ. శోణితేనావృతే కుర్యాద్వాతశోణితకీం క్రియామ్. 193

వ్యా. వాతము రక్తముచే నావరించి యున్నపుడు వాతరక్తమునకు చెప్పబడు చికిత్సావిధానము చేయనగును.

ఆమ-మాంసాద్యావృతవాతచికిత్స.

మూ. ప్రమేహవాతమేదోఘ్నమామవాతే ప్రయోజయేత్,
స్వేదాభ్యఙ్గరసక్షీరస్నేహా మాంసావృతే హితాః. 194
మహాస్నేహోఽస్థిమజ్జస్థే పూర్వవద్రేతసావృతే,
అన్నావృతే తదుల్లేఖః పాచనం దీపనం లఘు. 195
మూత్రలాని తు మూత్రేణ స్వేదాః సోత్తరవస్తయః,
శకృతా తైలమేరణ్డం స్నిగ్ధోదావర్తవత్క్రియాః. 196

వ్యా. వాతము ఆమరసముతో కూడి యున్నపుడు ప్రమేహమును, వాతమును, మేదస్సును హరించునట్టి చికిత్స లన్నిటిని చేయదగును. వాతము మాంసముచే నావరింపబడినపుడు స్వేదమును, అభ్యంగమును, మాంసరసములును, క్షీరమును, స్నేహములను నుపయోగింపదగును. అస్థిచేతను, మజ్జచేతను నావరింపబడినపుడు పైజెప్పబడిన మహాస్నేహమును అభ్యంగాదులకు నుపయోగింపదగును. శుక్రముచే నావరింపబడినపుడు శుక్రగత వాతమునకు చెప్పిన చికిత్సల చేయనగును. వాతము అన్నముచే నావరింపబడినపుడు అట్టి యన్నమును వమనము చేయించి నాహారమును పచింపచేయునదియు, అగ్నిని దీపింపచేయునదియు, లఘుగుణంబును నగు నౌషధాదులచే చికిత్సచేయనగును. మూత్రముచే నావరింపబడిన యెడ మూత్రమును వృద్ధినొందించు నౌషధములను, స్వేదములను, ఉత్తరవస్తులను ప్రయోగింపవలయును. పురీషముచే నావరింపబడినపుడు ఏరండతైలమును నుపయోగింపదగును. మరియు ఉదావర్తమునకు చెప్పిన స్నేహమును వస్తులు మున్నగునవి యుపయోగింపదగును.

ఇచ్చట "మహాస్నేహోఽస్థిమజ్జస్థే పూర్వవద్రేతసాఽఽవృతే" అనుచోట 'ప్రస్థస్యాత్త్రిఫలాయాస్తు......తదభ్యఙ్గే ప్రయోజయేత్" (శ్లో ౧౨౯-౧౩౩) అని చెప్పబడిన మహాస్నేహమును "హర్షోన్నపానం శుక్రస్థే" శ్లో.౯౪) అని యుపక్రమించి చెప్పబడిన శుక్రస్థవాతచికిత్సను గ్రహించునది.

స్వస్థానబలానుసారముగ చికిత్సావిధి.

మూ. స్వస్థానస్థో బలీ దోషః ప్రాక్తం స్వైరౌషధైర్జయేత్,
వమనైర్వా విరేకైర్వా వస్తిభిః శమనేన వా. 197

వ్యా. వాతాదిదోషములలో నేదియైనను దానికి నియమితమైన స్థలమున నుండినచో మిక్కిలి బలిష్ఠముగ నుండును. కావున తొలుత నాయాదోషమునకు సంబం

ధించిన యౌషధములచే వమనములనైనను, విరేకములనైనను, వస్తిప్రయోగమునైనను, చేసి శమింపచేయనగును. అట్టిశోధనమునుచేయ నర్హముకానియెడల ఆయాదోషమునకు సంబంధించిన శమనచికిత్సనైన చేయనగును.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—వాతపిత్తకఫములు మూడు నియతమైన వానివాని స్థానములయం దున్నపుడు బలవత్తరము లగును. అట్టియెడ ఆమూటిలో నేదైన నొకదోషము ప్రకుపితమై ఇతరదోషస్థానమున చేరినపుడు ఆస్థానమునందలి దోషమును దానికి విహితమైన చికిత్సచే శమింపజేసి పిదప ప్రకోపమునొందిన దోషమునకు చికిత్స చేయవలయును. ఎట్టులనః—ప్రకోపమునొందిన వాతము కఫముతో కూడి కఫమునకు స్వస్థానమైన ఆమాశయమున చేరినపుడు తొలుత ఆస్థానమునందలి కఫమును వమనముచే వెడలించియైనను, లేక శమనచికిత్సచే శమనము చేసియైనను, పిదప ఆస్థానమునకు చేరిన వాతమునకు చికిత్సచేయవలయును. ఇత్తెరంగుననే పిత్తస్థానమున చేరినపుడు పిత్తమునకు చేరిన విరేకంబును వాతస్థానమున చేరినపుడు వస్తిప్రయోగంబున చేసి ఆయాస్థానమునకు సంబంధించినదోషములను శమింపచేయవలయునని భావము.

### ఉక్తవిషయసంగ్రహము.

మూ. ఇత్యుక్తమావృతే వాతే పిత్తాదిభిర్యథాయథమ్,

వ్యా. ఇత్తెరంగున పిత్తకఫాదులచే నావరింపబడిన వాతమునకు ఆయాయావరణభేదము ననుసరించి తత్తదనుకూలమైన చికిత్స వివరింపబడినది.

### ప్రాణాదిపంచవాతముల పరస్పరావరణము.

మూ. మారుతానాం హి పఞ్చానాం అన్యోన్యావరణే శృణు. 198
లిఙ్గం వ్యాససమాసాభ్యాముచ్యమానం మయాఽనఘ,
ప్రాణో వృణోత్యుదానాదీన్ప్రాణం వృణ్వన్తి తేఽపి చ. 199
ఉదానాద్యాస్తథాన్యోన్యం సర్వ ఏవ యథాక్రమమ్,
వింశత్యావరణాన్యేతాన్యుల్బణానాం పరస్పరమ్. 200
మారుతానాం హి పఞ్చానాం తాని సమ్యక్ప్రతర్కయేత్,

వ్యా. ప్రాణము, ఉదానము, వ్యానము, సమానము, అపానము, అని ఐదువిధము లయిన వాతములకును ఒకదానినొకటి నావరించుటచే గల్గు లక్షణములను వేరువేరుగ విస్తరించియు సంగ్రహముగను నీక్రింద జెప్పబడును.

అందు ప్రాణవాతము తక్కిన యుదానాది నాల్గువాతములను ఆవరించును. ఇత్తెరంగుననే ఉదానాది వాతములు నాల్గును ఒక్కొక్కటి ప్రాణవాతము నావరించును.

ఉదానాదివాతములు నాల్గును పైజెప్పినవిధముననే ఒకదాని నొకటి నావరించును. ఇత్తెరంగున నావరణభేదములు ఇరువది యగును. మరియు నందును ఉల్బణాదిభేదములచే పరస్పరమావరించుటవలన అనేకభేదము లగును. అట్టియావరణభేదములను ఐదువిధము లయిన వాతములయొక్క లక్షణములబట్టి వేరువేరుగ నూహింపవగును.

వివరణము—ప్రాణవాతము ఉదానాదివాతముల నాల్గిటిని నావరించినపుడు (1) ప్రాణవృత-ఉదానవాత, (2) ప్రాణావృత-వ్యానవాతము, (3) ప్రాణావృత సమాన వాతము, (4) ప్రాణావృత అపానవాతము అని నాల్గువిధములగును.

మరియు ప్రాణవాతమును తక్కిన యుదానాదివాతములు ఒక్కొక్కటి యావ రించుట ఉదానావృతప్రాణవాతము (5), (6) వ్యానావృతప్రాణవాతము, (7) సమానా వృతప్రాణవాతము, (8) అపానావృతప్రాణవాతమని నాల్గు తెరంగులు.

ఇత్తెరంగుననే యుదానవాతమును తక్కిన మూడు వాతములును వేరువేరుగ నావరించుటవలన (9) వ్యానావృత ఉదానవాతము, (10) సనావృత ఉదానవాతము, (11) అపానావృత ఉదానవాతము, అని మూడువిధములు. ఇత్తెరంగుననే ఉదాన వాతముచే వ్యానాదివాతములు మూడును నావరించుటవలన (12) ఉదానావృత వ్యాన వాతము, (13) ఉదానావృతసమానవాతము, (14) ఉదానావృత అపానవాతమునని మూడువిధములు. మరియు వ్యానవాతము తక్కిన రెండువాతములచే వేరువేరు నావ రించుటవలన (15) వ్యానావృతసమానవాతము, (16) వ్యానావృతఅపానవాతము అని రెండువిధములుగను, సమానఅపానములచే వ్యానము ఆవరింపబడుటవలద (17) సమానా వృతవ్యానము (18) అపానావృతవ్యానము నని రెండువిధములు. సమానవాతముచే అపానవాతము ఆవరించుటవలన (19) సమానావృత అపానంబును, అపానముచే సమా నము ఆవరించుటవలన (20) అపానావృతసమానమనియు నగును. ఇత్తెరంగున ప్రాణాది పంచవాతములయొక్క పరస్పరావరణముచే కల్గునావరణవాతములు ఇరువదివిధములని యెరుంగునది. మరియు పైజెప్పిన యావరణభేదములలో రెండేసి వాతభేదములు చేరిన యావరణభేదములును ద్వ్యుల్బణ ఏకోల్బణాదిభేదములచేతను ఆవరణభేదము లనేకము లగును. ఈవిషయమునే "ద్వ్యుల్బణానాం పరస్పరమ్ మారుతానాం పఞ్చానాం తాని సమ్యక్ప్రతర్కయేత్" అనువాక్యముచే తంత్రకారులు సూచించిరి.

### ప్రాణావృతవ్యానవాతలక్షణము, చికిత్స.

మూ. సర్వేన్ద్రియాణాం శూన్యత్వం జ్ఞాత్వా స్మృతిబలక్షయమ్. 201
వ్యానే ప్రాణావృతే లిఙ్గం కర్మ తత్రోర్ధ్వజత్రుకమ్,

వ్యా. ప్రాణవాతముచే వ్యానవాత మావరింపబడినప్పుడు చక్షురాదీంద్రియ వ్యాపారము లుడుగును. జ్ఞాపకశక్తియు శరీరబలంబును క్షీణించును. అట్టియెడ కంఠమునకు పైభాగమునందలి చేయదగిన చికిత్స యుక్తముగనుండును.

### వ్యానావృతప్రాణవాతలక్షణము, చికిత్స.

మూ. స్వేదోఽత్యర్థం లోమహర్షః త్వగ్దోషః సుప్తగాత్రతా. 202
ప్రాణే వ్యానావృతే తత్ర స్నేహయుక్తం విరేచనమ్,

వ్యా. ప్రాణవాతము వ్యానవాతముచే నావృతమైనప్పుడు శరీరముపై నధికముగ చెమటపట్టును. లోమహర్షము కల్గును. చర్మము దుష్టమై దాన సంభవించు వ్యాధులు కల్గును. శరీరము స్పర్శజ్ఞానము నెరుంగకుండును. అట్టియెడ స్నేహద్రవ్యముతో గూడిన విరేచనౌషధము సేవించవలెను.

### ప్రాణావృతసమానవాతలక్షణము, చికిత్స.

మూ. ప్రాణావృతే సమానే స్యుః జడగద్గదమూకతాః. 203
చతుష్ప్రయోగాశ్శస్యన్తే స్నేహాస్తత్ర సయాపనాః,

వ్యా. సమానవాతము ప్రాణవాతముచే నావరింపబడినప్పుడు మందుడై యేమియు నెరుంగజాలడు. గద్గదస్వరముతో మాటలాడును. మాటరాక మూగయగును. అట్టియెడ పాన-అభ్యంజన-నస్య-అనువాసనవస్తులను స్నేహద్రవ్యములచే చేయుటయు (కల్పస్థానమున చెప్పబడు) యాపనవస్తుల ప్రయోగించుటయు నుచితము.

### సమానావృత-అపానవాతలక్షణము, చికిత్స.

మూ సమానేనావృతేఽపానే గ్రహణీపార్శ్వహృద్గదాః. 204
శూలం చామాశయే, తత్ర దీపనం సర్పిరిష్యతే,

వ్యా. అపానవాతము సమానవాతముచే నావరింపబడినయెడ గ్రహణీరోగంబును, ఇరుప్రక్కల నొప్పియు, హృదయరోగంబును, ఆమాశయమున శూలనొప్పియు కల్గును. అట్టియెడ అగ్నిని దీపింపజేయు ఘృతము నుపయోగింపనగును.

### ప్రాణావృత-ఉదానవాతలక్షణము, చికిత్స.

మూ. శిరోగ్రహః ప్రతీశ్యాయః నిశ్వాసోచ్ఛ్వాససఙ్గ్రహః. 205
హృద్రోగో ముఖశోషశ్చాఽప్యుదానే ప్రాణసంవృతే,
తత్రోర్ధ్వభాగికం కర్మ కార్యమాశ్వాసనం తథా. 206
కర్మ,

వ్యా. ఉదానవాతము ప్రాణవాతముచే నావరింపబడినప్పుడు తలనొప్పియు, పడిసంబును కలుగును. నిశ్వాస-ఉచ్ఛ్వాసములు సరళముగ వెడలక బంధింపబడును. హృద్రోగము కల్గును. నోట ద్రవములేక యెండును. అప్పుడు కంఠమునకు పైభాగమున చేయదగిన శిరోవిరేచనము నస్యము స్నేహపానము మున్నగు చికిత్స చేయవలెను. శరీరమున కాయాసమును గల్గింపక సేదదీర్చుటకు దగినచికిత్సయుం చేయనగును.

ఉదానావృతప్రాణవాతలక్షణము, చికిత్స.

మూ. ఓజోబలవర్ణానాం నాశో మృత్యురథాపి వా,
ఉదానేనావృతే ప్రాణే, తం శనైశ్శీతవారిణా. 207
సిఞ్చేత్, ఆశ్వాసయేచ్చైనం, సుఖం చైవోపపాదయేత్,

వ్యా. ప్రాణవాతము ఉదానవాతముచే నావరింపబడినప్పుడు శరీరమునందలి యోజస్సును బలంబును వర్ణంబును నశించును. ఒకవేళ మరణము కూడ సంభవించును. అట్టిరోగిని చల్లనినీళ్లచే మెలమెల్లగ తడుపుచు నూరడించి, వానికి సుఖమును కల్గించు నుపాయముల చేయవలెను.

ఉదానావృత-అపానవాతలక్షణము, చికిత్స.

మూ. ఊర్ధ్వగేనావృతేఽపానే ఛర్దిశ్వాసాదయో గదాః. 208
స్యుర్వాతే, తత్ర వస్త్యాది భోజ్యం చైవాఽనులోమనమ్,

వ్యా. శరీరమునం దూర్ధ్వముగ వ్యాపించు (ఉదాన) వాతముచేత (అధోగమనము కల) అపానవాతము ఆవరింపబడినప్పుడు వాంతి, శ్వాసము, కాసము, హిక్క మున్నగు వ్యాధులు సంభవించును. అట్టియెడ వస్తికర్మంబును, వాతము ననులోమముగ (క్రిందికి) సంచరింపజేయగల్గిన యాహారంబులు నుపయోగింపందగును.

అపానావృత-ఉదానవాతలక్షణము, చికిత్స.

మూ. మోహోఽల్పోఽగ్నిరతీసారః ఊర్ధ్వగేఽపానసంవృతే. 209
వాతే స్యాత్, వమనం తత్ర దీపనం గ్రాహి చాఽశనమ్,

వ్యా. ఉదానవాతము అపానవాతముచే నావరింపబడిన యెడ మూర్ఛ గ్రమ్మును. జఠరాగ్ని మందగించును. అతిసారము కల్గును. ఆరోగికి వమనముచేయించి అగ్నిని దీపింపచేయునదియు, మలమును నిరోధించునదియు దోషముల శమింపచేయునదియు నగు నాహారముల నుపయోగింపవలెను.

వ్యానావృత-అపానవాతలక్షణము, చికిత్స.

మూ. వమ్యాధ్మానముదావర్తగుల్మార్తిపరికర్తికాః. 210
లిఙ్గం వ్యానావృతేఽపానే తం స్నిగ్ధైరనులోమయేత్,

వ్యా. అపానవాతము వ్యానవాతముచే నావృతమైనపుడు వమనమగును. కడుపుబ్బరించును. ఉదావర్తంబును గుల్మంబును కల్గును కత్తిరించినవిధముగ కోతపుట్టును. ఈవాతమును స్నిగ్ధములగు నౌషధాదులచేత ననులోమముగ సంచరింపజేయవలెను.

అపానావృతవ్యానవాతలక్షణము, చికిత్స.

మూ. అపానేనావృతే వ్యానే భవేద్విణ్మూత్రరేతసామ్. 211
అతిప్రవృత్తిః, తత్రాపి సర్వం సంగ్రహణం మతమ్,

వ్యా. వ్యానవాతము అపానవాతముచే నావరింపబడినప్పుడు పురీషంబును మూత్రంబును రేతస్సును అధికముగ వెడలును. అప్పుడు మలమూత్రరేతస్సులను అధికముగ వెడలనీయక ఆపుటకై గ్రాహి (అగ్నిని దీపింపజేసి ఆహారమును పచింపజేసి ద్రవమును శుష్కింపజేయు) ఔషధములను ఆహారములను ఉపయోగింపవలెను.

గ్రాహ్యౌషధలక్షణము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"దీపనం పాచనం యత్స్యాత్ ఉష్ణత్వాద్ద్రవశోషణమ్, గ్రాహి తచ్చ యథా శుణ్ఠీ జీరకా గజపిప్పలీ."

సమానావృతవ్యానవాతలక్షణము, చికిత్స.

మూ. మూర్ఛా తన్ద్రా ప్రలాపోఽఙ్గసాదోఽగ్న్యోజోబలక్షయః. 212
సమానేనావృతే వ్యానే, వ్యాయామో లఘుభోజనమ్,

వ్యా. వ్యానవాతము సమానవాతముచే నావృతమైనపుడు మూర్ఛయు, కునికిపాటును కల్గును, అసంబద్ధముగ మాటలాడును. శరీరము కృశించును. కాయాగ్నియు ఓజస్సును శరీరబలంబును నశించును. అట్టియెడ శరీరవ్యాయామంబును, స్వల్పముగ భుజించుటయు హితముగ నుండును.

ఉదానావృతవ్యానవాతలక్షణము, చికిత్స.

మూ. స్తబ్ధతాఽల్పాఽగ్నితాఽస్వేదః చేష్టాహానిః నిమీలనమ్. 213
ఉదానేనావృతే వ్యానే, తత్ర పథ్యం మితం లఘు,

వ్యా. ఉదానవాతముచే వ్యానవాత మావరింపబడినపుడు అవయవములు స్తంభించును. జాఠరాగ్ని మందగించును. శరీరముపై చెమట బట్టును. ఆంగికవ్యాపారములకు

హానికల్గును. కండ్లు మూయబడును. అప్పుడు తేలికయైన పదార్థముల మితముగభుజించుట హితకరము.

### అనుక్తావరణవాతలక్షణ-చికిత్సానిర్దేశము.

మూ. పఞ్చాఽన్యోన్యావృతానేవం వాతాన్ బుధ్యేత లక్షణైః. 214
ఏషాం స్వకర్మణాం హానిః వృద్ధిర్వా వరణే మతా,
యథాస్థూలం సముద్దిష్టం ఏతదావరణేఽష్టకమ్. 215
సలిఙ్గభేషజం సమ్యక్ బుధానాం బుద్ధివృద్ధయే,

వ్యా. ఇత్తెరంగున ప్రాణ-ఉదాన-వ్యాన-సమాన-అపాన భేదములచే నైదువిధములైన వాతములును ఒకదానితో నొకటి యావరింపబడుటచే గల్గు భేదముల (పండ్రెండును) వానివానికి వేరువేరుగ జెప్పబడిన లక్షణముల బట్టి యెరుంగునది.

మరియు ఒకవాతము ఇంకొకవాతముచే నావరింపబడినప్పుడు ఆవాతము నియతముగ జేయు కృత్యములకు హానియైనను వృద్ధియైనను కల్గును. ఇది వాతావరణ సామాన్యముగ స్థూలభావముచే నుద్దేశింపబడిన లక్షణము. ఈస్థూలభావముగ జెప్పబడిన యావరణసామాన్యలక్షణముచేతనే పైని చెప్పబడిన పండ్రెండు ఆవరణవాతములు గాక తక్కిన యెనిమిది యావరణవాతములకును వేరువేరు లక్షణములను, తత్తదనుగుణములగు చికిత్సలను చక్కగ నూహించుటకై యచ్చట నిర్దేశింపబడినది.

ఇచ్చట నొకవాతము ఇంకొకవాతముచే నావరింపబడినప్పుడు ఆవరింపబడిన వాతము దుర్బలములగుటవలన స్వకార్యముల జేయనేరక యుండును. ఒకసమయమున నయ్యది నిరోధమునం జేసి ప్రకోపించినయెడ తనకృత్యములను అధికముగ జేయును. ఈవిషయమునే "కర్మణాం హానిః, వృద్ధిర్వా" అని తంత్రకారులు నిర్దేశించిరని యెరుంగునది.

వాతము రూపవంతము కాదని వాతకలాకలీయమున చెప్పబడినది. అట్టియెడ వాతమునకు అవాంతరభేదములెట్లు కల్గును? నిరవయవమైన వాతమునకు సమానజాతీయమైన యితరవాతముచే నిరోధ మెట్లు కల్గును? అను ప్రశ్నములు కల్గును. దానికిట్లుత్తరము చెప్పనగును:—'అసఙ్ఘాతవన్తం' అని వాతకలాకలీయమున చెప్పినదానికి తక్కినసామాన్యద్రవ్యములవలె కఠినమైనరూపము లేక కేవలము స్పర్శమాత్రగ్రాహ్య సూక్ష్మరూపము కల్గినదని యర్థముచక్షుర్గ్రాహ్యమైన ఘనరూపము లేకున్నను స్పర్శగ్రాహ్యసూక్ష్మరూపము వాతమునకు కలదనియే భావము. అట్టి సూక్ష్మరూపమైనవాతము స్థానభేదములబట్టియు, కృత్యభేదములం జేసియు ప్రాణాది యవాంతరభేదములు కల్గియుండును, వానిలో నొక

దానిచే నింకొకదానికి నిరోధము కల్గినప్పుడు, పిత్తకఫాదులయావరణమున గల్గువిధము గనే ప్రకోపము కల్గును. లోకమున బాహ్యవాతమునందును ఇట్టి వైకృతమును జూచుచున్నాము. ఒకముఖముగ సంచరించు గాలికి దానికి ప్రతిలోమముగ సంచరించు నింకొక గాలిలో నభిఘర్షణము కల్గినప్పుడు సుడిగాలిగ మారి దిరదిర దిరుగుచుండుట యందరకును ప్రత్యక్షము కదా. అత్తెరంగుననే ప్రాణాదివాతములలో నొండొంట నావరణము కల్గినప్పుడు అట్టి సంఘర్షణముచే ప్రకోపము కల్గుట విరుద్ధముకాదని యెరుంగునది.

## ఉక్తానుక్తఆవృతవాతచికిత్సానియమము.

మూ. స్థానాన్యవేక్ష్య వాతానాం వృద్ధిం హానిం చ కర్మణామ్. 216
ద్వాదశావరణాన్యన్యాన్యభిలక్ష్య భిషగ్జితమ్,
కుర్యాదభ్యఞ్జనస్నేహపానవస్త్యాదిసర్వశః (నస్యపానాదిసర్వతః.)
క్రమముష్ణమనుష్ణం వా వ్యత్యాసాదవచారయేత్,

వ్యా. పైని లక్షణములచే నిర్దేశింపబడిన పండ్రెండు ఆవరణవాతములకును ప్రత్యేకముగ లక్షణముల నిర్దేశింపకుండు సెనిమిదియావరణవాతములకును వానివాని స్థానములను వానివానికి నిర్ణీతములగు కృత్యములయొక్క హానివృద్ధులను చక్కగ గమనించి తత్తదనుగుణముగ అభ్యంజనము, స్నేహపానము, నస్యము, వస్తికర్మము మున్నగు చికిత్సలను చేయనగును. మరియు వానివాని స్థానాదిభేదములను గమనించి ఉష్ణరూపమయిన చికిత్సాక్రమమును, శీతరూపమయిన చికిత్సాక్రమమును, తత్తదనుగుణముగ మార్చుచు చికిత్సకుడు పొరబాటుబడక చికిత్స జేయవలయును. (ఇచ్చట వాతమునకు ఉష్ణరూపమయిన చికిత్సాక్రమమే యౌగికముగ నున్నను ఆనూశయాదిస్థానభేదమును రక్తాదిదూష్యములను అనుసరించి అట్టిశీతోష్ణక్రమమును వ్యత్యాసముగ మార్చుచు చికిత్స చేయుట యుచితమని చెప్పబడినది.)

## ప్రకుపితప్రాణాదివాతములను స్వస్థానములజేర్చువిధము.

మూ. ఉదానం యోజయేదూర్ధ్వం అపానం చానులోమయేత్. 218
సమానం సమయేచ్చైవ త్రిధా వ్యానం తు యోజయేత్,
ప్రాణో రక్ష్యశ్చతుర్భ్యోఽపి స్థానే హ్యస్య స్థితిర్ధ్రువా. 219
స్వం స్థానం గమయేదేవం వృతానేతాన్విమార్గగాన్,

వ్యా. పైజెప్పినరీతిగ ప్రాణాదివాతములకు అన్యోన్య ఆవరణముచే ప్రకోపము కల్గి ఇతరస్థానముల వ్యాపించినపుడు ఆట్టి ప్రకుపితవాతమును వానివానికి నియతమైన

స్వస్థానమును వమనవిరేచనాది చికిత్సావిధానములచే జేర్పవలయును. అందు ప్రకుపిత మైన యుదానవాతమును శరీరమునం దూర్ధ్వభాగమున జేర్పనగును. అపానవాతమును అనులోమనరూపమయిన చికిత్సను జేసి శరీరమునం దధోభాగమున జేర్పవలయును. సమానవాతమును శరీరమధ్యమున జేర్పనగును. వ్యానవాతమును శరీరమునం దంతట వ్యాపించునది గావున ఊర్ధ్వభాగమునను, అధోభాగమునను, శరీరమధ్యప్రదేశమునను జేర్పవలయును. ప్రాణవాతమునకు తక్కినయుదానాదివాతములచే నావరణము గల్గినపుడు వానిచే వీనికి హాని కల్గనీయక స్వస్థానమున జేర్చి మిగుల ప్రయత్నముతో కాపాడవలయును. ప్రాణవాతము ముఖ్యముగ హృదయస్థానముననుండి ప్రాణి జీవించుట ప్రధాన మగుటవలన అట్టి ప్రాణవాతమును హాని కల్గనీయక మిగుల జాగరూకతతో కాపాడవలయును. ఇత్తెరంగున నావృతవాతములను ఇతరమార్గములసంచారము నుండి తగుచికిత్సలచే మరలించి వానివాని స్థానమున జేర్పవలయును.

## పిత్తావృతప్రాణవాతలక్షణము.

మూ. మూర్ఛా దాహో భ్రమశ్శూలం విదాహశ్శీతకామితా. 220
ఛర్దనం చ విదగ్ధస్య ప్రాణే పిత్తసమావృతే,

వ్యా. ప్రాణవాతము పిత్తముచే నావరింపబడినపుడు మూర్ఛ గలుగును, మంట పుట్టును, ఒడలు తిరుగును, శూలనొప్పి కల్గును, ఆహారము విదగ్ధపాకము నొందును, శీతోపచారముల కోరును, విదగ్ధపాకము నొందిన యాహారరసము వాంతియగును.

## కఫావృతప్రాణవాతలక్షణములు.

మూ. ష్ఠీవనం క్షువథూద్గారనిశ్శ్వాసోచ్ఛ్వాససఙ్గ్రహః. 221
ప్రాణే కఫావృతే రూపాణ్యరుచిశ్ఛర్దిరేవ చ,

వ్యా. ప్రాణవాతము కఫముచే నావరింపబడినపుడు నోట కఫము నుమియును. తుమ్ములును, త్రేనుపులును, నిశ్శ్వాసోచ్ఛ్వాసంబులును సరళముగ వెడలక నిరోధింపబడును. అరుచి కల్గును. వాంతి యగును ఇచ్చట పిత్తకఫములు రెండును కలసి ప్రాణవాతము నావరించినపుడు పైజెప్పిన వేరువేరులక్షణములు కలిసి యుండునని సంసర్గలక్షణముల నెరుంగునది. ఇత్తెరంగుననే క్రిందజెప్పబడువానికెల్ల సంసర్గావరణలక్షణముల నూహించునది.

## పిత్తావృతఉదానవాతలక్షణము.

మూ. మూర్ఛాద్యాని చ రూపాణి దాహో నాభ్యురసః క్లమః. 222
ఓజోభ్రంశశ్చ సాదశ్చాప్యుదానే పిత్తసంవృతే,

వ్యా. ఉదానవాతము పిత్తముచే నావరింపబడినపుడు పైజెప్పబడిన మూర్ఛ మున్నగు లక్షణములును, నాభియందునురోమ్మునందును మంటయు, బడలికయు కల్గును. శరీరమునందలి యోజస్సుకు హానికల్గును. శరీరము కృశించును.

## కఫావృత ఉదానవాతలక్షణము.

మూ. ఆవృతే శ్లేష్మణోదానే వైవర్ణ్యం వాక్స్వరగ్రహః　　　　223
దౌర్బల్యం గురుగాత్రత్వం అరుచిశ్చోపజాయతే,

వ్యా. ఉదానవాతము శ్లేష్మముచే నావరింపబడినపుడు శరీరము వివర్ణమునగును. వాక్కును, కంఠస్వరమును పట్టినట్లుండును. శరీరము బలహీనమై బరువుగనుండును. అరోచకము కల్గును.

## పిత్తావృతసమానవాతలక్షణము.

మూ. అతిస్వేదస్తృషా దాహో మూర్ఛా చ అరుచి(అరతి) రేవచ. 224
పిత్తావృతే సమానే స్యాత్ ఉపఘాతస్తథోష్మణః,

వ్యా. సమానవాతము పిత్తముచే నావరింపబడినపుడు శరీరముపై చెమట నధికముగ పట్టును. దప్పి యధికమగును. మంట పుట్టును. మూర్ఛ గ్రమ్మును. అరుచి కల్గును. శరీరముపై వేడి తగ్గును. (ఇచ్చట సమానవాతము పిత్తముచే నావరింపబడినపుడు అట్టివాతము జాఠరాగ్నిని రగిలింపజేయు స్వకార్యమును చేయనేరకుండును కాన అగ్ని మందగించును. దానంజేసి శరీరముపై యూష్మంబును తగ్గునని యెరుంగునది.

## కఫావృతసమానవాతలక్షము.

మూ. అస్వేదో వహ్నిమాన్ద్యం చ లోమహర్షస్తథైవ చ.　　　　225
కఫావృతే సమానే స్యాత్ గాత్రాణాం చాతిశీతతా,

వ్యా. సమానవాతము కఫముచే నావరించియున్నపుడు శరీరమునం దవయవము లన్నియు మిక్కిలి చల్లగనుండును. చెమటపట్టదు. జాఠరాగ్ని మందగించును రోమహర్షము కల్గును.

## పిత్తావృతవ్యానవాతలక్షణములు.

మూ. వ్యానే పిత్తావృతే తు స్యాత్ దాహః సర్వాఙ్గగః క్లమః.　　　　226
గాత్రవిక్షేపసఙ్గశ్చ ససన్తాపస్సవేదనః,

వ్యా. వ్యానవాతము పిత్తముచే నావరింపబడినపుడు శరీరమునందెల్ల మంట బుట్టును. బడలిక కల్గును. శరీరమంతయు వణకును. సంధు లన్నియు బిగసి మంటయు నొప్పియు కల్గియుండును.

కఫావృతవ్యానవాతలక్షణము.

మూ. గురుతా సర్వగాత్రాణాం సర్వసన్ధ్యస్థిజా రుజః. 227
వ్యానే కఫావృతే లిఙ్గం గతిసఙ్గస్తథాధికః,

వ్యా. వ్యానవాతము కఫముచే నావరింపబడినపుడు అవయవము లన్నియు బరువుగ నుండును. కీళ్లయందును, ఎముక లన్నిటియందును నొప్పి కల్గును. నడచుటకు సాధ్యముగాక మిక్కిలి బాధకల్గును.

పిత్తావృతఅపానవాతలక్షణము.

మూ. హారిద్రమూత్రవర్చస్త్వం తాపశ్చ గుదమేఢ్రయోః. 228
లిఙ్గం పిత్తావృతేఽపానే రజసశ్చాతివర్ధనం,

వ్యా. అపానవాతము పిత్తముచే నావరింపబడినపుడు మలమూత్రములు పచ్చనగును. గుదమునందును మేఢ్రమునందు మంటపుట్టును. స్త్రీలకు బుతురక్తము అధికముగ వెడలును.

కఫావృతఅపానవాతలక్షణము.

మూ. భిన్నామశ్లేష్మసంసృష్టగురువర్చః ప్రవర్తనమ్. 229
శ్లేష్మణా సంవృతేఽపానే కఫమేహస్య చాగమః,

వ్యా. అపానవాతము కఫముచే నావరింపబడినయెడ పలుచబడినదియు, ఆమశ్లేష్మములతో కూడినదియు, బరువు కల్గినదియు నగు పురీషము వెడలును. కఫముచే కల్గిన ప్రమేహవ్యాధి సంభవించును.

పిత్తకఫమిశ్రావరణలక్షణములు.

మూ. లక్షణానాన్తు మిశ్రత్వం పిత్తస్య చ కఫస్య చ. 230
ఉపలక్ష్య భిషగ్విద్వాన్మిశ్రమావరణం వదేత్,

వ్యా. పైజెప్పబడిన ప్రాణాదివాతములకు పిత్తకఫముల మిశ్రముచే నావరణములు కల్గినపుడు ఆరెంటికిని వేరువేరుగ జెప్పబడిన లక్షణములు మిశ్రములుగ గనబడును ఆలక్షణములబట్టి కఫపిత్తముల రెంటిచే నాయావాతము ఆవరింపబడినదని సంసృష్టఆవరణభేదములను పండితుడగు వైద్యవరుడు నిర్ణయించుకొనవలయును.

మూ. యద్యస్య వాయోర్నిర్దిష్టం స్థానం తత్రేతరౌ స్థితౌ. 231
దోషౌ బహువిధాన్ వ్యాధీన్ దర్శయేతాం యథానిజాన్,

వ్యా. ఏవాతమునకు ఏది స్థానమని నిర్దేశింపబడినదియో ఆస్థానమున తక్కిన పిత్తకఫములు రెండును చేరినయెడ నాదోషములకు సంబంధించిన నానావిధరోగముల గల్గించును.

ప్రాణ-ఉదానవాతములప్రాధాన్యము.

మూ. ఆవృతం శ్లేష్మపిత్తాభ్యాం ప్రాణం చోదానమేవ చ. 232
గరీయస్త్వేన పశ్యన్తి భిషజశ్శాస్త్రచక్షుషః,
విశేషాజ్జీవితం ప్రాణే ఉదానే సంశ్రితం బలమ్. 233
స్యాత్ తయోః పీడనాత్ హానిః ఆయుషశ్చ బలస్య చ,

వ్యా. ప్రాణవాతంబైనను ఉదానవాతంబైనను, కఫముచే నైనను, పిత్తముచే నైనను ఆవరింపబడినయెడ దానిని యితరావరణవాతములకంటె మిక్కిలి యధికముగ శాస్త్రజ్ఞులగు వైద్యవరులు గమనించెదరు. అందు మనుజులయాయుఃవు ప్రాణమునకును, బలము ఉదానవాతమునకును అధీనములుగ నుండును. కావున అట్టి ప్రాణ-ఉదానవాతములకు ఇతరదోషావరణము కల్గినప్పుడు ఆయుష్యమునకును బలమునకు హాని కల్గును. (దానంజేసి యితరావరణవాతములకన్న ప్రాణ-ఉదానవాతముల యావరణము మిక్కిలి యధికమైనదియు, ముఖ్యముగ గమనింపదగినది యని వైద్యవరులు చెప్పెదరని భావము.)

అవృతవాతము లసాధ్యము లగుటకు కారణములు.

మూ. సర్వేఽప్యేతేఽపరిజ్ఞాతాః పరిసంవత్సరాస్తథా. 234
ఉపేక్షణాదసాధ్యాస్స్యుః అథవా దురుపక్రమాత్ (మాః),

వ్యా. పైజెప్పబడిన యావరణవాతము లన్నియు వానిస్థానాదిభేదములచే వాని లక్షణముల జక్కగ గమనించకున్నను, చక్కగ వాని నెరింగియు చికిత్స చేయక యుపేక్షించుటవలన చాలకాలము గడచి ప్రాతబడినను,మిక్కిలి యసాధ్యము లగును. లేక కష్టసాధ్యముగ నైన నగును.

అవృతవాతము నుపేక్షించుటచే గల్గునుపద్రవములు.

మూ. హృద్రోగో విద్రధిః ప్లీహా గుల్మోఽతీసార ఏవ చ. 235
భవన్త్యుపద్రవాస్తేషాం ఆవృతానాముపేక్షణాత్,

తస్మాదావరణం వైద్యః పవనస్యోపలక్షయేత్. 236
పఞ్చాత్మకస్య వాతేన పిత్తేన శ్లేష్మణాపి వా,
భిషగ్గితమతస్సమ్యక్ ఉపలక్ష్య సమాచరేత్. 237

వ్యా. ఆవృతవాతములను చక్కగ గమనించి సకాలమున దగిన చికిత్స జేయక యుపేక్షించినచో హృద్రోగము, విద్రధి, ప్లీహావృద్ధి, గుల్మము, అతిసారము, అనునీ రోగము లుపద్రవములుగ సంభవించును. కావున ప్రాణాదిభేదములచే నైదువిధములగు వాతములకు ఆవరణమును వైద్యుడు ముఖ్యముగ గమనింపవలెను.

మరియు పంచాత్మకమైన వాతమునకు ప్రాణాదివాతభేదముచేనైనను, పిత్తముచే నైనను, కఫముచేనైనను కల్గిన యావరణమును వైద్యుడు వానివానిలక్షణములపట్టి చక్కగ గమనించి యందుకు దగినచికిత్సితమును చేయవలెను.

పంచవాతముల యావరణములయందు చికిత్సావిధి.

మూ. అనభిష్యన్దిభిః స్నిగ్ధైః స్రోతసాం శుద్ధికారకైః,
కఫపిత్తాఽవిరుద్ధం యత్ యచ్చ వాతానులోమనమ్. 238
సర్వస్థానావృతేఽప్యాశు తత్కార్యం మారుతే హితం,

వ్యా. అభిష్యందిస్వభావము లేక స్నిగ్ధములై స్రోతస్సులను శుద్ధములుగ జేయునౌషధాదులచే పైజెప్పిన సర్వధాత్వావృతవాతములకు చికిత్స చేయవలెను. మరియు వాతము సర్వస్థానములయం దావరింపబడి యున్నను కఫపిత్తములకు విరుద్ధము కానిదియు, వాతము ననులోమముగ జేయునదియు నగు నౌషధాదులను అతిశీఘ్రముగ నుపయోగించి చికిత్సచేయనగును. (రసవహంబులగు సిరల నడ్డగించి శరీరమునకు గురుత్వమును కల్గించుద్రవ్యము అభిష్యంది యనబడును. అటుగాక దీనికి విరుద్ధగుణము కల్గినది యనభిష్యంది యని యెరుంగునది.)

మూ. యాపనాః వస్తయః ప్రాయో మధురాస్సానువాసనాః. 239
ప్రసమీక్ష్య బలాధిక్యం మృదు వా స్రంసనం హితం,
రసాయనానాం సర్వేషాముపయోగః ప్రశస్యతే. 240
శైలస్య జతునోఽత్యర్థం పయసా గుగ్గులోస్తథా,
లేహం వా భార్గవప్రోక్తం అభ్యసేత్ క్షీరభుఙ్నరః. 241
అభయామలకీయోక్తం ఏకాదశసితాశతం,
(అభయామలకీయోక్తా నేకాదశమితాశనః,)

వ్యా॰ మరియు కల్పస్థానమున చెప్పబడు యాపనవస్తులను, మధురద్రవ్యముల జేర్చి చేయబడును. వస్తులను, అనువాసనవస్తులను తరుచుగ ప్రయోగింపవలెను. వ్యాధి బలాధికముగ నుండు నెడ గమనించి మృదువైన విరేచనౌషధముచే విరేచనము చేయవలెను. మరియు రసాయనప్రకరణమున జెప్పబడిన రసాయనముల నన్నిటి నుపయోగించుటయు, శిలాజతువు నైనను గుగ్గిలము నైనను పాలతో నుపయోగించుటయు మిక్కిలి ప్రశస్తము. మరియు నభయామలకీయమను రసాయనపాదమున భార్గవవంశ సంజాతుడగు చ్యవను నుద్దేశించి చెప్పబడిన చ్యవనప్రాశమను రసాయనలేహమును ప్రతి దినంబును క్షీరాహారము భుజించుచు నభ్యాసము చేయవలెను. మరియు నభయామలకీయమున మొదట చెప్పబడిన పదునొకండువందలపలముల చక్కెరతో కూడిన బ్రాహ్మ రసాయనమును మితాహారము చేయుచు సేవింపనగును.

[ఇచ్చట 'భార్గవప్రోక్తం' అనుచోట భార్గవుడను యౌగికనామాంతరము చ్యవనునకు కలదు కావున చ్యవను నుద్దేశించి చెప్పబడిన చ్యవనప్రాశమని సమంజసమైన యర్థము. ఆయుర్వేదసముత్థానీయమను రసాయనపాదమున "భార్గవః చ్యవనః కామీ... పునర్యువా" (చి. అ. ౧ పాద, ౪ శ్లో. ౪౫) అనువాక్యముచే భార్గవుడను నామాంతరము చ్యవనునకు కలదని తెలిసెడి. అభయామలకీయమున "బిల్వోఽగ్నిమన్థః...... పునర్యువా" (చి. అ. ౧ పా. శ్లో. ౬౨-౭౨) అని చెప్పబడిన చ్యవనప్రాశయోగము నెరుంగునది. మరియు అభయామలకీయరసాయన పాదమున "పఞ్చానాం పఞ్చమూలానాం...సితోపలాసహస్రం చ చూర్ణితం తులయాధికమ్...ఇష్టాం సమశ్నుతే" (చి. అ. ౧ పా. ౧ శ్లో. ౪౧-౫౭) అనుగ్రంథముచే చెప్పబడిన పదునొకండునూరుల పలముల పరిమితమైన చక్కెరను చేర్చి సిద్ధమగు బ్రాహ్మరసాయనము నెరుంగునది. బ్రాహ్మరసాయనములు రెండు. అందు మొదటిరసాయనము నెరుంగుటకై "ఏకాదశ సితాశతమ్" అని విశేషవిధిగ తంత్రకారులు నిర్దేశించిరి. వాగ్భటాచార్యులును ఈ యర్థమునే "లేహో వా భార్గవస్తద్వత్ ఏకాదశసితాశతః" (అ. హృ. చి. అ. ౨౨ శ్లో. ౬౫) అనువాక్యముచే జెప్పిరి.]

మరియు యాపనవస్తిస్వరూపము తంత్రాంతరమున నిట్లున్నది:—"క్షౌద్రాజ్యక్షీర తైలానాం ప్రసృతం ప్రసృతం భవేత్, హాపుషాసైన్ధవాక్షాంశః వస్తిస్స్యాత్ యాపనః పరః" తేనె, నెయ్యి, పాలు, నూనె వీనిని ప్రత్యేక మొక్కొక ప్రసృతంబును, బోడతరమును సైంధవలవణము నొక్కొకకర్షమును గూర్చి చేయబడినది. యాపనవస్తియని యర్థము.

అపానావృతవాతచికిత్స.

మూ. అపానేనావృతం సర్వం దీపనం గ్రాహి భేషజమ్. 242
వాతానులోమనం యచ్చ పక్వాశయవిశోధనం,

వ్యా. అపానవాతముచే తక్కిన వాతము లావరింపబడినపుడు అగ్నిని దీపింపజేయునదియు, మలమును ద్రవింపజేయునదియు, వాతము ననులోమముగ జేయునదియు, పక్వాశయమును శోధించునదియు నగు చికిత్సావిధాన మంతయు చేయనగును.

అనుక్తవాతావరణచికిత్సాసంగ్రహము.

మూ. ఇతి సంక్షేపతః ప్రోక్తం ఆవృతానాం చికిత్సితమ్. 243
ప్రాణాదీనాం భిషక్కుర్యాత్ వితర్క్య స్వయమేవ తత్,
పిత్తావృతే తు పిత్తఘ్నైః మారుతస్యావిరోధిభిః 244
కఫావృతే కఫఘ్నైస్తు మారుతస్యానులోమనైః,

వ్యా. ఇత్తెరంగున ప్రాణాదివాతములకు పరస్పరావరణము కల్గినప్పుడు చేయదగిన చికిత్సావిధి సంగ్రహరూపముగ జెప్పబడినది. దీనిని చక్కగ గమనించి ఆయాయావరణ భేదమునకు దగినచికిత్సను స్వయముగ గల్పించి అనుక్తావరణ భేదముల కన్నిటికిని చికిత్స చేయనగును.

మరియు నట్టి ప్రాణాదివాతములు పిత్తముచే నావరింపబడినపుడు వాతమునకు విరోధము కల్గనీయక పిత్తమును హరించు చికిత్సలచే నుపచరింపనగును. కఫముచే నావరింపబడినపుడు వాతము ననులోమముగ సంచరింపజేయునవియు కఫహరంబులును నగు నౌషధాదులచే చికిత్స చేయనగును.

వాతాదిక్షయవృద్ధ్యాదిపరిజ్ఞానావశ్యకత.

మూ. లోకే వాయ్వర్కసోమానాం దుర్విజ్ఞేయా యథా గతిః. 245
తథా శరీరే వాతస్య పిత్తస్య చ కఫస్య చ,
క్షయం వృద్ధిం సమత్వం చ తథైవావరణం భిషక్. 246
విజ్ఞాయ పవనాదీనాం న ప్రముహ్యతి కర్మసు,

వ్యా. లోకమున వాతముయొక్కయు సూర్యునియొక్కయు చంద్రునియొక్కయు గతిభేదము నరయుట మిగుల కష్టము. అత్తెరంగుననే శరీరమునందలి వాత-పిత్త-కఫములయొక్క గమన భేదము తెలిసికొనుటకు చాల కష్టముగ నుండును.

కావున అట్టి వాత-పిత్త-కఫములయొక్క క్షయమును వృద్ధిని సమత్వమును ఆవరణభేదమును చక్కగ నెరింగినచో చికిత్సావిధానములయం దెకప్పుడును వైద్యుడు పొరబాటు పడడు.

అధ్యాయవిషయసంగ్రహము.

తత్ర శ్లోకాః—

మూ. పఞ్చాత్మనః స్థానవశాత్ శరీరే
స్థానాని కర్మాణి చ దేహధాతోః,
ప్రకోపహేతుః కుపితశ్చ రోగాన్
స్థానేషు చాన్యేషు వృతోఽవృతశ్చ　　247
ప్రాణేశ్వరః ప్రాణభృతాం కరోతి
క్రియా చ తేషామఖిలా నిరుక్తా,
తాం దేశకాలర్తుబలాన్యవేక్ష్య
ప్రయోజయేత్ శాస్త్రమతానుసారీ.　　248

వ్యా. శరీరమునందలి స్థానభేదముచే నైదువిధములై వికృతి జెందక శరీరధారకమగు వాతముయొక్క స్థానంబులును, అట్టివాతముయొక్క కర్మములును, అట్టివాతము ప్రకోపించుటకు కారణములును, ప్రకుపితమైనవాతము వానివానిస్థానములయం దుండియు, ఇతరస్థానముల జేరియు, ఆవరింపబడియు, ఆవరింపబడకయు నానారోగముల కల్గించువిధంబును, వానివాని ప్రత్యేకలక్షణంబులును, వానికన్నిటికిని వేరువేరు చికిత్సలును, ఈవాతవ్యాధిచికిత్సితమనునధ్యాయమున చెప్పబడినవి. అట్టిచికిత్సను దేశము కాలము ఋతువు రోగముయొక్కయు రోగియొక్కయు బలమునున్నగువానిని శాస్త్రమతము నవలంబించినవైద్యుడు చక్కగ గమనించి చేయదగును.

అధ్యాయసమాప్తి.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే, దృఢబలసమ్పూరితే
చికిత్సాస్థానే వాతవ్యాధిచికిత్సితం నామ
అష్టావింశోఽధ్యాయః.

వ్యా. ఇత్తెరంగున నగ్నివేశకృతంబును చరకప్రతిసంస్కృతంబునునగు చరకసంహితయను నాయుర్వేదతంత్రమున చికిత్సాస్థానమునందలి దృఢబలసంపూరితభాగమున వాతవ్యాధి చికిత్సితమను నిరువదియెనిమిదవ యధ్యాయము సంపూర్ణము.

---

# ఏకోనత్రింశాధ్యాయము.

అవతరణిక:—వాతరక్తము కూడ వాతవ్యాధిభేదములతో చేరినది. మరియు రక్తావృతవాతమునకు చికిత్స జెప్పునపుడు "శోణితేనావృతే కుర్యాత్ వాతశోణితకీం క్రియామ్" అని వాతరక్తచికిత్స యతిదేశింపబడినది. అట్టి సంబంధమునుపట్టి వాతవ్యాధిచికిత్సానంతరము వాతరక్తచికిత్స చెప్పబడును.

## వాతశోణితచికిత్సితాధ్యాయప్రారంభము.

మూ. అథాతో వాతశోణితచికిత్సితం వ్యాఖ్యాస్యామః. 1

ఇతి హ స్మాహ భగవానాత్రేయః. 2

వ్యా. వాతవ్యాధిచికిత్సితమును చెప్పినపిదప (వాతవ్యాధిభేదములలో చేరిన) వాతశోణితమునకు చికిత్సితమును దెల్పునధ్యాయమును భగవానుడగు నాత్రేయు లుపదేశించినదానికన్న న్యూనాతిరేకము గాకుండ వివరించి చెప్పెదనని యర్థము. (వాతరక్తములచే జనించిన వ్యాధి వాతరక్తము. లేక వాతరక్తములయొక్క యవస్థాంతరరూపమైన వ్యాధి వాతరక్తము అని వాతరక్తమున కన్వర్థసంజ్ఞ నెరుంగునది.)

## వాతరక్తము నుద్దేశించి యగ్నివేశుని ప్రశ్నము.

మూ. హుతాగ్నిహోత్రమాసీనమృషిమధ్యే పునర్వసుం,
పృష్టవాన్ గురుమేకాగ్రమగ్నివేశోఽగ్నివర్చసమ్. 3
అగ్నిమారుతతుల్యస్య సంసర్గస్యాఽనిలాఽసృజోః,
హేతులక్షణభైషజ్యాన్యథాస్మై గురురబ్రవీత్. 4

వ్యా. అగ్నిహోత్రమును (అగ్నిలో హోమము జేయదగిన హవిస్సును) హోమము చేసి ఋషివర్యులగోష్ఠిలో సుఖముగ నేకాగ్రత కల్గి కూర్చొనినవాడును, అగ్నితో సమానమైన బ్రహ్మవర్చస్సు కలవాడును, గురువర్యుడు నగు నాత్రేయుని, అగ్నివేశులు అగ్నివాతసంసర్గమును బోలె మిగుల క్రూరమైన వాతరక్తసంసర్గరూపమైన వాతరక్తవ్యాధియొక్క హేతువులను లక్షణములను చికిత్సను (చెప్పుమని) అడిగెను. పిమ్మట వాని నన్నిటిని గురువగు నాత్రేయుం డిట్లు చెప్పెను.

## వాతరక్తనిదానము, సంప్రాప్తియు.

మూ. లవణాఽమ్లకటుక్షారస్నిగ్ధోష్ణాజీర్ణభోజనైః,
క్లిన్నశుష్కాఽమ్బుజానూపమాంసపిణ్యాకమూలకైః. 5

కులుత్థమాషనిష్పావశాకాదిపలలేక్షుభిః,
దధ్యారనాళసౌవీరశుక్తతక్రసురాసవైః. 6
విరుద్ధాఽధ్యశనక్రోధ దివాస్వప్న ప్రజాగరైః,
ప్రాయశస్సుకుమారాణాం మిష్టాఽన్నసుఖభోజినామ్. 7
('మిష్టాన్నరసభోజినామ్', 'మిథ్యాహారవిహారిణామ్')
అచఙ్క్రమణశీలానాం కుప్యతే వాతశోణితం,
అభిఘాతాదశుద్ధ్యా చ ప్రదుష్టే శోణితే నృణామ్. 8
కషాయకటుతిక్తాల్పరూక్షాహారాదభోజనాత్,
హయోష్ట్రయానయానామ్బుక్రీడాప్లవనలఙ్ఘనైః. [హాత్,
ఉష్ణే చాత్యధ్వవైషమ్యాత్ (గమనాత్) వ్యవాయాద్వేగనిగ్ర
వాయుర్వివృద్ధో వృద్ధేన రక్తేనావారితః పథి. 10
కృత్స్నం సన్దూషయేద్రక్తం తత్ జ్ఞేయం వాతశోణితం,
ఖుడం వాతబలాసాఖ్యం ఆఢ్యవాతం చ నామభిః. 11

వ్యా॥ ఉప్పును పులుపును చేదును కారమును కలపదార్థముల విశేషముగ భుజించినను, స్నిగ్ధపదార్థములనైనను గుణవీర్యములచే నుష్ణములగుపదార్థములనైనను, జీర్ణముకాని స్వభావముకల పదార్థములనైనను విశేషముగభుజించినను, కుళ్లినమాంసము నైనను ఎండినమాంసమునైనను జలజంతువులమాంసమునైనను జలప్రాంతముల నివసించు జంతువుల మాంసమునైనను భుజించినను, ఉలవలు ఉద్దులు అనుములు ఆకుకూరలు మున్నగువాని భుజించినను, సాధారణముగ మాంసమును చెరకురసమును విశేషముగ నుపయోగించినను, పెరుగు, ఆరనాళ మనుకాంజికము, సౌవీరకము, పులిసినగంజి, పులి మజ్జిగ, సురామద్యము, ఆసవము, అను నీద్రవద్రవ్యముల విశేషముగ నుపయోగించినను, సంయోగాదులచే పరస్పరవిరుద్ధములగు క్షీరమత్స్యాదుల నొకటిగ జేర్చి భుజించినను, భుజించినవెంటనే (జీర్ణము కాకముందు) మరలభుజించినను, అధికముగ కోపబడినను, పగలు నిదురించినను, రాత్రులయందు నిదురమేల్కొనియున్నను, (ఈకారణములచేత) వాతరక్తము సంభవించును. మరియు పుట్టుక మొదలుచేసి సుకుమారముగ నుండువారికిని, మధురభూయిష్ఠమైన యన్నమును సుఖముగ భుజించువారికిని, అట్టిభోజనముచేసి సంచారములేక యుండువారికిని పైజెప్పిన లవణామ్లసేవనాది కారణములచే నీవాత

రక్తము ప్రాయికముగ సంభవించును. (ఇచ్చట లవణరససేవనము మున్నగునవి వాత రక్తోత్పత్తికి కారణములుగ జెప్పబడినను అట్టికారణములచే రక్తము దుష్టమై వాత రక్తోత్పత్తికి కారణమగునని యెరుంగునది. వాతరక్తోత్పత్తికి కారణమైన రక్తదుష్టిమూల ముగ వాతరక్తోత్పత్తికి లవణాదులు కారణములగునని ముఖ్యభావము.)

మరియు పైజెప్పిన కారణములచే దుష్టమైన రక్తము అభిఘాతమువలనను, వమనవిరేచనాది శోధనము చేయవలసినతరుణమున శోధనమును చేసికొనకుండుటవలనను మనుజులకు రక్తము మరింత ప్రకోపము నొందియున్నపుడు; కషాయకటుతిక్తరసముల సేవించుటవలనను, అల్పాహారమువలనను, రూక్షాహారమువలనను, ఉపవాసముచేతను, గుఱ్ఱములు ఒంటెలు మున్నగువాహనములపై నెక్కి సవారిచేయుటవలనను నీటియం దీదుటచేతను, పైకి గంతులిడుటచేతను, కాలువలు మున్నగువాని దాటుటచేతను, ఉష్ణ కాలమున త్రోవనడుచుటచేతను, స్త్రీసంభోగమువలనను, వాతమూత్రపురీషాదివేగముల నిరోధించుటచేతను, (ఈకారణములచేత) వృద్ధినందిన వాతము, పైజెప్పినరీతిగ మిక్కిలి (స్వకారణములచే) ప్రకోపమునొందినరక్తముచే తాను సంచరించు స్రోతోమార్గమున నడ్డగింపబడి (మరింత ప్రకుపితమై) యారక్తమును పూర్తిగ చెరచును. అయ్యది వాతరక్త మని చెప్పబడును. ఈవ్యాధిని ఖుడవాతమనియు (కీళ్లయందు సంభవించునది), వాత బలాసమనియు, ఆఢ్యవాతమనియు కొందరాచార్యులు చెప్పెదరు. (ఖుడమన సంధి - సంధిస్థలముల జనించుటంజేసి ఖుడవాతము, ఈవ్యాధియందు రక్తముచే నావృతమైన వాతము బలాధికమగుటంజేసి వాతబలాసము, ప్రాయికముగ బలాఢ్యుల కిది సంభవించుటం జేసి ఆఢ్యవాతము నని చెప్పబడును.)

ఇచ్చట లవణరసాదిసేవనమును అభిఘాతఅశుద్ధులును రక్తదుష్టికారణములు, కషాయకటుసేవనాదులు వాతప్రకోపకారణములు. అట్టికారణములను వేరువేరుగ నిర్దే శించుటచేత రక్తంబును వాతంబును స్వతంత్రంబులుగ ప్రకుపితములై రెండునుంగలిసి వాతరక్తమును కల్గించునని తంత్రకారుల యాశయము.

### వాతరక్తము శరీరమున వ్యాపించుక్రమము.

మూ. తస్య స్థానం కరౌ పాదౌ అఙ్గుళ్యః సర్వసన్ధయః,
కృత్వాదౌ హస్తపాదే తు మూలం దేహే విధావతి. 12
సౌక్ష్మ్యాత్ సర్వసరత్వాచ్చ పవనస్యాఽసృజస్తథా,
తద్ద్రవత్వాత్సరత్వాచ్చ దేహం గచ్ఛన్ సిరాయనైః. 13
పర్వస్వభిహతం క్షుబ్ధం వక్రత్వాదవతిష్ఠతే,

స్థితం పిత్తాదిసంసృష్టం తాస్తాః సృజతి వేదనాః. 14
కరోతి దుఃఖం తేష్వేవ తస్మాత్ప్రాయేణ సన్ధిషు,
భవన్తి వేదనాః తాస్తాః అత్యర్థం దుస్సహా నృణామ్. 15

వ్యా. పైజెప్పబడిన వాతరక్తమునకు హస్తములును, పాదములును, వ్రేళ్లును, శరీరమునందలి సంధులు (కీళ్లును)ను స్థానములు. అందు హస్తపాదములను తొలుత ముఖ్యస్థానముగ జేసికొని వ్యాపించి వాతరక్తములు రెండును శరీరమునందలి సూక్ష్మమార్గముల సంచరించుస్వభావమును అన్నిస్థలములయందు వ్యాపించుస్వభావంబును కల్గియుండుటంజేసి శరీరమునందెల్ల పలుదెరంగుల వ్యాపించును. మరియు నయ్యాది ద్రవరూపంబును సరంబును (ప్రసరించుస్వభావము కలది) నగుటంజేసి శరీరమునందలి సిరలరూపములైన మార్గములనుండి శరీరమునందెల్ల సంచరించుచు గణుపులు వక్రములగుటవలన నచ్చట వానినిరోధముచే సరళముగ వెడలక యభిఘాతమునొంది యచ్చటనే (గణుపులయందు) నిలబడును. పిదప నచ్చోట కారణాంతరములచే చేరియుండు పిత్తముతోనైనను కఫముతోనైనను సంబంధముకల్గి ఆయాదోషమునకు సంబంధించిన నొప్పి పోటు మంట మున్నగు నానాబాధలను గణుపులయందు గల్గించును. దానంజేసి సంధిబంధములయందెల్ల మిక్కిలి యోరువరానిబాధలు మనుజులకు సంభవించును.

ఇచ్చట కరపాదములు వాతరక్తమునకు స్థానములని చెప్పుటచేత వ్రేళ్లు కూడ స్థానములని యర్థమగుచున్నను, వ్రేళ్లయందు గణుపులు అధికముగ నుండుటవలన అట్టి వ్రేళ్లు వాతరక్తమునకు విశేషముగ స్థానమగునని తెలియుటకై 'అఙ్గుల్యః' అని ప్రత్యేకముగ నిర్దేశింపబడినది.

## వాతరక్తపూర్వరూపములు.

మూ. స్వేదోఽత్యర్థం నవా కార్ష్ణ్యం స్పర్శాఽజ్ఞత్వం క్షతేఽతిరుక్,
సన్ధిశైథిల్యమాలస్యం సదనం పిడకోద్గమః. 16
జానుజఙ్ఘోరుకట్యంసహస్తపాదాఙ్గసన్ధిషు,
నిస్తోదః స్ఫురణం భేదః గురుత్వం సుప్తిరేవ చ. 17
కణ్డూస్సన్ధిషు రుగ్భూత్వా భూత్వా నశ్యతి చాఽసకృత్,
వైవర్ణ్యం మణ్డలోత్పత్తిః వాతాసృక్పూర్వలక్షణమ్. 18

వ్యా. వాతరక్తము జనించుటకుముందు శరీరముపై విశేషముగ చెమట బట్టును. లేక బొత్తుగ చెమటబట్టకుండును. శరీరమునందెల్ల నల్లనిరంగుకల్గి స్పర్శము తెలియ

కుండును. గోట గిల్లినచో నొప్పి యధికముగ నుండును. శరీరమునందలి సంధిబంధము సడలి పనులయం దుత్సాహము లేకుండును. శరీరము కృశించి సన్నని పొక్కులు లేచును. మోకాళ్లు పిక్కలు తొడలు నడుము భుజశిరస్సులు కాళ్లుచేతులు, అనుసీయంగముల యందును, వానిసంధులయందును, సూదుల బొడిచినవిధముగ పోటును, అదరుపాటును కలిగి పగిలి బరువుగనుండి స్పర్శజ్ఞానము లేకుండును. మరియు సంధులయందు దురదయు నొప్పియు మాటిమాటి కప్పుడప్పుడును కలిగి తనంతనే శమించుచుండును. శరీరమున వర్ణము మారి పొడలు కల్గును. ఇవియన్నియు వాతశోణితమునకు ముందుకల్గు పూర్వ రూపములు.

(కుష్ఠపూర్వరూపములు చెప్పునపుడు 'స్పర్శాజ్ఞత్వమతి స్వేదః నవా......కుష్ఠ లక్షణ మగ్రజమ్'' (చి. అ. ౭. శ్లో. ౧౧-౧౨) అనువాక్యము చెప్పబడినవి. ప్రాయికముగ నీవాతరక్తమునందును చెప్పబడినవి. అయినను కుష్ఠమునందు పూర్వరూపములన్నియు సంభవించుననియు, ఈవ్యాధియందు కొన్ని మాత్రము కల్గుననియు భేదము నెరుంగునది. మరియు వాగ్భటాచార్యులును ''భవిష్యతః కుష్ఠసమం'' (అ. హృ. ని. అ. ౧౬) అని యుపక్రమించి కుష్ఠపూర్వరూపము లీవ్యాధియందును కల్గుననియే చెప్పిరి.)

### వాతరక్తద్వైవిధ్యము.

మూ. ఉత్తానమథ గమ్భీరం ద్వివిధం తత్ప్రచక్షతే,
త్వఙ్మాంసాశ్రయముత్తానం గమ్భీరం త్వన్తరాశ్రయమ్. 19

వ్యా. వాతరక్తము ఉత్తానమనియు గమ్భీరమనియు రెండువిధములు. అందు చర్మమాంసముల నాశ్రయించి సంభవించునది యుత్తానము. లోపలనుండు మేదస్సు అస్థి మజ్జశుక్రములను శరీరములోపలిభాగమున (లోతున) నుండు ధాతువుల నాశ్రయించి సంభవించునది గంభీరము.

### ఉత్తానవాతరక్తలక్షణము.

మూ. కణ్డూదాహరుగాయాస(మ)తోదస్ఫురణకుఞ్చనైః,
అన్వితా శ్యావరక్తా త్వక్ బాహ్యే తామ్రా తథేష్యతే. 20

వ్యా. శరీరమునందు రక్తమాంసముల నాశ్రయించి జనించిన(యుత్తాన)వాత రక్తమున చర్మమునందు దురదయు మంటయు కల్గి ముడుచుకొనియుండును. సూదుల గ్రుచ్చినట్లు పోటునుకల్గి యదరుచుండును. సంకుచితమగును. ఈలక్షణములతో కూడిన చర్మము శ్యామరక్తవర్ణంబును, తామ్రవర్ణంబునై యుండును.

## గమ్భీరవాతరక్తలక్షణము.

మూ. గమ్భీరేశ్వయథుః స్తబ్ధః కఠినోఽన్తర్భృశార్తిమాన్,
శ్యావస్తామ్రోఽథవా దాహతోదస్ఫురణపాకవాన్. 21
రుగ్విదాహాన్వితోఽభీక్ష్ణం వాయుః సన్ధ్యస్థిమజ్జసు,
ఛిన్దన్నివ చరత్యన్తః వక్రీకుర్వంశ్చ వేగవాన్. 22
కరోతి ఖఞ్జం పఙ్గుం వా శరీరే సర్వతశ్చరన్,

వ్యా. (మేదస్సు మున్నగు శరీరాంతర్ధాతువుల నాశ్రయించి జనించుటచే) గంభీర వాతరక్తమున స్తంభించినదియు, కఠినంబును, లోభాగమున మిక్కిలి బాధకల్గినదియు, శ్యామవర్ణంబైనను తామ్రవర్ణంబైనను కల్గునదియు, మంటయు పోటును అదరుపాటును కల్గి, పక్వమై మిక్కిలినొప్పియుమంటయు కల్గినదియు నగువాపు కల్గును. ప్రకుపితమైన వాతము కీళ్లయందును అస్థులయందును మజ్జయందును విశేషముగ సంచరించుచు ఛేదించు విధముగ బాధకల్గించి శరీరమునందు లోభాగముననే సంచరించి మిక్కిలి వేగముతో గూడి అవయవములను వక్రములుగ జేయుచు, ఖంజ-పంగువాతములను కల్గించును. ఈవ్యాధులు వాతము శరీరమునందంతట సంచరించునప్పుడు కల్గును.

ఇచ్చట వాతము నడుమున జేరి యొకకాలియందు మాత్రము చేరి యాతొడ యందలి కండరములను లాగిపట్టి నడువ వలనుపడక ముడుచుకొనునట్లుచేసిన నయ్యది ఖంజవాతమనియు, రెండుతొడలయందు జేరి రెండిటికండరముల నేకకాలమున లాగిపట్టి నడువ వీలులేక జేసిన నయ్యది పంగువాతమనియు నెరుంగునది. ఈలక్షణముల వాగ్భటు లిట్లు చెప్పెను:—"వాయుః కట్యాం స్థితః సక్థ్నః కణ్డరామాక్షిపేద్యదా, తదా ఖఞ్జో భవే జ్జన్తుః, పఙ్గుః సక్థ్నోః ద్వయోరపి." (అ. హృ. ని. అ. ౧౫. శ్లో. ౪౫)

## ఉభయాశ్రయవాతరక్తలక్షణము.

మూ. సర్వైర్లిఙ్గైశ్చ విజ్ఞేయం వాతాసృగుభయాశ్రయమ్. 23

వ్యా. పైని యుత్తానగంభీరములకు వేరువేరుగ జెప్పబడిన లక్షణములన్నియు మిశ్రముగ గనుబడినయెడ, చర్మమాంసములను మేదస్సు మున్నగుధాతువులను కూడ నాశ్రయించిన వాతశోణితమని యెరుంగునది.

ఇచ్చట నీవివరణము నెరుంగునది:—అష్టోదరీయాధ్యాయమున "ద్వివిధం వాతరక్తమితి.—గమ్భీర ముత్తానంచ." (సూ. అ. ౧౯. సూ. ౭౦) అనువాక్యముచే వాతరక్తము రెండువిధములనియే నిర్దేశింపబడినది. అయినను ఆరెండులక్షణముల మిశ్రముచే

నుభయాశ్రయమగునుగాన విశేషలక్షణాంతరము లేదని యుద్దేశించి వేరుగ జెప్పబడ లేదు.

మరియు సుశ్రుతాచార్యులు వాతరక్తమునుద్దేశించి యిట్లుచెప్పెను:—"ద్వివిధం వాతశోణిత ముత్తాన మవగాఢం చేతి ఏకే భాషన్తే; తత్తు న సమ్యక్, కస్మాత్? కుష్ఠ వదుత్తానం భూత్వా, కాలాన్తరేణాఽవగాఢీ భవతి" (సు. చి. అ. ౫) వాతరక్తము కుష్ఠమునుబోలె తొలుత చర్మమాంసములయందు పొడసూపి యుపేక్షించుటచే కాల క్రమముగ మేదస్సు అస్థిమున్నగుశరీరమునందు లోభాగముననుండు ధాతువులలో నానాట వ్యాపించును; కావున కొందరు ఉత్తానగంభీరభేదములచే వాతరక్తము రెండు విధములని చెప్పునది యసంగతమని సుశ్రుతవాక్యము నర్థము. ఈపద్ధతినే యనుసరించి వాగ్భటాచార్యులును ఇట్లు చెప్పిరి:—"త్వఙ్మాంసాశ్రయముత్తానం తత్పూర్వం జాయతే, తతః. కాలాన్తరేణ గమ్భీరం సర్వాన్ ధాతూనభిద్రవత్" (అ. హృ, ని. అ. ౧౬. శ్లో. ౮) ఈవాక్యముచే గూడ వాతరక్తము తొలుత చర్మమాంసముల జనించి, చికిత్సజేయక యుపేక్షించినచో కాలాంతరమునకు మేదస్సు మున్నగుధాతువుల నాశ్ర యించి గంభీరమగుననియే తేటబడుచున్నది. సుశ్రుతమతమున వాతరక్తము ఏకరూపమే యని నిర్ణయించుచు ద్వివిధమని చెప్పుట యుక్తముకాదని సహేతుకముగ నిరసించిరి.

ఆర్షమతములలో పరస్పరవిరోధముండుట యసంభవముకావున నిట్లు సమా ధానము చెప్పనగును:—వాతరక్తము తొలుత త్వఙ్మాంసముల జనించి కాలాంతరమున సర్వధాత్వాశ్రితమై గంభీరమగును కావున త్వఙ్మాంసములయందే జనించి యంతట నచ్చటనే నిల్కడగనుండు, ఉత్తానవాతరక్తము వేరుగ నొకటిలేదు, అని సుశ్రుతాభి ప్రాయము. చరకాచార్యులు త్వఙ్మాంసముల జనించునది యుత్తానమనియు, ధాతువుల నన్నిటి నాశ్రయించినది గంభీరమనియు చెప్పిరికాని త్వఙ్మాంసములలోజనించి నిల్కడగ నచ్చటనే యుండు వాతరక్త ముత్తానమని చెప్పియుండలేదు. కావున చరక-అగ్నివేశు లకు మతభేదములు విరుద్ధముగ లేవని యెరుంగునది.

## వాతాధికాదివాతరక్తవివరణము.

మూ. తత్ర వాతాధికే వా స్యాత్ రక్తే పిత్తే కఫేఽపి వా,
సంసృష్టేషు సమస్తేషు యచ్చ తచ్ఛృణు లక్షణమ్. 24

వ్యా. పైజెప్పబడిన రెండువిధములైన వాతరక్తములలో వాతంబైనను, రక్తం బైనను, పిత్తంబైనను, కఫంబైనను సంసృష్టమై యధికముగ నున్నను, లేక, వాత-రక్త-

పిత్త-కఫములు నాల్గును సమానములుగ బలాధికములై కలిసియున్నను కల్గులక్షణముల వేరు వేరుగ నీక్రింద జెప్పబడును.

### వాతాధికవాతరక్తలక్షణము.

మూ. విశేషతస్సిరాయామశూలస్ఫురణతోదనం,
శోథస్య కార్ష్ణ్యం రౌక్ష్యం చ శ్యావతా వృద్ధిహానయః 25
ధమన్యఙ్గులిసన్ధీనాం సఙ్కోచోఽఙ్గగ్రహోఽతిరుక్,
కుఞ్చనస్తమ్భనే శీతప్రద్వేషశ్చానిలేఽధికే. 26

వ్యా. వాతరక్తమున సంసృష్టమైనవాత మధికముగ నున్నపుడు శరీరమునందలి సిరలు విస్తరించును. అచ్చటచ్చట శూలనొప్పియు కల్గును. అదరును. సూదులగ్రుచ్చిన విధముగ పోటు కల్గును. వాపునల్లనై రూక్షమై శ్యామవర్ణంబైనను కల్గి వృద్ధినొందుచు తనంతనే శమించుచు నుండును. ధమనులును వ్రేళ్లయందలికీళ్లును ముడుచుకొనును. అవయవములు లాగిపట్టి నొప్పియుకల్గును. అవయవములు ముడుచుకొని స్తంభించి (కదలక) యుండును. చల్లనిపదార్థములయందు స్పర్శమునందును ద్వేషము కల్గును. ఈలక్షణములబట్టి వాతాధికవాతరక్తమని యెరుంగునది.

### రక్తాధికవాతరక్తలక్షణము.

మూ. శ్వయథుః భృశరుక్ తోదః (రక్తే శోథోఽతిరుక్తోదః)
తామ్రశ్చిమిచిమాయతే,
స్నిగ్ధరూక్షైశ్శమం నైవ కణ్డూక్లేదాన్వితోఽసృజి (భృశమ్.) 27

వ్యా. రక్తం బధికముగ కల వాతరక్తమున మిక్కిలి బాధతో కూడినదియు తామ్రవర్ణంబు నైనవాపు కల్గును. చిమచిమలాడుచుండును. స్నిగ్ధంబులును రూక్షంబులును నగునౌషధాదులచే శమింపక వృద్ధినందును. శరీరమునజిలపుట్టి గోకినపుడు ద్రవము స్రవించును.

### పిత్తాధికవాతరక్తలక్షణము.

మూ. విదాహో వేదనా మూర్ఛా స్వేదస్తృష్ణా మదో భ్రమః,
రాగః పాకశ్చ భేదశ్చ శోషశ్చోక్తాని పైత్తికే. 28

వ్యా. పిత్తం బధికముగ కల వాతరక్తమునందు మిగుల తీవ్రమైనమంట పుట్టును. నొప్పి యధికమగును. మూర్ఛ గ్రమ్మును. చెమట యధికమగును. దప్పి యధికమగును. తిక్కయెత్తిన ట్లుండును. చక్రముపై నున్నవానివలె నొడలు తిరుగున ట్లుండును. వాపు ఎఱ్ఱనై పుండుకల్గి పగులదీయునట్లు బాధకల్గి యుండును.

కఫాధికవాతరక్తలక్షణము.

మూ. స్తైమిత్యం గౌరవం స్నేహః సుప్తిర్మన్దా చ రుక్ కఫే,

వ్యా. వాతరక్తమున కఫం బధికముగ నున్నపుడు తడిగుడ్డగప్పినవిధముగ శరీరమ బరువై చమురుపూసినవిధముగ జిడ్డుకల్గి స్పర్శజ్ఞానము దెలియకుండును. నొప్పి మం ముగ నుండును.

ద్వంద్వజ-సన్నిపాతజ వాతరక్తలక్షణములు.

మూ. హేతులక్షణసంసర్గాత్ విద్యాత్ ద్వన్ద్వత్రిదోషజమ్. 2

వ్యా. పైని వాతాదిసంసృష్టవాతరక్తములకు వేరువేరుగ జెప్పబడిన కారణమ లోను, లక్షణములలోపలను రెండేసికారణముల సంసర్గముచేగల్గి రెండేసిదోషలక్షణము కలిసి యున్నయెడ, అట్టి రెండేసిదోషముల సంసర్గముచే కల్గిన వాతరక్తములని ద్వంద్వ ముల నెరుంగునది. మరియు వాత-రక్త-పిత్త-కఫములు నాల్గును కలిసి, జనించిన వాతర మును, అన్నికారణములయొక్కయు అన్నింటిలక్షణములయొక్కయు సంసర్గమునుబ యెరుంగునది.

ఇచ్చట వాతరక్తము వాత-రక్త-పిత్త-కఫములచే వేరువేరుగను, రెండేసిదోషమ సంసర్గముచేతను, అన్నింటిసంసర్గముచేతను కల్గునని యెరుంగునది. మరియు పైజెప్ప లక్షణములు ఉత్తానగంభీరభేదములచే రెండు తెరంగులైన వాతరక్తములకు దోషాధి మును సామాన్యముగ జెప్పబడినది.

వాతరక్త సాధ్యాఽసాధ్యవిభాగము.

మూ. ఏకదోషానుగం సాధ్యం నవం యాప్యం ద్విదోషజం,
త్రిదోషజమసాధ్యం స్యాత్ యస్య చ స్యురుపద్రవాః.

వ్యా. ఒక్కదోషము మాత్రము అనుసరించి సంభవించిన వాతరక్తము నూత ముగనున్నచో సాధ్యమగును. రెండుదోషములసంసర్గమున కల్గినది యాప్యము. మూ దోషములచే కల్గినది యసాధ్యము. మరియు నీక్రిందచెప్పబడు నుపద్రవములతోగూ నది యేకదోషజమైనను అసాధ్యము.

వాతరక్తోపద్రవములు, ఉపద్రవములబట్టి సాధ్యాసాధ్యవిభాగము.

మూ. అస్వప్నాఽరోచకశ్వాసమాంసకోథశిరోగ్రహాః,
మూర్ఛాయమదరుక్తృష్ణాజ్వరమోహప్రవేపకాః.

హిక్కాపాఙ్గుల్యవీసర్పపాకతోదభ్రమక్లమాః,
అఙ్గులీవక్రతాస్ఫోటదాహమర్మగ్రహార్బుదాః. 32
ఏతైరుపద్రవైర్వర్జ్యం మోహేనైకేన వాపి యత్,

వ్యా. నిదురబట్టకుండుట, అరోచకము, శ్వాసము, మాంసముకుళ్లుట, తలలాగిపట్టి బాధకల్గుట, మూర్ఛగ్రమ్ముట, మదము (తిక్కయెత్తినట్లుండుట) తీవ్రమైననొప్పి, దప్పి యధికమగుట, జ్వరము, మైకము, వణకు, ఎక్కిళ్లు, అవయవములు లాగికొని కుంటి యగుట, విసర్పము, ఈవ్యాధివ్యాపించినచోట పుండగుట, పోటు, ఒడలుతిరుగుట, బడలిక, వ్రేళ్లు వంకరగనగుట, లేక పగులుట, మంట, మర్మస్థలములయందు పట్టినట్లు బాధ కల్గుట, అర్బుదంబులగు వ్రణములు, ఇవియన్నియు వాతరక్తమున కుపద్రవములు. ఈయుపద్రవములు కల్గియున్నను, మోహము ఒక్కటిమాత్రము కల్గియున్నను సాధ్యముగ జెప్పబడిన వాతరక్తంబును అసాధ్యమగును; కావున చికిత్సజేయక విడువందగును.

మూ. సంప్రస్రావి వివర్ణం చ స్తబ్ధమర్బుదకృచ్చ యత్. 33
వర్జయేచ్చైవ సఙ్కోచకరమిన్ద్రియతాపనం,
అకృతోఽపద్రవం యాప్యం సాధ్యం స్యాన్నిరుపద్రవమ్. 34

వ్యా. వాతరక్తము కల్గినచోట పగిలి ద్రవము స్రవించుచున్నను,శరీరవర్ణమునకు విపరీతమైనవర్ణము కల్గియున్నను, స్తంభించియున్నను, అర్బుదమును కల్గించిన వాతరక్తంబును, అవయవముల ముడుచుకొనిన వాతరక్తంబును,చక్షురాదీంద్రియములకు తాపమును కల్గించు వాతరక్తంబును అసాధ్యము. పైజెప్పినయుపద్రవములలో కొన్నిమాత్రము కల్గినవాతరక్తము యాప్యము. ఉపద్రవములు లేకుండునది సాధ్యమగును.

(ఇచ్చట త్రిదోషములకు జెప్పినలక్షణములన్నియు పూర్తిగాక కొన్నిమాత్రము కల్గి నూతనముగజనించిన త్రిదోషజవాతరక్తము సాధ్యమనియుద్దేశించి "ఖజేన మథితా పేయా వాతరక్తే త్రిదోషజే" అని చికిత్సను తంత్రకారులు విధించిరని యెరుంగునది.)

### ప్రాణహానికరమైన వాతరక్తస్వరూపము.

మూ. రక్తమార్గం నిహన్త్యాశు శాఖాసన్ధిషు మారుతః,
నివిశ్యాఽన్యోఽన్యమావార్య(మాబాధ్య) వేదనాభిర్హరేదసూన్.

వ్యా. వాతరక్తమునందు వాతము ప్రకుపితమై హస్తపాదాదిశాఖలసంధుల యందుచేరి శరీరమున వ్యాపించు రక్తముయొక్క సంచారమార్గమును నిరోధించును. మార్గనిరోధముచే మరింత ప్రకుపితమైనరక్తము వాతసంచారమార్గమును నిరోధించును.

ఇత్తెరంగున నొకటితో నొకటి యావరింపబడిన వాతరక్తము వానికిసంబంధించినబాధల కల్గించి ప్రాణముల హరించును.

వాతరక్తమున రక్తమోక్షణవిధి.

మూ. తత్ర ముఞ్చేదసృక్ శృఙ్గజలౌకసూచ్యలాబుభిః,
ప్రచ్ఛనైర్వా సిరాభిర్వా యథాదోషం యథాబలమ్. 36

వ్యా. పైజెప్పినపరిస్థితియందుండు వాతరక్తమున కొమ్ములచేనైనను, జలగల ప్రయోగించియైనను, సూదులచేనైనను,సొరకాయబుఱ్ఱలచేనైనను,కాటువేసి శలాకలచేనైనను, సిరావ్యధనముచేనైనను దుష్టరక్తమును వెడలించవలెను. అందును ఆయాదోషమును బలమును చక్కగ గమనించి తత్తదనుసారముగ రక్తమును వెడలించవలెను.

వాతరక్తమున రుగ్దాహాదులయందు రక్తమోక్షణవిధి.

మూ. రుగ్దాహతోదార్తాత్ (రుగ్దాహతోదరాగార్తాత్) అసృక్
స్రావ్యం జలౌకసా,
శృఙ్గైస్తుమ్బైర్హరేత్ సుప్తికణ్డూచిమిచిమాయనాత్. 37
దేశాద్దేశం వ్రజత్ స్రావ్యం సిరాభిః ప్రచ్ఛనేనవా,

వ్యా. వాతరక్తరోగమున నొప్పి, మంట, పోటు, సూదులతో గ్రుచ్చినవిధముగ బాధ, ఈబాధలు కలిగినస్థలమునుండి జలగల గరిపించి ఈదుష్టరక్తమును స్రవింపచేయవలయును. వాతరక్తము వ్యాపించినస్థలమున స్పర్శము తెలియక మొద్దుబారియున్నపుడు దురదకల్గియున్నను, చిమచిమయను బాధకల్గియున్నను, ఈస్థలమునుండి కొమ్ములచేనైనను; సొరకాయబుఱ్ఱలచేనైనను రక్తమును స్రవింపచేయవలయును. వాతరక్తము ఒకచోటనైన నిల్కడలేక ఒకచోటినుండి మరియొకచోటికి సంచరించుచున్నయెడ సిరలనుండియైనను, శలాకలచేనైనను, దుష్టరక్తమును స్రవింపచేయవలయును. (ఇత్తెరంగున రక్తమోక్షణమును చేసినయెడ వాతమును నిరోధించినరక్తము వెడలుటంజేసి వాతము ప్రకోపముడిగి వ్యాధిశమించునని యెరుంగునది.

రక్తస్రావాధిక్యమున కల్గునుపద్రవములు.

మూ. అఙ్గగ్లానౌ న తు స్రావ్యం రూక్షే వాతోత్తరే చ యత్. 38
గమ్భీరం శ్వయథుం స్తంభం కమ్పం స్నాయుసిరామయాన్,
గ్లానిం చాపి ససంకోచాం కుర్యాద్వాయురసృక్ క్షయాత్. 39

ఖాఞ్జ్యాదీన్ వాతరోగాంశ్చ మృత్యుంచాత్యపసేచనాత్,
కుర్యాత్తస్మాత్ప్రమాణేన స్నిగ్ధాద్రక్తం వినిర్హరేత్. 40

వ్యా. శరీరము బడలియున్నపుడు రక్తమును స్రవింపచేయ దగదు. వాత మధికమై రక్తము మిగుల రూక్షగుణము కల్గియున్నపుడు అట్టిరక్తము కూడ స్రవింప దగదు. మరియు రక్తమును అధికముగ స్రవింపచేసినయెడ శరీరమునందు లోభాగమున వాపును కల్గించును. అవయవములను స్తంభింపజేయును. కంపము గలుగును. స్నాయువులను సిరలను సంబంధించినవ్యాధులు సంభవించును. అవయవములు ముడుచుకొని శుష్కించును. ఖంజత్వము మున్నగువాతరోగముల కల్గించును. ఒకసమయమున మరణమునుకూడ కల్గించును. కావున శరీరము స్నిగ్ధముగనున్న ప్రదేశమునుండి మితముగ రక్తమును వెడలించవలయును.

### వాతరక్తసామాన్యచికిత్సాక్రమము.

మూ. విరేచ్యః స్నేహయిత్వాఽఽదౌ స్నేహయుక్తైర్విరేచనైః,
రూక్షైర్వా మృదుభిః శస్తం అసకృత్ వస్తికర్మ చ. 41
సేకాభ్యఙ్గప్రదేహాన్నస్నేహాః ప్రాయోఽవిదాహినః,
వాతరక్తే ప్రశస్యన్తే,

వ్యా. వాతరక్తరోగికి తొలుత స్నేహములచే స్నిగ్ధకోష్ఠము గలవానినిగ జేసి స్నేహములతోకూడిన విరేచనౌషధములచే విరేచనము చేయించవలయును. (శరీరము మిక్కిలి స్నిగ్ధముగ నున్నపుడు) రూక్షములును, మృదుగుణంబులును నయినయౌషధములచే విరేచనము చేయించనగును. మరియు వస్తికర్మను, సేకమును, అభ్యంగనమును, ప్రలేపములును, ఆహారములను, స్నేహములను నుపయోగింపవలయును. అట్టిసేకాదులను మిక్కిలి విదాహకరములు కాకుండునౌషధాదులను నుపయోగించుట వాతరక్తమున మిగుల ప్రశస్తము. (ఇచ్చట విరేచనవిధియందు కొంచెము స్నిగ్ధముగనున్నప్పుడు స్నేహయుక్తమయిన యౌషధముచేతను మిక్కిలి స్నిగ్ధముగనున్నపుడు మృదురూక్షౌషధముల చేతను, విరేచనము చేయించవలయునని విభాగము నెరుంగునది. మరియు తీక్ష్ణౌషధములచే విరేచనము చేయించునెడ వాతము ప్రకోపించునని భయముచేత మృదువిరేచనము విధింపబడినది.)

### వాతరక్తవిశేషచికిత్స.

మూ. విశేషం తు నిబోధ మే. 42

బాహ్యామాలేపనాఽభ్యఙ్గపరిషేకోపనాహనైః,
విరేకాస్థాపనస్నేహపానైః గమ్భీరమాచరేత్. 43

వ్యా. వాతరక్తసామాన్యముగ చికిత్సాక్రమము పైని చెప్పబడినది. విశేషచికిత్స యీక్రింద చెప్పబడును:—ఉత్తానవాతరక్తమున ఆలేపనములు, అభ్యంగనము, పరిషేకము, అవగాహనము నను వానిచే చికిత్స చేయనగును. గంభీరవాతరక్తమునకు విరేచనౌషధములచేతను, ఆస్థాపనవస్తి ప్రయోగముచేతను, స్నేహపానముచేతను చికిత్స చేయనగును.

వాతాధికవాతరక్తచికిత్సాసంగ్రహము.

మూ. సర్పిస్తైలవసామజ్జాపానాభ్యఞ్జనవస్తిభిః,
సుఖోష్ణైరుపనాహైశ్చ వాతోత్తరముపాచరేత్. 44

వ్యా. వాతాధికమైన వాతరక్తమున ఘృతము తైలము వస మజ్జయుం ననుస్నేహములను పానమునకు అభ్యంగనమునకును వస్తికర్మకును చేర్చి చికిత్స చేయనగును. మరియుం సుఖోష్ణములుగ నుండునుపనాహములను కూడ చేయనగును.

పిత్తాధికవాతరక్తచికిత్స.

మూ. విరేచనైః ఘృతక్షీరపానైః సేకైః సవస్తిభిః,
శీతైర్నిర్వాపణైశ్చాపి రక్తపిత్తోత్తరం జయేత్. 45

వ్యా. రక్తంబైనను పిత్తంబైనను అధికముగనుండు వాతరక్తమున విరేచనౌషధములచేతను, ఘృత-క్షీరపానములచేతను, సేకములచేతను, వస్తిప్రయోగముచేతను, మంటను చల్లార్చు శీతలోపచారములచేతను చికిత్సజేసినయెడ శమించును.

కఫాధికవాతరక్తచికిత్స.

మూ. వమనం మృదు నాత్యర్థం స్నేహసేకౌ విలఙ్ఘనం,
కోష్ణలేపాశ్చ శస్యన్తే వాతరక్తే కఫోత్తరే. 46

వ్యా. కఫాధికవాతరక్తమున మిక్కిలి మృదువుగానుండు వమనౌషధముచే వమనము చేయించవలెను. స్నేహమును పరిషేకమును లంఘనమును చేయనగును. కొంచెముగ నుష్ణములగునౌషధములచే లేపముల చేయనగును.

కఫవాతాధికవాతరక్తచికిత్సాసంగ్రహము.

మూ. కఫవాతోత్తరే శీతైః ప్రలిప్తే వాతశోణితే,
దాహశోథరుజాకణ్డూవివృద్ధిః స్తమ్భనాద్భవేత్. 47

రక్తపిత్తోత్తరే చోష్ణైః దాహః క్లేదోఽవదారణం,
భవేత్తస్మాద్భిషగ్దోషబలంబుద్ధ్వాఽఽచరేత్క్రియామ్. 48

వ్యా. వాతరక్తమున కఫమైనను వాతంబైనను అధికముగ నున్నపుడు చల్లగనున్న యౌషధముచే పట్టువేసినయెడ బైటవెడలుచుండు ఆవిరిని వెడలనీయక స్తంభింప జేయుటవలన మంటను వాపును నొప్పిని దురదను మిక్కిలి వృద్ధినొందించును; కావున శీతములగు ప్రలేపముల చేయదగదు. (కావుననే వాత-కఫాధిక వాతరక్తములయందు "సుఖోష్ణైరుపనాహయేత్, కోష్ణలేపాశ్చ శస్యన్తే" అని సుఖోష్ణముగనుండు ప్రలేపము విధింపబడినది.)

మరియు రక్తంబైనను పిత్తంబైనను అధికముగనుండు వాతరక్తమున నుష్ణములగు ప్రలేపముల జేసినయెడ మంటయు క్లేదంబును అధికమై పగులును; (కావున శీతములగు ప్రలేపముల చేయవలెను). కావున వైద్యుడు వాతరక్తమునందు దోషములయొక్క బలాబలములను చక్కగ గమనించి తదనుసారముగ చికిత్స చేయనగును. (వాతకఫములయం దుష్ణక్రియను, రక్త-పిత్తాధికములయందు శీతప్రధానచికిత్సను, మిశ్రములయందు మిశ్రచికిత్సను చేయవలెనని భావము.)

వాతరక్తమున వర్జ్యములు.

మూ దివాస్వప్నం ససన్తాపం వ్యాయామం మైథునం తథా,
కటూష్ణం గుర్వభిష్యన్ది లవణామ్లం చ వర్జయేత్. 49

వ్యా. పగటియందు నిదురించుట, ఎండ నిప్పుసెగ మున్నగు వేడిసోకుట, దేహపరిశ్రమముచేయుట, సంభోగముచేయుట, కటురసంబును ఉష్ణవీర్యంబును గురుగుణంబును కలపదార్థములను, అభిష్యందిపదార్థములను, లవణ-అమ్లరసములను సేవించుట, వీని నన్నిటిని వాతరక్తరోగపీడితులు విసర్జించవలెను.

వాతరక్తమునం దాహారోపయోగ్యములు.

మూ. పురాణా యవగోధూమనీవారాః శాలిషష్టికాః,
భోజనార్థం రసార్థం వా విష్కిరప్రతుదాః హితాః. 50
ఆఢక్యశ్చణకాః ముద్గాః మసూరాస్సమకుష్ఠకాః,
యూషార్థం బహుసర్పిష్కాః ప్రశస్తా వాతశోణితే. 51

వ్యా. ప్రాతవియగు యవలును, గోధుమములును, నీవారములును, రాజనములును, అరువదినాళ్లసంబావులును వాతరక్తమునందు భోజనమునకై యుపయోగింపదగును.

మాంసరసమునకై కోడి మున్నగు విష్కిరములయొక్కయు ప్రతుదములను జంతువుల యొక్కయు మాంసముల నుపయోగింపదగును. కందులు, సెనగలు, పెసలు, చిరుసెనగలు, అడవిపెసలు, అను నీపప్పుదినుసుల జేర్చి యూషముల సిద్ధముచేసి, అందు విశేషముగ నేతిని కలిపి యుపయోగించుట వాతరక్తమున చాలయుపయోగము.

## వాతరక్తమున హితములగు శాకములు, క్షీరములు.

మూ. సునిషణ్ణకవేత్రాగ్రకాకమాచీశతావరీ,
వాస్తుకోపోదికాశాకం శాకం సౌవర్చలం తథా. 52
ఘృతమాంసరసైర్భృష్టం శాకసాత్మ్యాయ దాపయేత్,
వ్యఞ్జనార్థం తథా గవ్యం మాహిషాజం పయో హితమ్. 53

వ్యా. నీరుచెంచలి, వేత్రాగ్రము (పేముచిగురు), కాచికూర, పిల్లిపీచరకూర, చక్రవర్తికూర, దుంపబచ్చలియాకు, ప్రొద్దుతిరుగుడుచెట్టు ఆకుకూర, ఈశాకములకు ఘృతమును మాంసరసమును చేర్చి పక్వముచేసి శాకములు అలవాటునకల వాతరక్తరోగికి వ్యంజనములకై యుపయోగింపనగును. మరియు ఆవుపాలును బఱ్ఱెపాలును హితకరములుగ నుండును.

(ఇచ్చట వ్యంజనమన—అన్నముతో కలిపి భుజించుటకు దగిన కూరలని యెఱుంగునది.)

మూ. ఇతి సంక్షేపతః ప్రోక్తం వాతరక్తచికిత్సితం,
ఏతదేవ పునస్సర్వం వ్యాసతస్సమ్ప్రవక్ష్యతే. 54

వ్యా. ఇత్తెరంగున వాతరక్తచికిత్సితము సంగ్రహించి క్లుప్తముగ జెప్పబడినది. ఈచికిత్సయే యాక్రింద విస్తరించి వివరముగ చెప్పబడును.

## వాతరక్తహరశ్రావణ్యాదిఘృతము.

మూ. శ్రావణీక్షీరకాకోలీ జీవకర్షభకైస్సమైః,
సిద్ధం సమధుకైస్సర్పిః సక్షీరం వాతరక్తనుత్. 55

వ్యా. బోడతరము, క్షీరకాకోళి, జీవకము, ఋషభకము, అతిమధురము, వీనిని సమభాగములుగ గూర్చి కల్కముచేసి (కల్కమునకు నాలుగింత) ఘృతమును, (ఘృతమునకు నాలుగింతలు) ఆవుపాలనుకలిపి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి యుపయోగించిన వాతరక్తమును హరించును. (ఇచ్చట ద్రవాంతరము లేక క్షీరమును మాత్రము

చెప్పుటవలన "క్షీరపాకవిధౌ యత్ర క్షీరమేకన్తు కథ్యతే, తోయాదీనామనిర్దేశే క్షీరమేవ చతుర్గుణం" అను పరిభాష ననుసరించి క్షీరమును ఘృతమునకు నాల్గింత చేర్పవలెను.

### వాతరక్తహరబలాదిఘృతము.

మూ. బలామతిబలాం మేదాం ఆత్మగుప్తాం శతావరీం,
కాకోలీం క్షీరకాకోలీం రాస్నామృద్ధిం చ పేషయేత్. 56
ఘృతం చతుర్గుణక్షీరం తైస్సిద్ధం వాతరక్తనుత్,
హృత్పార్శ్వరోగవీసర్పకామలాజ్వరనాశనమ్ 57

వ్యా. చిట్టాముట్టి, పేరాముట్టి, మేద, దూలగొండి, పిల్లిపీచరగడ్డ, కాకోలి, క్షీరకాకోలి, సన్నరాష్ట్రము, ఋద్ధి, వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి నూరి కల్కము చేసి, కల్కమునకు నాల్గింతలుఘృతమును, ఘృతమునకు నాల్గింతలు ఆవుపాలనుకలిపి ఘృతపాకవిధిగ పక్వము చేయబడినఘృతము వాతరక్తమును హరించును. మరియు హృద్రోగమును ప్రక్కనొప్పులను, విసర్పమును, కామలారోగమును, జ్వరమునుకూడ హరించును.

### వాతరక్తహరపారూషకఘృతము.

మూ. త్రాయన్తికా తామలకీ ద్వికాకోలీ శతావరీ,
కశేరుకాకషాయేణ కల్కైరేభిః పచేద్ఘృతమ్. 58
దత్వా పరూషకద్రాక్షా కాశ్మర్యేక్షురసాన్ సమాన్,
పృథగ్విదార్యాః స్వరసం తథా క్షీరం చతుర్గుణమ్. 59
ఏతత్ప్రాయోగికం సర్పిః పారూషకమితి స్మృతం,
వాతరక్తే క్షతే క్షీణే వీసర్పే పైత్తికే జ్వరే. 60
(ఇతి పారూషకం ఘృతమ్.)

వ్యా. కానుక, నేలయుసిరిక, కాకోళి, క్షీరకాకోళి, పిల్లిపీచరగడ్డ, వీనిని సమభాగములుగ గూర్చి కల్కము చేసి ఈకల్కమును నాల్గింతల ఘృతమున కలిపి, అందు నమ్మదుంపకషాయమును, చిట్టీతపండ్లరసమును, ద్రాక్షపండ్లరసమును, గుమ్మడిరసమును, చెరకురసమును, నేలగుమ్మడిరసమును, ఒక్కొకటి ఘృతమునకు సమానభాగములుగను, ఘృతమునకు నాల్గింతలు ఆవుపాలను కలిపి, (అన్నిటి నొకటిగ గూర్చి) ఘృతపాకవిధి ప్రకారము పక్వము చేసిన నయ్యది పారూషకఘృత మనబడును. దీనిని వాతరక్తము

నందును, ఉరఃక్షతమునందును, ధాతుక్షీణమునందును, విసర్పమునందును, పిత్తజ్వరము నందును నియతముగ ప్రతిదినంబు నుపయోగింపందగును.

ఇచ్చట కానుగు నున్నగుద్రవ్యములను సమభాగములుగ గూర్చి కల్కముచేసి, కల్కమునకు నాల్గింతలఘృతమును, నమ్మదుంపకషాయమును చిట్టీతమున్నగువాని నాల్గురసములను, పాలగుమ్మడిరసమును, ఒక్కొకదానిని వేరువేరు ఘృతమునకు సమములుగను, ఘృతమునకు నాల్గింతలు ఆవుపాలను, వీనినన్నిటి నొకటిగ జేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వము చేయనగును.

ఈఘృతయోగము జతూకర్ణతంత్రమున నిట్లున్నది:—"తుల్యైరసైః పరూషక కాశ్మర్యకకశేరుకావిదారీ ద్రాక్షేక్షూణాం, చతుష్కే పయసి, ద్వికాకోలీతామలకీ శతావర్యః పిష్ట్వా వ్యపచేద్ఘృతమ్; ప్రాయేణ తద్వాతాస్రవీసర్పజ్వరజిత్ సర్పిః పరూషకం నామ" ఈయోగమున కానుగును మాత్రము చెప్పియుండలేదు.

పంచమూలాది (జీవనీయ)ఘృతము.

మూ. ద్వే పఞ్చమూలే వర్షాభూమేరణ్డం సపునర్నవం,
ముద్గపర్ణీం మహామేదాం మాషపర్ణీం శతావరీమ్. 61
శఙ్ఖపుష్పీమవాక్పుష్పీం రాస్నామతిబలాం బలాం,
పృథక్ ద్విపలికాం కృత్వా జలద్రోణే విపాచయేత్. 62
పాదశేషే సమాః క్షీరధాత్రీక్షుఛాగలాః రసాః,
ఘృతాఢకేన సంయోజ్య శనైర్మృద్వగ్నినా పచేత్. 63
కల్కేనావాప్య మేదే ద్వే కాశ్మర్యఫలముత్పలం,
త్వక్క్షీరీం పిప్పలీం ద్రాక్షాం పద్మబీజం పునర్నవామ్. 64
నాగరం క్షీరకాకోలీం పద్మకం బృహతీద్వయం,
వీరాం శృఙ్గాటకం భవ్యమురుమాణం నికోచకమ్. 65
ఖర్జూరాక్షోటవాతామముఞ్జాతాఽభిషుకాంస్తథా,
ఏతైః ఘృతాఢకే సిద్ధే క్షౌద్రం శీతే ప్రదాపయేత్. 66
సమ్యక్సిద్ధం చ విజ్ఞాయ సుగుప్తం సన్నిధాపయేత్,
కృతరక్షావిధిం చాక్షే ప్రాశయేదక్షసమ్మితమ్. 67
పాణ్డురోగం జ్వరం హిక్కాం స్వరభేదం భగన్దరం,
పార్శ్వశూలం క్షయం కాసం ప్లీహానం వాతశోణితమ్. 68

క్షయశోషమపస్మారం అశ్మరీం శర్కరాం తథా,
సర్వాఙ్గైకాఙ్గరోగాంశ్చ మూత్రసఙ్గం చ నాశయేత్.　　69
బలవర్ణకరం ధన్యం వలీపలితనాశనం,
జీవనీయమిదం సర్పిః వృష్యం వన్ధ్యాసుతప్రదమ్.　　70

వ్యా. రెండువిధములైన పంచమూలములు (మారేడు, దుండిగము, మున్నగు మహాపంచమూలములును; ముయ్యాకుపొన్న మొదలగు హ్రస్వపంచమూలములును చేరి ద్విపంచమూలములు), తెల్లగలిజేరు, ఆముదపువేళ్లు, ఎఱ్ఱగలిజేరు, అడవిపెసర, మహామేద, అడవిమినుము, పిల్లిపీచర, శంఖపుష్పి, అడవిసదాప, సన్నరాష్ట్రము, పేరాముట్టి చిట్టాముట్టి, వీనిని ప్రత్యేకము రెండేసిపలములవంతున గూర్చి (చిదుగకొట్టి) ద్రోణ మాత్రజలమున జేర్చి నాల్గవపాలు (ఆఢకపరిమితము) మిగుల కషాయము కాచి (వడగట్టి) యందు ఆఢకపరిమితమైన ఆవునేతిని; ఆవుపాలు, ఉసిరికపండ్లరసము, చెరకురసము, మేకపోతుమాంసరసము, ఈద్రవములను ప్రత్యేకము ఘృతమునకు సమానభాగములుగను కలిపి; మేద, మహామేద, పెద్దగుమ్మడిపండ్లు, నల్లకలువలు, వెదురుప్పు, పిప్పళ్లు, ద్రాక్షపండు, తామరవిత్తులు, గలిజేరు, శుంఠి, క్షీరకాకోలి, పద్మకాష్ఠము, వాకుడు, ములక, వృద్ధి, పరికెదుంప, గజపిప్పళ్లు, ఉరుమాణము అనుఫలవిశేషము, ఊడుగవేళ్లు,(లేక పండ్లు), ఖర్జూరపుపండ్లు, అక్రోడుపప్పు, బాదమువిత్తులు, ముంజాతము, అభిషుకము, అనునీద్రవ్యములన్నియు సమభాగములుగ జేరి ఘృతమునకు నాల్గవపాలుగ నుండునట్లు భాగముల గల్పించి నూరి కల్కము చేసి కలిపి, మందాగ్నిచే ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి, చల్లారినపిదప తేనెను కలిపి చక్కగ కలియబెట్టి సిద్ధమైన యీఘృతమును గాలిమున్నగు వానిచే నభిఘాతము కల్గకుండునట్లు చాల భద్రముగ నుంచునది. శుభలగ్నమున విధ్యుక్త ప్రకారము రక్షావిధానము చేసి పూటకు కర్షప్రమాణమువంతున అగ్నిబలాద్యనుసారముగ సేవింపనగును.

పైజెప్పిన విధిప్రకారము ఈఘృతము సేవించుటవలన పాండురోగము, జ్వరము, ఎక్కిళ్లు, కంఠస్వరభేదము, భగందరము, ప్రక్కనొప్పి, క్షయము, కాసము, ప్లీహవృద్ధి, వాతరక్తము, క్షయముచే కల్గినశోఫ, అపస్మారము, అశ్మరి, శర్కరామేహము, సర్వాంగవాతములు, ఏకాంగవాతములు, మూత్రబంధము, అనునీరోగములనెల్ల హరించును. శరీరబలమును వర్ణమును కల్గించును. ముసలితనముచే కల్గిన వలీపలితముల నివర్తిచేసి సుఖమును కల్గించును. శుక్రమును వృద్ధినందించి సంభోగశక్తిని పూర్తిగ కల్గించి బలకర

ముగనుండును. పంతతికల్గని స్త్రీకి పుత్రసంతతిని కల్గించును. ఇయ్యది శ్రేష్ఠమైన ఘృతము. గురువగు నాత్రేయులచే నగ్నివేశున కుపదేశింపబడిన జీవనీయఘృతము.

(ఈఘృతయోగమున కల్కపరిమాణము చెప్పలేదు కావున మేదాదిద్రవ్యము లన్నియు సమములుగ చేరి ఘృతమునకు నాల్గవవంతు (ప్రస్థపరిమితము) అగునట్లు కూర్చి కల్కము చేసి చేర్పనగును.)

వాతరక్తహరద్రాక్షాఘృతము.

మూ. ద్రాక్షామధు(ధూ)కతోయాభ్యాం సిద్ధం వా ససితోపలం,
పిబేద్ఘృతం తథా క్షీరం గుడూచీస్వరసే శృతమ్. 71

వ్యా. ద్రాక్షపండ్లను అతిమధురమును చేర్చి కషాయము కాచి యాకషాయమును చేర్చి పక్వము చేయబడినఘృతమున తెల్లచక్కెర కలిపి త్రాగినను, దురదగోండి స్వరసమును కలిపి పక్వముచేయబడిన క్షీరమును త్రాగినను వాతరక్తము శమించును.

జీవకాదిసిద్ధస్నేహము.

మూ. జీవకర్షభకౌ మేదామృశ్యప్రోక్తాం శతావరీం,
మధుకం మధుపర్ణీం చ కాకోలీద్వయమేవ చ. 72
ముద్గమాషాఖ్యపర్ణిన్యౌ దశమూలం పునర్నవాం,
బలాఽమృతావిదారీశ్చ సాఽశ్వగన్ధాఽశ్మభేదకాః. 73
ఏషాం కషాయకల్కాభ్యాం సర్పిస్తైలం చ సాధయేత్,
లాభతశ్చ వసామజ్జాధాన్వప్రాతుదవైష్కిరమ్. 74
చతుర్గుణేన పయసా తత్సిద్ధం వాతశోణితం,
సర్వదేహాశ్రితం హన్తి వ్యాధీన్ ఘోరాంశ్చ వాతజాన్. 75

వ్యా. జీవకము, ఋషభకము, మేద, పేరాముట్టి, పిల్లిపీచర, అతిమధురము, మధుపర్ణి (పుల్లవెలగ), కాకోలి, క్షీరకాకోలి, అడవిపెసర, అడవిమినుము, దశమూలములు, గలిజేరు, చిట్టాముట్టి, తిప్పతీగె, నేలగుమ్మడి, పెన్నేరుగడ్డ, పాషాణభేది, వీని చేర్చి కాచబడినకషాయమును; వీనికల్కమును చేర్చి, ఘృతమును తైలమును కలిపి, అందు వసను (మాంసస్నేహమును), మజ్జను, జాంగలజంతువులయొక్కయు ప్రతుదములయొక్కయు, విష్కిరములయొక్కయు మాంసమును, వీనిలో దొరికినంతమట్టుకును చేర్చి స్నేహమునకు నాల్గింతలు ఆవుపాలనుకలిపి స్నేహపాకవిధిప్రకారము స్నేహమును సిద్ధము

చేసి యుపయోగించిన దేహమునందెల్ల వ్యాపించిన వాతరక్తంబును, వాతముచే కల్గిన క్రూరవ్యాధులును శమించును.

కల్పనము:—ఘృతమును తైలమును సమభాగములుగ జేర్చి,అందుజీవకము మొదలు పాషాణభేదివరకు చెప్పబడినద్రవ్యములచే సిద్ధమైన కషాయమును స్నేహమునకు నాల్గింతలును, అట్టి క్వాథ్యద్రవ్యముల కల్కమునే స్నేహమునకు నాల్గవపాలును, ఆవుపాలు స్నేహమునకు నాల్గింతలును కలిపి, వసను మజ్జను జాంగలాది జంతుమాంసరసమును యథాలాభముగజేర్చి స్నేహపాకవిధిప్రకారము పక్వము చేయనగును. ఇది సామాన్యపరిభాషాను సారమైన కల్పనము.

ఇచ్చట వ్యాఖ్యానమున:—"ఋశ్యప్రోక్తా-అతిబలా, మధుపర్ణీ-వికఙ్కతః," అని యున్నది. మరియు ప్రతుదములన మాంసము మున్నగు నాహారపదార్థములను ముక్కున బొడిచితినునట్టి చిలుకలు గోరువంకలుమున్నగు పక్షిజంతువులనియు, భూమిపై కాళ్లచే గీచి కీటాదుల తినునట్టి కోడి నెమలి మున్నగుజంతువులు విష్కిరములనియు నెరుంగునది.

## త్రిదోషజవాతరక్తమునకు స్థిరాదితైలము, ఘృతంబును.

మూ. స్థిరా శ్వదంష్ట్రా బృహతీ సారిబా సశతావరీ,
కాశ్మర్యాత్మగుప్తా చ వృశ్చీరో ద్వే బలే తథా. 76
ఏషాం క్వాథే చతుఃక్షీరే పృథక్ తైలం పృథక్ ఘృతం,
మేదా శతావరీ యష్టి జీవన్తీ జీవకర్షభైః. 77
పక్వా మాత్రా తతః క్షీరత్రిగుణాఽర్ధ్యర్ధశర్కరా,
ఖజేన మథితా పేయా వాతరక్తే త్రిదోషజే. 78

వ్యా. ముయ్యాకుపొన్న, పల్లేరు, వాకుడు, సుగంధపాల, పిల్లిపీచరగడ్డ, పెద్ద గుమ్మడి, దురదగొండి, వృశ్చీరము, చిట్టాముట్టి, పేరాముట్టి వీనిని సమభాగములుగగూర్చి క్వాథము చేయునది. మేద, పిల్లిపీచర; అతిమధురము, పాలకూర, జీవకము, ఋషభకము, వీనిని సమభాగములుగ గూర్చి కల్కము చేసి, కల్కమునకు నాల్గింతలు నువ్వుల నూనెను, నూనెకు నాల్గింతలు పైజెప్పినకషాయమును, కషాయమునకు నాల్గింతలు ఆవుపాలను కల్పి యన్నిటి నొకటిగ జేర్చి తైలపాకవిధిప్రకారము తైలమును పక్వము చేయునది.

మరియుః పైజెప్పిన క్వాథకల్కక్షీరములను చేర్చి ఘృతమునుకూడ తైలవిధిప్రకారము వేరుగ పక్వము చేయనగును. ఇత్తెరంగున వేరువేరుగ సిద్ధములైన తైలఘృతముల

రెంటియందును తగుపరిమాణముగ గ్రహించి దానికి మూడుభాగములు ఆవుపాలను, అర్ధ భాగము చక్కెరను కూడ కలిపి కవ్వముచే నన్నియు నొకటిగ కలియునట్లు చిలికి, త్రిదోషములచే గల్గిన వాతరక్తమునందు త్రాగనగును. (తైలఘృతముల రెంటిని చేర్చి మాత్ర గల్పింపవలెను.)

ఇచ్చట స్థిరాదిద్రవ్యములను క్వాథపరిభాషానుసారముగ కషాయము కాచి, సామాన్యపరిభాష ననుసరించి నాల్గవపాలు తైలమును, తైలమునకు నాల్గవపాలు మేద మున్నగువానికల్కమును, ఉక్తపరిమాణప్రకారము కషాయమునకు నాల్గింతలు పాలను చేర్చి తైలమును పక్వము చేయనగును. ఇత్తెరంగుననే ఘృతమును వేరుగ పక్వముచేయునది. (త్రిదోషజవాతరక్త మసాధ్యంబైనను సంపూర్ణలక్షణము కానప్పుడు ఒకసమయమున సాధింపదగునని యీచికిత్స విధింపబడినది.)

## వాతరక్తహరపానములు.

మూ. తైలం పయశ్శర్కరాం చ పాయయేద్వా సుమూర్ఛితం,
సర్పిస్తైలవసాక్షౌద్రైః మిశ్రం వాపి పిబేత్పయః. 79

వ్యా. తైలమును పాలను చక్కెరను ఒకటిగ సమభాగములుగకూర్చి కలియబెట్టి వాతరక్తమున త్రాగవలెను. నెయ్యిని నూనెను వసను తేనెను పాలలో కలిపి త్రాగినను వాతరక్తమును హరించును.

## వాతరక్తరోగహరక్షీరపానము.

మూ అంశుమత్యా శృతః ప్రస్థః పయసో ద్విసితోపలః,
పానే ప్రశస్యతే తద్వత్పిప్పలీనాగరైశ్శృతః. 80

వ్యా. మయ్యాకుపొన్నను ప్రస్థపరిమితమైన పాలతోచేర్చి కాచి యందు రెండు పలములు చక్కెర కలిపి వాతరక్తరోగమున త్రాగుట ప్రశస్తము. మరియు పిప్పళ్లను శుంఠిని క్షీరప్రస్థమున కలిపి కాచి రెండుపలములు చక్కెర కలిపియైనను త్రాగుట మంచిది.

## వాతరక్తహరబలాదిసిద్ధక్షీరము.

మూ. బలా శతావరీ రాస్నా దశమూలైస్సపీలుభిః,
శ్యామైరణ్డస్థిరాభిశ్చ వాతార్తిఘ్నం శృతం పయః. 81
ధారోష్ణం మూత్రయుక్తం వా క్షీరం దోషానులోమనం,

వ్యా. చిట్టాముట్టివేరు, పిల్లిపీచరగడ్డలు, దుంపరాష్ట్రము, దశమూలములు, పీర గోగు, నల్లతెగడ, ఆముదపువేళ్లు, ముయ్యాకుపొన్న వీనినన్నిటిని సమభాగములుగగూర్చి యావుపాలలో కలిపి కాచి త్రాగిన వాతరోగములు నిమ్మళించును.

మరియు ధారోష్ణమైన యావుపాలలో గోమూత్రమును కలిపి త్రాగినను వాతాదిదోషముల ననులోమముగ జేయును. (ఇచ్చట ధారోష్ణమన:—పాలను పిండు నపుడే స్వాభావికముగ వేడిగనుండుపాలు. దీని 'ధారోష్ణమమృతోపమ్' అని వాగ్భటులు ప్రశంసించిరి.)

వాతరక్తమున దోషాధిక్యము ననుసరించి విరేచనౌషధయోగములు.

మూ. పిబేద్వా స త్రివృచ్చూర్ణం పిత్తరక్తావృతాఽనిలః. 82
క్షీరేణైరణ్డతైలం వా ప్రయోగేణ పిబేన్నరః,
బహుదోషో విరేకార్థం జీర్ణే క్షీరౌదనాశనః. 83

వ్యా. పిత్తముచేనైనను రక్తముచేనైనను వాతము ఆవరింపబడిన వాతరక్తము నందు ధారోష్ణక్షీరమున తెగడచూర్ణమును కలిపి త్రాగవలెను. లేక ఆముదమును పాలలో కలిపి దోషము ప్రబలముగనున్న వాతరక్తమున విరేచనమునకై త్రాగవలెను. అయ్యది జీర్ణమైనపిదప పాలతో నన్నమును భుజించవలెను.

విరేచనమున కభయాకషాయాదులు.

మూ. కషాయమమృతానాం వా(అభయానాంవా)ఘృతభృష్టంపిబేన్నరః,
క్షీరాఽనుపానం త్రివృతా చూర్ణం ద్రాక్షారసేన వా. 84

వ్యా. కరకకాయలను కషాయము కాచి దానిని నేతితో కలిపి సంస్కరించి త్రాగవలెను. లేక తెగడచూర్ణమును క్షీరానుపానముతోనైనను, ద్రాక్షపండ్లరసము నను పానముగ జేసియైనను త్రాగవలెను.

విరేచనమున కాశ్మర్యాదికషాయము.

మూ కాశ్మర్యం త్రివృతాం ద్రాక్షాం త్రిఫలాం సపరూషకాం,
శృతం పిబేద్విరేకాయ లవణక్షౌద్రసంయుతమ్. 85

వ్యా. గుమ్మడి, తెగడ, ద్రాక్షపండు, త్రిఫలములు, చిట్టీత వీనిని సమభాగములుగ గూర్చి కషాయము కాచి అందు సైంధవలవణమును తేనెను కలిపి దోషము బలిష్ఠముగ నున్న వాతరక్తమున విరేచనమునకై త్రాగవలెను.

### త్రిఫలాధాత్ర్యాదికషాయములు.

మూ. త్రిఫలాయాః కషాయం వా పిబేత్ క్షౌద్రేణ సంయుతం,
ధాత్రీహరిద్రాముస్తానాం కషాయం వా కఫాధికః. 86

వ్యా. మరియు త్రిఫలాకషాయమున తేనెను కలిపియైనను, ఉసిరికకాయలను పసుపును తుంగగడ్డలను సమముల గూర్చి కషాయముకాచి యందు తేనె కలిపియైనను త్రాగవలెను.

### అనుక్తవిరేచనయోగములసంగ్రహము.

మూ. యోగైశ్చ కల్పవిహితైః అసకృత్తం విరేచయేత్,
మృదుభిః స్నేహసంయుక్తైః జ్ఞాత్వా వాతం మలావృతమ్. 87

వ్యా. మరియు వాతరక్తమున వాతము పిత్తాదులచే నావరింపబడియున్నపుడు పైజెప్పిన విరేచనయోగములుగాక కల్పస్థానమున జెప్పబడిన మృదువిరేచనౌషధయోగములలో ఘృతము మున్నగు స్నేహములనుకూడ కలిపి యుపయోగించి పలుమాఱు విరేచనముల జేయించవలెను.

### వాతరక్తమున వస్తిప్రయోగప్రాశస్త్యము.

మూ. నిర్హారేద్వా మలం తస్య న ఘృతైః క్షీరవస్తిభిః,
నహి వస్తిసమం కిఞ్చిత్ వాతరక్తచికిత్సితమ్. 88

వ్యా. వాతరక్తమున మలము లావరించియున్నపుడు ఘృతముతో కూడి క్షీరప్రధానములగు వస్త్యౌషధములచే వస్తిప్రయోగముచేసి మలమును వెడలించవలెను. వాతరక్తమునకు వస్తితో సమానమైన చికిత్స వేరొండు లేదు. (కావున పైజెప్పినరీతిగ వస్తిప్రయోగము చేయవలెననుట.)

### వాతరక్తమున నిరూహ-అనువాసనవస్తివిధి.

మూ. వస్తివంక్షణపార్శ్వోరుపర్వాఽస్థిజఠరార్తిషు,
ఉదావర్తే చ శస్యన్తే నిరూహాస్సానువాసనాః. 89
దద్యాత్తైలాని చేమాని వస్తికర్మణి బుద్ధిమాన్,
నస్యాఽభ్యఞ్జనసేకేషు దాహశూలోపశాన్తయే. 90

వ్యా. వాతరక్తరోగమునందు వస్తి, గజ్జలు, ఇరుప్రక్కలు, కీళ్లు, అస్థులు, కడుపు అను నీస్థలములయందు బాధకల్గినను, వాతము పైకి వ్యాపించియున్నను నిరూహ

వస్తులును అనువాసనవస్తులును చాల ప్రశస్తములు. అట్టి వస్తిప్రయోగమునకును, నస్య-అభ్యంజన-సేచనములకును, మంటయు శూలమును శమించుటకై యీక్రింద జెప్పబడు తైలముల నుపయోగించవలెను.

## వాతరక్తమున వస్త్యాదులకు మధుయష్ట్యాదితైలము.

మూ. మధుయష్ట్యాస్తులాయాస్తు కషాయే పాదశేషితే,
తైలాఢకం సమక్షీరం పచేత్ కల్కైః పలోన్మితైః. 91
శతపుష్పావరీమూర్వాపయస్యాఽగురుచన్దనైః,
స్థిరాహంసపదీమాంసీద్విమేదామధుపర్ణిభిః. 92
కాకోలీక్షీరకాకోలీతామలక్యృద్ధిపద్మకైః,
జీవకర్షభజీవన్తీత్వక్పత్రనఖబాలకైః. 93
ప్రపౌణ్డరీకమఞ్జిష్ఠాసారిబైన్ద్రీవితున్నకైః,
చతుష్ప్రయోగాత్తద్ధన్తి తైలం మారుతశోణితమ్. 94
సోపద్రవం సాఙ్గశూలం సర్వగాత్రాఽనుగం తథా,
వాతాఽసృక్పిత్తదాహార్తిజ్వరఘ్నం బలవర్ణకృత్. 95
(ఇతి మధుయష్ట్యాదితైలమ్.)

వ్యా. నూరుపలములు అతిమధురమును (నాల్గాఢకముల) జలమున జేర్చి నాల్గవపాలు (ఆఢకపరిమితము) మిగుల కషాయము కాచి, అందు నువ్వులనూనె నొకయాఢకమును తైలసమభాగముగ క్షీరమును, ఈక్రింద జెప్పబడు ద్రవ్యముల నొక్కొకపలము వంతున చేర్చి చేయబడినకల్కమును కలిపి తైలపాకవిధిప్రకారము పక్వముచేయవలెను. కల్కద్రవ్యములు:—సదాపవిత్తులు, పిల్లిపీచర, చాగ, పాలకూర (మనుబాల), అగరు, చందనము, మయ్యాకుపొన్న, హంసపది, జటామాంసి, మేద, మహామేద, అతిమధురము (ఖర్బూజదోస); కాకోలి, క్షీరకాకోలి, నేలయుశిరిక, ఋద్ధి, పద్మకాష్ఠము, జీవకము, ఋషభకము, పిన్నమనుబాల, లవంగపుపట్ట, లవంగపుపత్రి, నఖముచిప్పలు, కురువేరు, ప్రపౌండరీకము (గంధద్రవ్యవిశేషము), మంజిష్ఠి, సుగంధపాల, పిన్నపాపర, దనియాలు వీనిని ప్రత్యేక మొక్కొకపలమువంతున గూర్చి మెత్తగ నూరి కల్కముచేసి పై జెప్పినతైలమున కలిపి పక్వము చేయనగును. (హంసపాది యనునది స్వనామప్రసిద్ధము. హంసకాలివంటి యాకులు కల్గి భూమిపై బ్రాకునది.)

ఈతైలమును పానము, అభ్యంజనము, నస్యము, వస్తి, అను నీనాల్గువిధములైన చికిత్స కుపయోగించినయెడ ఉపద్రవములతోడను ఒడలునొప్పులతోడను శూలము

తోడను కూడినవాతరక్తమును, పిత్తమును మంటను నొప్పిని జ్వరమును హరించును. శరీరమునకు బలమును వర్ణమును కల్గించును. ఇది మధుయష్ట్యాదితైలమని చెప్పబడును. (ఇచ్చట నూరుపలములు అతిమధురమున నాల్గాఢకములు జలమును జేర్చి నాల్గవపాలు మిగుల క్వాథముచేసినయెడ ఆఢకపరిమితతైలమునకు సమానముగ క్వాథమగును.)

సుకుమారతైలము.

మూ. మధుకస్య శృతం ద్రాక్షా ఖర్జూరాణి పరూషకం,
మధూకౌదనపాక్యా చ ప్రస్థం ముఞ్జాతకస్య చ. 96
కాశ్మర్యాఢకమిత్యేతత్ చతుర్ద్రోణే పచేదపాం,
శేషేఽష్టభాగే పూతే చ తస్మింస్తైలాఢకం పచేత్. 97
తథాఽఽమలకకాశ్మర్యవిదారీక్షురసైః సమైః,
చతుర్ద్రోణేన పయసా కల్కం దత్వా పలోన్మితమ్. 98
కదమ్బామలకాక్షోటపద్మబీజకశేరుకం,
శృఙ్గాటకం శృఙ్గబేరం లవణం పిప్పలీం సితామ్. 99
జీవనీయైశ్చ సంసిద్ధం క్షౌద్రప్రస్థేన సంసృజేత్,
నస్యాఽభ్యఞ్జనపానేషు వస్తౌ చాపి నియోజయేత్. 100
వాతవ్యాధిషు సర్వేషు మన్యాస్తమ్భే హనుగ్రహే,
సర్వాఙ్గైకాఙ్గవాతే చ క్షతక్షీణే క్షతజ్వరే. 101
సుకుమారకమిత్యేతత్ వాతాఽస్రామయనాశనం,
స్వరవర్ణకరం తైలం ఆరోగ్యబలపుష్టిదమ్. 102
(ఇతి సుకుమారతైలమ్.)

వ్యా. అతిమధురము నూరుపలములు, ద్రాక్షపండ్లు, ఖర్జూరపుపండ్లు, చిట్రీతపండ్లు, మధుకము (నీటియందుపుట్టిన యిప్పచెట్టు) ఓదనపాకి (చిట్టాముట్టి), ముంజాతము (స్వనామప్రసిద్ధము), ఇవి యొక్కొకటిప్రస్థ (పదునారుపలముల) పరిమితములు, పెద్దగుమ్మడి యొకఆఢకము, ఈభాగములవంతున వీనినన్నిటిని నాల్గుద్రోణముల పరిమితమైన జలమున వైచి యెనిమిదవపాలు (రెండాఢకములు) మిగుల కషాయము కాచి వడగట్టి, అందు ఆఢకపరిమితమైన నువ్వులనూనెను, ఉసిరికకాయలరసమును, గుమ్మడికాయలరసమును, నేలగుమ్మడిదుంపలరసమును, చెరకురసమును, ప్రత్యేకమొక్కొకఆఢకమువంతున

కలిపి, నాల్గుద్రోణములు ఆవుపాలను, క్రిందచెప్పబడు ద్రవ్యముల నొక్కొక్కపలము వంతున గూర్చినకల్కమునుకూడ కలిపి తైలపాకవిధిప్రకారము పక్వము చేయనగును.

కల్కద్రవ్యములు:—కడిమి, ఉసిరికకాయలబెరడు, ఆక్రోడు, తామరవిత్తులు, నమ్మదుంపలు, శృంగాటకము (పరికెగడ్డ), శుంఠి, సైంధవలవణము, పిప్పళ్లు, చక్కెర, జీవకము మున్నగు జీవనీయగణద్రవ్యములు పది, వీనినన్నింటి నొక్కొక్కపలమువంతున కల్కముచేసి పైజెప్పిన కషాయాదిద్రవములతో గూడినతైలమున కలిపి తైలపాకవిధి ప్రకారము తైలమును సిద్ధముచేసి చల్లారినపిదప నొకప్రస్థము తేనెను కూడ కలిపి పదిలముగ నుంచునది.

ఈతైలమును వాతవ్యాధు లన్నిటియందును, మన్యాస్తంభను, హనుగ్రహవాతము, సర్వాంగవాతము, ఏకాంగవాతము, క్షతక్షీణము, ఉరఃక్షతముచే గల్గినజ్వరము అను నీవ్యాధులయందు పానమునకును, అభ్యంజనమునకును, నస్యమునకును, వస్తిప్రయోగమునకును ఉపయోగింపదగును, ఇది సుకుమారతైల మనబడును. వాతరక్తరోగమును పూర్తిగ హరించును. కంఠస్వరమును శరీరకాంతిని బలమును పుష్టినికల్గించి యారోగ్యము నొనగూర్చును.

(ఇచ్చట జీవనీయగణమున చెప్పబడిన జీవకము, ఋషభకము, మేద, మహామేద, కాకోలి, క్షీరకాకోలి, ముద్గపర్ణి, మాషపర్ణి, పాలతూర, అతిమధురము అను నీపదిద్రవ్యములను 'జీవనీయైః' అనుపదముచే గ్రహింపవలెను.

### అమృతాదితైలము.

మూ. గుడూచీం మధుకం హ్రస్వం పఞ్చమూలం పునర్నవాం,
రాస్నా మేరణ్డమూలం చ జీవనీయాని లాభతః. 103
పలానాం శతకైర్భాగైః బలాపఞ్చశతం తథా,
కోలబిల్వయవాన్ మాషాన్ కులుత్థాంశ్చాఢకోన్మితాన్. 104
కాశ్మర్యాణాం సుశుష్కాణాం ద్రోణం ద్రోణశతేఽమ్భసి,
సాధయేజ్జర్జరం ధౌతం చతుర్ద్రోణం చ శేషయేత్. 105
తైలద్రోణం పచేత్తేన దత్వా పఞ్చగుణం పయః,
పిష్ట్వా త్రిపలికం చైవ చన్దనోశీరకేసరమ్. 106
పత్త్రైలాఽగురుకుష్ఠాని తగరం మధుయష్టికాం,
మఞ్జిష్ఠాఽష్టపలం చైవ తత్సిద్ధం సార్వయౌగికమ్. 107

వాతరక్తే క్షతక్షీణే భారార్తే క్షీణరేతసి,
లేపనాక్షేపభగ్నానాం సర్వాఙ్గైకాఙ్గరోగిణామ్. 108
యోనిదోషమపస్మారమున్మాదం ఖఞ్జపఙ్గుతామ్,
హన్యాత్ ప్రసవనం (పుంసవనం) చైతత్ తైలాగ్ర్యమమృతాహ్వయమ్. 109

(ఇత్యమృతాద్యం తైలమ్.)

వ్యా. తిప్పతీగె, అతిమధురము, ముయ్యాకుపొన్న, హ్రస్వపంచమూలములు, తెల్ల గలిజేరు, దుంపరాష్ట్రము, ఆముదపువేళ్లు, కాకోలి మున్నగు జీవనీయగణద్రవ్యములలో దొరికినంతమట్టుకును ఇవి యొక్కొకటి నూరేసిపలములు; చిట్టాముట్టి యెదువందలపలములు, రేగు,మారేడు,యవలు, ఉద్దులు, ఉలవలు ఇవి యొక్కొకటి యొక్కొక ఆఢకము (అరువదినాల్గుపలములు), ముక్కలుగ జేసి ద్రవములేక యెండింపబడిన పెద్దగుమ్మడికాయ యొకద్రోణము (నాలుగాఢకముల పరిమితము), ఈభాగముల ప్రకారము పైజెప్పబడిన ద్రవ్యముల గ్రహించి ముక్కలుజేసి శుభ్రముగ నీళ్లచే కడిగి చితుకగొట్టి, నూరుద్రోణములపరిమితమైన జలమున వైచి నాల్గుద్రోణములు (పదునారు ఆఢకములపరిమితము) మిగులునట్టులు క్వాథముచేసి వడగట్టి, అందు ద్రోణమాత్రము (నాలుగాఢకములు) నువ్వులనూనెను, నూనెకు ఐదింతలు (ఐదుద్రోణములు) ఆవుపాలను, క్రిందచెప్పబడు చందనము మున్నగుకల్కద్రవ్యములను నూరి కలిపి తైలవిధిప్రకారము పక్వము చేయునది.

కల్కద్రవ్యములు:—చందనము, వట్టివేళ్లు, నాగకేసరములు, లవంగపుపత్రి, ఏలకులు, అగరు, చెంగల్వకోష్టు, గ్రంథితగరము, అతిమధురము వీని నొక్కొకపలము వంతునను; మంజిష్ఠి నెనిమిదిపలములను గ్రహించి పైజెప్పిన క్షారాదిద్రవములబోసి నూరి కల్కముచేసి పైజెప్పబడిన కషాయాదియుక్తతైలమున కలిపి తైలమును సిద్ధము చేయనగును. ఈతైలము పాన-అభ్యంజన-నస్య-వస్తికర్మ లన్నిటియందును యోగికముగ నుండును.

ఈతైలమును వాతరక్తమునందును, క్షతక్షీణమునందును, భారమును మోయుటచే బాధితుడైనపుడును, శుక్రము క్షీణించినపుడు నుపయోగింపందగును. మరియు కంపవాతము, ఆక్షేపకవాతము, పక్షవధము, సర్వాంగవాతము, ఏకాంగవాతము, అను నీవాతరోగపీడితులకు నుపయోగింపందగును. యోనిదోషమును, అపస్మారమును, ఉన్మాదమును, ఖంజవాతమును, పంగుత్వమును హరించును. స్త్రీలు ఋతుస్నానమైనపిదప దీనిని

సేవించినయెడ పుత్రోత్పత్తి కల్గును. ఇయ్యది అమృతాది తైలమని శ్రేష్ఠమైనదిగ చెప్ప బడును.

## మహాపద్మతైలము.

మూ. పద్మవేతసయష్ట్యాహ్వా ఫేనిలాపద్మకోత్పలైః,
పృథక్పఞ్చపలైః దర్భబలాచన్దనకింశుకైః	110
జలే శృతైః పచేత్తైలప్రస్థం సౌవీరసమ్మితం,
లోధ్రకాలీయకోశీరజీవకర్షభకేసరైః.	111
మదయన్తీలతాపత్రపద్మకేసరపద్మకైః,
ప్రపౌణ్డరీకకాశ్మర్యమాంసీమేదాప్రియఙ్గుభిః.	112
కుఙ్కుమస్య పలార్ధేన మఞ్జిష్ఠాయాః పలేన చ,
మహాపద్మమిదం తైలం వాతాఽసృగ్జ్వరనాశనమ్.	113
(ఇతి మహాపద్మం తైలమ్.)

వ్యా. తామరపువ్వులు, ప్రబ్బలి, అతిమధురము, ఫేనిల (దుంపబచ్చలి), పద్మకాష్ఠము, నల్లకలువలు, దర్భవేళ్లు, చిట్టాముట్టివేళ్లు, చందనము, మోదుగపట్ట, వీనిని ప్రత్యేకము ఐదేసిపలములవంతున కూర్చి నాల్గింతలు జలముచేర్చి నాల్గవపాలు మిగుల క్వాథముచేసి, అందు ఒక ప్రస్థమాత్రము తైలమును, సౌవీరకోదకమును తైలమునకు సమంబుగను చేర్చి, అందు లొద్దుగుపట్ట, మ్రానిపసుపు, (లేక నల్లని గంధద్రవ్యవిశేషము), వట్టివేళ్లు, జీవకము, ఋషభకము, నాగకేసరములు, అడవిమల్లెతీగలు, లవంగపత్రి, తామరపువ్వులలోని కేసరములు, పద్మకాష్ఠము, ప్రపౌండరీకమను గంధద్రవ్యము, పెద్ద గుమ్మడి, జటామాంసి, మేద, ప్రేంకణము, వీనిని ప్రత్యేక మొక్కొకకర్షమువంతునను, అర్ధపలము కుంకుమపువ్వును, ఒకపలము మంజిష్ఠిని (వీనినన్నిటిని) కల్కముచేసి కలిపి తైలపాకవిధిప్రకారము పక్వముచేసిన నియ్యది మహాపద్మతైల మనబడును. దీనిని పానాభ్యంజననస్యవస్తుల కుపయోగించిన వాతరక్తంబును జ్వరంబును శమించును.

కల్పనము:—పద్మము మున్నగు క్వాథ్యద్రవ్యములను చతుర్గుణజలమున పాదశిష్టముగ క్వాథముచేసి అందు ప్రస్థము (పదునారుపలములు) తైలమును, తైలమునకు సమము సౌవీరకమను కాంజికమును, కలిపి, లొద్దుగు మొదలు ప్రేంకణమువరకుంగల పదునారు కల్కద్రవ్యములను ప్రత్యేక మొక్కొకకర్షము (కాలుపలము) వంతున కల్కముచేసి కలిపి పక్వముచేసి, సిద్ధమైనపిదప కుంకుమపువ్వు రెండుకర్షములు (అర్ధ

పలము)ను, మంజిష్ఠి నొకపలమును కలుపవలెను. ఈకల్పనమున కల్కము ప్రస్థపరిమిత తైలమునకు నాల్గవవంతు (నాల్గుపలములు) అగును. ఈయభిప్రాయముచేతనే చక్రపాణి దత్తవ్యాఖ్యలో—"లోధ్రాదిభిః కార్షికైః కుంకుమం చ ద్వికార్షికం" అనివ్రాసిరి. అటు గాక అన్నిటిని రెండేసి కర్షములవంతున జేర్చునెడ కల్కపరిమాణము తైలార్ధమునకును అధికమగును, కావున పైకల్పనమే సమంజసము.

### ఖుడ్డాక(లఘు)పద్మకతైలము.

మూ. పద్మకోశీరయష్ట్యాహ్వారజనీక్వాథసాధితం,
స్యాత్పిష్టైస్సర్జమఞ్జిష్ఠావీరాకాకోలిచన్దనైః. 114
ఖుడ్డాకపద్మకమిదం తైలం వాతాస్రదాహనుత్,

వ్యా. పద్మకాష్ఠము, వట్టివేళ్లు, అతిమధురము, పసుపు వీనిని సమభాగములుగ గూర్చి నాలుగింతలజలమునకూర్చి నాల్గవపాలు మిగుల కషాయముకాచి, కషాయమునకు నాల్గవపాలు తైలమును కలిపి;అందు వేగిచెట్టుపట్ట, మంజిష్ఠి, బుద్ధి, కాకోలి, చందనము ఈద్రవ్యములను సమభాగములుగ గూర్చి నూరి కల్కముచేసి తైలమునకు నాల్గవవంతు కలిపి తైలపాకవిధిప్రకారము పక్వముచేయునది. ఈతైలము వాతరక్తమును తాపమును హరించును. ఇది ఖుడ్డాకపద్మకతైల మనంబడును. ఖుడ్డాకమన స్వల్పమని యర్థము. అల్పపద్మకతైలమని తైలమునకు వైద్యవ్యవహారయోగ్యమని భావము.

(ఇచ్చట ద్రవ-స్నేహ-కల్కములకు పరిమితిచెప్పనందున "జలస్నేహౌ... ఔష ధాత్ స్నేహః స్నేహాత్తోయం చతుర్గుణమ్" అను సామాన్యపరిభాషచే పరిమాణము చెప్పబడినది.)

### యష్టిమధుకతైలము.

మూ. శతేన యష్టిమధుకాత్ సాధ్యం దశగుణం పయః. 115
తస్మిం స్తైలే చతుర్ద్రోణే మధుకస్య ఫలేన తు,
సిద్ధం మధుకకాశ్మర్యరసైర్వా వాతరక్తనుత్. 116

వ్యా. నూరుపలములు అతిమధురమును దీనికి పదింతలైన (వేయిపలములు) ఆవు పాలతోగూర్చి నాల్గవపాలు మిగుల కాచి యాపాలలో నాల్గుద్రోణములు తైలమును ఒకపలము అతిమధురకల్కమును కలిపి తైలపాకవిధిప్రకారము పక్వముచేయనగును. లేక అతిమధురమును నెద్దగుమ్మడికాయరసమును చేర్చి తైలమును సిద్ధముచేయునది. దీని నుపయోగించిన వాతరక్తమును హరించును.

### శతపాకమధుపర్ణీతైలము.

మూ. మధుపర్ణ్యాః పలం పిష్ట్వా తైలప్రస్థం చతుర్గుణే,
క్షీరే సాధ్యం శతం కృత్వా తదేవం మధుకాచ్ఛతే. 117
సిద్ధం దేయం త్రిదోషే స్యాత్ వాతాస్రే శ్వాసకాసనుత్,
(విషోన్మాదవాతాస్రశ్వాసకాసనుత్)
హృత్పాణ్డురోగవీసర్పకామలాదాహనాశనమ్. 118
(ఇతి శతపాకమధుపర్ణీతైలమ్.)

వ్యా. అతిమధురమును ఒకపలమాత్రము నూరి కల్కముచేసి యొకప్రస్థపరిమిత మైన తైలమున కలిపి తైలమునకు నాలుగింతలు (నాల్గుప్రస్థములు) ఆవుపాలను కూడ చేర్చి తైలపాకవిధిప్రకారము పక్వముచేయునది. ఇత్తెరంగున నూరుపర్యాయములు (ఒకపలము అతిమధురమును నాల్గింతలు ఆవుపాలను చేర్చుచు) ఆతైలమునే పక్వముచేసి సిద్ధముచేయునది. దీనిని త్రిదోషముచే కల్గిన వాతరోగమున పానాభ్యంగాదుల కుప యోగింపనగును. మరియు హృద్రోగంబును, పాండువులును, విసర్పంబును, కామలయు, తాపంబును ఈతైలోపయోగమున శమించును. (ఇచ్చట 'మధుకాచ్ఛతే సిద్ధం' అని చెప్పుటచేత తప్పక నూరుపర్యాయములు పక్వముచేసినదియే శ్రేష్ఠమని తెలిసెడి.)

### సహస్రపాక-శతపాకబలాతైలము.

మూ. బలాకషాయకల్కాభ్యాం తైలం క్షీరసమం పచేత్,
సహస్రం శతవారం వా (సహస్రశతపాకం వా)
వాతాసృగ్వాతరోగనుత్. 119
రసాయనమిదం శ్రేష్ఠం ఇన్ద్రియాణాం ప్రసాదనం,
జీవనం బృంహణం స్వర్యం శుక్రాసృగ్దోషనాశనమ్. 120
(ఇతి సహస్రపాక-శతపాకబలాతైలమ్.)

వ్యా. చిట్టాముట్టివేళ్లకషాయమునకు సమభాగము తైలమును, తైలమునకు నాల్గవ వంతు బలాకల్కమును, సమముగ నావుపాలనుచేర్చి తైలపాకవిధిప్రకారము పక్వము చేయునది. ఇత్తెరంగున బలాకల్కకషాయములను మాటికిమాటికిని చేర్చుచు వేయిమారు లైనను నూరుపర్యాయములైనను కాచబడిన యీతైలము నుపయోగించినచో వాత రక్తంబును ఇతరవాతరోగములను హరించును. మరియు నీతైలము రసాయనంబును చక్షు

రాదీంద్రియములకు బలకరంబును, శరీరమునకు బలమును పుష్టిని కల్గించునదియు నగును. కంఠస్వరమునకు హితకరము. శుక్రముయొక్కయు ఆర్తవముయొక్కయు దోషముల హరించును.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—పైజెప్పబడిన ప్రకారము నొకతైలమును కల్కకషాయముల జేర్చుచు నూరువేయిపర్యాయములు కాచునెడ తైలము నానాట శుష్కించి తగ్గిపోవును, కావున తైలమునకు నాల్గవపాలు బలాకల్కమును, వేయి భాగములైనను నూరుభాగములైనను బలాకషాయమును ఏకకాలమున చేర్చి విధ్యుక్త ప్రకారము ఒకపర్యాయమే కాచినతైలము గుణాధికమగునని కొందరు చెప్పెదరు. క్షీరమును చేర్చుటవలన క్షీరనిష్ఠమైన స్నేహము పాకపర్యాయములయందెల్ల తైలమున సంక్రమించును. కావున తైలము క్షీణించదు. మరియు పాకము సన్నిహితమై ద్రవశేషమించుకయున్నపుడే తైలకల్కములను వేరుచేసి కాచుచున్నయెడ స్నేహము క్షీణించదు. కావున ఆచార్యమతము సమంజసమని యెరుంగునది. ఈయుద్దేశముచేతనే "సహస్రం శతవారం వా" అని కంఠోక్తిగ తంత్రకారు లుపదేశించిరి.

### గుడూచ్యాదితైలము.

మూ. గుడూచీరసదుగ్ధాభ్యాం తైలం ద్రాక్షారసేన వా,
సిద్ధం మధుకకాశ్మర్యరసైర్వా వాతరక్తనుత్. 121

వ్యా. తిప్పతీగెస్వరసమును పాలను చేర్చి యైనను, ద్రాక్షపండ్లరసమును గూర్చి యైనను, అతిమధురమును నేలగుమ్మడిని చేర్చి కాచబడిన కషాయమును గూర్చియైనను, విధ్యుక్తప్రకారము పక్వముచేయబడిన తైలము వాతరక్తమును శమింపజేయును.

ఇచ్చట తైల-ద్రవములకు పరిమితి చెప్పలేదుకావున సామాన్యపరిభాష ననుసరించి ద్రవమునకు నాల్గవపాలు తైలమును చేర్చి పక్వము చేయవలెను. (ఈతైలయోగము కల్కరహితము.)

### ఆరనాళతైలము.

మూ. ఆరనాళాఢకే తైలం పాదసర్జరసం శృతం,
ప్రభూతే మథితం తోయే జ్వరదాహార్తినుత్పరమ్. 122

వ్యా. ఆఢకపరిమితమగు ఆరనాళమను కాంజికము (కలినీళ్లు)న నాల్గవపాలు నూనెను సర్జరసమును కూడ కలిపి పక్వముచేసి సిద్ధమైన యాతైలమును అధికమైన జలమున కలిపి కవ్వముతో చిలికి యాతైలము నుపయోగించిన వాతరక్తమున కల్గుజ్వరమును మంటను నొప్పిని హరించును.

ఇచ్చట 'సర్జరసం శృతమ్' అనుచోట 'ఘృతమ్' అనుపాఠము కొన్ని ప్రాచీన ముద్రితకోశముల నున్నది. ఇది యపపాఠము:—ఈయోగమునే యిదేశ్లోకమును వాగ్భటులును చెప్పియున్నారు. ఈశ్లోకవ్యాఖ్య (సర్వాంగసుందరి)లో నిట్లున్నది:—"కాఞ్జికస్యాఢకే, తైలం చతుర్థభాగం సర్జరసం యస్మిన్, పక్వం, ప్రభూతే జలే మథితం పరం జ్వరదాహార్తినుత్" (అ. హృ. వ్యా, చి, అ. ౨౨). ఈవ్యాఖ్యనుబట్టియు తైలముమాత్రమని తెలియదగుగాని ఘృతయోగము కానరాదు. కావున ఘృతమనుపాఠము సర్వథా అనార్షము.

## అండతైలము.

మూ. సమధూచ్ఛిష్టమాఞ్జిష్ఠం ససర్జరససారిబం,
పిణ్డాతైలం తదభ్యఙ్గాత్ వాతరక్తరుజాపహమ్.　　123
(ఇతి పిణ్డాతైలమ్.)

వ్యా. నువ్వులనూనెలో మైనము, మంజిష్ఠి, సర్జరసము, సుగంధపాల, వీనిని సమభాగములుగగూర్చి కల్కముచేసి తైలమునకు నాల్గవవంతు కలిపి, తైలమునకు నాల్గింతలు జలమునుచేర్చి తైలపాకవిధిప్రకారము పక్వముచేసిన నది పిండతైల మనబడును. దీనిని వాతరక్తము వ్యాపించినచోట పూసినచో బాధ శమించును.

ఇచ్చట మైనము మున్నగువానిని కల్కముగజేసి, ద్రవమును విశేషముగ చెప్పియుండలేదుకావున "ద్రవేఽవ్యనుక్తే జలమేవ దేయమ్"అనుపరిభాష ననుసరించి నాల్గింతలుజలమును చేర్చి తైలమును సిద్ధముచేయనగును. మరియు జతూకర్ణతంత్రాంతరమున—"కాఞ్జికసర్జరసశృతం ఖజితం బహునా జలేన సిక్తకసర్జరసైర్యుక్తమభ్యఞ్జనమ్" అని యున్నది. పైజెప్పిన యారనాళసర్జరససిద్ధతైలమున మైనమును సర్జరసమును కలిపి నిండుకు నీళ్లుబోసి చిలికిన, నయ్యది ముద్దయగును కావున నిది పిండతైల మనబడునని ఈ వాక్యముచే తెలిసెడిని. సర్వాంగసుందరవ్యాఖ్యయు నీపద్ధతినే తెలుపుచున్నది. ("దద్యాత్తైలాని చేమాని......దాహశూలోపశాన్తయే" అని యుపక్రమించి పిండతైలమువరకును వాతరక్తమున పానాదుల కుపయోగింపదగిన తైలయోగములు చెప్పబడినవి.)

## వాతరక్తమున పరిషేకములు.

మూ. దశమూలశృతం క్షీరం సద్యశ్శూలనివారణం,
పరిషేకోఽనిలప్రాయే తద్వత్కోష్ణేన సర్పిషా.　　124

వ్యా. వాతరక్తరోగమున శూల మధికముగ నున్నపుడు దశమూలముల చేర్చి కాచబడిన ఆవుపాలచే పరిషేకముచేసినయెడ అప్పుడే శూలము నివర్తించును. మరియు వాతరక్తమున వాతం బధికముగ నున్నయెడ సుఖోష్ణముగ నుండుఘృతముచేత పరిషేకము చేయనగును.

(పరిషేకమన—బాధకల్గినప్రదేశమున కషాయము మున్నగు ద్రవములచే తడుపుటయని యర్థము. దశమూలము లనేకస్థలములయందు వివరింపబడినవి, కావున నచ్చట జూచునది.)

## వాతాధికవాతరక్తమున పరిషేకములు.

మూ. స్నేహైర్మధురసిద్ధైర్వా చతుర్భిః పరిషేచయేత్,
స్తమ్భాక్షేపకశూలార్తం కోష్ణైః దాహే తు శీతలైః. 125
తద్వద్గవ్యాऽऽవికచ్ఛాగైః క్షీరైస్తైలవిమిశ్రితైః,
క్వాథైర్వా జీవనీయానాం పఞ్చమూలస్య వా భిషక్. 126

వ్యా. వాతరక్తమున స్తంభించుటచేనైనను ఆక్షేపకవాతముచేనైనను శూలనొప్పిచేనైనను బాధింపబడినవానికి మధురరసప్రధానములగు జీవనీయగణమునందలి కాకోలిక్షీరకాకోలి మున్నగు పదిద్రవ్యముల చేర్చి పక్వముచేయబడిన సుఖోష్ణముగనుండు ఘృతము తైలము వస మజ్జ యనునాల్గుస్నేహములచే పరిషేకము చేయనగును. మంట యధికముగ నున్నచో పైజెప్పినస్నేహములను చల్లగజేసి పరిషేకము చేయనగును.

మరియు ఆవుపాలను గొఱ్ఱెపాలను మేకపాలను సమములుగ కూర్చి, అందు నువ్వులనూనెను కలిపియైనను, కాకోలి మున్నగుజీవనీయద్రవ్యములకషాయముచేనైనను, లఘుపంచమూలములక్వాథములచేనైనను సుఖోష్ణముగ నున్నపుడు పరిషేకము చేయనగును. అందును మంట అధికముగ నున్నపుడు చల్లారిన పైద్రవములచే పరిషేకము చేయనగును.

(ఇచ్చట "పఞ్చమూలస్య వా లఘోః" అని వాగ్భటులు చెప్పిరి. కావున లఘుపంచమూలముల గ్రహించుట సమంజసము.)

## వాతరక్తమున తాపశమనోపాయములు.

మూ. ద్రాక్షేక్షురసమద్యాని దధిమస్త్వమ్లకాఞ్జికం,
సేకార్థే తణ్డులక్షౌద్రశర్కరాఽమ్బు చ శస్యతే. 127

కుముదోత్పలపద్మాద్యైః మణిహారైస్సచన్దనైః,
శీతతోయానుగైర్దాహే ప్రోక్షణం స్పర్శనం హితమ్. 128

వ్యా. వాతరక్తమున తాప మధికముగ నున్నపుడు ద్రాక్షపండ్లరసము, చెరకు రసము, మద్యము, పెరుగు, పెరుగుమీఁదిమీఁగడ, అమ్లకాంజికము (పుల్లనిగంజి), బియ్యపు కడుగునీళ్లు, తేనెతోకలిసిననీళ్లు, చక్కెరకలిపిన నీళ్లు అను నీద్రవములచే తడుపుట చాల హితకరము. మరియు తెల్లని తామరపువ్వులు కలువలు తామరకమలములు మున్నగు పుష్పములతోనైనను, చంద్రకాంతము మున్నగుమణులయొక్క హారములతోనైనను, చందనముతోనైనను కూడిన చల్లని నీళ్లను చల్లవలెను. లేక అట్టి పుష్పాదులను చల్లగ నుండునీళ్లచే తడిపి బాధకల్గినస్థలమున తాకించుటయు హితకరము.

దాహశమనశీతోపచారములు.

మూ. చన్ద్రపాదామ్బుసంసిక్తే క్షౌమపద్మదళచ్ఛదే,
శయనే పులినస్పర్శశీతమారుతవీజితే. 129
చన్దనార్ద్రస్తనకరాః ప్రియా నార్యః ప్రియంవదాః,
స్పర్శశీతాః సుఖస్పర్శాః ఘ్నన్తి దాహం రుజం క్లమమ్. 130

వ్యా. మంచునీళ్లచే తడుపబడినదియు, పట్టుబట్టలచేనైనను తామరరేకులచేనైనను గప్పబడినదియు, నదీప్రాంతమునందలి యిసుకదిబ్బలతాకుడుచే చల్లబడినగాలి వ్యాపించినదియు నగుశయనముపై బరుండి; చందనమును పూసికొనుటచే తడిసినహస్తములును స్తనంబులును గలవారును, మనసు కింపుగనుండువిషయముల నూట్లాడువారును, స్పృశించినచో చల్లగను సుఖముగనుండు శరీరముకలవారును నగుప్రియురాండ్ర నాలింగనస్పర్శనాదుల చేసినచో వాతరక్తరోగమున కల్గిన సర్వాంగతాపంబును, నొప్పియు బడలికయు నివర్తించును.

పిత్త-రక్తాధికవాతరక్తమున దాహాదిశామకప్రలేపములు.

మూ. సరాగే సరుజే దాహే రక్తం విస్రావ్య లేపయేత్,
మధుకాఽశ్వత్థత్వక్క్షాంసీవీరోదుమ్బరశాద్వలైః. 131
జలజైః యవచూర్ణైర్వా సయష్ట్యాహ్వాపయోఘృతైః,
సర్పిషా జీవనీయైర్వా పిష్టైర్లేపోఽర్తిదాహనుత్. 132

వ్యా. వాతరక్తమున శరీరము ఎఱ్ఱనై నొప్పియు మంటయు కల్గియున్నయెడ తొలుత రక్తమును స్రవింపజేసి యీక్రిందచెప్పబడు పట్టువేయవలెను:—అతిమధురము,

రావిచెట్టుపట్ట, జటామాంసి, కాకోళి, అత్తిపట్ట, గరిక, వీనిని మెత్తగనూరి పట్టువేయవలెను. లేక తామరపువ్వులు, యవలపిండి, అతిమధురము, వీనిని పాలను నేతిని కూర్చి మెత్తగ నూరియైనను, జీవనీయగణద్రవ్యములైన కాకోళి మున్నగుద్రవ్యములను నూరి నేతిలో కలిపియైనను పట్టుచేసినచో వాతరక్తమునందలి నొప్పియు మంటయునివర్తించును.

## దాహశామకతిలాదిపిష్టప్రలేపము.

మూ. తిలాః ప్రియాలో మధుకం బిసం (ఏలాప్రియాలమధుకబిసం)
మూలం చ వేతసాత్,
ఆజేన పయసా పిష్టః ప్రలేపో దాహరాగనుత్. 133

వ్యా. నువ్వులు, చారపప్పు, అతిమధురము, తామరకాడలు, నీరుప్రబ్బలి వేరు, వీనినన్నిటిని సమభాగములుగగూర్చి మేకపాలతో నూరి పూసినయెడ వాతరక్తమున కల్గినయెరుపును మంటయు నివర్తించును.

## దాహాదిశామకప్రపౌండరీకాదిప్రలేపము.

మూ. ప్రపౌణ్డరీకమంజిష్ఠాదార్వీమధుకచన్దనైః,
సితోపలైరకాసక్తుమసూరోశీరపద్మకైః 134
లేపో రుగ్దాహవీసర్పరాగశోఫనివారణః,
పిత్తరక్తోత్తరే త్వేతే,

వ్యా. ప్రపౌండరీకము, మంజిష్టి, మ్రానిపసుపు, అతిమధురము, చందనము, శీనాకల్కుండ, కాకివెదురుబియ్యముచే చేయబడిన సత్తుపిండి, చిరుసెనగలు, వట్టివేళ్లు, పద్మకాష్ఠము, వీనినన్నిటిని సమభాగములుగగూర్చి నూరి లేపనముచేసినయెడ పిత్తరక్తము లధికముగ కలవాతరక్తమున కల్గిననొప్పియు, మంటయు, విసర్పంబును, ఎరుపు రంగును, శోఫంబును నివర్తించును. "సదాహే సరుజే రక్తే" అని యుపక్రమించి యీ చెప్పబడిన ప్రలేపములన్నియు పిత్తంబైనను రక్తంబైనను అధికముగనుండు వాతరక్తమున చేయందగును. (అందును తొలుత రక్తమోక్షణముచేసి పిమ్మట ఆయాయుపద్రవమునకు దగినట్టులు ఆయాప్రలేపమును చేయవలెను.)

## వాతాధికవాతరక్తమున ఉపనాహప్రలేపములు.

మూ. లేపాన్ వాతోత్తరే శృణు. 135
వాతఘ్నైస్సాధితః స్నిగ్ధః సక్షీరో ముద్గపాయసః,
(కృసరో ముద్గపాయసః)

తిలసర్షపపిణ్డైర్వాఽప్యుపనాహో రుజాపహః.  136

వ్యా. వాతాధికవాతరక్తమున నుపయోగింపదగిన ప్రలేపము లీక్రింద చెప్పబడును:—వాతహరంబులగు నౌషధములను పాలను పెసలపప్పున చేర్చి పక్వముచేయబడిన పాయసమున నేతిని చేర్చియైనను, నువ్వులను ఆవాలను నూరి ముద్దచేసి దానిచేనైనను వాతాధికవాతరక్తమునం దుపనాహము చేయనగును. దీనిచే నొప్పి మున్నగు బాధలు శమించును.

(ఇచ్చట నుపనాహమన మిక్కిలి దట్టముగ పూతపూసి దానిపై చర్మము మున్నగు వానిచే నావిరిని బైటపోనీయక కప్పియుంచుటయని యెరుంగునది. పలుచగ పూయబడినది ప్రలేపము.)

## స్తంభాదిహరమాంసోపనాహము.

మూ. ఔదకప్రసహానూపవేసవారాస్సుసంస్కృతాః,
జీవనీయౌషధైస్స్నేహయుక్తాస్స్యురుపనాహనే.  137
స్తమ్భతోదరుగాయామ(స)శోథాఙ్గగ్రహనాశనాః,
జీవనీయౌషధైస్సిద్ధా సపయస్కా వసాపి వా.  138

వ్యా. ఉదకమునపుట్టిన జంతువులమాంసమునైనను, ప్రసహ (బలాత్కారముగ నాహారమును లాగి తిను) జంతువులమాంసమునైనను, ఆనూప (జలప్రాంతమున నివసించు) జంతువులమాంసమునైనను, జీవనీయౌషధముల జేర్చి పక్వముచేసి, స్నేహముల జేర్చి సంస్కరించి, వేసవారములుగ సిద్ధముచేసి, వానిచే నుపనాహముచేసినచో, వాతరక్తమునకల్గిన స్తంభము, పోటు, నొప్పి, లాగిపట్టినట్లుండుట, వాపు, అవయవములుపట్టినట్లుండుట, ఈయుపద్రవములన్నియు నివర్తించును.

మరియు పైజెప్పినజంతువులవసను జీవనీయౌషధములచేర్చి పాలను కలిపి సిద్ధముచేసి యుపనాహముచేసినను, పైజెప్పబడిన యుపద్రవములు శమించును.

(వేసవారమన—మాంసమునం దెముకలులేక శుభ్రపరిచి మెత్తగ నూరి యావిరిచే నుడికించి పిప్పళ్లు మిరియాలు మున్నగువాని జేర్చి సంస్కరింపబడినమాంసము.)

## స్తంభనాదిహరప్రలేపము.

మూ. ఘృతం సహచరాన్మూలం జీవన్తీ చ్ఛాగలం పయః,
లేపః పిష్టాస్తిలాస్తద్వత్ భృష్టాః పయసి నిర్వృతాః.  139

వ్యా. గోరంటవేరును మనుబాలవేరును మేకపాలను నేతిని చేర్చి నూరి పట్టువేసినను, నువ్వులను వేయించి మేకపాలలో చల్లార్చి నూరి పట్టువేసినను పైజెప్పబడిన స్తంభము మున్నగునుపద్రవములు నివర్తించును.

### శూలహర ఉమాదిపిష్టలేపము.

మూ. క్షీరపిష్టముమాలేపమేరణ్డస్య ఫలాని చ,
కుర్యాచ్ఛూలనివృత్త్యర్థం శతాహ్వామనిలేఽధికే. 140

వ్యా. వాతాధికవాతరక్తరోగమున శూలనొప్పి కల్గినయెడ అగసివిత్తులనైనను, ఆముదపువిత్తులనైనను, సదాపవిత్తులనైనను పాలను చేర్చి నూరి నొప్పికల్గినచోట పట్టువేసినచో నివర్తించును.

### వాతరక్తాదులకు మహాస్నేహము.

మూ. సమూలాఽగ్రచ్ఛదైరణ్డక్వాథే ద్విప్రాస్థికం పృథక్,
ఘృతం తైలం వసా మజ్జా చానూపమృగపక్షిణామ్. 141
కల్కార్థే జీవనీయాని గవ్యం క్షీరమథాజకం,
హరిద్రోత్పలకుష్ఠైలాశతాహ్వాఽశ్వహనచ్ఛదాన్ (వరుణచ్ఛదాన్).
బిల్వమాత్రాన్ పృథక్ పుష్పం కాకుభం చాపి సాధయేత్,
మధూచ్ఛిష్టపలాన్యష్టౌ దద్యాత్ శీతేఽవతారితే. 143
శూలేనైషోఽర్దితాఙ్గానాం లేపస్సన్ధిగతేఽనిలే,
వాతరక్తే చ్యుతే భగ్నే ఖఞ్జే కుబ్జే చ శస్యతే. 144

వ్యా. ఆముదపువేళ్లను దానిచిగుళ్లను క్వాథ్యముగ నుంచుకొని క్వాథవిధి ప్రకారము కషాయము కాచి, యందు నేతిని, నువ్వులనూనెను, అనూపదేశమునందలి మృగములయొక్కయు పక్షులయొక్కయు వసను మజ్జను వేరువేరుగ రెండేసిప్రస్థముల వంతున జేర్చి, జీవనీయగణమునందలి కాకోలి మున్నగుద్రవ్యములను, పసుపు, నల్లకలువలు, చెంగల్వకోష్టు, ఏలకులు, సదాపవిత్తులు, గన్నేరాకు, మద్దిపువ్వులు, వీనిని ఒక్కొక దాని నొక్కొకపలమువంతున గూర్చి కల్కముచేసి కలిపి, స్నేహములకు సమభాగముగ మేకపాలనుకూడ కలిపి (యన్నింటి నొకటిగగూర్చి) స్నేహపాకవిధిప్రకారము పక్వము చేసి సిద్ధమైనపిమ్మట దింపి చల్లారినపిమ్మట మైనమును ఎనిమిదిపలములను పైజెప్పినసిద్ధస్నేహమున కలిపి యుంచునది.

ఈస్నేహమును సంధిగతవాతరోగమునందు కల్లుశూలయందును, వాతరక్తము నందును, నీళ్లు తొలగినప్పుడును, సంధిభంగమైనపుడును, ఖంజ-కుబ్జవాతములయందును పూయుట కుపయోగింపనగును. పైజెప్పినవ్యాధుల కిది చాల ప్రశస్తమైనది.

కల్పనము—ఇచ్చట స్నేహములు వేరువేరుగ రెండేసిప్రస్థములవంతున నాల్గును చేరి యెనిమిదిప్రస్థములగును. సామాన్యపరిభాషచే స్నేహమునకు నాల్గింతల క్వాథద్రవ ముండవలెనుకావున నాల్గవపాలు మిగుల కాచిన యేరండక్వాథము స్నేహమునకు మూడింత లుండునట్లు కషాయమును కాచవలెను. "ద్రవాన్తరేణ యోగే తు క్షీరం స్నేహసమం విదుః" అను పరిభాష ననుసరించి మేకపాలను స్నేహములకు సమముగ జేర్పనగును. అట్టియెడ క్వాథక్షీరములు రెండును చేరినద్రవము స్నేహమునకు చతుర్గుణ మగును. జీవనీయాదికల్కద్రవ్యములను ఉక్తమానానుసారముగ నొక్కొక్కపలమువంతున జేర్చి నూరి కల్కము చేయనగును. ఇత్తెరంగున నెనిమిదిప్రస్థముల పరిమితమైన స్నేహ చతుష్టయమును నాల్గింతల కషాయాదిద్రవమున జేర్చి, జీవనీయాదికల్కమును కలిపి స్నేహపాకవిధిప్రకారము స్నేహమును సిద్ధముచేసి, అయ్యది చల్లారినపిదప నెనిమిది పలములు మైనమునుచేర్చి కలిపి యుపయోగించవలెను.

### కఫాధికవాతరక్తచికిత్స, అందు అభ్యంజనము.

మూ. శోఫగౌరవకణ్డ్వాద్యైః యుక్తే త్వస్మిన్ కఫోత్తరే,
మూత్రక్షారసురాపక్వం ఘృతమభ్యఞ్జనే హితమ్. 145

వ్యా. కఫాధికవాతరక్తమున వాపును గురుత్వంబును (బరువు), దురదయు మున్నగునుపద్రవములు కల్గియున్నయెడ గోమూత్రమును యవక్షారమును సురామద్య మునుచేర్చి పక్వముచేయబడిన ఘృతముచే నభ్యంజనముచేయుట హితకరము.

### కఫాధికవాతరక్తమున సేక-అభ్యంగములకు పద్మకాదిఘృతము.

మూ. పద్మకం త్వక్ సమధుకం సారిబా చేతి తైర్ఘృతం,
సిద్ధం సమధుయుక్తం స్యాత్ సేకాభ్యఙ్గే కఫోత్తరే. 146

వ్యా. పద్మకాష్ఠము, లవంగపుపట్ట, అతిమధురము, సుగంధపాలవేరు వీనిని సమ భాగములుగూర్చి కల్కముచేసి,కల్కమునకు నాల్గింతలు ఘృతమును, ఘృతమునకు నాల్గింతలు జలమును కలిపి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి, కఫాధికవాతరక్తమున సేక-అభ్యంగముల కుపయోగింపదగును.

కఫాధికవాతరక్తమున క్షారోదకాదిపరిషేకము.

మూ. క్షారస్తైలం గవాం మూత్రం (క్షీరం తైలం ఘృతం మూత్రం)
జలం చ కటుకైశ్శృతం,
పరిషేకే ప్రశంసన్తి వాతరక్తే కఫోత్తరే. 147

వ్యా. కటురసద్రవ్యములను చేర్చి కాచబడిన ఆవుపాలును, (క్షారోదకంబును) తైలంబును, గోమూత్రంబును కఫాధికవాతరక్తమున పరిషేకమునకై యుపయోగించుట చాల ప్రశస్తము.

కఫాధికవాతరక్తమునకు లేపములు.

మూ. లేపస్సర్షపనిమ్బార్కహింస్రాక్షీరతిలైర్హితః,
శ్లేష్మస్సిద్ధః కపిత్థత్వక్ ఘృతక్షీరైః ససక్తుభిః. 148
గృహధూమో వచా కుష్ఠం శతాహ్వా రజనీద్వయం,
ప్రలేపశ్శూలనుత్ వాతరక్తే వాతకఫోత్తరే. 149
తగరం త్వక్ శతాహ్వైలా కుష్ఠం ముస్తం హరేణుకా,
దారు వ్యాఘ్రనఖం చామ్లపిష్టం వాతకఫాప్రనుత్. 150
మధుశిగ్రోర్హితం తద్వత్ బీజం ధాన్యామ్లసంయుతం,
ముహూర్తం లిప్తమమ్లైశ్చ సిఞ్చేత్ వాతకఫోత్తరమ్. 151

వ్యా. ఆవాలు, వేపపట్ట, జిల్లేడుపట్ట, జటామాంసి, నువ్వులు వీనిని సమభాగములుగ గూర్చి ఆవుపాలతో నూరి వాతాధికవాతరక్తమున ప్రలేపముచేయుట చాల హితకరము. వెలగపట్టను, ఘృతమును, క్షీరమును, సత్తుపిండిని చేర్చి నూరి యుడికించి ప్రలేపముచేయుట మిగుల శ్రేష్ఠము. మరియు కరిధూపము, వస, చెంగల్వకోష్టు, సదాపవిత్తులు, పసుపు, మ్రానిపసుపు వీనినన్నిటిని గూర్చి నూరి పట్టువేసినచో వాతకఫాధిక వాతరక్తమున కల్గినశూలనొప్పి నివర్తించును.

గ్రంథితగరము, లవంగపుపట్ట, సదాపవిత్తులు, ఏలకులు, చెంగల్వకోష్టు, తుంగ గడ్డలు, రేణుకలు, దేవదారుచెక్క, వ్యాఘ్రనఖము వీనిని సమభాగములుగూర్చి పుల్లని గంజిపోసి నూరి పట్టువేసిన వాతకఫాధికవాతరక్తము శమించును.

ఎఱ్ఱమునగవిత్తులను పుల్లనికడుగునీళ్లుపోసి నూరి ముహూర్తకాలము శరీరమునకు పూసియుంచి పుల్లనిగంజి తడుపుచున్న వాతకఫాధికవాతరక్తమును హరించును.

### వాతరక్తహరత్రిఫలాదికల్కము.

మూ. త్రిఫలావ్యోషపత్రైలాత్వక్ క్షీరీ చిత్రకం వచాం,
విడఙ్గం పిప్పలీమూలం రోమశం వృషకత్వచమ్. 152
ఋద్ధిం తామలకీం చవ్యం సమభాగాని పేషయేత్,
కల్కం లిప్తమయస్పాత్రే (కల్కైర్లిప్త్వాయసీం పాత్రీం)
మధ్యాహ్నే భక్షయేత్తతః. 153
వర్జయేద్దధిశుక్తాని క్షారం వైరోధికాని చ,
వాతాస్రే సర్వదోషేఽపి హితం శూలార్దితే పరమ్. 154

వ్యా. త్రిఫలములు, త్రికటుకములు, లవంగపుపత్రి, ఏలకులు, వెదురుప్పు, చిత్రమూలము, వస, వాయువిడంగములు, మోడి, రోమశము—జటామాంసి (లేక తెల్లనివస), అడ్డసరపుపట్ట, ఋద్ధి, నేలయుసిరిక, చవ్యము వీని సమభాగములుగ గూర్చి మెత్తగ నూరి కల్కముచేసి యాకల్కమును ఉదయకాలమున ఇనుపపాత్రకు లోభాగమున పూసి మధ్యాహ్నమునం దాకల్కమును గ్రహించి భక్షించవలెను. దీనిని సేవించునపుడు పెరుగును, పులిసినగంజి మున్నగువానిని, కారమును, పరస్పరవిరుద్ధములగు క్షీరమత్స్యాదులను విడువవలెను. ఇయ్యది త్రిదోషములచే కల్గినవాతరక్తమునను శూలమునందును మిగుల హితకరముగ నుండును. (ఇచ్చట "రోమశం-కాసీసం" అని చక్రపాణిదత్తవ్యాఖ్య యున్నది. ఈయోగమున కాసీసము అయోగికమని తోచెడి.)

### వాతరక్తహరత్రిఫలాదికల్కము.

మూ. బుద్ధ్వా స్థానవిశేషాంశ్చ దోషాణాం చ బలాఽబలం,
చికిత్సితమిదం కుర్యాత్ ఊహాఽపోహవికల్పవిత్. 155

వ్యా. ఇత్తెరంగున వాతరక్తచికిత్సితము విపులముగ జెప్పబడినది. ఊహాపోహవికల్పపరిజ్ఞానమును చక్కగ దెలిసినవైద్యవరుడు వాతరక్తము జనించు స్థానవిశేషములను, వాతాదిదోషములయొక్క బలాఽబలములను చక్కగ గమనించి తత్తదనుకూలముగ చికిత్సను కల్పించి చికిత్సచేయవలెను.

### వాతరక్తమున అవస్థానుసారముగ చికిత్సావిధి.

మూ. కుపితే మార్గసంరోధాత్ మేదసో వా కఫస్య వా,
అతివృద్ధ్యా(ద్ధే)ఽనిలే నాఽఽదౌ శస్తం స్నేహనబృంహణమ్.

వ్యాయామశోధనాఽరిష్టమూత్రపానైః విరేచనైః,
తక్రాఽభయాప్రయోగైశ్చ శమయేత్కఫమేదసీ. 157

వ్యా. మేదస్సైనను కఫమైనను మిక్కిలి వృద్ధినొంది వాతసంచారమార్గమును నిరోధించుటవలన వాతరక్తవ్యాధియందు వాతము మిక్కిలి ప్రకోపమునొంది యున్న యెడ, అట్టి వృద్ధినొందిన కఫమేదస్సులను వ్యాయామముచేతను, శోధనములచేతను, అరిష్టములను మూత్రములను త్రాగుటచేతను, విరేచనములచేతను, తక్రమును కరకకాయల నుపయోగించుటచేతను తొలుత శమింపచేయవలెను, కాని వాతశాంతికై స్నేహనముల నైనను బృంహణములనైనను ఉపయోగింపజనదు. (వాతప్రకోపమునకు కారణములైన కఫమేదస్సులు పైజెప్పిన వ్యాయామాదులచే శమించినయెడ వాతసంచారమార్గమును నిరోధించుట యుడుగును. దానంజేసి వాతము శమించును. కావున తొలుత స్నేహన బృంహణముల చేయక వ్యాయామాదులనే యాచరింపవలెనని భావము.)

మూ. బోధివృక్షకషాయన్తు ప్రపిబేన్మధునా సహ,
వాతరక్తం జయత్యాశు త్రిదోషమపి దారుణమ్. 158
పురాణయవగోధూమశీధ్వరిష్టసురాసవైః,
శిలాజతుప్రయోగైశ్చ గుగ్గులోర్మాక్షికస్య చ. 159

వ్యా. మరియు పైజెప్పినరీతిగ వాతరక్తమున వాతము ప్రకోపించినపుడు రావి పట్టకషాయమున తేనె చేర్చి త్రాగవలెను. దీనిచేత త్రిదోషముచే జనించి మిక్కిలి క్రూరమైన వాతరక్తంబును శమించును. మరియు ప్రాతవి యగుయవలను, గోధుమలను, శీధు-అరిష్టమద్యములను, సురామద్యమును, ఆసవములను, శిలాజతువును, గుగ్గిలమును, తేనెను, ప్రయోగించినయెడ కఫమేదస్సులు శమించి వాతరక్తము నిర్మూలించును.

మూ. గమ్భీరే రక్తమాక్రాన్తం స్యాచ్చేత్ తద్వాతవజ్జయేత్,
పశ్చాద్వాతే క్రియాం కుర్యాత్ వాతరక్తప్రసాదనీమ్. 160

వ్యా. గంభీరవాతరక్తమున (మాంసము మున్నగుశరీరమునందు లోతుననుండు ధాతువుల నాశ్రయించిన వాతరక్తమున) వాతముచే రక్తము ఆక్రమింపబడి యున్న యెడ తొలుత వాతవ్యాధికి చెప్పినచికిత్స చేసి శమింపచేయవలెను. (ఇచ్చట వాతమే బలిష్ఠముగ నుండుటంజేసి వాతహరచికిత్స చేయవలెనని భావము.)

ఇత్తెరంగున కఫమేదోహరచికిత్సచే కఫమేదస్సులు హరించి, వాతచికిత్సచే వాతము శమించినపిదప వాతము పూర్తిగ హరించుటకై వాతరక్తమునకుజెప్పిన చికిత్సావిధానమును చేయవలెను.

మూ. రక్తపిత్తాఽతివృద్ధ్యా తు పాకమాశు నియచ్ఛతి,
భిన్నం స్రవతి వా రక్తం విదగ్ధం పూయమేవ వా. 161
తయోః క్రియా విధాతవ్యా భేదశోధనరోపణైః,
కుర్యాదుపద్రవాణాం చ క్రియాం స్వాం స్వాచ్చికిత్సితాత్. 162

వ్యా. వాతరక్తవ్యాధియందు రక్తంబైనను పిత్తంబైనను వృద్ధినొంది వాతరక్తమును శీఘ్రముగ పాకము నొందించును. అట్టియెడ పగిలి రక్తము కారును. లేక విశేషముగ పాకమునొందినచో చీమును స్రవించును. అట్టి రక్తపిత్తములచే గల్గినపాకముల యందు భేదనము శోధనము రోపణము నను వ్రణచికిత్సల జేయనగును.

మరియు వాతరక్తమున గల్గు నానాయుపద్రవములకు స్వతంత్రరూపముగ నుండు నానావ్యాధులకు చెప్పిన చికిత్సల నే యుపద్రవములకును చేయనగును.

అధ్యాయవిషయసంగ్రహము.

మూ. హేతుః స్థానాని మూలం చ యత్స్యాత్ ప్రాయేణ సన్ధిషు,
కుప్యతి ప్రాక్చ తద్రూపం ద్వివిధస్య చ లక్షణమ్. 163
పృథక్ భిన్నస్య లిఙ్గం చ దోషాధిక్యముపద్రవాః,
సాధ్యం యాప్యమసాధ్యం చ క్రియా సాధ్యస్య చాఖిలా. 164
వాతరక్తస్య నిర్దిష్టా సమాసవ్యాసతస్తథా,
మహర్షిణాఽగ్నివేశాయ తథైవావస్థికీ క్రియా. 165

వ్యా. వాతరక్తము జనించుటకు కారణములు, అది జనించుస్థానములు, అయ్యది ప్రాయికముగ సంధులయందు ప్రకోపమునొందుటకు కారణములు, వాతరక్తపూర్వరూపములు, ఉత్తాన-గంభీరభేదములచే ద్వైవిధ్యము; ఆరెండుభేదములకును వేరువేరులక్షణములు, దోషాధిక్యముచే వేరువేరు లక్షణములు, వానియుపద్రవములు, సాధ్య-యాప్య-అసాధ్యలక్షణములు, సాధ్యావస్థనుండు వాతరక్తమునకు చికిత్స, వాతరక్తమునకు అవస్థావిశేషమునుబట్టి చికిత్సావిధానము, ఇవియన్నియు సంగ్రహరూపముగను, విస్తారరూపముగను ఈవాతరక్తచికిత్సిత మనునధ్యాయమున ఋషివర్యుడగు నాత్రేయులచే నగ్నివేశునకుపదేశింపబడినది.

అధ్యాయసమాప్తి.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే, దృఢబలసమ్పూరితే
చికిత్సాస్థానే వాతశోణితచికిత్సితం నామ
ఏకోనవింశోఽధ్యాయః.

వ్యా. ఇత్తెరంగున నగ్నివేశకృతంబును చరకప్రతిసంస్కృతంబును నగు చరకసంహితయను నాయుర్వేదతంత్రమున చికిత్సాస్థానమునందలి దృఢబలసంపూరితభాగమున వాతరక్తచికిత్సితమనునది యేకోనత్రింశాధ్యాయము సమాప్తము.

---

## త్రింశాధ్యాయము.

అవతరణిక:—"నహి వాతాదృతే యోనిః నారీణాం సమ్ప్రదుష్యతి" అనువాక్యముచే వాతసంబంధము లేక స్త్రీలకు యోనిదోషము కల్గుటలేదని చెప్పబడినది. కావున వాతరక్తచికిత్సానంతరము యోనివ్యాపచ్చికిత్సితము చెప్పబడును.

అధ్యాయప్రారంభము.

మూ. అథాతో యోనివ్యాపచ్చికిత్సితమధ్యాయం వ్యాఖ్యాస్యామః. 1
ఇతి హ స్మాహ భగవానాత్రేయః. 2

వ్యా. వాతరక్తనిదానమును చెప్పినపిదప యోనివ్యాపత్తుయొక్క చికిత్సితమును దెల్పునధ్యాయమును భగవాను డగునాత్రేయు లుపదేశించినదానికన్న న్యూనాతిరేకము గాకుండ వివరించి చెప్పెదనని యర్థము. (స్త్రీలయోనికి సంబంధించినరోగములు యోనివ్యాపత్తు లనబడును.)

అగ్నివేశునిప్రశ్నము.

మూ. దివ్యతీర్థౌషధిమతః చిత్రధాతుశిలావతః,
పుణ్యే హిమవతః పార్శ్వే సురసిద్ధర్షిసేవితే. 3
విహరన్తం తపోయోగాత్ తత్త్వజ్ఞానార్థదర్శినం,
పునర్వసుం జితాత్మానం అగ్నివేశోఽనుపృష్టవాన్. 4
భగవన్! యదపత్యానాం మూలం నార్యః పరం నృణాం,
తద్విఘాతో గదైశ్చాసాం క్రియతే యోనిమాశ్రితైః. 5

తస్మాత్ తేషాం సముత్పత్తిం ఉత్పన్నానాం చ లక్షణం,
సౌషధం శ్రోతుమిచ్ఛామి ప్రజానుగ్రహకామ్యయా. 6

వ్యా. ౪౦౪ మున్నగు నానావిధదివ్యతీర్థములతోడను, బ్రహ్మసువర్చల మున్నగు దివ్యౌషధులతోడను, చిత్రవర్ణములైన గైరికాదిధాతువులతోడను కూడిన హిమాచలముయొక్క దేవతలచేతను సిద్ధులచేతను ఋషివర్యులచేతను సేవింపబడి పరమపావనమైనపార్శ్వమున విహరించువాడును, తపఃప్రభావమునంజేసి వస్తుతత్త్వముల జక్కగ నెరింగినవాడును, జితేంద్రియుడును నగునాత్రేయులను శిష్యుడైనయగ్నివేశుడిత్తెరంగున నడిగెను:—

భగవత్స్వరూపుడైన యోగురువర్యా! లోకమున మనుజులకు సంతానమునకు ముఖ్యకారణభూతులు స్త్రీలు; అట్టిస్త్రీలకు కల్గుసంతానమునకు వారియోనినాశ్రయించిన రోగములు విఘ్నమును కల్గించుచున్నవి. అట్టి సంతానవిచ్ఛేదమునకు కారణములైన యోనిరోగములయొక్క యుత్పత్తికారణములను, వానిలక్షణములను, చికిత్సితములను వినగోరెద. లోకముననుండు ప్రజలహితమును గోరి వానిం జెప్పవేయని యాత్రేయుల నడిగెను.

## ఆత్రేయప్రతివచనము.

మూ. ఇతి శిష్యేణ పృష్టస్తు ప్రోవాచర్షివరోఽత్రిజః,
వింశతిః వ్యాపదో యోనేః నిర్దిష్టా రోగసఙ్గ్రహే. 7
మిథ్యాచారేణ తాః స్త్రీణాం ప్రదుష్టేనార్తవేన చ,
జాయన్తే బీజదోషాచ్చ దైవాచ్చ శృణు తాః పృథక్. 8

వ్యా. యోనిరోగములగూర్చి పైజెప్పినరీతిగ శిష్యునిచే ప్రశ్నజేయబడిన యాత్రేయులు ఇట్లు బదులుసెప్ప దొడంగెను:—

యోనివ్యాపత్తులు ఇరువదివిధములుగ రోగసంగ్రహమున (అష్టోదరీయాధ్యాయమున) నిర్దేశింపబడినవి. అయ్యవి మిథ్యాహారవిహారములచేతను, ఆర్తవదోషముచేతను, పుత్రోత్పత్తికి కారణమైన శుక్రశోణితరూపబీజమునందలి దోషముచేతను, జన్మాంతరకృతకర్మపరిపాకముచేతను (యోనివ్యాపత్తులు) సంభవించును. వానిని వేరువేరుగ వివరించెద వినుము. (అని యగ్నివేశునుద్దేశించి యాత్రేయుడు చెప్పెనని భావము.)

(ఇచ్చట అష్టోదరీయాధ్యాయమున "వింశతిః యోనివ్యాపదః ఇతి—వాతికీ... వ్యాపదః" (సూ. అ. ౧౯. సూ. ౩౮,) అని నిర్దేశింపబడిన వివరణము నెరుంగునది.)

## 1. ఇరువదివిధములైన యోనివ్యాపత్తుల ప్రత్యేకలక్షణములు, అందు వాతికీలక్షణము.

మూ. వాతలాహారచేష్టాయాః వాతలాయాః సమీరణః,
వివృద్ధో యోనిమాశ్రిత్య యోనేస్తోదం సవేదనమ్. 9
స్తమ్భం పిపీలికాసృప్తిమివ కర్కశతాం తథా,
కరోతి సుప్తిమాయాసం వాతజాంశ్చాపరాన్ గదాన్. 10
సా స్యాత్ సశబ్దరుక్ఫేన తనురూక్షార్తవాఽనిలాత్,

వ్యా. వాతప్రకృతికలస్త్రీ వాతమును వృద్ధినందించు పదార్థముల నాహారమునకై యుపయోగించినను, వాతమునువృద్ధినొందించు విహారాదిచేష్టలజేసినను వాతము మిక్కిలి వృద్ధినొంది (ప్రకుపితమై) యోనిలోఁజేరి యోనియందు సూదులచేఁబొడిచినరీతి పోటును నొప్పిని కల్గించి స్తంభింపజేయును. చీమలు పారాడినవిధముగ గులగులమని జిలపుట్టును. యోని కఱకుబారి స్పర్శము నెరుంగక బాధను కల్గించును. ఇంతియకాక వాతప్రకోపమునకల్గు నాయారోగముల గల్గించును. ఈవ్యాధికలస్త్రీకి శబ్దముతోడను నొప్పితోడను నురుగుతోడను కూడి రూక్షమైనరక్తము యోనినుండి సూక్ష్మముగ (ఆర్తవకాలము కాని సమయమునందును) పలుమారు వెడలును.

ఇచ్చట పైలక్షణములతోఁగూడిన రక్తము అనార్తవకాలమందును స్రవించునని చెప్పుటవలన నియ్యది వాతికప్రదరరూపమైన యోనివ్యాపత్తని యెరుంగునది. ఇత్తెరంగుననే క్రింద చెప్పబడు పైత్తికశ్లైష్మికములయందును పైత్తికశ్లైష్మికప్రదరరూపములైన యోనివ్యాపత్తులని యెరుంగునది.

## 2. పైత్తికీలక్షణము.

మూ. వ్యాపత్కట్వమ్లలవణక్షారాద్యైః పిత్తజా భవేత్. 11
దాహపాకజ్వరోష్ణార్తా నీలపీతాఽసితార్తవా,
భృశోష్ణకుణపస్రావా యోనిస్స్యాత్పిత్తదూషితా. 12

వ్యా. కటు-అమ్ల-లవణరసములును క్షారములును మున్నగువాని నధికముగ సేవించుటవలన పిత్తము ప్రకోపమునొంది యోనివ్యాపత్తును కల్గించును. ఈవ్యాధిచే పీడింపబడినస్త్రీకి తాపము కల్గును. యోనియందు పుండగును. జ్వరంబును ఉష్ణంబును వ్యాపించును. ఆర్తవము నీలవర్ణంబైనను పచ్చనిరంగైనను, నల్లనిరంగైనను కల్గి మిక్కిలి వేడి కల్గి పీనుగవంటి దుర్గంధము కల్గి (యనార్తవ (ఋతుమతి కాని)సమయమునందును) పలుమారు వెడలుచుండును. ఇయ్యది పిత్తమున గల్గిన యోనివ్యాపత్తని యెరుంగునది.

### 3. శ్లైష్మికీలక్షణము.

మూ. కఫోఽభిష్యన్దిభిర్వృద్ధః యోనిం చేద్దూషయేత్ స్త్రియాః,
స కుర్యాత్పిచ్ఛిలాం శీతాం కణ్డుగ్రస్తాఽల్పవేదనామ్. 13
పాణ్డువర్ణాం తథా పాణ్డు పిచ్ఛిలార్తవవాహినీం,

వ్యా. అభిష్యందిపదార్థముల సేవింపుటంజేసి కఫము మిక్కిలి వృద్ధినొంది (ప్రకుపితమై) స్త్రీయొక్క యోనిస్థానమున జేరినపుడు యోని పిచ్ఛిలంబును, చల్లనైనదియు, దురదచే వ్యాప్తంబును, స్వల్పముగ బాధను కల్గినదియు, పాండువర్ణంబును నగును. మరియు నందుండి పాండువర్ణంబును, పిచ్ఛిలంబును నైన ఋతురక్తము (అనార్తవకాలమునందును) పలుమారు స్రవించుచుండును. ఇయ్యది శ్లైష్మికి (కఫప్రకోపమునగల్గిన) యోనివ్యాపత్తని యెరుంగనగును.

### 4. సాన్నిపాతిక యోనివ్యాపత్తులక్షణము.

మూ. సమశ్నన్త్యాః రసాన్ సర్వాన్ దూషయిత్వా త్రయో మలాః 14
యోనిగర్భాశయస్థాః స్వైః యోనిం యుఞ్జన్తిలక్షణైః,
సా భవేద్దాహశూలార్తా శ్వేతపిచ్ఛిలవాహినీ. 15

వ్యా. వాతాదిత్రిదోషమును వేరువేరుగ ప్రకోపింపజేయు సాయారసమును అన్నిటిని సమకాలమున నధికముగ భుజించుస్త్రీకి త్రిదోషంబులును సమకాలమున ప్రకోపమునొంది యోనియందును గర్భాశయమునందును జేరి, ఆయాదోషముచే గల్గిన వ్యాపత్తులకు వేరువేరుగ జెప్పబడిన లక్షణములతో గూడిన యోనివ్యాపత్తును కల్గించును. ఇయ్యది సాన్నిపాతికయోనివ్యాపత్తని యెరుంగునది. మరియు నీయోనివ్యాపత్తునందు శ్వేతవర్ణంబును పిచ్ఛిలంబు నైన ఋతురక్తము యోనియందు మంటను పోటును కల్గించి విశేషముగ స్రవించును.

### 5. రక్తయోనియను యోనివ్యాపత్తులక్షణము.

మూ. రక్తపిత్తకరైర్నార్యా రక్తం పిత్తేన దూషితం,
అతిప్రవర్తతే యోన్యాం లబ్ధే గర్భేఽపి సాఽసృజా(సాఽప్రజా).

వ్యా. రక్తమును పిత్తమును కూడ వృద్ధినొందించు నాహారవిహారాదులచేత రక్తంబును పిత్తంబును మిక్కిలి వృద్ధినొందును. అట్టియెడ పిత్తముచే రక్తము దుష్టమై స్త్రీ గర్భవతిగ నున్నపుడును యోనినుండి పలుమారు అప్పుడప్పుడును రక్తము అధికముగ

స్రవించుచుండును. ఇయ్యది రక్తదోషముచే గల్గిన రక్తప్రదరమని యెరుంగునది. ర
బధికముగ వెడలుటంజేసి రక్తయోని యనియు చెప్పబడును.

ఇచ్చట "లబ్ధే గర్భేఽపి సాఽప్రజా" అనుపాఠమున "పైజెప్పినరీతిగ ర
అధికముగ వెడలుటవలన గర్భము రానేరదు. ఒకవేళ గర్భము కల్గినను అప్పుడు ర
అధికముగ వెడలుటవలన గర్భము సంపూర్ణము కాక నడుమనే విచ్ఛిన్నమగును
సంతతి కల్గనేర"దని యర్థము. లోకమున గర్భమునుధరించిన కొందరు స్త్రీలకు అట్టి
యమున రక్త మధికముగ స్రవించుచున్నను గర్భము నిరపాయముగ వృద్ధినొంది స
మున సుఖముగ ప్రసవించి, వారిసంతతి యవిచ్ఛిన్నముగ వృద్ధినందుటను ప్రత్యక్ష
జూచుచున్నాము. కావున 'అప్రజా' అనుపాఠము ననుసరించి వ్రాసినయభిప్రాయ
ప్రాయికమని యెరుంగునది.

### 6. అరజస్కాలక్షణము.

మూ. యోనిగర్భాశయస్థం చేత్ పిత్తం సన్దూషయేదసృక్,
సాఽరజస్కా మతా కార్శ్యవైవర్ణ్యజననీ భృశమ్.

వ్యా. యోనియందును గర్భాశయమునందును పిత్తము చేరి యందలి రక్తమ
చెరిచినయెడ ఋతురక్తము యథాకాలమున బైటవెడలక శరీరము కృశించి పచ్చ
మారియుండును. ఇయ్యది అరజస్కమను యోనివ్యాపత్తని చెప్పబడును.

### 7. అచరణాలక్షణము.

మూ. యోన్యామధావనాత్కణ్డూం జాతాః కుర్వన్తి జన్తవః,
సా స్యాదచరణా, కణ్డ్వా తయాఽతినర కాంక్షిణీ.

వ్యా. యోనిని శుభ్రముగ నీటిచే కడగకుండుటవలన నందు క్రిములు
మిక్కిలి తీవ్రమైనజిలను పుట్టించును. అట్టి దురదచేత స్త్రీ (సంభోగనిమిత్తమై)
షుల నధికముగ కోరుచుండును. ఇయ్యది అచరణయను యోనివ్యాపత్తని చెప్పబ
(ఈవ్యాధిని వాగ్భటాచార్యులు విప్లుతయని చెప్పిరి.)

### 8. అతిచరణాలక్షణము.

మూ. పవనోఽతివ్యవాయేన శోఫ-సుప్తి-రుజః స్త్రియాః,
కరోతి కుపితో యోనౌ సా చాఽతిచరణా మతా.

వ్యా. స్త్రీలు మితిమీరి సంభోగమును చేయుటవలన (అట్టి యభిఘాతమ
జేసి) వాతము ప్రకోపమునొంది యోనియందు శోఫమును స్పర్శమును దెలియ

టను తీవ్రమైనబాధను కల్గించును. ఇయ్యది (సంభోగము నధికముగ నాచరించుటచేత కల్గుటంజేసి) అతిచరణయను యోనివ్యాపత్తని చెప్పబడును.

### 9. ప్రాక్చరణాలక్షణము.

మూ. మైథునాదతిబాలాయాః పృష్ఠకట్యూరువంక్షణమ్,
రుజన్ దూషయతే యోనిం వాయుః ప్రాక్చరణా హి సా. 20

వ్యా. మిక్కిలి పసిదియైనస్త్రీ మితిమీరి సంగమమును చేసినయెడ వాతము మిక్కిలి ప్రకోపమునొంది వీపునందును నడుమునందును తొడలయందును గజ్జలయందును తీవ్రమైన బాధకల్గించుచు యోనిని దుష్టముగజేయును. ఇయ్యది పురుష సంయోగమునకు యుక్తముకాని బాల్యముననే అధికముగ మైథునము నాచరించుటవలన కల్గుటంజేసి ప్రాక్చరణయను యోనివ్యాపత్తని యన్వర్థముగ చెప్పబడును.

### 10. ఉపప్లుతాలక్షణము.

మూ. గర్భిణ్యాః శ్లేష్మలాభ్యాసాత్ ఛర్దినిశ్శ్వాసనిగ్రహాత్,
వాయుః క్రుద్ధః (వృద్ధః) కఫం యోనిం ఉపనీయ ప్రదూషయేత్.
పాణ్డుం సతోదమాస్రావం శ్వేతం స్రవతి వా కఫం,
కఫవాతామయవ్యాప్తా సా స్యాత్ యోనిరుపప్లుతా. 22

వ్యా. గర్భవతిగ నుండుస్త్రీ కఫమును వృద్ధినొందించు నాహారవిహారములను నిరంతరముగ నలవాటుచేయుచున్నను, వమనమును నిశ్వాసమును వెడలనీయక నిరోధించినను వాతము మిగుల ప్రకోపమునొంది కఫమును యోనియందు చేర్చి యోనిని చెరచును. దానంజేసి పాండువర్ణంబైనను తెల్లనిరంగైనను కలకఫమునైనను ద్రవమునైనను స్రవింపజేయును. అట్టియెడ యోనియందు పోటును కఫ-వాతరోగంబులును వ్యాపించును. అట్టి కఫవాతరోగముల యోని బాధింపబడుటంజేసి యియ్యది యుపప్లుతయను యోని వ్యాపత్తు అని చెప్పంబడును.

### 11. పరిప్లుతాలక్షణము.

మూ. పిత్తళాయాః నృసంవాసే క్షవథూద్గారధారణాత్,
పిత్తసమ్మూర్ఛితో వాయుః యోనిం దూషయతి స్త్రియాః. 23
శూనా స్పర్శాక్షమా సార్తిః నీలపీతమసృక్ స్రవేత్,
శ్రోణివంక్షణపృష్ఠార్తిజ్వరార్తాయాః పరిప్లుతా. 24

వ్యా. పిత్తం అధికముగనుండు స్త్రీ పురుషునితో సంభోగము చేయుసమయమున తుమ్ములను త్రేనుపులను నిరోధించినయెడ మిక్కిలి వృద్ధినొందియుండు పిత్తముతో గూడినవాతము ప్రకోపమునంది యోనిని చెరచును. దానంజేసి యోని వాచి చేత తాకినను స్పర్శమునోరువజాలక, బాధతో గూడి నీలవర్ణంబైనను పచ్చనిరంగైనను కలరక్తమును స్రవించును. అట్టియెడ పిరుదులయందును గజ్జలయందును వీపునందును నొప్పి కల్గును. జ్వరము వ్యాపించును. ఇయ్యది పరిప్లుతయను యోనివ్యాపత్తని చెప్పబడును.

## 12. ఉదావర్తినీలక్షణము.

మూ. వేగోదావర్తనాద్యోనిం ఉదావర్తయతేఽనిలః,
సా రుగార్తా రజః కృచ్ఛ్రేణోదావృత్తం (త్యా) విముఞ్చతి. 25
ఆర్తవే సా విముక్తే తు తత్ క్షణం లభతే సుఖం,
రజసో గమనాదూర్ధ్వం జ్ఞేయోదావర్తినీ బుధైః. 26

వ్యా. రక్తము వెడలనున్నపుడు దానిని వెడలనీయక నిరోధించుటవలన వాతము ప్రకోపించి యోనిని ఉదావృత్తవాతము కలదానినిగ (యోనియందలివాతము పైకి వ్యాపించునట్లు) చేయును. అట్టియెడ యోనియందు మిక్కిలి తీవ్రమైన వేదనకల్గి, పైకి వ్యాపించినరక్తమును మిగుల కష్టముచే విసర్జించును. ఇత్తెరంగున కష్టముచే బుతురక్తము వెడలినపిదప క్షణకాలము స్త్రీ సుఖమునొందును. ఈవ్యాధియందు ఆర్తవము పైజెప్పిన రీతిగ విలోమగమనము కలిగి పైకి వ్యాపించుటవలన ఉదావర్తినియని యన్వర్థముగ చెప్పబడు యోనివ్యాపత్తు అని యెరుంగునది.

## 13. కర్ణికాలక్షణము.

మూ. అకాలే వాహమానాయాః గర్భేణ పిహితోఽనిలః,
కర్ణికాం జనయేద్యోనౌ శ్లేష్మరక్తేన మూర్ఛితః. 27
రక్తమార్గాఽవరోధిన్యా సా తయా కర్ణినీ మతా,

వ్యా. గర్భవతియైనస్త్రీ ప్రసవసమయముకాని యితరకాలమున అట్టిగర్భమును వెడలించుటకై బలాత్కారముగ ముక్కినయెడ వాతము గర్భముచే నడ్డగింపబడి ప్రకుపితమై శ్లేష్మముతోడను రక్తముతోడను కూడి యోనియందు కర్ణికను (తామరపువ్వులోనుండు గుండ్రని యవయవవిశేషమువంటి యాకారమును) కల్గించును. అయ్యది రక్తమార్గమును నిరోధించును. అట్టికర్ణిక కల్గినవ్యాపత్తు కర్ణినియని యన్వర్థముగ జెప్పబడును.

### 14. పుత్రఘ్నీలక్షణము.

మూ. రౌక్ష్యాద్వాయుర్యదా గర్భం జాతం జాతం వినాశయేత్. 28
దుష్టశోణితజం నార్యాః పుత్రఘ్నీ నామ సా మతా,

వ్యా. వాతమును ప్రకోపింపజేయు నాహారాదులచే వాతము మిగుల ప్రకోపము నొంది స్త్రీలయొక్క పుత్రోత్పాదకమైన ఆర్తవశోణితమును చెరచి అట్టిస్త్రీలకు గర్భము కల్గినప్పుడు తనయందలి రూక్షగుణాధిక్యముచేత శిశువును చంపును. ఇత్తెరంగున పలుమారు పుట్టుచుండు శిశువులనెల్ల చంపుచుండును. ఈవ్యాధి పుత్త్రుల చంపునట్టిదికాన పుత్రఘ్ని యని యన్వర్థముగచెప్పబడు యోనివ్యాపత్తని యెరుంగునది. (ఇచ్చట పుత్రోత్పాదనహేతువైన శోణితము వాతముచే చెడుట ఈవ్యాధికి ముఖ్యకారణము.)

### 15. అంతర్ముఖీలక్షణము.

మూ. వ్యవాయమతితృప్తాయా భజన్త్యాస్త్వన్నపీడితః. 29
వాయుర్మిథ్యాస్థితాఙ్గాయాః యోనిస్రోతసి సంస్థితః,
వక్రయత్యాననం యోన్యాస్సాస్థిమాంసానిలార్తిభిః. 30
భృశార్తిర్మైథునాశక్తా యోనిరన్తర్ముఖీ మతా,

వ్యా. పరిమితికి మిక్కుటముగ తృప్తిగ భుజించినస్త్రీ హెచ్చుతగ్గులుగనుండు ప్రదేశమున వ్యత్యస్థముగ పరుండి పురుషునితో సంభోగము చేసినయెడ భుజింపబడిన యాహారముచే వాతము పీడింపబడి యోనియొక్క స్రోతోమార్గమున జేరి అందలి అస్థులను, మాంసములను వాతసంబంధమయిన బాధలను కల్గించుచు యోనియొక్క ముఖమును వక్రముగ చేసి లోనికి ప్రవేశింపజేయును. అట్టియెడ మిక్కిలి తీవ్రమైనబాధ కల్గి సంభోగానర్హమగును. ఇది అంతర్ముఖియను యోనివ్యాపత్తు.

### 16. సూచీముఖీలక్షణము.

మూ. గర్భస్థాయాః స్త్రియా రౌక్ష్యాద్వాయుర్యోనిం ప్రదూషయన్.
మాతృదోషాదణుద్వారం కుర్యాత్సూచీముఖీ తు సా,

వ్యా. గర్భోత్పత్తికి కారణభూతురాలయిన తల్లియొక్క ఆర్తవము వాతము యొక్క రూక్షగుణముచే దుష్టమైనయెడ అట్టియార్తవముచేత సంభవించిన గర్భమునందలి శిశువుయొక్క యోనిద్వారము వాతము తనరౌక్ష్యగుణముచే శోషింపజేసి అట్టియవయవమును మిక్కిలి సూక్ష్మమయినద్వారముకలదానినిగ చేయును. ఇవ్యాధి సూదిని

బోలె మిగుల సూక్ష్మద్వారమై యుండుటంజేసి సూచీముఖియని యన్వర్థముగ చెప్పబడును. ఈవ్యాధి తల్లియొక్క దోషమువలన గర్భమునందలి స్త్రీశిశువుకు సంభవించును.

## 17. శుష్కయోనిలక్షణము.

మూ. వ్యవాయకాలే రుద్ధస్యా వేగాన్ప్రకుపితోఽనిలః. 32
కుర్యాద్విణ్మూత్రసంగార్తిం శోషం యోనిముఖస్య చ,

వ్యా. సంభోగకాలమున స్త్రీ మలమూత్రాదివేగముల నిరోధించి యున్నయెడ అట్టి వేగనిరోధముచే వాతము ప్రకుపితమై మలమూత్రముల నడ్డగించి యోనిని ముఖమున ద్రవములేక శుష్కింపచేయును. ఇయ్యది శుష్కయోనియను యోనివ్యాపత్తని యెరుంగునది.

## 18. వామినీలక్షణము.

మూ. షడహాత్ సప్తరాత్రాద్వా శుక్రం గర్భాశయం గతమ్. 33
సరుజం నీరుజం వాపి యా ప్రవేత్సా తు వామినీ,

వ్యా. ఋతుస్నానముచేసిన స్త్రీ పురుషునియొక్క శుక్రమును గర్భాశయమున చేరినపిదప వాతము ప్రకోపమునొంది ఆరు యేడుదినములకు లోపల బాధతోకూడి యైనను, బాధలేకయైనను స్రవింపజేయును. ఈయోనివ్యాపత్తు వామిని (గ్రహింపబడిన శుక్రమును వెడలించునది) యని యన్వర్థముగ చెప్పబడినది.

## 19. షండీలక్షణము.

మూ. బీజదోషాత్తు గర్భస్థమారుతోపగతాశయా. 34
నృద్వేషిణ్యస్తనీ చైవ షణ్డీ స్యాదనుపక్రమా,

వ్యా. గర్భోత్పత్తికారణమైన తల్లియొక్క ఆర్తవమునందలి గర్భాశయోత్పాదనభాగము వాతముచే దుష్టమైనయెడ అట్టిశోణితముచే జనించిన స్త్రీశిశువునకు గర్భాశయము చెడును. దానంజేసి యాస్త్రీశిశువు పురుషునియం దభిలాషలేక సంభోగేచ్ఛయే బొత్తుగ లేకయు, స్తనములు పొడమకయు నుండును. ఈయోనివ్యాపత్తు షండి యని చెప్పబడును. (ఈవ్యాధియు తల్లియొక్క బీజదోషమువలన కల్గును.)

## 20. మహాయోనిలక్షణము.

మూ. విషమం దుఃఖశయ్యాయాం మైథునాత్కుపితోఽనిలః. 35
గర్భాశయస్య యోన్యాశ్చ ముఖం విష్టంభయేత్స్త్రియాః,

అసంవృతముఖీ సార్తిః రూక్షమేవాస్రవాహినీ. 36
మాంసోత్సన్నా మహాయోనిః పర్వవంక్షణశూలినీ,

వ్యా. సంభోగకాలమున స్త్రీ శరీరమునకు కష్టమును కల్గించు శయ్యపైనుండి వ్యత్యస్తముగ సంభోగము చేసినయెడల వాతము ప్రకోపమునొంది స్త్రీయొక్క గర్భాశయనుయొక్కయు యోనియొక్కయు ద్వారమును పెద్దదిగ విస్తరింపజేయును. దానంజేసి యాద్వారము మరల యథాస్థితముగ మూసికొనకయుండును. మిక్కిలి బాధ కల్గును. అందుండి రూక్షమగు నురుగును రక్తమును వెడలుచుండును. మాంసము వెలుపలికివచ్చియుండును. కీళ్లయందును, గజ్జలయందును మిక్కిలి తీవ్రమైనపోటు కల్గును. ఈయోనివ్యాపత్తు మహాయోనియని యవ్యక్తముగ జెప్పబడును.

## యోనివ్యాపత్తులచే గల్గు రోగవిశేషములు.

మూ. ఇత్యేతైర్లక్షణైః ప్రోక్తాః వింశతిర్యోనిజాః గదాః. 37
న శుక్రం ధారయత్యేభిః దోషైర్యోనిరుపద్రుతా,
తస్మాద్గర్భం న గృహ్ణాతి స్త్రీ గచ్ఛత్యామయాన్బహూన్. 38
గుల్మార్శః ప్రదరాదీంశ్చ వాతాద్యైశ్చాతిపీడనం,

వ్యా. ఇత్తెరంగున "వింశతిర్వ్యాపదోయోనే" అని నిర్దేశింపబడిన యిరువదివిధములయిన యోనివ్యాపత్తురోగములు వానిని ప్రత్యేకలక్షణములచే వివరించి చెప్పబడినది. ఈవ్యాధులచే నుపద్రవమునొందినయోని గర్భోత్పత్తికికారణమైన శుక్రమునుగ్రహించి ధరింపనేరదు. కావున ఈవ్యాధిపీడితురాలగుస్త్రీ యెకప్పుడును గర్భమును ధరింపజాలదు. మరియు గుల్మము, అర్శోరోగము యోనివ్యాపత్తుకు సమానమైన రక్తప్రదరము మున్నగు రోగములను పొంది, వాతపిత్తకఫములచేనైన నానావిధబాధల ననుభవించుచు చాలకష్టముపడును.

ఇచ్చట "దోషైర్యోనిరుపద్రుతం" అనుచోట దోషశబ్దము రోగసామాన్యవాచకము. ఈవిషయమునే విమానస్థానమున "దోషా వ్యాపిచ రోగశబ్దం......... లభన్తే;.........తత్ర దోషేషు చైవ వ్యాధిషు చ రోగశబ్దస్సమానః" (వి. అ. 6. సూత్ర. 5.) అని చెప్పబడియున్నది. మరియు రక్తప్రదరరోగము యోనివ్యాపత్తులలో అంతర్భూతమయినదని కొందరు చెప్పెదరు. కొందరు రక్తప్రదరము యోనివ్యాపత్తులకన్న వేరైనదనియె చెప్పిరి. ఈమతము నవలంబించియే మాధవకరుడు రక్తప్రదరనిదానమును ప్రత్యేకముగ చెప్పెను.

వ్యా. వ్యాపత్తు లన్నిటియందును మిక్కిలి మృదువులగు వమనవిరేచనాది పంచకర్మలచేతను స్త్రీకి నుపచరించి, విధ్యుక్తముగ స్నేహస్వేదములచేసి శరీరమునందలి బాహ్యాభ్యంతరములయందును ఆంతట శుద్ధమైనపిదప నాస్త్రీకి క్రిందచెప్పబడు చికిత్సావిధానమును చేయనగును. (ఇచ్చట "పంచభిః" అనుపదము చికిత్సా సామాన్యమున కుపలక్షణము కావున యోనివ్యాపత్తునందు చేయబడు చికిత్సలన్నియు మృదువుగ నుండవలెను కాని తీక్ష్ణముగ నుండదగదని యర్థము. మరియు వమనాది పంచకర్మలును శరీరమునందలి బాహ్యాంతర్భాగముల కంతటికి నుపకారకమును కావున యోనిగతరోగముల శమింప జేయుటకును సమర్థములగునని యెరుంగునది).

## వాతికయోనివ్యాపచ్చికిత్స.

మూ. వాతవ్యాధిహరం కర్మ వాతార్తానాం సదా హితం,
ఔదకానూపజైర్మాంసైః క్షీరైస్సతిలతణ్డులైః. 47
సవాతఘ్నౌషధైర్నాడీకుమ్భీస్వేదైరుపాచరేత్,
అక్తాం లవణతైలేన సాశ్మప్రస్తరసంకరైః. 48
స్విన్నాం కోష్ణామ్బుసిక్తాఙ్గీం వాతఘ్నైర్భోజయేద్రసైః,

వ్యా. వాతముచే కల్గినయోనివ్యాపత్తు పీడితులగువారలకు వాతవ్యాధిహరమగు చికిత్సావిధానము ఎల్లప్పుడును హితకరమై యుండును. యెట్టులనః—నువ్వులను, తండులములను, వాతహరంబులగు నౌషధములను చేర్చి పక్వముచేయబడిన ఉదకమునందు జంతువులయొక్కయు, ఆనూప జంతువులయొక్కయు మాంసములచేనైనను; ఆవుపాలచేనైనను; నాడీస్వేదములను, కుమ్భీస్వేదములను విధ్యుక్తప్రకారముగ చేసి యుపచరించవలయును. మరియు సైంధవలవణముతో కూడి తైలమును శరీరమునకుపూసి అశ్మఘన-ప్రస్తర-సఙ్కరస్వేదములను చేయవలయును. ఇత్తెరంగున స్వేదవిధిని చేసిన పిదప శరీరమునందంతట గోరువెచ్చనినీటిచే స్నానము చేయించి వాతహరములగు ద్రవ్యములచే సిద్ధముచేయబడిన మాంసరసములతో భుజింప చేయవలయును.

## వాతికయోనిరోగమునకు బలాదితైలము.

మూ. బలాద్రోణద్వయక్వాథే ఘృతతైలాఢకం పచేత్. 49
(ఘృతతైలాఢకద్వయం).
స్థిరాపయస్యాజీవన్తీవీరర్షభకజీవకైః,
శ్రావణీపిప్పలీముద్గపీలుమాషాఖ్యపర్ణిభిః. 50

శర్కరాక్షీరకాకోలీకాకనాసాభిరేవ చ,
పిష్టైశ్చతుర్గుణక్షీరే సిద్ధం పేయం యథాబలమ్. 51
వాతపిత్తకృతాన్రోగాన్హత్వా గర్భం దధాతి తత్,

వ్యా. చిట్టాముట్టికషాయము రెండుద్రోణములు, నెయ్యి యొకద్రోణము, నువ్వుల నూనె యొకద్రోణము, వీని నొకటిగ జేర్చి, అందు ముయ్యాకుపొన్న, పిన్నమనుబాల, పాలకూర, కాకోళి, ఋషభకము, జీవకము, పెద్దబోదతరము, పిప్పళ్లు, అడవిపెసర, దొండ, అడవిమినుము, చక్కెర, క్షీరకాకోళి, కాకిదొండ, వీని నన్నిటిని సమభాగములుగ చేర్చి స్నేహమునకు నాల్గవవంతుండునట్లు పరిమాణముకల్పించి నూరి కల్కము చేసి పైజెప్పిన ఘృతమునకలిపి స్నేహమునకు నాల్గింతలు ఆవుపాలనుచేర్చి స్నేహపాక విధిప్రకారము పక్వముచేయునది. ఈఘృతమును రోగికి బలానుసారముగ త్రాగించిన యెడ వాతపిత్తముచేకల్గిన రోగములనన్నిటిని హరించి గర్భమును ధరించును.

ఇచ్చట క్వాథకల్పనమున చిట్టాముట్టిని ద్రోణద్వయ పరిమితముగ నుంచుకొని దానికి చతుర్గుణముగ జలమునుచేర్చి నాల్గవవంతు (రెండుద్రోణములు) క్వాథము మిగులునట్లు సిద్ధము చేయనగును. ముయ్యాకుపొన్న మొదలగు కల్కద్రవ్యములన్నియుం చేరి స్నేహమునకు నాల్గవవంతు పరిమితముగునట్లు కల్పింపనగును. ఇయ్యది సామాన్యపరిభాషానుసారమైన కల్పనము.

## యోనిరోగమునకు కాశ్మర్యాదిఘృతము.

మూ. కాశ్మర్యత్రిఫలాద్రాక్షాకాసమర్దపరూషకైః. 52
పునర్నవాద్విరజనీకాకనాసాసహాచరైః,
శతావర్యా గుడూచ్యాశ్చ ప్రస్థమక్షసమైః ఘృతాత్. 53
సాధితం యోనివాతఘ్నం గర్భదం పరమం పిబేత్,

వ్యా. పెద్దగుమ్ముడు, త్రిఫలములు, ద్రాక్షపండు, కసివింద, చిట్టీత, గలిజేరు, పసుపు, మ్రానిపసుపు, కాకిదొండ, ములుగోరింట, పిల్లిపీచర, తిప్పతీగె వీనిని ప్రత్యేక మొక్కొక్కకర్షమువంతున చేర్చి ప్రస్థపరిమితమైన ఆవునేతిలో కలిపి ఘృతపాకవిధి ప్రకారము పక్వముచేసి పానముచేసిన యోనికి సంబంధించిన వాతరోగముల నన్నిటిని శమింపజేసి గర్భమును కల్గించును. (ఇచ్చట ద్రవమును నిర్దేశించకుండుటవలన "ద్రవే వ్యనుక్తే జలమేవదేయం" అను పరిభాషననుసరించి ఘృతమునకు చతుర్గుణము జలమును చేర్చి పక్వము చేయునది.)

యోనిరోగమున పిప్పల్యాద్యుపయోగము.

మూ. పిప్పలీకుఞ్చికాజాజీ (కింశుకాజాజీ) వృషకం సైన్ధవం వచామ్.54
యవక్షారాజమోదే చ శర్కరాం చిత్రకం తథా,
పిష్ట్వా సర్పిషి భృష్టాని పాయయేత ప్రసన్నయా. 55
(పిష్ట్వా ప్రసన్నయాఽఽలోడ్య ఘృతభృష్టాని దాపయేత్.)
యోనిపార్శ్వార్తిహృద్రోగగుల్మార్శోవినివృత్తయే,

వ్యా. పిప్పళ్లు, నల్లజీలకఱ్ఱ, తెల్లజీలకఱ్ఱ, అడ్డసరము, సైంధవలవణము, వస, యవక్షారము, ఓమము, చక్కెర, చిత్రమూలము, వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి నేతిలో వేయించి మెత్తగ చూర్ణము చేసి మద్యము పైతేటలో గలిపి అగ్నిబలానుసారముగ సేవించినయెడ యోనిశూలంబును, పార్శ్వశూలంబును, హృద్రోగమును, గుల్మము, నర్శోరోగము, అనునీవ్యాధుల నన్నిటిని హరించును.

యోనిరోగమునకు వృషాదికల్కపానములు.

మూ. వృషకం మాతులుఙ్గస్య మూలాని మదయన్తికామ్. 56
పిబేత్సలవణైర్మద్యైః పిప్పలీకుఞ్చికే తథా.
రాస్నాశ్వదంష్ట్రావృషకైః పిబేచ్ఛూలే శృతం పయః. 57

వ్యా. అడ్డసరము, మాదీఫలవృక్షముయొక్క వేళ్లు, మల్లెవేళ్లు, వీనిని సమభాగములుగ గూర్చి చూర్ణముచేసియైనను; పిప్పళ్లను, నల్లజీలకఱ్ఱను సమభాగములుగ గూర్చి చూర్ణము చేసియైనను; మద్యమున గలిపి సైంధవలవణమును అందు చేర్చి త్రాగవలయును. మరియు సన్నరాష్ట్రము, పల్లేరు, అడ్డసరము, ఈమూటిని సమభాగములుగ గూర్చి పాలలో కలిపి కాచి త్రాగవలయును. దీనిచేత యోనిశూలము నివర్తించును.

యోనిరోగమునందు పరిషేకము.

మూ. గుడూచీత్రిఫలాదన్తీక్వాథైశ్చ పరిషేచయేత్,

వ్యా. తిప్పతీగె, త్రిఫలములు, దంతివేళ్లు వీనిని సమభాగములుగ గూర్చి క్వాథము చేసి సుఖోష్ణముగ యోనికి సేచనము చేసినయెడ యోనిశూలను హరించును.

యోనిశూలహరపిచుధారణము.

మూ. సైన్ధవం తగరం కుష్ఠం బృహతీ దేవదారు చ. 58
సమాంశైస్సాధితం కల్కైః తైలం ధార్యం రుజాపహమ్,

వ్యా. సైంధవలవణము, గ్రంథితగరము, చెంగల్వకోష్టు, పెద్దములక, దేవదారు చెక్క వీనిని సమభాగములుగ గూర్చి కల్కముచేసి కల్కమునకు నాల్గింతలు నువ్వుల నూనెను చేర్చి తైలమునకు నాల్గింతలు జలమును చేర్చి తైలపాకవిధిప్రకారము తైలమును సిద్ధము చేసి యందు ప్రత్తిని తడిపి యోనియం దుంచినయెడ యోనిశూలమును హరించును. (ఇచ్చట వాగ్భటాచార్యులు "తైలాత్ప్రసాధితం ధార్యః పిచుర్యోనౌ రుజాపహః" అని చెప్పియుండుటవలన నియ్యది పిచుధారణమని తెలిసెడి.)

యోనిరోగములయందు పిచుధారణమునకు గుడూచ్యాదితైలము.

మూ. గుడూచీమాలతీరాస్నా బలామధుకచిత్రకైః. 59
నిదిగ్ధికా దేవదారుయూథికాభిశ్చ కార్షికైః,
తైలప్రస్థం గవాం మూత్రే, క్షీరే చ ద్విగుణే పచేత్. 60
వాతార్తాయాః పిచుం దద్యాత్ యోనౌ చ ప్రణయేత్తతః,

వ్యా. తిప్పతీగె, జాజిపువ్వులు, సన్నరాష్టము, చిట్టాముట్టి, అతిమధురము, చిత్రమూలము, వాకుడు, దేవదారుచెక్క, అడవిమల్లె వీనిని ప్రత్యేక మొక్కొక్క కర్షమువంతున కూర్చి కల్కముచేసి ప్రస్థపరిమితమైన తైలమున చేర్చి తైలమునకు సమభాగము, గోమూత్రమును, రెండింతలు ఆవుపాలను కలిపి తైలపాకవిధిప్రకారము తైలమును సిద్ధముచేసి వాతముచే కల్గిన యోనివ్యాపత్తు కల్గిన స్త్రీకి యోనియందు పైజెప్పిన తైలములో తడుపబడిన ప్రత్తిని యుంచునది. లేక యోనియందు పైచెప్పినతైలమును గూర్చి ఉత్తరబస్తిని విధిప్రకారము ప్రయోగింపనగును.

వాతికయోనిరోగములకు సేకాదివిధి.

మూ. వాతార్తానాం చ యోనీనాం సేకాభ్యఙ్గపిచుక్రియాః. 61
(ఉష్ణాః స్నిగ్ధాః ప్రకర్తవ్యాః తైలాని స్నేహనాని చ.)

వ్యా. వాతప్రకోపముచేనైన యోనిరోగములు గలస్త్రీలకు యోనిస్థానమున ఉష్ణంబును స్నిగ్ధంబును నైన కషాయస్నేహాదులచేత సేకమును, అభ్యంజనమును, పిచుధారణమును చేయవలయును. స్నేహనమునకై పైజెప్పిన తైలములను నుపయోగింపదగును.

వాతాదియోనిరోగములయందు కల్కప్రయోగము.

మూ. హింస్రాకల్కం తు వాతార్తాః కోష్ణమభ్యజ్య ధారయేత్,

పఞ్చవల్కస్య పిత్తార్తా, శ్యామాదీనాం కఫాతురా. 62

వ్యా. వాతజయోనివ్యాపత్తునందు సుఖోష్ణముగ నున్న తైలమును యోనికి పూసి జటామాంసికల్కమును అందుంచవలయును. పిత్తముచేనైన యోనివ్యాపత్తున పఞ్చవల్కముల కల్కమును నుంచవలయు. కఫజయోనివ్యాపత్తునందు రోగభిషిగ్జితీయాధ్యాయమున చెప్పబడిన శ్యామాదిగణద్రవ్యముల కల్కము చేసి యుంచవలయును. (ఇచ్చట రోగభిషగ్జితీయాధ్యాయమున (వి. అ. ౮) "శ్యామా త్రివృత్ చతురఙ్గుళ" అని యుపక్రమించి చెప్పబడినద్రవ్యములు 'శ్యామాదీనాం' అనుపదముచే గ్రహింపబడును. రావి, జువ్వి, అత్తి, మఱ్ఱి, ప్రబ్బలి అను నీయైదిటిపట్టలును చేరి పంచవల్కము లని చెప్పబడును.)

## పిత్తజయోనిరోగములచికిత్సావిధానము.

మూ. పిత్తలానాం తు యోనీనాం సేకాభ్యఙ్గపిచుక్రియాః,
శీతాః పిత్తహరాః కార్యాః స్నేహనార్థం ఘృతాని చ. 63
(పిత్తఘ్నౌషధసిద్ధాని కార్యాణి భిషజా తథా),

వ్యా. పిత్తముచే గల్గిన యోనిరోగములయందు శీతస్పర్శంబులును, పిత్తహరంబులును నగునౌషధములచే సేకమును అభ్యంగమును పిచుక్రియయును చేయనగును. స్నేహమునకై పిత్తహరౌషధములచే సిద్ధములైన ఘృతముల నుపయోగింపనగును.

## యోనిరోగాదులకు బృహచ్ఛతావరీతైలము.

మూ. శతావరీమూలతులాః చతస్రః సంప్రపీడయేత్. 64
రసేన క్షీరతుల్యేన పచేత్తేన ఘృతాఢకం,
జీవనీయైశ్శతావర్యా మృద్వీకాభిః పరూషకైః. 65
పిష్టైః ప్రియాలైశ్చాక్షాంశైః ద్వియష్టిమధుకైః భిషక్,
సిద్ధే శీతే చ మధునః పిప్పల్యాశ్చ పలాష్టకమ్. 66
సితా దశపలోన్మిశ్రాత్ లిహ్యాత్ పాణితలం తతః.
యోన్యసృక్శుక్రదోషఘ్నం వృష్యం పుంసవనం చ తత్. 67
క్షతం క్షయం రక్తపిత్తం కాసం శ్వాసం హలీమకం,
కామలాం వాతరక్తం చ వీసర్పం హృచ్ఛిరోగ్రహమ్. 68
ఉన్మాదాఽరత్యపస్మారాన్ వాతపిత్తాత్మకాన్ జయేత్,
(ఇతి బృహచ్ఛతావరీఘృతమ్)

వ్యా. పిల్లిపీచరగడ్డలను నాల్గుతులములు (నాల్గువందలపలములు) గ్రహించి చక్కగ నలుగగొట్టి రసముపిండి యారసమునకు సమానముగ నావుపాలను కలిపి యీ రెంటిని అష్టకపరిమితమైన ఆవునేతిలో కలిపి, అందు—జీవనీయగణద్రవ్యములు, పిల్లిపీచర, ద్రాక్షపండు, చిట్టీతపండు, మొరళి, యష్టిమధుకద్వయము (నీటబుట్టిన అతిమధురము, మెట్టలోబుట్టిన అతిమధురము), ఈద్రవ్యములను ప్రత్యేక మొక్కొక కర్షము వంతున గూర్చి నూరి కలిపి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి, చల్లారినపిదప నందు ఎనిమిదిపలములు తేనెను, ఎనిమిదిపలములు పిప్పలిచూర్ణమును, పదిపలములు చక్కెరను కలిపి, యీఘృతమును పూట కొకకర్షప్రమాణమువంతున సేవించునది.

దీనివలన యోనిదోషములును, ఆర్తవదోషంబులును, శుక్రదోషంబులును నివర్తించును. శుక్రమును వృద్ధినందించి సంభోగశక్తిని కల్గించును. పురుషప్రజను కల్గించును. ఉరఃక్షతము, క్షయము, రక్తపిత్తము, కాసశ్వాసములు, హలీమకము, కామల, వాతరక్తము, విసర్పము, రొమ్మునొప్పి, తలనొప్పి, ఉన్మాదము, అరతి, అపస్మారము, వాతపిత్తములచే గల్గిన వీనినన్నిటిని హరించును.

ఇచ్చట—షడ్విరేచనశతాశ్రితీయమున "జీవకర్షభకౌ మేదా......జీవనీయాని భవన్తి." (సూత్ర. అ. ౪. సూ. ౹౪) అని చెప్పబడిన జీవనీయగణమును గ్రహించునది. మరియు 'ద్వియష్టిమధుకైః' అనుపదమునకు జలజ-స్థలజభేదములచే రెండుతెరంగులైన యష్టిమధుకమని యర్థము. లేక తక్కిన కల్కద్రవ్యములను కర్షప్రమాణమువంతున గ్రహించి యష్టిమధుకమును మాత్రము రెండుకర్షములపరిమితిని గ్రహింపనగునని యైన నర్థము నెరుంగనగును.

యోనిరోగమునందు జీవనీయక్షీరఘృతపానము.

మూ. ఏవమేవ క్షీరసర్పిః జీవనీయోపసాధితమ్. 69

గర్భదం పిత్తలానాం చ యోనీనాం స్యాద్భిషగ్జితం,

వ్యా. ఇత్తెరంగుననే జీవనీయగణద్రవ్యములను కల్కముగ జేసి క్షీరమును పక్వముచేసి యందుండి వెడలిన ఘృతమును పైజెప్పిన శతావరీకల్పప్రకారము సిద్ధముచేయబడిన ఘృతము నుపయోగించినయెడ నయ్యది గర్భమును కల్గించును. పిత్తముచే గల్గిన యోనిరోగముల నన్నిటిని హరించును.

ఇచ్చట ఆవుపాలలో జీవనీయగణద్రవ్యములను కల్కముగ జేర్చి పక్వముచేసి యాపాలనుండి కల్గినఘృతమును అష్టకపరిమితమును గ్రహించి, అందు నాల్గువందలపల

ముల శతావరినుండి రసమును తీసి కలిపి పైజెప్పినశతావరీఘృతకల్పప్రకారము కల్కాదుల జేర్చి ఘృతమును సిద్ధము చేయవలెను. ఈకల్పనము చక్రపాణిదత్తవ్యాఖ్యానమున నిట్లున్నది:—"ఏవమేవేత్యాదౌ శతావరీచతుశ్శతరసమేవేత్యర్థః, క్షీరోత్థితం సర్పిః క్షీరసర్పిః జీవనీయాన్యత్ర కల్కాః." వాగ్భటాచార్యులును ఇదేశ్లోకమును పఠించియున్నారు.సర్వాంగసుందరవ్యాఖ్యానమున—"అనేనైవ క్రమేణ క్షీరం సర్పిర్వా జీవనీయైః పక్వం గర్భదం, పిత్తజానాం చ రోగాణాం పరం హితమ్" అని యున్నది. ఈ వ్యాఖ్యానప్రకారము జీవనీయగణద్రవ్యముల కల్కముగగూర్చి క్షీరమునైనను ఘృతమునైనను పక్వముచేయవలెనని తెలిసెడి. ఈకల్పనమె సమంజసమని తోచెడి.

## శ్లేష్మజయోనిరోగచికిత్స, అందు వర్తిప్రయోగము.

మూ. యోన్యాం శ్లేష్మప్రదుష్టాయాం వర్తిస్సంశోధనీ హితా. 70
వారాహే బహుశః పిత్తే భావితైర్న(ర్న క్తకైః) క్తకైః కృతా,
భావితం పయసార్కస్య యవచూర్ణం ససైన్ధవమ్. 71
వర్తిః కృతా ముహుర్ధార్యా తతః సేచ్యా సుఖామ్బునా,
పిప్పల్యా మరిచైర్మాషైః శతాహ్వాకుష్ఠసైన్ధవైః. 72
వర్తిస్తుల్యా ప్రదేశిన్యా ధార్యా యోనివిశోధనీ,

వ్యా. కఫముచే దుష్టమైన యోనిరోగములయందు సంశోధనవర్తిని ఉపయోగించుట చాల హితము:—గుడ్డపేలికలను పందిపిత్తమున అనేకపర్యాయములు భావనచేసి వత్తిచేసి యోనియందుంచునది. యవలపిండిని జిల్లేడుపాలలో భావనచేసి అందు సైంధవలవణమును కలిపి వర్తిచేసి యోనియందుంచి సుఖోష్ణమయినజలముచే తడుపవలయును. మరియు పిప్పళ్లు, మిరియాలు, ఉద్దులు, సదాపవిత్తులు, చెంగల్వకోష్టు, సైంధవలవణము వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి నీళ్లతో నూరి చూపుడువ్రేలికి సమానమైనలావు అంతియే పొడవు కల్గియుండు వర్తిని చేసి యోనియం దుంచినయెడ దోషముల నన్నిటిని శుభ్రపరచును. (ఇచ్చట "భావితైర్నక్తకైః" అనుచోట "నక్తకైః" అనుపాఠాంతరము ప్రాచీనముద్రితప్రతియందు గనబడుచున్నది. వర్తినిర్మాణమునకు గుడ్డపేలికలు ఆవశ్యకము కాన ఈపాఠమే సమంజసము. "సమౌ నక్తకకర్పటౌ" అను నిఘంటువును పట్టి గుడ్డపేలిక యని యర్థము.)

## యోనిరోగములకు ఉదుంబరాదితైలము.

మూ. ఉదుమ్బరశలాటూనాం ద్రోణమబ్ద్రోణసంయుతమ్. 73

సపఞ్చవల్కకులకమాలతీనిమ్బపల్లవమ్,
నిశాం స్థాప్యజలే తస్మిం స్తైలప్రస్థం విపాచయేత్. 74
లాక్షాధవపలాశత్వక్ నిర్యాసైః శాల్మలేన చ,
పిష్టైస్సిద్ధస్య తైలస్య పిచుం యోనౌ నిధాపయేత్. 75
సశర్కరైః కషాయైశ్చ శీతైః కుర్వీత సేచనం,
పిచ్ఛిలా వివృతా కాలదుష్టా యోనిశ్చ దారుణా. 76
సప్తాహాచ్ఛుద్ధ్యతి క్షిప్ర మపత్యం చాపి విన్దతి,

వ్యా. అత్తికాయలు, పఞ్చవల్కలములు, నల్లతుమ్మపట్ట, జాజిమొగ్గలు, వేపచిగుళ్లు ఇవి యన్నియు సమభాగములుగ చేరి ద్రోణపరిమితముగ నుండునట్లు గూర్చి అందు ద్రోణపరిమితజలమును పోసి యొకరాత్రి యంతయు నూరపెట్టి యాశీతజలమును ప్రస్థమైన నువ్వులనూనెను కలిపి, అందు లక్క, చంద్రచెక్క, మోదుగపట్ట, మోదుగబంక, బూరుగబంక ఇవి యన్నియు సమభాగములుగ జేరి తైలమునకు నాల్గవవంతుగ నుండునట్లు గూర్చి కల్కముచేసి (పైజెప్పిన తైలమున) కలిపి తైలపాకవిధి ప్రకారము పక్వముచేసి యాతైలమున ప్రత్తిని తడిపి యోనియందుంచునది. పిదప పైజెప్పిన ఉదుమ్బర, పంచవల్కాది ద్రవ్యములను చేర్చి సిద్ధముచేయబడిన శీతకషాయమున చక్కెర కలిపి యాకషాయముచేత దడిపి శుభ్రముగ కడుగవలయును. దీనిచేత పిచ్ఛిలమై, వివృతమై (మూసికొనగల్గు) చాలకాలమునుండి దుష్టమై మిక్కిలి క్రూరముగనుండు యోనిదోషము శమించును. పైజెప్పిన రీతిగ యేడుదినములు చికిత్సచేసిన యెడ నతిశీఘ్రముగ యోనిదోషము లన్నియు నివర్తించి నిర్దుష్టమై సంతతి కల్గును.

యోనిరోగములకు ఉదుంబరతైలము, రెండవది.

మూ. ఉదుమ్బరస్య దుగ్ధేన షట్ కృత్వో భావితా త్తిలాత్. 77
తైలం క్వాథేన తస్యైవ సిద్ధం ధార్యం చ పూర్వవత్,

వ్యా. నువ్వులను అత్తిపాలయందు ఆరుమార్లు భావనచేసి యానువ్వులనుండి తియ్యబడిన నూనెను అత్తిపట్టయొక్క క్వాథమున చేర్చి విధిప్రకారము తైలమును పక్వముచేసి యాతైలమున తడుపబడిన వర్తిని పైయోగమున చెప్పిన ప్రకారము యోనియందుంచినయెడ యోనిదోషము లన్నియు నివర్తించును. ఇచ్చట భావనయన రాత్రియందు ద్రవమున నానబెట్టి పగటియందు యెండించునది భావనయని పేరు. ఈ విషయము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"దివాదివాఽతపే శుష్కం రాత్రిం రాత్రౌ నివాసయేత్."

## యోనిరోగములకు ధాతక్యాదితైలము.

మూ. ధాతక్యామలకీపత్రస్రోతోజమధుకోత్పలైః. 78
జమ్బ్వామ్రమధ్యకాసీసలోధ్రకట్ఫలతిన్దుకైః,
సౌరాష్ట్రికాదాడిమత్వగుదుమ్బరశలాటుభిః. 79
అక్షమాత్రైరజామూత్రే, క్షీరే చ ద్విగుణే పచేత్,
తైలప్రస్థం పిచుం దద్యాత్ యోనౌ చ ప్రణయేత్తతః. 80
కటీపృష్ఠత్రికాభ్యఙ్గం స్నేహవస్తిం చ దాపయేత్,
పిచ్ఛిలాస్రావిణీ యోనిః విప్లుతోపప్లుతా తథా. 81
ఉత్తానా చోన్నతా శూనా సిధ్యేత్ సస్ఫోటశూలినీ,

వ్యా. మేకలమూత్రము రెండుప్రస్థములును, ఆవుపాలు రెండుప్రస్థములును, నువ్వులనూనె యొకప్రస్థమును (వీని నన్నింటిని) ఒకటిగ కలిపి, అందు ఆరెపువ్వు, ఉసిరికాకు, స్రోతోంజనము (సుర్మారాయి) అతిమధురము, నల్లకలువలు, నేరేడువిత్తులలోని పప్పు, మామిడివిత్తులపప్పు, కాసీసము (అన్నభేది), లొద్దుగుచెక్క, టేకుమ్రానిపట్ట, నల్లతుమికిపట్ట, సౌరాష్ట్రమృత్తిక (తువరిమన్ను), దానిమ్మకాయలబెరడు, అత్తికాయలు వీనిని ప్రత్యేక మొక్కొక్కకర్ష ప్రమాణమువంతున చేర్చి నూరి కల్కముచేసి కలిపి తైలపాకవిధిప్రకారము పక్వముచేసి యాతైలమును పిచుధారణమునకును ఉత్తరవస్తికిని యోనిలో నుపయోగించునది.

మరియు ఈతైలమును కటిప్రదేశమునందును వీపునందును వెన్నెముకకు క్రింది సంధియందును అభ్యంగనము చేయుటకును, స్నేహవస్తిప్రయోగమునకును ఉపయోగింపదగును. దీనివలన పిచ్ఛిలముగ నుండు యోనిరోగంబును, రక్తమును స్రవించు యోనిరోగంబును, విప్లుత-ఉపప్లుతయను యోనిరోగంబులును, యోని బైటవెడలినదియు, ఉన్నతమైనదియు, వాచినదియు నగు యోనిరోగంబులు, బొబ్బలతో గూడి పోటు కల్గిన యోనిరోగంబులును నివర్తించును.

## యోనిప్రక్షాళనవిధి.

మూ. కరీరధవనిమ్బార్కవేణు (రేణు) కోశామ్రజామ్బవైః. 82
జిఙ్గినీవృషమూలానాం క్వాథైః మార్ద్వీకశీధుభిః,
సశుక్తైర్ధావనం మిశ్రైః యోన్యాస్స్రావవినాశనమ్. 83

కుర్యాత్ సతక్రగోమూత్రయుక్తైర్వా త్రిఫలారసైః,
పిప్పల్యయోరజః పథ్యాప్రయోగా మధునా హితాః. 84

వ్యా. వెణుతురుచెట్టుపట్ట, వేపపట్ట, జిల్లేడుపట్ట, వెదురాకు, ఆంబాళము (నల్ల మామిడి), నేరేడుపట్ట, మంజిష్ఠి, అడ్డసరపువేరు వీనిని సమభాగములుగ గూర్చి క్వాథము చేసి యాక్వాథముతో తేనెను, శీధుమద్యమును, కాంజికమును గూర్చి యోని ప్రక్షాళనము చేసిన యోనినుండి స్రవించు ద్రవము హరించును. లేక త్రిఫలాకషాయమున పులిమజ్జిగను కలిపి యోనిప్రక్షాలనము చేయనగును. పిప్పళ్లు, ఇనుపరాపొడి, కరకకాయలు వీనిని చూర్ణముచేసి తేనెలో కలిపి సేవించుట చాల హితకరము.

## యోనిరోగములయందు వస్తిప్రయోగము.

మూ. శ్లేష్మలాయాం కటుప్రాయాస్సమూత్రా వస్తయో హితాః,
పిత్తే సమధురక్షీరాః, వాతే తైలామ్లసంయుతాః,

వ్యా. శ్లేష్మముచే జనించిన యోనిరోగములయందు కటురసమును ప్రధానముగ జేసి గోమూత్రముచేత వస్తిప్రయోగమును చేయనగును. పిత్తజయోనిరోగములయందు మధురద్రవ్యములతో కూడినక్షీరములను, వాతికయోనిరోగములయందు ఆమ్లరసముతో కూడిన తైలమును కూర్చియు వస్తిప్రయోగమును చేయనగును.

## సాన్నిపాతికయోనిరోగచికిత్స.

మూ. సన్నిపాతసముత్థాయాః కర్మ సాధారణం హితమ్. 85

వ్యా. త్రిదోషసన్నిపాతముచే కల్గిన యోనివ్యాపత్తునందు వాతాదిదోషజయోనివ్యాపత్తులకు వేరువేరుగ జెప్పబడిన చికిత్సలను మిశ్రముగ జేసి చికిత్సజేయుట చాల హితకరము.

## రక్తయోని (అసృగ్దర) చికిత్సావిధి.

మూ. రక్తయోన్యామసృగ్వర్ణైరనుబన్ధం సమీక్ష్య చ,
తతః కుర్యాద్యథాదోషం రక్తస్థాపనమౌషధమ్. 86

వ్యా. రక్తయోనియను (రక్తమును స్రవించు యోనిరోగము) వ్యాధియందు వెడలునట్టి రక్తముయొక్క నీలపీతాదివర్ణభేదములచే నాయాదోషసంబంధమును చక్కగ గమనించి తత్తద్దోషానుసారముగ పైజెప్పబడిన వస్త్యాదికర్మలచే చికిత్సజేసి పిమ్మట ఆయాదోషానుసారముగ రక్తమును వెడలనీయక నిలుపునట్టి చికిత్సను చేయనగును.

వాతికరక్తప్రదరచికిత్స.

మూ. తిలచూర్ణం దధి ఘృతం ఫాణితం సౌకరీ వసా,
క్షౌద్రేణ సంయుతం పేయం వాతాసృగ్దరనాశనమ్. 87
వరాహస్య రసో మేధ్యః సకాలుత్థోఽనిలాధికే.

వ్యా. నువ్వులపిండి, పెరుగు, నెయ్యి, ఫాణితము (చక్కెరపాకము), పందివస వీని నన్నిటిని తేనెలో కలిపి త్రాగినయెడ వాతాధిక్యముచే కల్గిన రక్తప్రదరమును హరించును. మరియు పందిమాంసరసమున ఉలవలపిండిని కలిపి త్రాగినను వాతాధికరక్తప్రదరము శమించును.

పైత్తికరక్తప్రదరచికిత్స.

మూ. శర్కరాక్షౌద్రయష్ట్యాహ్వానాగరైర్వా యుతం దధి. 88
పయస్యోత్పలశాలూకబిసకాలీయకామ్బుదం,
సపయఃశర్కరాక్షౌద్రం పైత్తికేఽసృగ్దరే పిబేత్. 89

వ్యా. చక్కెర, తేనె, అతిమధురము, శుంఠి వీనిని పెరుగులో కలిపియైనను; పెద్దమనుబాల, నల్లకలువలు, తామర మున్నగువానిదుంపలు, కాడలు, మ్రానిపసుపు, లేక నల్లని చందనము, తుంగగడ్డలు వీని నన్నిటిని నూరి పాలలో కలిపి, అందు చక్కెరను, తేనెను చేర్చి యైనను; పిత్తముచే కల్గిన రక్తప్రదరమున త్రాగవలయును.

యోనిరోగాదులకు పుష్యానుగచూర్ణము.

మూ. పాఠాజమ్బ్వామ్రయోర్మధ్యం శిలోద్భేదం రసాంజనం,
అమ్బష్ఠాశాల్మలీశ్లేషం సమఙ్గాం వత్సకత్వచమ్. 90
బాహ్లీకాతివిషే బిల్వం ముస్తం లోధ్రం సగైరికం,
కట్వఙ్గం మరిచం శుంఠీం మృద్వీకాం రక్తచందనమ్. 91
కట్ఫలం వత్సకానన్తాం ధాతకీం మధుకార్జునం,
పుష్యేణోద్ధృత్య తుల్యాని సూక్ష్మచూర్ణాని కారయేత్. 92
తాని క్షౌద్రేణ సంయుజ్య పిబేత్తణ్డులవారిణా,
అర్శస్సు చాతిసారేషు రక్తం యచ్చోపవేశ్యతే. 93
దోషాగన్తుకృతా యే చ బాలానాం తాంశ్చ నాశయేత్,
యోనిదోషం రజోదోషం శ్వేతం నీలం సపీతకమ్. 94

స్త్రీణాం శ్యావారుణం యచ్చ ప్రసహ్య వినివర్తయేత్,
చూర్ణం పుష్యానుగం నామ హితమాత్రేయపూజితమ్. 95

(ఇతి పుష్యానుగచూర్ణమ్).

వ్యా. చిరుబొద్ది, నేరేడుపప్పు, మామిడిపప్పు, శిలాజితు, రసాంజనము, బలుసు, బూరుగుబంక, మంజిష్ఠి, కొడిసెపాలపట్ట, కుంకుమపువ్వు, అతివస, మారేడుపట్ట, తుంగ గడ్డలు, లొద్దుగుపట్ట, కావిరాయి, దుండిలముపట్ట, మిరియాలు, శుంఠి, ద్రాక్షపండు, రక్తచందనము, లేకుచెట్టుపట్ట, కొడిసెపాలగింజలు, తీటకసివింద, ఆరెపువ్వులు, అతిమధురము, కడిమిపట్ట అనునీయోషధుల నన్నిటిని పుష్యమాసమునందలి పుష్యనక్షత్రమునాడు సమభాగములుగ గ్రహించి మిక్కిలి సూక్ష్మచూర్ణముగ జేసి (వస్త్రగళితముచేసి) బియ్యపుకడుగులో కలిపి, అందు కొంచెము తేనెను కలిపి త్రాగవలెను.

ఈచూర్ణోపయోగమువలన అర్శస్సులయందును అతిసారములయందును వెడలు రక్తస్రావంబును, బాలురకు దోషములచేనైనను ఆగంతుకారణములచేనైనను సంభవించు రోగములును శమించును. మరియు స్త్రీలకు సంభవించు యోనిరోగంబులును, శ్వేతవర్ణంబును, నీలవర్ణంబును, పీతవర్ణంబును, శ్యామవర్ణంబును, అరుణవర్ణంబును నైన రజోదోషంబును ఇవి యన్నియు పూర్తిగ నివర్తించును. ఇయ్యది పుష్యానుగచూర్ణమని యాత్రేయమహర్షిచే మిగుల ప్రశస్తముగ కొనియాడబడినది. కావున పైజెప్పిన వ్యాధులన్నిటియందును మిక్కిలి హితకరముగ నుండును.

ఇచ్చట పాఠ, అంబష్ఠాశబ్దములు ఏకవస్తువునకు పర్యాయనామములుగ నున్నను వానిలో రెండుభేదములుగ నుండువానిని గ్రహింపవలెనని "పాఠేత్యాదౌ అంబష్ఠా పాఠాభేదః." అనువాక్యముచే చక్రపాణి వివరించెను. మరియు ఏకవస్తువాచకములైన పర్యాయపదములు ఒక్కయోగముననే రెండుసారులు నిర్దేశించినయెడ అట్టిద్రవ్యమును రెట్టింత (ద్విగుణముగ) గ్రహింపవలెననియు చెప్పి, ఈవిషయమున ప్రమాణవచనము నిట్లుచూపిరి:—"ఘృతే తైలే చ యోగేచ యద్ద్రవ్యం పునరుచ్యతే, భాగతో ద్విగుణం తద్ధి గ్రహణీయం మనీషిభిః." మరియు "బాహ్లీకం-కుంకుమం" అనివ్యాఖ్యానముచేసిరి. కావున బాహ్లీకశబ్దముచే కుంకుమపువ్వు గ్రహింపదగును. మరియు ఈయోషధులను పుష్యయోగమునాడు గ్రహించినచో నదృష్టరూపమైన ప్రభావముచే దోషనివర్తకమగునని "పుష్యేణోద్ధృత్య తుల్యాని" అనువాక్యముచే తంత్రకారు లుపదేశించిరి.

## రక్తప్రదరహరములగు కొన్ని యోగములు.

మూ. తణ్డులీయకమూలం తు సక్షౌద్రం తణ్డులామ్బునా,
రసాఞ్జనం చ లాక్షాం చ ఛాగేన పయసా పిబేత్. 96
పత్రకల్కౌ ఘృతే భృష్టౌ రాజాదనకపిత్థయోః,
పిత్తాఽనిలహరౌ పైత్తే సర్వథైవాస్రపిత్తజిత్. 97
మధుకం త్రిఫలాం లోధ్రం ముస్తం సౌరాష్ట్రికాం మధు,
మద్యైర్నిమ్బగుడూచ్యౌ వా కఫజేఽసృగ్దరే పిబేత్. 98

వ్యా. చిఱ్ఱివేళ్లను నూరి బియ్యపుకడుగునీళ్లలో కలిపి అందు తేనె కూర్చి యోని రోగములయందును రక్తప్రదరమునందును త్రాగవలెను. మరియు రసాంజనమును లక్కను మేకపాలతో నూరి త్రాగినను హితముగ నుండును. మెరళియాకునైనను వెలగాకునైనను కల్కముచేసి నేతితో వేయించి సేవించిన పిత్తవాతములచే కల్గిన ప్రదరముల హరించును. కేవల పిత్తముచే కల్గిన రక్తప్రదరమునందు రక్తపిత్తమునకు జెప్పిన చికిత్సలన్నియు హితకరములు. అతిమధురము, త్రిఫలములు, లొద్దుగు, తుంగగడ్డలు, సౌరాష్ట్రమృత్తిక (తువరిమన్ను), వీనిని సమభాగములు చూర్ణముచేసి మద్యములో కలిపి కొంచెము తేనెను చేర్చి త్రాగినను, వేపపట్టను తిప్పతీగెను చూర్ణముచేసి మద్యముతో కలిపి త్రాగినను కఫముచే గల్గిన రక్తప్రదరము శమించును.

## పైత్తికరక్తప్రదరమున విరేచనాదిచికిత్స.

మూ. విరేచనం మహాతిక్తం పైత్తికేఽసృగ్దరే పిబేత్,
హితం గర్భపరిస్రావే యచ్చోక్తం తచ్చ కారయేత్. 99

వ్యా. పిత్తముచే గల్గిన రక్తప్రదరమునందు తెగడ మున్నగు విరేచనౌషధములను సేవించుటయు, కుష్ఠచికిత్సితమున జెప్పబడిన మహాతిక్తఘృతమును త్రాగుటయు హితముగ నుండును. మరియు గర్భస్రావమునకు జెప్పబడిన చికిత్సావిధానమంతయు హితముగ నుండును.

ఇచ్చట కుష్ఠచికిత్సితమున "సప్తచ్ఛదం ప్రతివిషాం...హృద్రోగగుల్మపిడకాః అసృగ్దరం గణ్డమాలాం చ హన్యాదేతత్సర్పిః పీతం కాలే యథాబలం సద్యః......మహాతిక్తమ్" (చి. అ. ౭. శ్లో. ౧౪౪—౧౫౦.) అని చెప్పబడిన మహాతిక్తఘృతమును; శారీరస్థానమునందలి జాతిసూత్రీయమున (ఎనిమిదవయధ్యాయమున) జెప్పబడిన గర్భస్రావచికిత్సితమును ఎరుంగునది.

రక్తయోన్యాదియోనిరోగములకు కాశ్మర్యాదిఘృతవస్తివిధి.

మూ. కాశ్మర్యకుటజక్వాథసిద్ధముత్తరవస్తినా,
రక్తయోన్యరజస్కానాం పుత్రఘ్న్యాశ్చ హితం ఘృతం. 100

వ్యా. పెద్దగుమ్ముడును కొడిసెపాలక్వాథమును చేర్చి పక్వముచేయబడిన ఘృతముచేత ఉత్తరవస్తిని ప్రయోగించినయెడ రక్తయోని, అరజస్క, పుత్రఘ్ని యను యోనిరోగములు శమించును.

అరజస్కాయోనిరోగమునకు మృగాదిరక్తపానము.

మూ. మృగాఽజాఽవివరాహాసృగ్దధ్యమ్లఫలసర్పిషా(దధ్యమ్లక్షౌద్ర సర్పి
అరజస్కా పిబేత్సిద్ధం జీవనీయైః పయోఽపి వా. [షా),

వ్యా. అరజస్కయను యోనిరోగమునందు జింక, మేకలు, గొఱ్ఱెలు, పందులు, అనుజంతువుల రక్తమును పెరుగుతోనైనను, దానిమ్మ మున్నగు పండ్లరసముతోనైనను, నేతితోనైనను కలిపి త్రాగవలెను. మరియు జీవనీయగణద్రవ్యముల జేర్చి కాచబడిన పాలనైనను త్రాగుట హితము.

కర్ణిన్యాదియోనిరోగములయం దుత్తరవస్తివిధి.

మూ. కర్ణిన్యచరణాశుష్కాయోనిప్రాక్చరణాసు చ,
కఫవాతే చ దాతవ్యం తైలముత్తరవస్తినా. 102

వ్యా. కర్ణిని, అచరణ, శుష్కయోని, ప్రాక్చరణ అను యోనివ్యాపత్తులయందును, కఫవాతముచే కల్గిన యోనిరోగములయందును పైజెప్పిన జీవనీయగణద్రవ్యముల చేర్చి సిద్ధముచేయబడిన తైలమును ఉత్తరవస్తిప్రయోగముచే నుపయోగింపదగును.

అచరణాయోనిరోగమునకు చికిత్స.

మూ. గోపిత్తే మత్స్యపిత్తే వా క్షౌమం త్రిస్సప్తభావితమ్,
మధునా కిణ్వచూర్ణం వా దద్యాదచరణాపహం. 103
స్రోతసాం శోధనం కణ్డూక్లేదశోఫహరం చ తత్,

వ్యా. పట్టుగుడ్డను గోపిత్తమునందైనను, మత్స్యపిత్తమునందైనను ఇరువదియొక పర్యాయము భావనచేసి యోనియం దుంచినను, సురాబీజమును చూర్ణముచేసి తేనెతో కలిపి యైనను యోనియం దుంచినను అచరణయను యోనిరోగమును హరించును. పైజెప్పిన చికిత్స స్రోతోమార్గమును శుద్ధముగ జేసి, దురదను క్లేదమును శోఫమును హరించును.

### ప్రాక్చరణ-అతిచరణ, అను యోనిరోగముల చికిత్స.

మూ. వాతఘ్నైః శతపాకైశ్చ తైలైః ప్రాగతిచారిణీ. 104
ఆస్థాప్యా చానువాస్యా చ స్వేద్యా చాఽనిలసూదనైః,
స్నేహద్రవ్యైః తథాహారైః ఉపనాహైశ్చ యుక్తితః. 105
శతాహ్వాయవగోధూమకిణ్వకుష్ఠప్రియఙ్గుభిః,
బలాఖుపర్ణికాశ్రాహ్వైః సంయావో ధారణః స్మృతః. 106

వ్యా. ప్రాక్చరణ, అతిచరణ అను యోనిరోగములయందు వాతహరంబును నూరుపర్యాయములు పక్వముచేయబడినవియు నగు తైలములచే ఆస్థాపన - అనువాసన వస్తుల చేసి, వాతహరములగు స్నేహద్రవ్యముల చేతను ఆహారముల చేతను ఉపనాహముల చేతను యుక్తియుక్తముగ స్వేదనమును చేయవలెను. పిదప సదాపవిత్తులు, యవలు, గోధుమలు, సురాబీజము, చెంగల్వకోష్ఠు, ప్రేంకణము, చిట్టాముట్టి, ఎలుకచెవియాకు, టేకు వీనిని నూరి ఆవిరిచే నుడికించి ముద్దచేసి యోనియం దుంచవలెను. దీనిచేత నిలువ కుండు బీజము నిలుచును. (ఇచ్చట 'శ్రాహ్వైః' అనుచోట శ్రీశబ్దముచేత పర్ణికా శబ్దసాహచర్యమునం జేసి 'శ్రీపర్ణికా' యని యన్వయించవలెను. టేకుమ్రాను అని యర్థము.)

### వామిని-ఉపప్లుతయను యోనిరోగముల చికిత్స.

మూ. వామిన్యుపప్లుతానాం చ స్నేహస్వేదాదికః క్రమః,
కార్యః, తతస్స్నేహపిచుః తతస్సన్తర్పణం భవేత్. 107

వ్యా. వామిని, ఉపప్లుత అను యోనిరోగములయందు విధ్యుక్తప్రకారము స్నేహస్వేదాదివిధుల వరుసగ చేసి, పిమ్మట స్నేహముచే తడుపబడిన పిచువును యోనియం దునిచి, పిమ్మట సంతర్పణరూపమైన పరిషేకాదివిధుల చేయవలెను.

### విప్లుతయను యోనిరోగమునకు చికిత్స.

మూ. సల్లకీజిఙ్గినీజమ్బూధవత్వక్పఞ్చవల్కలైః,
కషాయైస్సాధితస్స్నేహః (హా) పిచుస్స్యాత్ విప్లుతాపహః. 108

వ్యా. అందుగుచెట్టుపట్ట, మంజిష్ఠి, నేరేడుపట్ట, చంద్రపట్ట, పంచవల్కలములు (అత్తి, రావి, జువ్వి, మఱ్ఱి, ప్రబ్బలి, ఈయెడిటిపట్టలు), వీని నన్నిటిని చేర్చి కాచబడిన కషాయములచే సిద్ధమైన తైలాదిస్నేహములలో దూదిని తడిపి యోనియం దుంచిన విప్లుతయను యోనివ్యాపత్తును హరించును.

### కర్ణినియను యోనిరోగమున కుష్ఠాదివర్తిధారణము.

మూ. కర్ణిన్యాం వర్తికా కుష్ఠపిప్పల్యర్కాగ్రసైన్ధవైః
బస్తమూత్రకృతా ధార్యా సర్వం చ శ్లేష్మనుద్ధితం, 109

వ్యా. కర్ణినియను యోనిరోగమున చెంగల్వకోష్టు, పిప్పళ్లు, జిల్లేడుచిగుళ్లు, సైంధవలవణము వీని నన్నిటిని గొఱ్ఱెపంచితమున నూరి కణికచేసి యోనియం దుంచవలెను. మరియు శ్లేష్మహరమైన చికిత్సావిధానమంతయు నీరోగమున హితకరమగును.

### ఉదావర్తాదియోనిరోగముల చికిత్స.

మూ. త్రైవృతం స్నేహనం స్వేదః గ్రామ్యానూపౌదకాః రసాః,
దశమూలపయోవస్తిశ్చోదావర్తాఽనిలార్తిషు. 110
త్రైవృతేనానువాస్యా చ వస్తిశ్చోత్తరసంజ్ఞితః,
ఏతదేవ మహాయోన్యాం స్రస్తాయాం చ విధీయతే. 111

వ్యా. ఉదావర్తినియను యోనివ్యాపత్తునందును, వాతముచే కల్గిన రోగమునందును స్నేహనమునకై తెగడను చేర్చి పక్వముచేయబడిన నెయ్యి, నూనె, వస యను స్నేహముల నుపయోగింపనగును. గ్రామములయందలి జంతువులయొక్కయు, జలప్రాంతముననుండు జంతువులయొక్కయు, ఉదకమునందలి జంతువులయొక్కయు మాంసరసములను స్వేదవిధి కుపయోగింపవలెను. దశమూలముల జేర్చి సిద్ధముచేయబడిన పాలచే వస్తికర్మ చేయనగును. తెగడను చేర్చి పక్వముచేయబడిన స్నేహముచే ననువాసనవస్తిని ఉత్తరవస్తిని చేయవలెను.

మరియు మహాయోనియను యోనిరోగమునందును, స్రస్త (స్వస్థానమునుండి జారిన) మాంసముకల మహాయోనివ్యాధియందును పైజెప్పిన తెగడతో గూర్చి సిద్ధముచేయబడిన స్నేహములచేతనే అనువాసనవస్తి-ఉత్తరవస్తుల చేయవలెను.

### మహాయోనిచికిత్స, అందు స్నేహపూరణము.

మూ. వసాబుుక్షవరాహాణాం (వరాహకుక్కుటవసా) ఘృతం చ
మధురైశ్శృతమ్,
పూరయిత్వా మహాయోనిం బధ్నీయాత్ క్షౌద్రలక్తకైః 112

వ్యా. మహాయోనియను రోగమున ఎలుగుబంటియొక్కయు అడవిపందులయొక్కయు వసను ఘృతమును మధురద్రవ్యముల చేర్చి విధిప్రకారము పక్వముచేసి యా స్నేహమును యోనిలో నిండించి పట్టుగుడ్డపేలికచే కట్టుకట్టి యుంచవలెను.

### ప్రస్తయోనికి వేసవారబంధనము.

మూ. ప్రస్రస్తాం సర్పిషాభ్యజ్య క్షీరస్విన్నాం ప్రవేశ్య చ,
బధ్నీయాద్వేశవారస్య పిణ్డేనాఽఽమూత్రకాలతః 113

వ్యా. మరియు పైజెప్పిన మహాయోనివ్యాధియందు యోనిలోని మాంసము బైట వెడలియున్న యెడ ఘృతముచే తడిపి విధ్యుక్తప్రకారము పాలచే స్వేదవిధినిచేసి వెలుపలయుండుమాంసమును లోనికి యుక్తియుక్తముగ స్వస్థానమున జేర్చి మాంసముచే సిద్ధమైన వేశవారపుముద్దను యోనియందునిచి పైజెప్పినరీతిగ పట్టుగుడ్డపేలికచే కట్టుకట్టి మూత్రము వెడలింపవలసిన కాలమువరకు నుంచవలెను. (ఇచ్చట మాంసము అస్థిఖండములులేక యుండునట్లు సిద్ధము చేసినది వేసవారమని యెరుంగునది. మరియు మహాయోని వ్యాధిలక్షణములయందు ఒకవేళ యోని వక్రమై అందుండి మాంసము బైటికివెడలునని చెప్పబడినది. అట్టియోనివ్యాపత్తున సామాన్యము త్రివృత్‌స్నేహముచే ననువాసన-ఉత్తరవస్తుల చేయవలెనని "ఏతదేవ మహాయోన్యాం ప్రస్తాయాం చ విధీయతే" అని నిర్దేశింపబడినది. ప్రస్తావస్థయందు పైజెప్పబడిన ఘృతముసైనను వేసవారముసైనను యోనిని యథాస్థితముగ జేర్చి యందుంచవలెనని విధింపబడినది).

### యోనివ్యాపత్తు లన్నిటియందును వాతశామకచికిత్సావిధి.

మూ యచ్చ వాతవికారాణాం కర్మోక్తం తచ్చ కారయేత్,
సర్వవ్యాపత్సు మతిమాన్ మహాయోన్యాం విశేషతః. 114
న హి వాతాదృతే యోనిః వారీణాం సంప్రదుష్యతి,
శమయిత్వా తమన్యస్య కుర్యాద్దోషస్య భేషజం. 115

వ్యా. యోనివ్యాపత్తు లన్నిటియందును వాతరోగములకు చెప్పినచికిత్సను సామాన్యముగ చేయనగును. అందును హాయోనియందు వ్యాపత్తునందు విశేషముగ చేయవలెను. వాతసంబంధములేక స్త్రీలకు యోనిరోగముకల్గదు. కావున యోనిరోగసామాన్యముగ వాతశామకచికిత్సచే తొలుత వాతము శమింపజేసి పిమ్మట తక్కిన పిత్తకఫములకు దగినచికిత్సావిధానము చేయవలెను.

### రక్తప్రదరరోగమునకు కల్కాదులు.

మూ. రోహీతకాన్మూలకల్కం పాణ్డురేఽసృగ్దరే పిబేత్,
జలే నామలకీబీజం కల్కం వా సతిలామధుమ్. 116

మధునాఽఽమలకాచ్చూర్ణం రసం వా లేహయేచ్చ తాం (లేహ
యేత్స్త్రీతే). 117

న్యగ్రోధత్వక్కషాయేణ లోధ్రకల్కం తథా పిబేత్,
ఆస్రావే క్షౌమపట్టం వా భావితం తేన ధారయేత్. 118

వ్యా. పాండువర్ణమైన రక్తప్రదరరోగమునందు ములుమోదుగవేళ్లను నూరి కల్కముచేసి త్రాగవలెను. ఉసిరికకాయపప్పులను నువ్వులను నీళ్లతో నూరి కల్కము చేసి, అందు తేనె కలిపి త్రాగవలెను. నెల్లికాయల చూర్ణముసైనను రసముసైనను తేనెలో కలిపి సేవించవలెను. మఱ్ఱిపట్టకషాయమున లొద్దుగుపట్టచూర్ణమును కలిపి త్రాగవలెను. అట్టిరక్తము అధికముగ స్రవించుచున్నయెడ పట్టుగుడ్డను పైజెప్పిన మఱ్ఱిపట్ట కషాయమున పలుమారు తడిపి భావనచేసి యోనియం దుంచవలెను.

## రక్తప్రదరమున స్రావమునిలచుటకు చికిత్స.

మూ. ప్లక్షత్వక్చూర్ణపిణ్డం వా ధారయేన్మధునా కృతం,
యోన్యాం స్నేహాక్తయా లోధ్రప్రియఙ్గుమధుకస్య వా. 119
ధార్యా మధుకృతా వర్తిః కషాయాణాం చ సర్వశః,
స్రావచ్ఛేదార్థమభ్యక్తాం ధూపయేద్వా ఘృతాప్లుతైః. 120
సరళాగుగ్గులుయవైః సతైలకటుమత్స్యకైః,

వ్యా. మరియు పైజెప్పిన ప్రదరమునందు స్త్రీయొక్క యోనికి స్నేహములచే నభ్యంగనముచేసి (పూసి) పిదప జువ్విపట్టచూర్ణమును తేనెలో కలిపి ముద్దచేసి యోనియం దుంచునది. లేక లొద్దుగుపట్ట, ప్రేంకణపుచెట్టుపట్ట, అతిమధురము, అత్తి, మఱ్ఱి మున్నగు పగరుకల చెట్లయొక్కపట్టలు, వీని నన్నిటిని తేనెతో నూరి వర్తి (కణిక) జేసి యోనిలో ధరించవలెను. మరియు రక్తస్రావము నిలచుటకు చమురుచే యోనిలో పూసి దేవదారు బంకను, గుగ్గిలమును, యవలను, చేదుగనుండు శఫరి (పక్కెలు) అనుమత్స్యములను చూర్ణముచేసి, నేతిలోను నూనెలోను తడిపి దానిచే పొగబట్టవలెను.

## యోనిపైచ్ఛిల్యనివర్తక కాసీసాదిచూర్ణము.

మూ. కాసీసం త్రిఫలా కాఙ్క్షీ సమఙ్గామ్రాస్థిధాతకీ. 121
పైచ్ఛిల్యే క్షౌద్రసంయుక్తః చూర్ణో వైశద్యకారకః,

వ్యా. కాసీసము (అన్నభేది), త్రిఫలములు, తువరిమన్ను, మంజిష్ఠి, మామిడి పప్పు, ఆరెపువ్వు, వీని నన్నిటిని సమభాగములుగ చూర్ణముచేసి తేనెలో కలిపి యుప యోగించినచో పిచ్ఛిలముగ (జిగటకల్గి) నుండు యోని జిగటమానును.

ప్రదరమున స్రావమునుబంధించు పలాశాదిచూర్ణము.

మూ. పలాశసర్జజమ్బ్వాత్వక్ సమజ్ఞామోచధాతకీ. 122
సపిచ్ఛిలా పరిక్లిన్నా_స్తమ్భనః కల్క_ ఇష్యతే,

వ్యా. మోదుగపట్ట, వేగిపట్ట, నేరేడుపట్ట, మంజిష్ఠి, మోచరసము, ఆరెపువ్వు, వీనిని సమభాగములుగగూర్చి కల్కముచేసి యుపయోగించిన పిచ్ఛిలమై స్రవించు రక్తమును బంధించును.

కర్కశయోనిమృదూకరణోపాయము.

మూ. స్తబ్ధానాం కర్కశానాం చ కార్యం మార్దవకారకమ్. 123
ధారయేద్వేసవారం వా పాయసం కృసరం తథా,

వ్యా. మరియు యోనిరోగములయందు యోని స్తంభించి కఠినముగ నున్నపుడు వేసవారముగానైనను, పాయసముగానైనను, కృసరముగానైనను యోనిలో ధరించినయెడ యోని మెత్తబడును.

యోనిదుర్గంధనివర్తనచికిత్స.

మూ. దుర్గన్ధానాం కషాయస్స్యాత్తౌవరః కల్క_ ఏవ వా. 124
చూర్ణం వా సర్వగన్ధానాం పూతిగన్ధాపకర్షణం,

వ్యా. యోనిదుర్గంధముగనుండునపుడు నీరుదుగింజల కషాయముగానైనను, కల్కముగానైనను, పలువిధములైన సుగంధద్రవ్యముల చూర్ణముగానైనను యోనిలో ధరించినయెడ దుర్గంధము నివర్తించును.

నిర్దుష్టయోనికి గర్భము కల్గుననుట.

మూ. ఏవం యోనిషు శుద్ధాసు గర్భం విన్దన్తి యోషితః. 125
అదుష్టే ప్రాకృతే బీజే జీవోపక్రమణే సతి,

వ్యా. పైజెప్పబడిన చికిత్సావిధానముచేత పైజెప్పిన యోనివ్యాపత్తులన్నియు శమించి యోని పరిశుద్ధమై నిర్దుష్టముగనుండి, శుక్రశోణితరూపమైన బీజంబును నిర్దు

ష్టమై స్వాభావికముగ నుండవలసిన గుణములుకల్గి, పూర్వజన్మకృత సుకృతపరిపాకవిశేషము జీవమును కల్గింప ననుకూలముగ నుండునెడ ఆట్టిస్త్రీ గర్భమునుధరించును. (ఇచ్చట గర్భధారణమునకు క్షేత్రమైనస్త్రీలయోనియు, బీజరూపమైనశుక్రార్తవంబులును నిర్దిష్టముగనున్నను స్త్రీ పురుషులకు పూర్వజన్మకృత కర్మవాసనావిశేషము గర్భోత్పాదనమున కనుగుణముగనున్నగాని గర్భధారణము కల్గనేరదని "జీవోపక్రమణే సతి" అను వాక్యముచే తంత్రకారు లుపదేశించిరి.)

## శుక్రదోషచికిత్సాసంగ్రహము.

మూ. పఞ్చకర్మవిశుద్ధస్య పురుషస్యాపి చేన్ద్రియమ్. 126
పరీక్ష్య వర్ణైర్దోషాణాం దుష్టం తద్ఘ్నైః ఉపాచరేత్,

వ్యా. వమనవిరేచనాది సంశోధనపంచకర్మములచే శుద్ధశరీరుడగు రోగియొక్క యింద్రియమును (శుక్రమును) చక్కగ పరీక్షించి, అయ్యది తెలుపు నలుపు మున్నగు రంగులు కల్గియున్నయెడ వాతాదిదోషములచే దుష్టమైనదని యెరింగి, ఆయాదోషముల హరించు చికిత్సలచే నుపచరించవలెను.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—స్త్రీయొక్క శోణితంబును యోనియు గర్భాశయంబును, పురుషునియొక్క శుక్రంబును దోషదుష్టము కాకయుండినచో ఆట్టిస్త్రీపురుషుల పరస్పరసంగమముచే నుత్పన్నమైన శుక్రశోణితము లొండొంట కలిసి గర్భాశయమున ప్రవేశించిన నయ్యది గర్భోత్పత్తికి కారణమగునని శారీరస్థానమున "పురుషస్య అనుపహతరేతసః స్త్రియాశ్చ అప్రదుష్టయోని-శోణితగర్భాశయాయాః యదా భవతిసంసర్గః......తదా గర్భో భవతి" (శా. అ.౩. సూ. ౩.) అనువాక్యముచే చెప్పబడినది. తదనుసారముగ గర్భోత్పత్తికి విఘాతుకమైన యోనిదోషములును, వానిచికిత్సితంబును పైని వివరింపబడినవి. పిదప గర్భోత్పత్తికి ఘాతుకమైన శుక్రదోషములును, వానిచికిత్సితంబును పైశ్లోకముచే సంగ్రహముగ చెప్పబడినది.

భవన్తి చాత్ర:—

మూ. సలిఙ్గా వ్యాపదో యోనేః సనిదానచికిత్సితాః. 127
ఉక్తా విస్తరశః సమ్యక్ మునినా తత్వదర్శినా,

వ్యా. ఇత్తెరంగున యోనివ్యాపత్తులు ఇరువదియును వానివాని లక్షణముల తోడను చికిత్సలతోడను తత్వజ్ఞానియగు ఆత్రేయమహర్షిచేత విపులముగ చర్చించి చక్కగ వివరింపబడినవి.

### శుక్రదోషములనుద్దేశించి యగ్నివేశుని ప్రశ్నములు.

మూ. పునరేవాగ్నివేశస్తు పప్రచ్ఛ భిషజాం వరమ్,
ఆత్రేయముపసఙ్గమ్య శుక్రదోషాంస్త్వయానఘ. 128
రోగాధ్యాయే సముద్దిష్టా హ్యష్టౌ పుంసామశేషతః,
తేషాం హేతుం భిషక్ఛ్రేష్ఠ! దుష్టాఽదుష్టస్య చాకృతిం. 129
చికిత్సితం చ కార్త్స్న్యేన క్లైబ్యం యచ్చ చతుర్విధమ్,
ఉపద్రవేషు యోనీనాం ప్రదరో యశ్చ కీర్తితః. 130
తేషాం నిదానం లిఙ్గం చ చికిత్సాం చైవ తత్త్వతః, 131
సమాసవ్యాసభేదేన ప్రబ్రూహి (బ్రూహి నో) భిషజాం వర!,
తస్మై శుశ్రూషమాణాయ ప్రోవాచ మునిపుఙ్గవః. 132

వ్యా. అగ్నివేశులు పైజెప్పబడిన (గర్భోత్పత్తికి విఘాతుకములగు) యోనివ్యాపత్తులయొక్క లక్షణచికిత్సితముల జక్కగ విని మరల నాత్రేయుల నుద్దేశించి నమస్కరించి యిట్లడుగందొడంగెను:—"వైద్యవరుడగు నోగురువర్యా! రోగాధ్యాయమున శుక్రదోషములు పురుషులకు ఎనిమిదివిధములుగ సంభవించునని మీచే నిర్దేశింపబడినవి. అట్టి శుక్రదోషములు జనించుటకు కారణంబులును, దుష్ట-అదుష్టశుక్రలక్షణంబులును, వానిచికిత్సితమును, నాల్గుతెరంగులైన క్లీబత్వ (నపుంసకత్వ)మును, వానిచికిత్సితమును, యోనిరోగముల కుపద్రవముల నిర్దేశించునపుడు—"తస్మాద్గర్భం న గృహ్ణాన్తి...... గుల్మార్శః ప్రదరాదీంశ్చ" అని నిర్దేశింపబడిన ప్రదరరోగముయొక్క నిదాన-లక్షణ-చికిత్సితంబులును వీని నన్నిటిని సంగ్రహముగను విస్తరముగను వినగోరెద చెప్పుము" అని యగ్నివేశులడుగ వాని నన్నిటిని ఆత్రేయు లిట్లు వివరించి చెప్పందొడంగెను. (అష్టోదరీయాధ్యాయమున "అష్టౌ రేతో దోషాః......అవసాది చేతి" (సూ. అ. ౧౯. సూ. ౭) అని నిర్దేశింపబడిన శుక్రదోషముల నెరుంగునది.)

ఇచ్చట శుక్రదోషములు వాజీకరణముచేతనే చికిత్సజేయదగియుండును కావున వాజీకరణాధ్యాయముచేతనే శుక్రదోషచికిత్సితము గతార్థము. క్లైబ్యము, దానిభేదములును, శారీరమున ("కస్మాద్ద్విరేతాః పవనేన్ద్రియో వా......ఇత్యేవమష్టౌ వికృతిప్రకారాః కర్మాత్మకానాముపలక్షణీయాః." (శా. అ. ౨. శ్లో. ౧౭—౨౧.) అను గ్రంథముచేత) నిర్దేశింపబడినవి. ప్రదరంబును దానిచికిత్సయు యోనివ్యాపచ్చికిత్సావ

సరముననే ("రోహీతకాన్మూలకల్కం పాణ్డురేఽసృగ్ధరే పిబేత్." అని యుపక్రమించి) వివరింపబడినది. కావున నీవిషయముల వివరించుచు "పునరేవాఽగ్నివేశస్తు" అని యుపక్రమించి చెప్పబడినగ్రంథము అనార్షమని కొందరాచార్యులు చెప్పెదరు. మరికొందరు పైజెప్పిన విషయములు ఇంతకుమున్ను సంగ్రహముగ జెప్పి, వానినే వివరించి చెప్పుటకై తంత్రకారులు చెప్పిరికావున అనార్షము కాదని చెప్పెదరు. ఈవివరణమును చక్రపాణిదత్తుడు నిరూపించి "ఏవమస్యార్షత్వవివాదేఽపి కాశ్మీరాదిదేశానుమతత్వాత్ కిఞ్చిద్వ్యాకరణం కుర్మః"అని వ్రాసిరి. ఈవాక్యమును పరికించినచో చక్రపాణివ్యాఖ్యానమునకు ముందుగనే యీయార్షానార్షవిచారము కాశ్మీరాదిదేశపాఠభేదములయం దున్నదని స్పష్టమగుచున్నది. విజ్ఞులు గమనించెదరుగాత!

### పురుషునిశుక్రము గర్భోత్పత్తికి బీజమనుట.

మూ. బీజం యస్మాత్ వ్యవాయే తు (షు) హర్షయోనిసముత్థితం,
శుక్రం పౌరుషమిత్యుక్తం తస్మాద్వక్ష్యామి తచ్ఛృణు 133

వ్యా. స్త్రీసంభోగకాలమున హర్షాతిశయమును కారణముగజేసి పుట్టినశుక్రము గర్భమునకు పురుషచిహ్నములకు కారణమైయుండునని చెప్పబడినది. కావున పురుషుని శుక్రంబును గర్భోత్పత్తికి హేతువగును. కావున అట్టి శుక్రమునకు సంబంధించిన గుణదోషాదుల వివరించెద వినుము.

### దుష్టశుక్రము గర్భోత్పాదకసమర్థము కాదనుట.

మూ. యథా బీజమకాలామ్బుక్రిమికీటాదిదూషితం,
న విరోహతి సన్దుష్టం తథా శుక్రం శరీరిణామ్. 134

వ్యా. లోకమున అకాలమున నాటబడినవిత్తనంబును, జలము, పురుగులు మున్నగు వానిచే చెరుపబడిన విత్తనంబును మొలచుటకు సమర్థముకాక చెడును. అత్తెరంగుననే ఈక్రింద చెప్పబడు అతివ్యవాయాదికారణములచే చెడినశుక్రంబును గర్భోత్పాదనసమర్థము కానోపదు.

### శుక్రము చెడుటకు కారణములు.

మూ. అతివ్యవాయాత్ వ్యాయామాత్ అసాత్మ్యానాం చ సేవనాత్,
అకాలే వాఽప్యయోనౌ వా మైథునం న చ గచ్ఛతః. 135

రూక్షతిక్తకషాయాఽతిలవణామ్లోష్ణసేవనాత్,
నారీణామరసజ్ఞానాం గమనాత్ జరయా తథా. 136
(నారీణామరసజ్ఞత్వాత్ స్రవణాత్ జరయా తథా),
చిన్తాశోకాదవిస్రమ్భాత్ శస్త్రక్షారాగ్నివిభ్రమాత్,
భయాత్క్రోధాదభీచారాత్ (అతీసారాత్) వ్యాధిభిఃకర్శితస్యచ.
వేగాఘాతాత్ క్షతాచ్చాపి ధాతూనాం సంప్రదూషణాత్,
దోషాః పృథక్ సమస్తా వా ప్రాప్య రేతోవహాస్సిరాః. 138
శుక్రం సన్దూషయన్త్యాశు తద్వక్ష్యామి విభాగశః,

వ్యా. మైథునము నధికముగ (తనశక్తికి మిక్కుటముగ) చేయుట, దేహపరిశ్రమము నధికముగచేయుట, తనకు సాత్మ్యములుకాని యాహారవిహారాదుల సేవించుట, అకాలమునందైనను, ఇతరయోనుల (పశ్వాదిజంతుయోనుల) యందైనను మైథునము సేయుట, మైథునార్హమైన వయసున బొత్తుగ మైథునము సేయకుండుట, (శుక్రమును నిరోధించుట) రూక్షగుణంబును తిక్త-కషాయ-లవణ - అమ్లరసంబులును ఉష్ణగుణంబును అధికముగకల ద్రవ్యములను అధికముగ సేవించుట, శృంగారాదిరసముల దెలియక మూఢలైనస్త్రీలతో రమించుట, ముసలితనము, చింత, శోకము, విశ్వాసము లేనిస్త్రీలతో రమించుట, భయము, క్రోధము, అభిచారము (మంత్రతంత్రాదిక్రియలు), (లేక అతిసారము), శస్త్రక్షార-అగ్నికర్మలను వ్యస్తముగ నాచరించుట, జ్వరాదిరోగములచే శరీరము కృశించుట, శుక్రవేగమును నిరోధించుట, క్షతము (శుక్రము వెడలుమార్గమున గాయము తగులుట), రసాదిధాతువులు చెడుటకు కారణములైనవాని నాచరించుట, ఈకారణముల చేత వాతాదిదోషములు వేరువేరుగనైనను అన్నియు కలిసియైనను ప్రకోపమునొంది శుక్రమును వహించుసిరలను చేరి వెంటనే శుక్రమును చెరచును. వానిలక్షణాదులను వేరువేరుగ విస్తరించి అట్టి దుష్టశుక్రమును వాతాదిదోషవిభాగపూర్వకముగ జెప్పెద.

### ఎనిమిది శుక్రదోషములు.

మూ. ఫేనిలం తను రూక్షం చ వివర్ణం పూతి పిచ్ఛిలమ్. 139
అన్యధాతూపసంసృష్టం అవసాది తథాష్టమమ్,

వ్యా. ఫేనిలము (నురుగుతో కూడియుండుట), తను (పలుచబడియుండుట), రూక్షము (జిడ్డులేక శుష్కించియుండుట), వివర్ణము (స్వాభావికమైన శ్వేతవర్ణము మారి నీలపీతాదివర్ణములు కల్గియుండుట), పూతి (దుర్గంధముకల్గియుండుట), పిచ్ఛిలము

(మిక్కిలి జిగటకల్గియుండుట), ఇతరములగు రసరక్తాదిధాతువులతో కలిసియుండుట, అవసాది (వాతముచే నిరుద్ధమై కష్టముగ వెడలుట), అనునవి యెనిమిదియు వాతాది దోషసంబంధమున గల్గు శుక్రదోషములు.

### వాతదుష్టశుక్రలక్షణము.

మూ. ఫేనిలం తను రూక్షం చ కృచ్ఛ్రేణాల్పం చ మారుతాత్. 140
భవత్యుపహతం శుక్రం న తత్ గర్భాయ కల్పతే,

వ్యా. వాతముచే చెడిన శుక్రము ఫేనిలమై పలుచబడి రూక్షమైయుండును. మిక్కిలి కష్టముచే స్వల్పముగ వెడలును. ఇయ్యది గర్భోత్పత్తికి సమర్థము కానోపదు.

### పిత్తదుష్టశుక్రలక్షణము.

మూ. సనీలమథ వా పీతం అత్యుష్ణం పూతిగన్ధి చ. 141
దహల్లిఙ్గం వినిర్యాతి శుక్రం పిత్తేన దూషితం,

వ్యా. పిత్తముచే దుష్టమైన శుక్రము నీలవర్ణమైనను పీతవర్ణమైనను కల్గి మిక్కిలి వేడితో గూడి దుర్గంధమై లింగమును దహించునట్లు మంటతో గూడి వెడలును.

### కఫదుష్టశుక్రలక్షణము.

మూ. శ్లేష్మణా బద్ధమార్గం తు భవత్యత్యర్థపిచ్ఛిలమ్. 142

వ్యా. కఫముచే శుక్రమును వెడలించుమార్గము అడ్డగింపబడినపుడు శుక్రము (అట్టి శ్లేష్మసంబంధమునం జేసి) మిక్కిలి జిగట కల్గి యుండును.

### అభిఘాతజశుక్రదోషము.

మూ. స్త్రీణామత్యర్థగమనాత్ అభిఘాతాత్ క్షతాదపి,
శుక్రం ప్రవర్తతే జన్తోః ప్రాయేణ రుధిరాన్వయమ్. 143

వ్యా. అధికముగ స్త్రీలతో రమించినను, గుహ్యమునం దభిఘాతము కల్గినను, గాయమైనను, మనుజునకు శుక్రము ప్రాయికముగ రక్తముతో కూడి వెడలును.

### అవసాదిశుక్రదోషము.

మూ. వేగసన్ధారణాచ్ఛుక్రం వాయునా విహతం పథి,
కృచ్ఛ్రేణ యాతి గ్రథితం అవసాది తథాఽష్టమమ్. 144
ఇతి దోషాస్సమాఖ్యాతాః శుక్రస్యాష్టౌ సలక్షణాః,

వ్యా. శుక్రము వెడలనున్నపుడు వెడలనీయక నిరోధించినచో శుక్రము వెడలు మార్గమునసే వాతముచే నిరోధింపబడి గ్రంథిరూపమై చిరకాలమునకు బైటవెడలును. ఇయ్యది అవసాదియను యెనిమిదవ శుక్రదోషము. ఇత్తెరంగున శుక్రదోషము లెనిమిదియు నుద్దేశప్రకారము వివరింపబడినవి.

## నిర్దుష్టశుక్రలక్షణము.

మూ. స్నిగ్ధం ఘనం పిచ్ఛిలం చ మధురం చాఽవిదాహి చ. 145
రేతశ్శుద్ధం విజానీయాత్ శ్వేతం స్ఫటికసన్నిభం,

వ్యా. పరిశుద్ధమైన శుక్రము స్నిగ్ధముగను, పిచ్ఛిలముగను, చిక్కనైయుండును, తీపికల్గియు, మంట లేకయు, శుద్ధస్ఫటికమును బోలె శ్వేతవర్ణంబు నైయుండును. (ఇట్టి లక్షణములు కలశుక్రము దోషరహితమని యర్థము). ఇచ్చట శుక్రప్రసంగవశముచే శుద్ధశుక్రస్వరూపంబును చెప్పబడినది.

## శుక్రదోషసామాన్యచికిత్స.

మూ. వాజీకరణయోగైస్తైః ఉపయోగసుఖైర్హితైః. 146
రక్తపిత్తహరైర్యోగైః యోనివ్యాపదికైస్తథా,
దుష్టం యదా భవేచ్ఛుక్రం తదా తత్ సముపాచరేత్. 147
ఘృతం చ జీవనీయం యత్ చ్యవనప్రాశ ఏవ చ,
గిరిజస్య ప్రయోగశ్చ రేతోదోషా నపోహతి. 148

వ్యా. పైజెప్పినరీతిగ శుక్రము దుష్టమైనపుడు ఉపయోగించుటకు సుఖముగ నుండునవియు, హితకరంబులును నగు వాజీకరణయోగములచేతను, రక్తపిత్తహరములగు యోగములచేతను, యోనివ్యాపత్తుకు చెప్పబడిన యోగముల చేతను ఉపచరించవలెను. మరియు జీవనీయఘృతమును, చ్యవనప్రాశరసాయనమును, శిలాజతుప్రయోగంబును శుక్రదోషముల హరించును.

## వాతాదిదుష్టశుక్రచికిత్సావిధానము.

మూ వాతాఽన్వితే హితాశ్శుక్రే నిరూహాస్సానువాసనాః,
అభయామలకీయం చ పైత్తే శస్తం రసాయనమ్. 149
(బ్రాహ్మామలకీయం చ పైత్తే శస్తం విరేచనమ్,)

మాగధ్యమృతలోహానాం త్రిఫలాయా రసాయనం,
కఫోత్థితం శుక్రదోషం హన్యాద్భల్లాతకస్య చ. 150

వ్యా. శుక్రము కఫముచే దుష్టమైనపుడు నిరూహ-అనువాసనవస్తులను విధ్యుక్త ప్రకారము ప్రయోగింపవలెను. పిత్తముచే దుష్టమైనపుడు రసాయనప్రథమపాదమున ("అథామలకవిభీతకీనాం" అని యుపక్రమించి చెప్పబడిన) అభయామలకీయరసాయనయోగముల నుపయోగించుట చాల ప్రశస్తము. (లేక బ్రాహ్మ-ఆమలకరసాయనముల నుపయోగించుటయు, విరేచనము చేయించుటయు ప్రశస్తము). కఫముచే కల్గిన శుక్రదోషమున పిప్పలిరసాయనమును, అమృత (ఆమలక) రసాయనమును, లోహరసాయనమును, త్రిఫలరసాయనమును, భల్లాతక రసాయనమును ఉపయోగించినచో శమించును. ఈరసాయనయోగము లన్నియు రసాయనాధ్యాయమున (చి.౧ అధ్యాయమున) చూచునది.

## అన్యధాతుసంసృష్టశుక్రదోషచికిత్స.

మూ. యదన్యధాతుసంసృష్టం శుక్రం తద్వీక్ష్య యుక్తితః,
యథాదోషం ప్రయుఞ్జీత దోషధాతుభిషగ్జితమ్. 151

వ్యా. శుక్రము తదితరములైన రక్తాదిధాతువులతో గూడియున్నయెడ చక్కగ గమనించి సంసృష్టలగు ధాతువులకును వాతాదిదోషములకును తగినట్లు యుక్తియుక్తముగ చికిత్సచేయనగును.

## శుక్రదోషసామాన్యముగ హితములు.

మూ. సర్పిః పయో రసాః శాలిః యవగోధూమషష్టికాః,
ప్రశస్తాః శుక్రదోషేషు వస్తికర్మ విశేషతః. 152

వ్యా. నెయ్యి, పాలు, మాంసరసములు, రాజనములబియ్యపుటన్నము, యవలు, గోధుమలు, అరువదినాళ్లసంబావులు, ఇవియన్నియు శుక్రదోషము లన్నిటియందును మిగుల ప్రశస్తములు. వస్తికర్మ చేయుటయు అన్నిటికన్న మిగుల ప్రశస్తము.

మూ. ఇత్యుష్టశుక్రదోషాణాం మునినోక్తం చికిత్సితం,
రేతోదోషోద్భవం క్లైబ్యం యస్మాచ్ఛుద్ధ్యైవ సిద్ధ్యతి. 153

తతో వక్ష్యామి తే సమ్యక్ అగ్నివేశ యథాతథమ్,

వ్యా. ఇత్తెరంగున నెనిమిదివిధములైన శుక్రదోషంబులును వానిచికిత్సలును వేరువేరుగ చెప్పబడినవి. అట్టిశుక్రదోషముచే కల్గిన నపుంసకత్వము శుక్రము పైజెప్పిన చికిత్సితముచే శుద్ధమైనయెడ నివర్తించును. పిదప క్లీబలక్షణము నీక్రింద వివరించెద.

## క్లైబ్యసామాన్యనిదానము.

మూ. బీజధ్వజోపఘాతాభ్యాం జరయా శుక్రసంక్షయాత్. 154

క్లైబ్యం సమ్పద్యతే తస్య శ్రుణు సామాన్యలక్షణం,

వ్యా. బీజోపఘాతముచేతను, మేఢ్రము శిథిలమగుటచేతను, ముసలితనముచేతను, శుక్రము క్షీణించుటచేతను క్లీబత్వము సంభవించును. (పైని చెప్పిన నాల్గుకారణభేదములచే క్లీబత్వము నాల్గుతెరంగు లగునని భావము). దానిసామాన్యలక్షణమును వినుము.

## క్లైబ్యసామాన్యలక్షణము.

మూ. సఙ్కల్పప్రవణో నిత్యం ప్రియాం వశ్యామపి స్త్రియమ్. 155

న యాతి లిఙ్గశైథిల్యాత్ కదాచిద్యాతి వా యది,

శ్వాసార్తః స్విన్నగాత్రశ్చ మోఘసఙ్కల్పచేష్టితః. 156

మ్లానశిశ్నశ్చ నిర్వీర్యః (నిర్బీజః) స్యాదేతత్ క్లైబ్యలక్షణం,

సామాన్యలక్షణం హ్యేతత్ విస్తరేణ ప్రచక్ష్యతే. 157

వ్యా. క్లైబ్యముచే బాధితుడైనమనుజుడు నిత్యంబును స్త్రీసంభోగవిషయకములగు సంకల్పము (కోరిక)లు కల్గి, తనకు వశ్యురాలైన స్త్రీ సన్నిహితముగ నున్నను, లింగ మున్నతిజెందక శిథిలమై యుండుటవలన స్త్రీతో సంభోగము చేయనేరడు. ఒకవేళ రమించినను వానికి శ్వాసమధికమై యొడలెల్ల చెమట పుట్టును. తాను సంకల్పించిన విధముగ సంభోగము చేయ సామర్థ్యము లేక తాను కోరిన కోరికలన్నియు వ్యర్థమై శిశ్నము బిగిచెడి శుక్రము పాడమక నిశ్చేష్టితమగును. ఇది నపుంసకత్వమునకు సామాన్యలక్షణము. విశేషలక్షణము లీక్రింద వేరువేరుగ వివరింపబడును.

## 1. బీజోపఘాతజక్లైబ్యనిదాన-లక్షణములు.

మూ. శీతరూక్షాల్పసంక్లిష్టవిరుద్ధాజీర్ణభోజనాత్,

(విషమాఽసాత్మ్యభోజనాత్,)

శోకచిన్తాభయత్రాసాత్ స్త్రీణాం చాత్యర్థసేవనాత్. 158

అభిచారాదవిస్రమ్భాత్ రసాదీనాం చ (వాతాదీనాంచ)సంక్షయాత్,

వాతాదీనాం చ వైషమ్యాత్ తథైవాఽనశనాత్ శ్రమాత్. 159

నారీణామరసజ్ఞత్వాత్ పఞ్చకర్మాపచారతః,
బీజోపఘాతాద్భవతి పాణ్డువర్ణస్సుదుర్బలః. 160
అల్పప్రాణోఽల్పహర్షశ్చ ప్రమదాసు భవేన్నరః,
హృత్పాణ్డురోగతమకకామలాశ్రమపీడితః. 161
ఛర్ద్యతీసారశూలార్తః కాసజ్వరనిపీడితః.
బీజోపఘాతజం క్లైబ్యం,

వ్యా. శీతవీర్యంబులును రూక్షగుణంబులును కల పదార్థముల భుజించుట, తనకు వలసినపరిమితికన్న స్వల్పముగ భుజించుట, క్లిష్ట (చెడిన) పదార్థములను, విరుద్ధపదార్థములను భుజించుట, అజీర్ణపదార్థముల భుజించుట, లేక జీర్ణము కాకుండునపుడు మరల భుజించుట, శోకము, చింత, భయము, మనసుకుద్వేగము, స్త్రీసంభోగమును మితిమీరి యాచరించుట, దుష్టములగు మంత్రతంత్రాదిప్రయోగములు, రసాదిధాతువులు క్షీణించుట, (లేక వాతాదిదోషములు క్షీణించుట),) చనవులేనిస్త్రీలతో రమించుట, వాతాది దోషములు విషమములగుట, ఆహారమును భుజించకుండుట, శరీరమునకు శ్రమమును కల్గించుపనుల నధికముగ జేయుట, తాను రమించునట్టిస్త్రీలు రసజ్ఞత లేక మూఢులుగ నుండుట, వమనాదిపంచకర్మములను విధివిపరీతముగ జేయుట, (లేక అట్టి పంచకర్మముల జేసికొనినపుడు పథ్యసేవనాదినియమముల వ్యత్యస్తముగ జేయుట), ఈకారణములచే బీజరూపమైన శుక్రము చెడును. దానంజేసి మనుజునిశరీరము పాండువర్ణమగును. శరీరబలను నశించును. శుక్రము పాటవము చెడి స్త్రీసంభోగమున వాంఛయు ఉత్సాహంబును తగ్గును. దానంజేసి సంభోగశక్తియు నడుగంటును. హృద్రోగంబును పాండురోగంబును తమకశ్వాసంబును కామలారోగంబును శరీరశ్రమంబును సంభవించును. వమనంబును అతిసారంబును శూలరోగంబును కాసంబును జ్వరంబును వానిని బాధించును. ఈలక్షణములు కల్గినది బీజోపఘాతముచే కల్గిన క్లీబత్వము. (ఇచ్చట "రసాదీనాం చ సంక్షయాత్" "వాతాదీనాం చ" అనుపాఠము చక్రపాణిదత్తవ్యాఖ్యాసమ్మతము.)

## 2. ధ్వజభంగక్లైబ్యనిదానము.

మూ. ధ్వజభఙ్గకృతం శృణు. 162
అత్యమ్లలవణక్షారవిరుద్ధాఽసాత్మ్యభోజనాత్,
అత్యమ్బుపానాద్విషమాత్ పిష్టాన్నగుడభోజనాత్. 163

దధిక్షీరానూపమాంససేవనాత్ వ్యాధికర్శనాత్,
కన్యానాం చైవ గమనాత్ అయోనిగమనాదపి. 164
దీర్ఘరోగాం (రోమ్ణీాం) చిరోత్సృష్టాం తథైవ చ రజస్వలాం,
దుర్గన్ధాం దుష్టయోనిం చ తథైవ చ పరిస్రుతామ్. 165
ఈదృశీం ప్రమదాం మోహాత్ యో గచ్ఛేత్ కామహర్షితః,
చతుష్పదాఽభిగమనాత్ శేఫసశ్చాఽభిఘాతతః. 166
అధావనాద్వా మేఢ్రస్య శస్త్రదన్తనఖక్షతాత్,
కాష్ఠప్రహారనిష్పేషాత్ శూకానాం చాఽతిసేవనాత్. 167
రేతసశ్చ ప్రతీఘాతాత్ ధ్వజభఙ్గః ప్రవర్తతే,
(భవన్తి యాని రూపాణి తస్య వక్ష్యామ్యతః పరమ్)

వ్యా. ధ్వజభంగముచే కల్గిన క్లైబ్యము నీక్రింద వివరించెద:—మిక్కిలి పులుపును ఉప్పును కారంబును కలపదార్థముల భుజించుట, పరస్పరవిరుద్ధంబులును అసాత్మ్యంబులు నగుపదార్థముల భుజించుట, అధికముగ జలమును త్రాగుట, అకాలమున భుజించుట, పిండిచే చేయబడిన యన్నమును బెల్లముచే చేయబడిన భక్ష్యములను విశేషముగ భుజించుట, పెరుగును పాలను అనూపజంతువులమాంసమును అధికముగ సేవించుట, ఇతరవ్యాధులచే శరీరము కృశించుట, పుష్పిణికాకయుండు కన్యకలతో రమించుట, యోనికాక ఇతరసాధనములతో మైథునము చేయుట, దీర్ఘకాలముగ రోగపీడితయైన స్త్రీతోనైనను, (మిక్కిలి నిడుదలైనరోమములుకల స్త్రీతోనైనను), చిరకాలమునుండి సంగమమును మానియున్న స్త్రీతోనైనను, రజస్వలగానుండు స్త్రీతోనైనను, దుర్గంధమైన (భగముకల) స్త్రీతోనైనను, వాతాదులచే దుష్టమైన యోనికల స్త్రీతోనైనను, దుష్టమైన ద్రవమును స్రవించు స్త్రీతోనైనను, అజ్ఞానము వలన కామోద్దీపితుడై సంభోగము చేసినను; పశువులు మున్నగు నాలుగుకాళుల జంతువులతో మైథునము చేసినను, మేఢ్రమున కభిఘాతమును కల్గించినను; మేఢ్రమును శుభ్రముగ కడుగకున్నను, మేఢ్రమున శస్త్రములు దంతములు గోళులు మున్నగువానితో గాయము కల్గినను, మేఢ్రమునకు కొయ్యలచే దెబ్బతగిలినను, చేతులు మున్నగువానిచే మర్దించినను, మేఢ్రము వృద్ధినందించుటకై చేయబడు శూకమను నౌషధము నధికముగ లేపనము చేసినను, శుక్రమును (యుక్తకాలమున వెడలనీయక నిరోధించినను, ఈకారణముల చేత ధ్వజభంగము కల్గును. (మేఢ్రము బిగిచెడునని భావము.)

(జలమున సంచరించుచు కప్పవలెనుండు విషజంతువు శూకము, అట్టివిషజంతువును చేర్చి చేయబడిన యౌషధమును లింగము చాల వృద్ధినొందుటకై పూసెదరు. అట్టి యౌషధము నధికముగ నుపయోగించుటచే ధ్వజభంగము సంభవించునని యిచ్చట "శూకానాం చాఽతిసేవనాత్" అని చెప్పబడినది).

అట్టి ధ్వజభంగముచే గల్గిన క్లైబ్యలక్షణము లీక్రింద వివరింపబడును.

### ధ్వజభంగజ క్లైబ్యలక్షణము.

మూ. శ్వయథుర్వేదనా మేఢ్రే రాగశ్చైవోపలక్ష్యతే. 168
స్ఫోటాశ్చ తీవ్రాః జాయన్తే లిఙ్గపాకో భవత్యపి,
మాంసవృద్ధిర్భవేచ్చాస్య వ్రణాః క్షిప్రం భవన్త్యపి. 169
పులాకోదకసఙ్కాశః స్రావః శ్యావారుణప్రభః,
వలయీకురుతే చాపి కఠినశ్చ పరిగ్రహః. 170
జ్వరస్తృష్ణా భ్రమో మూర్ఛా ఛర్దిశ్చాస్యోపజాయతే,
రక్తం కృష్ణం స్రవేచ్చాపి నీలమావిలలోహితమ్. 171
అగ్నినేవ చ దగ్ధస్య తీవ్రో దాహస్సవేదనః,
వస్తౌ వృషణయోర్వాపి సీవన్యాం వంక్షణేషు చ. 172
కదాచిత్ పిచ్ఛిలో వాపి పాణ్డుస్రావశ్చ జాయతే,
శ్వయథుర్జాయతే మన్దస్తిమితోఽల్పపరిస్రవః. 173
చిరాచ్చ పాకం వ్రజతి శీఘ్రం చాఽథ ప్రముచ్యతే,
జాయన్తే క్రిమయశ్చాపి క్లిద్యతే పూతిగన్ధి చ. 174
విశీర్యతే మణిశ్చాస్య మేఢ్రం ముష్కావథాపి చ;
ధ్వజభఙ్గకృతం క్లైబ్యం ఇత్యేతత్సముదాహృతమ్. 175
ఏతం(ఏవం) పఞ్చవిధం కేచిత్ ధ్వజభఙ్గం ప్రచక్షతే,

వ్యా. మేఢ్రమునందు వాపును, పోటును కల్గి యెఱ్ఱగ నుండుట; (ఇది వాతిక క్లైబ్యము). లింగముపై పుండై బొబ్బలు కల్గి తీవ్రమైనబాధ కల్గును. (ఇది పైత్తిక క్లైబ్యము.) మేఢ్రముపై మాంసము వృద్ధినొంది శీఘ్రముగ వ్రణములు జనించుట, శ్యామవర్ణంబైనను, అరుణవర్ణంబైనను కల్గి గంజినీళ్లవలె నుండుద్రవము మేఢ్రమునుండి స్రవించుట, మేఢ్రముపై నుండుచర్మము కఠినముగను విస్తృతంబునై మేఢ్రముచుట్టును

వలయాకారముగ వ్యాపించుట (ఇయ్యది శ్లైష్మికము.) జ్వరము, దప్పి, భ్రమము,మూర్ఛ, వాంతి, ఈలక్షణములు కల్గి నీలవర్ణంబును, కలుషంబును, లోహితవర్ణంబును, లేక కృష్ణ వర్ణంబును, నగు రక్తము స్రవించుట; (ఇది రక్తజము.) మేఢ్రమునందు నిప్పున కాల్చిన విధముగ తీవ్రమైన మంటయు, నొప్పియు కల్గుట; అట్టివేదన వస్తియందైనను, వృషణ ముల యందైనను, సీవనియందైనను, గజ్జలయందైనను, సంభవించుట; ఒకప్పుడు పిచ్ఛిల ముగను, ఒకప్పుడు పాండువర్ణముగ నుండు ద్రవము స్రవించుట; మందముగను, చిక్క నైనదిగను నుండు ద్రవము స్రవించుట వాపు, చిరకాలమునకు మేఢ్రమునందు పుండై శీఘ్రముగ అవయవమును నశింపజేయుట, అట్టి వ్రణమున క్రిములు కల్గి కుళ్లి, దుర్గంధము కల్గి మేఢ్రమునందు మణియు, వృషణంబును చిందరవందరగ శిథిలమై యూడిపడుట; (ఇది సాన్నిపాతికము.) ఈలక్షణములుకల క్లైబ్యము ధ్వజభంగముచే (మేఢ్రనాశముచే) కల్గిన క్లీబత్వము (నపుంసకత్వము) అని యెఱుంగునది. కొందరా చార్యులు క్లైబ్యమునకు కారణమైన ధ్వజభంగము పైజెప్పిన వాతాదిలక్షణములచే నైదువిధముల నుండునని చెప్పెదరు.

ఇచ్చట ధ్వజభంగమన ఉపదంశమను గుహ్యారోగవిశేషము. అయ్యది పైజెప్పిన క్లైబ్యమువలె వాతాదిభేదములచే నైదువిధములుగ నుండునని "ఏతం పంచవిధం" అను వాక్యమున కర్థము. ఈవిషయమునే గంగాధరకృత జల్పకల్పతరువ్యాఖ్యానమున నిట్లు చెప్పబడినది.—"ఏతం ధ్వజభఙ్గముపదంశం కేచిత్ పంచవిధం ప్రచక్షతే."

ఈప్రకరణమున ఉపదంశరోగనిదానలక్షణచికిత్సలు ప్రత్యేకముగ జెప్పబడ లేదు. ఐనను ధ్వజభంగశబ్దమునకు ఉపదంశమని యర్థము పైవ్యాఖ్యానమున తేలు చున్నది. అట్టి యుపదంశమును వాతికాదిభేదములచే నైదువిధములుగ నుండునని పై లక్షణములనే యతిదేశించుచు మతాంతరముగ నీతంత్రకారు డుపదేశించెను. వాగ్భటా చార్యులు "ఉపదంశోఽత్ర పంచధా పృథగ్దోషైః సరుధిరైః సమస్తైశ్చ......వరణం క్రిమిసంభవః." (అ. హృ. ఉ. అ. 33 శ్లో. ౧-౮) అనుగ్రంథముచేత పంచవిధోప దంశములను వివరించెను. మాధవకరుడును వాగ్భటానుసారముగ ఉపదంశములను వివ రించి చెప్పెను. ఈతంత్రమునందును పైవివరణమునుపట్టి ఉపదంశలక్షణము ఉక్తప్రాయ మని యెఱుంగదగును.

### 3. జరాసంభవక్లైబ్యనిదాన-లక్షణము.

మూ. క్లైబ్యం జరాసంభవం హి ప్రవక్ష్యామ్యథ తచ్ఛృణు. 176
జఘన్యమధ్యప్రవరం వయస్త్రివిధముచ్యతే,

అతిప్రవయసాం శుక్రం ప్రాయశః క్షీయతే నృణామ్. 177
రసాదీనాం సంక్షయాచ్చ తథైవావృష్యసేవనాత్,
బలవీర్యేన్ద్రియాణాం చ క్రమేణైవ పరిక్షయాత్. 178
పరిక్షయాదాయుషశ్చాప్యనాహారాచ్ఛ్రమాత్క్లమాత్,
జరాసంభవజం క్లైబ్యం ఇత్యేతైర్హేతుభిర్నృణామ్. 179
జాయతే; తేన సోఽత్యర్థం క్షీణధాతుస్సుదుర్బలః,
వివర్ణో విహ్వలో దీనః క్షిప్రం వ్యాధిమథాశ్నుతే. 180
ఏతజ్జరాసంభవం హి,

వ్యా. జరాసంభవమైన(ముసలితనముచే కల్గిన) క్లైబ్యము నీక్రింద వివరించెదః— మనుజులకు శతసంవత్సరపరిమితమైన ఆయుష్యమున వయస్సు జఘన్యము, మధ్యమము, ప్రవరము, అని మూడువిధములుగ విభక్తమైయుండును. అందు మిక్కిలి వయస్సు చెల్లినవృద్ధులకు శుక్రము ప్రాయికముగ క్షీణించును. మరియు మనుజులకు శరీరమునందలి రసాదిధాతువులు క్షీణించుటవలనను, వృష్యయోగముల సేవించకుండుటవలనను, బలంబును, వీర్యంబును, ఇంద్రియంబును, వయోధర్మమునుపట్టి నానాట క్రమేణ కృశించుటవలనను, ఆయుష్యము క్షీణించుటవలనను, ఆహారము విసర్జించుటవలనను, శరీరపరిశ్రమముచేతను, బడలికవలనను, శుక్రము నానాట క్షీణించి ముసలితనమును కారణముగ చేసికొని క్లైబ్యము సంభవించును. అట్టియెడ శరీరమునందలి ధాతువులును బలహీనములైయుండును. శరీరవర్ణము మారును. సంభోగశక్తి నశించును. మిక్కిలి దీనభావము నొందును. ఇతరవ్యాధులచే నతిశీఘ్రముగ పీడింపబడును. ఇయ్యది ముసలితనముచే కల్గిన క్లైబ్యమని యెరుంగునది.

ఇచ్చట "ప్రాయశః క్షీయతే నృణామ్" అనుచోట ప్రాయశ్శబ్దముచేత సారవంతమైన శుక్రము కలవారికిని, వృష్యయోగముల సేవించినవారికిని, ముసలితనమునందును శుక్రము క్షీణించక యొకప్పుడు శుక్రము పుష్టికల్గియుండునని తెలిసెడి.

### 4. శుక్రక్షయజ క్లైబ్యనిదాన-లక్షణములు.

మూ. చతుర్థం క్షయజం శృణు,
అతీవ చిన్తనాచ్చైవ శోకాత్ క్రోధాద్భయాత్తథా. 181
ఈర్ష్యోత్కణ్ఠామదోద్వేగాన్ (మనఃక్షోభాత్)
సదా విశతి యో నరః.

కృశో వా సేవతే రూక్షం అన్నపానం తథౌషధమ్. 182
దుర్బలప్రకృతిశ్చైవ నిరాహారో భవేద్యది,
అసాత్మ్య(అథాఽల్ప)భోజనాచ్చాపి హృదయే యో వ్యవస్థితః.
రసః ప్రధానధాతుర్హి క్షీయేతాశు, తతో నృణాం,
రక్తాదయశ్చ క్షీయన్తే ధాతవస్తస్య దేహినః. 184
శుక్రాఽవసానాః, తేభ్యోఽపి శుక్రం ధామ పరం మతం,
చేతసో వాఽతిహర్షేణ వ్యవాయం సేవతేఽతి యః. 185
తస్యాశు క్షీయతే శుక్రం తతః ప్రాప్నోతి సంక్షయం,
ఘోరం వ్యాధిమవాప్నోతి మరణం వా స గచ్ఛతి. 186
శుక్రం తస్మాద్విశేషేణ రక్ష్యమారోగ్యమిచ్ఛతా,

వ్యా. శుక్రక్షయముచే గల్గిన నాల్గవ క్లైబ్య మీక్రిందచెప్పబడును:—మిక్కిలి చింతనముచేయుట, శోకము, క్రోధము, భయము, ఈర్ష్య (సోర్వోమి), ఉత్కంఠ (ప్రియమైనవస్తువును సంపాదించుటయందు తొందరపాటు). ఈకారణములచే మనస్సు సంక్షోభము నొంది యెల్లప్పుడును తిక్కయెత్తిన ట్లున్నను శరీరము రోగాదికారణాంతరములచే కృశించి యున్నపుడు మిక్కిలి రూక్షములగు నన్నపానముల నైనను ఔషధముల నైనను సేవించినను, పుట్టుకతోనే బలహీనమైన ప్రకృతి కల్గియున్నను, ఆహారమును బొత్తుగ వర్జించి యున్నను, తనకు శరీరప్రకృతికి నిమడని యాహారమును భుజించినను, ఈకారణములచేత మనుజుల హృదయమున నుండు రక్తధాతువుల కన్నిటికిని (ఉత్పాదకమై) ప్రధానమైన రసధాతువు శీఘ్రముగ క్షీణించును. అట్టి రక్తాదిధాతువుల కుత్పత్తికారణమైన రసధాతువు క్షీణించుటం జేసి (దాన సంభవించు) తక్కిన రక్త-మాంస-మేదోఽస్థి-మజ్జ-శుక్రధాతువు లన్నియు వరుసగ నానాట క్షీణించును. లేక సంభోగవిషయమైన మనోఽభిలాష మిక్కిలి యధికమగుటవలన మనుజుడు స్త్రీసంభోగమును మితిమీరి యాచరించినను శుక్రము అతిశీఘ్రముగ నశించును. అట్టియెడ మనుజుడు శుక్రమువరకుం గల ధాతువు లన్నియు బొత్తుగ క్షీణించి మిగుల క్రూరమైన వ్యాధిని పొందును. లేక తుదకు మరణమును కూడ పొందును. (ఇదియే శుక్రక్షయజ క్లైబ్యము). కావున నారోగ్యమును కోరు మనుజుడు మిక్కిలి జాగరూకుడై శుక్రము నెంతమాత్రమును చెడనీయక కాపాడుకొనవలెను.

మూ. ఏవం నిదానలిఙ్గాభ్యాముక్తం క్లైబ్యం చతుర్విధమ్. 187

కేచిత్ క్లైబ్యే త్వసాధ్యే ద్వే ధ్వజభఙ్గక్షయోద్భవే,
వదన్తి; శేఫసశ్ఛేదాత్ వృషణోత్పాటనేన చ. 188

వ్యా. ఇత్తెరంగున నుద్దేశప్రకారము నాల్గువిధములైన క్లైబ్యములనిదానంబులును లక్షణంబులును వేరువేరుగ వివరించి చెప్పబడినవి.

కొందఱాచార్యులు ఈక్రింద చెప్పబడురీతిగ సంభవించిన ధ్వజభంగమువలనను శుక్రక్షయమువలనను సంభవించిన క్లైబ్యములు అసాధ్యములని చెప్పెదరు:—అందు మేఢ్రమును ఛేదించుటవలనను వృషణముల పెకలించి విడదీయుటవలనను ధ్వజభంగము సంభవించును. (దీనివలన కల్గిన క్లైబ్యము అసాధ్యము.)

వివరణము.—ధ్వజభంగలక్షణముల జెప్పునప్పుడు "శ్వయథుర్వేదనా మేఢ్రే... ఏవం పఞ్చవిధం కేచిత్ ధ్వజభంగం ప్రచక్షతే." (౧౬౯-౧౭౫ శ్లో) అనుగ్రంథముచే నైదువిధములుగ ధ్వజభంగము చెప్పబడినది. అందు సన్నిపాతధ్వజభంగలక్షణములలో "విశీర్యతే మణిశ్చాస్య మేఢ్రం ముష్కావథాపి చ." అని సాన్నిపాతికమున మేఢ్రములును వృషణములు క్రిములచే రూపు లేక చెడునని చెప్పబడినది. అన్నిసాన్నిపాతిక ధ్వజభంగమున కల్గిన క్లైబ్యము అసాధ్యమని "శేఫసః చ్ఛేదాత్, వృషణోత్పాటనేన చ." అనువాక్యముచే ననువదింపబడినదని యెఱుంగనది.

బీజదోషజనితశుక్రక్షయజక్లైబ్యలక్షణము.

మూ. మాతాపిత్రోర్బీజదోషాత్ అశుభైశ్చాకృతాత్మనః,
గర్భస్థస్య యదా దోషాః ప్రాప్య రేతోవహాస్సిరాః. 189
శోషయన్త్యాశు తన్నాశాత్ రేతశ్చాప్యుపహన్యతే,
తత్ర సమ్పూర్ణసర్వాఙ్గః స భవత్యపుమాన్ పుమాన్. 190

వ్యా. తల్లిదండ్రులయొక్క శుక్రశోణితరూపమైన (గర్భోత్పత్తి) బీజమునకు సంబంధించిన దోషముచే నైనను, గర్భమునందలిశిశువు పూర్వజన్మమున చేసిన దుష్కర్మములచే నైనను వాతాదిదోషములు ప్రకోపము నొంది, గర్భమునందలి శిశువు యొక్క శుక్రవహాస్రోతస్సులలో చేరి, శోషింపజేయును. దానంజేసి యాశిశువునకు శుక్రము పుట్టకయే నశించును. ఆశిశువు పురుషుడును, పురుషున కుండవలసిన యంగము లన్నియు సంపూర్ణముగ (నేవిధమైన కొఱంతయు లేక) నుండినవాడయ్యును, స్త్రీసంభోగమునకు వలసిన శుక్రము లేమింజేసి, (అట్టి సామర్థ్యము లేక) నపుంసకుడగును.

(ఇదియును గర్భమునం దున్నపుడే బీజదోషమునం జేసి శుక్రము నశించినది కావున పుట్టుకతో కూడ సంభవించిన శుక్రక్షయజ క్లైబ్యము.)

ఇచ్చట బీజదోషమన గర్భోత్పత్తికి ఉపాదానకారణమైన తలిదండ్రుల శుక్రశోణితరూపమైన బీజమునసే సంక్రమించిన వాతాదిదోషసంబంధము. శిశువు పూర్వజన్మమున శుక్రోత్పత్తికి భంగకరముగ జేసినకర్మ సంచితము. ఈరెండుకారణములచేత వాతాది దోషములు శిశువునకు శుక్రవహములగు స్రోతస్సులలో జేరి శుక్రమును శోషింప జేయును. దానం జేసి యాశిశువు పుట్టునప్పుడే నపుంసకుడుగ పుట్టును. ఈబీజదోషవివరణమంతయు నర్శశ్చికిత్సితమున—"ఇహ ఖల్వగ్నివేశ! ద్వివిధాన్యర్శాంసి......... తథా అన్యేషామపి సహజానాం వికారాణాం" (చి. అ. ౧౪. సూ. ౫) అనువాక్యమును వివరించునపుడు మాచే విస్తరముగ జెప్పబడినది. కావున నచ్చట జూచునది.

మరియు శుక్రవహస్రోతస్సులు సుశ్రుతమున నిట్లు చెప్పబడినవి:—శుక్రవహే ద్వే, తయోర్మూలం స్తనే వృషణౌ చ." (సుశ్రుత. శా. అ. ౯ సూ. ౨౨) శుక్రవహములగు స్రోతస్సులు రెండు. వానికి స్తనములును వృషణములును మూలస్థానములు. అని యర్థము.

మూ. ఏతే త్వసాధ్యాః వ్యాఖ్యాతాః సన్నిపాతసముచ్ఛ్రియాత్,
చికిత్సితమతస్తూర్ధ్వం సమాసవ్యాసతశ్శృణు. 191

వ్యా. పైజెప్పబడిన క్లైబ్యములలో సన్నిపాతముచే గల్గినవి యసాధ్యములు. క్లైబ్యమునకు చేయదగిన చికిత్సితము సంగ్రహముగను విస్తరముగను ఈక్రింద వివరింపబడును.

## శుక్రదోషజక్లైబ్యసామాన్యచికిత్స.

మూ. శుక్రదోషేషు నిర్దిష్టం భేషజం యన్మయానఘ!
క్లైబ్యోపశాన్తయే కుర్యాత్ క్షీణక్షతహితం చ యత్. 192
వస్తయః క్షీరసర్పీంషి వృష్యయోగాశ్చ యే మతాః,
రసాయనప్రయోగాశ్చ సర్వానేతాన్ ప్రయోజయేత్. 193
సమీక్ష్య దేహదోషాగ్నిబలం భేషజకాలవిత్,
వ్యవాయహేతుజే క్లైబ్యే తథా ధాతువిపర్యయాత్.
(భేషజం ధాతువర్ధనమ్). 194

దైవవ్యపాశ్రయం చైవ భేషజం చాఽభిచారకే,
సమాసేనైతదుద్దిష్టం భేషజం క్లైబ్యశాన్తయే. 195

వ్యా. శుక్రదోషముల నుద్దేశించి చెప్పబడిన చికిత్సితంబును, ధాతుక్షయమునకును ఉరఃక్షతమునకును చెప్పబడిన చికిత్సితంబును క్లైబ్యసామాన్యముగ నుపయోగింపనగును. మరియు పైజెప్పిన వ్యాధుల నుద్దేశించి చెప్పబడిన వస్తులును, క్షీరయోగములును, ఘృతయోగములును, వృష్యయోగములును, రసాయనప్రయోగంబులును, ఇవి యన్నియు రోగియొక్కయు దేహముయొక్కయు వాతాదిదోషములయొక్కయు జాఠరాగ్నియొక్కయు బలమును, శీతవర్షాదికాలస్వభావమును చక్కగ గమనించి తత్తదనుగుణముగ నుపయోగింపవలెను.

మరియు అతిసంభోగమును కారణముగజేసి దోషవైషమ్యముచే గల్గిన క్లైబ్యమునందును పైజెప్పిన చికిత్సలను ధాతువుల వృద్ధినందించునౌషధములను బలకాలాద్యనుసారముగ నుపయోగింపనగును. అభిచారదోషమునంజేసి (మంత్రప్రయోగాదులవలన) సంభవించిన క్లైబ్యమునకు తత్తద్దోషనివర్తక దేవోపాసనము మున్నగు చికిత్సను చేయవలెను. ఇత్తెరంగున క్లైబ్యనివర్తక చికిత్సితము సామాన్యముగ నిర్దేశింపబడినది.

ఇచ్చట "వ్యవాయహేతుజే క్లైబ్యే" అనుటవలన బీజదోషముచే గల్గిన సహజక్లైబ్యము అసాధ్యము కావున తదితరమగు శుక్రక్షయముచే గల్గిన క్లైబ్యము నుద్దేశించి యిచ్చట చికిత్స చెప్పబడినది యని తెలిసెడి.

### క్లైబ్యవిశేషచికిత్స, అందు బీజోపఘాతజ క్లైబ్యచికిత్స.

మూ. విస్తరేణ ప్రవక్ష్యామి క్లైబ్యానాం భేషజం పునః,
సుస్విన్నస్నిగ్ధగాత్రస్య స్నేహయుక్తం విరేచనమ్. 196
అన్నాశనం తతః కుర్యాత్ అథవాఽఽస్థాపనం పునః,
ప్రదద్యాత్ మతిమాన్ వైద్యః తతస్తమనువాసయేత్. 197
పలాశైరణ్డముస్తాద్యైః పశ్చాదాస్థాపయేత్తతః,
వాజీకరణయోగాశ్చ పూర్వం యే సముదాహృతాః. 198
భిషజా తే ప్రయోజ్యాస్స్యుః క్లైబ్యబీజోపఘాతజే,

వ్యా. మరియు క్లైబ్యమునకు చికిత్స యీ క్రింద విస్తరముగ జెప్పబడును. బీజోపఘాతముచే సంభవించిన క్లైబ్యమున తొలుత విధ్యుక్తప్రకారము స్నేహస్వేద విధుల చేసి స్నిగ్ధగాత్రుడైనవానికి స్నేహద్రవ్యముతో గూడిన విరేచనౌషధము నుపయోగింపవలెను. చక్కగ విరేచనములైన పిదప నన్నము నాహారమునకు పెట్టవలెను. లేక స్నేహస్వేదవిధుల నిర్వర్తించినపిదప నాస్థాపనవస్తిని ప్రయోగించి, పిమ్మట అనువాసన వస్తిని ప్రయోగించి, పిదప సిద్ధస్థానమున చెప్పబడు ఆముదపువేళ్లు మున్నగువానిచేతను, తుంగగడ్డలు మున్నగువానిచేతను మరల నాస్థాపనవస్తిని ప్రయోగింపవలెను. పిమ్మట వాజీకరణమున జెప్పబడిన యోగములను బలాద్యనుసారముగ నుపయోగింపనగును.

ఇచ్చట—"ఏరండమూలపలాశ......అపత్యకామానామ్." (సిద్ధి. అ. ౧౭) ముస్తోశీరబలారగ్వధ......సద్యోబలజననో రసాయనచ్చేతి." (సిద్ధి. అ. ౧౬) అని చెప్పబడు వస్తియోగములు రెండును "పలాశైరణ్డముస్తాద్యైః." అనుపదముచే గ్రహింపనగును.

### ధ్వజభంగకృత క్లైబ్యచికిత్స.

మూ. ధ్వజభఙ్గకృతం క్లైబ్యం జ్ఞాత్వా తస్యాఽఽచరేత్ క్రియాం. 199
ప్రదేహాం పరిషేకాంశ్చ కుర్యాద్వా రక్తమోక్షణమ్,
స్నేహపానం చ కుర్వీత సస్నేహం చ విరేచనమ్. 200
అనువాసం తతః కుర్యాత్ అథవాఽఽస్థాపనం పునః,
వ్రణవచ్చ క్రియాస్సర్వాః తతః కుర్యాద్విచక్షణః. 201

వ్యా. ధ్వజభంగముచే కల్గిన క్లీబత్వమును వానిలక్షణములచే చక్కగ గమనించి దానికి ఈ క్రింద చెప్పబడు విధముగ చికిత్స చేయవలయును. విధ్యుక్తప్రకారము ప్రలాపాదులను, పరిషేకములను చేసి రక్తమోక్షణమును చేయదగును. స్నేహపానమును, స్నేహముతో కూడిన విరేచనౌషధమును పలుమారు నుపయోగింపదగును. పిదప అనువాసనవస్తిసైనను, ఆస్థాపనవస్తిసైనను, దోషబలానుసారముగ పలుమారుచేసి వ్రణమునకు చెప్పినచికిత్సల నన్నిటిని పరిస్థితినిపట్టి చేయనగును.

### జరాసంభవ-క్షయజక్లైబ్యముల చికిత్స.

మూ. జరాసమ్భవజే క్లైబ్యే క్షయజే చైవ కారయేత్,
స్నేహస్వేదోపపన్నస్య సస్నేహం శోధనం హితం. 202

క్షీరసర్పిర్వృష్యయోగాః వస్తయశ్చైవ యాపనాః,
రసాయనప్రయోగాశ్చ తయోర్భేషజముచ్యతే. 203
విస్తరేణైతదుద్దిష్టం క్లైబ్యానాం భేషజం మయా (పరమ్),

వ్యా. ముసలిశనముచే కల్గిన క్లైబ్యమునందును, శుక్రక్షయముచే కల్గిన క్లైబ్యము నందును, రోగికి తొలుత స్నేహస్వేదవిధుల నిర్వర్తించి స్నేహముతో కూడిన శోధనౌషధము నుపయోగించుట చాల హితకరము. మరియు క్షీరఘృతంబులును, వృష్యయోగంబులును, యాపనవస్తువులును, రసాయనప్రయోగంబులును, యుక్తములగు చికిత్సితము లై యుండును. ఇత్తెరంగున నాలుగువిధములయిన క్లైబ్యములకు తగిన చికిత్సలు నాచే విస్తరముగ చెప్పబడినవి. ఇచ్చట యాపనవస్తివిధానము భావప్రకాశమున నిట్లు చెప్పబడినది:—"క్షౌద్రాజ్యక్షీరతైలానాం ప్రసృతం ప్రసృతం భవేత్,హాపుషా సైన్ధవాక్షాంశః వస్తి స్యాద్యాపనః పరః." (భా. ప్ర. పూర్వఖండము ప్రకరణము. శ్లో.163.)

రక్తప్రదరసామాన్యనిదానము, దాని నిరుక్తి.

మూ. యః పూర్వముక్తః ప్రదరః శృణు హేత్వాదిభిస్తు తమ్. 204
యాత్యర్థం సేవతే నారీ లవణామ్లగురూణి చ,
కటూన్యథ విదాహీని స్నిగ్ధాని పిశితాని చ. 205
గ్రామ్యౌదకాని మేధ్యాని కృశరాం పాయసం దధి,
శుక్తమస్తుసురాదీని భజన్త్యాః కుపితోఽనిలః. 206
రక్తం ప్రమాణముత్క్రమ్య గర్భాశయగతాస్సిరాః,
రజోవహాస్సమాశ్రిత్య రక్తమాదాయ తద్రజః. 207
యస్మాద్వివర్ధయత్యాశు రసభావాద్విమానతా,
(రసభావాద్విమార్గతః, రక్తపిత్తం సమారుతమ్)
తస్మాదసృగ్దరం ప్రాహురేతత్తన్త్రవిశారదాః. 208
రజః ప్రదీర్యతే యస్మాత్ ప్రదరస్తేన స స్మృతః,

వ్యా. ఇంతకుముందు యోనివ్యాపత్తులకు ఉపద్రవరూపముగ నిర్దేశింపబడిన ప్రదరరోగమునకు కారణములు మున్నుగునవి యీక్రింద వివరింపబడును:—ఏస్త్రీ లవణ-అమ్ల-రసములు గల పదార్థములను, గురుపదార్థములను, కటురసంబులును, విదాహకరంబులును నగుపదార్థములను, స్నిగ్ధపదార్థములను, గ్రామములయందును, ఉదకములయందును,

సంచరించునవియు, మేదస్సును వృద్ధినొందించునదియు నగు మాంసములను క్రసరము (పులగము)ను, పాయసమును, పెరుగును, పులిగంజిని, మీగడను, సురామొదలగు మద్యములను, మితిమీరి సేవించునో అట్టిస్త్రీకి వాతము ప్రకోపమునొంది రక్తమును ఉత్కటముగ వృద్ధినొందించి గర్భాశయమునందలి ఋతురక్తమును వహించుసిరలయందు చేర్చి యందలి ఋతురక్తమును (యితరరక్తసంబంధముచేత) మిక్కిలి వృద్ధినొందించును. ఋతురక్తము సమానరూపమయిన ఇతరరక్తసంబంధమునంజేసి మిక్కిలి వృద్ధినొందును గాన ఈ వ్యాధి అసృగ్దరమని వైద్యతంత్రకారులు చెప్పెదరు.

మరియు రక్తముచేత రజోరూపమయిన ఋతురక్తము వృద్ధినొందుటవలన నీ వ్యాధి ప్రదరమనియు చెప్పబడును. ఈవ్యాధి అసృగ్దరము, రక్తప్రదరము అని రెండు నామములచే చెప్పబడును. "రక్తం ప్రదీర్యతే విస్తారితో భవతీతి రక్తప్రదరః." అను వ్యుత్పత్తిచేత పైశబ్దమును ఈవ్యాధియందు వ్యవహరింపబడును.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—యోనివ్యాపత్తుచికిత్సితమున నుపద్రవముల నిర్దేశించునపుడు "స్త్రీ గచ్ఛత్యామయాన్బహూన్, గుల్మార్శః ప్రదరాదీశ్చ." (శ్లో. 3ర.) అని యోనివ్యాపత్తున కుపద్రవముగ ప్రదరరోగము నిర్దేశింపబడినది. మరియు రక్తయోనిచికిత్సావసరమున అసృగ్దరము రక్తయోనిభేదములుగనే జేర్చి చెప్పబడినది. అచ్చట సంగ్రహరూపముగ చెప్పబడుటంజేసి విస్తరించి చెప్పుటకై మరల నిచ్చట వివరింపబడియోనని యెరుంగునది.

### రక్తప్రదరవిశేషలక్షణములు.

మూ. సామాన్యతస్సముద్దిష్టం కారణం లిఙ్గమేవ చ. 209
చతుర్విధం వ్యాసతస్తు వాతాద్యైస్సన్నిపాతతః,
అతఃపరం ప్రవక్ష్యామి హేత్వాకృతిభిషగ్జితమ్. 210

వ్యా. పైజెప్పబడిన ప్రదరరోగమునకు సంబంధించి సామాన్యకారణంబును, సామాన్యలక్షణంబును పైని నిర్దేశింపబడినది. అట్టిరోగము వాతాదిభేదములచేతను, సన్నిపాతముచేతను జనించుటంజేసి నాల్గువిధముల నుండును. ఆనాల్గిటికిని వేరువేరు లక్షణములును, కారణములును, చికిత్సలును ఈక్రింద విస్తరముగ వివరింపబడును.

### వాతికప్రదరనిదానము, లక్షణంబును.

మూ. రూక్షాదిభిర్మారుతస్తు రక్తమాదాయ పూర్వవత్,
కుపితః ప్రదరం కుర్యాత్, లక్షణం తస్య మే శృణు! 211

ఫేనిలం తను రూక్షం చ శ్యావం చాఽరుణమేవ చ,
కింశుకోదరసఙ్కాశం సరుజం వాథ నీరుజమ్. 212
కటీవంక్షణహృత్పార్శ్వపృష్ఠశ్రోణిషు మారుతః,
కురుతే వేదనాం తీవ్రాం ఏతద్వాతాత్మకం విదుః. 213

వ్యా. వాతవర్ధకములగు రూక్షాద్యాహారవిహారములచే వాతము ప్రకోపమునొంది రక్తముతో కలిసి యారక్తమును గర్భాశయమునందలి యార్తవవహస్రోతస్సుల జేరి పైజెప్పినరీతిగ ప్రదరమును కల్గించును. అట్టియెడ రక్తము నురుగుతో గూడి పలుచనై రూక్షంబును, శ్యామారుణవర్ణంబును లేక మోదుగపువ్వులోపలి రంగువంటి రంగు కల్గినదియు నై నొప్పితో కూడియైనను బాధ లేకయైనను వెడలును. నడుమునందును, గజ్జలయందును, హృదయమునందును, ఇరుప్రక్కలయందును, వీపునందును, పిరుదులయందును వాతము తీవ్రమైన బాధను కల్గించును. ఈలక్షణములు కల్గినది వాతప్రకోపముచే గల్గిన ప్రదరమని యెఱుంగునది.

## పైత్తికప్రదరనిదానము, లక్షణంబును.

మూ. అమ్లోష్ణలవణక్షారైః పిత్తం ప్రకుపితం యదా,
పూర్వవత్ప్రదరం కుర్యాత్ పైత్తికం, లిఙ్గతశ్శృణు. 214
సనీలమథ వా పీతం అత్యుష్ణమసితం తథా,
నితాన్తరక్తం స్రవతి ముహుర్ముహురథార్తిమత్. 215
దాహరాగతృషామోహజ్వరభ్రమసమాయుతం,
అసృగ్దరం పైత్తికం స్యాత్;

వ్యా. అమ్ల-క్షారరసంబులును ఉష్ణవీర్యంబును కల పదార్థముల విశేషముగ సేవించుటచేత పిత్తము ప్రకోపమునొంది పైజెప్పినరీతిగ పైత్తికరక్తప్రదరమునుకల్గించును. అట్టియెడ నీలవర్ణంబైనను పీతవర్ణంబైనను నల్లని రంగైనను కల్గి మిక్కిలి వేడి కల్గినరక్తము బాధతో కూడి మిక్కిలి యధికముగ మాటిమాటికిని వెడలును. అట్టియార్తవము బట్టలకు తగిలిన ఎఱ్ఱనై రంగు మాయక యుండును. మంటయు, దప్పియు, మూర్ఛయు, జ్వరంబును, భ్రమంబును కల్గును. ఈలక్షణములు కల్గినది పిత్తముచే కల్గిన రక్తప్రదరమని యెఱుంగునది.

### శ్లైష్మికరక్తప్రదరనిదానము, లక్షణము.

మూ. శ్లైష్మికం తు ప్రవక్ష్యతే. 216
గుర్వాదిభిర్హేతుభిశ్చ పూర్వవత్ కుపితః కఫః,
ప్రదరం కురుతే తస్య లక్షణం తత్త్వతశ్శృణు. 217
పిచ్ఛిలం పాణ్డువర్ణం చ గురు స్నిగ్ధం చ శీతలం,
స్రవత్యసృక్ శ్లేష్మలం చ ఘనం మన్దరుజాకరమ్. 218
ఛర్ద్యరోచకహృల్లాసశ్వాసకాససమన్వితం,

వ్యా. కఫవర్ధకములగు గుర్వాదిపదార్థముల సేవించుట మున్నగుకారణములచే కఫము వృద్ధినంది ప్రకుపితమై పైజెప్పినరీతిగ ప్రదరమును కల్గించును. ఈప్రదరమున పిచ్ఛిలంబును, పాండువర్ణంబును, బరువైనదియు, స్నిగ్ధంబును, శీతలంబును, శ్లేష్మముతో కూడినదియు, చిక్కనైనదియు, నగు బుతురక్తము స్వల్పమైన బాధను కల్గించుచు వెడలును. అట్టియెడ వాంతియు, అరోచకంబును, ఓకరింతలును, శ్వాసకాసంబులును కల్గును. ఇయ్యది శ్లేష్మముచే జనించిన రక్తప్రదరము.

### సాన్నిపాతికప్రదరనిదానము, సామాన్యలక్షణము.

మూ. వక్ష్యతే క్షీరదోషాణాం సామాన్యమిహ కారణమ్. 219
యత్తదేవ త్రిదోషస్య కారణం ప్రదరస్య తు,
త్రిలిఙ్గసంయుతం విద్యాత్ నైకావస్థమసృగ్దరమ్ 220

వ్యా. ఈక్రింద జెప్పబడు క్షీరదోషములకు కారణములు సాన్నిపాతికప్రదరమునకు గూడ కారణ మగును. అట్టి సాన్నిపాతిక ప్రదరరోగమునకు వాతాదులప్రదరములకు వేరువేరుగ జెప్పిన లక్షణము లన్నియు కలిసి యొకవిధమయిన వ్యవస్థ లేక అప్పటప్పటికి లక్షణములు మారుచుండును. ఇది సాన్నిపాతిక ప్రదరమునకు సామాన్యలక్షణము.

### అవస్థావిశేషముచే సాన్నిపాతికప్రదరలక్షణవిశేషములు.

మూ. నారీ త్వతిపరిక్లిష్టా యదా ప్రక్షీణశోణితా,
సర్వహేతుసమాచారాత్ అతివృద్ధస్తదాఽనిలః. 221
రక్తమార్గేణ సృజతి ప్రత్యనీకబలం కఫం,
దుర్గన్ధం పిచ్ఛిలం పీతం విదగ్ధం పిత్తతేజసా. 222

వసాం మేదశ్చ యావద్ధి సముపాదాయ వేగవాన్
సృజత్యపత్యమార్గేణ సర్పిర్మజ్జవసోపమమ్. 223
శశ్వత్స్రవత్యథాస్రావం తృష్ణాదాహజ్వరాన్వితాం,
క్షీణరక్తాం దుర్బలాం చ తామసాధ్యాం వివర్జయేత్. 224

వ్యా. మిక్కిలి బడలికనొంది శరీరమునందలి ఋతురక్తమును క్షీణించియున్న స్త్రీ వాతాదిదోషముల మాటిని వృద్ధినొందించును. ఆహారవిహారములను చేసినయెడల దోషము లన్నియు ప్రకోపించును. అందు వాతము మిక్కిలి దుష్టమై కఫముయొక్క మార్గమును నిరోధించినయెడ దానంజేసి బలిష్ఠమయి దుర్గంధంబును, పిచ్ఛిలంబు నైన కఫమును ఋతుశోణితమును వెడలుమార్గమును చేర్చి వెడలించును. ఒకసమయమున ప్రకుపితమైన వాతము వసయును, మేదస్సును, వహించు నాడుల చేరినయెడ పిత్తముయొక్క వేడిచే మిక్కిలి తపింపబడిన వసను, మేదస్సును, ప్రసూతిమార్గమున చేరి నేతిని, మజ్జను బోలిన ద్రవమును రక్తమార్గమునుండి వెడలజేయును. అట్టియెడ ఆస్రావము అధికముగ వెడలును. ఈవ్యాధి గలస్త్రీ దప్పియు, తాపంబును, జ్వరంబును కల్గి శరీరమునందలి రక్తము బొత్తుగ క్షీణించి చాల బలహీనస్థితి నుండును. ఇట్టియవస్థ నొందిన రక్తప్రదరమసాధ్యమగును. కావున విడువందగును.

### శుద్ధార్తవలక్షణము.

మూ. మాసాన్నిష్పిచ్ఛదాహార్తి పఞ్చరాత్రానుబన్ధి చ,
నైవాతిబహు నాత్యల్పమార్తవం శుద్ధమాదిశేత్. 225
గుంజాఫలసవర్ణం చ పద్మాలక్తకసన్నిభం,
ఇంద్రగోపకసంకాశమార్తవం శుద్ధమాదిశేత్. 226

వ్యా. ఋతురక్తము పిచ్ఛిలము దాకి మంటయు నొప్పియు లేక ఐదురాత్రులు అనుబంధముగ నుండి మిక్కిలి యధికముగను, అల్పముగను కాక మితమయిన పరిమాణము కల్గి మాసమున కొకతూరి వెడలుచున్నయెడ నయ్యది శుద్ధమయిన ఋతుశోణితమని యెరుంగునది. మరియు ఇంద్రగోపపురుగువలె వంటిరంగైనను, గురిగింజవంటి రంగైనను, యెఱ్ఱతామరపువ్వువంటి రంగైనను, లత్తుకవంటి రంగైనను కల్గిన యార్తవము శుద్ధమయినదని తెలియందగునది. (ఇచ్చట చెప్పబడిన వర్ణభేదములు ప్రకృతిభేదముల ననుసరించి సంభవించునని తెలియందగును.)

### ప్రదరచికిత్సావిధానము.

మూ. యోనీనాం వాతలాద్యానాం యదుక్తమిహ భేషజం,
చతుర్ణాం ప్రదరాణాం చ తత్సర్వం కారయేద్భిషక్. 227
రక్తాతిసారిణాం యచ్చ తథా శోణితపిత్తినాం,
రక్తార్శసాం చ యత్ప్రోక్తం భేషజం తచ్చ కారయేత్. 228

వ్యా. వాతికాదియోనివ్యాపత్తులకు నాల్గిటికి వేరువేరుగ చెప్పబడిన చికిత్సలు నాల్గును వాతికాదిభేదములచే నాల్గు తెరంగులైన ప్రదరముల నాల్గింటికిని యథాక్రమముగ చేయునది. మరియు రక్తాతిసారమునకును, రక్తపిత్తమునకును, రక్తార్శస్సులకును చెప్పబడిన చికిత్స లన్నియు ప్రదరరోగమునందును చేయదగియుండును.

### స్తన్యదోషాదివివరణము.

మూ. ధాత్రీస్తనస్తన్యసంపదుక్తా విస్తరతః పురా,
స్తన్యసఞ్జననం చైవ స్తన్యస్య చ విశోధనమ్. 229
వాతాదిదుష్టే లిఙ్గం చ క్షీణస్య చ చికిత్సితం,
తత్సర్వముక్తం యే త్వష్టౌ క్షీరదోషాః ప్రకీర్తితాః. 230
వాతాదిష్వేవ తాన్విద్యాచ్ఛాస్త్రచక్షుర్భిషక్తమః,
త్రివిధాస్తు యతశ్శిష్యాస్తతో వక్ష్యామి విస్తరమ్. 231

వ్యా. శిశువునకు పాలిచ్చుదాదికి ఉండవలసిన లక్షణంబులును, స్తన-స్తన్యములకుండవలసిన రూపగుణాదులును, స్తన్యమును కల్గించు ఔషధములును, స్తన్యమును శుభ్రపరచు విధానంబును, వాతాదిదుష్ట స్తన్యలక్షణంబులును, స్తన్యము క్షీణించినపుడు చేయుచికిత్సలును, ఇవియు విస్తరముగ శారీరస్థానమున చెప్పబడినవి. మరియు నెనిమిదివిధములుగ నిర్దేశింపబడిన క్షీరదోషంబులును, వాతాదిదోషభేదములయందే యంతర్భూతము లగును. శాస్త్రమున చక్కని పరిజ్ఞానముకల వైద్యవరుడు ఆవివరణమును బట్టియే చక్కగ గమనింపదగును. శాస్త్రాభ్యాసకు లగుశిష్యులు ఉత్తమ-మధ్యమ-అధమ-భేదములచే మూడుతెరంగుల నుందురు. అట్టి శిష్యులలో మందమతులగు శిష్యులకు సులభముగ తెలియుటకై ఇచ్చట మరల వానిని వివరించి చెప్పెదనని యర్థము.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—శారీరస్థానమున "అథాతో ధాత్రీపరీక్షా ముపదేక్ష్యామః." అని యుపక్రమించి "క్షీరజననాని" (శా. అ. ౮. శ్లో. ౧౩౧—౧౩౯) అనుగ్రంథముచేత పాలిచ్చుదాది కుండవలసిన గుణంబులును, స్తన -

స్తన్యముల కుండవలసిన గుణసంపత్తును, స్తన్యజనన-స్తన్యశోధనద్రవ్యంబులును, వాతాది దుష్టస్తన్యలక్షణంబులును, వాని వేరుచికిత్సలును, ఇవి యన్నియు సంగ్రహముగ చెప్ప బడినవి. మరియు అష్టోదరీయాధ్యాయమున "అష్టౌ క్షీరదోషా ఇతి—వైవర్ణ్యం, వైగన్ధ్యం, వైరస్యం, పైచ్ఛిల్యం, ఫేనసఙ్ఘాతః, రౌక్ష్యం, గౌరవమ్, అతిస్నేహశ్చేతి." (సూ. అ. ౧౯. సూ. ౬) అను సూత్రముచే నిర్దేశింపబడిన స్తన్యదోషము లెనిమిదియు వాతాదిదోషభేదములయందే యంతర్భూతము లగును. వానిని మరల త్రివిధశిష్యులకు సుఖబోధమునకై మరల విస్తరించి యిచ్చుట చెప్పబడునని ముఖ్యభావము.

## స్తన్యదోషనిదానము.

మూ. అజీర్ణాఽసాత్మ్యవిషమవిరుద్ధాఽత్యర్థభోజనాత్,
లవణామ్లకటుక్షారప్రక్లిన్నానాం చ సేవనాత్. 232
మనశ్శరీరసన్తాపాత్, అస్వప్నాన్నిశి చిన్తనాత్,
ప్రాప్తవేగప్రతీఘాతాత్, అప్రాప్తోదీరణేన చ. 233
పరమాన్నం గుడకృతం కృశరాం దధి మన్దకమ్ (మత్స్యకం),
అభిష్యన్దీని మాంసాని గ్రామ్యానూపౌదకాని చ. 234
భుక్త్వా భుక్త్వా దివాస్వప్నాత్ మద్యస్యాఽతినిషేవణాత్,
అనాయాసాదభీఘాతాత్ క్రోధాచ్చాతఙ్కకర్శనైః. 235
దోషాః క్షీరవహాః ప్రాప్య సిరాః స్తన్యం ప్రదూష్య చ,
కుర్యురష్టవిధం భూయో దోషతస్తాన్నిబోధ మే. 236

వ్యా. ఆహారము జీర్ణము కాకుండునపుడు భుజించుట, సాత్మ్యములు కాని పదార్థముల భుజించుట, కాలనియమము నతిక్రమించి భుజించుట, విరుద్ధపదార్థముల భుజించుట, పరిమితికన్న నధికముగ భుజించుట, లవణ-అమ్ల-కటు-క్షార-రసములు కలపదార్థములను, క్లిన్నపదార్థములను భుజించుట, మనస్సుకును శరీరమునకును సంతాపము కల్గుట, రాత్రులయందు నిదుర లేకుండుట, మితిమీరి యోచించుట, మలమూత్రాదులు వెడలుటకై వేగము జూపినప్పుడు వానివేగమును నిరోధించుట, అయ్యవి వేగము జూపకుండు తరి వానిని వెడలింప బలాత్కారము చేయుట, పరమాన్నమును బెల్లముతో చేయబడిన భక్ష్యములను, కృసరము (పులగము)ను, పెరుగును, మందకమును మజ్జిగను, అభిష్యంది పదార్థములను, గ్రామములయందును జలప్రాంతమునను జలమునను నివసించుజంతువుల మాంసములను విశేషముగ సేవించుట; భుజించినవెంటనే పగలు నిదురించుట, మద్యము

నధికముగ సేవించుట, శరీరమున కాయాసము నించుకేనియుం గల్గనీయక నిశ్చేష్టితముగ నుండుట, అభిఘాతము కల్గుట, కోపబడుట, వ్యాధులచే శరీరము కృశించుట, ఈకారణములచేత వాతపిత్తకఫములు ప్రకోపమునొంది స్త్రీలచనుబాలను వహించుసిరలం జేరి, చనుబాలను చెరిచి యెనిమిదివిధములగు స్తన్యదోషములను కల్గించును. అట్టి వైవర్ణ్యాది స్తన్యదోషములు వాతాదిదోషసంబంధము ననుసరించి వేరువేరులక్షణము లీక్రింద వివరింపబడును.

స్తన్యవహస్రోతస్సులు సుశ్రుతాచార్యులచే నిట్లు చెప్పబడినవి:—''ఏతాస్త్వేవ స్త్రీణామపరాణి త్రీణి, ద్వే స్తనయోః, అధస్తాత్ రక్తవహం చ.'' (సు. శా. అ. ౯. సూ. ౯.) ''ద్వే స్తన్యం స్త్రియాః వహతః స్తనసంశ్రితే.'' (సు. శా. అ. ౯. సూ. ౮.)

దోషసంబంధముచే గల్గు అష్టవిధస్తన్యదోషములు.

మూ. వైరస్యం ఫేనసఙ్ఘాతో రౌక్ష్యం చేత్యనిలాత్మకే,
పిత్తాత్ వైవర్ణ్యదౌర్గన్ధ్యే, స్నేహపైచ్ఛిల్యగౌరవమ్. 237
కఫాద్భవతి,

వ్యా. ఎనిమిది స్తన్యదోషములలో వైరస్యము (క్షీరమునందలి స్వాభావికమైన రుచి మారియుండుట), ఫేనసంఘాతము (నురుగు ఘనీభవించి యుండుట), రౌక్ష్యము (జిడ్డు లేకుండుట), అను నీమూడు స్తన్యదోషములు వాతసంబంధముచే గల్గును. వైవర్ణ్యము (వర్ణము మారుట), దుర్గంధము, ఈరెండు దోషంబులును పిత్తసంబంధముచే గల్గును. స్నేహము (జిడ్డు), పైచ్ఛిల్యము (జిగట గల్గియుండుట), గౌరవము (బరువు), ఈమూడుదోషంబులు కఫసంబంధముచే గల్గును.

వాతికస్తన్యదోషములు మూడు,
అందు వైరస్యయుక్తస్తన్యపానమున గల్గులక్షణము.

మూ. రూక్షాద్యైరనిలః స్వైః ప్రకోపణైః,
క్రుద్ధః క్షీరాశయం ప్రాప్య రసం స్తన్యస్య దూషయేత్. 238
విరసం వాతసంసృష్టం కృశీభవతి తత్పిబన్,
న చాస్య స్వదతే క్షీరం కృచ్ఛ్రేణ చ వివర్ధతే. 239

వ్యా. వాతమును ప్రకోపింపజేయు రూక్షాదిగుణములు కల పదార్థములను సేవించుటవలన వాతము ప్రకోపించి క్షీరమునకాశ్రయమైన స్తనముల జేరి చనుబాల

యందలి స్వాభావికమైన రసమును చెరుచును. దానం జేసి చనుబాలయందు రుచి మారును. అట్టి వాతముచే విరసమైన చనుబాలను త్రాగిన శిశువు నానాట కృశించును. అట్టి క్షీరము బిడ్డకు రుచింపక త్రాగుటకు ఇచ్ఛగొనడు. దానంజేసి శిశువు మిగుల కష్టముచే వృద్ధినొందును.

### ఫేనసంఘాతదోషయుక్తస్తన్యపానమున గల్గులక్షణము.

మూ. తత్రైవ వాయుః కుపితః స్తన్యమన్తర్విలోడయన్,
కరోతి ఫేనసఙ్ఘాతం తత్తు కృచ్ఛ్రాత్ప్రవర్తతే. 240
తేన క్షామస్వరో బాలః బద్ధవిణ్మూత్రమారుతః,
వాతికం శీర్షరోగం వా పీనసం వాఽధిగచ్ఛతి. 241

వ్యా. వాతము పైజెప్పినరీతిగ రూక్షాది స్వవర్ధకహేతువులచే ప్రకోపమునొంది స్తనముల జేరి స్తన్యమును లోపలనే కలియపెట్టును. అట్టి సంక్షోభమునంజేసి స్తన్యమున నురుగు చేరును. అట్టి స్తన్యము మిగుల కష్టముచే బైటవెడలును. అట్టి నురుగుతో కూడినపాలను బిడ్డ త్రాగినయెడ కంఠస్వరము హీనమగును. మల-మూత్ర-అపానవాతములు సరళముగ వెడలక బద్ధగించును. వాతరోగంబైనను శిరోరోగంబైనను పడిసంబైనను శిశువునకు సంభవించును.

### రౌక్ష్యదోషయుక్తస్తన్యపానముచే గల్గు లక్షణము.

మూ. పూర్వవత్ కుపితః స్తన్యే స్నేహం శోషయతేఽనిలః,
రూక్షం తత్పిబతో రౌక్ష్యాత్ బలహ్రాసః ప్రజాయతే. 242

వ్యా. వాతము పైజెప్పినరీతిగ ప్రకుపితమై (తనయందలి రూక్షగుణ మధికమగుటంజేసి) చనుబాలయందలి స్నేహభాగమును శోషింపజేయును. అట్టి రూక్షగుణము కల పాలను త్రాగుశిశువునకు స్నిగ్ధము లేక రూక్షతవలన బలము నానాట తగ్గును. (ఇత్తెరంగున వాతముచే సంభవించు వైరస్య-ఫేనసంఘాత-రౌక్ష్యములను స్తన్యదోషముల మూడిటి లక్షణముల నెరుంగునది.)

### పిత్తకృతస్తన్యదోషములు రెండు,
### అందు వైవర్ణ్యదోషయుక్తస్తన్యపానముచే గల్గులక్షణము.

మూ. పిత్తముష్ణాదిభిః క్రుద్ధం స్తన్యాశయమభిప్లుతం,
కరోతి స్తన్యవైవర్ణ్యం నీలపీతాఽసితాదికమ్. 243

వివర్ణగాత్రః స్విన్నస్స్యాత్ తృష్ణాళుః ఖిన్నవిట్ శిశుః,
నిత్యముష్ణశరీరశ్చ నాభినన్దతి తం స్తనమ్. 244

వ్యా. ఉష్ణము మున్నగు పిత్తవర్ధక కారణములచే పిత్తము మిక్కిలి ప్రకుపితమై స్తనముల జేరి వేడిని కల్గించి స్తన్యమున నీలవర్ణము పచ్చనిరంగు నలుపు మున్నగు వర్ణాంతరముల గల్గించును. అట్టి స్వాభావికవర్ణమును మారి వర్ణాంతరము నొందిన చనుబాలను త్రాగినశిశువునకు శరీరము వివర్ణమగును. వాని శరీరమున చెమటబట్టును. వానికి దప్పి యధికముగ నుండును. మలము భిన్నమై కొంచెము కొంచెముగ వెడలును. వానిశరీరము ఎల్లప్పుడు మిక్కిలి వేడిగ నుండును. ఆశిశువు అట్టిచనుబాలు ద్రావ నిచ్చగొనడు.

దౌర్గంధ్యదోషయుక్తస్తన్యపానముచే గల్గులక్షణము.

మూ. పూర్వవత్ కుపితే పిత్తే దౌర్గన్ధ్యం క్షీరమృచ్ఛతి,
పాణ్డ్వామయః తత్పిబతః కామలా చ భవేచ్ఛిశోః 245

వ్యా. పైజెప్పినరీతిగ నుష్ణాదిపిత్తవర్ధకకారణములచే పిత్తము ప్రకుపితమై స్తన్యమున జేరి చనుబాలలో దుర్గంధమును కల్గించును. అట్టి దుర్గంధమైన పాలను త్రాగినశిశువునకు పాండురోగంబును కామలారోగంబును సంభవించును. (పైజెప్పబడిన వైవర్ణ్య-దౌర్గంధ్యములు రెండును పిత్తముచే గల్గిన స్తన్యదోషములు.)

కఫజస్తన్యదోషములు మూడు, అందు అతిస్నేహస్తన్యదోషము.

మూ. క్రుద్ధో గుర్వాదిభిః శ్లేష్మా క్షీరాశయగతః స్త్రియాః,
స్నేహాన్వితత్వాత్ తత్ క్షీరం అతిస్నిగ్ధం కరోతి తు. 246
ఛర్దనః కున్థన స్తేన లాలాళుః జాయతే శిశుః,
నిత్యోపదిగ్ధైః స్రోతోభిః నిద్రాక్లమసమన్వితః. 247
శ్వాసకాసపరీతస్తు ప్రసేకతమకాన్వితః,

వ్యా. కఫవర్ధకములగు గురు-స్నిగ్ధ-పైచ్ఛిల్యాదిగుణములు కలద్రవ్యముల నుపయోగించుటచేత కఫము వృద్ధినంది ప్రకుపితమై స్త్రీయొక్క స్తన్యాశ్రయములం జేరి తన యందలి యధికమైన స్నిగ్ధగుణముచేత స్వభావముచేతనే స్నిగ్ధమైన చనుబాలను మరింత మిక్కుటముగ స్నిగ్ధ మగునట్లు చేయును. అతిస్నిగ్ధమైన యాచనుబాలను త్రాగిన బాలునకు వాంతి యగును. వానికడుపులో చేరిన పాలు చెడును. నోట జొల్లుకారును. వాని స్రోతోరంధ్రములయం దెల్లపుడును చెమ్మ గల్గియుండును. సొమ్మసిలి యెల్లప్పుడును

నిద్రించుచుండును. శ్వాసకాసములచే బాధింపబడుచు నోట ద్రవము స్రవించుచు మైకము కల్గియుండును.

### పైచ్ఛిల్యదోషయుక్తస్తన్యపానముచే గల్గులక్షణము.

మూ. అభిభూయ కఫః స్తన్యం పిచ్ఛిలం కురుతే యదా. 248
లాలాళుః శూనవక్త్రాక్షిః జడస్స్యాత్ తత్పిబన్ శిశుః,

వ్యా. పైజెప్పినరీతిగ ప్రకుపితమైన కఫము స్తన్యమును చెరచి తనయందలి పిచ్ఛిలత్వముచే పిచ్ఛిలముగ (జిగురు అధికముగ) చేయును. అట్టిపాలను ద్రావినశిశువునకు అధికముగ నోట జొల్లుకారును. ముఖంబును కన్నులును వాచును. చురుకుదనము లేక శిశువు జడుడుగ నుండును.

### గురుత్వదోషయుక్తస్తన్యపానమున గల్గులక్షణము.

మూ. కఫః క్షీరాశయగతః గురుత్వాత్ క్షీరగౌరవమ్. 249
కరోతి గురు తత్ పీత్వా బాలో హృద్రోగ(తద్రోగ)మృచ్ఛతి,
అన్యాంశ్చ వివిధాన్ రోగాన్ కుర్యాత్ క్షీరసమాశ్రయాన్.
క్షీరే వాతాదిభిః దుష్టే సమ్భవన్తి తదాత్మకాః,

వ్యా. పైజెప్పిన రీతిగ కఫము ప్రకోపించి క్షీరమునకాశ్రయస్థలమున జేరి తనయందలి గురుత్వముచేత చనుబాలయందును గురుత్వమును (భారమును) కల్గించును. అట్టి గురుత్వము కలక్షీరమును త్రాగినశిశువునకు హృద్రోగంబును, ఇతరములగు క్షీరము నాశ్రయించిన కఫరోగంబులును సంభవించును. మరియు పైజెప్పిన రీతిగ వాత-పిత్త-కఫములచే స్తన్యము దుష్టమైనపుడు పైజెప్పిన రోగములే గాక వాతాదులకు సంబంధించిన ఆయారోగములు బాలులకు సంభవించును.

(పైజెప్పిన మూడు స్తన్యదోషలక్షణంబులును కఫమునకు సంబంధించినవని యెరుంగునది. ఇత్తెరంగున నుద్దేశప్రకారము స్తన్యదోషముల కెనిమిదింటికిని వాతాదివిభాగంబులును ప్రత్యేకలక్షణంబులును వివరింపబడినవి.)

### స్తన్యదోషచికిత్స, అందు స్తన్యశోధనమునకు ధాత్రీ చికిత్సితము.

మూ. తత్రాదౌ స్తన్యశుద్ధ్యర్థం ధాత్రీం స్నేహోపపాదితామ్. 251
సంస్వేద్య విధివద్వైద్యః వమనేనోపపాదయేత్,

వ్యా. పైజెప్పబడిన స్తన్యదోషములచే స్తన్యము చెడి యున్నపుడు అట్టిదోషములు నివర్తించి శుద్ధమగుటకు తొలుత పాలిచ్చు తల్లికి విధ్యుక్తప్రకారము స్నేహ

పానము అభ్యంగనముచే స్నిగ్ధముగ జేసి, విధివిహితముగ స్వేదనముచేసి, పిమ్మట వమనము చేయించవలెను.

## స్తన్యదోషశోధనమునకు వమనౌషధము.

మూ. వచాప్రియఙ్గుయష్ట్యాహ్వాఫలవత్సకసర్షపైః. 252
కల్కైః నిమ్బపటోలానాం క్వాథైస్సలవణైర్వమేత్,

వ్యా. వస, ప్రేంకణము, అతిమధురము, మంగకాయ, కొడిసపాల, ఆవాలు, వీని కల్కములచే నైనను, వేపపట్టయొక్కయు, చేదుపొట్లయొక్కయు క్వాథములచేనైనను, అందు లవణమును చేర్చి వమనము చేయించవలెను.

## స్తన్యదోషశోధనవిరేచనవిధి.

మూ. సమ్యగ్వాన్తాం యథాన్యాయం కృతసంసర్జనాం తతః. 253
దోషకాలబలాపేక్షీ స్నేహయిత్వా విరేచయేత్,

వ్యా. పైజెప్పిన యౌషధముచే చక్కగ వమనమైనపిదప పేయాదిసంసర్జన క్రమముచే నాహారవిధిని నిర్వర్తించి, పిదప మరల స్నేహనమును చేసి, పిదప దోషమును కాలమును బలమును చక్కగ గమనించి తదనుసారముగ నీక్రింద జెప్పబడు నౌషధముచే విరేచనము చేయించనగును.

## స్తన్యదోషశోధనవిరేచనౌషధము.

మూ. త్రివృతామభయాం వాపి త్రిఫలారససంయుతామ్. 254
పాయయేన్మధుసంయుక్తాం అభయాం వాపి కేవలాం,
పాయయేన్మూత్రసంయుక్తాం విరేకార్థం చ శాస్త్రవిత్. 255

వ్యా. తెగడచూర్ణమునైనను, కరకకాయలచూర్ణమునైనను త్రిఫలాకషాయమున కలిపి, అందు తేనెను చేర్చి, విరేచనమునకై త్రాగించవలెను. లేక కరకకాయలచూర్ణమును మాత్రము గోమూత్రమున కలిపి త్రాగింపవలెను.

## శోధనానంతరమాహారవిధి.

మూ. సమ్యగ్విరిక్తాం మతిమాన్ కృతసంసర్జనాం పునః,
తతో దోషావశేషఘ్నైః అన్నపానైరుపాచరేత్. 256

వ్యా. పైజెప్పిన యౌషధముచే చక్కగ విరేచనమైనపిదప సంసర్జనవిధిప్రకారము పథ్యసేవనము చేసిన పిదప దోషశేషమును హరించునట్టి (యీక్రింద జెప్పబడు) అన్నపానములచే నుపచరించవలెను.

స్తన్యశోధనములైన యాహారములు.

మూ. శాలయష్షష్టికా వా స్యుః శ్యామాకా భోజనే హితాః,
ప్రియఙ్గవః కోరదూషా యవా వేణుయవా స్తథా. 257
వంశవేత్రకలాయాశ్చ శాకార్థే స్నేహసంస్కృతాః,
ముద్గాన్మసూరాన్యూషార్థే కులుత్థాంశ్చ ప్రకల్పయేత్. 258
నిమ్బవేత్రాగ్రకులకవార్తాకామలకైః శృతాన్,
సవ్యోషసైన్ధవాన్యూషాన్ దాపయేత్ స్తన్యశోధనాన్. 259

వ్యా. రాజనములు, అరువదినాళ్ల సంబావులు, చామలు, కొఱ్ఱలు, ఆరుకలు, యవలు, వెదురుబియ్యము, ఈధాన్యములను స్తన్యదోషముల శమింపజేయుటకై యన్నమున కుపయోగించవలయును.

మరియు వెదురుమోవులు, పేముచిగుళ్లు, కలాయశాకము, వీనిని స్నేహద్రవ్యముల చేర్చి సంస్కరించి శాకములుగ నుపయోగింప దగును. పెసలు, చిరుసెనగలు, ఉలవలు, వీనిని వేప, పేముచిగుళ్లు, చేదుపొట్ల, వంకాయలు, ఉసిరికకాయలు, వీనిని కూడ చేర్చి యూషములుగ పక్వము చేసి, యందు త్రికటుకచూర్ణమును, సైంధవలవణమును చేర్చి పాలిచ్చుస్త్రీలకు సేవింపజేసిన స్తన్యమునందలి దోషముడిగి శుద్ధమగును.

స్తన్యశోధనములయిన మాంసములు, పానీయములు.

మూ. శశాన్ కపిఞ్జలానేణాన్ సంస్కృతాంశ్చ ప్రకల్పయేత్,
శార్ఙ్గేష్టాస ప్తపర్ణత్వక్ అశ్వగన్ధాశృతం జలమ్. 260
పాయయేతాథ వా స్తన్యశుద్ధయే రోహిణీశృతం.

వ్యా. కుందేళులయొక్కయు, ఊరబిచ్చుకలయొక్కయు, జింకలయొక్కయు మాంసమును, విధ్యుక్తప్రకారము పక్వముచేసి తిరుగబాత మున్నగువానిచే సంస్కరించి స్తన్యశోధనమునకు సేవింపదగును. మరియు శార్ఙ్గింష్ట(గినియ)యేడాకులపొన్నపట్ట, పెన్నేరుగడ్డ, వీనిని చేర్చి కాచబడిన జలమునయినను, కటుకరోహిణి చేర్చి కాచబడిన జలమునయినను త్రాగవచ్చును. స్తన్యము శుద్ధమగును.

స్తన్యశోధన క్వాథములు.

మూ. అమృతాసప్తపర్ణత్వక్ క్వాథం చైవ సనాగరమ్. 261
కిరాతతిక్తకక్వాథం శ్లోకపాదేరితాన్పిబేత్,

త్రీ నేతాః స్తన్యశుద్ధ్యర్థం, ఇతి సామాన్య భేషజమ్. 262
కీర్తితం స్తన్యదోషాణాం, పృథగన్యన్ని బోధత,

వ్యా. తిప్పతీగె, యేడాకులపట్ట, ఈరెంటిని చేర్చి చేయబడిన క్వాథమునైనను; శొంఠికషాయమునైనను; నేలవేముకషాయమునైనను త్రాగవలయును. ఈచెప్పబడిన శ్లోకపాదముల మూడిటియందు కల ద్రవ్యములను వేరువేరుగ జేర్చి సిద్ధముచేయబడిన కషాయముల మూటిని త్రాగినచో స్తన్యదోషములు నివర్తించును. ఇత్తెరంగున స్తన్య దోషసామాన్యముగ చికిత్స చెప్పబడినది. ఈక్రింద స్తన్యదోషముల వేరువేరుగ నుద్దే శించి యౌషధము చెప్పబడును.

వాతిక స్తన్యదోషముల చికిత్స, అందు వైరస్యదోషచికిత్స.

మూ. పాయయేద్విరసక్షీరాం ద్రాక్షామధుకసారిబాః. 263
శ్లక్ష్ణపిష్టాం పయస్యాం చ సమాలోడ్య సుఖామ్బునా,
పఞ్చకోలకులుత్థైశ్చ పిష్టై రాలేపయేత్ స్తనమ్. 264
శుష్కే ప్రక్షాల్య నిర్దుహ్యాత్తథా స్తన్యం విశుధ్యతి,

వ్యా. స్తన్యము రసము చెడి విరసముగ నున్నపుడు ద్రాక్షపండు, అతిమధురము, సుగంధపాల, క్షీరకాకోలి, వీనిని మెత్తగ నూరి చల్లనినీళ్లలో కలిపి త్రాగించవలయును. మరియు పఞ్చకోలములను ఉలవలను చేర్చి మెత్తగ నూరి స్తనములకు పూసి, చక్కగ యెండినపిదప నీళ్లతో శుభ్రముగ కడిగి, అప్పుడు కలిగియుండు పాలను నిశ్శేషముగ పిండినయెడ స్తన్యమునందలి వైరస్యదోషము నివర్తించును.

ఫేనసంఘాతక్షీరస్తన్యదోషచికిత్స.

మూ. ఫేనసఙ్ఘాతవత్ క్షీరం యస్యాస్తాం పాయయేత్ స్త్రియమ్. 265
పాఠానాగరశార్ఙ్గేష్టామూర్వాః పిష్ట్వా సుఖామ్బునా,
అంజనం నాగరం (తగరం)దారు బిల్వమూలం ప్రియఙ్గవః. 266
స్తనయోః పూర్వవత్ కార్యం లేపనం క్షీరశోధనం,

వ్యా. స్తన్యమున నురుగు చేరి ఘనీభవించి యున్నపుడు చిరుబొద్ది, శుంఠి, గినియచాగ వీనిని సమభాగములుగ కూర్చి మెత్తగ నూర్చి సుఖోష్ణముగ నీళ్లలో కలిపి త్రాగింపవలయును. మరియు శోతోంజనము, శుంఠి లేక(గంధితగరము)దేవదారు, మారేడువేరు, ప్రేంకణము వీని నన్నిటిని మెత్తగ నూరి పైజెప్పినరీతిగ పట్టువేసి యెండిన

పిదప శుభ్రముగ కడిగి క్షీరమును పిండినయెడ పాలయందలి ఫేనసంఘాతదోషము నివర్తించి శుద్ధమగును.

### ఫేనసంఘాతమునకు రెండవచికిత్స.

మూ. కిరాతతిక్తకం శుంఠీం సామృతాం క్వాథయేద్భిషక్. 267
తం క్వాథం పాయయేద్ధాత్రీం స్తన్యదోషనిబర్హణం,
స్తనౌ చాలేపయేత్పిష్టైర్యవగోధూమసర్షపైః 268

వ్యా. నేలవేము, శుంఠి, తిప్పతీగ వీనిని క్వాథముచేసి పాలిచ్చు స్త్రీకి త్రాగించవలయును. పిదప యవలను, గోధుమలను, ఆవాలను, మెత్తగ నూరి పైజెప్పినరీతిగ స్తనములకు పూయవలయును. దీనిచేతను స్తన్యమునందలి ఫేనసంఘాతదోషము నివర్తించును.

### రౌక్ష్య స్తన్యదోషచికిత్స.

మూ. షడ్విరేకాశ్రితీయోక్తైః ఔషధైః స్తన్యశోధనైః,
రూక్షక్షీరా పిబేత్ క్షీరం తైర్వా సిద్ధం ఘృతం పిబేత్. 269
పూర్వవత్ జీవకాద్యం చ పఞ్చమూలం ప్రలేపనం,
స్తనయోః సంవిధాతవ్యం సుఖోష్ణం స్తన్యశోధనమ్. 270

వ్యా. షడ్విరేచనశతాశ్రితీయమున చెప్పబడిన స్తన్యశోధనగణమునందలి యౌషధములను (యథాసంభవముగ జేర్చి కాచబడిన క్షీరమునైనను, ఘృతమునైనను త్రాగినయెడ స్తన్యమునందలి రౌక్ష్యదోషము శమించును. మరియు జీవనీయగణద్రవ్యముల నైనను, పఞ్చమూలముల నైనను, మెత్తగ నూరి యుడికించి సుఖోష్ణముగ నున్నప్పుడు పైజెప్పినరీతిగ స్తనములకు పట్టువేసినను, స్తన్యమునందలి రూక్షదోషము నివర్తించి శుద్ధమగును.

ఇచ్చట షడ్విరేచనశతాశ్రితీయమున "పాఠామహౌషధ...... స్తన్యశోధనాని భవన్తి" (చ. సూ. అ. ౪. సూ. ౪౧) అని చెప్పబడిన స్తన్యశోధనగణద్రవ్యముల నెరుంగునది. (ఇంతదనుక వాతముచే కల్గిన స్తన్యదోషముల మాటికి వేరువేరుగ చికిత్స చెప్పబడినది.)

### పైత్తిక స్తన్యదోషములచికిత్స, అందు వైవర్ణ్యనాశకయష్టిమధుకాదికల్కము.

మూ. యష్టీమధుకమృద్వీకాపయస్యా సిన్దువారికాః,
శీతామ్బునా పిబేత్కల్కం క్షీరవైవర్ణ్యనాశనమ్. 271

వ్యా. అతిమధురము, ద్రాక్షపండు, మనుబాల, వావిలి, వీనిని సమభాగములుగ గూర్చి నూరి కల్కముచేసి చల్లనినీళ్లతో కలిపి త్రాగినచో చనుబాలలో కల్గిన నీల పీతాదివైవర్ణ్యము నివర్తించును.

వైవర్ణ్య స్తన్యదోషహరద్రాక్షాదికల్కలేపము.

మూ. ద్రాక్షామధుకకల్కేన స్తనౌ చాస్యాః ప్రలేపయేత్,
ప్రక్షాళ్య వారిణా చైవ నిర్దుహ్యాత్తౌ పునః పునః. 272

వ్యా. ద్రాక్షపండ్లను, అతిమధురమును నూరి కల్కముచేసి పాలిచ్చుస్త్రీయొక్క స్తనములకు పూసి యెండినపిదప నీళ్లచే కడుగవలెను. పిదప స్తనములయందలి పాలను నిశ్శేషముగ పిండవలెను. ఇత్తెరంగున పలుమారు చేసిన చనుబాలయందలి వైవర్ణ్య దోషము నశించును.

దౌర్గంధ్య స్తన్యదోషమునకు విషాణికాదికల్కము.

మూ. విషాణికాఽజశృఙ్గ్యౌ చ త్రిఫలాం రజనీం వచాం,
పిబేచ్ఛీతామ్బునా పిష్ట్వా క్షీరదౌర్గన్ధ్యనాశినీమ్. 273

వ్యా. కర్కాటకశృంగి, అజశృంగి (దుష్టపు ఆకు), త్రిఫలములు, పసుపు, వస, వీని నన్నిటిని చల్లనినీళ్లతో నూరి కల్కముచేసి త్రాగిన చనుబాలలో కల్గిన దుర్గంధము నశించును.

దౌర్గంధ్యహర అభయాదిచూర్ణావలేహము.

మూ. లిహ్యాద్వాఽప్యభయాచూర్ణం సవ్యోషం మాక్షికప్లుతం,
క్షీరదౌర్గన్ధ్యనాశార్థం ధాత్రీ పథ్యాశినీ తథా. 274

వ్యా. కరకకాయలను త్రికటుకములను చూర్ణముచేసి తేనెలో కలిపి పాలిచ్చు స్త్రీ సేవించి పథ్యాహారము చేసినయెడ చనుబాలలో కల్గిన దుర్గంధము నశించి శుద్ధమగును.

దౌర్గంధ్య స్తన్యదోషనాశకప్రలేపములు.

మూ. సారిబోశీరమఞ్జిష్ఠాశ్లేష్మాతకకుచన్దనైః,
పత్రామ్బుచన్దనోశీరైః స్తనౌ చాస్యాః ప్రలేపయేత్. 275

వ్యా. సుగంధపాలవేరు, వట్టివేళ్లు, మంజిష్ఠి, విరిగిచెట్టుపట్ట, రక్తచందనము, వీనినైనను; లవంగపత్రి, కురువేరు, చందనము, వట్టివేళ్లు, వీనినైనను మెత్తగ నూరి స్తన

ములకు పట్టువేసి యెండినపిదప నీళ్లతో కడిగి పాలను నిశ్శేషముగ పిండినచో స్తన్యము నందలి దుర్గంధదోషము నశించి శుభ్రమగును. (ఇత్తెరంగున పిత్తముచే గల్గు వైరస్య-దౌర్గంధ్యస్తన్యదోషముల రెండిటిచికిత్స చెప్పబడినది).

## కఫజస్తన్యదోషచికిత్సితము, అందు స్నిగ్ధదోషహారకల్కము.

మూ. స్నిగ్ధక్షీరా దారుముస్తపాఠాః పిష్ట్వా సుఖామ్బునా,
పీత్వా ససైన్ధవాః క్షిప్రం క్షీరశుద్ధిమవాప్నుయాత్. 276

వ్యా. చనుబాలయందు అతిస్నిగ్ధదోషము కలస్త్రీ దేవదారుచెక్క, తుంగగడ్డలు, చిరుబొద్ది వీనిని మెత్తగ నూరి, యందు సైంధవలవణమును కలిపి త్రాగినయెడ స్నిగ్ధదోషము నశించి శుద్ధమగును.

## పిచ్ఛిలదోషహారకల్కములు.

మూ. పాయయేత్ పిచ్ఛిలక్షీరాం శార్ఙ్గేష్టామభయాం వచామ్,
ముస్తనాగరపాఠాశ్చ పీతాః స్తన్యవిశోధనాః. 277
తక్రారిష్టం పిబేద్వాపి యదుక్తం గుదజాపహం,

వ్యా. స్తన్యము పిచ్ఛిలముగ నున్నపుడు గినియ, కరకకాయలు, వస, తుంగగడ్డలు, శుంఠి, చిరుబొద్ది, వీనిని మెత్తగ నూరి కల్కము చేసి నీళ్లలో కలిపి త్రాగవలెను. మరియు అర్శశ్చికిత్సితమున చెప్పబడిన తక్రారిష్టమునైనను త్రాగవలెను. దీనిచేత పిచ్ఛిలదోషము హరించి స్తన్యము శుద్ధమగును.

ఇచ్చట అర్శశ్చికిత్సితమున "హపుషాం కుఞ్చికాం ధాన్యం......కణ్డ్వార్తినాశనం బలవర్ధనమ్" (చి. అ. ౧౪. శ్లో. ౭౫-౭౬) అని చెప్పబడిన తక్రారిష్టయోగము నెరుంగునది.

## స్నేహ-పైచ్ఛిల్యదోషహర విదార్యాదిలేపము.

మూ. విదారీబిల్వమధుకైః స్తనౌ చాస్యాః ప్రలేపయేత్. 278

వ్యా. నేలగుమ్మడిగడ్డ, మారేడువేరు, అతిమధురము, వీనిని మెత్తగ నూరి స్తనములకు బూసి యెండినపిదప శుభ్రముగ కడిగి పాలను పిండిన పైజెప్పిన స్నేహ-పైచ్ఛిల్యస్తన్యదోషములు నశించును.

గురుత్వదోషహారకషాయములు.

మూ. త్రాయమాణాఽమృతానిమ్బపటోలత్రిఫలాశృతం,
గురుక్షీరా పిబేదాశు స్తన్యదోషవిశుద్ధయే. 279

వ్యా. కానుగపట్ట, తిప్పతీగె, వేపపట్ట, చేదుపొట్ల, త్రిఫలములు, వీనిని సమ భాగములు గూర్చి కషాయము కాచి త్రాగిన క్షీరమునందలి గురుత్వ (భారము) దోషము నశించి శుద్ధమగును.

గురుత్వహార పిప్పలీమూలాదికల్కము.

మూ. పిబేద్వా పిప్పలీమూలచవ్యచిత్రకనాగరం,

వ్యా. మోడి, చవ్యము, చిత్రమూలము, శుంఠి, వీనిని నూరి కల్కముచేసి త్రాగినను గురుత్వదోషము నశించి స్తన్యము శుద్ధమగును.

గురుత్వస్తన్యదోషహారలేపములు.

మూ. బలానాగరశార్ఙ్గేష్టా మూర్వాభిర్లేపయేత్ స్తనౌ. 280
పృశ్నిపర్ణీపయస్యాభ్యాం స్తనౌ చాస్యాః ప్రలేపయేత్,

వ్యా. చిట్టాముట్టి, శుంఠి, గినియ, చాగపట్ట, వీనిని నూరి స్తనములకు లేపనము చేసినను; ముయ్యాకుపొన్న, మనుబాల, ఈరెంటిని నూరి స్తనములకు బూసినను గురుత్వ స్తన్యదోషము హరించును. (ఈచెప్పబడిన చికిత్సలు కఫజస్తన్యదోషములను హరించు నవియని యెరుంగునది.)

మూ. అష్టావేతే క్షీరదోషాః హేతులక్షణభేషజైః. 281
నిర్దిష్టాః క్షీరదోషోత్థాః తథోక్తాః కేచిదామయాః,

వ్యా. ఇత్తెరంగున నెనిమిదివిధములైన క్షీరదోషంబులును, అవి జనించుటకు కారణములును, ప్రత్యేకలక్షణంబులును, వేరువేరు చికిత్సలును చెప్పబడినవి. మరియు నట్టి క్షీరదోషమువలన దానిని త్రాగునట్టి బాలురకు సంభవించు కొన్నిరోగంబులును నిర్దేశింపబడినవి.

బాలరోగచికిత్సాక్రమము.

మూ. దోషదూష్యమలాశ్చైవ మహతాం వ్యాధయశ్చ యే. 282
త ఏవ సర్వే బాలానాం మాత్రా త్వల్పతరా మతా,
నివృత్తిర్వమనాదీనాం మృదుత్వం పరతన్త్రతామ్. 283

వాక్చేష్టయోరసామర్థ్యం వీక్ష్య బాలేషు శాస్త్రవిత్,
భేషజం స్వల్పమాత్రం తు యథావ్యాధి ప్రయోజయేత్. 284

వ్యా. వాతాదిదోషంబులును, రక్తమాంసాదిదూష్యంబులును, పురీషమూత్ర స్వేదాదిమలంబులును, జ్వరాదిరోగంబులును వయసుచే గొప్పవారగువారి కుండునవియే బాలురకు నుండును. కాని అట్టిదోషదూష్యాదులు బాలురకు మాత్రము స్వల్పపరిమాణము కల్గియుండును. (కావున వారికిం గల దోషదూష్యాదిప్రమాణానుగుణముగ నౌషధములకు పరిమాణము మిగుల స్వల్పముగ గల్పించి మిక్కిలి మెలకువతో నుపయోగింపవలెనని భావము.)

మరియు—బాలురు మిక్కిలి సుకుమారులును పరతంత్రులు నైయుందురు. దానంజేసి కాగ్వ్యాపారమునందును, అంగచాలనాదిచేష్టలయందును సామర్థ్యము దక్కియుందురు. అట్టియెడ శోధనరూపములైన వమనవిరేచనాది పంచకర్మములను బాలురకు చేయక విడువందగును. శమనరూపమైన యౌషధమును మాత్రము వారికిం గల దోష - దూష్య - రోగబలాదులను పరిమాణమును చక్కగ గమనించి తదుచితపరిమితితో నాయావ్యాధులకు తగిన ట్లుపయోగింపం దగును.

(బాలురు స్వతంత్రవృత్తులును పరతంత్రవృత్తులు నై వయోభేదము ననుసరించి యుందురు. అందు పరతంత్రులుగ నుండునవస్థయందును, మిక్కిలి సుకుమారులుగ నున్నపుడును వమనాదిచికిత్సల బొత్తుగ మానవలెను. కొంచెము స్వతంత్రత కల్గియున్నపుడు వమనాదులను మృదువులగు నౌషధములచే బలానుసారముగ చేయదగును. మరియు శమనౌషధమును శిశువులయొక్క వాక్చేష్టలసామర్థ్యమును కనుగొని తదుచితముగ స్వల్పపరిమాణమును గల్పించి ఆయావ్యాధికి దగిన ట్లుపయోగింపవలెనని సముదితార్థము.)

బాలోపయోగ్యౌషధవిశేషములు.

మూ. మధురాణి కషాయాణి క్షీరవన్తి మృదూని చ,
ప్రయోజయేత్ భిషక్ బాలే మతిమానప్రమాదతః. 285

వ్యా. బాలురవిషయమై మధురంబులును, కషాయరసంబులును, పాలతో కూడినవియు మృదుగుణంబులును నైన యౌషధములను వైద్యవరుడు మిక్కిలి మెలకువతో దోషదూష్యాదిపరిస్థితిని చక్కగ గమనించు పొరబాటు లేక యుపయోగింపవలయును.

బాలురకు నిషిద్ధములగు నౌషధాన్నపానములు.

మూ. అత్యర్థస్నిగ్ధరూక్షోష్ణమమ్లం కటువిపాకి చ,
గురు చౌషధపానాన్న మేతద్బాలేషు గర్హితమ్. 286

వ్యా. మిక్కిలి స్నిగ్ధంబులును, రూక్షంబులును గుణవీర్యంబులచే నుష్ణంబులును, అమ్లరసంబులును, కటువిపాకంబులును, గురుత్వము గల్గినవియు నగు నౌషధములను, అన్నపానములను బాలురకు నొకప్పుడు నుపయోగింప జనదు.

బాలరోగచికిత్సాసంగ్రహము.

మూ. సమాసాత్సర్వరోగాణామేతద్బాలేషు భేషజం,
నిర్దిష్టం శాస్త్రవిద్వైద్యైః ప్రవివిచ్య ప్రయోజయేత్. 987

వ్యా. ఇత్తెరంగున బాలురకు సంభవించు జ్వరాదిరోగముల కన్నిటికిని చికిత్స సంగ్రహముగ నిర్దేశింపబడినది. శాస్త్రపరిజ్ఞానముగల విద్వద్వైద్యుడు నట్టిచికిత్సల నన్నిటిని నాయావ్యాధులకు తగినట్లు విభజించి యుక్తియుక్తముగ నుపయోగింపదగును.

ఇచ్చట స్తన్యదోషముల నిరూపించునపుడు అట్టి దుష్టస్తన్యదోషముచే బాలురకు సంభవించు రోగములు నిర్దేశింపబడినవి. పిమ్మట నాబాలరోగములకు వలసిన చికిత్స "దోషదూష్యమలాశ్చైవ" అని యుపక్రమించి సంగ్రహముగ చెప్పబడినవని యెఱుంగునది. (మరియు నిచ్చట "అత్యర్థస్నిగ్ధ......ప్రయోజయేత్" అని చెప్పబడిన శ్లోకములు రెండును అనార్షములను విషయమును వివాదగ్రస్తమని చక్రపాణిదత్తవ్యాఖ్యానమున నున్నది.)

చికిత్సితస్థానప్రాశస్త్యము.

భవన్తి చాత్ర:—

మూ. ఇతి సర్వవికారాణాముక్తమేతచ్చికిత్సితం,
స్థానమేతద్ధి తన్త్రస్య రహస్యం పరముత్తమమ్ (ముచ్యతే). 288

వ్యా. ఇత్తెరంగున జ్వరాదిరోగముల కన్నిటికిని వలసిన చికిత్సితము విస్తరముగ నీస్థానమున చెప్పబడినది. (కావున నీతంత్రమునందు ఈచికిత్సితస్థానము మిక్కిలి పరమ రహస్యమై యుత్తమోత్తమముగ నుండును. ఈచికిత్సాస్థానమున మిక్కిలి యుపయోగింప దగిన చికిత్స లన్నియు విస్తరముగ చెప్పబడుటంజేసి దీనిని పాపిష్ఠులుగ నుండు వారికి చెప్పదగదు కాని సద్గుణవిశిష్టులగు శిష్యులకు మాత్రము చెప్పదగునని "రహస్యం" అనుపదముచేత తంత్రకారు లుపదేశించిరి. "సర్వవికారాణాం" అనుటచేత ఈస్థానమున అనుక్తమైన రోగములకును తత్తదనుగుణములుగ దోషదూష్యాదుల నిర్ణయించి తత్త దుచితముగ చికిత్సలను కల్పింపదగునని సూచితము.)

## ఈతంత్రమున దృఢబలసంపూరితవిషయవిభాగము.

మూ. అస్మిన్నష్టదశాధ్యాయాః కల్పాః సిద్ధయ ఏవ చ,
నాసాద్యన్తేఽగ్నివేశస్య తన్త్రే చరకసంస్కృతే. 289
తానేతాన్కాపిలబలిః శేషాన్ దృఢబలోఽకరోత్,
తన్త్రస్యాస్య మహార్థస్య పూరణార్థం యథాతథమ్. 290

వ్యా. అగ్నివేశకృతంబును చరకునిచే ప్రతిసంస్కృతంబును నగు నీయాయుర్వేద తంత్రమునందలి చికిత్సాస్థానమున పదునేడధ్యాయంబులును, కల్పసిద్ధిస్థానంబులు పూర్తిగను దొరకలేదు. అట్టి లోపించిన భాగమును (చికిత్సయందలి పదునేడధ్యాయంబులును, కల్పస్థానమునందలి పండ్రెండధ్యాయములును, సిద్ధిస్థానమునందలి పండ్రెండధ్యాయములును చేరి నలుబదియొక యధ్యాయములను), పంచనదపురవాస్తవ్యులగు కపిలబలియను వారికి పుత్రుడైన 'దృఢబలుడు' అనువాడు పూర్తిగావించి, మిక్కిలి విశేషాంశములతో గూడి ప్రశంసార్హమైన యాతంత్రమును సంపూర్తి చేసెను.

ఇచ్చట నీవిమర్శనము నెరుంగునది:—భరద్వాజునకు శిష్యుడైన యాత్రేయుని వలన నగ్నివేశులు ఆయుర్వేదమును పూర్తిగ నుపదేశమునొంది, తానుపదేశమునొందిన దానికి న్యూనాతిరేకము లేకుండునట్లు ఆయుర్వేదతంత్రమును రచియించెను. ఈవిషయమును అగ్నివేశులు ప్రతియధ్యాయమునందును "ఇతి హ స్మాహ భగవానాత్రేయః" అనువాక్యముచే సూచించెను.

అగ్నివేశకృతంబైన యాతంత్రమును చరకులను నామాంతరముకల వ్యాకరణ మహాభాష్య కర్తయగు పతంజలి సంస్కరించి చరకసంహిత యనుపేర నెలకొల్పెను. ఆయ్యది కొన్నికారణాంతరములచే చివరభాగమున కొంతభాగము లుప్తమై తంత్రము సంపూర్ణముగ లభింపకుండుతరి, అట్టిలోపమును నివర్తింప నుద్దేశించి పంచనదపురవాస్తవ్యుడును, కపిలబలపుత్రుండును నగు దృఢబలుడను మహనీయుడు లోపించిన తంత్రభాగమును రచించి పూర్తిగావించెను. తాను లుప్తపూరణము చేసినభాగమునే "అస్మిన్ నష్టదశాధ్యాయాః...పూరణార్థం యథాతథమ్" అను శ్లోకములచే తాను నిర్దేశించెను.

అగ్నివేశకృతమై చరకప్రతిసంస్కృతమైన తంత్రమునందలి చికిత్సాస్థానమున పదునేడధ్యాయములు తనకు చిక్కలేదని కంఠోక్తిగ నుడివెను. ఆయధ్యాయము లేవి యన—చికిత్సాస్థానమున ప్రథమాధ్యాయము మొదలు రాజయక్ష్మ చికిత్సితాంతము వరకుం గల యధ్యాయము లెనిమిదియు, తక్కినభాగమునంగల అర్శశ్చికిత్సితము (౧౪),

అతిసారచికిత్సితము (౧౯), విసర్పచికిత్సితము (౨౧), ద్వివ్రణీయచికిత్సితము (౨౫), మదాత్యయచికిత్సితము, అనునీయధ్యాయములు పదుమూఁడు దక్క తక్కిన పదునే డధ్యాయములును, కల్పసిద్ధిస్థానంబులు పూర్తిగను దృఢబలప్రతిసంస్కృతమని యెఱుంగునది.

ఈనిర్ణయము నే యీశ్లోకముల వ్యాఖ్యానమున చక్రపాణిదత్తు డిట్లుచెప్పెను:— "అస్మిన్ చికిత్సాస్థానే సప్తదశాధ్యాయాః, తే చ చరకసంస్కృతాన్ యక్ష్మచికిత్సితాన్తాన్, అష్టావధ్యాయాన్, తథా అర్శోఽతీసారవిసర్పద్వివ్రణీయ మదాత్యయాన్ విహాయ జ్ఞేయాః." ఈవ్యాఖ్యానమునుబట్టి పైఁగనబరచిన యధ్యాయములు పదుమూఁడును చరకప్రతిసంస్కృతము లనియు, తక్కుం గల పదునేడధ్యాయములును, చికిత్సాస్థానమున దృఢబలప్రతిసంస్కృతములై చికిత్సాస్థానము లుప్తపూరణము (దృఢబలునిచే) గావింపబడియెననియు స్పష్టమగుచున్నది. ఇదియే సిద్ధాంతము. ఇట్టి యధ్యాయవిభాగవిషయమై ప్రమాణాంతరము లనేకములు గలవు. అవి యన్నియుం స్థలాంతరమున వివరింపబడును. విస్తరభీతిచే నిట నావివరణము విడువంబడియె.

## అనుక్తరోగములకు చికిత్సాతిదేశము.

మూ. రోగా యేఽప్యత్ర నోద్దిష్టాః బహుత్వాన్నామరూపతః,
తేషామప్యేతదేవ స్యాత్ దోషాదీన్ వీక్ష్య భేషజమ్. 291

వ్యా. రోగము లనంతము లగుటంజేసి ఈచికిత్సాస్థానమున చికిత్సానిమిత్తమై నామరూపభేదములచే నిర్దేశింపబడని యేరోగములు లోకమున కలవో, అట్టిరోగముల కన్నిటికిని యీచికిత్సితమున జెప్పబడిన చికిత్సనే వానిదోషదూష్యనిదానముల నీక్రింద జెప్పబడువానిని చక్కగ గమనించి చేయదగును. (రోగముల కంతములేదు. కావున సంఖ్యాతీతము లైయుండును. దానంజేసి వాని నన్నింటిని నిర్దేశించి నామరూపభేదములచే వివరింప నేరికి నలవికానిపని. కావున నీస్థానమున నామరూపభేదములచే నిర్ణయింపబడక యుండు వ్యాధులకును ఇచ్చట చెప్పబడిన చికిత్సితమే యుక్తముగ నుండును. అట్టిరోగములకు వానిలక్షణములబట్టి దోషములను రక్తాదిధాతువులను వాని యుత్పత్తికారణములను చక్కగ గమనించి యీక్రింద జెప్పబడువిధముగ దోషాది ప్రత్యనీకమైన చికిత్సను కల్పింపవలెనని భావము.)

## ఉక్తాఽనుక్తరోగములకు దోషాదివిపరీతచికిత్సాతిదేశము.

మూ. దోషదూష్యనిదానానాం విపరీతం హితం ధ్రువం,
ఉక్తాఽనుక్తాన్ గదాన్ సర్వాన్ సమ్యగ్యుక్తం నియచ్ఛతి. 292

వ్యా. వాతాదిదోషములకును, రక్తాదిదూష్యములకును, ఆయావ్యాధులకు నిదానములైన రూక్షాదులకును వ్యస్తముగ నైనను అన్నింటికినైనను విపరీతముగను హితముగ నుండునౌషధమును ఈక్రింద జెప్పబడు దేశకాలాదులకు సమ్యగ్యుక్తముగ నుపయోగించిన నాయౌషధము ఈచికిత్సితమున జెప్పబడిన జ్వరాదిరోగములను, అనుక్తములగు రోగముల నన్నింటిని తప్పక శమింపజేయును. (ఈచికిత్సితమున నామరూపములచే నిర్దేశింపబడిన జ్వరాదిరోగములకు, దోషదూష్యనిదానములకు విపరీతంబును హితంబునైన యౌషధము చెప్పబడినది; అట్టియౌషధమునే యిచ్చట జెప్పబడనిరోగములకు జేరిన దోషదూష్యనిదానముల జక్కగ గమనించి వానికి విపరీతమగు నౌషధమును గల్పించి సమ్యగ్యుక్తముగ నుపయోగించినయెడ నారోగముల నన్నింటిని తప్పక నివర్తిపరచునని భావము.)

ఇచ్చట నీవివరణము నెరుంగునది:—సకలరోగములకును కారణములు ప్రకోపమునొందిన వాతాదిదోషములు. అట్టి వాతాదిప్రకోపమునకు కారణము వాతాదులకు సమానగుణములైన యాహారవిహారాదులు. ఇవియే నిదానశబ్దముచే జెప్పబడును. అట్టి నిదానమునకు విపరీతగుణాదులు దోషములకును విపరీతమే యగును. ఎట్లులన—రూక్షగుణముచే ప్రకోపము నొందినవాతమునకు స్నేహగుణముకల నిదానము విపరీతమే యగును. అట్టియెడ దోషవిపరీత మని చెప్పిన చాలును. నిదానశబ్దము ప్రత్యేకముగ నెందుకు? అన్నచో:—వాతము స్వప్రకోపణనిదానములైన గుణాదు లన్నిటిచే ప్రకోపము నొందినపుడు, అట్లు సర్వాత్మనా విపరీతమైన తైలము నుపయోగింపదగును. అట్లుగాక వాతము కేవలము శీతగుణము మాత్రముచే ప్రకోపము నొందియున్నయెడ సర్వదా విరుద్ధమైన తైలమును వదలి నిదానమై వాతవర్ధకమైన శీతగుణమునకు మాత్రము విరుద్ధమైన ఉష్ణగుణము కల యౌషధము నుపయోగింపవలెను. ఇత్తెరంగుననే దోషము ఎట్టి నిదానగుణాదులచే నేయంశమున వృద్ధినొందునో, అట్టి వృద్ధినొందిన దోషాంశమునకు విరుద్ధమైన యౌషధమునే యుపయోగింపనగునని శాసించుటకై "దోషదూష్యనిదానానాం విపరీతం" అని తంత్రకారులు చెప్పిరి. ఈవిషయమునే విమానస్థానమున "శీతేనోష్ణకృతాన్ రోగాన్ శమయన్తి భిషగ్విదః." (వి. అ. 3) అని చెప్పిరి.

మరియు—దోషదూష్యనిదానవిపరీతమనుటచేత దోషదూష్యనిదానసముదాయార్థమైన రోగంబును గ్రహింపబడును. ఇట్లు చెప్పుటచేత వ్యాధివిపరీతంబును ఉక్తప్రాయము. విపరీతశబ్దముచేత విపరీతార్థకారియు గ్రహింపబడును. ఈవివరణమునుబట్టి అనుక్తరోగములకు దోషదూష్యనిదానాదుల పరిస్థితిని ఆయాలక్షణములచేచక్కగ గమనించి అట్టి దోషాదులకును వ్యాధులకును విపరీతగుణంబులును విపరీతార్థకరంబులును నగు

నౌషధముల గల్పించి తత్తదుచితముగ నుపయోగించవలెననియు, అట్టి యుపయోగముచే నుక్తరోగములు శమించువిధముగనే అనుక్తరోగంబులును తప్పక నివర్తించునని నిష్కృష్టార్థము ఏర్పడును.

## సమ్యగ్యోగనిరూపణము.

మూ. దేశకాలప్రమాణానాం సాత్మ్యాఽసాత్మ్యస్య చైవ హి,
సమ్యగ్యోగోఽన్యథా హ్యేషాం పథ్యమప్యన్యథా భవేత్. 293

వ్యా. యోగమున సంబంధము, అట్టి సంబంధము విధ్యుక్తప్రకారముగ గల్పింపబడినయెడ నయ్యది సమ్యగ్యోగ మనబడును. అట్టి సమ్యగ్యోగము గల్గియుండు నౌషధము సమ్యగ్యుక్త మనబడును. దోషదూష్యనిదానములకు విపరీతమై సమ్యగ్యుక్తమైన యౌషధము వ్యాధుల నన్నిటిని హరింప గల్గునని పైని నిర్దేశింపబడినది. అట్టి సమ్యగ్యోగము ఔషధములకు వేనితో కల్గియుండవలెనన్న నవి యీశ్లోకమున వివరింపబడును.

దేశము (రోగిశరీరరూపమైనదేశము), దిన-ఆతుర-ఔషధ-వ్యాధి-జీర్ణలింగ-ఋతువుల నపేక్షించి యారుతెరంగులైన కాలము, ఔషధప్రమాణము, (అల్ప-బహు-సమ భేదములచే మూడువిధములైన ప్రమాణము), దేశమునకును శరీరమునకును సంబంధించిన సాత్మ్యము, అసాత్మ్యము (సాత్మ్యము కానిది) అను నీయైదిటితో సమ్యగ్యోగము (విధ్యుక్తమైన యోజనము) కల్గినయౌషధము వ్యాధినివర్తకదక్షమగును. అటుగాక దేశకాలాదులతో సమ్యగ్యోగము లేనియౌషధము దోషదూష్యనిదానములకు విపరీతముగను పథ్యముగ నున్నను, అయ్యది హితము (వ్యాధినివర్తకము) కానోపదు.

ఇచ్చట భూమి-శరీరభేదములచే రెండుతెగంగులైన దేశములలో భూమిరూపదేశము సాత్మ్యయోజనానిరూపణముచేతనే గతార్థము కావున దేశశబ్దముచేత శరీరరూపదేశము మాత్రము వివక్షితము. సాత్మ్యశబ్దముచేత దేశసాత్మ్యంబును శరీరసాత్మ్యంబును గ్రహింపబడును.

పైజెప్పినరీతిగ యోజనము దేశ-కాల-ప్రమాణ-సాత్మ్య-అసాత్మ్యములకు సంబంధించి యైదువిధములుగ నుండును. వీని కన్నిటికిని "ఆస్యాదామాశయస్థాః హి...... నాతిదోషం చ బహ్వపి." (అ-౮-౩౧౯) అను నీక్రిందిగ్రంథముచే విస్తరముగ నుదాహరణములు తంత్రకారులచే నుపదేశింపబడును.

## 1. దేశ (శరీర)మునకు సంబంధించి యౌషధమునకు సమ్యగ్యోగము, దాని కుదాహరణము.

మూ. ఆస్యాదామాశయస్థాన్ హి రోగాన్, నస్తశ్శిరోగతాన్,
గుదాత్ పక్వాశయస్థాంశ్చ హన్త్యాశు దత్తమౌషధం
(హన్త్యాశుతరమౌషధమ్.) 294
శరీరావయవోత్థేషు విసర్పపిడకాదిషు,
యథాదేశం(దోషం) ప్రదేహాది శమనం స్యాద్విశేషతః. 295

వ్యా. రోగియొక్క నోటినుండి యుపయోగింపబడిన వమనాద్యౌషధములు ఆమాశయమునందలి రోగములు మిక్కిలి శీఘ్రముగ హరించును. (నోటికి ఆమాశయము సన్నిహితప్రదేశము కావున నోటినుండి యుపయోగింపబడిన వమనాద్యౌషధము శీఘ్రముగ నామాశయమున జేరి యందలి దోషములను అతిశీఘ్రముగ వెడలింపజేయునని భావము. ఇత్తెరంగుననే తక్కినవానికిని అర్థము నెరుంగునది.)

మరియు — నాసారంధ్రములనుండి ప్రయోగింపబడిన నస్యాద్యౌషధములు శిరోగతరోగములను, గుదమునుండి ప్రయోగింపబడిన వస్తి మున్నగు నౌషధములు ఆమాశయమునందలి వ్యాధులను అతిశీఘ్రముగ హరించును. (ఇది అంతఃపరిమార్జనరూపమైన యౌషధప్రయోగము.)

మరియు శరీరమునందలి పైభాగమున (చర్మమున) కల్గిన విసర్పము, పిడకలు మున్నగు రోగములయందు ఆయారోగము కల్గినయంగమున (ప్రదేశమున) ప్రలేపము, పరిషేకము, ఉపనాహము మున్నగువాని నుపయోగించినచో నాయావ్యాధులు అతిశీఘ్రముగ శమించును. (ఇది బహిఃపరిమార్జనరూపభేషజప్రయోగము. ఈ గ్రంథముచేత అంతఃపరిమార్జన-బహిఃపరిమార్జనరూపచికిత్సాప్రయోగమునకు దేశసమ్యగ్యోగ ముదహరింపబడినది.)

## కాలమునకు సంబంధించిన సమ్యగ్యోగము, అందు షడ్విధకాలవిభాగము.

మూ. దీనాతురౌషధవ్యాధిజీర్ణలిఙ్గర్త్వవేక్షణమ్,
కాలం విద్యాత్

వ్యా. దీనము, (రోగియొక్క బలాదులనుబట్టి యౌషధోపయోగ్యకాలము), ఔషధము నుపయోగింప దగినకాలము, వ్యాధివిశేషమునకు సంబంధించి యౌషధోపయోగ్యకాలము, జీర్ణావస్థలక్షణములబట్టి యౌషధోపయోగ్యకాలము, వసంతాదిఋతు

భేదములబట్టి యౌషధోపయోగ్యకాలము అను భేదములచే కాలము ఆరువిధములుగ నుండును. (అట్టి యారువిధములైన దినాదిభేదములబట్టి తత్తదుచితముగ వేరువేర నిర్ణయింపబడిన కాలము నపేక్షించి యుపయోగింపబడిన యౌషధము సమ్యగ్యోగయుక్తమని చెప్పబడును. ఇది కాలమును గమనించి యౌషధోపయోగరూపసమ్యగ్యోగము.)

### దినాపేక్షితకాలసమ్యగ్యోగము.

మూ. దినాపేక్షః పూర్వాహ్ణే వమనం యథా. 296

వ్యా. పూర్వాహ్ణమున వమనౌషధమును సేవింపవలెనని విధింపబడినది. ఇది దినము నపేక్షించిన యౌషధకాలము. (అట్టి కాలమున నుపయోగింపబడిన వమనౌషధము దినరూపకాలము నపేక్షించి సమ్యగ్యుక్తమగును. ఇత్తెరంగుననే తక్కినవాని కన్నిటికిని లక్షణసమన్వయము నెరుంగునది.)

"ప్రాయః పిత్తకఫోద్రేకే విరేకవమనార్థయోః, లేఖనార్థం చ భైషజ్యం ప్రభాతేఽనన్నమాహరేత్" అని తంత్రాంతరమున విధింపబడినది. వమనాదులకు విధింపబడిన కాలము దినరూపమని యెరుంగునది.

### రోగ్యపేక్షాకాలకృతసమ్యగ్యోగము.

మూ. రోగ్యపేక్షో యథా ప్రాతః నిరన్నో బలవాన్ పిబేత్,
భేషజం లఘుపథ్యాన్నైః యుక్తమద్యాత్తు దుర్బలః. 297

వ్యా. బలశాలిగ నుండురోగి ప్రాతఃకాలముననే పరగడుపున నౌషధమును సేవించి భుజింపక యుండవలెను. రోగి బలహీనుడుగ నున్నయెడ ప్రాతఃకాలముననే యౌషధమును సేవించి పథ్యంబులైన వ్యంజనాదులతో లఘువైన యన్నమును భుజించవలెను. ఇచ్చట రోగియొక్క బలాఽబలములను గమనించి యౌషధకాలము విధింపబడినది. కావున నియ్యది రోగ్యపేక్షకాలము.

### ఔషధకాలవిభాగము.

మూ. భైషజ్యకాలో భుక్తాదౌ, మధ్యే, పశ్చాత్, ముహుర్ముహుః,
సాముద్గం, భక్తసంయుక్తం, గ్రాసే, గ్రాసాన్తరే దశ. 298

వ్యా. భోజనమునకు ముందు కాలము (ఇయ్యది ప్రాతఃకాలమున నిరాహారముగ నుండుకాలము, భోజనసమయమునకు సన్నిహితమైన ముందటికాలము, అను భేదములచే రెండువిధములుగ గ్రహింపదగిన యౌషధకాలములు), భోజనమధ్యకాలము (ఈకాలమున సగము ఆహారమును భుజించి నడుమ నౌషధమును సేవించి,అప్పుడే తక్కిన సగమునాహార

మును భుజింపదగును. ఇదియే భోజనమధ్యకాలము), భోజనమునానంతరకాలము, (ఇదియు ప్రాతర్భోజనోత్తరకాలము, సాయంభోజనోత్తరకాలము నని రెండు కాలములుగ గ్రహింప నగును). భోజనసమయమున మాటిమాటికి నౌషధము నుపయోగించుకాలము, సాముద్గము, భోజనమునకు ముందును భుజించినపిమ్మటను ఔషధమునుపయోగింప దగినకాలము. ముందు ఔషధమును సేవించి వెంటనే యాహారమును భుజించి మరల నప్పుడే యౌషధమును సేవించవలెను. (ఈయౌషధకాలము భోజనమునకు ముందును వెనుకను ఆహారమునకు సంపుటమునుబోలె గ్రమ్మియుండుటంజేసి సాముద్గ మనబడును). అన్నముతో కూడ నౌషధమును సంస్కారాది రూపముగ జేర్చి భుజించిన నీయౌషధకాలము భక్తసంయుతము. అన్నమును భుజించునపుడు ప్రతికబళమున నందాహారమును జేర్చి యుపయోగించిన నాయౌషధకాలము గ్రాసశబ్దముచే చెప్పబడినది. ఒక కబళమును తిని ఔషధమును సేవించి వేరొకకబళమును తినుచు నిట్లు పలుమారు ప్రతికబళమునకును మధ్యకాలమున నౌషధము నుపయోగించిన నయ్యది గ్రాసాంతరకాలము. ఇత్తెరంగున నౌషధోపయోగ్యకాలము పదివిధములుగ నుండును. (ఈకాలములలో నేయేకాలమున నేవిధముగ నౌషధము విహితమైయుండునో ఆవిధి ననుసరించి యుపయోగించుటయే యౌషధకాలకృతసమ్యగ్యోగ మనబడును. వీని కుదాహరణములు క్రింద జెప్పబడును.)

## ఔషధకాలముల కుదాహరణము.

మూ. అపానే విగుణే పూర్వం, సమానే మధ్యభోజనమ్,
వ్యానే తు ప్రాతరశితం, (వ్యానేఽన్తే ప్రాతరాశస్య)
ఉదానే భోజనోత్తరమ్. 299
వాయౌ ప్రాణే ప్రదుష్టే తు గ్రాసగ్రాసాన్తరిష్యతే,
శ్వాసకాసపిపాసాసు త్వవచార్యం ముహుర్ముహుః. 300
సాముద్గం హిక్కినే దేయం, లఘునాఽన్నేన సంయుతం,
సంభోజ్యం చౌషధం భోజ్యైః విచిత్రైరరుచౌ హితమ్. 301

వ్యా. అపానవాతము ప్రకుపితమైనపుడు అన్నమును భుజించుటకు ముందును, సమానవాతము ప్రకోపమునొందినపుడు భోజనమధ్యకాలమునను, వ్యానవాతము ప్రకుపితమైనపుడు భోజనమునకు ముందుకాలమునను, ఉదానవాతము ప్రకోపించినపుడు భోజనానంతరంబును, ఔషధము నుపయోగింపవలెను. మరియు ప్రాణవాతము ప్రకోపించినపుడు ప్రతిగ్రాసమునందైనను, కబళములకు మధ్యకాలమునందైనను ఔషధమును

సేవింపనగును. శ్వాస-కాసములయందును దప్పియందును ఔషధమును భుజించునపుడు పలుమారు ఔషధము నుపయోగింపవలెను. (ఇది "ముహుర్ముహుః" అనుకాలమున కుదాహరణము). ఎక్కిళ్లు కలవానికి భోజనమునకు ముందును భుజించినవెనుకను ఔషధము నియ్యవలెను. (ఇది సాముద్గకమున కుదాహరణము). లేక తేలికయైన యవాగువు మున్నగు నాహారపదార్థములతో నౌషధమును కలిపియైనను, సంస్కారరూపముగ జేర్చియైన నుపయోగింపదగును. (ఇది భక్తసంయుతమను కాలమున కుదాహరణము). అరోచకమున చిత్రమైన రుచికల భోజ్యపదార్థములయందు ఔషధమును కలిపి యుపయోగింపవలెను. (ఇదియును భుక్తసంయుతమను కాలమున కుదాహరణము. ఇత్తెరంగున విధింపబడిన కాలము ననుసరించి యుపయోగింపబడిన యౌషధము ఔషధకాలమునకు సంబంధించి సమ్యగ్యుక్తమని యెరుంగునది.)

### రోగమునకు సంబంధించిన యౌషధకాలము.

మూ॥ జ్వరే పేయాః కషాయాశ్చ క్షీరం సర్పిర్విరేచనం,
షడహే షడహే దేయం కాలం వీక్ష్యాఽఽమయస్య చ. 302

వ్యా॥ జ్వరమునందు పేయలను (యవాగువులను), కషాయములను, క్షీరమును, ఘృతమును, విరేచనౌషధమును, వీనిని వరుసగ జ్వరప్రారంభదినము మొదలుజేసి యొక్కొకదాని నారేసి దినములవంతున జ్వరముయొక్క అవస్థావిశేషకాలమును చక్కగ గమనించి యుపయోగింపందగును. (ఇది వ్యాధియొక్క అవస్థావిశేషమునకు జేరినకాలమును అపేక్షించి చెప్పబడినదికావున వ్యాధికాలము ననుసరించిన సమ్యగ్యోగమున కుదాహరణము.)

### జీర్ణకాలలక్షణములబట్టి సమ్యగ్యోగము.

మూ॥ క్షుద్వేగమోక్షౌ లఘుతా విశుద్ధిర్జీర్ణలక్షణం,
తదా భేషజమాదేయం స్యాద్ధి, దోషవదన్యథా. 303

వ్యా॥ ఆకలి చక్కగ కల్గుట; మలమూత్రాదులు యథాకాలమున బద్ధము లేక సరళముగ వెడలుట, శరీరము తేలిక యైయుండుట, త్రేనుపులు ఆహారరససంబంధము లేక శుద్ధముగ వెడలుట, ఇది యాహారము జీర్ణమైనపుడు కల్గులక్షణములు. ఈలక్షణములబట్టి జీర్ణదశను చక్కగ గమనించి అట్టి జీర్ణకాలమున నౌషధము నుపయోగింపనగును. అటుకాక అజీర్ణకాలమునం దౌషధమును ప్రయోగించినచో చెరుపు కల్గును. (ఇది జీర్ణలక్షణములకు జేరినకాలము. ఈకాలము నపేక్షించిన సమ్యగ్యోగమున కుదాహరణ మిదియని యెరుంగునది).

### ఋతురూపకాలము నపేక్షించిన సమ్యగ్యోగము.

మూ. చయాదయశ్చ దోషాణాం వర్జ్యం సేవ్యం చ యత్ర యత్,
ఋతావపేక్ష్యం యత్కర్మ పూర్వం సర్వముదాహృతమ్. 304
ఉపక్రమాణాం కరణం ప్రతిషేధే చ కారణం,
వ్యాఖ్యాతమబలానాం సవికల్పానామవేక్షణే. 305
ముహుర్ముహుశ్చ రోగాణాం అవస్థామాతురస్య చ,
అవేక్షమాణస్తు భిషక్ చికిత్సాయాం న ముహ్యతి. 306

వ్యా. శిశిరాది ఋతువులయందు దోషముల చయప్రకోపప్రశమంబులును, ఆయాదోషముల చయాద్యవస్థాభేదముల ననుసరించి ఆయాఋతువులయందు విసర్జింపదగినవియు, సేవింపదగినవియు సూత్రస్థానమున (తస్యాశితీయాధ్యాయమున) వివరింపబడినవి. మరియు నాయాఋతువునందును దోషముల చయాద్యవస్థల ననుసరించి చేయదగిన సామాన్యచికిత్సితంబును, కొన్నిటిని నిషేధించుటకు కారణంబును, బలాఽబలావేక్షణకారణంబును వివరింపబడినవి. వాని ననుసరించి ఆయారోగములయొక్క అవస్థావిశేషములను, రోగియొక్క బలాఽబలములను పలుమారు గమనించి విధ్యుక్తప్రకారము ఆయాఋతుచర్యలను చక్కగ గమనించి చికిత్సజేయు వైద్యుడెప్పుడును పొరబాటు లేకుండును. (ఇది ఋతురూపకాలము నపేక్షించిన సమ్యగ్యోగమున కుదాహరణము. ఇదియే ఋతుసాత్మ్యమనియుం చెప్పబడును. ఇచ్చట "ఉపక్రమాణాం కరణం" అని యుపక్రమించి చెప్పబడిన శ్లోకములు రెండును అనార్షములని వ్యాఖ్యాతల యభిప్రాయము).

### పైజెప్పినకాలము నపేక్షింపక యుపయోగింపబడిన యౌషధము హితముకాదనుట.

మూ. ఇత్యేవం షడ్విధం కాలం అనవేక్ష్య భిషగ్జితం,
ప్రయుక్తమహితాయ స్యాత్ సస్యస్యాఽకాలవర్షవత్. 307

వ్యా. ఇత్తెరంగున దినము, రోగిబలాఽబలము, ఔషధము, వ్యాధి,జీర్ణలక్షణము, ఋతువు, అను నీయారిటికి సంబంధించినకాలభేదంబులు ఆరును, వాని ననుసరించిన సమ్యగ్యోగంబులును, (ఉదాహరణసహితముగ) వివరింపబడినవి. అట్టి షడ్విధకాలసమ్యగ్యోగముల నపేక్షింపక వ్యత్యస్తముగ నుపయోగింపబడిన యౌషధము (అసమ్యగ్యోగయుక్తము) పత్థ్యమైయును (అకాలవర్షము పైరుల చెరచి ధ్వంసముచేయువిధముగ)

రోగిని లేనిపోని యితరములైన యుపద్రవముల కల్గించి తుదకు ప్రాణముల హింసించున
(కావున పైజెప్పిన కాలభేదముల జక్కగ గమనించి సమ్యగ్యుక్తముగ నౌషధము న
యోగింపవలెనని భావము.)

### మతాంతరమున కాలకృతసమ్యగ్యోగవిభాగము.

మూ. వ్యాధీనామృత్వహోరాత్రవయసాం భోజనస్య చ,
విశేషో భిద్యతే యస్తు కాలాపేక్షః స ఉచ్యతే. 30

వ్యా. గ్రీష్మాదిఋతువులు, అహోరాత్రములు, పురుషులయొక్క వయస్సు, ఆహ
పరిణామకాలము, వీనియొక్క కాలవిశేషభేదముల ననుసరించి వాతాదులచే రోగము
సంభవించును. ఋత్వాదికాలవిశేషముల ననుసరించి వాతాదిరోగములు జనించుటయ
కాలాపేక్షితమనియే చెప్పబడును.

### ఋతుభేదముచే జనించురోగవిశేషములు.

మూ. వసన్తే శ్లేష్మజాః రోగాః శరత్కాలే తు పిత్తజాః,
వర్షాసు వాతికాశ్చైవ ప్రాయః ప్రాదుర్భవన్తి హి. 30
నిశాన్తే దివసాన్తే చ వర్షాన్తే వాతజా గదాః,
ప్రాయః క్షపాదౌ కఫజాః, తయోర్మధ్యే తు పిత్తజాః. 31

వ్యా. శ్లైష్మికరోగములు వసంతఋతువునందును, శరత్కాలమున పైత్తికరోగంబ
లును, వర్షఋతువున వాతికరోగంబులును ప్రాయికముగ సంభవించును. (ఇది ఋత
త్మకకాలము నపేక్షించి రోగములు సంభవించు రోగకాలము.)

మరియు పగటియొక్కయు, రాత్రియొక్కయు కడపటి మూడవభాగమ
నందును, వర్షఋతువుయొక్క మూడవభాగమునందును వాతికరోగములు ప్రాయికము
సంభవించును. పగటియొక్కయు రాత్రియొక్కయు మొదటి మూడవవంతుభాగము
కఫరోగంబులును, పగటియొక్కయు రాత్రియొక్కయు నడుమ మూడవవంతుకాలము
పిత్తరోగంబులును ప్రాయికముగ సంభవించును. (ఇది యహోరాత్రకాలవిశేషము
గల్గు రోగకాలవిశేషకాలము).

### వయస్సు మున్నగు కాలవిశేషమునుబట్టి జనించు రోగములు.

మూ. వయోఽన్తమధ్యప్రథమే వాతపిత్తకఫామయాః,
బలవన్తో భవన్త్యేవ స్వభావాత్ వయసో నృణామ్. 31

జీర్ణాన్తే వాతజా రోగాః జీర్యమాణే తు పిత్తజాః,
శ్లేష్మజాః భుక్తమాత్రే తు లభన్తే ప్రాయశో బలమ్. 312

వ్యా. మరియు వయస్సుయొక్క అంతమునను, జీర్ణకాలముయొక్క అన్నమునను వాతరోగములు మిక్కిలి బలిష్ఠములగును. వయస్సుయొక్క మధ్యభాగమునను ఆహారముయొక్క పచ్యమానావస్థకాలమునను పిత్తమున జనించిన రోగములు బలిష్ఠము లగును. మనుజుల ప్రథమవయస్సునందును భుజించిన ప్రథమకాలమునను కఫమున కల్గిన రోగములు ప్రబలము లగును. (వాతికాదిరోగములు పైజెప్పినరీతిగ వసంతాది కాలములలో సాయాభాగము ననుసరించి సంభవించుట కాలకృతమైన సర్గికస్వభావముచేనని యెరుంగునది. ఇట్టి కాలభేదము ననుసరించి తత్తదనుగుణముగ నుపయోగింపబడిన సమ్యగ్యోగయుక్తమని భావము. ఇది యొకవిధమైన కాలాపేక్షిత సమ్యగ్యోగము. 'వ్యాధీనామృత్వహోరాత్ర' అని యుపక్రమించి చెప్పబడిన గ్రంథము అనార్షమని వ్యాఖ్యాతలసిద్ధాంతము.)

## ప్రమాణకృత సమ్యగ్యోగము.

మూ. నాల్పం హన్త్యౌషధం వ్యాధిం యథాఽఽపోఽల్పా మహానలం,
దోషవచ్చాఽతిమాత్రం స్యాత్ సస్యస్యాఽత్యుదకం యథా.
సమ్ప్రధార్య బలం తస్మాత్ ఆమయస్యౌషధస్య చ,
నైవాఽతిబహు నాత్యల్పం భైషజ్యమవచారయేత్. 314

వ్యా. ఔషధము స్వల్పప్రమాణముగ నున్నయెడ (స్వల్పపరిమాణము కలజలము మిక్కిలి అత్యధికమైన నిప్పును చల్లార్పజాలని భంగి) మిక్కిలి బలిష్ఠమైన వ్యాధిని శమింపనేరదు. మరియు నౌషధమును మిక్కిలి యధికమైన పరిమాణము కల్గియున్నయెడ నయ్యది (మిక్కుటమైన జలము పైరును చెరచువిధముగ) శరీరమును బొత్తుగ చెడగొట్టును. (కావున వాతాదిదోషములయొక్కయు రోగములయొక్కయు రోగియొక్కయుం బలాఽబలముల జక్కగ గమనించి తత్తదుచితపరిమాణయుక్తముగ నౌషధము నుపయోగింపవలెనని భావము. ఇదియె ప్రమాణవిశేషము నపేక్షించిన సమ్యగ్యోగము.) ఈవిషయమునే విమానస్థానమున నిట్లు చెప్పబడినది:—"దోషప్రమాణానురూపో హి భైషజ్యప్రమాణవికల్పః బలప్రమాణవిశేషాపేక్షో భవతి" దోష-బలప్రమాణముల ననుసరించి యౌషధప్రమాణమును కల్పింప నగుగాని యౌషధమునకు నిర్ణయముగ నొకప్రమాణమును జెప్ప వలనుపడదని తంత్రకారుల యాశయము.

—◉ సాత్మ్యమున పేక్షించి సమ్యగ్యోగము. ◉—

మూ. ఔచిత్యాత్ యస్యయత్సాత్మ్యం దేశస్య పురుషస్య చ,
అపథ్యమపి నైకాన్తాత్ తత్త్యజన్ లభతే సుఖమ్. 315

వ్యా. ఏపురుషునికైనను, యేదేశమునకైనను, యేవస్తువు చిరకాలమునుండి యభ్యాసమున (నిరంతరోపయోగమున) నుండునో అయ్యది పథ్యము గాకున్నను దానిని తటాలున పూర్తిగ విసర్జించినయెడ మనుజునకు కొంచెమైన సుఖము గల్గనేరదు.

ఇచ్చట అపథ్యమైన వస్తువునైనను నభ్యాసముగ నలవాటుచేసినయెడ నయ్యది సాత్మ్య మనబడును. దానిని శీఘ్రముగ విసర్జించినచో రోగాంతరములు సంభవించును. "అపథ్యమపి" అని చెప్పుటవలన పథ్యమైన వస్తు వలవాటైయున్నపుడు దానిని త్యజించుటవలన మిక్కిలి కష్టము సంభవించునని తెలిసెడి. మరియు "దేశ" శబ్దమునకు జనపదమని యర్థము. ఏపల్లెయందు పుట్టిన వస్తువు ఎవరికి అలవాటుగ నుండునో అయ్యది దేశసాత్మ్యము. ఏమనుజునకు యేవస్తువు అలవాటుననుండునో అయ్యది పురుషసాత్మ్యము. ఇత్తెరంగున దేశసాత్మ్యము పురుషసాత్మ్యము అను రెండువిధములయిన సాత్మ్యములు ఇచ్చట గ్రహింపబడును. ఇయ్యది సాత్మ్యమునకు చేరిన సమ్యగ్యోగమని యెరుంగునది.

—◉ దేశభేదముచే సాత్మ్యనిర్ణయము. ◉—

మూ. బాహ్లీకాః పహ్లవాః చీనాః శూలీకాః యవనాః శకాః,
మాంసగోధూమమాధ్వీకశస్త్రవైశ్వానరోచితాః. 316
మత్స్యసాత్మ్యాస్తథా ప్రాచ్యాః క్షీరసాత్మ్యాశ్చ సైన్ధవాః,
అశ్మకావన్తికానాం తు తైలామ్లం సాత్మ్యముచ్యతే. 317
కన్దమూలఫలం సాత్మ్యం విద్యాన్మలయవాసినాం,
సాత్మ్యం దక్షిణతః పేయా మన్థశ్చోత్తరపశ్చిమే. 318
మధ్యదేశే భవేత్సాత్మ్యం యవగోధూమగోరసాః,
తేషాం తత్సాత్మ్యయుక్తాని భైషజ్యాన్యవచారయేత్. 319
సాత్మ్యం హ్యేశు బలం ధత్తే నాతిదోషం చ బహ్వపి,

వ్యా. బాహ్లీకము, పహ్లవము, చీనా, శూలీకా, యవన, శక, అనునీదేశములం దుండువారికి మాంసంబును, గోధుమలును, మాధ్వీకమద్యంబును, శస్త్రాగ్నికర్మలును, సాత్మ్యము లైయుండును. మరియు తూర్పుదేశమున నుండువారికి మత్స్యములు

సాత్మ్యములుగ నుండును. సింధుదేశస్థులకు క్షీర మసాత్మ్యముగ నుండును. అశ్మకా-అవంతిదేశస్థులకు తైలంబును, అమ్లరసంబును సాత్మ్యంబులు. మలయపర్వతప్రాంతముల నుండువారికి కందమూలఫలములు సాత్మ్యములగును. దక్షిణదేశవాసులకు పేయయను కాంజికము సాత్మ్యముగ నుండును. పశ్చిమదేశస్థులకును, ఉత్తరదేశస్థులకును, మంథము సాత్మ్యమగును. మధ్యదేశస్థులకు యవలు, గోధుమలు, అపూపాలు మున్నగునవి సాత్మ్యములుగ నుండును. ఇట్టి సాత్మ్యభేదముల నెరింగి వారివారికి సాత్మ్యములైయుండు నాహారాదులతో కూడ నౌషధముల నుపయోగింపదగును. సాత్మ్యయుక్తమైన యౌషధము అధికప్రమాణము కల్గియున్నను, మిక్కిలి దోషమును కల్గించక శీఘ్రముగ బలమును కల్గించును. (కావున పైజెప్పినరీతిగ ఆయాదేశములకును, ఆయామనుష్యులకును, సాత్మ్యమును చక్కగ గమనించి తద్యుక్తముగ నౌషధము నుపయోగించుట ముఖ్యకర్తవ్యము. ఇది సాత్మ్యాపేక్షసమ్యగ్యోగమున కుదాహరణము.)

## సమ్యగ్యోగావశ్యకత.

మూ. యోగైరేవ చికిత్సన్హి దేశాద్యజ్ఞోఽపరాధ్యతి. 320
వయోబలశరీరాదిభేదా హి బహవో మతాః,
(తేషాం తత్సాత్మ్యయుక్తాశ్చ వయోవస్థాయుతా స్తథా,
ఆయుర్బలశరీరాణి భేదా హి బహవో మతాః.)
(ఇతి గంగాధరసమ్మతః పాఠః.)

వ్యా. పైజెప్పిన దేశకాలాదుల సమ్యగ్యోగమును తెలియక కేవల మౌషధయోగములచే చికిత్స చేయువైద్యుడు చికిత్సాఫలమును సాధింపలేడు. ఏలనన:— చికిత్సకులకు వయస్సు, బలము, రోగియొక్క పరిస్థితి, ప్రకృతి, సత్వము, సాత్మ్యము మున్నగునవి ముఖ్యముగ నపేక్షితములు. అయ్యవి నానారూపములుగ నుండుటచేత వానిని చక్కగ గమనించి సమ్యగ్యోగయుక్తముగ తత్తద్యుక్తముగ నుపయోగింపవలయునని భావము.

[ఇచ్చట నీసంగ్రహము నెరుంగునది:—దోష-దూష్య-రోగ-నిదానములకు విపరీతంబును, హితంబును, సమ్యగ్యోగయుక్తంబును నగునౌషధము నుపయోగించినచో నీచికిత్సితమున జెప్పబడిన రోగములను ఇచ్చట జెప్పబడని రోగంబు లన్నియును నిశ్చయముగ నివర్తించునని "దోషదూష్య...నియచ్ఛతి" (శ్లో. ౨౯౨) అనుశ్లోకముచే జెప్పబడినది. పిమ్మట సమ్యగ్యోగమును నిరూపించుటకై దేశ-కాల-ప్రమాణ-సాత్మ్యాది

ములను వాని యవాంతరభేదములతో వివరించి, వానికన్నిటికిని ప్రత్యేకముగ
రణములును "దేశకాలప్రమాణానాం... నాతిదోషం చ బహ్వపి" అనుగ్రంథ
స్తరముగ నిర్దేశింపబడినవి. ఇచ్చట నిర్దేశించినప్రకారము దేశకాలాదులకు
చిన సమ్యగ్యోగయుక్తంబై దోషదూష్యాది విపరీతమైన యౌషధము నుపయో
నుక్తానుక్తరోగముల నన్నిటిని తప్పక జయించుననియు; అటుగాక సమ్య
న పేక్షింపక కేవలము దోషదూష్యాది విపరీతంబును హితంబునైన యౌషధము
గించినను వ్యాధినివృత్తిరూపచికిత్సాఫలము కల్గ నేరదనియు ప్రకరణసముది
.]

### దోషములయవస్థాభేదమునుబట్టి విరుద్ధాభిమతచికిత్సావిధి.

తథాఽన్తస్సన్ధిమార్గాణాం దోషాణాం గూఢచారిణామ్. 321
భవేత్క్వచిత్కార్యాపి విరుద్ధాభిమతా క్రియా,

వ్యా. శరీరాంతర్భాగమైన కోష్ఠమునందలి మార్గమును, సంధి (మధ్య) మార్గ
ఆశ్రయించి శరీరమున గూఢముగ సంచరించు దోషములకు ఒకానొకసమయ
షములకు విరుద్ధముగ గన్పడుచుండియు వ్యాధిని శమింపజేయునట్టి చికిత్సను
యుండును. (చూచుటకు విరుద్ధోపక్రమముగ గన్పడినను వ్యాధిని శమింప
సమర్థమగుటంజేసి యుపయోగార్హమగునని భావము).

### విరుద్ధాభిమతచికిత్సోదాహరణము.

పిత్తమన్తర్గతం గూఢం స్వేద-సేకోపనాహనైః. 322
నీయతే బహిరుష్ణైర్హి తథోష్ణం శమయన్తి తే,
బాహ్యైశ్చ శీతైస్సేకాద్యైః ఊష్మాన్తర్యాతి పీడితః. 323
స్తోఽన్తర్గూఢం కఫం హన్తి శీతం శీతైస్తథా జయేత్,
శ్లక్ష్ణపిష్టో ఘనో లేపః చన్దనస్యాపి దాహకృత్. 324
త్వగ్గతస్యోష్మణో రోధాత్ శీతకృచ్చాఽన్యథాఽగురోః,
ఛర్దిఘ్నీ మక్షికావిష్ఠా మక్షికైవ తు వామయేత్. 325
ద్రవ్యేషు స్విన్నజగ్ధేషు చైవం తేష్వేవ విక్రియా,

వ్యా. స్వేదనము, పరిషేకము, ఉపనాహనము అనునవి ఉష్ణప్రధానచికిత్సలుగ
శరీరాంతర్భాగమున గూఢముగ పిత్తమును బైటవెడలించి శమింపజేయును.



ఇత్తెరంగున
యుండును.
(ఇ
లగుటంజేసి
న్నను, నిగ
శమింపజేయ
మరి
జలసేకాదుల
జనును. అట్టి
మును శమి
శమింపచేయ
రోగాక శ
సామాన్యవిధి
విధింపబడియు
మరిం
యెడ చర్మ గ
కల్గించును. ఉ
మరిం
వాంతుల హ
జఠరాగ్ని చే
క్రియకు విరు
రమునకును వి
భావము).
ఇచ్చట
పాఠమున—
ద్రవ్యములయ
యర్థము. ఎ
యావిరిలో న
కల్గించును. క

ఇత్తెరంగున నుష్ణములైన చికిత్సలచే నుష్ణరూపమైన పిత్తమును శమింపజేయ దగి యుండును.

(ఇచ్చట ఉష్ణవీర్యములైన స్వేద-సేక-ఉపనాహములు పిత్తమునకు సమానగుణము లగుటంజేసి పిత్తవర్ధకములుగ నుండవలెను. కావున నిది పిత్తమునకు యుక్తము కాకున్నను, నిగూఢముగ నంతర్గతమైయుండు పిత్తమును స్వేదరూపమున బైటవెడలించి శమింపజేయును. కావున నిది పిత్తమునకు విరుద్ధోపక్రమము.)

మరియు నుష్ణము శరీరముపై త్వగ్గతముగ నుండును. అట్టిచర్మముపైని శీతములగు జలసేకాదుల జేసినయెడ చర్మగతమైన యూష్ణము శీతస్పర్శముచే నడ్డగింపబడి లోనికిం జనును. అట్టియెడ కోష్ఠమున నిగూఢముగ నున్నకఫమును లోనికి ప్రవేశించిన యూష్మమును శమింపజేయును. ఇత్తెరంగున శీతమును శీతలములగు చికిత్సావిధానములచే శమింపచేయనగును. ఇది శీతరూపమైన కఫమునకు విరుద్ధచికిత్స. "శీతేనోష్ణకృతాన్ రోగాన్ శమయన్తి భిషగ్విదః, యేచ శీతకృతాః రోగాః తేషాముష్ణం భిషగ్జితం." అను సామాన్యవిధిచే శీతరోగమున నుష్ణచికిత్సయు, ఉష్ణరోగమునకు శీతరూపమైన చికిత్సయు విధింపబడియున్నను, ఇచ్చట విశేషవిధిగ సమానగుణచికిత్స యౌగికమని యెరుంగునది.)

మరియు శీతమైన చందనమును మెత్తగ చాది దట్టముగ చర్మముపైని పట్టువేసిన యెడ చర్మగతమైన యూష్మము నిరోధింపబడి శరీరాంతర్భాగమున జొచ్చి తాపమును కల్గించును. ఉష్ణమైన అగరును నూరి పలుచగ పట్టువేసినచో చలువను చేయును.

మరియు తేనెటీగెలు వాంతిని కల్గించునవి యైనను వానిమలము (మైనము) వాంతుల హరించును. తేనెటీగెలు తినునట్టి (మలారంభమైన) ద్రవ్యములు వానియొక్క జఠరాగ్నిచే పక్వమైన (మలరూపము నొందిన) యెడ వానియందు స్వాభావికమైన క్రియకు విరుద్ధమైన క్రియ సంభవించును. (వానిచే తినబడిన ద్రవ్యములకును వానిశరీరమునకును విరుద్ధమైన క్రియను జేయుప్రభావము మక్షికామలమునకు సంభవించునని భావము).

ఇచ్చట 'ద్రవ్యేషు స్విన్నదగ్ధేషు' అను పాఠాంతరము గానవచ్చుచున్నది. ఈ పాఠమున—ఆవిరిలో ఉడికించబడిన కొన్ని ద్రవ్యములయందును, కాల్పబడిన కొన్ని ద్రవ్యములయందును మక్షికామలమునందువలె విరుద్ధక్రియాకరణశక్తి కల్గియుండునని యర్థము. ఎట్టులన:—వరిపేలాలు తేలికయై శీఘ్రముగ జీర్ణించునవి యైనను, వానిని యావిరిలో నుడికించి ముద్దజేసినయెడ స్వాభావికక్రియకు విరుద్ధముగ గురుత్వమును కల్గించును. కలువకాడలు శీతగుణము కల్గియున్నను వానిని నిప్పున కాల్చి క్షారముగ

జేసినయెడ శీతగుణమునకు విరుద్ధముగ ఛేదనాదిక్రియల జేయును. ఇట్టి విరుద్ధక్రియా కరణశక్తి సంస్కారవిశేషమునం జేసి సంభవించును. ఇది 'స్విన్న-దగ్ధేషు' అనుదాని కుదాహరణము.

—చికిత్సావిషయమై దోషౌషధాదిపరీక్షావశ్యకత.—

మూ. తస్మాద్దోషౌషధాదీని పరీక్ష్య దశ తత్త్వతః 326
కుర్యాచ్చికిత్సితం ప్రాజ్ఞః, న యోగైరేవ కేవలం,

వ్యా. సిద్ధిస్థానమున చికిత్సావిషయమై పరీక్షింపవలసినవిషయములు దోషములు ఔషధము మున్నగునవి పది నిర్దేశింపబడును. వానిని పదిటిని యథోక్తప్రకారము చక్కగ పరీక్షింపక చికిత్స జేసినచో నయ్యది పథ్యమగు నౌషధంబైనను వ్యాధినివర్తి రూపఫలమును కల్గింపకుండుటయే గాక, లేనిపోని యుపద్రవముల దెచ్చిపెట్టి తుదకు రోగి నొకసమయమున జంపజాలును; కావున దోషౌషధాదుల పదిటిని చక్కగ పరీక్షించి తత్తదనుసారముగ సమ్యగ్యోగయుక్తంబైన యౌషధము నుపయోగింపవలెను. కాని కేవలము ఔషధప్రయోగముచేతనే చికిత్స చేయంజనదు.

ఇచ్చట నీవివరణము నెరుంగునది:—సిద్ధిస్థానమున "సమీక్ష్య దోషౌషధదేశ కాలసాత్మ్యాగ్నిసత్త్వౌకవయోబలాని, వస్తిః ప్రయుక్తో నియతం గుణాయ స్యాత్; సర్వ కర్మాణి చ సిద్ధిమన్తి." (సిద్ధి. అ. 3 శ్లో. 3) అను గ్రంథముచేత వాతాదిదోషములు, ఔషధములు, జాంగలాదిదేశము, గ్రీష్మాదికాలము, సాత్మ్యము, జాఠరాగ్ని, సత్త్వము, ఓక (వారివారియభ్యాసము), బాల్యాదివయస్సు, శరీరాదిబలము, అనునీపదివిషయ ములును చికిత్సావిషయమున పరీక్షింప దగినవని నిర్దేశింపబడినవి.

ఉపకల్పనీయాధ్యాయమున—"శక్యం తథా......సూక్ష్మాణి హి దోష-భేషజ-దేశ-కాల-బల-శరీర-ఆహార-సాత్మ్య-సత్త్వ-ప్రకృతి-వయసాం అవస్థాన్తరాణి" (సూ. అ. ౧౫ సూ. ౫) అనువాక్యముచే పరీక్ష్యవిషయములు నిర్దేశింపబడినవి. ఇందు సిద్ధి స్థానమున జెప్పబడనివి శరీర-ఆహార-ప్రకృతులు మూడున్నను, అవియును నీపదిటిలోనే యంతర్భూతము లగును:—దేశము జాంగలాభూమిరూపంబును, రోగియొక్క రోగ స్థానావయవరూపంబు నైయుండును. ఈవిషయము 'దేశో భూమిరాతురశ్చ' (వి.అ. ౮) అని విమానస్థానమున జెప్పబడినది. కావున నిచ్చట దేశశబ్దముచేతనే రోగిశరీరంబును గ్రహింపదగును. దోషశబ్దముచే ప్రకృతియు, సాత్మ్యముచే నాహారంబును సంగ్రహింప బడును. కావున ఇచ్చట 'పరీక్ష్య దశ' అని సంఖ్యానురోధముగ సిద్ధిస్థానమున జెప్పబడిన పదిపరీక్ష్యములు గ్రహించుట సమంజసము.

## వ్యాధి నిశ్శేషమగునందాక చికిత్సాభ్యాసావశ్యకత.

మూ. నివృత్తోఽపి పునర్వ్యాధిః స్వల్పేనాఽఽయాతి హేతునా. 327
క్షీణే మార్గీకృతే దేహే శేషస్సూక్ష్మ ఇవాఽనలః,
తస్మాత్తమనుబధ్నీయాత్ ప్రయోగేణాఽనపాయినా. 328
దార్ఢ్యార్థం ప్రాక్ప్రయుక్తస్య సిద్ధస్యాఽప్యౌషధస్య తు,

వ్యా. చికిత్సావిధానముచే వ్యాధి (అతిస్వల్పావశిష్టముగ) పూర్తిగ నివర్తించిన లక్షణములు కానవచ్చినను, శరీరమునందలి మాంసాదులు వ్యాధివశతంజేసి మిక్కిలి కృశించి యుండుతరి స్వల్పకారణము తటస్థించినను (మిగుల సూక్ష్మముగ మిగిలిన దావానలము తృణాదిస్వల్పకారణసంబంధము కలిగినపుడు మరల గాఢముగ వృద్ధినంది వ్యాపించు భంగి) శరీరమున మరల వ్యాపించును. కావున వ్యాధి నిశ్శేషముగ నివర్తించినట్లు కానవచ్చినను ముందు ప్రయోగింపబడిన యౌషధప్రయోజనము (ఆరోగ్యము) దృఢముగ నేర్పడునంతకాలము అట్టి యౌషధప్రయోగముచే శరీరమున కెట్టి యపాయమును కల్గనీయక మునుపటివలెనే యుపయోగింపవలెను.

మూ. కాఠిన్యాదూనభావాద్వా దోషోఽన్తః కుపితో మహాన్. 329
పథ్యైః మృద్వల్పతాం నీతో మృదుదోషకరో భవేత్,
పథ్యమప్యశ్నతస్తస్మాత్ యో వ్యాధిరుపజాయతే. 330
జ్ఞాత్వైవం వృద్ధిమభ్యాసమథవా తస్య కారయేత్,

వ్యా. కాఠిన్యమన దోషదూష్యసంబంధముచే నైన స్థైర్యము. అట్టి కాఠిన్యముచే నైనను, కాఠిన్యము లేకుండుటచేనైనను వాతాదులలో నేదైన నొక్క దోషము శరీరాంతర్భాగముననే ప్రకోపమునొంది బలిష్ఠమైనచో, నట్టి దోషములను పథ్యములగు నాహారౌషధాదులచే మృదువుగను అల్పముగను చేయవలెను. అట్టి మృదుత్వమును అల్పత్వమునొందింపబడిన దోషము స్వల్పముగ రోగమును కల్గించును.

పథ్యములగు నౌషధాదుల సేవించినను యేవ్యాధి స్వల్పముగ ననువర్తించియే యుండునో, అవ్యాధి గంభీరమైనదని యెరింగి ముందుపయోగించుచున్న యౌషధమును ప్రమాణముచే వృద్ధినందించి యుపయోగింపవలెను. లేక ఆయౌషధమునే చాలకాలమువరకు నుపయోగింపవలెను. (తగినచికిత్స జేయుచు పథ్యముగ నున్నను వ్యాధి వదలక చిరకాలమువరకును అనువర్తించి బాధించుచున్నయెడ విసుకుజెంది చికిత్సను మానక ఆయౌషధమునే అభ్యాసముగ చిరకాల ముపయోగించినయెడ వ్యాధి పూర్తిగ నివర్తించునని భావము. ఈవిషయము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"అభ్యస్య

మానాః క్రమశస్తు యోగాః జయన్తి రోగాన్ బలినః స్థిరాంశ్చ, తస్మాదభిన్నః పురుషో ఽభ్యుపేయాత్ యోగప్రయోగాన్ సముదీర్ణవేగే."

### రోగి కింపుగాని యౌషధమును రుచింపజేయువిధము.

మూ. సాతత్యాత్ స్వాద్వభావాద్వా పథ్యం ద్వేష్యత్వమాగతమ్. 331
కల్పనావిధిభిః తైస్తైః ప్రియత్వం గమయేత్పునః,

వ్యా. హితకరమైన యౌషధము చిరకాల ముపయోగించుటచేనైనను, అట్టి యౌషధమున మంచిరుచి లేకుండుటచేనైనను రోగికి రుచింపక దానియందు ద్వేషము కల్గినయెడ; అట్టి యౌషధములను స్వరసఫాంటాదిరూపాంతరకల్పనావిధానముల చేతను, ఆహారపదార్థములను పాకశాస్త్రోక్తకల్పనావిశేషములచేతను కల్పించి రోగికి దానియం దభిరుచియు ప్రీతియు కల్గునట్లు చేయవలెను.

### మనోఽర్థానుకూల్యప్రయోజనము.

మూ. మనసోఽర్థాఽనుకూల్యాద్ధి తుష్టిరూర్జా రుచిర్బలమ్. 332
సుఖోపయోగతా చ స్యాత్ వ్యాధేశ్చాతో బలక్షయః,

వ్యా. ఔషధము రోగియొక్క మనసుకు ఇంపుగ నుండునట్లు కల్పించుటవలన మనసుకు సంతోషంబును, మనోబలంబును, నోటికి రుచియు, శరీరబలంబును కల్గును. అట్టి యౌషధము వమనాదుల కవకాశము కల్గక సుఖముగ నుపయోగింప దగియుండును. దానంజేసి వ్యాధిబలంబును తగ్గును. (కావున రోగికి పథ్యమైన యౌషధమును ఆహారాదులు మనసు కింపుగాకుండుతరి పైజెప్పినరీతిగ కల్పనావిశేషములచే రోగి కభిరుచి కల్గునట్లు చేయుట యావశ్యకమని భావము.)

మూ. లౌల్యాత్ దోషక్షయాత్ వ్యాధేః వైధర్మ్యాచ్చాపి యా రుచిః.
తాసు పథ్యోపచారస్స్యాత్ యోగే నాద్యం వికల్పయేత్,

వ్యా. కొన్ని సమయములయందు రోగికి ఆసచేనైనను, వాతాదిదోషములు క్షయించుటచేనైనను, వ్యాధిస్వభావముచేనైనను, విరుద్ధగుణములచేనైనను, అపథ్యములగు పదార్థములయందు అభిరుచి కల్గును. అట్టియెడ రోగి మనస్సును బలవంతముగనైనను అట్టి యపథ్యములనుండి మరలించి పథ్యములచేతనే యుపచరించవలెను. అందు కేవలము ఆసచేత అపథ్యమునం దభిలాష కల్గినపుడు అట్టి ద్రవ్యమునందు ఔషధమును గూర్చి సంస్కరించి ప్రయోగింపవలెను.

(రోగికి సామాన్యముగ నీపథ్యమునందు బుద్ధిచాపల్యముచే కల్గు వ్యాధి స్వభావముచే పాండురోగాదులయందు అపథ్యమైన మృత్తికాభక్షణమునం దాస కల్గును. ఇట్టి యపథ్యములయందు రోగిమనసునుపోనీయక మరలించుటయే ముఖ్యకర్తవ్యమనిభావము).

## అధ్యాయవిషయసంగ్రహము.

తత్ర శ్లోకాః.—

మూ. వింశతిర్వ్యాపదో యోనేః నిదానం లిఙ్గమేవ చ. 334
చికిత్సా చాపి నిర్దిష్టా శిష్యాణాం హితకామ్యయా,
శుక్రదోషాస్తథా చాష్టౌ, నిదానాఽఽకృతిభేషజైః. 335
క్లైబ్యాన్యుక్తాని చత్వారి చత్వారః ప్రదరాస్తథా,
తేషాం నిదానం లిఙ్గం చ భైషజ్యం చైవ కీర్తితమ్. 336
క్షీరదోషాస్తథా చాష్టౌ హేతులిఙ్గభిషగ్జితైః,
రేతసో రజసశ్చైవ కీర్తితం శుద్ధిలక్షణమ్. 337
ఉక్తాఽనుక్తచికిత్సా చ, సమ్యగ్యోగస్తథైవ చ,
దేశాదిగుణశంసా చ (యోగాశ్చ) కాలష్షడ్విధ ఏవ చ. 338
దేశే దేశే చ యత్సాత్మ్యం యథా వైద్యోఽపరాధ్యతి,
చికిత్సా చాపి నిర్దిష్టా దోషాణాం గూఢచారిణామ్. 339
యో హి సమ్యఙ్న జానాతి శాస్త్రం శాస్త్రార్థమేవ చ,
న కుర్యాత్ స క్రియాం, చిత్రం అచక్షురివ చిత్రకృత్. 340

వ్యా. ఇరువదివిధములైన యోనివ్యాపత్తులును, వాని నిదాన-లక్షణ-చికిత్సితంబులును; ఎనిమిదివిధములైన శుక్రదోషంబులును, వాని నిదాన-లక్షణ-చికిత్సితంబులును; నాల్గువిధములైన క్లైబ్యంబులును, వానిచికిత్సాసంగ్రహంబును; నాల్గువిధములైన రక్తప్రదరంబులును, వానినిదాన-లక్షణ-చికిత్సితంబులును, ఎనిమిదివిధములైన క్షీర (స్తన్య) దోషంబులును, వాని నిదాన-లక్షణ-చికిత్సితంబులును; శుక్ర-ఆర్తవశుద్ధి-లక్షణంబులును; ఉక్త-అనుక్తవ్యాధిచికిత్సావిధానంబును; దేశకాలాద్యపేక్షితసమ్యగ్యోగస్వరూపంబును, దేశకాలాదిగుణప్రశంసయు, షడ్విధకాలవివరణంబును, ఆయాదేశమునకు సంబంధించిన సాత్మ్యంబులును, దేశకాలాదుల పరీక్షింపక సమ్యగ్యోగమును గమనింపక చికిత్స జేయు వైద్యుడు చికిత్సావిధియందు పొరబాటు బహువిధంబును ఇవి యన్నియు నీయోనివ్యాపచ్చికిత్సాధ్యాయమున నగ్నివేశులచే వివరించి చెప్పబడినవి.

ఈశాస్త్రమును దీనియందలి వాస్తవ్యార్థమును చక్కఁగ నెరుంగని వైద్యుడు (కన్నులు లేని చిత్రకారుడు చిత్రపటమును వ్రాయలేని భంగి) చికిత్స చేయనేరడు.

LBx1,1
35G39.3

—◎ అధ్యాయసమాప్తి. ◎—

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే
దృఢబలసంపూరితే చికిత్సాస్థానే
యోనివ్యాపచ్చికిత్సితం నామ
త్రింశోఽధ్యాయః

వ్యా. ఇత్తెరంగున నగ్నివేశకృతంబును చరకప్రతిసంస్కృతంబును నగు చరకసంహితయను నాయుర్వేదతంత్రమునందలి చికిత్సాస్థానమున దృఢబలసంపూరితభాగమున త్రింశాధ్యాయము సంపూర్ణము.

—◎ స్థానసమాప్తి. ◎—

మూ. అగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే,
చికిత్సితమిదం స్థానం షష్ఠం పరిసమాపితమ్. 341

అగ్నివేశకృతంబును చరకప్రతిసంస్కృతంబును నగు నీతంత్రమున చికిత్సితస్థానమనునది యాఱవస్థానము సమాప్తము.

ఇతి విశ్వనాథవిరచితసద్వ్యాఖ్యాయాన్తు చరకకౌముద్యాం,
స్థానం చికిత్సితమిదం జీయాదాచన్ద్రతారమవనితలే.

ఇది శ్రీశ్రీశ్రీ కాళహస్తిసంస్థానాధిపాస్థానవిద్వదవతంససర్వతంత్రస్వతంత్రబ్రహ్మశ్రీ కుంభకోణము లక్ష్మీనృసింహశాస్త్రివరేణ్యాచరణకమలసంసేవాసమాసాదితపాణినీయాదిశాస్త్రవిజ్ఞానసముల్లసితుండును, అష్టాంగహృదయ-పరహితసంహితా-మాధవనిదానాద్యాయుర్వేదతంత్రాంధ్రవ్యాఖ్యాతయు, శ్రీవైఖానసకులతిలక-ఆయుర్వేదమార్తాండభిషఙ్మణి వైద్యరత్న, పండిత దీవి గోపాలాచార్యసంస్థాపితాయుర్వేదాశ్రమాస్థానవిద్వాంసుండును, ఉభయభాషాకవితావిరాజితుండును, శ్రౌతప్రక్రియాధౌరేయుండును, ఆపస్తంబసూత్ర-కౌండిన్యగోత్రపవిత్ర నుదురుపాటివంశపయఃపారావారసుధాకరుండును, వేదవేదాంగశ్రౌతాభిజ్ఞ బ్రహ్మశ్రీ అగ్నిచిత్ సీతారామ[illegible] శ్రీమతి సీతాంబాసోమపీథినీసాధ్వీమతల్లి కాతనూభవుండును, ఉ[illegible]భాషాకవితా[illegible] శ్రౌతాగమధౌరేయ బ్రహ్మశ్రీ సుబ్రహ్మణ్యయాయజూకా[illegible]డును నగు వైయాకర[illegible] విద్వాన్ బ్రహ్మశ్రీ [illegible] నుదురుపాటి విశ్వనాథశాస్త్రి[illegible] విరచితమగు కౌముదియను చరకసంహితాంధ్రవ్యాఖ్యా[illegible]న చికిత్సాస్థానము సమాప్తము.

---

[illegible]: వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.

CENTRAL LIBRARY & RESEARCH ... TIRUPATI 19750
19750